

ఆంధ్రపత్రిక

పరీధావినామ సంవత్సరాది సంచిక

[అరువది రెండవ సంచిక]

[1972 - 73]



సంపాదకుడు:


శివలెంక శంభుప్రసాద్



వెల రూ. 3

ఆంధ్రపత్రికా కార్యాలయమున ముద్రితము.

Supplement to Andhra Patrika Issue Dated 16-3-1972 Regd No. M 1118



సంచిక 62	# పరీధావినామ సంవత్సరాది సంచిక	సంవత్సరము 1972—73

విషయానుక్రమణిక



వర్ణచిత్రాలు:

ముఖచిత్రం—గోదాదేవి—శ్రీ కొండపల్లి శేషగిరిరావు, హైదరాబాదు.

పరమభాగవతులు—నాల్గు చిత్రాలు—సేకరణ—శ్రీ కోడూరు శ్రీరామమూర్తి.

ఓమ్

ప్రస్తావన


పశ్చిమ జర్మని పురాప్రాణి విజ్ఞానవేత్తలలో మానసిక విజ్ఞాన వేత్తలలో ప్రసిద్ధులయిన ప్రొఫెసర్ రూడోల్ఫ్ బిల్జ్ ఇటీవల మానవ ప్రవృత్తి లక్షణాలను గురించి కొన్ని పరిశీలనలు చేశారు. ఆ పరిశీలనలలో సూక్ష్మ విషయాలు అనేకం ఆయన వివరించారు. ఆయన పరిశోధనాసారాంశం ఒక్కటే. మనుష్యుని ప్రవృత్తి ఇట్లా వుంటుంది అని సిద్ధాంతం చేసుకొని నిర్ణయించడము, పట్టడము కష్టం. ప్రతి ఒక్క పరిస్థితి దృష్ట్యాను ఆ ప్రవృత్తిని గురించిన అనుశీలనము, నిగమనము చేయవలసి వుంటుంది. ఇచ్చట ఆ మానవుని పరిసరాలు గూడా కొంత పని చేయవచ్చు. అనగా ఈ అనుశీలనానికి, నిగమనానికి తోడ్పడవచ్చు. కాని అసలు అనుశీలనం ఏ స్థితికి ఆ స్థితి నుంచే జరగవలసి వుంటుంది. అధునాతనమైన విజిజ్ఞాసా పథప్రమేయవిజ్ఞానం ఈ విధంగా వుంటూ వుండగా, బద్ధ బుద్ధులైన జనులు ముందుకు జరగలేక, ముందుకు చూడలేక, గతకాల సంబంధమైన పరిమిత దృష్టి కోణంలోనే ఆలోచనలు చేస్తూ, ఆ ఆలోచనలను లోకం మీద విధించ చూడడాన్ని మనం చూస్తూనే వున్నాము.

అట్లాకానిపక్షంలో ఆకృతి లేని మాటలు, నిరాకారా లయిన భావాలు వెలుబడిలోనికి వచ్చి వుండవు. సమూహాల మీద మనుష్యులను అభ్యుదయశక్తులనడమున్నా, సముదాయాల మీద మనుష్యులను ప్రతీపశక్తులనడమున్నా కుదరదు. అదే విధంగా నిబంధ (కమిటెడ్) రాజకీయాలు అన్న పద్ధతి పదబంధాలు చలామణిలోనికి రావు. కాల గమనాన్ని, సాంకేతిక విజ్ఞాన ప్రగతిని, విజ్ఞానశాస్త్రపు మనోవేగపు ప్రసరణాన్ని గమనించని వారు మాత్రమే ఇటువంటి పరిమిత భావప్రవిష్ట చిత్తులై లోకాన్ని గూడా, తమ లాగా చేద్దామని చూస్తారు.

రాజకీయాలలో ఈ రకమైన ప్రవృత్తి సహజంగా వుంటుంది. రాజకీయాలయు, రాజకీయవేత్తలయు ప్రయోజనాలు అటువంటివి. అక్కడ పరార్థాన్ని స్వార్థం ఆక్రమించుకుంటున్నదో, స్వార్థానికి పరార్థం హద్దులు దిద్దగల్గుతున్నదో ఎవ్వరూ చెప్పలేరు. ఈ రాజకీయాలలో కొన్ని సందర్భాలలో వ్యక్తి ప్రయోజనం పార్టీ ప్రయోజనంగా విలసిల్లడము, పార్టీ ప్రయోజనం ప్రజాభీష్టంగా ప్రదర్శించడానికి ప్రయత్నాలు సాగడము కన్పిస్తుంది. ఇందులో ఏది ఏదో తేల్చి చెప్పడం ఎవ్వరికి సాధ్యం కాదు. అటువంటి సందర్భాలలో ప్రజాస్వామ్య ధర్మం యొక్క అర్థం పరిమితం అయిపోవడం అంటూ గూడా సంభవం అవుతుంది. ఈ స్థితి ఒక విచిత్రమైన స్థితి. ఈ అన్నింటికి కారణం ఏమిటని ఆలోచిస్తే, అది ఒక్కటిగానే కన్పిస్తుంది. అది భయం. బహుత్వంలో ఏకత్వాన్ని దర్శించక లేక, తమ అస్తిత్వం ఏమైపోతుందో నన్న భయం అది. ఈ భయంయొక్క ప్రసరణమే రాజకీయాలలో వివిధ రీతులకు, విపరీతాలకు కారణం అవుతూ వుంటుంది.

అయితే ఇటువంటి ద్వంద్వాలను చూచి, వానికి అతీతంగా వుండి, ప్రకృతిని, ఆ ప్రకృతి యొక్క సృష్టిని జడం నుంచి స్థావరం వరకు, స్థావరం నుంచి జంగమం వరకు సూక్ష్మ అనుశీలనం చేసి, లోకానికి ఆ ప్రకృతి యొక్క రహస్యాలను స్థూలంగాను, సూక్ష్మంగాను విప్పి చెప్పవలసిన మేధావులు గూడా రాజకీయవేత్తల స్థితిలో పడిపోవడం ఒక్కటే విచారం కల్గిస్తున్నది. రాజకీయవేత్తల ప్రవృత్తి పరిశీలన పద్ధతికిన్నీ, మేధావి అయిన వాడు చేసే ప్రవృత్తి పరిశీలనానికిన్నీ, నిధిగా తేడా వుంటుంది. వుండాలి. ఈ అంతరాన్ని గ్రహించలేక, మేధావిత్వం నెరపుతున్నామనుకుంటున్న వారు తమ్ము తామే గాక, లోకాన్ని గూడా ప్రతారిస్తున్నవారు, వంచన చేస్తున్న వారు అనే అనవలసి వుంటుంది. ఎందుచేతనగా—రాజకీయవేత్తల ఆలోచన ఎప్పుడూ స్వప్రయోజన మాత్ర పర్యాప్తం అయి మాత్రమే వుంటుంది. మేధావికి ఈ అడ్డమాకలు వుండ గూడదు. మేధావి మనస్సు ఆకాశంలో అందరాని ఎత్తులకు పోయే విహంగం లాంటిది. ఆ మనస్సు యొక్క సంచారానికి హద్దులు ఎక్కడ! అది నిస్సీమమర్యాదంగా సంచరిస్తుంది. అందుచేతనే రాజకీయ వేత్తకన్నా మేధావి అయిన మానవుడు, కవి అయిన మానవుడు, రచయిత అయిన మానవుడు భిన్నుడు, విశిష్టుడు అవుతున్నాడు. మరి ఇచ్చట కమిట్‌మెంటులు, కట్టడులు, బిగింపులు వున్నప్పుడు, అచ్చట ఈ వైశాల్యము, ఈ నిస్సీమమైన స్థితి వుండవు.

ఇప్పుడు మనదేశం వంక చూస్తే మేధావిలోకంలో, రచయితృ లోకంలో ఈ సీమాయితబుద్ధిమత్త్వం గోచరిస్తున్నది. రచయితలలో రచయితలు— రాజకీయ ప్రపంచపు పదజాలాన్ని అరువు తెచ్చుకొని తమ్ము తాము బంధించుకొనడమే గాక, లోకాన్ని గూడా ఆ పరిమిత భావ ప్రపంచం చేత బంధించాలని చూస్తున్నారు. ఇచ్చట మనుష్యుణ్ణి విశ్వరూపుణ్ణి గాక, పరిమితుణ్ణి చేయాలన్న ప్రయత్నం గోచరిస్తున్నది. భూమి బంధాలను గూడా విజ్ఞానం యొక్క సహాయంతో మానవుడు ఒకవంక ఛేదిస్తూ వుండగా, ఇంకో వంక మానవులోని ఈ పెరగలేనితనం వెర్రితలలు వేస్తున్నది. మానవుణ్ణి శాసించడం ఒక నీతి అయినంతగా, మానవుని ఉత్థానం సిద్ధాంతం కావడం లేదు. అనగా మనదేశంలో మేధావులు, రచయితలు వారి పని వారు చేయడం లేదు. రాజకీయాలలో పడిపోతున్నారు. మహాప్రళయంలో గూడా నిర్మముడు, అనాసక్తుడు అయి వుండవలసినవారు [illegible] భ్రాంతులు, మమతాచిత్తులు అయిపోతున్నారు. అందుచేతనే మనదేశంలో ప్రకృష్టమైన రచన ఇటీవలి కాలంలో జరిగి



కన్పించడం లేదు. ప్రతిభను ఏకదేశసిద్ధాంతాలకు బిగించి, వ్యుత్పన్నత నామోషి అయిపోయి, రచయితలు కుతిల పడుతున్నారు. తమ్ము తామే మరిచి పోతున్నారు. ఈ స్థితిలో మానవులలో అనధికారులకు, అధికారి అయిన వాడు దీపమై ముందుకు నడిపించే స్థితి కుదరదు. ఇక్కడ ఏది దీపమో, అది లేదు. ఈ స్థితి చీకటి. ఈ స్థితి నుంచి దేశాన్ని ఉద్ధరించవలసిన వారు గూడా మేధావులు, రచయితలే అయినందు వల్ల, ఈ ఏర్పడిన స్థితి మరీ విచారాన్ని కల్గిస్తున్నది.

ఇచ్చట ఇంకో విచిత్రమైన స్థితిని గూడా చూస్తున్నాము. రచన అనగా ఎంతసేపు పద్యమో, కథో, నవలో, లేక ఏ ఏకదేశ రాజకీయ భావవిన్యాసమో— అని అనుకోవడమే తప్ప, అంతకన్న సమగ్రమైన దృష్టి గోచరం కావడం లేదు. సమాజం అన్నది మహాసముద్రం లాగా గభీరమై గంభీరమై ముందు వుండగా, దానిని గురించి, వివిధ సత్త్వలలో అనుశీలనం చేసి, ఆ అనుశీలన ఫలితాంశాలను వాఙ్మయ ప్రపంచంలోనికి పట్టడం కన్పించదు. అభివృద్ధి అన్నది నాల్గు రాళ్ళు చేతులలో ఆడేట్లు చెయ్యడం మీదనే ఆధారపడి వుండదు. మనుష్యుణ్ణి సర్వతోముఖుణ్ణి, సమగ్రుణ్ణి స్వతంత్రుణ్ణి చేయగల్గడం మీద దాని ప్రకాస్తి నిలుస్తుంది. ఇది రాజకీయవేత్తకు సాధ్యమయ్యే పని కాదు. రాజకీయవేత్త మనిషిని బంధిస్తాడే గాని, విడవడు. రచయిత మనిషికి విడుదలను, ఉన్నతిని సాధించడమే లక్ష్యంగా గలవాడు. ప్రపంచంలో కొన్ని ఇతర దేశాలను చూచినట్లయితే ఈ అభివృద్ధి యొక్క లక్షణం ఇట్టిదని స్పష్టంగా కన్పిస్తుంది. ఎక్కడ మేధావులు మనస్సు వదిలి పని చేస్తారో అక్కడ నిజమైన అభివృద్ధి వుంటుంది. ఎక్కడ మేధావి ఏవో ఏకదేశపు కట్టడులు పెట్టుకొని, ఆ కట్టడుల పంజరంలో, పంజరంలో పక్షి వంటివాడు అయిపోతున్నాడో, అక్కడ అభివృద్ధి వుండటం లేదు. ఈ అభివృద్ధి లేనితనం మనదేశంలోను, ముఖ్యంగా మన ఆంధ్ర వాఙ్మయ వర్తమాన ప్రపంచంలోను విశదమై కన్పిస్తున్నది. మేధావులు, రచయితలు ఈవిషయాన్నిగురించి ఆలోచించాలన్నదే, ఇచ్చట విషయం. మేధావి గాని, రచయితగాని ప్రతినివిష్ట బుద్ధి కారాదు. మనస్సుకు సంకెళ్ళు వేసుకోరాదు. ఈ సంకెళ్ళు ఒకరు వేసినవిఅయినా, లేకపోతే స్వయంగావేసుకున్నా అక్కడ వాణి పలకదు. అది స్తబ్ధము, దగ్ధము అయిపోతుంది.

సాహిత్యం రాజకీయాలకు ఆయుధం కావాలన్న వాదం ఒకటి ఇటీవల ఇటీవల మరీ ప్రచలితం అవుతూ వస్తున్నది. సాహిత్యానికి మరణం అన్నది ఇంత కంటే వేరే వుండదు. ఎందుచేత ననగా, ఏ రాజకీయానికి, ఏ సాహిత్యం ఆయుధం కావాలి? రాజకీయం అన్నది ఎప్పుడు ఏకాకారంగా నిల్చి వుంటుందా? ఎప్పటికి అప్పుడు రాజకీయం మారుతూ వుంటుంది అని అంగీకరించే పక్షంలో సాహిత్యంలో శాశ్వత సత్తాకు స్థానం ఎక్కడినుంచి వస్తుంది? రాజకీయం సాహిత్యాంశమే అవుతుందిగాని సాహిత్య సమస్తం కాదు. ప్రకృతిని, ప్రకృతియొక్క వైవిధ్యాన్ని సాహిత్యపరుడు ద్రష్టయై అనుశీలనంచేసి, ఆ ప్రకృతిలోని సార్థమైన బుతాన్ని, ధర్మాన్ని చూచి, ఆవిష్కరించవలసి వుంటుంది. అట్లాచేసేశక్తిగల్గిన వారే రచయిత్ర నామవాచ్యులవుతున్నారు. కానివారు విపరీతపు సిద్ధాంతాలను సాహిత్య ప్రపంచంలో ప్రవేశ పెట్టి సాహిత్యాన్ని పర్యాప్తము, పరిమితము చేస్తున్నారు. పరిమిత ధర్మాలకు అపరిమితమైన సాహిత్యభావనను కట్టివేయచూడటం, కోరి బానిసత్వాన్ని కొని తెచ్చుకొనడం వంటిదే అవుతుంది.

లోకంలో ఏ సిద్ధాంతము, ఏ రాజకీయ సూత్రము సమగ్రం కాదు. ఎల్లకాలానికి చెల్లే సిద్ధాంతము, ధర్మము అంటూ ఏదీ వుండదు. నిన్నటి ధర్మం ఇవ్వాళ్ల చెల్లుబడిలేనిది అవుతున్నది. ఇందుకు కారణం ఒక్కటే. ఇవి అన్నీ ప్రయోజనాకాంక్ష కల్గిన ధర్మాలు. వానికి కేవలస్థితిలేదు. అప్పటికి అది మంచిది కావచ్చు. కాలాంతరంలో దానికి ఆపోవనిస్థితి ఏర్పడవచ్చు. మానవుని చరిత్రలో ఇంతవరకు ఎన్ని ధర్మాలు తలఎత్తలేదు., ఎన్ని అంతరించి పోలేదు! అందువల్ల సాహిత్యకారులు ప్రకృతిని, మానవుణ్ణి ఇతివృత్తం చేసుకొని అనాది నుంచి అనుశీలనం చేస్తూ, ఆ అనుశీలన ఫలితాలను గద్యంగా, పద్యంగా గానం చేస్తూ వస్తున్నారు. ఆ ఎవ్వరూ మనస్సుయొక్క తలుపులను మూసుకొని, మా మనస్సును ఇక్కడే బిగించుకు కూర్చుంటామని అనలేదు. కాలము అనంతము, పృథ్వి విపులము అన్న పద్ధతిని అవలంబనం చేశారు. ఇది రచయితకు వుండవలసిన ఏకైక లక్ష్యము, ప్రవృత్తిని. ఇది కానిది బంధము, బానిసత్వమున్నూ.

శాస్త్రవేత్తల దృష్టి ఇది. బంధాలు లేని విచార ధార వల్లనే, ప్రయోగ సాహిత్యం వల్లనే ప్రకృతి రహస్యము, ప్రాణికోటియొక్క రహస్యము క్రమక్రమావిష్కారం చెందుతుంది. అది కంటికి అందుతుందని, చెవికి వినబడుతుందని అనుకోరాదు. దానిని తరచి శోధించి "కనిపెట్టవలసి" వుంటుంది. అవ్యవస్థగా కంటికి కన్పిస్తున్న దానిలోనే వ్యవస్థ నిబిడమై వుంటుంది. ఆ వ్యవస్థను, ప్రకృతిలో ప్రకృతి యొక్క వైవిధ్యంలో నిహితమై వున్న ధర్మాన్ని తరచి ఆవిష్కరించడమే ప్రతిభ: ప్రతిభతో కూడినదే సాహిత్యం. ఇటువంటి దృష్టిని మేధావులు సాహిత్యకారులు అలవరచుకొన్నప్పుడు జాతికి నిజమైన అభ్యుదయము, ఆలోచనలో నిజమైన ప్రగతి, సాహిత్యంలో నిజమైన ఉపదేశం, రాజకీయాలలో నిజమైన సేవాధర్మం, పరిమిత స్థితినుంచి అపరిమిత స్థితికి మానవుణ్ణి నడిపించగల సర్వతోముఖమైన సర్వజనక్షేమంకరమైన కళ్యాణమార్గం గోచరిస్తుంది.

ప్రతి సంవత్సరంలాగానే ఈ సంవత్సరం గూడా కోరగానే రచయితలు తమ అమూల్యమైన రచనలు పంపి మాకు తోడ్పడినందుకు సంతోషిస్తున్నాము. అయితే సమాజంలో వున్న బహు విధ వైవిధ్యం రచనల రూపంలో రాకపోతున్నందుకు విచారిస్తున్నాము. వచ్చిన కొన్నిరచనలు ఆలస్యంగా వచ్చినందువలనను, కొన్ని రచనలు చిన్న గ్రంథాలంతగా వుండి, అవ్యవధిగా వచ్చినందునను ప్రకటించలేకపోయాము.

పరమభాగవతులు – 2



తాలప్యుడు　　రుక్మాంగదుడు　　అర్జునుడు


పరమభాగవతులు – 3



ప్రహ్లాదుడు నారదుడు పరాశరుడు

ఆంధ్రపత్రిక – పరీధావి నామ సంవత్సరాది సంచిక

పరమభాగవతులు – 4



శుకుడు శౌనకుడు భీష్ముడు

దాగుడు మూత

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

తల్లి

(గండశిల మీద దొంగకు గంత కట్టుచు)

"దాగుడు మూతా దండాకోర్
పిల్లివచ్చే ఎలికా భాద్దర్
నిక్కడి దొంగలు అక్కడే
పారిపోండి, పారిపోండి!"

మొదటి దొర

(గాదెలో)

ధాన్యమధ్యాన గాదెలో దాగుకొంటి
కటిక చీకటి ఇట కనుల్ కానరావు
నిలుకనే నిందు పిల్లియు నెరుగలేదు
నన్నసాధ్యంబు పట్టుట యున్న నిచట!

* * * *

అయ్యయో! వినవచ్చెడి నడుగు జాడ
పిల్లివలె దొంగవలె నన్ను వెదకి కొనుచు
సూటిగా గంపవైపుకే చూడవచ్చె!
గంపపై తట్టి వెన్నెలల్ నింపు మొగము
వంచి లోనికి, తనువు రోమాంచ మొదవ
బుజముపై కేలదట్టి నన్ ముట్టుకొనియె!

దొంగ

దమ్మ, దొంగవైతివి, పట్టరమ్మ నన్ను
ఆట పెట్టుము చేయక యాగడమ్మ!

మొదటి దొర

(పైకి లేచి)

అయ్యయో, చేసె నెంత యన్యాయ మమ్మ!
గంత వీనికి గట్టిగా కట్టలేదు!

దొంగ

చూచుకొనుము నా గంతను చూడు మిదిగో,
గట్టిగా కట్టియున్నది కనుల కింక!

మొదటి దొర

దొంగవుర నీవు బలుగజదొంగ వీవు
గంతలోపలి నుండియు గాంచగలవు!

* *

రెండవ దొర

(ధనరాశిలో)

చుట్టును ధనరాశి చోద్యమై బలసె
వజ్ర గోమేధిక వైడూర్యములును
ముత్యాలు పవడాలు పుష్యరాగములు
పచ్చలు నీలాలు పద్మరాగముం
కుప్పలుగా చుట్టు కోటగా వెలసె
రుక్మంపు కడ్డీలు గాంప్యరాశులును,
గది జముల్ తాళాల గట్టిగా బిగిసె
దొంగ యిచ్చటి కెట్లు దూరంగ జాలు?
దూరిననే నిందు దొంగకు దొరుక
కాంతుల మిరుమిట్లు కనులు కన్పడవు!

* *

అయ్యయ్యో వినవచ్చు నడుగులు జాడ
గది తల్పు తట్టెడి గజదొంగ మెల్ల
గాలియై లోదూరి కైకయి బట్టె
గాత్రంబు పులకాంక కందుకితముగ!

దొంగ

రమ్మి దొంగా, నన్ను రమ్మి పట్టంగ
ఆటపెట్టుము చేయ కాగడ మింక!

రెండవ దొర

(పైకిలేచి)

అయ్యయో చేసిన దన్యాయ మంబ
యింతగట్టిగ నీకు కట్టగాలేదు!

దొంగ

చూచుకో నా గంత చూడు మిప్పుడను
కండ్లను గట్టిగా కప్పిమ్మ చూడుమిదె !

రెండవ దొర

దొంగవు బలు గజదొంగవు నౌర
గంతలో నుండియు గనజాలు దొరి !

* * *

మూడవ దొర

(వనము పొదలో)

ధాన్యరాశి నమ్మి దాగినా డొక్కడు
ఒకుడు రత్నరాశి నొదిగె నమ్మి,
వీర బిడ్డ రెంత వీరిడులో గదా
తెలివి యున్న నాది తెలివిగాక!

దొరికె నాకు చుట్టు మరుభూమి నడుమలో
తరులతానికుంజ తతవనంబు
దప్పి బడలు దొంగ దాటుచో మరుభూమి
వనము మధ్య నన్ను పట్టలేడు!

* * *

అయ్యొ వినగవచ్చు నడుగుల సవ్వడి
చూడవచ్చె నిటకె సూటిగాను
పొదను తట్టి నన్ను పొదివెడి కౌగిట
మరుల జలదరించి మై గగుర్పు!

దొంగ

రమ్ము దొంగవైతి రారమ్ము ననుబట్టి
ఆట పెట్టు చేయు కాగడమ్మ

మూడవ దొర

(శేషము)

అమ్మ చేసెనయ్యొ అన్యాయ, మితనికి
కనుల గట్టలేదు గట్టె గంత

దొంగ

గంతె యిపుడు గనుల గట్టిగా నున్నది
చూడవలతువేని చూచుకొనుము !

మూడవ దొర

దొంగ వారి నీవు దొంగలదొంగవు
గంతలోవ నుండి కాంచగలవు!

* * * *

నాల్గవ దొర
(పుస్తకాల మధ్యలో)

పుస్తకాలమధ్య పురుగువలె డాగితివి
విస్తులగ్రంథాలు విలువెత్తు పేర్చితిని
ఈ దొంతరలమధ్య కెటు దొంగ రాగలడు
ఏదారి వచ్చిందు నెరిగి గుర్తింల గలడు?

* * * *

అయ్యయ్యో వినవచ్చు నడుగులిడు సవ్వడులు
దయ్యమటు సూటిగా దరిసినా డిక్కడల
పుస్తకంబులు తన్ని పారి నెడదలో జొచ్చె
మస్తకంబున తల్చె మైపులక లిటు హెచ్చ!

దొంగ

అరె, దొంగనైనాడ వాగడము చేయకుము
మరి యాటపెట్టకే మాయమై పోవకుము!

నాల్గవ దొర
(లేచుచు)

అంత యన్యాయ మా అమ్మయే పొనరిచెను
గంత వీనికి కళ్ల గట్టిగా కట్టకను!

దొంగ

చూచుకొమ్మా గంత చూచుకో యిప్పుడును
ఏచికండ్లకు గంత ఎడపకే కన్పదును!

నాల్గవ దొర

వింత గజదొంగవుర ఈ గంతలో నున్న
వింతగా జగమెల్ల వీక్షింపగల వన్న!

* * *

ఐదవ దొర
(వరుగిడుచు)

పరుగు వెదకికొనుచు నేను మాటుచేర నేలరా
పరుగువెట్ట పదములందు బలము వడియు నుండగా

పరుగు వారగలను నేను పాయువట్లు మన మటుల్
తరిమి నన్ను పట్టుకొనగ తరమె బ్రహ్మ దొంగకేన్!

* * *

అయ్యొ ఏమి చేయువాడ నడుగొ దొంగ కదిసె, నే
మయ్యొ, కాళ్ళు వడకసాగె నడుగు బరువు లెక్కెడిన్
ఇయ్యెడ కిటు తరిమి లీల నిట్టె వీపు తాచెడిన్
వెయ్యి గలది యేమి తనువు చేమరి పులకరించెడిన్!

దొంగ

తమ్ము దొంగవైతి విపుడు రార ఆటపెట్టగా

ఐదవ దొర

(రోజుతూ ఆగి)

అమ్మ గంతకట్టలేదు న్యాయమౌటర ఈ పనుల్?

దొంగ

అమ్మ చూడు మిడుగొ గంత నేత్రములకు నిప్పుడున్

ఐదవ దొర

అమ్మ ననగ నేల నీవె అలుపులేని దొంగవే!

* * * *

దొంగ

(ఐదుగురు దొరలను తెచ్చి)

దొంగలందరు నాకు దొరికినారే తల్లి
ఇప్పుడు వీరికి గంతలేవి వద్దు,
నను వీరు కనుగొన్న నను పట్టుకొన్నను
ఆట పెట్టెద వీరి కందరికిని!

తల్లి

దాగుడుమూతలు దండల కోరులు
పిల్లలు వచ్చెడి వేగపొమ్మ
పారిపో పారిపో పట్టుకొందురు వీరు
పారిపో కన్నుల పడకముందె!

ఐదుగురు దొరదొంగలు ఏకకంఠముగా

అమ్మ ఏడె ఈతడగపడకున్నాడు
ఎటులుపోయె తల్లి, ఎందుదాగె?

తల్లి

కళ్ళులేవె నీకు కాళ్ళులు లేకున్న
అడుగో ఎట్టయెదుట నాడు పాడు !

దొంగ

(తెరలో)

"నాలుగు స్తంభాలాటా
వడిమికి తోడిమికి
తానక తప్పక
తన పేరేమంటె
చెప్పుకో—చెప్పుకో - చెప్పుకో— ెప్పుకో— చెప్పుకో !"

1 వ వాడు

హరి నీవు !

2 వ వాడు

నీవు హరుడవు !

3 వ వాడు

హరిహరుడవు నీవు సందియుంబా దేవా !

4 వ వాడు

హరిహరుల హరివి నీవే!

5 వ వాడు

హరిహర హరి పక్ష్యతోపి హరుడవు, స్వామీ !



భారతీయ పునరుజ్జీవనము — రామమోహన్‌రాయ్ కృషి

శ్రీ కల్లూరి బసవేశ్వరరావు

"It is now high time for us to realise that the true history of a country is the history of its people, their ideals and achievements, social life education, culture, and their problems of weal or woe. Historical study is neither the luxury of a scholar, nor his idle pursuit of dry political and military details in the tangled web of chronological puzzles....History should be a truthful record of the unfolding and march of human civilisation age after age, and its object of study should be the human mind, human culture and human society."

—K. K. DATTA.

1. ప్రవేశిక

భారతీయ నాగరకతా పరిణామాన్ని మూడు యుగాలుగా విభజింప వచ్చు. 1. ప్రాచీనయుగము. 2. మధ్యయుగము. 3. ఆధునికయుగము. క్రీస్తుశకం 8—వ శతాబ్ది వరకు ప్రాచీనయుగమనీ, 9—వ శతాబ్ది నుండి 18—వ శతాబ్ది వరకు (800 నుండి 1800 వరకు) మధ్యయుగమనీ, 19—వ శతాబ్ది నుండి ఆధునిక యుగము ప్రారంభమైనదనీ చరిత్రవేత్తల అభిప్రాయము.

నాగరకత అంటే ఏమిటి? నాగరకతా పరిణామాన్ని నిర్ణయించే అంశాలు ఏవి? అనే ప్రశ్నలకు ముందుగా సమాధానం చెప్పటం అవసరం. అందువల్ల ఈ వ్యాసరచనలో ఏ దృక్పథం అనుసరింపబడిందీ అవగతమవుతుంది. "మానవుల సృజనాత్మక శక్తులను పెంపొందించి, వారి సంస్కృతీ వికాసానికి తోడ్పడే సాంఘిక—ఆర్థిక— రాజకీయ వ్యవస్థల నిర్మాణమే నాగరకత." శాస్త్ర సాంకేతిక జ్ఞానం అభివృద్ధి చెందటం, తాత్త్విక చింతనం పురోగమించటం, సాహిత్యం, లలితకళలు వికసించటం—ఇవి సాంస్కృతిక వికాసంలోని ప్రధానాంశాలు. నాగరకత— సంస్కృతి అనేవి వేర్వేరు విషయాలు గావు. అవి ఒకే నాణమునకున్న రెండు ముఖాలు. అవి పరస్పరాశ్రయాలు; పరస్పర పోషకాలు. నాగరకతాపరిణామాన్ని నిర్ణయించే సాంఘికశక్తుల్లో మూడింటిని చరిత్రవేత్తలు ప్రధానమైనవిగా గుర్తించారు.

అవి: 1. ఆర్థికస్థితిగతులలో మార్పులు. 2. భావాల ప్రభావం. 3. నాయకుల పాత్ర.

ప్రాచీనయుగంలో భారతీయ నాగరకత ఉన్నత శిఖరాలను అందుకొన్నట్లు చరిత్ర చెప్తున్నది. వేదాలు, ఉపనిషత్తులు, భగవద్గీత, షడ్దర్శనాలు, లోకాయతదర్శనం, జైనబౌద్ధాలు— నాటి భారతీయ తాత్త్విక ప్రపంచంలోని మణిపూసలు. ఖగోళ, గణిత, వ్యాకరణాది శాస్త్రాలే గాక, భౌతిక శాస్త్రాలు, వైద్యవిజ్ఞానం ఆనాడు పరిఢవిల్లినవి. వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు ఆ యుగంలోని వారే. అజంతా గుహలు నాటివే. నాలందా విశ్వవిద్యాలయం అప్పటిదే. మౌర్య, గుప్త సామ్రాజ్యాలు, అశోకునిధర్మదీక్ష నాటి భారతీయుల రాజనీతిలోని మౌలికతకు తార్కాణాలు. భారతీయ నాగరకత ఆగ్నేయాసియా దేశాల్లో వ్యాపించి మన్ననలను పొందింది. ఒక్కమాటలో ప్రాచీనయుగంలో భారతీయులు హేతువాదానికీ, మానవతాదృక్పథానికీ మకుటం పెట్టటం వారి విశిష్టత. ప్రాచీన భారతీయ నాగరకతా వైభవాన్ని బషామ్ పండితుడు ఇలా క్రింది మాటల్లో ఉగ్గడిస్తున్నాడు:-

"India was a cheerful land whose people...... reached a higher level of kindliness and gentleness in their mutual relations than any other nation of antiquity. For this, as well as for her great achievements in religion, literature, art and mathematics, one European student at least would record his admiration of her ancient culture." (See "The Wonder that was India" by A. L. Basham.)

మధ్యయుగంలో భారతీయ నాగరికతలోని జీవశక్తి మందగించింది. క్రీ. శ. 11—వ శతాబ్దిలో భారతదేశాన్ని సందర్శించిన ఆల్బెరూని యీ విషయాన్ని ప్రస్తావించి, భారతీయులలో సంకుచితత్వం, అహంకారం పెచ్చు పెరిగినట్లు భావించాడు. మధ్యయుగంలో సృజనాత్మకమైన ఆలోచనల తగ్గినవి. శాస్త్రవిజ్ఞానం కుంటుపడింది. మూఢవిశ్వాసాల పెరిగినవి. వర్ణ వ్యవస్థ గట్టిపడినది. అనేక ఉపకులాలు ఏర్పడినవి. సంకుచిత వలయాలు కొరణులుగా ఏర్పడటం, శాస్త్రవిజ్ఞానానికి, సమతకు తోడ్పడని విద్యావిధానం, ఇహలోకాన్ని నిరసించే మాయావాదం, నిష్క్రియాశీలాన్ని, నిరాశావాదాన్ని పెంపొందించే కర్మసిద్ధాంతం, సంప్రదాయానికి దాసోహమనే హేతువాదరాహిత్యం, మార్పులు లేని సాంఘిక—ఆర్థిక వ్యవస్థ, ఫ్యూడల్ విధానాలు, మహమ్మదీయ పాలకుల నిరంకుశత్వమూ, అందువల్ల చెలరేగిన రాజకీయ సంఘర్షణలూ— ఇవి మధ్యయుగ దుస్థితికి మూలములైన కొన్ని కారణాలు. పణిక్కర్ మహాశయుడు మధ్యయుగపరిస్థితిని యిలా వర్ణించాడు:—

"From Kashmir to Cape Comorin, the worship of Siva, Vishnu and Devi prevailed and the background of philosophy accepted without question the main doctrines of Paramatma Jivatma, Maya, and re incarnation in a society organised on the basis of caste and the Dharma–Sastras." ("A Survey of Indian History" by K. M. Panikkar.)

ఢిల్లీ సుల్తానుల, మొగలాయి పాదుషాల పరిపాలన వల్ల రాజకీయ, మతసాహిత్య రంగాల్లో కొన్ని మార్పులు వచ్చినవి. అయినప్పటికీ తరతరాలుగా పాతుకొని వున్న భారతీయ సాంఘిక—ఆర్థిక వ్యవస్థలో మార్పులు సంభవించ లేదు. భారతీయుల భావాలలో విప్లవం రాలేదు. కాగా 18—వ శతాబ్ది నాటికి భారతదేశంలో మధ్యయుగ నిస్తబ్దత, నిస్తేజం పరాకాష్ఠ నందుకొన్నవి షుమారు రెండు వందల సంవత్సరాలు కొనసాగిన మొగల్ సామ్రాజ్యం నాదర్షా దండయాత్ర (1739) పిమ్మట శిథిలావస్థకు గురియైంది. రాజధాని అంతఃకలహాలకు, కుట్రలకు, హత్యలకు ఆలవాలమైనది. కేంద్రప్రభుత్వ అధికారం క్షీణించింది. మొగలాయి సర్దారులు అవినీతికీ, అధికార వాంఛకూ లోనై రాజకీయాలను కలుషితం జేశారు. రాష్ట్రపాలకులు కేంద్రప్రభుత్వాన్ని లెక్కచేయలేదు. స్వతంత్రాన్ని ప్రకటించుకొన్నారు. ప్రభుత్వోద్యోగుల, నిరంకుశంగా ప్రవర్తించసాగారు. పరిపాలనా వ్యవస్థ బీటలువారినది. ఈ పరిస్థితుల్లో మొగలాయీలను ప్రతిఘటించిన మహారాష్ట్రులు వారి స్థానాన్ని ఆక్రమించుకోలేకపోయారు. ఒక విచిత్రమైన రాజకీయ పరిస్థితి యేర్పడింది. మొగలాయీ వ్యవస్థ శిథిలమై అధికార శూన్యత యేర్పడినది. దానిని పూరించే శక్తి మహారాష్ట్రులకు లేదు. అదే సమయంలో పర్షియా, ఆఫ్ఘనిస్థానాల నుండి విదేశీయులు దండెత్తి వచ్చి తమ అధికారాన్ని భారతదేశంలో స్థాపించే అవకాశం లేదు. తిరిగి ఒక మహమ్మదు ఘోరీగాని, ఒక బాబరుగాని వచ్చే స్థితిలేదు. ఈ పరిస్థితి ఆంగ్లేయులకు చక్కని అవకాశాన్ని కల్పించింది. కాగా వారు 18—వ శతాబ్దం రెండో భాగంలో భారతదేశంలో తమ సామ్రాజ్య సంస్థాపనకు పునాదులు వేశారు. క్రమేణా సామ్రాజ్య సౌధాన్ని నిర్మించుకొన్నారు.

రాజకీయ వ్యవస్థ వలె 18—వ శతాబ్దిలో సాంఘిక, ఆర్థిక, రంగాలు కూడ శోచనీయమైన స్థితిలో వున్నాయి. హిందువులు—మహమ్మదీయుల మధ్య సంపూర్ణ సామరస్యం లేదు. కులతత్వం బలీయంగా వుంది. సాంఘిక సమైక్యానికి దోహదం చేసే శక్తులు బలహీనంగా వున్నాయి. నాటి గ్రామ వ్యవస్థ కూడా సాంఘిక, ఆర్థిక అసమానతలకు నిలయమైనది. ఇక నాటి ఆర్థిక పరిస్థితులు కూడ అధ్వాన్నంగా వున్నాయి. మూలధనం తక్కువగా వుంది. బాంకింగ్ పద్ధతి అభివృద్ధి చెందలేదు. ఆర్థికాభివృద్ధిని సాధించే పౌరవగాని, నూతన సాంకేతిక పరిజ్ఞానం గాని భారతీయులకు లేవు. మధ్యయుగం నాటి వ్యవసాయక ఆర్థిక వ్యవస్థయే కొనసాగుతూ వుంది. పాశ్చాత్యుల పోటీ వల్ల విదేశీ వ్యాపారం దెబ్బతిన్నది. పైగా సాహిత్య, విద్యారంగాల్లో, సృజనాత్మకశక్తి తగ్గిపోయింది. 18—వ శతాబ్దిలో తత్వవేత్తలు గాని, సంస్కర్తలు గాని కనపడరు. విద్యావిధానంలో అభ్యుదయకర రీతులు శూన్యము. నిరక్షరాస్యులు ఎక్కువ. అక్షరాస్యులలో హేతువాదం లేదు. శాస్త్రవిజ్ఞానం దాదాపు లేనట్లే. సంప్రదాయపు సంకెళ్ళు బిగిసినవి. కొత్త ఆలోచనలు కొరవడినవి. మానసిక మౌఢ్యం ముదిరింది. మూఢాచారాలు, అంధవిశ్వాసాలు తాండవం చేయసాగినవి. భారతీయ నాగరికత జీవశక్తిని కోల్పోయింది. కళావిహీనమైనది. ఈ దైన్యస్థితిని రవీంద్రనాథ్ టాగోరు యీవిధంగా వర్ణించాడు:—

"Our country having lost its link with the inmost truths of its being, struggled under a crushing load of unreason in abject slavery to circumstances In social usage, in politics, in the realm of religion and art, we had entered the Zone of uncreative habit, of decadent tradition, and ceased to exercise our humanity." (Ram Mohan Roy Centenary Commemoration volume."1933)

2. పునరుజ్జీవనమంటే...

19—వ శతాబ్ది ప్రారంభం నుండి భారతీయ నాగరకతా పరిణామంలో తిరిగి సృజనాత్మక దశ ప్రారంభమైంది. దానిని భారతీయ పునరుజ్జీవనము (ఇండియన్ రినైజాన్స్) అంటున్నారు. మానవ నాగరకతా పరిణామంలో కొన్నిసందర్భాల్లో నిస్తబ్దత గూడుకట్టుకొంటుంది. జీవశక్తి తగ్గుతుంది. అభివృద్ధి వుండదు. భావచైతన్యం, పరిస్థితుల్లో మార్పులు వుండవు. కొత్త సాంఘికశక్తులు, కొత్త భావాలు ఉద్భవిస్తేగాని తిరిగి సృజనాత్మక వ్యాపారం సాగదు. పాత సంప్రదాయాల అవరోధం తీవ్రంగా వుంటే కొత్త శక్తుల విజృంభణ మందంగా వుంటుంది. ప్రజలలో చైతన్యం తగ్గిపోతుంది. నిరాశ, నిస్పృహలు పెరుగుతాయి. మేధస్సు తరిగిపోతుంది. నాగరకత పతనావస్థలో వుంటుంది. అలాగాక కొత్త భావాలు, సాంఘికశక్తులూ శీఘ్రంగా ఆవిర్భవిస్తే నాగరకతలోని నిస్తబ్దత తొలగిపోతుంది. తిరిగి వికాసం ప్రారంభమవుతుంది. దానినే పునరుజ్జీవనము అంటారు. పునరుజ్జీవన ప్రారంభంలో గత చరిత్రను అధ్యయనం చేయటం సహజం. ఎందుకంటే భవిష్యత్తులోకి ధైర్యంగా ప్రయాణం చేయటానికి అవసరమైన ఉత్సాహం గత చరిత్ర పరిజ్ఞానంవల్ల కలుగుతుంది. పైగా గత చరిత్రలో తాత్కాలికమైన రాజకీయ, సాంఘిక పరిణామాలే గాక శాశ్వతమైన విలువలు కూడ వుంటాయి. అవి ఒక జాతి నాగరకతా స్రవంతిలో అంతర్గతంగా వుంటాయి. శాశ్వతమైన అంతశ్శక్తి లేకపోతే ఆ నాగరకత మన లేదు. అంతర్వాహినిగా వున్న శాశ్వత సూత్రాలనూ, విలువలనూ అవగాహన చేసుకోటానికి గత చరిత్ర అధ్యయనం పునరుజ్జీవనానికి అవసరమవుతుంది.

పునరుజ్జీవనం రినైజాన్స్ అనునది ఒక ప్రత్యేక చారిత్రక శబ్దం. ఐరోపా ఖండంలో 14, 15 శతాబ్దాల్లో వచ్చిన సాంఘిక—సాంస్కృతిక పరిణామాల ఫలితంగా అక్కడ మధ్యయుగం అంతరించి, ఆధునికయుగం అవతరించింది. ఆ పరిణామాలను చరిత్రవేత్తలు పునరుజ్జీవనమని వర్ణించారు. పునరుజ్జీవనం ఏ రెండుమూడు దశాబ్దాల్లోనో పూర్తి గాదు. అదిఒక సాంఘిక స్రవంతి. ఐరోపా ఖండంలో పునరుజ్జీవనం కొన్ని శతాబ్దాలపాటు కొనసాగింది. తత్ఫలితంగా ఐరోపా నాగరకతా పరిణామంలోఆధునికత (Modernity) సిద్ధించింది. మధ్యయుగంనాటి సంకుచిత సంప్రదాయ ధోరణులు తొలగినవి. కనుక సమాజం ఆధునికత్వాన్ని పొందటానికి తోడ్పడే వివిధ పరిణామాలను ఉద్దేశించి చరిత్ర వేత్తలు రినైజాన్స్ అనే ప్రత్యేక శబ్దాన్ని వాడారు. పునరుజ్జీవనమంటే కేవలం గతాన్ని పునరుద్ధరించటంకాదు. సమాజం ఆధునికత్వాన్ని పొందటమే పునరుజ్జీవనము. అయినప్పుడు 'ఆధునికత ప్రధాన లక్షణాలు ఏమిటో తెలుసుకొనక తప్పదు. ఈ క్రింది నాలుగు లక్షణాలు 'ఆధునికత'కు ప్రాణపదాలని, వాటిని సంతరించుకొన్న సమాజమే ఆధునిక సమాజమని పరిగణించవచ్చు.

ఆధునికతకు హేతువాదం మొదటి లక్షణం. ప్రకృతి సిద్ధమైన హేతుశక్తిద్వారా మానవుడు భౌతిక జగత్తునూ, సాంఘిక ప్రపంచాన్నీ అవగాహన చేసుకొని తన భవిష్యత్తునుతానే నిర్ణయించుకో గలడనే సిద్ధాంతమే హేతువాదం హేతువాదం శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందిస్తుంది. పరిశీలన, ప్రశ్న, పరి

శోధన, ప్రయోగం, ఉపపత్తి — ఇవి ఆధునిక శాస్త్రీయ విచారణా పద్ధతిలోని ప్రధానాంశాలు. శాస్త్రీయ విచారణా పద్ధతి ద్వారా మానవుడు నూతన విజ్ఞానాన్ని సముపార్జిస్తున్నాడు.

నూతన శాస్త్రీయ విజ్ఞాన వికాసం ఆధునికతకు రెండవ లక్షణం. దాని వలన మానవుడు విశ్వాన్ని గురించి, ప్రకృతిని గురించి, సమాజ పరిణామాన్నిగురించి తెలుసుకోగల్గుతున్నాడు. శాస్త్రీయ విజ్ఞానం పెరిగినకొద్దీ మానవుల సాంకేతిక నైపుణ్యం అభివృద్ధి చెందుతుంది. వారు కొత్త పరికరాలనూ, ఉత్పత్తి సాధనాలనూ సృష్టిస్తారు. యంత్రయుగం ప్రారంభమవుతుంది. పారిశ్రామికీకరణం జరుగుతుంది. ఆవిరిశక్తి, విద్యుచ్ఛక్తి, అణుశక్తి మానవులస్వాధీనము అవుతున్నవి. మానవులు వినియోగింప గలిగిన బాహ్యశక్తులు ఆధునికతకు ఒక గీటురాయి.

అభివృద్ధి చెందుతూవున్న నూతన శాస్త్రీయవిజ్ఞానాన్ని అమలు పరచటం వల్ల నాగరకతలో మౌలికమైన పరిణామాలు రావటం ఆధునికత మూడో లక్షణం. ఆర్థికరంగంలో ఉత్పాదకశక్తి పెరుగుతున్నది. మానవులను పట్టి పీడిస్తున్న దారిద్ర్యాన్ని తొలగించే ఆర్థిక వ్యవస్థను రూపొందించు కోటానికి వీలుకలుగుతున్నది. ఇక రాజకీయ రంగంలో అధికారం విస్తరింప బడటమేగాక, కేంద్రీకృతమవుతుంది. అధికారం ప్రజల సంక్షేమానికి వినియోగింపబడాలనే భావం బలపడుతున్నది. ప్రజాస్వామ్యం అమలు చేయబడుతున్నది. ప్రజలు అధికార నిర్వహణలో భాగస్వాములవుతున్నారు. జాతి ఆర్థిక జీవనంలో ప్రభుత్వాల జోక్యం ఎక్కువవుతున్నది. జాతీయ ఆర్థిక ప్రణాళికలు అమలుచేయబడుతున్నాయి. నూతన సిద్ధాంతాలు — ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సోషలిజం — ఆవిష్కరింపబడుతున్నాయి. సాంఘికరంగంలో పాతసంప్రదాయాలూ, వ్యవస్థలూ, సడలిపోతున్నవి. సాంఘిక సమానత్వానికీ, న్యాయానికీ ప్రాధాన్యం వస్తున్నది. విద్యావిధానం జాతీయాభివృద్ధిని సాధించటానికి అవసరమైన సాధనంగా గుర్తింపబడుతున్నది. సాహిత్య, కళారంగాల్లో నూతన ప్రక్రియలూ ప్రయోగాలూ వస్తున్నవి. శ్రామిక వర్గాలు పైకి వస్తున్నాయి.

మానవతా తత్త్వ వికాసం ఆధునికత యొక్క నాలుగో లక్షణం. సర్వజన హితం, సర్వజనసుఖం మానవతాతత్త్వానికి ప్రాతిపదిక. మానవుడు తన భవిష్యత్తుకు తానే కర్త. సర్వ విషయాలకు మానవ వికాసమే కొలతబద్ద అనే సూత్రాలకు తాత్విక విచారంలో ప్రాముఖ్యం వస్తున్నది. శాస్త్రవిజ్ఞానం సాయంతో మానవతాతత్త్వం పరిపుష్టమై, మానవుల ఆధ్యాత్మిక, భౌతిక వికాసాలను కలుపుకొని వచ్చే సమగ్రతత్త్వంగా రూపొందుతూ వుంది.

పైన వివరించిన నాలుగులక్షణాలను సంతరించుకొంటున్న సమాజాన్ని ఆధునిక సమాజమంటారు. సమాజం ఆధునికత్వాన్నిపొందటానికి తోడ్పడే వివిధ పరిణామాలను రినైజాన్స్ అనే శబ్దం సూచిస్తుంది.

భారతీయ నాగరికత మధ్యయుగ దశనుండి ఆధునిక యుగంలోనికి పరివర్తన వర్తన చెందే సమయంలో సంభవించిన పరిణామాలను ఉద్దేశించి మన చరిత్రవేత్తలు భారతీయ పునరుజ్జీవనము అనే శబ్దాన్ని వాడారు. కాగా భారతీయ పునరుజ్జీవన పరిశీలనవల్ల, భారతీయ సమాజం ఆధునికత్వాన్ని ఎలా సంతరించుకొందో తెలుసుకోవచ్చు. భారతీయ పునరుజ్జీవన చరిత్రలో యీ క్రింది ఐదు దశలను గుర్తింపవచ్చు:—

1. పునరుజ్జీవనప్రారంభము—రామమోహనుని యుగము (1800—1833)
2. రెండోదశ—1857నాటిజాతీయపుతిరుగుబాటువరకు (1833—1857)
3. మూడోదశ—జాతీయ కాంగ్రెసుసంస్థాపనవరకు (1857—1885)
4. నాలుగోదశ—బెంగాల్ విభజనవరకు (1885—1905)
5. ఐదోదశ— గాంధినాయకత్వం ప్రారంభమయ్యేవరకు (1905—1919)
6. ఆరోదశ— భారతరిపబ్లిక్ అవతరణ వరకు (1920—1950)

సౌలభ్యం కొరకు పునరుజ్జీవనచరిత్రను పై విధంగా విభాగించాను. న్యాయంగా 1800 నుండి 1950 వరకు కొనసాగిన ఉద్యమం ఎడతెగని ఒకే ప్రవంతి. ఆ 150 సంవత్సరాల కాలంలో భారతదేశం మధ్యయుగ సంప్రదాయ ధోరణులను విడనాడి ఆధునికతను కొంతవరకు సంతరించుకొంది. అయితే 1950తో ఆధునికీకరణం ఆగిపోలేదు. కొత్త జవంతో సాగుతూవుంది. కనుక ఆధునిక భారతీయ చరిత్రలో 1950 నుండి నూతన ధ్రువకాలము ప్రారంభమైనదని నిర్ణయించవచ్చు.

భారతీయ పునరుజ్జీవన చరిత్ర ప్రారంభదశను స్థూలంగా పరిశీలించటం యీ వ్యాసం యొక్క లక్ష్యం. వ్యాస ప్రారంభంలో చెప్పినట్లుగా చరిత్రగతి నిర్ణయించే అంశాలలో ఆర్థిక—సాంఘిక స్థితిగతులు, భావచైతన్యం, మహాపురుషుల కృషి ముఖ్యమైనవి. ఈ మూడు అంశాలను దృష్టిలో పెట్టుకొనియే భారతీయ పునరుజ్జీవన ప్రారంభదశ సమీక్షింపబడింది. ఈ ప్రారంభ దశ 1833లో రామమోహన్‌రాయ్ మరణంతో ముగుస్తుంది. ఐరోపా పునరుజ్జీవనానికి ఇటలీవలె, భారతీయ పునరుజ్జీవనానికి బెంగాల్— తొలిదశలో—కీలకమైన పాత్రను నిర్వహించింది. నాటి అభ్యుదయకరపరిణామాలను గుర్తించి, ఆధునిక భారతదేశ అవతరణకు తోడ్పడిన మహనీయులలో రాజారామమోహన్‌రాయ్ అగ్రగణ్యుడు. కనుక ఈ ప్రారంభదశను రామమోహన్‌రాయ్ యుగమని పేర్కొనవచ్చు.

3. ఆంగ్లేయుల పరిపాలన—నూతన మధ్యతరగతి

భారతీయ పునరుజ్జీవనంలో రామమోహన్‌రాయ్ నిర్వహించిన పాత్రను అంచనావేసేముందు, 18— వ శతాబ్దపు ఉత్తరభాగంలో తలఎత్తిన సాంఘిక శక్తులనూ, నూతన భావాలనూ ప్రస్తావించటం అవసరం. అందువల్ల రామమోహనుడు ఏ సాంఘికశక్తులకు ప్రతినిధియో, ఏ జీవప్రవంతికి ఆలంబనంగా నిలచాడో తెలుస్తుంది.

క్రీ. శ. 1600 లో ఇంగ్లండులో స్థాపించబడిన ఈస్టు ఇండియా వర్తక సంఘం భారతదేశంలో ఏకస్వామ్యం హక్కులతో వ్యాపారం చెయ్యటానికి ఉద్యమించింది. 17 వ శతాబ్దిలో సూరత్, కలకత్తా, మదరాసు, బొంబాయి మొదలయిన చోట్ల ఈస్ట్ ఇండియా కంపెనీ తన వర్తక కేంద్రాలను స్థాపించింది. 18— వ శతాబ్దపు మొదటిభాగంలో మొగల్ సామ్రాజ్యం విచ్ఛిన్న దశలో పడే నాటికి, ఆంగ్లేయుల కంపెనీ మనదేశంలో రాజ్యాధికారాన్ని స్థాపించే శక్తిని కూడా పుంజుకొంది. 1750 తర్వాత అటు ఫ్రెంచికంపెనీవారినీ, ఇటు భారతీయపాలకులనూ ఓడించి, కంపెనీ తన రాజ్యాధికారాన్ని బెంగాలు, బొంబాయి, మదరాసు, మైసూరు, అయోధ్య మొదలయిన ప్రాంతాల్లో స్థాపించింది. 1813 నాటికి ఆంగ్లేయుల అధికారం ఢిల్లీనుండి అస్సాంవరకు, తూర్పు తీరంలో, పశ్చిమతీరంలో పలుచోట్ల చెల్లుబడి అవుతూవుండేది. ప్రత్యక్షంగా రాజ్యాధికారాన్ని చలాయించని తావుల్లో సైన్యసహకారంవంటి దౌత్య విధానాల ద్వారా పరోక్షాధికారాన్ని సంపాదించుకొంది. ఈస్టుఇండియా కంపెని రాజ్యాధికారాన్ని స్థాపించే సమయంలో బ్రిటిష్ పార్లమెంటు 1773 లో రెగ్యులేటింగ్ ఆక్టు మొదలుకొని అనేక శాసనాలుచేసి, భారతదేశంపై బ్రిటిష్ సార్వభౌమత్వాన్ని స్థిరీకరించింది. 1813 లో కంపెనీకి వర్తకరంగంలో వున్న

ఏకస్వామ్యం రద్దు చేయబడింది. భారతదేశంలో స్వేచ్ఛా వ్యాపారం అంగీకరింపబడింది. తమ అధీనంలో వున్న ప్రాంతాల్లో ఆంగ్ల పాలకులు అనేక న్యాయ పరిపాలనా సంస్కరణలను ప్రవేశపెట్టి తమ ఆధిపత్యాన్ని గట్టిపరచుకొన్నారు.

ఆంగ్లపరిపాలనవల్ల భారతీయ ఆర్థికసాంఘికవ్యవస్థలు విచ్ఛిన్నమయ్యాయి. వానిస్థానంలో నూతన సాంఘికశక్తులూ, వర్గాలూ ఉద్భవించాయి. [See, Karl Marx on India in "India today"—By P. R. Dutt.] అంతకు పూర్వం ఢిల్లీ సుల్తానుల యుగంలోగాని, మొగల్ యుగంలోగాని అటువంటి పరిణామాలు సంభవింప లేదు — సాంస్కృతిక, పరిపాలనారంగాల్లో మార్పులు వచ్చినప్పటికీ, భారతీయ సాంఘిక, ఆర్థిక వ్యవస్థలు విచ్ఛిన్నం కాలేదు. కాని బ్రిటిష్ యుగంలో ఆర్థికరంగంలో, ఆస్తిసంబంధాల్లో మార్పులువచ్చి, పాత సాంఘిక వ్యవస్థ దెబ్బతిన్నది. కొత్త సాంఘిక శక్తులు— ముఖ్యంగా— ఒక నూతన మధ్యతరగతి ఆవిర్భవించింది. అదెలా సంభవించిందో రేఖామాత్రంగా వివరిస్తాను.

17— వ శతాబ్దపు చివరభాగంలో ఇంగ్లండులో భారతీయ పారిశ్రామిక వస్తువులకు— ముఖ్యంగా— సన్నని నూలుబట్టలకు గిరాకీ ఎక్కువైంది. ఆంగ్లేయులు తమ దేశంలో తయారవుతున్న ముతకరకమైన ఉన్ని బట్టల కంటె భారతదేశం నుండి దిగుమతియైన మేలురకపు నూలు బట్టల కొరకే మోజు పడేవారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకొని ఈస్టు ఇండియా కంపెనీ భారతదేశం నుండి నూలు బట్టలు ఎక్కువ దిగుమతి చేసింది. నీలిమందు, సుగంధ ద్రవ్యాల వ్యాపారంకంటె నూలు బట్టల వ్యాపారంవల్లనే కంపెనీ అధిక లాభాలు పొందుతూ వుండేది. కాని బ్రిటిష్ ఆర్థికవేత్తలు (వారిని మర్కంటిలిస్టులు అనేవారు) యీ వ్యాపారాన్ని వ్యతిరేకించారు. ఆంగ్లేయులు వెండి, బంగారాలను కోల్పోతున్నారని వారి వాదం. ఇంగ్లండులోని సిల్కు, ఉన్నిబట్టల ఉత్పత్తిదారులు కూడ తమకు నష్టం వస్తుందనీ, తమ పరిశ్రమల్లో నిరుద్యోగం పెరుగుతుందనీ ఆక్రోశించారు. తత్ఫలితంగా బ్రిటిష్ ప్రభుత్వం 1700 తర్వాత కొన్ని రక్షణచర్యలు తీసుకొంది. భారతదేశంనుంచి దిగుమతులపై పన్నులను అధికం చేసింది. 1720 లో ఒక శాసనం ద్వారా భారతదేశపు సిల్కు, నూలు బట్టల వాడకాన్ని నిషేధించింది. ఇటువంటి రక్షణ చర్యలు— ఇంగ్లండులోనే గాదు— ఫ్రాంసులో కూడ అమలుపరిచారు. ఈ చర్యలవల్ల ఆశించిన ఫలితం లభించ లేదు. భారతీయ వస్త్రాలకు గిరాకీ తగ్గలేదు. ఇంగ్లండులో వానివాడకం పెరుగుతూనే వుంది.

ఇలావుండగా ఇంగ్లండులో నూలుబట్టల పరిశ్రమ వేగంగా అభివృద్ధి చెంద సాగింది. అందుకు కొత్త ఉత్పత్తి సాధనాలు తోడ్పడ్డాయి. (వస్తువుల ఉత్పత్తిలో యంత్రాల వాడకం పెరిగింది. దీనిని పారిశ్రామిక విప్లవం అంటారు). ఒక వైపున భారతదేశపు దిగుమతులపై నిషేధాలు, మరొక వైపున ఇంగ్లండులో నూలుబట్టల పరిశ్రమ అభివృద్ధి చెందటం— యీ రెండు కారణాల వల్ల 1750నాటి నుండి భారతదేశపు నూలుబట్టల వ్యాపారం మందగించింది. అయినప్పటికీ భారతీయులు ఉత్పత్తి చేస్తున్న బట్టలు మన్నికలో, అందచందాల్లో తీసికట్టుగా లేనందున, వాటి దిగుమతులు పూర్తిగా దెబ్బతిన లేదు. పైగా మొదట్లో ఇంగ్లండులో యంత్రాల వాడకంవల్ల ఉత్పత్తి అయినబట్టల ధరలు భారతీయ వస్త్రాలధరలకంటె తక్కువగాదు. కనుక 1820 వరకు భారతీయ పరిశ్రమ ఆంగ్లేయుల పోటీని తట్టుకొని మనగలిగింది. కాని అప్పటికి ఆంగ్లేయులు రాజ్యాధికారాన్ని స్థాపించటంవల్ల, వారు తమ అధికారాన్ని దుర్వినియోగంచేసి భారత పరిశ్రమలను నాశనం చేశారు. వారు అనుసరించిన పద్ధతిని "వలస ఆర్థిక విధానం" అని అంటారు. ఇంగ్లండులోని పరిశ్రమలకోసం మనదేశంలో ముడి పదార్థాల వుత్పత్తిని అధికం చేయటం, ఇంగ్లండులోని పరిశ్రమలు తయారు చేసిన వస్తువులకు మనదేశం మార్కెట్‌గావుండటం— ఇవి నాటి వలస ఆర్థిక విధానం యొక్క లక్ష్యాలు. ఈ లక్ష్య సాధనకై బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశపు ఎగుమతులపై సుంకాలు అధికం చేశారు. ఇతర నిర్బంధాలను ప్రవేశపెట్టారు. 1833నుండి స్వేచ్ఛా వ్యాపారాన్ని ప్రవేశపెట్ట ఇంగ్లండు పారిశ్రామికులకూ, బూర్జువాలకూ మేలుచేశారు. భారతదేశం ముడి పదార్థాలను ఎగుమతిచేసి, తయారీ వస్తువులనుకొనే దేశంగా మారింది. అంతేగాక బెంగాలులో వసూలు చేసిన రెవెన్యూ నుండి, ఈస్టుఇండియా కంపెనీ మన దేశంలో వస్తువులుకొని, ఎగుమతి చేసేది. ఇలాంటి కొనుగోళ్లను పెట్టుబడులు అనేవారు. ఈ పద్ధతి ద్వారా కూడ సంపద కొల్లగొట్టబడింది. దీనిని "డ్రైన్ ఆఫ్ వెల్త్" అనేవారు. ఈ డ్రైన్ ఫలితమేమంటే ఇంగ్లండులో పరిశ్రమలు పెరిగి, ఆ దేశం పారిశ్రామిక పురోగతిని సాధించ గల్గింది.

'The drain ot wealth from India was a contributory factor in the industrial development of England. The available evidence leaves little doubt that the magnificient industrial structure of England which began to rise after Plassy was largely built upon the ruins of Indian manufactures." "The productive organisation of India was destroyed and the country which was once known for its riches all the world over was reduced to a state of poverty, disease, misery and starvation. The economic decline of the country was accompanied by a social revolution. The village community which fostered co-operative living was destroyed. New economic relations based on the western ideas of individual property and enterprise, competition and market economy began to prevail." ("History of the Freedom Movement"—Tarachand)

ఆంగ్ల పాలకులు అనుసరించిన వలస ఆర్థిక విధానంవల్ల భారతీయ పారిశ్రామిక వ్యవస్థ బ్రద్దలై నిరుద్యోగం, దారిద్ర్యం, పెరిగినాయి. ఢాకా వంటి పారిశ్రామిక పట్టణాల్లో జనసంఖ్య తగ్గింది. నేతపనివారు, ఇతర చేతివృత్తుల వారు పట్టణాల నుండి గ్రామాలకు తరలి వెళ్లారు. భూమిపై వత్తిడి పెరిగింది. కాని వ్యవసాయరంగం కూడ ఆంగ్ల పాలకుల విధానంవల్ల సమస్థితిని కోల్పోయింది. ఆంగ్లప్రభుత్వం అధికమైన భూమిశిస్తులను విధించింది. తమకు ప్రయోజనకరంగా వుండే పంటలను పండించమని రైతులను ఇబ్బంది పెట్టింది. మొత్తం మీద ఆంగ్లేయుల పరిపాలనవల్ల భారతీయ వాణిజ్యం, పరిశ్రమలు, ఆర్థిక వ్యవస్థ భగ్నమైనాయి. దారిద్ర్యం పెరిగింది. ఆర్థికరంగంలో మార్పులురావటంవల్ల సాంఘిక సంబంధాలు కూడ మారిపోయినాయి. ప్రాచీన గ్రామీణ సామూహిక జీవితం లుప్తమైనది. వ్యక్తిగతమైన ఆస్తి, ఆర్థికరంగంలోపోటీ, లాభాలమీద ఆధారపడిన నూతన ఆర్థిక సంబంధాలు ఉత్పన్నమైనాయి.

ఆంగ్ల పరిపాలనా ఫలితంగా సాంఘికరంగంలో వచ్చిన మౌలికమైన మార్పు మధ్యతరగతి ఉదయించుట. ఈ నూతన మధ్య తరగతి ఉద్భవానికి రెండు కారణాలు వున్నాయి. బ్రిటిష్‌వారు భారతీయ పాలక వర్గాలను నాశనం చేయటం మొదటి కారణం. వారు ప్రవేశ పెట్టిన పరిపాలనా సంస్కరణలు, భూ సంస్కరణలు రెండో కారణం. నూతన మధ్యతరగతి విదేశీ పాలక వర్గానికి— దేశీయులైన పేదవర్గాలకూ మధ్యగా తలెత్తింది. ఇందులో వ్యాపారస్థులు, భూస్వాములు, ప్రభుత్వోద్యోగులు, ఉపాధ్యాయులు, లాయర్లు, ఇతర

మధ్యతరగతి వారిలో భావ విప్లవం రావటానికి, జాతీయ చైతన్యం, స్వాతంత్ర్యో ద్యమం విజృంభించటానికి బాగా తోడ్పడింది. ఆధునిక భారతీయ సమాజ అవతరణకు కారణమైంది. ఆంగ్లేయుల పరిపాలనా ఫలితంగా బెంగాలులో ప్రభవించిన నూతన మధ్యతరగతికి చెందిన ప్రముఖ నాయకులలో రామమోహన్‌రాయ్ ఒకరు.

4. భావచైతన్యము

నూతన మధ్య తరగతి ఆధునిక యుగ అవతరణకూ, వికాసానికీ తోడ్పడిందని చెప్పితిని. అందుకు వారిలో రేకెత్తిన భావ విప్లవం ముఖ్యకారణం. భావచైతన్యం లేకపోతే విప్లవాత్మకమైన సాంఘిక పరిణామాలు సిద్ధింపవు గదా? నాటి భావ చైతన్యానికి దోహదం చేసిన అంశాలు నాలుగు:— 1. మిషనరీలకృషి. 2. ఆంగ్లవిద్యావిధానం. 3. పత్రికలు. 4. సాంస్కృతిక పరిశోధనలు.

మధ్యతరగతిలో భావవిప్లవం మొలకెత్తటానికి పాశ్చాత్య సంస్కృతి సంపర్కం ప్రధానమైన కారణం. పాశ్చాత్య విజ్ఞానాన్ని సమాదరించినందువనే వారిలో కొత్త ఆలోచనలు పొడసూపినవి. 18—వ శతాబ్దిలో భారత దేశానికి వచ్చిన పాశ్చాత్య విజ్ఞానం మధ్యయుగం నాటి సంప్రదాయ బద్ధమైన భారతీయ విజ్ఞానానికంటె భిన్నమైనది—ఉత్తమమైనదికూడా. ఆధునిక పాశ్చాత్య విజ్ఞానం శాస్త్రీయమైనది. విమర్శనాత్మక మైనది. హేతుపద్ధతి ద్వారా గ్రహింపబడినది. ఇంకా భారతీయ విజ్ఞానం సంప్రదాయ బద్ధమైనది. ఇది రెండు రకాలు. ఒకటి లౌకికమైనది. మరొకటి అలౌకికమైనది. నాటి భారతీయుల దృష్టిలో లౌకిక జ్ఞానం కంటె అలౌకిక జ్ఞానం మిన్నయైనది. అలౌకిక జ్ఞానం ఆత్మ, పరమాత్మలకు సంబంధించినది. దాని లక్ష్యం, మోక్ష సాధన. అలౌకిక జ్ఞానానికి ఆధిక్యత ఇచ్చినందువల్ల భారతీయుల శాస్త్ర పరిశోధనలూ, తాత్త్విక చింతనము తిరోగమించాయి. గణిత, ఖగోళ, రసాయన, వైద్య, శాస్త్రాల్లో వారి కృషి మందగించింది. వారి హేతుశీలము కర్మ సిద్ధాంతానికి బలియైనది. వారి ఐహికదృష్టి, విమర్శనా దృక్పథమూ మాయావాదానికి లొంగిపోయినాయి. పైగా—18వ శతాబ్దపు మొదటి భాగంలో రాజకీయ అస్థిరత, యుద్ధాలవల్ల దేశంలో శాంతిభద్రతలు కూడ మృగ్యమైనాయి. అయితే ఆంగ్లేయుల అధికారం స్థిరపడిన తర్వాత, దేశంలో శాంతి భద్రతలు నెలకొని వైజ్ఞానిక వికాసానికి అనువైన వాతావరణం సమకూరింది.

భావ చైతన్యానికి దోహదం చేసిన వారిలో క్రైస్తవ మిషనరీల కృషి ఉగ్గడింపతగింది. బెంగాలులో కృషిచేసిన క్రైస్తవ మిషనరీలలో విలియంకారీ సుప్రసిద్ధుడు. కారీ మహాశయుడు 1793లో కలకత్తా వచ్చాడు. 1798లో జాన్ మార్ష్‌మన్, విలియం వార్డ్‌లు ఆయనతోపాటుగా సెరాంపూర్‌లో స్థిరపడ్డారు. వారు ముగ్గురూ సలిపిన సంయుక్త కృషి ఫలితంగా బెంగాలులో పునరుజ్జీవనం మొగ్గలు తొడిగింది. కారీమహాశయుడు సంస్కృతం, మరాటీ, బెంగాలీ, హిందీ భాషలు అధ్యయనం చేశాడు. ఆయన న్యూ టెస్టమెంటును బెంగాలీలోనికి అనువదించాడు. 1801 లో వెల్లస్లీ ప్రారంభించిన ఫోర్టు విలియం కాలేజీలో ఆయన బెంగాలీ భాషను బోధించేవాడు. సంస్కృత వ్యాకరణాన్ని నిఘంటువునూ వ్రాశాడు. వాల్మీకి రామాయణాన్ని వెలువరించాడు. ఆధునిక వంగభాషా గద్యరచనకు పునాదులు వేశాడు. వంగభాషా వ్యాకరణాన్ని రచించాడు. ఎనభై వేల శబ్దాలతో ఒక వంగభాషా నిఘంటువును నిర్మించాడు. అనేకపాఠ్య గ్రంథాలను వ్రాశాడు. బాలబాలికల విద్యను ప్రోత్సహించాడు. కారీ మిత్రులు పత్రికలూ, పుస్తకాలు ప్రకటించటానికి తోడ్పడ్డాడు. ఈ విధంగా సెరాంపూర్ మిషనరీలు ప్రారంభించిన భావ వికాసోద్యమాన్ని జాన్‌క్లార్క్, విలియం పీట్సు, ఫెలిక్స్‌కారీ, అలెగ్జాండర్ డఫ్ మొదలయినవారు కొనసాగించారు. వారు ఆంగ్ల భాషనుండి శాస్త్రీయ గ్రంథాలు వంగ భాషలోనికి అనువదించారు. వారి కృషి వలన మధ్యతరగతి యువకుల్లో నూతన భావాలు ఉద్భవించాయి.

నూతన పాశ్చాత్య విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టటం వల్ల కూడా మధ్యతరగతిలో భావచైతన్యం అభివృద్ధి చెందింది. అలెగ్జాండర్ డఫ్ వంటి మిషనరీలు భారతీయులకు, ఆంగ్లభాషతోపాటు శాస్త్ర గ్రంథాలు బోధించటం అవసరమని భావించారు. 1813 చార్టర్ చట్టం ప్రకారం బ్రిటిష్ పార్లమెంటు ప్రతి సంవత్సరం షుమారు ఒక లక్ష రూపాయలు విద్యా వ్యాప్తికి ఖర్చు పెట్టాలని నిర్ణయించింది. కాని మొదట్లో ప్రభుత్వం విద్యారంగాన్ని అలక్ష్యం చేసింది. అయినప్పటికి నూతన మధ్యతరగతి యువకుల విద్యావసరాలను తీర్చటానికై మిషనరీలతోపాటు, ప్రాజ్ఞులైన భారతీయులు కూడ కృషి చేశారు. 1817లో కలకత్తాలో హిందూ కాలేజీ స్థాపనతో వారి ఉద్యమానికి ఒక రూపం లభించింది. ఈ పరిస్థితుల్లో 1823లో ప్రభుత్వం విద్యా విషయాలను పరిశీలించటానికై ఒక కమిటీని నియమించింది. ఆ కమిటీలోని మెజారిటీ సభ్యులు ప్రభుత్వం సంప్రదాయ బద్ధమైన విజ్ఞాన వికాసానికీ సంస్కృత అరబ్బీ భాషల అభివృద్ధికి ధనాన్ని వెచ్చించాలని భావించారు. వారి నిర్ణయాన్ని బిషప్ హీబర్, అలెగ్జాండర్ డఫ్, రాజా రామమోహన్‌రాయ్ వంటి ప్రాజ్ఞులు నిరోధించారు. పాశ్చాత్య శాస్త్రాలకు ప్రాధాన్యం ఇచ్చే నూతన విద్యావిధానాన్ని ప్రవేశపెట్టమని కోరారు. చివరకు మెకాలే సూచన ప్రకారం విలియం బెంటింక్ 1835లో నూతన ఆంగ్ల విద్యా విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ నూతన విద్యావిధానం భారతీయుల భావ చైతన్యానికి బాగా దోహదం చేసింది. ఆ విద్యావిధాన లక్ష్యాలు:—(1). ప్రభుత్వానికి అవసరమైన ఉద్యోగ సిబ్బంది లభించటం. (2) ప్రయోజన కరమైన శాస్త్ర పరిజ్ఞానం భారతీయులకు కల్గించటం, (3) భారతీయుల భావవిప్లవానికి సాయపడటం. ఈ లక్ష్యాలను సాధించడంతో పాటు నూతన విద్యా విధానం మధ్యతరగతి యువకులకు ఆంగ్లభాషాజ్ఞానాన్నికూడా ప్రసాదించింది. ఆంగ్ల భాష వారిలో జాతీయ సమైక్యాన్ని, భావ సమైక్యాన్నీ, ప్రోదిచేసింది. 1850కి పూర్వమే అనేక కళాశాలలు స్థాపించబడటం గమనార్హమైన విషయం. వానిలో బొంబాయిలోని విల్సన్ కాలేజీ (1832), మదరాసులోని క్రిస్టియన్ కాలేజి (1837), ఆగ్రాలోని సెయింట్స్ జాన్స్‌కాలేజి (1853), మచిలీపట్నంలోని నోబెల్ కాలేజీ (1841) ప్రసిద్ధి గాంచినవి. ఈ కళాశాలలు పునర్వికాసానికి కేంద్రాలుగా పనిచేసినాయి. కలకత్తాలో 1817లో స్థాపించబడిన హిందూకాలేజి భావవిప్లవానికి నిలయం లెత్తింది. ఆ కాలేజి ఉపాధ్యాయుల్లో దేరీజియో ప్రముఖుడు. దేరీజియో కవి, విమర్శకుడు. భావ విప్లవ విధాత, ఆయన తన శిష్యుల్లో హేతుశీలాన్నీ సత్యదృష్టిని పెంపొందించాడు. ఆయన అనుయాయుల్లో కొందరు హిందూ క్రైస్తవ మతాలను తీవ్రంగా ఖండించారు. దేరీజియో మత విరోధిగా, అభారతీయుడుగా విమర్శలకు గురియైనాడు. 1831లో హిందూకళాశాలల పాలక వర్గం ఆయనను ఉద్యోగంనుండి తొలగించింది.

కొత్త భావాల వ్యాప్తికి పత్రికలుకూడా దోహదం చేశాయి. ఆంగ్ల విద్యనభ్యసించిన సాంఘిక వర్గాలు తమ అభిప్రాయాలను ప్రకటించటానికి, ప్రజా

లను చైతన్యవంతులుగా చెయ్యటానికి జర్నలిజాన్ని ఆశ్రయించారు. మిషనరీలు బెంగాలీగద్యాన్ని అభివృద్ధి చేశారు. అందువల్ల గంభీరమైన సాంఘిక—శాస్త్ర సంబంధమైన విషయాలు సరళ గద్యంలో వివరించటానికి వీలైనది. 1816లో గంగాధరభట్టాచార్య, హరచంద్రరాయ్‌లు, 'బెంగాల్ గెజిట్' అనే పత్రికను ప్రారంభించారు. సెరాంపూర్ మిషనరీలు కూడా యీ రంగంలో చక్కని కృషి చేశారు. 1818లో వారు 'దిగ్దర్శన్', అనే బెంగాలీ మాసపత్రికను ప్రారంభించారు. ఈ పత్రికలో శాస్త్రీయ, చారిత్రక, సాహిత్య విషయాలు చర్చింపబడినాయి. సమాచార్ దర్పణ్, అనే వారపత్రిక కూడా వారు నడిపారు. ఆ పత్రికలో, హిందూ, క్రైస్తవ మతాలకు సంబంధించిన చర్చలు వుండేవి. 1818 లోనే సెరాంపూర్ మిషన్‌వారు 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా' అనే ఆంగ్లపత్రికను కూడా ప్రారంభించారు. 1821లో భవానీ చరణ్ బందోపాధ్యాయ సంవాద కౌముది అనే బెంగాలీ వారపత్రికను ప్రారంభించాడు. 'కౌముది'లో రామమోహన్ రాయ్ మత సాంఘిక సంస్కరణలను గూర్చి వ్రాసేవాడు. నాటి ఆంగ్ల ప్రభుత్వం పత్రికాస్వాతంత్ర్యంపై నిషేధాలు పెట్టినప్పటికీ, ప్రముఖులు పత్రికలను ప్రకటిస్తూవుండేవారు. బెంగాలులో భావవికాసానికి దోహదం చేసిన యితర పత్రికల్లో 'బెంగాల్ హెరాల్డ్' 'జ్ఞానాన్వేషన్' చెప్పుకోతగ్గవి. పార్శీ భాషలో హిందీలోకూడా పత్రికలు వుండేవి. 1830 నాటికే కలకత్తా పట్టణంలో మూడు బెంగాలీ దినపత్రికలు, ఏడు వారపత్రికలు, ఒక మాసపత్రిక వుండేవి. ఆంగ్లభాషలో పదమూడు పత్రికలు వుండేవి. ఈ పత్రికల్లో ప్రభుత్వ విధానాలు కూడా విమర్శింపబడేవి.

సాంస్కృతిక పరిశోధనల వల్ల ప్రాచీన భారతీయ వైభవం బయల్పడింది. కలకత్తాలో 1784లో స్థాపించబడిన ఆసియాటిక్ సొసైటీ అందుకు దోహదం చేసింది. ఆ సంఘ సంస్థాపకుల్లో విలియం జోన్స్ అగ్రగణ్యుడు. ఆసియాదేశాలకు —ముఖ్యంగా భారతదేశానికి సంబంధించిన—చరిత్ర, సాహిత్యం, పురావస్తువులు, శాస్త్రాలకు సంబంధించిన విషయాలను సేకరించటం పరిశోధనలు కొనసాగించటం యీ సంఘం లక్ష్యం. హెన్రీ థామస్ కోల్‌బ్రూక్, జేమ్స్‌ప్రిన్సెప్, ఆసియాటిక్ సొసైటీ పరిశోధనలకు ఎనలేని సేవ చేశారు. ఛార్లెస్ విల్కిన్స్ ఆంగ్లభాషలోకి అనువదించిన భగవద్గీత 1785లో ప్రకటించబడింది. 1787లో హితోపదేశాన్ని, 1808లో సంస్కృత వ్యాకరణాన్ని కూడా ఆయన ప్రకటించాడు. విలియంజోన్స్ కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని, జయదేవుని గీతగోవిందాన్ని, మనుసంహితను అనువదించాడు. కోల్‌బ్రూక్ హిందూధర్మశాస్త్రాలను అమరకోశాన్ని వెలువరించాడు. విల్సన్ మహాశయుడు మేఘ సందేశాన్ని అనువదించాడు. అష్టాదశ పురాణాలనూ ఆంగ్లభాషలోకి తర్జుమా చేయించాడు. రామమోహన్‌రాయ్ సమకాలికుడైన రాధాకాంతదేవ్ ఉద్దండ పండితుడు. ఆయన శబ్దకల్పద్రుమమ్ అనే సంస్కృత నిఘంటువును నిర్మించాడు. ఈ పరిశోధనలూ, పరిశ్రమా నాటి భావ చైతన్యానికి కొత్త బలాన్ని పుష్టినీ సమకూర్చినాయి.

నాటి మధ్యతరగతిలో మూడు వృక్పధాల వ్యక్తులు ఉండేవారు. మొదటి వర్గం వారిని కన్సర్వేటివ్స్ అనేవారు. వారు యథాతథ వాదులు. సంఘంలో, మతంలో, మార్పులనూ, సంస్కరణలనూ వారు ఆమోదించలేదు. పాశ్చాత్య నాగరికతను వారు ఏవగించుకొనేవారు. భారతీయ నాగరికతకు ప్రత్యేక విశిష్టత వుందని, దానిని సంరక్షించటమే ముఖ్యమని వారి భావన. బెంగాలులో రాధాకాంతదేవ్ యీ వర్గానికి నాయకుడు. రెండో వర్గాన్ని రాడికల్స్ అంటారు. వారు విప్లవ వాదులు. సాంఘిక వ్యవస్థనూ, మతాన్నీ, వారు విమర్శించారు. ఖండించారు. వారి నాయకుడు డిరోజియో. కలకత్తా హిందూ కాలేజీకి చెందిన యువకులు యీవర్గంలో వుండేవారు. ఇక మూడోవర్గం వారిని లిబరల్స్ అంటారు. వారు సంస్కరణ వాదులు. సమన్వయ వాదులు. హేతుశీలం, శాస్త్రీయజ్ఞానం, ద్వారా సాంఘిక వికాసాన్ని సాధించటం వారి లక్ష్యం. పాశ్చాత్య నాగరికతలోని మేలైన విషయాలను స్వీకరించటానికి వారు వెనుకాడరు. ఈ మధ్యతరగతి లిబరల్స్‌లో రాజారామమోహన్ రాయ్ అగ్రగణ్యుడు.

19—వ శతాబ్దపు పూర్వార్ధంలో పాశ్చాత్య దేశాల్లోకూడా మధ్యతరగతి బలంగావుంది. బెంథామ్, టామ్‌పైన్, రూసో, వాల్టేర్‌లు నాటి మధ్యతరగతి సిద్ధాంతకర్తలు. 1789లో, 1830లో ఫ్రాంసులో మధ్యతరగతి విప్లవాలు జరిగాయి. నిరంకుశ రాజరికం స్థానంలో మధ్యతరగతి ప్రజాస్వామ్యం (బూర్జువా డెమోక్రసీ.) నెలకొంటున్నది. మానవ హక్కులసిద్ధాంతం ఆవిష్కరించబడింది. నిరంకుశప్రభుత్వాలను ప్రతిఘటించే హక్కు ప్రజలకు వున్నదని నిరూపించబడింది. భారతీయ మధ్య తరగతిలోని అభ్యుదయవాదులు యీ సిద్ధాంతాల ప్రాధాన్యాన్ని గుర్తించినట్లుగా కనపడుతుంది.

5. రామమోహన్‌రాయ్ కృషి

వంగ రాష్ట్రంలో హుగ్లీజిల్లా రాధానగర్ గ్రామంలో 1772లో రామమోహన్ రాయ్ సంపన్న బ్రాహ్మణ కుటుంబంలో జన్మించినాడు. తండ్రి రమాకాంతరాయ్. తల్లి తారిణిదేవి. ఫ్రెంచి విప్లవం నాటికి రామమోహనుని వయస్సు 18 సంవత్సరాలు. బాల్యంలో ఇంట్లోనే విద్యాభ్యాసం చేశాడు. తర్వాత పాట్నాలో పార్శీ, అరబ్బీ భాషలు చదివాడు. సూఫీతత్వాన్ని అవగాహనచేసుకొన్నాడు. కాశీలో హిందూమత గ్రంథాలను అధ్యయనం చేశాడు. 15 సంవత్సరాల వయస్సులో మూడు నాలుగు, ఏండ్లు దేశాటనం చేసినట్లు ఒక ఐతిహ్యంవున్నది. టిబెట్‌ను సందర్శించినాడనీ, అచట ఆయన బౌద్ధాన్ని అధ్యయనం చేశాడని చెప్తారు. 1803లో రామమోహనుని తండ్రి రమాకాంతరాయ్ మరణించాడు. అందువల్ల రామమోహనుడు ఈస్టు ఇండియా కంపెనీలో ఉద్యోగాన్ని చేయటం ప్రారంభించాడు. 1805 నుండి డిగ్బీ దొరదగ్గర దివాన్‌గా పనిచేశాడు. ఆ సందర్భంలో ఆయన ఆంగ్లభాషను నేర్చుకొన్నాడు. పాశ్చాత్య సంస్కృతిని అర్థం చేసుకొన్నాడు. గ్రీక్, లాటిన్, హీబ్రూ భాషలనుకూడా నేర్చుకొన్నాడు. 1814లో కంపెనీ ఉద్యోగాన్ని విరమించాడు. 1815నుండి 1830వరకూ కలకత్తాలో నివాసం ఏర్పాటు చేసుకొన్నాడు. కలకత్తాలో వుండగా, విద్యా, సాంఘిక, సంస్కృతి రంగాల్లో, అద్భుతమైన కృషి చేశాడు. హేతువాదాన్ని, మానవతాతత్వాన్ని ప్రబోధించాడు. భారతీయపునరుజ్జీవనానికి చేయూతనిచ్చాడు. 1830లో ఇంగ్లండ్ వెళ్ళాడు. ఇంగ్లండులో బెంథామ్, రాబర్ట్ ఓవెన్ వంటి ప్రముఖులతో చర్చలు కొనసాగించాడు. ఫ్రాంసునుకూడా సందర్శించాడు. 1833లో అనారోగ్యం వల్ల బ్రిస్టల్‌లో మరణించాడు. ఆయన స్మారక చిహ్నంగా వుంచిన శిలాఫలకముపై యీలా వ్రాసివుంది:—

"Beneath this stone
Rest the remains of Raja Ram Mohan Ray
Bahadoor,
A conscientious and steadfast believer in the unity
of the Godhead
He conscerated his life with entire devotion
To the worship of the Divine Spirit alone."

రామమోహనుని కేవలం ఒక దైవ చింతకునిగా, ఆస్తికునిగా వర్ణించిన యీ శిలాఫలకం ఆయనకు అపచారం చేసింది. ఎందుకంటే ఆయన మతసంస్కర్త, సంఘ సంస్కర్త, విద్యావేత్త, బహుభాషా కోవిదుడు. నవభారత నిర్మాతల్లో ప్రథముడు.

రామమోహన్‌రాయ్ వ్యక్తిత్వం, సిద్ధాంతాలు తెలుసుకోటానికి ఆయన రచనలేగాక, ఇతర పండితుల రచనలుకూడా ఆధారాలుగా ఉపయోగిస్తాయి. రామమోహనుని రచనలు వంగభాషలో, ఆంగ్ల భాషలో వున్నాయి. ఆయన వ్యక్తిత్వాన్ని, విశిష్టతనూ, వివరిస్తూ రవీంద్రనాథ్ టాగూర్, బ్రజేంద్ర నాథ్ సీల్, సుశోభన్‌సర్కార్, శంకర్ ఘోష్ మహాశయులు వ్రాసిన పుస్తకాలు, వ్యాసాలు పరమప్రామాణికాలు.

రామమోహన్‌రాయ్ కృషిని అంచనా వేసే ముందు, ఆయన తాత్విక దృష్టిని అవగాహన చేసుకోవటం అవసరం. రామమోహనుడు ఆస్తికుడు. దైవ విశ్వాసం కలవాడు. ఈ భౌతిక ప్రపంచాన్ని ఆయన మిథ్యగా భావించలేదు. ఆయనకు యీజగత్తు యదార్థము. జగత్తును అర్థం చేసుకొని వ్యక్తిగత, సాంఘిక, జీవనాన్ని సుఖమయం చేసుకోగల్గిన శక్తియుక్తులు మనిషికి వున్నాయని ఆయన నమ్మకం. వానిలో హేతుశక్తి అతిముఖ్యమైనది. హేతుశీలం ద్వారా మనిషి జ్ఞానాన్ని సంపాదించుకుంటాడు. ఏది ధర్మమో, ఏది అధర్మమో గ్రహిస్తాడు. తన భవిష్యత్తును తానే నిర్మించుకొంటాడని రామమోహన్‌రాయ్ భావించాడు.

రామమోహనుడు తత్వవేత్త గాదు. అయినప్పటికీ ఆయన రచనలను, కార్యక్రమాలనుబట్టి ఆయన మూలసిద్ధాంతాలను గ్రహించవచ్చు. మానవులకున్న సహజసిద్ధమైన హక్కులు(**Natural rights**)ఆయన తాత్వికదృష్టిలోని ప్రధానాంశం. ఆ హక్కులలో జీవించటానికీ, స్వేచ్ఛను అనుభవించటానికీ, అవసరమైన హక్కులను ఆయన ప్రాణప్రదంగా భావించాడు. హక్కులు వ్యక్తివికాసానికేగాక, లోక సంగ్రహానికి కూడ అవసరమని ఆయన నిర్ణయం. మానవుల హక్కులను గుర్తించే రాజ్యాంగబద్ధమైన ప్రభుత్వం కావలయునని ఆయన ఉద్బోధించాడు. చట్టబద్ధమైన పరిపాలన, భావ ప్రకటనా స్వేచ్ఛ, మత పూజా స్వాతంత్ర్యం, ఆస్తిహక్కులు వున్న రాజకీయ వ్యవస్థ ఆయన దృష్టిలో అభిలషణీయము.

"In this constitutional government, the rule of law ought to be supreme, and civil liberties and individual rights guaranteed. Among them must be included the right of life and liberty, freedom of expression of opinions, and of religious worship. Along with them, he recognised the absolute ownership of property by the individual." ("Freedom Movement" by Tara Chand)

వ్యక్తుల హక్కులకు ప్రాధాన్యం యిచ్చినప్పటికీ ఆయన సాంఘికసంక్షేమాన్ని విస్మరించలేదు. సాంఘిక సంక్షేమం కొరకు ప్రభుత్వం ఆ శాసనాలు, సంస్కరణలు చేయాలని, ఆయన ఉద్దేశ్యం. అందువల్లనే విద్యా రంగంలో, సతీసహగమన నిషేధంలో ప్రభుత్వ విధానాలను ఆయన హర్షించాడు.

రామమోహనుని తాత్వికదృష్టిలో స్వాతంత్ర్యేచ్ఛ రెండో అంశం. స్వాతంత్ర్యం, వ్యక్తికేగాక జాతికి కూడా అవసరమని ఆయన అభిప్రాయము. ఆయన కోరుకున్న స్వాతంత్ర్యం పరిమితమైనదిగాదు. అది సాంఘిక, రాజకీయ, సాంస్కృతిక రంగాలకు విస్తరించినట్టిది. వివిధ రంగాల్లో మానవస్వేచ్ఛకు అవరోధంగావున్న భావాలను సంప్రదాయాలను తొలగించుకొని, నూతన పరిస్థితులకు అనుగుణంగా స్వేచ్ఛాపథంలో మానవుడు పురోగమించాలని ఆయన విశ్వాసం. అందుకు జ్ఞానం ముఖ్య సాధనమని ఆయన గుర్తించాడు. ఈ జ్ఞానం కేవలం ఆధ్యాత్మికమైనదేగాదు, భౌతికమైనదిగూడ. భౌతిక శాస్త్రాల పరిజ్ఞానం, టెక్నాలజీల అవశ్యకతను ఆయన గ్రహించాడు. ఈ రంగంలో భారతదేశం వెనుకబడిందని ఆయనకు తెలుసు. ఆ లోటును పూర్తి చేయటానికి పాశ్చాత్యుల శాస్త్రాలు, జ్ఞానం— ఆంగ్లభాషద్వారా—భారతీయులకు అవసరమని ప్రచారం చేశాడు. ఆధునిక భారతదేశాభ్యుదయానికి సైన్సు—టెక్నాలజీ అవసరాన్ని గుర్తించిన ప్రగతిశీలుడు ఆయన.

పైన పేర్కొన్న తాత్విక దృష్టిని కేంద్రంగా తీసుకొంటే, వివిధరంగాల్లో రామమోహనుని కృషిని సరిగా అంచనా వేయగలం.

మతరంగం:—18—వ శతాబ్దం నాటికి హిందూమతం అంధ విశ్వాసాలతో, మూఢాచారాలతో నిండివుంది. వేదాలు, ఉపనిషత్తులు, దర్శనాలు అధ్యయనంచేసి నిజమైన మతతత్వాన్ని అర్థం చేసుకున్నవాళ్ళు తక్కువగా వున్నారు. పౌరాణికమైన నమ్మకాలతో, ఆచారాలతో సంఘం క్షుభితమై వున్నది. బహుదేవతా పూజ, విగ్రహారాధన, తాంత్రికాచారాలతో మతం కలుషితమైంది. సర్పాలూ, జంతువులు, శిలలూ పూజింపబడుతున్నాయి. శక్తి పూజలతో, తీర్థయాత్రలతో, చిల్లర దేవుళ్ళ ఆరాధనతో హిందూమతంలోని ఆధ్యాత్మికతత్వం మరుగున పడినది. క్రైస్తవ మిషనరీలు భ్రష్టమైన యీ హిందూమతాన్ని ఖండించి, హిందువులను అవహేళన చేస్తున్నారు.

హిందూమతం పేరుతో జరుగుతున్న అనాచారాలను ఖండించి, అచ్చమైన హిందూమతమూలతత్వాన్ని నిరూపించటం రామమోహనుని సంకల్పం. బలులను, పూజలను, వామాచారాలను, ఆయన నిరసించాడు. విగ్రహారాధన వ్యక్తికీ, సంఘానికిగూడా అనర్థదాయకమని, ఆయన నిర్ణయం. అనాలోచితమైన విగ్రహారాధన, మనుష్యుల హేతుశక్తినీ, నైతిక శక్తినీ నిర్మూలిస్తుందనీ, భావదాస్యాన్ని పెంచి జాతి సుఖశాంతులను హరిస్తుందనీ ఆయన వాదించాడు. హిందూమతమూలతత్వం ఏకేశ్వరవాదమని రామమోహనుని తీర్పు. 1815లో ఆయన కలకత్తాలో ఆత్మీయసభను స్థాపించాడు. ఆత్మీయసభ సమావేశాల్లో మత సాంఘిక విషయాలు చర్చింపబడినాయి. 1815—1817 మధ్య హిందూమతగ్రంథాలను—అనగా— వేదాంత సూత్రాలను, ఈశ, కేన, కఠ, మాండూక్య, ముండక, ఉపనిషత్తులను బెంగాలీ భాషలోకి అనువదించాడు. హేతుతత్వం ఆస్తికభావానికి వైరికాదని, ఆయన నమ్మకం. మతగ్రంథాలు మానవ నిర్మితాలే. అందువల్ల వానిలో లోపాలు వుండక తప్పదు. సంప్రదాయం సాంఘిక వికాసాన్ని, నాశనంచేసి అవినీతిని పెంచితే దాన్ని త్రోసిరాజనే హక్కు మానవునికున్నదని ఆయన నొక్కి చెప్పాడు.

రామమోహన్‌రాయ్ క్రైస్తవ మతాన్నిగూడా అధ్యయనంచేసి, నిశితంగా పరిశీలించాడు. 'జీసస్ బోధలు' అనే గ్రంథాన్ని వ్రాశాడు. క్రైస్తవమతంలోని నైతికబోధలకు ఆయన జోహారులర్పించాడు. ఆ మతంలోని ఆచారాలనూ, అద్భుతాలనూ, త్రైతాన్ని, **Trinity** ఆయనవిమర్శించాడు. 1820-23 మధ్య ఆయన క్రైస్తవమిషనరీల నుద్దేశించి మూడు కరపత్రాలు ప్రకటించాడు. ఏసు క్రీస్తు బోధించిన ప్రేమ తత్వానికంటె ఇతర విషయాలకు అనవసరంగా ఎక్కువ ప్రాధాన్య మిస్తున్నారని ఆయన విమర్శ. ఇస్లాం మతస్థుల విమూఢత్వాన్ని కూడా ఆయన విమర్శించాడు.

సర్వమతసమాదరణం రామమోహనుని విశిష్టత. అన్నిమతాల్లోనూ ఏకేశ్వరతత్వం సమానమైన లక్షణమనీ, సర్వమతస్థులూ ఒకే మానవకుటుంబానికి చెందినవారని ఆయన తలంపు. (See : 'Gift to Monotheists' "Humble Suggestions" and "Different Modes of worship" by Ram Mohan Roy.) మత—నైతిక విషయాల్లో రామమోహనుడు విశ్వమానవ దృక్పథాన్నిఅనుసరించాడు. అన్నిమతాలు ఒకే సత్యాన్ని బోధిస్తున్నవని ఆయన భావన. ఆధునికయుగంలో హిందూ, క్రైస్తవ ఇస్లాం మతాలను తులనాత్మకంగా పరిశీలించిన పండితుల్లో ప్రథముడు ఆయన. "In fact on religious and moral issues, his sympathies were cosmopolitan and his outlook universal. He believed in the truth of all great religions."

తాను హిందూమతస్థుడైనప్పటికీ, రామమోహన్‌రాయ్ హిందూమతం పరిధిలోనే తన మనస్సును బంధించలేదు. సర్వమతాలను గౌరవించినవాడే నిజమైన భారతీయుడని ఆయన బోధించాడు. ఆయనది మతదృష్టి కాదు— లౌకికదృష్టి. విశ్వమానవదృష్టి. 1828 లో ఆయన "బ్రహ్మ సమాజాన్ని" స్థాపించాడు. బ్రహ్మసమాజం మతరంగంలో రామమోహనుని సృష్టి. బ్రహ్మసమాజం నాటి మధ్యతరగతివిద్యావంతులను ఆకర్షించి, బెంగాలులో, ఆంధ్రలో, యితర రాష్ట్రాల్లో పునరుజ్జీవనవికాసానికి తోడ్పడింది.

సాంఘిక సంస్కరణలు : "హైందవ సమాజం కులతత్వం, బహుభార్యాత్వం, కులీనత్వం, సతీసహగమనం, బాలబాలికలవధ మొదలయిన దురాచారాలతో మొదలంట నెడివున్నది. నైతిక ప్రవర్తన అడుగంటినది. వ్యసనపరులై, సోమరిగావుంటూ, సాంఘికసంఘర్షణలతో, పార్టీ కక్షలతో ప్రజలు కాలాన్ని వ్యర్థం చేస్తున్నారు. అజ్ఞానం, అంధవిశ్వాసాలు దేశంలో స్వైరవిహారం చేస్తున్నాయి. దేశం అంధకారంలో నిండివున్నది."— ఇవి రామమోహన్‌రాయ్ అభిప్రాయాలు. నాటి సంఘంలో స్త్రీల పరిస్థితి శోచనీయం. వారికి ఆస్తిహక్కులేదు. విధవాపునర్వివాహం నిషేధము. బహుభార్యాత్వం వారి దైన్యాన్ని పెంచింది. సతీసహగమనం నిర్బంధమైంది.

రామమోహన్‌రాయ్ సతీసహగమనాన్ని తొలగించటానికై విశ్వప్రయత్నం చేసి కృతకృత్యుడైనాడు. 1815—1828 మధ్య షుమారు 8000 నిర్బంధ సతీసహగమనాలు జరిగాయి. సతీసహగమనం అహేతుకమనీ, మానవత్వానికి విరుద్ధమనీ, ప్రాచీనమతగ్రంథాలు సహగమనాన్ని ప్రతిపాదించలేదనీ రామమోహనుని వాదన. 1818—1829 మధ్య సహగమనాన్ని విమర్శిస్తూ మూడు గ్రంథాలను వ్రాశాడు. 1829 లో బ్రిటిషుప్రభుత్వం సహగమనాన్ని నిషేధించినప్పుడు ప్రభుత్వచర్యకు అనుకూలంగా ఆయన ప్రజాభిప్రాయాన్ని సంఘటితపరిచాడు. బహుభార్యాత్వాన్ని వ్యతిరేకించాడు. స్త్రీలకు ఆస్తిహక్కువుండాలని ప్రచారం చేశాడు. స్త్రీ విద్యను ప్రోత్సహించాడు. (See his: "Ancient Rights of the Females" (1822) and "Rights of Hindus over Ancestral Property" (1830).

కులవ్యవస్థ హిందూసమాజంలో విభేదాలను సృష్టించి, వారిలో ఐకమత్యం, దేశభక్తి లేకుండా చేశాయనీ, కులతత్వం నశిస్తేగాని స్వేచ్ఛ సమానత్వాలు ప్రాతిదికలుగావున్న ప్రజాస్వామిక సమాజం అభివృద్ధిచెందదని ఆయన తీర్పు. కులతత్వాన్ని విరసిస్తూ ఆయన వ్రాసిన మాటలు ఇప్పటికీ గుర్తుంచుకోదగినవి:—

The distinction of caste, introducing innumerable divisions and subdivisions among them (Hindus) has entirely deprived them of patriotic feeling..... we have been subjected to such insults for about nine centuries, and the cause of degradation has been... our division into castes which has been the source of want of unity among us."

కులతత్వ నిర్మూలనకు "మహానిర్వాణతంత్రమ్"లో చెప్పబడినవిధంగా వర్ణాంతర వివాహాలు అవసరమని ఆయన భావించాడు. ("వయోవర్ణ విచారో అత్ర న విద్యతే" అని మహానిర్వాణతంత్రంలో చెప్పబడింది. (కులవ్యవస్థను తీవ్రంగా ఖండిస్తున్న "వజ్రసూచి" అనే పుస్తకాన్ని ఆయన 1827-లో అనువదించాడు.

విద్యా సంస్కరణలు : మత సాంఘిక సంస్కరణలు విజయవంతం కావాలన్నా, దేశం అభ్యుదయం సాధించాలన్నా భావవిప్లవం, నూతన విజ్ఞానం అవసరమని రామమోహనుడు గుర్తించాడు. అందుకు తగిన ఉపకరణాల్లో విద్యావిధానం ముఖ్యమైనదని ఆయన గ్రహించాడు. కనుక ఆయన నూతన విద్యావిధానం కొరకు అవిరళంగా కృషి చేశాడు. అప్పటికి అనుసరింపబడుతున్న విద్యావిధానంలో సంస్కృతం, అరబ్బీ; పారశీక భాషల బోధనం, వ్యాకరణాది ప్రాచీన శాస్త్రాల అధ్యయనం ప్రముఖంగా వుండేవి. ఆ విద్యావిధానం మానసిక, సాంఘిక వికాసాలకు తోడ్పడదని ఆయన విమర్శ.

1817 లో కలకత్తాలో హిందూకళాశాల స్థాపనకు ఆయన సహాయం చేశాడు. కాని సనాతన సంపన్న హిందువులు అభ్యంతరం చెప్పినందున కాలేజీ కమిటీలో సభ్యుడుగా వుండకుండా దూరంగా వున్నాడు. స్వయంగా కొన్నాళ్ళ 'ఆంగ్లో— హిందూ' స్కూలును నడిపాడు. 1825 లో వేదాంత కళాశాలను స్థాపించాడు. ఈ కళాశాలల్లో పాశ్చాత్యశాస్త్రాలు, వేదాంత విషయాలూ బోధింపబడినాయి. మతరంగంలో క్రైస్తవ మిషనరీలతో విభేదించినప్పటికీ, విద్యారంగంలో వారి కృషికి దోహదం చేశాడు. ముఖ్యంగా అలెగ్జాండర్ డఫ్ విద్యాకృషికి రామమోహనుని సహకారం లభించింది. 1823 లో రామమోహన్‌రాయ్ భారతదేశానికి అవసరమైన విద్యావిధానాన్ని సూచిస్తూ అమ్‌హరెస్ట్ ప్రభువుకు లేఖ వ్రాశాడు. అయితే ఆయన సూచనలను 1835 నాటికిగాని మెకాలే, బెంటింక్‌లు అంగీకరింపలేదు. సంప్రదాయబద్ధమైన వ్యాకరణ, వేదాంతాది విషయాలుగాక, ప్రయోజనకరమైన పాశ్చాత్య శాస్త్రాలు— గణితశాస్త్రం, రసాయనశాస్త్రం, శరీర నిర్మాణశాస్త్రం— బోధించవలసినదని ప్రభుత్వాన్ని ఆయన కోరినాడు. సంస్కృత, పారశీక, అరబీ భాషల అధ్యయనం కంటె ఆంగ్ల భాషాధ్యయనం జాతికి మేలని ఆయన భావించాడు. భారతదేశం ఆధునికత్వాన్ని అభ్యుదయాన్నీ అందుకోవాలంటే శాస్త్ర— సాంకేతిక పరిజ్ఞానం తప్పక అవసరమని గుర్తించటంలో రామమోహనుని ప్రగతిశీలం ఇమిడివుంది. నూతన విద్యావిధానాన్ని రూపొందించటంలో తోడ్పడి ఆయన ఆధునిక యుగవైతాళికుడైనాడు.

రాజకీయ ఆర్థికవిషయాలు : మత సాంఘిక సంస్కరణలలో నిమగ్నుడైన రామమోహన్‌రాయ్ రాజకీయ విషయాలను విస్మరింపలేదు. నూతన జీవిత లక్ష్యాలతో ఉత్తేజితుడైన ఆయన మధ్యయుగ ఫ్యూడల్ సంప్రదాయాలను ఛేదించటానికి పూనుకొన్నాడు. ఆంగ్లపాలనావిముక్తికై మధ్యతరగతి ప్రజాఉద్యమాలను నడుపుతుందని ఆయన వూహించాడు. ఆంగ్ల ప్రభుత్వ నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా చట్టబద్ధమైన ఆందోళనలు నడిపాడు. 1823 లో ప్రభుత్వం పత్రికా స్వాతంత్ర్యాన్ని నిరోధిస్తూ శాసనం చేసింది. భావప్రకటనా స్వేచ్ఛను సమర్థిస్తూ ఆయన సుప్రీంకోర్టుకు, ఇంగ్లండు

ప్రభువుకు వినతి పత్రాలు సమర్పించాడు. 1827 లో న్యాయ వ్యవస్థలో మతవిచక్షణను ప్రవేశపెట్టిన జ్యూరీ శాసనమును వ్యతిరేకించాడు. ఇంగ్లండులో వున్నప్పుడు పార్లమెంటుకు ఒక నివేదికను సమర్పించాడు. అందులో కంపెనీ పరిపాలనలోని లోపాలను వివరించాడు. నివారణ మార్గాలను సూచించాడు. వినతిపత్రాలు, నివేదికలతో కూడిన చట్టబద్ధమైన ఆందోళనకు రామమోహన్‌రాయ్ శ్రీకారం చుట్టినాడని కొందరి అభిప్రాయం.

"Ram Mohan Roy was the pioneer of the constitutional method of agitation, which India's political leaders continued to emplov for nearly a century."—
—Tara Chand.

నాటి న్యాయవ్యవస్థలోని లోపాలను సవరించటానికి జ్యూరీ విధానాన్ని ప్రవేశ పెట్టమని, కార్య నిర్వాహక— న్యాయశాఖలను వేరు చేయవలసిందనీ సలహా యిచ్చాడు. జాతిసమైక్యతకోరకు హిందువులు— మహమ్మదీయుల మధ్య సుహృద్భావ సంబంధాలు పెంపొందవలసిన ఆవశ్యకతను గుర్తించాడు.

భూస్వాముల దౌర్జన్య విధానాలను ఆయన నిరసించాడు. కర్షకులస్థితి బాగుపడటానికై వారికి గూడ శాశ్వతశిస్తు విధానం వుండటం అవసరమన్నాడు. ఆంగ్లేయ పెట్టుబడిదారులు మనదేశంలో పరిశ్రమలు స్థాపించినట్లయితే, వారు మన దేశంలో దోచుకొన్న సంపద కొంత తిరిగి వస్తుందని ఆయన అభిప్రాయము.

అంతర్జాతీయతత్వం రామమోహనుని భావప్రపంచంలోని మరియొక మణిపూస. గ్రీకు ప్రజల స్వాతంత్ర్య పోరాటాన్ని గురించి, ఐర్లండువాసుల ఇబ్బందులను గురించి ఆయన వ్రాసినాడు. 1821 లో నేపుల్స్‌విప్లవం విఫలమైనందుకు ఆయన విచారాన్ని వెలిబుచ్చాడు. 1823 లో స్పానిష్‌అమెరికాలో విప్లవాన్ని, 1830 లో జరిగిన ఫ్రెంచివిప్లవాన్ని ఆయన అభినందించాడు. స్వాతంత్ర్యంకోసం జరుగుతున్న ప్రజాపోరాటాలను గుర్తించి, హర్షించిన స్వేచ్ఛావాది ఆయన. "ప్రపంచములోని జాతులన్నీ ఒకే కుటుంబానికి చెందినవారనీ విభేదాలను పరిష్కరించుకోటానికి అంతర్జాతీయ కాంగ్రెసు" అవసరమనీ ఆయన ఫ్రెంచి విదేశాంగమంత్రికి వ్రాసిన లేఖలో సూచించాడు.

వంగభాషా సేవ : ఆధునిక వంగభాషావతరణకుగూడ రామమోహన్‌రాయ్ దోహదం చేశాడు. ఆయన నడిపిన పత్రికలు, వ్రాసిన రచనలు వంగ భాషా ఔన్నత్యానికీ, సరళగద్యరచనారీతులకు అలంకారాలుగా నిలిచినాయి. 1826 లో ఆయన "బెంగాలీ వ్యాకరణాన్ని" ప్రకటించాడు. "సంవాద కౌముది" లో ఆయన వ్రాసిన వ్యాసాలు భావవిప్లవానికేగాక భాషావిప్లవానికి గూడ తార్కాణాలు.

ముగింపు "భారతీయ నాగరకతలోని బలహీనతలు తొలగించటానికీ, ప్రాచ్య పాశ్చాత్య నాగరకతల సమ్మేళనాన్ని సాధించటానికీ రామమోహన్‌రాయ్ కృషిచేశాడు. ఆధునిక యుగ ప్రథమ మనీషిగా భారతదేశ చరిత్రలో ఆయన స్థానం శాశ్వతమైనది. ప్రఖ్యాత చరిత్రవేత్త సుశోభన్ సర్కార్ మాటలతో ఈ వ్యాసాన్ని ముగిస్తాను:—

"The central characteristics in the life and thought of Ram Mohan Roy were his keen consciousness of the stagnant, degraded and corrupt state into which our society had fallen, his deep love of the people which sought their all-round regeneration, his critical appreciation of the value of modern western culture and the ancient wisdom of the East alike, and his untiring many-sided efforts in fighting for improving the conditions around him. No contemporary ever approached him in the quantity and the quality of achivement or the range of activity."

"తద్విజిజ్ఞాసిస్వ"



కొన్ని ముఖ్యఆంగ్లగ్రంథాలు

1. The English works of Ram Mohan Roy.
2. "Renascent India" by K. K. Datta.
3. "Bengal Renaissance" by Susobhan Sarkar.
4. "Renaissance to Militant Nationalism" by Sankar Ghosh.
5. "The Awakening of Bengal" by N. Sadhan Bose.
6. "Modern Indian Political Thought" by Verma.
7. Indian Culture" (4 Vols) by Ramakrishna Mission.
8. "Indian Middle Class" by Misra.
9. "History of Freedom Movement" by Tara Chand
10. "India in Transition" by M. N. Roy.

కథానిక:

లెస్ లగేజ్, మోర్ కంఫర్ట్

శ్రీ మధురాంతకం రాజారాం

"డియర్ శేఖరం!

అయిదు సంవత్సరాల తర్వాత జాబు రాస్తున్నందుకు ఆశ్చర్యపడొద్దు. ఇంతకాలం రాయకపోవడానికీ, ఇప్పుడు రాస్తున్నందుకు గూడా బలీయమైన కారణాలు వున్నాయి. అవన్నీ నేరులో చెబుతాను. నీతో అత్యవసరంగా మాట్లాడవలసిన పని ఏర్పడింది. ఈ జాబు చేరగానే బయల్దేరి రావలసింది. నేనిలా జాబు రాశానని ఎవరితోనూ చెప్పొద్దు. అన్ని వివరాలూ నేరులో. నీ కోసం వేచి వున్నాను.

మురళి"

వాడిపేరుతో ఇంకొకడెవడైనా వ్రాసివుంటాడనుకోడానికి వీల్లేదు. మురళి దస్తూరి నాకు బాగా గుర్తే!

అయిదు సంవత్సరాలకు మునుపు అయిపులేకుండా పోయినవాడు మురళి. కనిపించలేదు అని ప్రకటన ఇవ్వడానికి వాడు చిన్నవాడేమీకాదు. అప్పటికే పట్టధారి. రాజ్యభారం స్వీకరించడానికి ముందు మళ్ళీ అవకాశం దొరకదన్న వుద్దేశంతో ఎవరితోనూ చెప్పకుండా దేశాటనకు వెళ్ళిపోయిన రాకుమారుడిలా అతడు మటుమాయమైపోయాడు. మళ్ళీ ఇంతకాలానికి జాబు!

* * * *

నేనూ, మా మురళి చిన్నప్పుడు మా వూరి ఏటి ప్రక్కన, కొబ్బరిచెట్ల నీడలో ఎన్నెన్నో పిచ్చుకగూళ్ళు కట్టుకున్నాం. పిచ్చుక గూళ్ళేకదా అని తేలికచేసి పారెయ్యడం అన్యాయం. తాజ్‌మహలు నిర్మాణం కోసం షాజహాను తీసుకున్న శ్రద్ధాసక్తులను గురించి ఘనంగా చెప్పుకుంటారు. మా పిచ్చుకగూళ్ళ నిర్మాణంలో మా శ్రద్ధాసక్తులంతకు తక్కువైనవేమీకాదు. తలదాచుకోడానికి గూడు లేక నిరాశ్రయంగా పడివుండే గువ్వలు చీకటిపడగానే వచ్చి ఆ గూళ్ళల్లో హాయిగా విశ్రమిస్తాయని మేమనుకునేవాళ్ళం. చిన్నతనంలోనే అంతలావు ఉపకారచింతన కలిగి వుండడం మాకెంతో గర్వకారణంగా వుండేది. గడ్డాలూ మీసాలూ వచ్చి, తలలు గూడా పండి, పెద్దరికాల కన్నింటికీ తామే దిక్కయినట్టుగా తిరిగే మా వూరి పెద్దమనుషుల్ని చూస్తుంటే మాకొకవైపున ఒళ్ళు మండుకపోతుండేది. వెనకటి కెప్పుడో ఎవడో ఒక పుణ్యాత్ముడు వూరినడుమ కట్టించిపోయిన ధర్మసత్రం పైకప్పు కూలిపోయి, గోడలు నెర్రెలుపడి, ద్వారబంధాలు వ్రాలిపోయి, అంతా ఒక శిథిల గృహం సెట్టింగులా తయారైపోతుంటే వీళ్ళేం కట్టించుకున్నారు? వీళ్ళెలాగూ కొత్తగా గుళ్ళు కట్టించలేరు. ఉన్న గుడిలో పూజా పునస్కారాలూ లేక, దీపంపెట్టే దిక్కయినా లేక ఖిన్నుడై కూర్చున్న ఆ దేవుడిసంగతి వీళ్ళకేం కావాల్సింది? పోనీ, బడిసంగతే చూద్దాం. గవర్నమెంటు వారి కళ్ళు తుడవడం కోసం ఇక్కడొక బడికట్టడం వున్నమాట నిజం! ఇంతే సంగతులు. బడికి కావలసిన హంగులకు సంబంధించి అది అయ్యవారి నట్టిల్లు. కుర్రవాళ్ళు కూర్చునే కొయ్య పలకల్ని దొంగలెత్తుకపోయారు. పాఠాలు బోధించడానికి ఉపకరించే మ్యాపుల్నీ, చార్టుల్నీ చెదలు తినిపోయాయి. అసలు ఆ బడి కట్టడం నెలకొల్పిన వాళ్ళకు కాలక్రమంలో చదువుకునే కుర్రవాళ్ళ సంఖ్య పెరగవచ్చునన్న వూహవుండి వుండదు. బడిముందర పెద్దరావిచెట్టు ఒకటి వుండబట్టి, దాని నీడక్రింద మూడు తరగతులు ధారాళంగా కూచోడానికి వీలుండడం పిల్లల అదృష్టం. లేకుంటే అన్నం పున్నం ఎరుగని కుర్రకుంకల నందరినీ ఒక మందలా ఆ పూరికొంపలోకి తోలిపెట్టి, చరిత్రలో 'కలకత్తా చీకటిగది' లాంటి ఉదంతం ఇంకొకటి సృష్టింపవలసి వచ్చేది. అబ్బబ్బ, లాభంలేదని కస్సుబుస్సులాడే వాడు మా మురళి. మనుషుల్లో స్వార్థం బలిసింది. తాము ఈ ప్రపంచం కోసమేనన్న భావన నశించింది. ఈ ప్రపంచమంతా తమకోసమేనన్న స్వాతిశయం హెచ్చింది. ఎవడికడుపే వాడికి కైలాసమై పోయింది. ఇదంతా ఇలా జరగగూడదనేవాడు మురళి. హైస్కూలున్న చిన్నబస్తీకిన్నీ, మా వూరికిన్నీ మధ్య దూరం అయిదుమైళ్ళు. పుస్తకాల సంచి భుజానికి తగిలించుకుని, ఖాళీ అయిన అన్నం కారియర్‌ని ఒక చేతితో పట్టుకుని, సాయంకాలాల్లో ఇంటికి తిరిగొస్తూ తారురోడ్డు పొడుగునా మేము ఒక ఆదర్శ నవసమాజానికి రూపకల్పన చేస్తూ వచ్చాం. అక్కడ దరిద్రం వుండదు. చీకుచింతలుండవు. దుర్వ్యసనాలుండవు. 'ఇంతై, అంతై, మరియు తానంతై' అన్నట్టుగా అది వామనుడంతో ఎత్తుకు పెరిగే సమాజం!

'బేష్, బాగానేవుంది. కానీ ఆ సమాజానికి వెళ్ళేదారి ఎటువైపుగా వుందో, గమ్యస్థానం చేరుకోడానికి ఆ దారిగుండా ఎంతదూరం వెళ్ళాలో తెలియకుండా వుంది.....' అనే వాణ్ని.

'ఏముంది? నువ్వునాటకాలు రాస్తావు. నేను వేస్తాను. నిప్పుకు వాయువు తోడైనట్టే! కాల్చిపారేద్దాం' అనేవాడు మురళి.

మా మురళి తరఫున నేను వేడుకుంటున్నాను. మురళిని మీరు మన్నించాలి. అతడు కాల్చిపారేయాలన్నది లోకాన్నికాదు— కుళ్ళును, కుసంస్కారాన్నీ, కుటిలత్వాన్నీ! చేసినా అంతపనీ చేయగలిగినవాడే మురళి! నా బుద్ధికలా అనిపించేది. 'నాకు నచ్చిన హీరో' లక్షణాలు అలనాటి అతడి చిన్న ఆకారంలోనే నాకు కనిపించాయి. స్వతహాగా నేనే గొప్పవాడిని కాగలనన్న ఆత్యాశ ఆ చిన్న వయసులోనైనా లేకపోవడం భగవంతుడు నాకిచ్చిన గొప్పవరం! కానీ గొప్పవాడికి ప్రక్కవాడుగా ప్రసిద్ధికెక్కడం మాత్రం అందరికీ లభించే భాగ్యమా?

అంతలో మా హైస్కూలు చదువు ముగిసింది.

మా మురళి మాటలద్వారా మీ రిపాటికి గ్రహించే వుంటారు. అప్పటికే నేను దాదాపుగా కొంత వ్రాతగాణ్ణి! పరీక్షల తతంగమంతా వ్రాతతో గూడిన పనే గనుక, వ్రాతనుబట్టి పరీక్షల్లో నాకు కాస్త ఎక్కువ మార్కులే వచ్చాయి. కాలేజీకి వెళ్ళివుంటే ఆ మాత్రం మార్కులకు నాకొక స్కాలర్‌షిప్పు దొరక్క పోయేదిగాదు. కానీ కాలేజి చదువుపైన ప్రలోభం పెట్టుకోడానికి వీల్లేకుండా చేసినాయి మా కుటుంబ పరిస్థితులు. నేను ఫోర్తుఫారంలో వున్నప్పుడు మా నాన్నగారు కాలంచేశారు. ముగ్గురు చెల్లెళ్ళకు పెళ్ళి చేయవలసిన భారం నా భుజాలపైన వుంది. పిత్రార్జితంగా కొంతపొలం మిగిలిందన్న మాటేగాని, దానిపైన వచ్చే రాబడి మా తిండికైనా కటాకటీగా సరిపోయేదిగాదు.

కుటుంబపరిస్థితుల దృష్ట్యా మురళిగూడ సరిగా నే నడిగి వచ్చినదారినే అడిగివచ్చాడు. లేదంటే ఒక చిన్న తేడా! వాడితోబుట్టువులు వాడికన్నా పెద వాళ్ళు. ముగ్గురికీ పెళ్ళిళ్ళు అయ్యాయి. ఎవరి సంసారం వాళ్ళు చేసుకుంటు న్నారు. ముగురక్కల ముద్దులతమ్ముడు మురళి. ఈ బుల్లి బావమరిది మీద బావలకు గూడా చెప్పరానంత అభిమానం. వాళ్ళు భూమి తల్లితో పోరాడి బ్రతికేవాళ్ళే. కానీ తమ బావమరిదికి మాత్రం ఎద్దుల్ని కొట్టి ముద్దలు తినే దురదృష్టం పట్టగూడదన్నది వాళ్ళ దృఢనిర్ణయం. హైస్కూల్లో సర్టిఫికేట్లు తీసుకునేవరకూ నేనూ, మురళీ కలిసేవున్నాం. సర్టిఫికేట్లు చేతికి తీసుకుని రోడ్డుపైకొచ్చాక మురళి అలాగే స్టేషనుకు వెళ్ళి పట్నానికి రైలెక్కేశాడు. నా పాటుకు నేను వెనుదిరిగి మా పల్లెకు వచ్చేశాను.

వచ్చేశానన్న మాటేగానీ నేను మాత్రం వూరుకున్నానా? రెండేళ్ళపాటు అదొక అజ్ఞాతవాసంలా ఒక ట్రెయినింగు స్కూల్లో కాలక్షేపంచేసి, టీచరుగా పని చేయడానికి కావలసిన యోగ్యతాపత్రం సంపాదించాను. అప్పటికింకా దేశంలో సమితుల ప్రాదుర్భావం జరగలేదు. జిల్లాలోని పాఠశాలల్ని జిల్లా బోర్డే ఏలుకుంటూ వుండేది. నేను ట్రెయినింగు స్కూలును వదలిపెట్టిన సమయానికి సరిగా మా వూరి బడిలో ఒక టీచరు రిటయిరు గావడంతో, ఆ ఖాళీకి నేను భర్తీ చేయబడ్డాను. అంతటితో నాకొక విస్తరి దొరికినట్టయింది. ఆరకొరగా వడ్డించిన విస్తరి అనుకోండి పోనీ!

పట్టుడివిలో నుంచి అమాంతంగా ఉద్యానవనంలోకి విసరివేయబడ్డ వాని పరిస్థితి వూహించుకోవలసిందే! నగరం తన అందచందాలన్నింటితోనూ మురళిని అలా వివశుణ్ణి చేసివుండాలి. ఆ విషయం అతడి ఉత్తరాలద్వారా నాకు తెలిసొచ్చేది. తన అనుభవాలను ఉల్లేఖించడానికి నేనొకణ్ణి బాగా దొరికిపోయాను మురళికి! అతడి అక్కచెల్లెళ్ళు చదువుకోలేదు. బావలకీ గొడవేమిటో అర్థంకాదు. అందు వల్ల యించుమించుగా నాదొక దుబాసి వ్యవహారమై పోయింది. ఎటొచ్చీ వచే చిక్కంతా ఉత్తరంలో డబ్బు ప్రసక్తి వచ్చినప్పుడే! నోరు విడిచి చెప్పకపోయినా అయ్యయ్యో! అంత డబ్బెందుకు?' అన్న ప్రశ్న ప్రతిఒక్కరి ముఖంలోనూ కాన వచ్చేది. రెడీమేడ్ సమాధానం లేకపోలేదు. కాలేజి చదువులంటే మాటలా! ఏనుగుకు అందించినట్లుగా అందివ్వవలసిందే!

సెలవు లొచ్చాయంటే పెట్టెతో, పరుపుతో వచ్చి మురళి పల్లెలో దిగేవాడు. పట్టుమని పదిరోజులుండేసరికి పల్లెటూరి జీవితం అతడికి పచ్చక పోవడం గమనించి నేనాశ్చర్యపడేవాణ్ణి. ఎంతో ప్రియంగా వండిపెడితే—అబ్బే, ఏదేం భోజనమనేవాడు. అభిమానంతో పలకరించిన వాళ్ళ ఎదుట ముఖం ముడుచుకునేవాడు. మళ్ళీ తన కాలేజీ హాస్టల్లో నో కుర్రాడి కొంటె చేష్టను గురించి చెబుతుంటే ఎక్కడలేని వెలుగు అతడిముఖంలోకి పుంజుకునేది. స్వర్గం నుంచి అమాంతంగా నేలపైకి జారిపడిన దివ్యపురుషుడిలా అతడు తనను తాను భావించుకుంటున్నందుకు నా మనసు చివుక్కుమనేది. కాని మనుకారాలున్నచోట లోటుపాట్లు దృష్టికానవేమో! మురళిలో వచ్చిన మార్పు అతడి బంధువులకు మాత్రం అత్యంత సహజమైన పరిణామంగానే తోస్తూవచ్చింది. అవునమ్మా మరి! వాడు హాస్టల్లో దివ్యాన్నాలు తింటున్నవాడాయె! వాడికీ పల్లెటూరి ఎద్దె వండి రుచించకపోవడంలో ఆశ్చర్యమేముంది, యింకా రుచిస్తేనే ఆశ్చర్యపడాలి గానీ! పట్నంలో నాగరికపు మనుషులతో కలిసిమెలిసి వుంటున్నవాడుగదా, వాడికీ పల్లెలోకి వచ్చిపడితే నీళ్ళలోని చేపను బయటికి విసిరివేసినట్లే వుంటుంది పాపం! అయినా యిప్పుడైతే చదువుకుంటున్నాడు గనుక సెలవలు గడపడం కోసం యిలారావలసివస్తోందిగానీ, లేకపోతే ఈ మురికి కొంపల్లో పడివుండడానికి వాడి కర్మేం కాలింది!

ఇక్కడ మురళితో నా స్నేహం గురించి కొంచెం చెప్పుకోవాలి. స్నేహానికి ఆయువుపట్టు సమానమైన అభిరుచులు కలిగి వుండడం. సాహిత్యం పట్ల గల ఆసక్తి మా కిద్దరికీ జతకూర్చివుంటుందని నే నమకునేవాణ్ణి. మేమిద్దరం కలిసి హరి కథలకు వెళ్ళేవాళ్ళం. వీధినాటకాలు చూచేవాళ్ళం. ఏదైనా పుస్తకం దొరికితే ఒకరు బిగ్గరగా చదువగా, యింకొకరం వినేవాళ్ళం. హైస్కూలు మాగజైనులో ఒకటి రెండు రచనలు పడ్డంవల్ల నాకు రచయితగా పరిగణన వచ్చినట్టే, యానివర్సరీ నాటికల్లో పాల్గొనడంవల్ల వాడికీ నటుడన్న గుర్తింపు వచ్చింది. ఐతే మురళి పట్నానికివెళ్ళి అక్కడ జీవితానికి బాగా అలవాటు పడిపోయిన తర్వాత అతడి కళాభిరుచిలోసైతం నాకు మార్పు కనిపించసాగింది. ఒకసారి సెలవుల్లో యింటికొచ్చినవాడు హుటాహుటిగా నన్ను కేటీ చేసి బ్రహ్మాండంగా అభినందించి పారేశాడు. అందుకు కారణం ఆమధ్య ఏదో పత్రికలో పడిన నా కథ. 'చదివావా' అన్నాను. లేదన్నట్లు తలడ్డంగా త్రిప్పాడు. 'నేనుకాదులేవోయ్! మా ప్రసాదరావు చదివాడట! అర గంటసేపు పొగిడాడనుకో! అంతెందుకు? నేనక్కడ వుండగానే వాళ్ళ సిస్టర్ని గూడా చదవమన్నాడు.......'

బ్రతికిపోయాను! ఆ ప్రసాదరావు సిస్టరు గూడా నా కథను చదివి మెచ్చు కోడం జరిగి వుంటే, వీడునన్ను మరింత బిగ్గరగా ఆలింగనం చేసుకుని ఎము కలు విరచినంత పనిచేసి వుండేవాడు!

క్రమక్రమంగా సెలవుల్లో స్వగ్రామానికివచ్చినప్పటికీ మురళి యిక్కడి మనుషులతో కలిసిమెలసి కాలం గడపడం తగ్గించేశాడు. ట్రాన్సిస్టరు భుజానికి తగిలించుకుని పొలాలపైకి వెళ్ళిపోయేవాడు. అదేమిటంటే సౌందర్యారాధన అనేవాడు. మేము కలిసి ఆడుకున్న కొబ్బరితోటలకు 'సుందర్ బన్స్' అనీ, ఎండి పోయిన ఏటికి 'మెరీనాబీచ్' అనీ, మా వూరి చెరువుకు (అందులో నీళ్ళు లేకపోయినా సరే) మానససరోవరమనీ పేర్లుగూడా పెట్టేశాడు. వీడు సౌందర్యోపాసన చేస్తున్నాడా? సౌందర్యానికి నోచుకోని వాటిని ఈసడిస్తున్నాడా? నాకు సరిగా అర్థమయ్యేదిగాదు. నగరంలో వాడు సంచరించినంతమేరకు యిళ్ళు, వాకిళ్ళు, వీధులు, పార్కులు అన్నీతీర్చిదిద్దినట్టే వుండొచ్చు. అక్కడి మనుషులు మడత చెరగని దుస్తులలో నాజూగ్గానే కనిపించవచ్చు. వాళ్ళ భాష గూడా మన్నితంగానే వుండొచ్చు. ఆ సౌందర్యం, సౌకుమార్యం పల్లెటూళ్ళకు రమ్మంటే ఎలా వస్తుంది? ఇక్కడి మనుషులు మోటువాళ్ళు. వీళ్ళ ఆకారాలు, వీళ్ళ వేష భాషలు, అంతెందుకూ, వీళ్ళ జీవన విధానమంతా మోటుగానే వుండొచ్చు. కానీ ఈ చీకటి బ్రతుకుల్లో కొత్తవెలుగులు నింపాలని కలలుగన్నవాడు కాడా ఈ మురళి! నాలుగైదేళ్ళపాటు పట్టణంలో వుండిరావడంతో వీడు పల్లెటూళ్ళ పరిస్థితులను పూర్తిగా అసహ్యించుకునే స్థితికి వస్తాడా? నేను నమ్మలేకపోయే వాణ్ణి. ఏమైనప్పటికీ మురళి మూలంగా ఒకవేళ ఆశాభంగం పొందవలసి

వచ్చినా అందుకు నేను ఒట్టుకోగలను.అందుకు సిద్ధంగా లేనిది అతడి బంధువులే!

మురళి పట్టా పుచ్చుకునే రోజులు దగ్గర పడుతున్నాయి.

'ఏమిటోయ్ మురళీ! చదువులైపోవస్తున్నాయిటగా! పెళ్ళెప్పుడు? ఎవర్ని చేసుకుంటావు?' అన్న ప్రశ్న ఒకటికొత్తగా మురళిని ఎదుర్కోసాగింది

ఈ విషయంలో గూడా మురళి అదృష్టవంతుడే! కొత్తగా వధువు కోసం వెదుక్కోవలసింది లేదు. చేయవలసిందల్లా ఎన్నుకోడమే! మురళి అక్కయ్యల్లో, పెద్దవాళ్ళకిద్దరికీ ఈడొచ్చిన కూతుళ్ళున్నారు. పెద్దక్కయ్య కూతురురాజ్యాలు. ఈ రాజ్యాలు అనే పిల్లను,అది పుట్టినప్పటినుంచీ మురళికి పెళ్ళాంగానే వ్యవహరించుకుంటున్నారు. 'ఏవిటే రాజ్యాలూ! నీ మామవచ్చాడటగా! నీకేంతెచ్చాడు? పెళ్ళెప్పుడు ఆముహూర్తం ఎప్పుడేస్తావు మామా అని అడగలేకపోయావా? ఒదీ వరస!

మురళి కాలేజీనుంచి విడుదలైన సంవత్సరం దేశం సుభిక్షంగా వుంది. పొలాలు నిండా పంట యిబ్బడిగా పండింది. గరిసె నిండుకూ వడ్లుపోసుకుని మురళి పెద్ద బావ పెళ్ళికి సన్నాహాలు ప్రారంభించాడు. మురళికెందరో స్నేహితులు. వాళ్ళందరూ పెళ్ళికి వచ్చేస్తారు. ఆ రాబోయే స్నేహితుల వసతి సదుపాయాల కోసం అతడు నో పదంకణాలమట్టి మిద్దె వేయించాడు. బాల్‌రూము కట్టించాడు. పెళ్ళి పందిరికోసం అడివినుంచి వెదుళ్ళు తెప్పించాడు. ఇంటి ముంగిట ఆరుబయలంతా గచ్చుచేయించాడు.

పరీక్షలయిపోయిన తర్వాత అలా అలా మిత్రుల ఊళ్ళన్నీ తిరిగి మురళి నిదానంగా యింటికి తిరిగి వచ్చేసరికి యిక్కడ అతడికోసం ఒకటే తొందరపడిపోతున్నారు.

మురళి వచ్చాడు. చూచాడు. ఇల్లంతటా పెళ్ళికళ తాండవిస్తోంది. మురళి ఏమనుకున్నాడు? ఆ భగవంతుడికే తెలియాలి. తన కీ పెళ్ళి యిష్టం లేదనీ, అతడు చూచాయగా కనీసం నాతోనైనా చెప్పలేదు. మీదుమిక్కిలి దుస్తులు కుట్టించుకోడానికని, గడియారానికని బావ దగ్గర వెయ్యి రూపాయలు పుచ్చుకున్నాడు. రేపీపాటికల్లా వచ్చేస్తానని చెప్పి బస్సెక్కేశాడు.

ఇక పోవడం! రోజులు, నెలలు, సంవత్సరాలు గూడా గడిచిపోయాయి. మిలిటరీలో చేరిపోయివుండవచ్చునన్నారుకొందరు. హఠాత్తుగా అతడికి మతి చలించి వుండచ్చునన్నారు కొందరు.చివరికందరూ కలిసి మురళిదేం తప్పులేదు. ఇదంతా ఆ రాజ్యాలనే పిల్ల గ్రహచారమన్నారు. నా మట్టుకు నేను మాత్రం ఏమీ అనలేదు. ఈ జన్మలో మురళి ఎప్పుడైనా తారసపడితే చాచి వో లెంపకాయ కొట్టాలని మాత్రం అనుకున్నాను.

ఆ సదుద్దేశం సఫలం గావడానికి ఒక అవకాశంయిస్తున్నట్టుగా నాకో మురళి దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది!

*   *   *   *

మదరాసు మహానగరానికి నా చిన్నతనంలోఎప్పుడో ఒకసారి వెళ్ళివున్నాను. మా నాన్నగారు నా కప్పుడు సముద్రాన్ని, చచ్చిన—బ్రతికిన కాలేజీలను చూపించారు. ఆ నగరాన్ని గురించి తలచుకున్నప్పుడల్లా సముద్రంలో అయోమయంగా రవళించే అలలు, మృగశాలలో వుండి వుండి క్రూరంగా అరిచే అడవి మెకాలు, మ్యూజియంలో పేరదిరుతున్నట్టున్న జంతువుల మృత కళేబరాలు నాకు జ్ఞప్తి కొస్తుంటాయి. మురళి ఉత్తరం వచ్చిన తర్వాత మదరాసుకు తరచుగా వెళ్ళివచ్చే ఒక పెద్దమనిషిని కలిసి, రాయపేట ఎక్కడుంటుందో వాకబు చేశాను. ఆయన 'రాయపేటా రాయపురమా?' అంటూ నాకే ఒక ఎదురు ప్రశ్న వేశారు. నాకు తెలిసినంతలో పేట, పురము పర్యాయపదాలే! బహుశా అవి రెండూ ఒకటే అయివుండవచ్చునన్నాను. ఆ పెద్దమనిషి ఫక్కుమని నవ్వేశాడు. మదరాసుకు బయల్దేరకముందే ఆ ఊరికి సంబంధించిన నా అజ్ఞానం యిలా వెల్లడయింది. మరింతగా అజ్ఞానాన్ని బయట పెట్టుకోడమెందుకని రైల్లో బయలుదేరివస్తున్నాననీ, స్టేషనుకు వచ్చి కలుసుకో వలసిందనీ మురళి యిచ్చిన చిరునామాకొక ఉత్తరం వ్రాసి పడేశాను.

వ్యక్తులు తమ బాధ్యత తెలిసి నడుచుకోడంపైన కుటుంబ బాధ్యత ఆధారపడి వుంటుంది. వ్యక్తిగా మురళి తనపైన ఎన్నోఆశలు పెట్టుకున్న కుటుంబాలపైన దారుణంగా దెబ్బ తీశాడు. తనను కన్నబిడ్డకన్నా ఎక్కువగా చూచుకున్న అక్కచెల్లెండ్లు యితడిమూలంగా సంఘంలో నగుబాట్లకు మాత్రమే నోచుకున్నారు. వాడి చదువులకోసం చేసిన అప్పు విన్న మొన్నటిదాకా తీరలేదు. ఆయినసంబంధం అర్ధాంతరంలో తెగిపోయిన తర్వాత ఆ రాజ్యాలనే పిల్లకు కొత్త సంబంధం కుదిర్చి పెళ్ళి చేసేసరికి తల్ప్రాణం తోక కొచ్చింది. ఇంత గొప్పగా నిరవాకం వెలగబెట్టిన మురళిని నేనిప్పుడు కలుసుకోబోతున్నది! ఇంత పని చేసిన తరువాత వీడు తగుదునమ్మా అని ముఖం పెట్టుకుని నా ముఖంకేసి సూటిగా చూడగలడు? నేను మాత్రం మనసు విప్పి వాడితో మునుపటిలా ఎలా మాట్లాడగలను? ప్రయాణం చేసినంత సేపూ నేను రైల్లో వాడిపైన కారాలూ మిరియాలూ నూరుతూనే కాలం వేగించాను. నూరిన సరుకు నంతా వాడి తలకు వేసి పులిమేదాకా నా ఆవేదన ఉపశమించేటట్లు లేదు.

నా ఆలోచనలో నేనుండగానే బండి సిటీ సివార్లు దాటేసిందన్నారు.

అదిగో భద్రాద్రి, ఇదిగో గౌతమి అన్నట్టుగా—ఇదిగో బేసిన్ బ్రిడ్జి, అదిగో సెంట్రల్ అని గూడా అనేశారు.

రైలు స్టేషనులో ఆగింది.

ఆ రోజు సెంట్రల్‌స్టేషను నేల యీనినట్టు జనంతో కిటకిటలాడి పోతూవుంది అని నేను చెప్పను. ఎవరు చూచారు? తేరుకు, తిరణాలకు చేరినట్టుగా అక్కడ ప్రతిరోజు ఇల జనం గుమిగూడుతూనే వుండొచ్చు. ఈ నగరాన్ని విడిచిపెట్టి వెళ్ళేదాకా తప్పుడు స్టేటుమెంట్లు యివ్వకుండా, నోటికి వచ్చినట్టల్లా వాగకుండా ఒళ్ళు దగ్గరగా పెట్టుకుని నేను జాగ్రత్తగా మసలుకో దలచుకున్నాను. రైలెలాగూ ఆగింది. కానీ నెమ్మదిగా దిగి పోవచ్చునని ఏ ఒక్కరూ అనుకోకపోవడమే విచిత్రం! ముందుగా దిగిన వాళ్లకు అక్కడెవరో బహుమతిస్తున్నట్టుగా ద్వారం దగ్గర ఒక బల ప్రదర్శనం ఏర్పాటు చేశారు. నేను నింపాదిగా నా సీటు దగ్గరే నిలబడి ప్లాట్‌ఫారం వైపు చూచాను. ఈ జన సముద్రంలో ఎక్కడో మురళి గూడా వుండివుండాలి. ఎక్కడున్నాడు? అసలు వాడిప్పుడు ఎలా వుంటాడు?

మురళి జాడ కనిపించకముందే కంపార్టుమెంటు ఖాళీ అయిపోయింది.

దిగి ప్లాట్‌ఫారంపైకి వచ్చాను. మెల్లగా పదిబారల దూరం ముందుకు నడిచాను.

ప్రయాణీకులు ఒకరినొకరు తోసుకుంటూ నా కెదురుగా వచ్చి ముందుకు సాగిపోతున్నారు.

నేను తిరిగి చూచాను. ప్రయాణీకులు బయటికి వెళ్ళిపోయే ద్వారం అటువైపున్నే వుంది.

పెద్ద మాయలమరాటీ గుహలా ఈ స్టేషన్ని కట్టి పెట్టినవాళ్ళని ప్రశ్నించాలి. మనం గూడా అటువైపు వెళ్ళవలసిందేనేమో!

వెళ్ళి వెళ్ళినంత దూరం తిరిగి వచ్చివుంటాను. ఎటువైపునుంచి వచ్చిందో తెలియదు. హఠాత్తుగా ఒక చేయి వచ్చి నా భుజంపైన వ్రాలింది.

కళ్ళ ఎదుట ప్రత్యక్షమైన ఆకారం వైపు ఎగాదిగా చూశాను.

నల్లద్దాల కళ్ళజోడు. తుమ్మెదరెక్కల్లా పొంకమైన మీసాలు. కొన్ని శిలాశిల్పాలలో కనిపించేటట్లుగా అందమైన కేశాలంకరణ, పొట్టి చేతులచొక్కా క్రింద కాళ్ళను సగమంతా పొదివి పట్టుకున్న పాంటు. ఇటీవలి నాలుగైదేళ్ళలో యింకొక రెండంగుళాల ఎత్తు పెరిగి, అందుకు తగినంతగా ఒళ్ళు గూడా చేసిందేమో మనిషి బాగా దుక్కయినుముతో చేసి నిలబెట్టిన విగ్రహంలా వున్నాడు.

'ఏమిటోయ్ శేఖరం! నన్ను గుర్తుపట్టలేక పోయావ్ గదూ! నే ననుకున్నానులే! అనుకున్నట్లే జరిగింది. సర్లే. నువ్వొచ్చేశావు. మాటంటే అలా వుండాలి. పోర్టరుని పిలవనా శేఖరం! లగేజేది?'

నేను నా చేతిలోవున్న చిన్న సంచీని చూపించాను.

'ఓహ్, అదేనా, పరవాలేదే! చూశావా శేఖరం! 'లెస్ లగేజ్, మోర్ కంఫర్ట్స్,' అని రైల్వేవాళ్ళు చెబుతారు. వినిపించుకునే వాళ్ళెవరు, ఎవరో నీలాంటి వాళ్ళు తప్పిస్తే!'

వెళ్దాం పదమన్నట్లుగా భుజంపైన చేయివేశాడు మురళి. పువ్వుతో చేరిన నారకు పరిమళం అబ్బుతుందంటే ఏమిటో ననుకునేవాణ్ణి. అప్పుడు తెలిసింది. మురళి నన్ను యివతలికి తీసుకొస్తుంటే టికెట్ కలెక్టరు తెల్లబోయి చూస్తున్నాడే తప్ప టికెట్టెక్కడ అని అడగలేక పోయాడు.

అంతలో వున్నట్టుండి జ్ఞప్తికి వచ్చినట్లు 'ఏదీ, దాన్నిలా యివ్వు శేఖరం! నేను తీసుకొస్తానులే' అంటూ నా చేతిలో వున్న సంచి అందుకోబోయాడు మురళి. 'అబ్బే ఎందుకూ యిదేం బరువు' అన్నాను.

'అదేంమాట! నువ్విప్పుడు నాకు అతిథివి. ఇక్కడినుంచి వెళ్ళేదాకా నువ్వు నేనెలా చెబితే అలా వినాలి. మారుమాటలేకుండా నేను చేసే సత్కారాలన్నీ స్వీకరించాలి. అతిథి దేవోభవ అంటే మరేమిటనుకున్నావు శేఖరం? వినే వాళ్ళేమనుకుంటారో నన్న విచక్షణ లేకుండా డబ్బారేకులపైకప్పు ఎగిరి పోయేటట్లు నవ్వసాగాడు మురళి.

బాబోయ్, ఇదేనా నేను మందలించాలనుకున్నది? వీడు మందలింపులకు అతీతమైన స్థితిలోకి వెళ్ళిపోయినట్లున్నాడు.

ఎందరో మనుషు లెదురవుతున్నారు. సైకిళ్ళు ఢీ కొట్టుకోబోయి తప్పుకుంటున్నాయి. కలాలు, దువ్వెన్లు, టూత్‌బ్రష్షులు అమ్మజూపే వాళ్ళు అడుగడుగునా అడ్డు తగులుతున్నారు. ఏ అడ్డంకినీ లెక్క పెట్టకుండా మురళి నన్ను దూరంగా లాక్కెళ్ళాడు.

'ఏ నెంబరు బస్సు?' అన్నాను నోరు జారి.

'బస్సా! ఇంకా నయం! లారీ అన్నావుకావు. ఎక్కు ఎక్కు' అంటూ టక్కుమని తలుపు తెరచి నన్ను కారు లోపలికి తోశాడు మురళి.

కారు కదిలింది. నడిచిన కారయితే వేగం తెలియకుండిగానీ, నా ఆలోచన మాత్రం ఆ కారుచుట్టే గింగుర్లుకొడుతూ వుంది. చూడగానే కారు పేరేమిటో చెప్పగల పరిజ్ఞానం నాకులేదు. ఇదేంకారోగానీ, చాలా మంచి కారల్లేనే వుంది. లోపలా బయటా గూడా ఎంతో అందంగా వుంది. అందులో కూచున్నాక ఒక చిన్న పుష్పక విమానంలో తేలిపోతున్నట్లే తోచింది. ముమ్మరంగా రాకపోకలు సాగుతున్న రోడ్డుపైన డ్రయివు చేస్తూ చేస్తూ మురళి సిగరెట్లు ముట్టించుకోగలిగిన వైఖరిని బట్టిచూస్తే, వాడికీ కారు, ఈ డ్రయివింగు, ఈ రోడ్లు, యిదంతా చాలా పాతబడిన వ్యవహారమై వుంటుందనే అనిపించింది.

కానీ అతడెంతో సేపు నా ఆలోచనలకు నన్నుండ నివ్వలేదు. అతిథి సత్తముడి కాలక్షేపానికి కొరత రాకుండా వుండడంకోసం అతడు కొన్ని ముఖ్యమైన వర్తమానాలను నాకు నివేదింపసాగాడు. ఈ మధ్య సిటీ కార్పొరేషన్ చాలా బాగుపడిపోయిందట! వీధుల పరిశుభ్రతను, పార్కుల ఒయ్యారాన్ని చూచి కేంద్రమంత్రి ఒకాయన తెగ మెచ్చుకున్నాడట! తెలుగువాళ్ళు శతపోరి ఒక రాష్ట్రమైతే తెచ్చుకోగలిగారు గానీ, తెలుగు సినిమా పరిశ్రమను మాత్రం యిక్కడి నుంచి లేవదియ్యలేక పోయారట. 'అంతెందుకూ!' అంటూ ముదలంకించుకున్నాడు మురళి. 'కూవం నదిలో మొసళ్ళున్నాయి గదా! ఏదీ, మూసీ నదిలో ఒక్కటి చూపించు!'

నేను మురళి ప్రసంగాన్ని వింటున్నానో, రోడ్డుపైన అతడు కారునొక ఆటబొమ్మగా చేసి దొర్లించుకపోవడాన్ని గమనిస్తున్నానో చెప్పలేను. వెళ్ళివెళ్ళి ఓ అరగంట సేపట్లో కారొక యింటి ముందర నిలిచింది. ఆ యిల్లు గూడా యిలాంటి కారును కలిగివుండడానికి తగినంత హుందాతనంతోనే ఒప్పారుతోంది. చాక్లెట్ ముక్కలా కొరుక్కుని తినేయాలన్పించేంత ముచ్చటగా వున్న కట్టడం. ముంగిట చిన్న పూలతోట. లోపలికి వెళ్తుంటే తివాచీలు, సోఫాసెట్లు, గోడల పైన చిత్తరువులు అంతా శోభాయమానంగా వుంది. కానీ మురళిలో నాకు కనిపించిన సుగుణమేమిటంటే, వాడు తన ఐశ్వర్యాన్ని చూచి చకితుణ్ణై అయిపోవడానికి నాకు అవకాశమే యివ్వడం లేదు. ఇదంతా ఒక సర్వసామాన్యమైన విషయమైనట్లుగా ఎడతెగని ప్రసంగంతో నా మనసుని ట్రాక్టరులా దున్నుక పోతున్నాడు.

'కూచో శేఖరం! రైల్లో దూర ప్రయాణమంటే ఏమిటి? ఒళ్ళు చిత్తు చిత్తయిపోయిందన్నమాటే! కాసేపు సేదదీరు' అంటూ లోపలికి వెళ్ళాడు. నిమిషంలో దుస్తులు మార్చుకున్నాడు. మళ్ళీ హాల్లోకి వచ్చి, గోడకు తాపడం చేసివున్న మరకొక్క యింట్లో గింగురింగుమంటూ ఒక కలరవం పుట్టించాడు. పదేళ్ళ పిల్ల ఒకతె పరుగెత్తుకుంటూ వచ్చింది. 'అతిథులొచ్చారని అమ్మగారితో చెప్పు' అన్నాడు. వెంటనే నా వైపు తిరిగాడు. 'అమ్మగారంటే ఆ పిల్లకు తల్లి అనుకునేవు! అదేంకాదు. సాక్షాత్తుగా మా ఆవిడే! నీ కథలంటే తనకు ఒళ్ళు మాలినంత అభిమానం. పడి చస్తుందనుకో! నువ్వు నా స్నేహితుడి వంటే మొదట నమ్మలేక పోయింది. 'చూస్తూ వుండు! ఎప్పుడో ఒకప్పుడు రప్పిస్తా' నంటే 'అంతటి గొప్పవాడు మనింటి కొస్తాడా' అంటూ ఆశ్చర్యం వెలిబుచ్చింది.'

పట్టణానికి దూరంగా ఒక కుగ్రామంలో, కిటికీలు లేని పూరి కొంపలో, బుడ్డి దీపం ముందు కూర్చుని రచనలు చేసుకునే రచయితలకు ఒక పాఠకు రాలు యింత గొప్ప అభిప్రాయం కలిగి వుండడం [illegible]! తన్మయుడ్ని కావడానికి ఇంతకంటే మహదవకాశం ఎప్పుడు లభిస్తుంది? కాని అంతపని జరిగేలోపుగా నాలో ఒక అనుమానం పొడసూపింది. కొంపదీసి నన్ను గురించిన నిజాలన్నింటినీ వీడు భార్యతో ఏకరువు పెట్టి వుండడుగదా! [illegible]! రచయిత వ్యక్తిగత జీవితాన్ని గురించి పాఠకులకు కొంచెం తక్కువగా తెలిస్తే అంత మంచిదని నా అభిప్రాయం.)

ఇంతలో ద్వారం దగ్గర కరకంకణాల కదలిక వినిపించింది. హోర్‌కర్టెన్ తొలగింది. చేతులు జోడించి, 'నమస్కారమండి' అని చెబుతూ ఆవిడ హాల్లోకి వచ్చేసింది.

'నమస్కారం' అంటూ ప్రత్యభివాదనం చేశాను.

ఆమె పొట్టిగా వుంది. అందుకుతోడు సన్నగా వుంది. కళ్ళు మరీ చిన్నవి. ఒంటినిండుకూ ఆభరణా లున్నాయి. విలువైన చీరలు గూడా కొన్ని చాలా పాత గానే కనిపిస్తుంటాయి. ఆమె కట్టుకున్న తెల్లటి చీరగూడా బహూశా అలాంటిదే కావచ్చు. ఇబ్బూడిదె లేచినట్టు మనిషి నాస్తి నీరసంగా గూడా కనిపించింది. అదో రూపాషిగాన అనుకోండి, నాదోయ పెళ్ళాం ఏం వుండాలన్న విషయాన్నిగురించి మురళి తన వూర్వాశ్రమంలో నాతో ఎన్నోసార్లు ముచ్చటించి వున్నాడు. ఆ లక్ష ణాల్లో ఏ ఒక్కటిగూడా ఈమెలో నాకు కనబాడదం లేదు.

'మిమ్మల్ని గురించి మీరా చెబుతుంటారండీ! అసలేం జరిగిందంటే, నాకు నచ్చిన కథల్ని నేనెప్పటికప్పుడు చింపి పెట్టుకుంటూ వుంటాను. మళ్ళీ ఎప్పుడైనా పుస్తకంగా బైండు చేయించి దాచుకుంటాను. ఒకసారి నాటిలో మీ పుస్తకం కాయన చేతికి దొరికింది. అందులో మీవే నాలుగైదు కథలున్నాయి. 'వీడు నా స్నేహితుడేనేవ్' అన్నారీయన. ఆనందం పట్టలేక పోయాననుకోండి.. కూచోండి, కాఫీ తీసుకొస్తాను....'

లోపలికి వెళ్తుండగా గమనించాను. ఆమె ఒక కాలు కొంచెం ఎగరేస్తూ నడుస్తున్నది.

ఒక వ్యక్తికి అంగవైకల్యం గనుక వున్నట్టయితే ఆత్మీయులైనవాళ్ళు బయటవాళ్ళ విషయం గమనించకుండా వుండేటట్టు జాగ్రత్త పడతారు. మురళి పలాంటి జాగ్రత్త తీసుకుంటున్నట్టు లేదు. ఇంటావిడ అలా లోపలికి వెళ్ళిందో లేదో కుర్చీ నాకు దగ్గరగా జరుపుకుని అగి ముఖ్యంగా ఏమిటో చెయ్యదగిన రహస్యంలా ప్రకటించేశాడు. 'ఏందిరా, శేఖరం! నువ్వుండే ఏం లాభం? అమ్మాయి యిలా పుట్టింది. ఎన్నో సంబంధాలు రావడం, వెళ్ళిపోవడం జరుగుతూ వచ్చింది. పాపం, ఆ ముసలాయన పిచ్చి పోయాడు. మామగారికీ పెళ్ళి కాదేమోనన్న బెంగ పట్టుకుంది. అప్పట్లో ఆయనకు నేను దొరికాను. ఎలా దొరికానని అడుగుతావేమో! అదంతా పెద్ద కథ. నువ్వు ఎప్పుడైనా చెబుతాన్లే, ఇప్పుడు నా కనిపించింది. జీవితంలో మనం ఎన్నెన్నో కావాలని కోరుకుంటాం! అవన్నీ మనకు లభిస్తాయా? ఎవడి కేది ప్రాప్తమో, అదే వాడికి దొరుకుతుందని సరిపెట్టుకున్నాను. ఈ అమ్మాయి మెళ్ళో మూడు ముళ్ళూ వేసేశాను'

'ఓరి మూర్ఖుడా! మారిపోరా!' అని గట్టిగా అరవాలనిపించింది నాకు! కాని అందు కిది సమయం కాదని ప్రయత్నపూర్వకంగా నోరుమూసుకున్నాను.

ఇంతకీ వీడు తన పెళ్ళి గురించి మేమనుకునేది చెప్పాలని చూస్తున్నాడా? ఆ ముసలాయనకు తాను ఉపకారం చేశానంటున్నాడు. అది శుద్ధ తప్పు. వీడికే ఆ ముసలాయన చేసి పెట్టాడు. మంచి యిల్లు, మంచి కారు, మంచి బ్యాంకు అకౌంటు, ఓ టెనొకర చక్కిలో వుంది, 'మంచి భార్య' నింకొక తక్కెడలో వుంచి వీడు తూచుకుని వుంటాడు. మొదటి తక్కెడ క్రిందికి ఒరిగి, రెండోది పైకి లేచిపోయి వుంటుంది. ఫలం దక్కితే చాలు ననుకుని వీడు ప్రతాన్ని బుగ్గిలో కలిపేశాడు. ఇంత పని చేశాక యిప్పుడు తన స్వార్థానికి అందంగా ఒక త్యాగం ముసుగు తొడిగి నా కళ్ళల్లో కారం కొట్టాలని చూస్తున్నాడు.

సమయంకోసం వెతికి చూస్తూ నేను నా ఆక్రోశమంతా లోలోపలే అణచుకొన్నాను.

సాయంకాలమైంది. 'ఎక్కడికి వెళ్దాం?' అన్నాడు మురళి. 'కుమార్ రాజాగారి చిత్రం' అన్నాను. మురళి ఒళ్ళంతా కదిలేటట్టు నవ్వేశాడు. ఆ తరువాత అతడి కారు కదిలింది. గమ్యస్థానం సముద్రతీరం. మెరినాబీచ్ అంటే అదే నన్నాడు మురళి. మనుష్యు లెక్కువగా లేని చోట కూర్చున్నాం.

'ఎలా వుంది సముద్రాను?' అన్నాడు మురళి.

'మదరాసుకేంరా బాబూ! చాలా బాగుంది. నాకు బాగుండనిదల్లా నీ ప్రవర్తనే! నిన్నమాంతంగా ఈ సముద్రంలోకి గిరవాటు పెట్టాలని వుంది. ధర్మాధర్మాలను ద్వంద్వయుద్ధంలో పరిష్కరించుకోడం పట్ల నీకు నమ్మకముంటే నిన్నందుకు పిలిచి నీ ముక్కూ, మూతీ పచ్చడం చేసెయ్యాలని వుంది' అన్నాను.

ఎలాగైనా గడుసుగదూ, ఎలాంటి 'మూడ్' అయినా వీడు సరిగ్గా పలికేటట్టుంది. హఠాత్తుగా బుంగమూతి పెట్టేశాడు. 'నేరేపొరీ శేఖరం! నేనం చేశాన్రా? నా తప్పేమిటో చెప్పు' అన్నాడు.

'మెల్లిగా అడుగుతున్నావా ఆ మాట! ఇక్కడెవరో ముసలాయన్ను వుద్ధరించడానికని ఈ సంబంధం చేసుకున్నట్టు కోతలు కోస్తున్నావు గదరా నువ్వు! ఆ మాత్రం త్యాగం అక్కడ నిన్ను నమ్ముకున్న వాళ్ళకు సైతం చేయవచ్చు నన్న బుద్ధిలేక పోయిందా నీకు! నీ ప్రాణాలకు వూపిరూ పోస్తూ ఆ కుటుంబాలు స్వార్థంగా చితికి పోతే నీకు ఏమనుట్టైనట్టయినా వుందా? నువ్వేదో తవ్వి తల కెత్తుతావని నమ్మి నున్నావు నిన్ను యువరాజులా పెంచినందుకు, చదివించినందుకు యిదేనా నువ్వు చూపించే కృతజ్ఞత! ఛీఛీ....'

చేసిన త్యాగం వల్ల తన నెత్తు ఆకాశం దాకా పెరిగిందని భావిస్తున్నట్టున్న మురళి, నా ఆరోపణవల్ల పాతాళానికి కృంగి పోయినట్టు కనిపించాడు. 'ఏం మాట్లాడాలో శేఖరం! నన్ను చిన్నప్పటినుంచీ ఇంత అపార్థం చేసుకున్నారు. కనీసం నువ్వయినా నన్ను అర్థం చేసుకుంటావేమో అనుకున్నాను. అది గూడా అడియాసే అయిపోయింది. నాదురా బాబూ! నేనొక మాటడుగుతాను. మా అక్కయ్య కూతురికి ఏం కొదవో చెప్పు. కాలొంకరా, చెయ్యి వంకరా? దాన్నెవడైనా కళ్ళకద్దుకుని చేసుకుంటాడు. ఎటొచ్చి దాన్ని చేసుకోలేనివాణ్ణి నేనొక్కణ్ణే! ఎందుకంటావా? ఇంత నంటబిడ్డగ వున్నప్పటినుంచీ దాన్ని నేనెరుగుదును. వరసకు మామనే అనుకో. కాని ఆ పిల్లను నేను చెల్లెలు కన్నా వేరుగా చూచింది లేదు. పోనీ, స్పష్టంగా తెలిసేటట్టు యింకొక రకంగా చెప్పనా శేఖరం! పొరబాటు వల్లనో, గ్రహపాటు వల్లనో మా అక్కయ్య ఆడదై పుట్టిపోయింది. లేదు, మగవాడై పుట్టి వుండేదనుకో! అప్పుడా పిల్ల నాకు అన్నకూతురై వుండేది. అన్నకూతుర్ని చేసుకునే మూర్ఖుడెవడైనా వుంటాడా లోకంలో?'

సమాజయాన్ని ఒప్పేసేపడంలో తప్పులేదు. మురళి వాదాన్ని వినేటప్పటికి నా తల దిమ్మెక్కిపోయిన మాట వాస్తవం. వాదంలో నిజం లేదని చెప్పడానికి — ఇప్పుడు నోరాడటం లేదు. ఏం మాట్లాడాలో తోచక కళ్ళు మూసుకున్నానేమో, అలాగే యిసుక పైకి ఒరిగిపోయాను.

అరగంట సేపటి తర్వాత కళ్ళు తెరిచి చూసేసరికి మురళి తాను కూర్చున్న చోట లేడు. చుట్టూరా కలయజూశాను. దూరంగా ఓ పడవ కొయ్యపైన కూర్చుని వాడు పంజాబీ దుస్తులు వేసుకున్న ఓ అమ్మాయితో మాటాడుతున్నాడు.

ఆకాశాన చందమామ. బ్యాక్‌గ్రౌండులో నీలి జలరాశి. ఆ యువతీ యువకులు ఒకరి భుజంపైన ఒకరు చేయివేసుకుని యుగళగీతం ఒకటి అందుకుంటే సినిమాలో ఆ సీను కంతకంటే కావలసిన హంగులుండవు.

తిరిగి వచ్చాక అడిగాను. ఆవిడపేరు లలిత అన్నాడు మురళి. ఏం చేస్తుందన్నాను. ఇలాగే తిరుగుతూ వుంటుందట! నువ్విక్కడున్నావని ఎలా తెలుసుకుందన్నాను. 'అబ్బో, అందులో వేట కుక్కలావిడ ముందు దిగదుడుపు! నా కారును చూసిందేమో, వచ్చిన పసిగట్టేసింది. ఎందుకులే శేఖరం! నువ్వున్నావు గనుక సరిపోయింది. లేకుంటే నేనింటికి వెళ్ళకుండానే ఈ రాత్రి తెల్లవారి పోయి వుండేది . . . .'

అప్పటి కది 'అయ్యో పాప' మంటూ సానుభూతి ప్రకటించవలసిన విషయమైనట్టు ఎంతో దీనంగా చెప్పుకుపోతున్నాడు మురళి. 'మామూలుగా శేఖరం! నా సంసార సౌఖ్యం అంతంత మాత్రం! ప్రొద్దు పొడిస్తే, ప్రొద్దుపోతే మా ఆవిడకు డాక్టర్లతోనే పని! మొగుడన్నవాడు ఒకడున్నాడా, లేదా అన్న ధ్యాసయినా వుండదు . . . .'

'సముద్రతీరము [illegible], నాలు [illegible] వుంటిమి' అని పాడుకోడానికి వీలుగా మేమింటికి చేరుకునేటప్పటికి గంట పది కావచ్చింది. చలిగాలులు వీచడం ప్రారంభమైందేమో, నరాలు జిల్లు జిల్లు మంటున్నాయి. తువ్వాలు ఒకటి తలకు చుట్టుకుని గదిలో కూచున్నాను. పేపరులో తల దూర్చుకోడం వల్ల చలి పిల్లగాలికి ఎగిరిపోతుండడం గురించి నేనంతగా పట్టించుకోలేదు. పత్రికలు, స్కెచ్చులు, [illegible] కదులుతున్న చప్పుడు మాత్రం విన్నాను. మురళి తలుపులు మూసి గడియ పెట్టేశాడు. 'రోజూ చూసే పేపరే గదా! దాని కిప్పుడేమొచ్చిందిగాని, దాని సంగతి చూడు శేఖరం!' అన్నాడు.

పేపరు క్రిందికి దించి టేబిలుపైన పేర్చుకున్న సరుకుల వైపు చూసేసరికి ఒళ్ళు గగుర్పొడిచింది.

'ఇదెప్పటినుంచిరా మురళీ?' హడావుడైపోతూ అడిగాను.

'[illegible] గుర్తుకు వచ్చాడట— 'వెన్నెల మహిమల్ని గురించి వినడమేగాని, కన్నది లేదు' అని! నీకే అనుభవం అలాంటిదేదీ నాకు తెలుసు. పోనీ, ఇప్పుడు రాస్తున్నావని చూడరాదా శేఖరం! ఈ మాత్రం పనికే ఆచరాలు [illegible] పోవాలా! తాగి మత్తుగా పడి వుండడానికేమీ గాదు. రాస్తూ ఉత్తేజం కలగడానికి! ఎ లైన్ డ్రింక్ ఫార్ గుడ్ హెల్త్! ఫరవాలేదులే శేఖరం! పుచ్చుకో . . . .'

'అందులో మెక్కడానికి అనుభవ ముండాలి. నువ్వు అనుభవజ్ఞుడివి. కానివ్వు. నేను చూస్తూ కూర్చుంటాను' అన్నాను.

నా అనుమతి లభించడమే తడవుగా మురళి సోడా పైకెత్తి కొట్టి నిమిషాల్లో ఖాళీ చేసేశాడు. ఆ ప్లేటులోనుంచి జీడిపప్పు ముక్కలు, [illegible] నుంచి కొన్ని ఉంగరాలుండలు తీసి, [illegible] నాలుగైదు బిస్కెట్లు కరకరా నమిలి మ్రింగేశాడు. [illegible] అతడి కళ్ళల్లోనుంచి ఇప్పుడు ఉత్సాహం తొంగి చూస్తోంది.

'మారేం భయపడొద్దు శేఖరం! ఇది నన్నేం చెయ్యదులే! నా స్వాధీనంలో నే నుండగలను.'

తనను తాను నిగ్రహించుకోడానికి కష్టపడ్డట్టుగా అరచేతులతో ముఖాన్ని రుద్దుకుంటూ కొనసాగించాడు మురళి. 'ఎక్కడో చదివాను నేను. సామ్రాజ్య మనేది ఒక ఆశయం. కానీ తీరా సిద్ధించిన తరువాత మనిషిపాలిటి కది [illegible] లేకుండా చాలా చప్పగా వుంటుందట! ఇప్పుడు నా పరిస్థితి గూడా అలాగే ఉందేమో ననిపిస్తుంది. అలా అనిపించినప్పుడల్లా నా బుద్ధి నీళ్ళపైకి పోతుంది. నీకు జ్ఞాపకం ముందా శేఖరం! మనం చిన్నప్పుడు ఎన్నెన్నో ఘనకార్యాలు చేదామనుకున్నాం . . . .'

నా సందేహం నాది! ఏదు నిషా తలకెక్కి మాట్లాడ్డం లేదుగదా!

'కానీ దేనికైనా సమయం రావాలి. అదిప్పుడు వచ్చిందనుకో! ఓ పత్రిక పెడదామని నా ఆలోచన . . . .'

అర్ధరాత్రి దాకా చర్చించాం. సాహిత్యలోకంలో నేనున్న పత్రికలకు రూపకల్పన చేసి వుండడం ఆ సందర్భంలో నాకు ఉపకరించింది. త్రివర్ణచిత్రంతో అందమైన ముఖపత్రం. పచ్చపువ్వులాంటి కాగితం. వంద పుటలకు తగ్గని పరిమితి. సర్వతోముఖంగా వికసిస్తున్న మానవవిజ్ఞానాన్ని విశదీకరిస్తూ [illegible] వ్యాసాలిందులో వుండాలి. వాటి మధ్య మధ్య రెండు కథలూ, ఒక నాటిక తప్పని సరి! ఆణిముత్యాల లాంటి కవితలు కొన్ని అవశ్యం వుండవలసిందే! ఆ పత్రిక విభిన్న దృక్పథాలు కలిగిన మేధావుల కందరికీ చర్చావేదికగా వుండాలి. జిజ్ఞాసువులకు కరదీపికగా ఉపయుక్తం కావాలి. 'గ్లాడ్, గ్లాడ్' అంటూ నా సూచనలన్నిటిపైన ఆమోదముద్ర వేస్తూ వచ్చాడు మురళి. మంచి పేరు కుదరగానే ఆలస్యం, డిక్లరేషన్ కోసం వ్రాసి పారేస్తా నన్నాడు.

* * * *

నేను మద్రాసు వెళ్ళి వచ్చి పదారు రోజులైంది. వచ్చిన కొత్తలో కొన్ని ఉత్తరాలు వ్రాసి చూశాను. ప్రత్యుత్తరం లేదు. పరిస్థితులు అనుకూలించక పోవడం వల్ల సుభాషితాలకు మల్లే [illegible] గూడా [illegible] జీర్ణమైపోతాయేమో! మురళి పెట్టదలచుకున్న పత్రిక గతి గూడా అంతే అయి వుండవచ్చు.

కుటుంబ జీవితంలో ఏర్పడిన ఒడుదుడుకుల వల్ల ఆ విషయాన్నిగురించి అంతకుమించి ఆలోచించే అవకాశం నాకు లేకపోయింది. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళకు చేసిన అప్పులు [illegible] పెరుగుతూ వచ్చిన [illegible] కలిసి ఒక్కసారిగా నా పైన విరుచుకుపడ్డాయి. వాటి బారినుంచి బయట పడ్డంకోసం ఉన్న భూస్థితిలో సగానికి పైగా అమ్ముకోవలసి వచ్చింది. పోయింది పోగా మిగిలినప్పుడు పొలానికి [illegible] ఆధారం. అది ఉమ్మడి బావి. ఆ బావి క్రింద పెద్ద భాగం కలిగివున్న [illegible] పంపుసెట్టు బిగించుకోడంతో చిన్న కమతాల్లో గింజ [illegible] లేకపోయింది. అతడు పంపుసెట్టుతో [illegible] అవకాశం లేదు. అదేమిటని [illegible] అడిగితే [illegible] నిర్ణయించి, ఆ ధరకు [illegible] సరసమంటాడు. [illegible] కోర్టుకు [illegible] తప్పింది గాదు. [illegible] లేకపోవచ్చు. [illegible] [illegible] తన వైపుకు [illegible] [illegible] పత్రిక నా కంట పడింది. [illegible] మురళి [illegible] కనిపించక [illegible] పలుమార్లు [illegible] మాత్రం చూపులతో [illegible]!

'బాబూ! ఏం పత్రికమ్మా అది?' అంటూ చేయి చాచాను.

'ఇదా! ఇదొక [illegible]!' [illegible] నా వైపు [illegible] పత్రిక కను కాస్త తన లెదర్ బ్యాగులోకి చేరవేయజూశాడు.

కానీ అంత పని జరిగేలోగా నేను దాన్ని నా చేతిలో చిక్కించుకోగలిగాను.

ఆ పత్రిక నా చేతిలో వున్న ఒక్కొక్క క్షణంలోనూ, నేను ఒక్కొక్క అనుభూతికి లోనౌతూ వచ్చాను. పది క్షణాలు గడిచేసరికి భూతం అన్ని అనుభూతుల్నీ మింగేస్తూ భయం నన్ను ఆవహించింది. ప్రక్కన కూర్చున్న పడుచువాడు ఆ పత్రిక చేతిలో వుండగా అంత కంగారు పడిపోవడమెందుకో నాకు తెలిసి వచ్చింది. ఇప్పుడు నన్ను పట్టుకున్నది గూడా దాన్ని నేను చదువుతుండగా ఎవరైనా చూచిపోతారేమోనన్న జంకుగొంకులే! ఎక్కడలేనంత మైకంలో కళ్ళు తూలిపోవడం కోసం హిప్పీలనేవాళ్ళు అభిని మందు లాంటిదేదో సేవిస్తారట! వాళ్ళు ఇలాంటి రచనలు చదవడానికి అలవాటు పడి, ఇంతకంటే హాయిగా వుండడంకోసం ఆ మందును సేవిస్తూ వుండాలి. మనిషిలో మృగతత్వం ప్రవేశపెట్టడానికి ఇందులోని ఒక రచనే చాలు! మనసును కోతిగా మార్చడానికి ఒక బొమ్మ చాలు! సభ్యతని, సంస్కారాన్ని మైనస్ చేసి, మిగిలిన ప్రపంచమంతా కామలిప్సాపరిపూర్తికై అంకితం చేసేస్తే అప్పటి మానవ జగత్తు ఎలా వుంటుందనడానికి ప్రత్యేకంగా ఆలోచించ నక్కర్లేదు. దీన్నొకసారి చదివితే చాలు! గబుక్కున దాన్ని మూసేశాను. కానీ వాపసు చేయడానికి ముందుగా ఇంతటి మహత్కార్యానికి కారణభూతమైన ఉపజ్ఞ ఎవరిదో తెలుసుకోడం న్యాయమనిపించింది. అందుకోసం మళ్ళీ తెరిచాను. ఆ పేరు కనిపించగానే నిర్ఘాంతపోయాను. మురళి ఆలోచనకు కార్యరూపమా ఈ పత్రిక!

నేను కూర్చున్న బస్సు శరవేగంతో పరుగిడుతోంది. పైన పేర్కొన్న ఉదంతం జరిగిన తర్వాత అడుగడుగునా అదేదో ఘోర ప్రమాదానికి గురికానున్నట్లు నాకు కనిపించసాగింది. ఆ రోజు సురక్షితంగా గమ్యస్థానం చేరుకోడం నా మట్టుకు నాకొక మహాద్భుతమైన విషయంగా గోచరించింది. బస్‌స్టాండులో దిగగానే నేరుగా మొదలియారు బంకుకే దారి తీశాను. పట్టణంలో న్యూస్ ఏజంటుగా ప్రసిద్ధుడు మొదలియారు. ఎప్పటిలాగే నవ్వుతూ పలకరించాడు. 'ఏం పత్రిక కావాలండీ మేష్టరు గారూ!' అన్నాడు.

అప్పటికే చూపులతో ఆ బంకునంతా ఒక వరస గాలించివున్న నేను 'ఆ పత్రిక యిక్కడున్నట్లు లేదు' అన్నాను.

'పేరు చెప్పండి' అన్నాడు మొదలియారు.

చెప్పాను.

'పాపం వాళ్ళెవరోగానీ గాలండాడి అయిపోయిందిలెండి మేష్టరుగారూ! ఆ పేర కొని తెచ్చుకోడమెందుకని పారాడుగుతున్న పత్రికని బయట పెట్టలేదు. లోపలుంది. తెచ్చి పెట్టమంటారా?' అన్నాడు మొదలియారు.

'లోపలుంటే అది అమ్మకమవ్వ విధాయకం ఎట్లాగబ్బా' అంటూ ఆశ్చర్యం ప్రకటించాను.

'బాబూ! మీలాగ చపలుక్కర్లేదు. అన్నింటికన్నా ఎక్కువగా అమ్ముడుపోయేది అదే! మొదటి నెల వంద కాపీలే తెప్పించాను. రెండో నెల రెట్టింపు చేశాను. ఈ మాసం సర్క్యులేషన్ అయిదొందలు. . . .'

మొదలియారు మూలంగా తెలిసిన వర్తమానం వల్లనేమో నేను చెప్పను, ఉదయం నుంచి పరగడుపుతో వుండడం వల్ల గూడా కావచ్చు. నా కళ్ళెదుట యిళ్ళు, అంగళ్ళు, బస్సులు, లారీలు రంగులరాట్నంలా గిర్రున తిరుగుతున్నాయి.

'ఏమండీ మేష్టరుగారూ! దానికి మీరొక కథ రాయగూడదూ? బాగా డబ్బు వొస్తాయి గూడా!' అన్నాడు మొదలియారు.

'ఎంతిస్తారేమిటి?'

నమ్మడానికి వీల్లేనంత పెద్ద సంఖ్యే చెప్పాడు మొదలియారు.
తన కెలా తెలిసిందని అడిగాను. దానికి సంబంధించిన ప్రకటన అందులోనే వుందట!

'వ్రాయొచ్చు, వ్రాస్తాను' అని చెప్పకుండా నేను గుడ్లు మిటకరించడం మొదలియారుకు నచ్చలేదు. 'ఐనా మీకు డబ్బుకు కొదవలేదేమో! మీ కెందుకు రాస్తారు లెండి!' అంటూ అతడు నిష్ఠూరంగా ఓ చురక తగిలించాడు.

నాకా! నాకు డబ్బుకు కొదవ లేదా! నా కిప్పుడు కావలసివున్నదే అది. ఇప్పుడొక అయిదు రూపాయలుంటే ఆసుపత్రిలో వున్న మా అమ్మకు ఆవిడ కోరినన్ని పళ్ళు కొనిపెట్టగలను. పది రూపాయలు దొరికితే చంటి పాపకు పాలడబ్బా కొనుక్కుపోగలను. పాతిక రూపాయలుంటే చెడిపోయిన వాచి రిపేరు చేయించుకోగలను. యాభై రూపాయలు లభ్యమైతే ఓ చీర తీసుకెళ్ళి పండగకు పుట్టింటికి వచ్చివున్న మా దొడ్డచెల్లెల్ని అత్తగారింటికి తరలించగలను. ఈ అవసరాలన్నింటికీ సరిపోయి, ఇంకా నాలుగు రూకలు చేతిలో మిగిలే అవకాశం ఒకటి కళ్ళముందర కనబడుతుండగా దాన్ని నేనెందుకు వదులుకోవాలి? పేరెందుకు, కూడబెట్టుకోడానికా? నీతెందుకు, జాడీలో పాతరవేసి ఊరగాయ పెట్టుకోడానికా? మంచి చెడ్డల విచక్షణ చేస్తూ కూచోడమెందుకు, మంచి ముహూర్తాలు కాస్తా దాటిపోవడానికా? మొహమాటాలెందుకు? 'బహుభంగుల విత్తమే మాకు మేలు!' చేస్తున్న పనికి వెనుకనున్న రీతినీ, నీతినీబట్టి కాకుండా, ఆ పని మూలంగా గడించగలుగుతున్న రూపాయల మొత్తాన్నిబట్టి మాత్రమే మనిషికి విలువ లెక్కగట్టబడుతున్న సమాజంలో ఆదర్శాలను వల్లిస్తూ కూచోడం అవివేకం. కాకపోతే ఇతడు, ఈ మొదలియారు లాభసాటి పనులు చేయడం నీచేతనేమవుతుందని నన్ను ఈసడిస్తాడా? నేనతడి మాటను సవాలుగానే స్వీకరించ దలచుకున్నాను.

ఆసుపత్రి ఆవరణలో ఒక వేప చెట్టుంది. నీడ కదిలికనుబట్టి వేపచెట్టు క్రింద తావు మార్చుకుంటూ సాయంకాలమయ్యేసరికి ఇరవై పుల్‌స్కేపు పేజీల నిండుకూ ఆ రచనను దట్టించేశాను. 'కాచుకోరా మురళీ! మాదక్రోద్ దేవుడికి యిదిగో గోదర్బేద్ పత్రి' అనుకున్నాను.

ప్రయాణాన్ని గురించి మళ్ళీ ఏకరువు పెట్టను. ఎలా వెళ్ళానో అలాగే వెళ్ళాను. ఎక్కడ దిగాలో అక్కడే దిగాను. ఇంటికి మాత్రం వెళ్ళలేదు. కార్యాలయంలోనే మురళిని సంధించాను.

నన్ను చూడగానే మురళిలో ఎందుకో తొట్రుపాటు కనిపించింది. 'ఇదేమిటోయ్ శేఖరం! ఎప్పుడు రావడం? ఇంటికి వెళ్ళలేక పోయావా? ఇక్కడి కెందుకొచ్చావురా బాబూ!' అన్నాడు.

'వచ్చిన పని చెబుతానుగానీ, ముందు నువ్వు కూచో! తరువాత నన్ను కూచోనివ్వు' అన్నాను.

కుశల ప్రశ్నలు ముగిశాక ఏవో కబుర్లు మొదలెట్టబోయాడు మురళి. వాటిని వినే ఆసక్తి .. కెక్కడిది? సూటిగా అసలు విషయంలోకి చొచ్చుకు రాదలచుకుని, 'మరైతే నువ్వు చేస్తున్న పనిని గురించి నాకొక మాట వ్రాసివుంటే నీదేం పోయింది మురళీ! అందులో పాలుపంచుకోడానికి నేను బొత్తిగా తగనని అభిప్రాయం?' అన్నాను.

మురళి గబాలున లేచి నిల్చున్నాడు. నా చేతులు రెండింటినీ తన చేతుల్లోకి తీసుకుంటూ 'అంత మాటనకురా శేఖరం! నిన్నిందులో పాలు పంచుకోమని నేనెలా అడగగల్గుతాను? నువ్వు దీనికి రాయవు. ఒకవేళ రాశావుపో, నేను వేసుకుంటానా? నేను తింటున్నది గడ్డికాదే! ఎంత చెడినా నాలో నరవాసనలింకా మిగిలే వున్నాయిరా బాబూ!' అన్నాడు.

నాకు ఏడుపొచ్చినంత పనయింది! ... అంతట నేను నా గుండెల బరువును వదిలించుకోవాలనుకున్నాను. దించుకుంటాను బాబో అని మొత్తుకున్నాను. బాల్యమిత్రుడే వినిపించుకోలేదు. ఇంక నా మొర వినిపించుకునే నాథుడెవరు? కొందరి కొందరి జన్మరాత ఇంతేనేమో!

అర్చన

శ్రీ నూతలపాటి గంగాధరం

మళ్ళీ నీ చెంతకు రావాలనుకున్నాను
మరపురాని–మరచిపోలేనివిధంగా
మధురమోహనంగా అలంకరించుకుని
మళ్ళీ నీ చెంతకు రావాలనుకున్నాను.

నవవధువులా, సరసుని చదువులా
మంచులో తడిసిన మల్లెలా
ప్రజోపయోగకరమైన ముల్లెలా
కరకుదేలిన వరిపైరులా
కొండకోననుంచి జారే సెలయేరులా
హరివిల్లులా, విరిజల్లులా
రసగీతంలా, మధుర సంగీతంలా
హృద్యంగా అనవద్యంగా
అనితరసాధ్యంగా
అలంకరించుకుని నీ చెంతకు రావాలని
వీధిలో అడుగుపెట్టానో లేదో—

తల్లిలేనిపిల్ల ఏడుపూ,
చెమటనుంచి లేచిన నిప్పులగాడుపూ,
ఈడొచ్చినా, తోడుకరవైన
వయసుపిల్ల నిట్టూరుపూ,
ఆడపిల్లల తండ్రి కడుపుచెరువూ,
దగాపడ్డ చెల్లెమ్మల గుండెబరువూ,
ప్రశ్నార్థకపు గుర్తులై అడ్డునిలిచాయి
భరించలేని బాధలై గుండె తొలిచాయి.
గుండె నిబ్బరం చేసుకుని
మరో అడుగు ముందుకు వేశానా—

నిలువెల్లా దుమ్ములో తడిసినవాళ్ళూ,
నిప్పులదారిని చూచి జడిసినవాళ్ళూ,

కాలిన కడుపును కన్నీటితో నింపడానికి
వృధాప్రయత్నం చేసేవాళ్ళూ,
ఆయుష్షంతా అనారోగ్యసర్పానికి ఆహుతిచేసి
అకాలమృత్యువుకోసం ఎదురుచూచేవాళ్ళూ
బాధల కూడలిలో నిరాశావేదికమీద నిలచి
నిస్తేజంగా దిక్కులు చూచేవాళ్ళూ,
పడ్డవాళ్ళూ, చెడ్డవాళ్ళూ,
చెరచబడ్డవాళ్ళూ,
పడి లేవలేని వాళ్ళూ,
స్నేహంకోసం చాచిన—చేతులు కాల్చుకున్నవాళ్ళూ,
అందరూ నా కళ్ళముందు ప్రత్యక్షమయ్యారు
నా కాళ్ళకు బంధాలు వేశారు
వీళ్ళేనా నరులు—నా సహచరులు?
వీళ్ళేనా నా దేశవాసులు?

నన్ను నేనొకసారి చూసుకున్నాను
సిగ్గుతో చచ్చిపోయాను
నా అలంకారాలన్నీ బరువైపోయాయి.
భగవాన్ ! నన్ను క్షమించు.
వీళ్ళని వదలి ఇలా అలంకరించుకుని
ఒంటరిగా నీ చెంతకు రాలేను
వీళ్ళతోపాటే నేనూ !
వీళ్ళందరూ నీ అర్చనకువచ్చే
శుభఘడియ ఎప్పుడు వస్తుందో
అప్పుడే నేనూ వస్తాను—వీళ్ళతోపాటు !
అంతవరకు వీళ్ళసేవే — అర్చన !
వీళ్ళ పాదధూళే నాకు అలంకారం !

వచన పద్యం : ఆభాస లక్షణ నిరాకరణం

శ్రీ చేకూరి రామారావు

ఇటీవల వస్తున్న ఒకరకం కవితా స్వరూపానికి వచనకవిత, వచనపద్యం ఇత్యాదిగా చాలా పేర్లు వాడుకలో ఉన్నై. ఈ పేర్లను గురించి శ్రీయుతులు సంపత్కుమార (1968), నరసింహారెడ్డి (1968) విశేషమైన చర్చ చేశారు. శ్రీ నరసింహారెడ్డి వచనకవిత అనే పేరును సంపత్కుమార వచనపద్యం అనే పేరును ఎన్నికచేశారు. శ్రీ నరసింహారెడ్డి (1968) మొత్తం 15 పేర్లను పేర్కొన్నారు. వీటిని రెండు గ్రూపులుగా విభజించవచ్చు. మొదటితరగతి వచన అనే పూర్వపదంతో ఉన్న సమస్తపదాలు. అవి: 1. వచనకవిత, 2. వచనపద్యం, 3. వచనగేయం, 4 వచనగీతం. ఇతరమైనవి రెండోతరగతి. అవి ముక్తచ్ఛందం (శ్రీ సోమసుందర్) స్వచ్ఛంద కవిత్వం (శ్రీ వరవరరావు) మొదలైనవి. వీటిలో మొదటిరకపు పేర్లే ఎక్కువ ప్రచారంలో ఉన్నై. మొదటి తరగతిలో ఉన్న నాలుగు పేర్లమధ్యా చెప్పుకోదగిన భేదం లేదు. పద్యం, గేయం, గీతం అనేవి కవిత్వానికి పర్యాయపదాలుగానే ఈ పేర్లలో ప్రయుక్తమయినై. వచనగేయం, వచనగీతం అని శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు, శ్రీ కుందుర్తి ఆంజనేయులు వాడారు. వచన పద్యం అనే పేరు మొదట శ్రీ పట్టాభిరామరెడ్డి (పఠాభి), తరువాత శ్రీ సంపత్కుమార వాడారు. వచనకవిత అనే పేరు శ్రీయుతులు కుందుర్తి ఆంజనేయులు, కే.వి. రమణారెడ్డి, కోవెల సుప్రసన్నాచార్య మొదలైనవారు వాడుతున్నారు. ఈ పేరే ఎక్కువ ప్రచారంలో ఉన్నట్టు శ్రీయుతులు సంపత్కుమార (1968), నరసింహారెడ్డి (1968) ఇద్దరూ పేర్కొన్నారు. ఫ్రీవర్సు ఫ్రంటువారుకూడా ఈ పేరే ఎన్నికచేశారు. (శ్రీ ఆంజనేయులు శ్రీ గోపాలచక్రవర్తి 1967) అయినప్పటికీ ఈ వ్యాసంలో—వచన కవిత అనే పేరు అప్పుడప్పుడు వాడినా—వచనపద్యం అనే పేరే స్వీకరిస్తున్నాను. దానికి కారణాలివి: 1. పద్యం అనే పేరు Verse కు సమానార్థకంగా తెలుగులో వాడుతున్నారు. 2. వృత్తాలు, జాతులు, ఉపజాతులు, రగడలు—ఇవన్నీ పద్యాలుగానే ప్రాచీనులు పరిగణించారు. 3. శ్రీ సంపత్కుమార ఒక్కరే ఈ కవితా స్వరూపానికి లక్షణాలు చెప్పడానికి సీరియస్‌గా ప్రయత్నించారు. ఆయన అభిప్రాయాల్నే ప్రధానంగా, పరామర్శకంగా ప్రస్తావించదల్చుకున్నాను గనుక ఆయనకు నచ్చినపేరే గ్రహించదల్చుకున్నాను.

అసలు లక్షణాలను పరామర్శించబోయేముందు అపోహలు కలక్కుండా ఉండడానికి ఒక విషయం స్పష్టంగా చెప్పాల్సి ఉంది. శ్రీ నరసింహశాస్త్రి (1971 ఇటీవల భారతిలో—వచనకవిత—అభిమానుల అత్యుక్తులు—అనే పేరుతో ఒకవ్యాసం రాశారు. అందులో ఆయన వచనపద్య స్వరూపాన్నే కాక, అందులో వస్తున్న కవిత్వాన్ని గూడ వ్యతిరేకిస్తున్నట్టు తెలుస్తుంది. వచనపద్య తత్త్వ పరిశీలన అక్కడ శుష్కంగా జరగలేదు. ప్రాచీన ఛందఃపద్ధతిని సమర్థించటమూ, ఆధునిక పద్ధతిని వ్యతిరేకించడమూ ఆయన అక్కడ పెట్టుకున్న ప్రధాన లక్ష్యాలుగా కనిపిస్తున్నై. నాకు వచనపద్యస్వరూపం మీదగాని, ఆ రూపంతో వస్తున్న కవిత్వం మీదగాని వ్యతిరేకత లేదు. కవిత్వం ఏ తొడుగు వేసుకున్నా నా కభ్యంతరంలేదు. ఒక్కొక్క తొడుక్కి ఒక్కొక్క ప్రయోజనం ఉండవచ్చు. ఆ ప్రయోజనాల్లో ఒకానొకటి నాకు నచ్చవచ్చు. అదివేరే విషయం. ప్రస్తుత పరిశీలన ఛందస్స్వరూపానికి మాత్రమే పరిమితం.

ఈ వ్యాసంలో నేను ప్రస్తావించని విషయాలు చాలా ఉన్నై. వచన పద్యం చారిత్రక పరిణామాల్ని గురించి విమర్శకుల్లో చాలా అభిప్రాయాలున్నై. కొందరు దీనికి సమాజ పరిణామంతో ఉన్న సంబంధాన్ని నిరూపించడానికి ప్రయత్నించారు. దాన్ని గురించి ఈ వ్యాసంలో ప్రస్తావించను.

వచనగేయం ఒక ఉద్యమమని శ్రీ కుందుర్తి ఆంజనేయులు (నవత—2) ప్రకటించారు. ఈ విషయంలో నేను శ్రీ రమణారెడ్డి (1967)తో ఏకీభవిస్తాను. అయినా అందుకు కారణాలు ఈ వ్యాసంలో ప్రస్తావించబడవు.

వచనపద్యంలో కథా కావ్యాలు రావాలని శ్రీయుతులు కుందుర్తి ఆంజనేయులు, శీలా వీర్రాజు, కోవెల సుప్రసన్నాచార్యులువంటివారు అభిప్రాయపడ్డారు. దే. శే. బాలగంగాధరతిలక్ ఇందుకువ్యతిరేకులు. ఈవిషయంలో నాది అలీన విధానం.

ఈ వ్యాసంలో నేను చెయ్యదల్చుకున్నది వచన పద్యాని లక్షణాలుగా చెప్పబడుతున్న వాటిని పరామర్శించటమే. ఈ లక్షణాలు కేవల ఆభాసమాత్రాలేనని, అవి శాస్త్రచర్చకు నిల్వవని నా అభిప్రాయం. అందుకే వాటిని నిరాకరిస్తున్నాను. అది హేతుబద్ధంగా చెయ్యటమే ఈ వ్యాసంలో నేను చేసిన ప్రయత్నం.

వచనపద్యం తత్త్వాన్ని గురించి, చరిత్రను గురించి ఇటీవల (అంటే దాదాపు ఒక దశాబ్ది కాలం) భారతి, ఆంధ్రపత్రిక, నవత, సృజన, జనధర్మ వంటి పత్రికల్లో విశేషమైన చర్చజరిగింది. వాటిల్లో శ్రీయుతులు కుందుర్తి ఆంజనేయులు, కె.వి.రమణారెడ్డి, దేవరకొండ బాలగంగాధరతిలక్, శ్రీపాద గోపాలకృష్ణమూర్తి, కోవెల సంపత్కుమార, కోవెల సుప్రసన్నాచారి, వే. నరసింహారెడ్డి, అద్దేపల్లి రామమోహనరావు, పెండ్యాలవరవరరావు, వేగుంట మోహనప్రసాద్, ఆవంత్స సోమసుందర్, టి.ఎల్.కాంతారావు, అరిపిరాల విశ్వం—ఇంకా అనేకులు పాల్గొన్నారు. వీటిలో కొన్నిటిని వచనకవిత అనే పేరుతో ఫ్రీవర్సు ఫ్రంటువారు శ్రీ కుందుర్తి ఆంజనేయులు, శ్రీ గోపాలచక్రవర్తి (1967) సంపాదకత్వాన ఒక సంకలనం చేశారు. (వీటన్నిటికీ కలిపి ఒక bibliography తయారు చేద్దామని కొంతకాలం క్రింద ప్రారంభించి ఒక card index తయారు చేశాను. కాని ఇతర వ్యాపకాల్లో ఆ పని కుదరక మధ్యలో వదిలేశాను. ఈ ప్రయత్నాన్ని కొనసాగించదల్చుకున్న ఉత్సాహవంతులకు నా దగ్గరున్న కార్డుల్ని అప్పగించగలను).

వచన పద్యం చాలామంది రచయితల దృష్టిని ఆకర్షించింది. కొత్తకవులు దాదాపు అంతా వచనపద్యాల్లోనే రాస్తున్నారు. అంతేకాదు. పాతకాలపుకవులు కూడా ఈ పద్ధతిలో రాయడానికి ప్రయత్నించారు (చూ. శ్రీ భాగవతుల శంకర శాస్త్రి (ఆరుద్ర) రాసిన సినీవాలికి కాటూరి వెంకటేశ్వరరావుగారి పీఠిక) ప్రధానంగా కథలూ, నవలలూ రాసే రచయితలు వచనపద్యంద్వారా కవులైనవారున్నారు.

(స్పందన సాహితివారు 1969 లో ప్రచురించిన స్పందన అనే సంకలనంలో శ్రీమతి వాసిరెడ్డి సీతాదేవి రచించిన అన్వేషణ అనే ఖండిక ఉంది. శ్రీ పోతుకూచి సాంబశివరావు వచనపద్యాలు రాసినిరా అనే పేరుతో 1963 లో ప్రచురితమయినై.) ఆలిండియారేడియో యువవాణి కార్యక్రమాల్లో కుర్రవాళ్ళు ఆవేశంతో వచన పద్యాలే చదువుతున్నారు. ఎన్నికల ప్రచార కరపత్రాల్లోకి కూడా ... వచనపద్యం వ్యాపించింది. ఒక ఏడాది కిందట జరిగిన పార్లమెంటు ఎన్నికలకు పోటీచేసిన శ్రీ పి. వి. రంగారావు వేసిన వచనపద్య కరపత్రం నా దగ్గర ఇంకా భద్రంగానే ఉంది.

ఇంతగా ప్రచారంలో ఉన్న కవితాప్రక్రియనుగురించిన చర్చకూడా ఇంత విస్తారంగానే జరిగింది. చాలామంది వచనపద్యం అంటే ఏమిటో చెప్పకుండానే దాని మీద పెద్ద పెద్ద వ్యాసాలురాశారు. కొంతమంది వచనకవిత్వాన్ని గురించి కవితామయ నిర్వచనాలిచ్చారు. కవిత్వాన్ని గురించి కవిత్వంలో చెప్పితే అది లక్షణంకాదు. స్పష్టంగా, శాస్త్రపరిభాషలో హేతుబద్ధంగా దానిలక్షణం చెప్పాలి. (అట్లాంటి ప్రయత్నం చేసింది నాకు తెలిసినంతమటుకు ఒక్క శ్రీ కోవెల సంపత్కుమార మాత్రమే. ఆయన లక్షణాల్ని నేను నిరాకరించటం, ఆయన ప్రయత్నాన్ని కించపరచటంగా అర్థం చేసుకోకూడదు.) నేను ఆరోపణలను నిరాధారంగా చెయ్యటం లేదు. మచ్చుకు ఈ వ్యాక్యాలు గమనించండి.

'వచన గీతానికి ప్రాణప్రదమైన లక్షణం గమన వైవిధ్యం. ఇది సంభాషణలోని యాసలూ, కాకువులూ, ఉచ్చారణవిశేషాల మీద ఆధారపడి ఉంటుంది.

— శ్రీరంగం శ్రీనివాసరావు (1939)

'వచన గేయం సమాజాన్ని గురించి సూటిగా చెపుతుంది. సమాజం ఎవరికీ తెలుగా విరుచుకుపడుతుంది. సమాజంలో అనేకమందికి అర్థమవుతుంది. ప్రజాస్వామ్యాన్ని పటిష్ఠం చేస్తూ ప్రజాహృదయాల్లోని విప్లవ దృక్పథాన్ని విశదపరిచి సంపూర్ణ సామాజిక వికాసానికి దోహదం చేస్తుంది.'

—అద్దేపల్లి రామమోహనరావు (1969)

ఇట్లాంటి వాక్యాలు చాలా వ్యాసాల నుంచి చూపించవచ్చు. చాలామంది వచనపద్యం ఎలాపుట్టిందో, ఎప్పుడు పుట్టిందో, ఏం చెయ్యగలదో చర్చించారేగాని దానిలక్షణాలేమిటో ఎవరూ చెప్పరు. వచనపద్య ప్రవక్తలు, సిద్ధాంతకర్తలుగా పత్రికల్లో కనిపిస్తున్న శ్రీయుతులు కుందుర్తి ఆంజనేయులు, అరిపిరాల విశ్వం, అద్దేపల్లి రామమోహనరావు, కోవెల సుప్రసన్నాచారి, టి.ఎల్.కాంతారావు— మొదలైనవారంతా వచనపద్యం మీద పెద్ద పెద్ద వ్యాసాలు రాసినవారే. కాని వారి వ్యాసాల్లో వచనపద్యాలను గురించిన పొగడ్తలు తప్ప శాస్త్రసంక్షిప్తత అసలు కనపడదు. అయినా అక్కడక్కడ కొన్ని అభాస లక్షణాలు ప్రస్తావన కనిపిస్తుంది. వాటిని ఒక్కటొక్కటే పరామర్శించి ఖండిస్తాను.

తూగు, విసురు, ఊపు, విరుపు, లయ, భావలయ, అంతర్లయ, అంతర్నాదం, భావగణాలు లక్షణాలుగా కొందరు ప్రతిపాదించారు. వీటిలో తూగు, విసురు, వూపు, విరుపు, అనే వాటిని ఒక గణంగానూ, లయ, భావలయ అంతర్లయ, అంతర్నాదం, భావగణాలు అనేవాటిని ఇంకో గణంగానూ వేరుచేసి పరిశీలిస్తాను. ముందుగా ఈ ప్రవచనాలను పరిశీలించండి.

'వచన గేయానికి మొట్టమొదటి లక్షణం నిరాడంబరత.... వచన గేయాన్ని కుంటుపడనీయకుండా ఆద్యంతం చదివేటట్లు చేయగల సొగసు, విసురు అలవరచటం ఛందోబద్ధమైన పద్యరచన కంటే కష్టమైనపని..... వచన గేయంలో ఒక్క ఉపమానాల విషయంలోనేకాదు, ఇతర సందర్భాల్లో కూడా యీ విసురు ఒక ముఖ్యలక్షణంగా ప్రతిపాదిస్తున్నాను.

ఆంజనేయులు (1958)

వచన గేయానికి ఒక స్థిరత్వం, ఒక స్థిమితత్వం ఏర్పడాలంటే పంక్తి నిర్మాణం లో ఒక తూగు కూడా అవసరం ఆంజనేయులు (1967)

వదిలేసిన ఛందస్సు యొక్క effects మరో రూపంలో సాధించబడుతున్నవి. ఆధునిక వచన గేయాల్లో విరుపూ, విసురూ, ధోరణీ, పలుకుబడీ ఇందుకే పుట్టినవి. ఆంజనేయులు (1965)

మాత్రా ఛందస్సు వల్లా, కావ్యభాషాగుణంవల్లా వచ్చిన పూపూ విసురూ తెలుగునుడికారపు సొంపువల్ల తేవాలనే ప్రయత్నం వచన గేయంగా రూపొందింది. ఆంజనేయులు (1969)


ఇన్ని చోట్ల ఇన్ని విధాలుగా శ్రీ కుందుర్తి ఆంజనేయులు ప్రతిపాదించిన వూపు, విసురు, తూగు అనేవాటిని గుర్తు పట్టటానికి తగిన సాధనాలులేవు. వీటిని పారిభాషిక పదాలుగా ఉద్దేశించినట్లు కూడా నాకు తోచటంలేదు. వ్యక్తపదత్వం విరుపుఅయితే ఏ పద్యాల్లోనయినా ఉండవచ్చు. అది కవిశైలికి సంబంధించిన విషయం. భావోద్వేగం విసురయితే అది ఛందస్సుతో సంబంధంలేకుండా కవిత్వానికి ఉండే లక్షణం. ఈ వూపు ఏమిటో నాకు తెలీదు. ఇదీ విసురూ ఒకటేనేమో? సమభారత్వాన్ని తూగు అంటారు. ఇందుకు శ్రీనాథుడి సీసపద్యాన్ని ఉదాహరణగా సాహిత్య విమర్శకులు చూపిస్తుంటారు. సమభారత్వం ... ప్రాణం ... గణాల ప్రయోగం వల్లనే సాధ్యం. అట్లాంటి గణనియమం లేని వచన పద్యాల్లో తూగు ఎట్లా ఉంటుంది? ఒకవేళఉన్నా అది మాత్రాపద్యాలవుతాయి గాని వచన పద్యాలుకావు. ఒక వస్తువుకు కొన్ని లక్షణాల్ని ప్రతిపాదించేటప్పుడు ఆ లక్షణాల్ని తెలిపే మాటలకు అర్థం చేసుకోదగిన వివరణ ఇయ్యటం లక్షణకారుడి కనీసధర్మం. అట్లాంటి ధర్మాన్ని వచనపద్యసిద్ధాంతకర్తలు పాటించకపోవటం మన దురదృష్టం. ఆ లక్షణాల్ని గురించి వారికే స్పష్టమైన అవగాహన లేదని తీర్మానించుకోవాల్సి ఉంటుంది. శ్రీ కుందుర్తి ఆంజనేయులు తాను ప్రతిపాదించిన విసురుకు ఉదాహరణగా శ్రీ గోపాలచక్రవర్తి రాసిన ఈ పాదాలను ఉదాహరించారు.

ఆకసం నిండా మేఘాలు
ప్రేలాడు ఏన్గుల వలె
దేవ వేశ్య ఊర్వశి శిరోజాలవలె
ఉన్మత్త మనో వల్మీకంలో
ఊర్ధ్వంగా ప్రసరించే వేడివేడి తలపులవలె,

మహిషాసురుని ... సాలవలె
అనభ్యుదయ వాది ఆలోచనవలె

పై పాదాల్లో నాక్కనిపించిన గుణం ఒక ఉపమేయానికి అనేక ఉపమానాలు వాడటం. ఇది మాలోపమ అవుతుంది. ఇదే విసురుఅని శ్రీ ఆంజనేయులు ఉద్దేశమా? ఇది వచనపద్యానికి మాత్రమే ఎందుకుపరిమితం? ఛందస్స్వరూపానికీ ఉపమాన బాహుళ్యానికీ ఉన్న అవినాభావ సంబంధమేమిటి? ఇంత అస్పష్టమైన అసమర్థమైన ప్రతిపాదనలు చెయ్యటానికి కారణం కవులైన వాళ్ళు సిద్ధాంతకర్తలుగూడా కావాలన్న ఉబలాటమే.

ఇక రెండోవర్గ లక్షణాలు. మొదటివర్గాన్ని శ్రీ కుందుర్తి ఆంజనేయులు గాని, ఆయన అనుయాయులుగాని పరిభాషగా ఉద్దేశించారని చెప్పలేం. సీరియస్‌గా


G
E F

చర్చించదగిన విలువ నిజానికి ప్రతిపాదనకు లేదు. కాని రెండో వర్గంలో లయ, అంతర్లయ, భావలయ, అంతర్నాదం, భావగణాలు అనే మాటలు పరిభాషగా ఉద్దేశించినట్లు కనిపిస్తున్నవి. కొన్ని పదాలకు ఇవన్నీ సమానార్థకాలుగా కనిపిస్తున్నై. కాని అంతర్లయ—అంతర్నాదం వేరు వేరని శ్రీ మాదిరాజు రంగారావు (1969) ఉద్దేశించినట్లు ఈ క్రింది వాక్యాలవల్ల తెలుస్తున్నది.

అనుభూతి ప్రమాణంతో, ఆవేశపు పొంగులో సంయోగతను బట్టి, శబ్ద సంయోజనమూ, వాక్యరీతి, భావవిన్యాసమూ, రూపొందిన రచన ఇది. ఇందులో ఏ సందర్భాన్నీ ఉద్దేశించలేము. అంతర్లయ కన్నా అంతర్నాదం అనుభవానికి వచ్చేప్పుడు కవితగా భావిస్తాను.—రంగారావు (1969) యుగ సంకేతం, పీఠికలో

అంతర్నాదమంటే ఏమిటో శ్రీ రంగారావు చెప్పలేదు. అంతర్లయ ఏమిటో వివరాలు చెప్పలేదు. ఇక ఈ రెంటికీ తేడా తెలుసుకునే మార్గమేమిటి?

లయ, అంతర్లయ, భావలయ అనే మాటల్ని దాదాపు ఒకే అర్థంలో రచయితలు వాడుతున్నట్లు కనిపిస్తున్నది. శ్రీ సి. నారాయణరెడ్డి (1967) తన సిద్ధాంత గ్రంథంలో ఇలా అంటున్నారు.

'వచనగేయమునకు లయ ముఖ్యము. ఈ లయ గణములచే కూర్పబడుటచే ఉత్పన్నము కాదు. ఒకానొక క్రమములో, విరామములో, పదములను గుప్పించుట వలన ఈ లయ ఏర్పడును. ఏ నియమమును పాటించక కేవల వచనమును లయాత్మకముగా మార్చినచో అది వచన గేయమగును.

'పాఠకునిలో భావోద్వేగమును కలిగించు అంతర్లయ దీని ప్రధాన లక్ష్యము. దీనిలో కేవలము అంత్యప్రాసలు, సంస్కరించు శబ్దలయ ఆనుషంగికమైనది. దీనికి అతీతమైన భావలయ ముఖ్యమైనది. భావలయ యనగా భావములో దాగియుండు అంతర్లయ.' —నారాయణరెడ్డి 1967)

శ్రీ నారాయణరెడ్డి ప్రకారం వచన పద్యానికి లయ ముఖ్యలక్షణం. ఈ లయ ఒకానొక (?) క్రమంలో, విరామంతో పదాల్ని గుప్పించటం వల్ల వస్తుంది. ఒకానొకటంటే ఎటువంటి? మళ్ళీ మొదటికే వచ్చాం. క్రమం, విరామం అర్థం అయితే కాని ఈ లయ అర్థంకాదు. అదే సందర్భంలో ఇంకో చోట భావలయ ముఖ్యమంటున్నారు. భావలయ అంటే ఏమిటి? భావంలో దాగియుండే అంతర్లయ. అది తెలిస్తేగదా ఇది తెలియటానికి. [illegible].

పై వాక్యాల్లో శ్రీ నారాయణరెడ్డి కొత్తగా చెప్పిందేమీలేదు. శ్రీ కుందుర్తి ఆంజనేయులు, శ్రీ అరిపిరాల విశ్వం మొదట్లోనే చెప్పిందాన్ని rephrase చేశారు. వాళ్ళ ప్రతిపాదనలెంత అస్పష్టంగా ఉన్నవో ఇదీ అంతే.

ఈ భావలయను శ్రీ అరిపిరాల విశ్వం ప్రతిపాదించినట్లు శ్రీ కుందుర్తి ఆంజనేయులు ఉపోద్ఘాతంగా రాసిన ఈ వాక్యాలవల్ల తెలుస్తున్నది.

'ఈ మార్గం (వచన కవితామార్గం—నేను) ప్రాత్తగా ప్రవర్తించటానికి మిత్రులు డా. అరిపిరాల విశ్వంగారు స్థాపించిన భావలయ సిద్ధాంతము, శ్రీ కోవెల సంపత్కుమారాచార్య ప్రతిపాదించిన ప్రాసాని సిద్ధాంతము బాగా ఉపయోగపడే సాధనాలు. —ఆంజనేయులు 1967a)

శ్రీ విశ్వం కృష్ణాపత్రిక 1961 జనవరి 7, 14, సంచికల్లో 'ప్రాచీనాలంకారికుల ధ్వనీ, ఆధునిక వచన కవిత్వంలో భావలయకూ గల సామ్య వైషమ్యాలు' అనే పేరుతో ఒక వ్యాసాన్ని ప్రకటించారు. ఆ వ్యాసంలో ఒక్కొక్కటి పద్యాలను ఉదాహరించి ఇందులో భావలయ ఉంది చూడమంటారే కాని అదేమిటో చెప్పలేదు. దాదాపు వచనకవిత్వానికి లక్షణాలను ప్రతిపాదించిన వాళ్ళందరూ ఇదే పనిచేశారు. (ఒక్క శ్రీ సంపత్కుమారాచార్య ఇందుకు అపవాదం). లయనుగురించి శ్రీ కుందుర్తి ఆంజనేయులు (1967b) ఇట్లా అంటున్నారు.

'శబ్దానికిగాని, భావానికిగాని ఆనాటి పద్యాలలోని లయ వచనపు లయ. వచనగేయంలోని లయ కవిత్వపు లయ. ఈ రెంటి మధ్యగల పరిధి కేవలం బుద్ధికి మాత్రమే తోచే స్వభావం కలిగి చాలా సున్నితంగా ఉంటుంది...... వచన గేయమైనా విశృంఖల విహారం చేయరాదని, దాని నడకలోనూ ఒక(!) లయ, పంక్తిలో ఒక నిర్మాణ పద్ధతి ఉండాలని సారాంశం' —ఆంజనేయులు (1967b)

వచన పద్య సిద్ధాంతకర్తల 'ఒక' శబ్ద ప్రయోగం విశేషమైనది. తెలుగులో 'ఒక' శబ్దానికి రెండు రకాల ప్రయోగాలున్నై. ఒకటి, నిర్దిష్ట సంఖ్యావాచకం (Enumerative). ఉదా: ఒక కిలో పంచదార మూడు రూపాయలు. రెండో ప్రయోగం అనిర్దిష్టార్థకం (Indefinitive) సూచించటం. దీనికి ఉదాహరణలు వచనపద్యసిద్ధాంతకర్తల వ్యాసాలనిండా దొరుకుతై. ఈ రెండో అర్థంలో 'ఒక' శబ్దాన్ని 'ఏదో' శబ్ద పర్యాయమై 'ఏదో ఒక' అనే విధంగా కూడా ప్రయోగించబడుతుంది. శ్రీ కుందుర్తి ఆంజనేయులు ప్రయోగించిన 'ఒక తూగు' 'ఒక లయ' ఇట్లాంటివి. సిద్ధాంత విషయాల్లో రచయితలకు స్పష్టమైన అవగాహన లేనప్పుడు ఈ ప్రయోగం పెరుగుతుంది.

పైన ఒకలయ అంటే ఎట్లాంటి లయో తెలియదు. పైగా అది కవిత్వపు లయ అట! అదెట్లా ఉంటుందో స్పష్టంగా ఎవరూ చెప్పరు. దాన్ని నిర్వచించటం కష్టమని శ్రీ ఆంజనేయులు అభిప్రాయంలాగా కనపడుతున్నది.

వచన పద్యంలో శబ్దలయను కొందరు అంత ప్రధానంగా పరిగణిస్తున్నట్లు లేదు. శబ్దలయ అనేటప్పటికి మళ్ళీ మాత్రా ఛందస్సు అవుతుందేమోనని వీరి భయం. శ్రీ శ్రీరంగం శ్రీనివాసరావు రాసిన 'కవితా ఓ కవితా'ను ఇందుకను కొందరు వచన పద్యంగా గుర్తించకపోవటానికి ఇదే కారణమనుకుంటాను. శబ్దానికి అతీతమైన అంతర్లయ గాని, భావలయగాని వచన పద్యానికి ముఖ్యమని వీరి అభిప్రాయం. ఇది ఇంగ్లీషులో వాడుతున్న Rhythm of thought అనే పదానికి తెలుగులో సమానార్థకంగా కనిపిస్తున్నది.

పద్యం (Verse) లో అర్థవంతమైన శబ్దాల కూర్పు (Morphological arrangement), ధ్వనుల కూర్పు (Phonological arrangement) ఉంటై. ధ్వనుల కూర్పు అక్షర పరిమాణం (Syllabic quantity) మీద ఆధారపడి ఉంటుంది. ఈ అక్షరాలనే గురు (Heavy syllable) లఘువు (Light syllable) అని ఛందశ్శాస్త్రకర్తలు విభజించారు. గురు లఘు క్రమం నిర్ణీతమైతే అక్షర గణ ఛందస్సు అవుతుంది. అట్లాకాక గురు లఘు సమూహాల పరిమాణాన్ని [illegible] త్ర్యస్ర (త్రిశ్ర) చతురస్రాది భేదాలుగా విభజించి ప్రయోగిస్తే మాత్రాగణఛందస్సు అవుతుంది. ఈ మాత్రాగణ ఛందస్సు లయ ప్రధానమైనది. నియతమైన మాత్రా పరిమాణంగల గురు లఘు సమూహాల (మాత్రా గణాల) క్రమావృత్తిని ఛందస్సులో లయగా నిర్వచించవచ్చు. అయితే వీటితోపాటు పదప్రయోగం కూడా సహకరిస్తేనే లయ సాధ్యమవుతుంది. ఇక్కడే అర్థవంతమైన శబ్దాల పాత్ర ఉంటుంది. దీన్నే (Morphological arrangement) అంటున్నాను. ప్రయోగించిన పదాలు మాత్రాగణాంతంలో విరిచి చదివినా అర్థబోధకు ఆటంకం కలక్కపోతే పద ప్రయోగం లయానుకూలమవుతుంది. పూర్వపదాంతాక్షరంతో మాత్రాగణాన్ని ప్రారంభించినట్లయితే లయ భంగమవుతుంది. పదాంత విరామమూ (Word Juncture), గణాంత

విరామమూ కలిసివస్తే లయ స్పష్టంగా తెలుస్తుంది. ఒక్కొక్కసారి పదాంత విరామం బదులు పదాంశాంత విరామం (Morpheme Juncture) గణాంతవిరామంతో కలిసినా లయ కనిపిస్తుంది. ఈ రెండూ సాధ్యం కానప్పుడు ధ్వనిక (Stress) ఉన్న అక్షరంతో గణం ప్రారంభమైనప్పుడు ఆ అక్షరం పదమధ్యమైనా లయానుకూలమే. తెలుగులో ఒక పదంలో రెండో అక్షరం గురువు కాకపోతే మొదటి అక్షరం మీద ధ్వనిక ఉంటుంది. రెండో అక్షరం గురువైనా మొదటి అక్షరం కూడా గురువే అయితే మొదటి అక్షరంమీదనే ధ్వనిక ఉంటుంది. మొదట లఘువు తరవాత గురువుంటే ఆ గురువుమీద ధ్వనిక ఉంటుంది. మూడక్షరాల పదాలను ప్రమాణంగా తీసుకుంటే ధ్వనిక ప్రవర్తనను ఈ విధంగా సూచించవచ్చు.

ÚII
ÚIU
ÚUI
ÍII
ÍIU
IÚI
IÚU

రెండక్షరాలకూ ఇదే పద్ధతి వర్తిస్తుంది. నాలుగక్షరాలకన్నా ఎక్కువైనా ఇది వర్తిస్తుందిగాని అక్కడ పదాంశ విభాగమూ (Morphemic division) పదాంశ గణమూ (Morpheme class) ధ్వనిక ప్రవర్తనలో మార్పు తీసుకురావచ్చు. తెలుగులో ధ్వనిక ప్రవర్తనమీద పరిశోధన అంతగా జరగలేదు. కాని ఇంతవరకు ధ్వనికమీద ఎక్కువగా చెప్పటం ప్రస్తుతం సాధ్యంకాదు. పై వాటిలో మొదటి అక్షరంమీద ధ్వనిక ఉన్నవాటిని అవరోహగణాలని రెండో అక్షరంమీద ధ్వనిక ఉన్నవాటిని ఆరోహగణాలని అనవచ్చు.

ఈ ధ్వనిక సహాయంతో పదమధ్యాక్షరంతో గణం ప్రారంభమైనా అక్షరం ధ్వనిక ఉన్నదైతే లయ సరిపోతుంది. ఉదాహరణకు—

వ్రక/వర్తి ల/తో కు/డెక్కా

అన్న పాదంలో వ్రక్రి తో పదం అయిపోలేదు. కాని వ్రక అర్థవంతమైన రూపం. అందువల్ల వ్రక తరువాత పదాంశాంత విరామం (Morpheme juncture) ఉంది. ఇక్కడికి ఒక మూడు మాత్రలగణం అతికుడెక్కా అన్నప్పుడు శో మీద ధ్వనిక ఉండదు. అందుకు కారణం దీని పూర్వాక్షరం పదాంత లఘువు. ధ్వనికలో ఉన్న అక్షరంతో గణం ప్రారంభమయింది. వర్తి—ల విభాగ్యమైనా రెండు గణాల సంధ్య ఉండటంవల్ల ఇది గణం కాగలిగింది. డెక్కాడి అన్నప్పుడు పదవిభాగం చేస్తే అజాడి పదం వస్తుంది. ధ్వనిక ఎప్పుడూ అప్పువిహాదనే ఉంటుంది. అందువల్ల అర్థస్ఫురణకు భంగం ఉండదు.

అక్షర నిర్ణయంలో స్వరమే ప్రధానమని శ్రీ సీతాపతి (1921) ఇట్లా అంటున్నారు.

'ఈ సంపర్కమున మాత్రా పరిమాణము అచ్చును గూర్చి చెప్పవలెను గాని వ్యంజనము గూర్చి చెప్పగూడదు. అచ్చులబట్టి (Syllables) అక్షరము లేర్పడునుగాని వ్యంజనములబట్టి ఏర్పడవు. 'భవి'లో ఎన్ని వ్యంజనము లున్నా అచ్చు ఒక్కటే గనుక అది ఒక్క అక్షరమనే చెప్పవలెను.

ఇక్కడ పి.ఎస్. సిద్ధాంతం ఒక పెద్ద తప్పు చేసింది—ప్రధానంగా అక్షర నిర్ణయాన్ని గురించి. అక్షర (Syllable) సంఖ్యానిర్ణయం అచ్చుల ఆధారంగానే చెయ్యాలనే సీతాపతిగారి నిర్ణయం భాషా శాస్త్ర సమ్మతమైంది. మాత్రా పరిమాణంలో వ్యంజనాలకు ఏమీ ప్రమేయం లేదని సీతాపతిగారి అభిప్రాయంగా కనబడుతోంది. అచ్చు అక్షరానికి శిఖర ప్రదేశమైనా (Syllabic Peak) కాబట్టి అక్షర భేదాన్నిబట్టి గురులఘునిర్ణయం జరగాలిగనుక మాత్రా పరిగణన ప్రధానంగా అచ్చుల మీద ఆధారపడి ఉంటుంది అనేది సీతాపతిగారి అభిప్రాయం. అయితే ఇంతస్పష్టంగా చెప్పకపోవటంవల్ల ఇది శ్రీ పాటిబండ మాధవశర్మ (1966) విమర్శకు గురి అయింది.

లఘుస్ఫురణకు పద, పదాంశ విరామాలు, పదంలో ధ్వనిక ప్రధానపాత్ర వహిస్తాయని పైన నిర్ణయించబడింది. ఇంకా పరిశోధిస్తే కేవలం ధ్వనికనే లయకు కారణంగా నిరూపించవచ్చుననుకుంటాను. అయితే ఈ ధ్వనిక ప్రవర్తన పద, పదాంశ విభాగం మీద ఆధారపడి ఉంటుంది. పద, పదాంశ విభాగ విరామాల పరిజ్ఞానం ఛందశ్శాస్త్రానికి ఎక్కువగా అవసరమనుకుంటాను.

మాత్రా పద్యాల్లో సాధారణంగా లయ నియతంగా ఉంటుంది. లయ భంగమైన పద్యాలు లేవనలేం. ఉదా: (5+5) పద్యాల్లో ఒక్కొక్కసారి మాత్రలు (3+4+3) కనిపిస్తుంది. మాత్రా పద్యాల్లో ఎక్కువగా మాత్రాగణాల ఎన్నికతోనే లయ నిర్ణీతమవుతుంది. అక్షర గణ ఛందస్సుల్లో లయ గణాల ఎన్నికను బట్టి నిర్ణీతం కాదు. పదాల ఎన్నికనుబట్టి నిర్ణీతమవుతుంది. అక్షరగణ ఛందస్సుల్లో గురు లఘు ప్రయోగంలో కవికి స్వేచ్ఛ లేదు. లయను ఎన్నుకోవటంలో మాత్రం స్వేచ్ఛ ఉంది. లయ లేకుండా (అంటే లయ స్ఫురణ లేకుండా) శుద్ధవచనంగా చదివే పద్యాలున్నై. మాత్రా పద్యాల్లో సరిగ్గా నియమాన్ని పాటిస్తే లయ నిశ్చయంలో స్వేచ్ఛలేదు. (కవిసంతకున్న). గురు లఘు ప్రయోగంలో మాత్రం చాలా స్వేచ్ఛ (స్వేచ్ఛ అనేకంటే Choice అనటం బాగుంటుంది). సాధారణంగా లయ స్ఫూర్తిలేని మాత్రా పద్యముండదు. కాని లయలేని వృత్తం ఉండవచ్చు.

కాబట్టి లయ ప్రధానంగా అక్షరగుణం (Syllabic quality) అని, దీనిని నియతపరిమాణం (quantity) గల గణాలుగా ప్రయోగించటం వల్ల లయ సిద్ధిస్తుందని, దీనికి గణాంతాల దగ్గర విరతి పడినా అర్థభంగం కాని విధంగా పదాలుండాలని తెలుస్తుంది. ఒక నియతపరిమాణంగల గణాలు ప్రయోగమైనప్పుడే లయ ఉంటుంది. ఈ లక్షణం వచనపద్యంలో ఉంటే, అది మాత్రా పద్యమవుతుంది. మాత్రా పద్యంలో ఒకేరకపు లయ సాధారణంగా పద్యమంతా ఉంటుంది. వచన పద్యంలో అవసరాన్నిబట్టి భిన్న లయలు ఉండవచ్చునంటే, అది గతులు మార్చే మాత్రాపద్యమవుతుందిగాని వచనపద్యంకాదు. అంటే పైన వివరించిన పద్ధతిలో లయ ఉన్నపద్యం మాత్రా పద్యమో, అద్వికారమో అవుతుంది గాని వచనపద్యం కాదన్నమాట. వచనపద్యంలో స్పష్టమైన అక్షర సంబంధమైన లయ ఉండదని సారాంశం. బహుశా ఇది గుర్తించేనేమో శ్రీ విశ్వం (1961) భావలయను, శ్రీ సంపత్కుమార (1967) భావగణాలను ప్రతిపాదించారు. పేరుకు కనిపిస్తున్నా ఈ రెండూ ఒకటే. శబ్దరూపంలో అక్షర సమూహాల పరిమాణాన్నిబట్టి మాత్రాగణాలుంటై. తద్వారా సాధించిన లయ

శబ్దలయ అవుతుంది. దీన్నే అక్షరలయ అని కూడా అనవచ్చు. ఇది చెవికి వినిపించేది. అర్థంతో నిమిత్తం లేకుండా శ్రోత గుర్తించేది. అట్లా కాకుండా భావగణాల ద్వారా సాధించేది భావలయ. భావగణాలుంటే భావలయ ఉంటుంది. భావగణాలు లేవని నిరూపిస్తే భావలయ సిద్ధాంతం కూడా నిరాసమవుతుంది.

ఛందశ్శాస్త్రంలో గణాలు—అవి మాత్రాగణాలు కానీ, అక్షరగణాలు కానీ పరిమిత సంఖ్యాకాలు. అంటే పరిగణనీయాలు. వాటి మిశ్రమాలు పద్యపాద పరిమితినిబట్టి అధిక సంఖ్యాకాలు కావచ్చు. కాని గణాలు మాత్రం పరిమితసంఖ్యాకాలే. అవి నిసర్గ, ఇంద్ర, చంద్ర, సూర్య గణాలు కావచ్చు, రెండు, మూడు, నాలుగు ఐదు మాత్రల గణాలుగా కావచ్చు. కాని ఈ భావగణాల సంఖ్య ఎంత? భావాలు ఎన్ని ఉంటయ్యో భావగణాలు సంఖ్య అంతన్నమాట! భావాలు ఎన్ని ఉంటయ్యో ఎవరు అంచనావెయ్యగలరు. అనంతమైన భావగణాలున్నప్పుడు వాటికి వ్యవస్థ ఏమిటి?

అక్షరగణాల్లోకాని, మాత్రాగణాల్లోగాని ఒక్కొక్కగణం పరిమితిని ఉచ్చారణతో కొలవ్వొచ్చు. ఒక్కొక్క భావగణపరిమితిని భావనతో కొలవగలమా? భావాలు వ్యక్తమయ్యేది భాషలో వాక్యవాక్యాంశాలద్వారా కాబట్టి వాటి ద్వారానే కొలవాల్సి ఉంటుంది. శ్రీ సంపత్కుమార (1967) ఇచ్చిన ఉదాహరణలనుబట్టి చూస్తే వ్యాకరణ రూపైకత (**Grammatical similarity in form**) ఉన్న వాక్యాంశాలను ఒక గణంగా భావిస్తున్నట్టు కనిపిస్తున్నది. కే. శే. బాలగంగాధర తిలక్ కవితలో నుంచి ఈ భాగాన్ని శ్రీ సంపత్కుమార ఉదాహరించారు.

ప్రతిమాటకీ। శక్తి ఉంది। పదును ఉంది.
ప్రతిమాటకీ। అర్థం ఉంది ఔచిత్యం ఉంది.

ఇక్కడ కీ—విభక్తి బంధం ఒక గణం. తరువాత వచ్చిన నామం, క్రియ కలిపి ఒక గణం. శక్తి, పదును, అర్థం ఔచిత్యం అనేవి ఒక రకపు (నామ) గణాలుగాను, ఉంది అనేది ఒక (క్రియా) గణంగానూ ఎందుకు విభజించగూడదు? శక్తి ఉంది అనేది ఒక భావమా రెండు భావాలా? ప్రతిమాటకీశక్తి అనేది ఒక గణం ఎందుకు కాగూడదు? భావగణాలను వేరుచేసే నిర్దిష్టమైన సూత్రాలేమిటి? వీటికి **objective criteria** ఏమన్నా ఉన్నయ్యా? కేవలం **arbitrary** గా చేసే విభాగమేనా? ఈ ప్రశ్నల్లో వేటికీ సమాధానాలు దొరకవు. అందుకే శ్రీ సంపత్కుమార (1967) ఇక్కడ అర్థాన్నిబట్టి గణవిభజన ఆభాస రూపంగా చేయువచ్చునన్నారు. వారి భావగణాలు ఆభాసాలేగాని నిర్దిష్టమైనవికావని వారే అంగీకరిస్తున్నారు. ఈ ఆభాస గణాలు వచనపద్యాన్ని నిర్వచించలేవు గాబట్టి వాటిని నిరాకరించాల్సి వస్తున్నది. అసలు విషయమేమిటంటే భావాల్ని గణాలుగా విభజించటం సాధ్యంకాదనీ, వీరు విభజించింది వ్యాకరణ రూపైకత ఉన్న పదసమూహాలు కాబట్టి, వీటిని న్యాయంగా వ్యాకరణ గణాలు అని అనాల్సిఉంటుందని తేలుతున్నది. వ్యాకరణ గణాలు వాక్య, శబ్ద నిర్మాణానికి సంబంధించినవి. వాటి ఆవృత్తి ఒకేశబ్దంతో అయితే పునరుక్తి, భిన్నశబ్దాలయితే అనుప్రాస అవుతుంది. అవి (శ్రీ సంపత్కుమార భావగణాలంటున్న వ్యాకరణగణాలు) పద్యబాహ్యస్వరూపానికి అవసరమైన గణాలు కావని, వాక్యనిర్మాణానికి అవసరమైన కూర్పు అని తేలుతున్నది. పద్యనిర్మాణం వేరు, వాక్యనిర్మాణం వేరు. వేటి సూత్రాలు వాటికే ఉన్నై. భావగణాలే లేనప్పుడు వాటిపైన ఆధారపడిఉండే భావలయ కూడా ఉండదని చెప్పకతప్పదు.

ఇవికాక శ్రీ సంపత్కుమార 1962 లో 10 లక్షణాలు, 1965 లో 6 లక్షణాలూ ప్రతిపాదించారు. ఇక వాటిని పరామర్శిస్తాను. 1962 లో లక్షణాల్ని సంక్షిప్తం చేస్తే వచ్చినవే 1965 లో ప్రతిపాదితమైన లక్షణాలు. అందువల్ల 1965 లో లక్షణాల్ని ఇక్కడ ఉద్ధరిస్తాను.

1. భావాన్ని, భావాంశాన్నిబట్టి పాదాలను విభజించడం.
2. క్రియాపదాలతో ప్రారంభించడం, పూర్తి చేయడం.
3. క్రియారహితంగా భావాన్ని వాక్యంగా నిరూపించడం.
4. అనియతంగా యతిప్రాసల్ని, అంత్యప్రాసల్ని ఉపయోగించడం.
5. ఒక్కొక్కపాదాన్ని తత్పూర్వపాదంకన్నా పొడిగిస్తూ, తగ్గిస్తూ భావోద్దీప్తిని కలిగించడం.
6. భావాన్ని లయబద్ధంగా స్ఫురింపేట్టు పాదాలలో పదాల కూర్పు ద్వారా నిముడ్చడం.

వీటిని ఈ క్రమంలో కాకుండా, నాకు వీలైన క్రమంలో పరిశీలిస్తాను. వీటిల్లో 2, 3, 4 లక్షణాలను ఆభాసంగానైనా లక్షణాలుగా అంగీకరించలేం. క్రియాపదాలతో ప్రారంభించటం, పూర్తి చెయ్యటం పద్యలక్షణమెట్లా అవుతుంది? మాటవరసకు అవుతుందనుకుందాం. క్రియాపదం మధ్యలో ఉండదా? క్రియాపదం అంటే సమాపకమా? అసమాపకమా?

గోనెగదా అని దండం పెట్టబోతే
ఉన్నట్టే ఉండి ఎగిరి మీద పడుతుంది
సంపత్కుమార 'నేలవిడిచిన సాం'
(చేతనావర్తం—2, పేజి.8)

వాడెప్పుడు తెరదింపుతాడో తెలియదు
ఏ ఘట్టంలో మరి ఈ నాటకం ముగుస్తుందో
అనుక్షణం అయిపోయిందనే అనిపిస్తుంది.
అయితే ఇది మొదలంటాడు వాడు
సంపత్కుమార 'ఆత్మాశ్రయం'
(చేతనావర్తం—2, పేజి.13)

క్రియాపదం సమాపకమైనా, అసమాపకమైనా, పై ఖండికల్లో పాదం మధ్యలో వచ్చినట్టు స్పష్టమేకదా. అంటే క్రియాపదం పాదాదిమధ్యాంతాల్లో ఎక్కడైనా రావచ్చునన్నమాట. ఈ మూడు చోట్లా కాకుండా ఎక్కడొస్తుంది?

క్రియా రహితంగా భావాల్ని వాక్యంగా రూపించటం మూడోలక్షణం. దీనికి శ్రీ మాదిరాజు రంగారావు కవిత నుంచి ఉదాహరణలు చూపించారు. వాక్య ప్రయోగ విశేషం పద్యలక్షణంగా చెప్పటం విచిత్రం. క్రియ అవసరమైనచోట లేకుండా చెప్పటం వాక్యదోషం అవుతుంది. అయితే కవులకు ఈ వెసులుబాటు ఉంది. ఒకానొకకవి శైలీవిశేషాన్ని పద్యలక్షణంగా చెప్పటం కుదరదు. శ్రీ మాదిరాజు రంగారావు వచన పద్యాల్లో గ్రాంథిక భాష ఉపయోగిస్తారు కాబట్టి దాన్నికూడా వచనపద్యం లక్షణంగా అంగీకరిస్తామా?

యతిప్రాసల్ని అంత్యప్రాసల్ని అనియతంగా ప్రయోగించటం నాలుగో లక్షణం. అనియుతత్వం ఒక లక్షణం ఎట్లా అవుతుంది? అనుప్రాస అలంకారం. తెలుగులో అక్షరసామ్యయుక్తమైన యతిప్రాసలు అలంకార సన్నిభాలే. అయితే ప్రాచీన కవులు వీటిని నియమాలుగా పాటించారు. మాత్రాపద్యాల్లో వీటిని చాలా మంది అనియతంగానే పాటించారు. కాని వీటిని మాత్రాపద్యలక్షణాలుగా ఎవరూ చెప్పినట్టు లేదు.

పై లక్షణాల్లో 1, 5, 6 లక్షణాలు ఆభాసంగానైనా లక్షణాలుగా కనిపిస్తున్నై. ఆరో లక్షణానికి సమానమైంది శ్రీ సంపత్కుమార (1962)లో ఇట్లా ఉంది.

10. గణ విభజనాదులకు భిన్నముగా రచనాశక్తి నాధారముగా చేసి లయను సమాకర్షించుట.

శ్రీ సంపత్కుమార (1962)నీ (1965)నీ కలిపిచూస్తే, ఆయన ఇక్కడ భావలయనే ఉద్దేశించినట్లు కనిపిస్తుంది. భావలయను ఇంతకు ముందే విపులంగా చర్చించి నిరాకరించాను.

1, 5 లక్షణాలు పాదవిభజనకు సంబంధించినవి. పద్యానికీ, గద్యానికీ పాద విభజన ప్రధాన భేదం అని ప్రాచీనులు చెప్పారు.

పాద కల్పనంబు వలవదు గద్యమునకు
పాద నియతినొప్పు బద్యంబులు

అని అనంతుడు ఛందోదర్పణంలో అన్నాడు. శ్రీ సంపత్కుమార (1962, 1965, 1967, 1968, 1970) పాదబద్ధతను గురించి చాలాచోట్ల ఉద్ఘాటించారు. వచనపద్యాన్ని ఛందోవిభాగంలో చేర్చటానికి ఆయన ప్రధానంగా దీనిమీదనే ఆధారపడినట్లు కనిపిస్తున్నది. ఉదాహరణకు ఈ వాక్యాలు చూడండి.

'ఛందో విభాగానికి చెందిన ప్రతిదీ పాదబద్ధమై లేదా పాదవిభాగంతో ఉంటుంది. పాదబద్ధత ఛందస్సు యొక్క మొట్టమొదటి లక్షణం. పాదాలు అన్నీ సమాన రూపంలో ఉండవచ్చు, ఉండకపోవచ్చు. అయినా అదీ పద్యమే.

సంపత్కుమార (1968)

వచనం నుంచి పద్యాన్ని భేదింపజేసేది దాని పాదబద్ధత. పద్యానికి సంబంధించిన ఇతర విషయాలనేకం ఎట్లా ఉన్నా, అది పద్యంకావటానికి దాని పాదబద్ధత ప్రధాన లక్షణం. పాదబద్ధంగా ఉండాలన్నదే ప్రధానం తప్ప పాదసమత్వంగానీ, పాద సంఖ్యానియమంగానీ కావు. . . . .

ఇందువల్ల ప్రధానమయిన పాదబద్ధతను స్వీకరించి, మిగిలిన అంశాలను ఐచ్ఛికం చెయ్యటం, ఒక దశలో నిరాకరించటం, వచన పద్యంలో ప్రధానంగా గమనింపవలసి ఉంటుంది.

సంపత్కుమార (1970)

వీటినిబట్టి ఇంతకుముందు చర్చించిన లక్షణాలు ఐచ్ఛికాలనీ, ఒక్కొక్కసారి వాటిని నిరాకరించవచ్చునీ, పాదబద్ధత మాత్రం నిరాకరింపరాని లక్షణమని శ్రీ సంపత్కుమార అభిప్రాయంగా మనం గ్రహించవచ్చు. పాదబద్ధత స్థాపితమైతే వచనపద్యం సలక్షణమైన పద్యరూపంగా అంగీకరించవచ్చుని తాత్పర్యం. పాదబద్ధత అన్ని పద్యాలకూ లక్షణమవుతుంది గదా; మరి వచనపద్యాన్ని మిగతా పద్యాల్నించి పృథక్కరించటమెట్లా అనే ప్రశ్నకి అనియతగురులఘ్వక్షర ప్రయోగాన్ని వేరు చేసే గుణంగా సరిపెట్టుకోవచ్చు. అంటే పాదబద్ధత ఏకైక, అనైచ్ఛిక లక్షణమన్నమాట.

ఈ పాదబద్ధతకు లొంగనివి కూడా ఆధునిక కవిత్వంలో కొన్ని ఉన్నై. కీ. శే. బాలగంగాధరతిలక్ వ్రాసిన 'ఆర్తగీతం' 'రాత్రివేళ' అనే ఖండికల్లో ఈ పాదబద్ధతను పాటించినట్లు కనిపించదు.

శీర్ణసస్త్రాలం, ఎవ్వరూలేరు, చుట్టూ పరచుకున్న మైదానపు
నగ్నదేహాన్ని స్పృశింపబోయే నీమల శాఖాగ్రపు వ్యగ్రపు
తొందర నిశ్శబ్దం మెల్లగా అడుగులువేస్తూ నడుస్తోంది, ఆకాశం
మీద ఒకచుక్క మరోనక్షత్రంతో మాట్లాడేమాట మనసుకి
వినిపిస్తోంది.

—తిలక్ 'రాత్రివేళ'

ఇందులో పాదవిభజనకు ఆధారాలేమిటో నా కర్థం కావటంలేదు. ముఖ్యంగా మూడోపాదం ఆకాశం లో అంతం కావటానికి హేతువు ఎవరైనా చెప్తే సంతోషిస్తాను.

పాపికొండల కావల, సజాంగజాంకుశం కాలేదూనీవు?
కోనసీమలో, లంకసీమలో, పాపాలదీపాలవార్పలేదూ
నీవు? నిప్పుకత్తులబోను రెక్కలు త్రుంచలేదూ
రాత్రిని కప్పుకొని, ధాత్రిని మప్పుకొని చరించలేదూ నీవు?

కె.వి.రమణారెడ్డి 'బాధాగాథము'

పైదాంట్లో రమణారెడ్డి అచ్చులో కూడా పాదబద్ధత పాటించలేదు. అయితే దీన్ని 'వచనపద్యములను కూడా అతిక్రమించి ఆవేశ స్ఫోరకంగా, అంతర్న్యాయాన్వితంగా సాగిన యీకావ్యం కావ్యోపన్యాసం అనదగింది' అంటున్నారు శ్రీ రమణారెడ్డి. శ్రీ నరసింహారెడ్డి (1968) దీన్ని తానంటున్న వచన కవితగానే పరిగణించారు.

నగ్నముని రాసిన 'మొహమ్మద చంద్రుడు' అనే ఖండిక (దిగంబరకవులు—2) లో పాదబద్ధత అసలు పాటించలేదు. 'స్వరూపాన్నిబట్టి, స్వభావాన్నిబట్టి మేం వ్రాస్తున్నదానిని వచనకవిత అని మేం అనదలచుకోలేదు' అని దిగంబరకవులు అన్నా వచనపద్యకవులు, సిద్ధాంతకర్తలు వాళ్లను వదల్లేదు. వాళ్లు ఒప్పుకోకున్నా దిగంబరకవుల స్వరూపం ఫ్రీవర్సుదేనంటున్నారు వరవరరావు. (1967)

దిగంబర కవుల్ని వదిలేద్దాం. శ్రీ రమణారెడ్డి బాధాగాథాన్ని కావ్యోపన్యాసమనే అందాం. వచనపద్య కవులందరూ ఒప్పుకునే తిలక్ మాటేమిటి? వీటిని అపవాదాలుగా పరిగణించి పాదబద్ధతను గురించిన మిగతా అంశాలను పరిశీలిద్దాం. పాదబద్ధత పద్యానికి గద్యానికీ ప్రధానమైన భేదమనీ, పాదసంఖ్యానియమం అంత ప్రధానం కాదనీ, పాదాలు సమపాదాలే కానక్కర్లేదనీ, విషమపాదాలు కూడా అంగీకార్యాలేనని శ్రీ సంపత్కుమారతోపాటు నేనూ అంగీకరిస్తాను.

వృత్తాల్లోగాని, జాతుల్లోగాని, మాత్రాపద్యాల్లోగాని పాదవిభజన గణ నియతిని బట్టి ఉంటుంది. అక్షరగణచ్ఛందస్సుల్లో పాదాల్లో అక్షరాల సంఖ్య నియతం. మాత్రాపద్యపాదాల్లో మాత్రాసంఖ్య నియతం. జాతుల్లో ఇంద్ర గణాల ప్రయోగం వల్ల ఈ రెండూ నిర్దిష్టసంఖ్యాకాలు కాకపోయినా వాటి రేంజి (Range) నియతం. ఉదాహరణకు గీతపద్యపాదంలో అక్షరాలసంఖ్య 12—19 మధ్య ఉంటుంది. మాత్రాసంఖ్య 17—19 మధ్య ఉంటుంది. ఇంత వరకూ తెలుగులో వచ్చిన పద్యపాదాలన్నిటినీ, రాతతోగాని, అచ్చుతోగాని పనిలేకుండా కనుక్కునే వీలుంది. ఏ పద్యాన్నయినా పాదవిభజన చెయ్యకుండా పూర్వులు తాళపత్రగ్రంథాల్లో ఒకే వరసలో రాసేవాళ్ళు. అయినా ఛందస్సు తెలిసిన వాళ్లకి వాటిని మళ్లీ పాదబద్ధంగా రాయటం కష్టంకాదు. పాదవిభజన లేకుండా అచ్చువేసిన (లేక రాసిన) వచనపద్యానికి ఈ వచనపద్య లక్షణ కర్తలు మళ్లీ కవ్యుద్దిష్టమైన పాదవిభజన చెయ్యగలరా? కవ్యుద్దిష్టంకాకపోతే పోనీ, ఏ ఇద్దరు లక్షణ కర్తలైనా ఒకేరకపు పాద విభజన చెయ్యగలరా? వచనపద్యాల్లో పాదవిభజన జ్యామెట్రీని బట్టి ఉంటుంది అని సాంప్రదాయిక విమర్శకులు చేసే ఆరోపణలో నిజం లేకపోలేదు.

పాదం కేవలం అక్షర సముదాయంకాదు. గణ సముదాయం. అంటే పాదానికి అంతర్నిర్మాణం (Internal structure) ఉందన్నమాట. వచనపద్య

పాదంలో ఉండేవేమిటి? భావగణాలు లేవని పూర్వమే నిరూపించాను. అందువల్ల వచనపద్యపాదానికి అంతర్నిర్మాణంలేదని కూడా నిరూపితమే. నిర్దిష్టమైన పరిమితి, గణనిర్మాణం పద్యపాదానికి లక్షణాలు. ఈ రెండూలేని పాదాలు పద్యపాదాలు కాలేవు. అందువల్ల పద్యానికి ప్రధానమైన పాతబద్ధత అనే లక్షణం వచనపద్యం అనే కవితారూపానికి లేదు.

వచనపద్యానికి లక్షణాలుగా చెప్పబడుతున్నవేవీ లక్షణాలు కావని పైన నిరూపించాను. అందువల్ల వచనపద్యం పద్యంకాదని, గద్యమేనని సిద్ధాంతం. గద్యానికి ఏ నియమాలూ లేవు. వచనపద్యానికీ అంతే. నియమ రాహిత్యమే వచన పద్య లక్షణం.

మొదటే చెప్పినట్లుగా వచనపద్యస్వరూపంమీదగాని వచనకవిత్వంమీద గాని నాకు వ్యతిరేకత లేదు. వచన పద్యసిద్ధాంతాలతోనే నాకు పేచీ.

రిఫరెన్సులు

ఆంజనేయులు కుందుర్తి (1958) 'హృదయంవిప్పి' (శ్రీ గోపాలచక్రవర్తి 'కలం కలలు' పీఠిక) హైదరాబాదు: నవ్యసాహితీసమితి.

(1965) 'నా మతం' (శ్రీ శీలావీర్రాజు 'కొడిగట్టిన సూర్యుడు' పీఠిక) హైదరాబాదు: సుషమా.

(1967ఎ) 'ఒకమంచిప్రయోగం' (శ్రీ సి.వి. కృష్ణారావు 'వైతరణి' పీఠిక) హైదరాబాదు: ప్రీవర్స్ ఫ్రంట్.

(1967బి) 'నాలోని నాదాలు'— హైదరాబాదు: ఫ్రీవర్స్ ఫ్రంట్.

(1969) 'వర్తమానసాహిత్యం: పోకడలు'; ఆంధ్రపత్రిక సౌమ్యసంవత్సరాది సంచిక

ఆంజనేయులు కుందుర్తి & గోపాల చక్రవర్తి (1967) 'వచనకవిత': వివిధ కవుల వ్యాసాలూ, దృక్పథాలు; హైదరాబాదు: ఫ్రీవర్స్ ఫ్రంట్.

కాంతారావు టి. ఎల్. (1969) 'తెలుగులో వచనకవిత'; భారతి, నవంబరు.

నరసింహశాస్త్రి, నోరి (1971) 'వచన కవిత': అభిమానుల ఆత్మోక్తులు; భారతి, ఏప్రిల్.

నరసింహారెడ్డి, పే. (1968) 'వచనకవిత'; పుస్తకప్రపంచం; సెప్టెంబరు.

నారాయణరెడ్డి, సింగిరెడ్డి (1967) 'ఆధునికాంధ్ర కవిత్వము: సంప్రదాయము, ప్రయోగము'; హైదరాబాదు.

మాధవశర్మ, పాటిబండ (1966) 'ఆంధ్రమహాభారతము, ఛందఃశిల్పము' హైదరాబాదు.

రంగారావు, మాదిరాజు (1969) 'యుగసంకేతం'; వరంగల్లు: సాహితీబంధు బృందం.

రమణారెడ్డి, కె.వి. (1964) 'తెలుగులో వచనపద్యం'; భారతి, జూన్.

(1967) 'వచనకవిత: అవరోధాలు అవకాశాలు' (ఆంజనేయులు & గోపాలచక్రవర్తి (1967)లో.

రామమోహనరావు అద్దేపల్లి (1969) 'వచనగేయం: అంతస్సత్వం'; జనధర్మ— 1

వరవరరావు, పెండ్యాల (1967) 'స్వచ్ఛంద కవిత్వంలోనవ్యత్వం' (ఆంజనేయులు & గోపాలచక్రవర్తి (1967) లో

విశ్వం, అరిపిరాల (1961) 'ప్రాచీనాలంకారికుల ధ్వనికి, ఆధునిక కవిత్వంలోని భావలయకూ గల సాదృశ్య వైషమ్యాలు'. కృష్ణా పత్రిక, జనవరి.

శ్రీనివాసరావు, శ్రీరంగం (1939) 'నేటి తెలుగు కవిత: కొత్త పోకడలు'; భారతి, ఫిబ్రవరి

సంపత్కుమార, కోవెల (1962) 'తెలుగు ఛందోవికాసము'; వరంగల్లు, కళాపతి సమితి

(1965) 'వచనపద్యం: లక్షణ నిరూపణం'— భారతి జూన్.

(1967) 'వచనపద్యం ఛందోరీతి'; (ఆంజనేయులు & గోపాలచక్రవర్తి (1967) లో

(1968) 'వచనపద్యం: దాని పేరు'; జనధర్మ, కీలక సంవత్సరాది సంచిక.

(1970) '(సం) చేతనావర్తం—2'; వరంగల్లు: సాహితీబంధుబృందం.

సీతాపతి గిడుగు (1921) 'అనంతుని ఛందస్సుకు ఉపోద్ఘాతము'— మద్రాసు: వావిళ్ల రామస్వామిశాస్త్రులు & సన్స్.

హేమంత హసంతిక*

(సాహిత్య సంభాషణలు–1)

స్వర్గీయ బాలగంగాధర తిలక్

ఎండ లేతగా కొబ్బరాకులమీద పడుతోంది. శీతాకాలపు ఆగమనాన్ని తెలియచేసే చల్లనిగాలి ఒంటికి తగులుతోంది. గదిలో హాయిగా మెత్తగా ఉన్న పగటి వెలుతురు. తెల్లని చాందినీ వేసిన పందిరిలో ఉన్న ఫీలింగు.

చదువుతున్న పుస్తకంలో యీ వాక్యం కనబడింది.

There is an awful warmth about my heart like a load of immortality. చకితుడినయాను. అనిర్వచనీయమైన అనుభూతి ఏదో కలిగింది. కీట్సు వ్రాసిన వాక్యం అది.

'నా హృదయపు పరిసరాలలో వెచ్చగా
ఒత్తుకుంది ఒకానొక అమరత్వపు బరువు'

ఇది కవిత్వం. గొప్ప కవిత్వం మధువు లాంటిది. Special **wine** లాంటిది సృష్టియొక్క అద్భుతత్వాన్నీ రహస్యాన్నీ అందుకునేటట్టు చేస్తుంది. ప్రియురాలి చెంపల్నీ తాజమహల్ పాలరాతి గోడల్నీ స్పృశించినంత భౌతికంగా నిరాకారమైన విశ్వరహస్యాన్ని అనుభవించేటట్టు చేస్తుంది.

ఇలాగ అందరూ అనలేరు. అనుభవిస్తేకాని అనలేరు. అనుభవించిన గొప్పకవికాని అనలేడు, పలకలేడు. కీట్సు ఆ నిముషంలో అమరత్వాన్ని నిజంగా బలంగా అనుభవించాడు. కవిత్వం యొక్క నిజమైన గొంతు యిలాంటి సమయాలలోనే వినబడుతుంది.

ఫీలింగుకి సంబంధించినది కవిత్వం. ఇంద్రియాలూ ఉద్రేకాలూ కవి విహరించే క్షేత్రాలు. మునిలాగా రుషిలాగా వీటిని సంయమించి సత్యాన్ని అన్వేషించవలసిన అవసరం కవికిలేదు. వీటిద్వారానే ప్రకృతి స్వభావాన్నీ విశ్వాత్మనీ దర్శించగలశక్తి కవికి వుంటుంది. సమాధిలో సాధనలో ఒక జ్ఞాని సాధించగలిగినదాన్ని కవి కులాసాగా తన ఫీలింగ్ద్వారా పొందగలడు.

సృష్టియొక్క అద్భుతత్వంతో రహస్యంతో దగ్గరగా నిలబడి మాట్లాడగలగడం ఆ అనుభూతిని అనువదించగలగడమూ కవితాశక్తి సిద్ధింపచేసే అత్యున్నత ఫలాలలో ఒకటి.

మామూలు మనిషి తనకి బహిః ప్రపంచానికీ గల వ్యత్యాసమే గుర్తించగలడు. తన అవసరాలకి అనుగుణంగా ప్రపంచాన్నీ ప్రకృతినీ విభాగించుకుంటాడు. వానవస్తే గొడుగు ఉపయోగకరమనీ ఎండవస్తే బట్టలారవేసుకోవచ్చుననీ పెద్దసముద్రం దగ్గరకి వెళ్ళడం ప్రమాదకరమనీ యోచిస్తాడు. వార్షుకలోకవిభ్రమమూ, సూర్యాతపసౌందర్యమూ అనంతజలరాశియొక్క నిరంతర తరంగ ఖేలనమూ అతను పట్టించుకోడు. తెల్లని మంచుకిరీటంలోఉన్న హిమాలయాల ఎత్తు అతనికి చాలా అనవసరంగా వ్యర్థంగా కనిపిస్తుంది. ప్రయోజనమూ స్వార్థమూ అతని భావనకీ ప్రవర్తనకీ కొలబద్దలుగా వుంటాయి.

కవి యిలాగ విడిగా చూడలేడు. మనిషికీ ప్రకృతికీ ఉన్న ఒక అద్వైతాన్ని అంతర్లీనంగా ఉన్న ఒక సంబంధాన్ని సహజంగా గుర్తిస్తాడు. తనలోంచి తాను విడిపోయి అంతటా పరుచుకుంటాడు. ప్రపంచం పగిలి చెల్లాచెదరైన గాజు పెంకుల్లాగ కనబడుతుంది సామాన్యుడికి. సంబంధంలేని ప్రతిబింబాలు కనబడతాయి అతనికి. నిశిత భావనగల కవికి ఒకే ఒక నిలువుటద్దంలా యీ ప్రపంచం ఎదురు నిలిచి అనంతరామణీయకత నావిష్కరిస్తుంది.

ఇటువంటి దర్శనంలోనే ఒక్కొక్క కవి సృష్టిశక్తిని చూసినంతగా అనుభవం పొందుతాడు. మార్మికవాదం (మిస్టిసిజం) యిక్కడే ఉద్భవిస్తుంది. థామ్సన్, బ్లేక్ A E, టాగూరు మొదలైన కవులు యీ ఆధ్యాత్మికసంయోగాన్ని రకరకాల సంకేతాలతో మనకి వెల్లడించారు. ఇక్కడ కవికి ఒక సదుపాయం వుంది. కవి ఉద్రేకాలనుండి దూరమవడానికి ప్రయత్నించ నక్కరలేదు. ఎప్పుడూ మనుష్యులకి దగ్గరగా వాళ్ళమధ్యగా కలసిమెలసి వుంటాడు. జీవితాన్ని ఆహ్వానించడమూ ఆస్వాదించడమూ కవికే తెలుసును. అందుకే జీవితంనుండీ అనుభవంనుండీ పారిపోవడం

* అసంపూర్ణ రచన; సేకరణ:– శ్రీ మిరియాల రామకృష్ణ, శ్రీ సోమసుందర్.

కవిలో ఒక **contradiction** ని సూచిస్తుంది. 'చచాల బాలా స్తనభిన్నవల్కలా' వంటి శృంగార సంరంభమాల్ని గమనించిన వాడే తనలో తననే దర్శించి ధ్యానించే సమాధినిష్ఠుడైన పరమేశ్వరుణ్ణి దర్శించాడు. వట్టి ఆధ్యాత్మిక వేదాంత ప్రవచనాలు కవిత్వం అనవు. ఆర్ద్రత ఉండాలి ప్రగాఢ జీవితంయొక్క ముద్ర ఉండాలి. అందుకే వాల్మీకీ కాళిదాసూ షేక్సుపియరూ అందరూ జీవితం రుచి తెలిసిన వాళ్ళు. అందమైన ఆడదీ, సంధ్యాదృశ్యమూ, మోడైన చెట్టూ యివన్నీకూడా ఒక అలౌకిక ఆధ్యాత్మిక భావన అంత తీవ్రంగానూ ఆకర్షిస్తాయి.

Tiger, Tiger burning braight
In the forests of Night

అన్నప్పుడు షికారీ కథల్లో చదివే పెద్దపులి మాత్రమే మనకి కనిపించదు. పెద్దపులిలోంచి సృష్టి వైచిత్రినీ దైవలీలనీ శక్తినీ మనకి చూపించాడు బ్లేక్. దేవుడే పెద్దపులిగా చీకటి అడవులలో ధగధగమండుతూ తిరుగుతున్నాడేమో అనిపిస్తుంది. ప్రాథమిక క్రౌర్యానికీ ప్రాథమికసౌందర్యానికీ సంబంధం కల్పగలిగిన కవి దర్శనవిశిష్టతని హర్షించకుండా ఉండలేము.

* * *

కీట్సుపొందిన యీ అమృతానుభూతి మనకి నిజం అనిపిస్తుంది. ఎక్కడో అగోచరమైన దివ్యలోకాలనుండి స్రవించే అమృతం ఒక బిందువు చటుక్కున కీట్సు గొంతులో పడిందేమో, లేనిదే ఆ తీయని బరువేమిటి అతని గుండె చుట్టూ.

ఇది కవిత్వంలో నిజమైన గొంతు. కీట్సు కొన్నిమాటల సహాయంతో మనల్ని మభ్యపెట్టుతున్నాడనీ మోసగిస్తున్నాడనీ అనిపించదు. ఈ నిజాయితీ పాఠకుణ్ణి ఆకట్టుకుంటుంది.

ఇక్కడ నిజం అంటే ఏమిటి? ఒక అనుభవాన్ని సూటిగా పొందగలగడమూ, తనదిగా చేసుకోవడమూ, తన రంగూ రుచీతో రంగరించుకోవడమూ అన్నమాట. అప్పుడు ఆ అనుభూతికి, దాన్ని వెలువరించిన మాటలకీ ప్రత్యేకతా బలమూ కలుగుతాయి. అలవాటుగా అనుశ్రుతంగా వర్ణింపబడుతూన్న కొన్ని భావాలని బుద్ధిమాత్రంచేత గ్రహించి తన తెలివినీ భాషనీ ఉపయోగించి ప్రకటిస్తే సాదారకం కవిత్వం తయారవుతుంది. విరహాన్నీ రాత్రి వర్ణననీ బాధల్నీ రాజుల్నీ యితఃపూర్వం అనేకులు చెప్పిన బాటలలో పరిధులలో యిప్పుడూ వెలువరించితే మనల్ని కదిలించలేదు. కొన్ని ప్రబంధాలలో ప్రకృతి వర్ణనలు వింత నిస్తేజంగా ఉంటాయి! తన యింట్లో బూర్జెమూకుడునీ పాతబట్టలబుట్టనీ చూపినట్లుగానే ఉదయసాయంసంధ్యల్నీ తోటల్నీ పువ్వుల్నీ చూపిస్తాడు పాదాకవి. ఈ ప్రకృతిలో నక్షత్రాలలో పువ్వులలో నీరవంగా నిగూఢంగాఉన్న స్వభావాన్నీ హృదయాన్నీ బహిర్గతం చెయ్యలేడు.

నిజమైన అనుభూతిని మనం సులువుగా పోల్చుకోగలం. మేరువంత బరువు గుండెమధ్య భాగమందు, అనగానే చటుక్కున కదలిపోతాం. 'ఇట్టిపదంబుగాంచి పరమేశ్వరునిం గృతినాథుచేసి' అని తిక్కన అన్నప్పుడు ద్వితీయానుభూతివల్ల కలిగే ఒక ఉదాత్తత స్ఫురిస్తుంది. సురనదియు కాళిందియు బెరసినట్లు కాంతిపూరంబు శోభిల్ల, శాంతమూర్తి' అయిన సర్వేశ్వరుడు సన్నిధి చేశాడు కాబట్టి ఆ తృప్తీ గర్వమూ కలిగాయి. మార్మికమూ ఆధ్యాత్మికమూ అయిన కవితలో నిజాయితీ లేకపోతే కవి చటుక్కున దొరికిపోతాడు.

'దేవుడా, నువ్వు మా యింటికొస్తే కూర్చోనేందుకు కుర్చీలు లేవు' అనే అర్థంవచ్చే పద్యాలున్నాయి. మనకి హేళనతో కూడిన నవ్వు వస్తుంది. 'దేవుడా నువ్వు మా యింటికొస్తే డబ్బాపాలతో చేసిన కాఫీ యిస్తాను. ఏం చెయ్యను మరి. పాలవాడు నాడకం మానేశాడు' అని అనవచ్చును కూడా. ఇది కవిత్వం అవదు. (ఇక్కడ నిజమైన లేదు). దేవుడంతటి మహాత్ స్వరూపాన్ని భావించకలిగే నైశిత్యమూ వైశాల్యమూ ఆ అనుభూతికి లేవు. పై అఫీసరునో మరో పెద్దమనిషినో అలా గౌరవించాలంటే మనకి అర్థం అవుతుంది. కాని యీ కుర్చీ బీరువా మనస్తత్వానికీ దేవుడికీ చాల దూరం వుంది. నేను చాలా పాపాలు చేశాను. వయస్సు ముసలిదై పోతోంది. మా ఆవిడకి పదకొండో కాన్పు; ఇంక నాకు మోక్షం ఎలా ప్రభూ' అనే ధోరణిలో కొన్ని వందల పద్యాలూ శతకాల్లోనూ, విడిగానూ వచ్చాయి. వీటిలో పారమార్థికమైన అన్వేషణ, తపన, తహతహ వుండవు. దేవుణ్ణి **feel** అయి పెట్టుకునే మొరయొక్క అరుంతుదమైన బాధ వుండదు. సాంప్రదాయికంగా వస్తూన్న పాపభీతితో సమీప మృత్యుభయమో వీరి నిలాగ తొందరపెట్టి వ్రాయిస్తుంది. పుట్టువుని సెకలించే వేదన, నలువైపులా చేతులుసాచి పరుగెత్తే అన్వేషణా, ఉన్మాదమూ ఉంటేకాని ప్రాణంవున్న భావాలూ మాటలూ రావు. నా వెనుకనున్న కవి పరంపరను పేలవంగా ప్రతిధ్వనిస్తూగాని, చతికిలబడిపోయిగాని మాటల్ని కూర్చి ఛందస్సులో యిరికిస్తే సత్యమైన కవితాకంఠం అక్కడ వినిపించదు.

బహిరంతరాత్మల మధ్య కలిగే సంయోగాన్ని కవి గుర్తించగలిగినపుడే నిజమైన ఆధ్యాత్మిక రచన రావడానికి వీలుంది. దీన్నే **'essentail unity'** అన్నారు. రోమాంటిసిజమ్ యీ సూత్రాల మీదే ఆధారపడి ఉద్భవించింది. ఈ సంయోగాన్ని కళాచైతన్యం తీసుకురాగలదు. కవిత్వం యితివృత్తాలనుండి క్రమంగా వ్యక్తిగతం కావడంలోని విశిష్టతకూడా యిదే. కవి డైరెక్టుగా చుట్టూ ఉన్న ప్రపంచాన్నీ ప్రకృతినీ తన జాగృతి ఆవరణలోకి తెచ్చుకుని ఆ అనుభూతిని మనకి అందిస్తాడు. 'విశ్వవీణాగళమ్ము ఘోరున

ఘోరున నీ వాడు (మోతవెట్టు' అని కవి అన్నప్పుడు విశ్వాన్ని ఆకళింపు చేసుకునే నిశితచైతన్యాన్ని కొంతైనా ప్రదర్శిస్తున్నాడు.

The best poetry should not be finally understood' అని అంటాడొక అమెరికన్ కవి. మంచి కవిత్వం—గొప్పకవిత్వం—సంపూర్ణంగా అర్థం కాకూడదని అతనంటాడు. ఇదేదో విచిత్రంగా అసంబద్ధంగా అవివేకంగా కనబడినా యిందులో నిజం వుంది. వంకాయ యిగురువచ్చడి చెయ్యడం గురించీ ట్రాఫిక్ రూల్సు గురించీ సబ్బు బిళ్ళల తయారీ గురించీ మనం పూర్తిగా తెలుసుకోవచ్చును. ఒకసారి తెలుసుకున్న తర్వాత దాన్ని గురించి ఆలోచించవలసిన పనిలేదు. వాటిని గురించిన రహస్యాలేవో మన మనసులో గుసగుసలాడవు. చేతిలో వొలిచిపెట్టిన అరటిపండుమట్టూ ఏవో అద్భుతాలూ అదృశ్యశక్తులూ లేవు. చటుక్కున నోరు తెరచి మింగెయ్యవచ్చును. కవిత్వం—మంచి కవిత్వం—అలాంటిది కాదు. అది అర్థమైనట్టు తోస్తుంది. కాని యింకా ఆ కవితలో, కవితమట్టూ ఏదో గారడీ వున్నట్టూ, మనకి దొరకకుండా తప్పించుకుంటూన్నట్టు అనిపిస్తుంది.

ఈ గుణాన్ని మనం ధ్వని అని suggeshion అనీకూడా పిలవవొచ్చును. ఒక వీణతంత్రి మీటగానే కలిగిన ఖంగన్న శబ్దాన్ని ఆశ్రయించి అలా అలా ధ్వనితరంగాలు కొంతసేపు ప్రకంపించి చివరకు గాలిలో కలసిపోతాయి. అప్పుడుకూడా ఆ ప్రకంపన ఆ గాలిలోనో యింకా మన మనసులోనో మసలుతూన్నట్టు అనిపిస్తుంది. అదే విధంగా అసలైన కవితనుండి స్ఫుటంగా వచ్చే అర్థంతోపాటు అస్ఫుటంగ ఎన్నో అర్థాలు అనుభవాలు ప్రకంపితమౌతుంటాయి. పర్వత శిఖరంమీద చెరువులో నీటిమీద అడవిమీద కదలే ఆడదాని కురులమీద లేత ఎండ పడినపుడు ఆయా స్వరూపాల అంచులు (contours) కదలిపోయినట్టు విస్తరించినట్టు అనిపిస్తుంది. అటువంటి అనుభవమే కవిత్వమూ కలిగిస్తుంది.

ఓ. యనగ ఓహోహోయన బోయవాండ్రు
నీటి వెలువల నేల్కొనె తోట చెరువు
ఓ. యనగ ఓ. హోహో యన బోయవాడు
తోట వెలుపల కాలువ తొనకె నిదుర

ఈ పద్యం విన్న సహృదయుడు ఆహా అని ఆనందాన్ని సూచిస్తాడు. అందమైన పెళ్ళికూతురు పల్లకీలో వెళుతూంటే ప్రకృతి అంతా పులకరించిందనీ అందగించిందనీ తాత్పర్యం చెప్పకోవచ్చును. అయినా తోట చెరువు మేల్కొవడమూ, కాలవ నిదురలో తొనకడమూ ఏదో విచిత్రంగానే ఉంటుంది. పద్యం చదివి పుస్తకం మూసివేసినా బోయీల స్వరం యింకా మనసులో తారట్లాడుతూనే ఉంటుంది. కాలవ నిదురలో తొనకడం యింకా వెంటాడుతూనే వుంటుంది. మనస్సుద్వారా పొందిన యీ అనుభూతి యింకా లోపల్లోపలకు చొచ్చుకుని ఒక విశ్వజనీనమైన సౌందర్య భావనలో ఆత్మానందంలో లయమౌతుంది. అప్పుడే కవిత కాలావధుల్ని దాటిన ఒక శక్తితో సాక్షాత్కరిస్తుంది.

ఇటువంటి పద్యమే మరొకటి—

గాఢాలింగన వామనీ కృత కుచ ప్రోద్భిన్న రోమోద్గమా
స్నేహోనంద రసాతిరేక విగళత్ శ్రీ మన్నితంబాంబరా
మామామానదమాతిమామలమితిక్షామాక్షరోల్లా పినీ
సుప్తా కింను మృతాను కిం మనసి మే లీనా విలీనాను కిం

ఇది మామూలుగా వినవచ్చే శృంగార శ్లోకం లాంటిదని పిస్తుంది. నిజంగా మొదటి మూడు పాదాలూ అంతే. ప్రియుని గాఢాలింగనంలో ఆమెకు రోమాంచం కలిగింది. పిరుదులమీద బట్ట దానంతట అదే జారిపోయింది. ఆమె అవశయ్యే పోయింది. కాని నాల్గవపాదంలో మన్ని చటుక్కున ఆశ్చర్యపరచే భావంవుంది. ఈమె నిద్రపోయిందా చచ్చిపోయిందా నా మనస్సులో లీనమయిందా లేక కరగిపోయిందా? అని ప్రియుడు విస్తుపోతాడు. మామూలు తాత్పర్యాన్ని మించిన భావనాసౌందర్యం ఈ ప్రియుని సంశయంలో వుంది. నిద్రపోయింది చచ్చిపోయింది అంటే ఆమె చేష్టలు తక్కి వివశయై వరున్నదీ అనుకోవచ్చును. కాని యిక్కడి ప్రియుని మనస్సులోకి లీనమవడం ఏమిటి? లేక ఆమె కరగిపోవడం ఏమిటి? ఇక్కడ శృంగారం భౌతికావధుల్ని దాటిపోయింది. విషయలోలుపతవల్ల, కామోద్రిక్తతవల్ల కలిగే ఒకానొక స్థితిలో ఉన్మత్తత అవశత కలగవచ్చును కాని యీ కరగిపోవడం రెండు హృదయాల రెండు ఆత్మల ప్రేమాతిరేకతవల్ల మాత్రమే కలుగు....

(అలా అలా యింకా ఎంత రాసుకుపోదామనుకున్నాడో పాపం తిలక్ — ఈ వ్యాసం యిలా చటుక్కున ఆగిపోయింది. ఇది అంతమే లేని దీర్ఘ నిశ్వాసమై......)

ఐరోపా సమిష్టి విపణి - భారతదేశం

శ్రీ బారు గోవిందరావు

ఇటీవలి కాలంలో ఐరోపా సమిష్టి విపణి ప్రజల దృష్టిని ఎక్కువగా ఆకర్షిస్తూ వచ్చింది. బ్రిటన్ అందులో చేరుతుంది గనుక, ఆ చేరినదాని ఫలితాలు, ప్రభావాలు ఎట్లా వుంటాయి? ముఖ్యంగా బ్రిటిష్ కామన్వెల్త్‌కు చెందిన దేశాల మీదను, భారతదేశం మీదను ఆ ఫలితాలు, ప్రభావాలు ఎట్లా ప్రసరిస్తాయి— అన్నది గూడా ప్రజల మనస్సు ముందు నిలుస్తూ వస్తున్నది. సమిష్టి విపణికి చెందిన పశ్చిమ జర్మనీ, ఇటలీ, లగ్జెంబర్గ్, నెదర్‌లాండ్స్, బెల్జియమ్, ఫ్రాన్సు దేశాలు 1956—57 లో రోమ్ ఒప్పందానికి ప్రాతిపదికగా 'స్పాక్' నివేదికను ఆమోదించి వున్నాయి. అది పూర్తిగా లక్ష్యంలో రాజకీయమైనది. 1958 జనవరిలో ఐరోపా సమిష్టి విపణి ఏర్పడింది. ఆ విపణి యొక్క ముఖ్య లక్ష్యాలు యీ విధంగా చెప్పబడినాయి.

1. విపణిలో సభ్యత్వంవున్న రాజ్యాలమధ్య సన్నిహితమైన ఆర్థిక, రాజకీయ సంబంధాలు కలిగి వుండటం.

2. వృథాఉత్పత్తిని నివారణ చేసుకునేందుకుగాను కృషివిభజన జరుపుకొనటం.

3. సమర్థవంతమైన యాజమాన్యం నిర్వహణం.

4. వ్యవసాయము, వ్యాపారము, మార్కెట్లసంపాదనము మొదలైనటువంటి విషయాలలో అన్యోన్యమైన ఏర్పాట్లు చేసుకొనటము, సంయుక్త వ్యవస్థలను ఏర్పరచుకొని వాని ద్వారా పనులు జరిపించుకొనటము.

5. రష్యానుండి రక్షణకు రక్షణపథకాలు వేసుకొనటము.

మొదటిప్రపంచయుద్ధానికి ముందు, ఐరోపాలో ఎన్ని రకాల వ్యాపార నిరోధ పద్ధతులు వున్నప్పటికిన్నీ ఒక పద్ధతి ఆర్థిక సహకారం కొనసాగుతూ వచ్చింది. ఆ యుద్ధం తరువాత విశాలఐరోపానిర్మాణభావ ప్రపంచం పైకి వస్తూ వచ్చింది. అయితే 1930 ప్రాంతాల బ్రహ్మాండమైన ఆర్థిక సంక్షోభము, మాంద్యము ఏర్పడి, ఆర్థిక సంబంధమైన కంట్రోళ్ళు, స్వాయత్త ద్రవ్య పద్ధతులు అవలంబించబడినాయి. రెండవ ప్రపంచ యుద్ధ సందర్భంలో ఐరోపా పునర్నిర్మాణాన్ని సాగించవలసి వచ్చినప్పుడు అనేక రాజ్యాల మధ్య వ్యాపారము, చెల్లింపుల పద్ధతులువచ్చి పడ్డాయి. 1947లో 'గాట్' ఒప్పందం కుదిరింది. ఆ ఒప్పందం ద్వారా వస్తువుల మీద టారిఫ్‌లు తగ్గేవిధంగా చూసుకోటానికి, బేరసారాలు సాగేందుకు వీలు ఏర్పడింది. ఇదిగాని లేక అంతర్జాతీయద్రవ్యనిధిగాని, ఐరోపాలో రాజకీయమైనటువంటి ఆర్థికమైనటువంటి సమైక్యతను నిర్మించటానికి సమర్థాలు కాలేక పోయాయి. ఐరోపా చెల్లింపుల వ్యవస్థ అందువల్ల ప్రారంభించబడింది. అందులో సభ్య రాజ్యాల మధ్య ద్రవ్యాల బదిలీలకు, పరపతులు యివ్వడానికి యిది ఉద్దేశించబడింది. అమెరికాకు, ఐరోపాలో రాజకీయమైనసుస్థిరత్వం ఉండటం అవసరం. ఆ రాజ్యాలు ఆర్థికంగా కోలుకోవటం కూడా అమెరికాకు ముఖ్యమైన విషయం అయింది. అయితే సమిష్టివిపణిదేశాలుగావున్న ఆరు ఐరోపా రాజ్యాలలోను టారిఫ్ గోడలు అమెరికాకు పెరుగుతూ వచ్చాయి. ఇదికాక ఐరోపాలో ఐరోపా స్వేచ్ఛా వ్యాపార మండలమని గూడా ఒకటి వుంది. అందులో నార్వే, స్వీడన్, డెన్మార్క్, బ్రిటన్, స్విట్జర్లెండ్, పోర్చుగల్, ఆస్ట్రియాలు వున్నాయి. ఈ ఏడురాజ్యాలు పై ఆరు రాజ్యాలు కలిసే అవకాశం వున్నదా— అని గూడా అమెరికా ఆలోచిస్తూ వచ్చింది. ఈ స్వేచ్ఛా వ్యాపార మండలం 1960 లో బ్రిటన్ యొక్క ప్రోత్సాహంతో ఏర్పడింది. 1970 నాటికి యీ రాజ్యాల మధ్య టారిఫ్ నిర్బంధాలు లేకుండా చేసుకోవాలన్నది అప్పుడు వారు పెట్టుకున్న లక్ష్యం. ఆ లోగా పశ్చిమ ఐరోపా, ఆర్థికంగా ఉరకలు వేస్తూ అభివృద్ధి చెందుతూ వచ్చింది. అభివృద్ధి రేటు మంచి ఉదాత్తంగా వుంటూ వచ్చింది. బ్రిటన్‌లోగాని, అమెరికాలోగాని అభివృద్ధి రేటు, ఆస్థాయిలో వున్నది లేదు. 1967 కు ముందు గడిచిన సంవత్సరాలలో సమిష్టి విపణి రాజ్యాల పారిశ్రామికోత్పత్తి 68 శాతం పెరిగింది. ప్రజలయొక్క జీవన ప్రమాణం 41 శాతం పెరిగింది. పరిశ్రమలలో ఉత్పాదకత 70 శాతంగా పెరిగి కొనసాగింది. వ్యాపారం 200 శాతం పెరిగింది. 1973 జనవరి నాటికి సమిష్టి మార్కెట్లను ఏర్పాటు చేసుకునే పద్ధతిని పూర్తి చేయాలని ఆ రాజ్యాలు అనుకున్నాయి. ఈ సమిష్టి విపణిలోని ఆరురాజ్యాలున్నూ అమెరికా మీద ఒకరకమైన ఒత్తిడిని తీసుకురావటం మొదలు పెట్టాయి. వ్యాపారంలో ఆత్మరక్షణ పద్ధతులను వదలి పెట్టవలసిందనీ, అట్లా చేసినట్లయితే తాము, అమెరికాకు కొన్ని కొన్ని టారిఫ్ మినహాయింపులను సమకూర్చగలమని ఆరాజ్యాలు అన్నాయి. సమిష్టి విపణిరాజ్యాలలో ఉత్పాదకత— ఉన్నతస్థాయిలో వుండటం వల్లను, వస్తూత్పత్తి ఖర్చు అంత ప్రియం కాక పోవటం వల్లను, అమెరికాకంపెనీలు యీ దేశాలలో తమకార్యక్రమాలను ప్రారంభం చేశాయి. ఇందుమూలంగా అమెరికా యొక్క వ్యాపారపుతరుగు 1968—70 ల మధ్య కొంత తగ్గి ఆ నాటి సమస్య కొంత మెరుగ్గా కనిపించింది.

ఇది యిట్లా వుండగా, ఐరోపా స్వేచ్ఛా వ్యాపార మండలం వలన బ్రిటన్ విశేషమైన ప్రయోజనాలనుగా పొందలేకపోయింది. సమిష్టి విపణి రాజ్యాలలో వస్తూత్పత్తి రేటు ప్రతివర్షప్రవర్ధమానంగా కొనసాగుతూ వస్తున్నది. అందువల్ల ఒక పది సంవత్సరాల క్రిందట సమిష్టి విపణిలో చేరతానంటూ బ్రిటన్

మంతనాలు ప్రారంభించింది. ఆ మంతనాలకు లక్ష్యాలు యివిగా చెప్పబడి వున్నాయి:

1. కామన్వెల్తు ప్రతినిధిగా యూరోపుతో వ్యవహరించటం.
2. తన ఆర్థిక వ్యవస్థను మెరుగు పరచుకోవటం.
3. తన పరిశ్రమల వస్తువులకు పెద్ద పెద్ద ఆర్డర్లు సంపాదించుకొనగల్గడం.
4. పరిశ్రమలు వైవిధ్యాన్ని పెంచుకోవటము, సాంకేతిక విజ్ఞానపు ప్రయోజనాలను సమకూర్చుకొనటము.

ఇంతలో 1958 లో జనరల్ డిగాల్ ఫ్రాన్సులో అధ్యక్ష పదవికి వచ్చారు. ఆయనకు యూరోపులో అమెరికా పలుకుబడి పెరగటం నచ్చింది కాదు. మార్షల్ పథకం వల్ల యూరోపు రాజ్యాలు, ఆర్థిక పునరుజ్జీవనాన్ని పొందివున్నప్పటికిన్నీ ఆయన అమెరికా విషయంలో ఆ వైఖరిని అవలంభించారు. సమిష్టి విపణిలో బ్రిటన్ ప్రవేశానికి ఆయన అడ్డు నిలిచారు. ఉత్తర అట్లాంటిక్ రాజ్యాలు, అమెరికాల మధ్య సమ భాగస్వామ్యం వుండాలని బ్రిటన్ అనటం, ఆయన యీ ప్రతిఘటనకు కారణమైంది. ఆ రాజ్యాలన్నీ గూడా ఆ ఉత్తర అట్లాంటిక్ మండలంలో సభ్యత్వం కలిగి వుండటంవల్ల బ్రిటన్ ఆ విధంగా ప్రతిపాదించి వుంది. అయితే ప్రపంచంలో సంఘటనలు, మనం అనుకున్నంత నెమ్మదిగా వుండవు. అతిత్వరగా నడుస్తాయి. 1970 జూన్లో సమిష్టి విపణి యొక్క మండలి లగ్జెంబర్గ్లో సమావేశమైంది. సమిష్టి విపణిలో ప్రవేశానికి బ్రిటన్ పెట్టుకున్న దరఖాస్తును ఆ మండలి పరిశీలించింది. 1972 జనవరి 22 వ తేదీన బ్రిటన్ సమిష్టి విపణిలో ప్రవేశం చెందుకు మార్గాన్ని సవరించుకో గలిగింది. ఆ రోజున బ్రిటిష్ ప్రధానమంత్రి శ్రీ ఎడ్వర్డ్ హీత్ బ్రస్సెల్స్ ఒప్పందంపై సంతకం చేశారు. డెన్మార్క్, నార్వే, ఐర్లెండ్ గూడా సమిష్టి విపణిలో చేరాయి. బ్రస్సెల్స్ ఒప్పందం మీద సంతకాలు చేశాయి. అంతవరకు ఆరు రాజ్యాలతో మాత్రమే కూడివున్న యూరోపు సమిష్టి విపణి పది రాజ్యాలు గల విశాల విపణిగా పరిణామం చెందింది. 1973 జనవరి 1 వ తారీఖున యీ కొత్త రాజ్యాలు, నాలుగూ విపణిలో అధికారికంగా ప్రవేశిస్తాయి. ఆ లోగా ఆ దేశాల పార్లమెంట్లు, వాటి యీ ప్రవేశానికి ఆమోదముద్రను సమకూర్చవలసి వుంటుంది. ఇప్పుడు యీ రాజ్యాలు అన్నీ, పశ్చిమ యూరోపును నియంత్రించ గలమన్న, యూరోపు ప్రాక్ పశ్చిమ రాజ్యాల మధ్య వ్యత్యాసాలను తగ్గించగలమన్న, మానవలోకానికి సుఖసౌఖ్యాలు ఎక్కువ కాగల పరిస్థితి కల్పించగలమన్న పెద్ద ఆశ పెట్టుకొని పని చేస్తున్నాయి. అంతేగాక సమిష్టి విపణి యొక్క ఏ విధమైన విస్తరణ యూరోపుకు బలాన్ని చేకూర్చి, అమెరికాతో, రష్యాతో, చైనాతో విడివిడిగానైనా, లేక ఆ మూడు రాజ్యాలలో ఏర్పడే సంఘటనలతో నైనా, తన బలాన్ని నిరూపించుకోగలిగిన స్థితి యూరోపుకు కలుగ వస్తున్న భావం ఒకటి ప్రబల మవుతున్నది. ప్రపంచదృష్టిలో, రాజకీయదృష్టిలో, లేక మిలిటరీ దృష్టితో యీ పరిస్థితిని పరిశీలిస్తే, యీ అంశం స్ఫుటమై గోచరిస్తుంది.

యూరోపు సమిష్టి విపణిలో బ్రిటన్ చేరుతూవున్నందువల్ల, ఆ దేశం యిక సంయుక్త యూరోపుతో తన స్వాతంత్ర్యం నిర్వహించవలసి వుంటుందని, అంతేగాక స్వతంత్రమైన ప్రపంచ రాజ్య ప్రతిపత్తిని వదులుకోవలసి వుంటుందని యిక్కడ స్పష్టపడుతూనే వుంది. యూరోపు స్వతంత్ర వ్యాపార మండలంలోని తన భాగస్వామి రాజ్యాలతో బ్రిటన్ ఈ వున్న విషయాన్ని చెప్పివేసింది. 1972 డిశంబర్ 31 వ తారీఖున తాను స్వేచ్ఛావ్యాపారమండలం నుంచి నిష్క్రమిస్తున్నట్లు తెలియపరచింది. అది సరిగా, బ్రిటన్, యూరోపు సమిష్టి విపణిలో చేరే రోజుకు ముందు రోజు. 1973 జనవరి 1 వ తారీకున బ్రిటన్ అధికారికంగా సమిష్టి విపణిలో ప్రవేశిస్తుంది. ఆ ప్రవేశించినపుడు బ్రిటన్ తన అనేక శాసనాలను సవరించుకోవలసి వుంటుంది. గుత్తస్వామ్యపద్ధతులు, పన్నులు, రవాణా, వలసపద్ధతి, మొదలైన అనేక విషయాలలో తన శాసనాలను యూరోపు సమిష్టి విపణి రాజ్యాల శాసనాలతో సదృశ స్థితిలోనికి వచ్చే విధంగా— మార్చుకోవలసి వుంటుంది. యూరోపుతో సమైక్యతాసాధనకు అనుకూలమైన విధానాలను ప్రోత్సహించేందుకు యూరోపుసమిష్టివిపణిరాజ్యాలు తమ తమ దేశాలలో యూరోపు వ్యవహారాల మంత్రులను నియమించటం బాగుంటుందని ఫ్రాన్సు అధ్యక్షుడు శ్రీ పాంపిడో సూచించి వున్నారు. ఈ సూచన ఎంతవరకు పనిచేస్తుందో కూడా చూడవలసి వుంది. అదేవిధంగా పశ్చిమ జర్మనీ ఛాన్సలర్ మరోవిధమైన అభిలాషను వ్యక్తం చేశారు. ఈ సంవత్సరం మధ్యలో భద్రతా సమస్యలకు సంబంధించిన మహాసభను ఒకదానిని జరిపించాలని ఆయన అభిలషిస్తున్నారు. దీని విషయం గూడా చూడవలసి వుంది.

ఇవి అన్నీ యూరోపుకు సంబంధించిన సమస్యలు. ఇక్కడ మరి యితర రకములైన సమస్యలు గూడా కొన్ని వున్నాయి. యూరోపుసమిష్టి విపణిలో బ్రిటన్ చేరటం వల్ల, కామన్వెల్తురాజ్యాల మీద దాని ఫలితాలు, ప్రభావాలు ఎట్లా వుంటాయి— అన్న విషయానికి సంబంధించిన సమస్య అది. యూరోపు సమిష్టి విపణి వున్నదంటే ఆ విపణికి ఒక వ్యావసాయకవిధానం వుంది ఆ విధానం క్రింద వున్న ఏర్పాట్లు యివి: ఈ విపణిలో సభ్యత్వంగల రాజ్యాలు, విదేశాలలో ధరలు తక్కువ పలికే పంచదార, పాడి వుత్పత్తులు మొదలైన ఆహారద్రవ్య విశేషాలను దిగుమతి చేసుకో కూడదు. విపణి సభ్య రాజ్యాలలోనే వానికి మంచి ధరలు యిచ్చి, సబ్సిడీలు యిచ్చి ఉత్పత్తి ఎక్కువ చేసుకోవాలి. నిస్సంపన్న దేశాలకు యీ సరుకులు సహాయ ద్రవ్యాల క్రింద సమకూర్చబడుతూ వుంటాయి కాబట్టి ఆయా దేశాలలో వాటి వుత్పత్తి నిరుత్సాహపడిపోతూ వుంటుంది. ఇంతకీ యూరోపు సమిష్టి విపణిలో బ్రిటన్ చేరుతూ వుండటం వల్ల కామన్వెల్తు రాజ్యాలతో చిరకాలంగా, ఫలసంతంగా బ్రిటన్ కొనసాగించు కుంటూ వస్తున్న ఆర్థిక సహకారం మీద చివరి తెర జారి పడుతోంది.

భారతదేశం వున్నదంటే, యిప్పుడు ఎగుమతుల విషయంలో సుంకాలను మీద వేసుకోవలసి వుంటుంది. అయితే భారతదేశం ఒక పని చేసింది. 1968 లోనే యూరోపు సమిష్టి విపణి దేశాలతో కొన్ని ఒప్పందాలు వ్రాసుకుంది. అవి భారతదేశం ఎగుమతుల మీద, ఆ దేశాలు టారిఫ్ సుంకాల తగ్గింపులకు సంబంధించిన ఒప్పందాలు. అదే సంవత్సరం మార్చి నెలలో ఐక్యరాజ్య సమితి వాణిజ్య వ్యాపారము—అభివృద్ధి మహాసభలు ఢిల్లీలో జరిగాయి. ఆ మహాసభలకు 132 రాజ్యాలు హాజరైనాయి. సంపన్న దేశాలకు, నిస్సంపన్న దేశాలకు మధ్య ద్రవ్యాధారాల విషయంలోవున్న తేడాలు, ప్రపంచ వ్యాపార వస్తువులలో సంస్కరణల ఆవశ్యకత, వర్ధమాన దేశాల ఎగుమతులకు సౌకర్యాలు, ధరల స్థిరీకరణకు చర్యలు మొదలైన సమస్యలను గురించి ఆ మహాసభలో చర్చలు జరిగాయి. ప్రతినిధుల అభిప్రాయాలలో ఏకాభిప్రాయం కుదరలేదు. పెద్ద ఫలితాలు ఏవీ కూడా అక్కడ సాధించబడలేదు. వర్ధమానదేశాలు, స్వావలంబన పద్ధతులద్వారాను, ప్రాంతీయ సంయోజనం ద్వారాను, అభివృద్ధిని సాధించుకోవాలని అక్కడ కొన్ని సూచనలు వచ్చాయి. పోతే సంపన్నదేశాలు,

తమ తమ స్థూల జాతీయ ఉత్పత్తుల మొత్తంలో ఒక్క శాతం విలువను వర్ధమాన దేశాల యొక్క అభివృద్ధి కోసం వినియోగించుచాలని అన్న ప్రతిపాదన కూడా వచ్చింది. ఈ పద్ధతిలో అయితే వర్ధమాన దేశాలకు ఏ సంవత్సరానికి ఆ సంవత్సరం 200 కోట్ల డాలర్ల చొప్పున సహాయం లభిస్తూ వుంటుంది. భారతదేశం యింతవరకు బయట ప్రపంచం నుంచి పొందిన సహాయంతో ఋణ భారం 5500 కోట్ల రూపాయలకు పైగా పెరిగింది. ఈ మొత్తంలో పి. ఎల్. 480 మొత్తాలుగాని, అంతర్జాతీయ ద్రవ్యనిధి నుంచి తీసుకున్న మొత్తాలు గాని చేర్చబడి లేవు. ఈలోగా బ్రిటన్ ఒక నిర్ణయం చేసింది. 33 సంవత్సరాలనుంచి, భారతదేశం—బ్రిటన్ల మధ్య ఒక వాణిజ్య ఒప్పందం నడుస్తోంది. దానిని ఏకపక్షంగా అంతం చెందించడానికి బ్రిటన్ నిర్ణయం తీసుకుంది. 1973 జనవరి 1 వ తేదీన సమిష్టి విపణిలో ప్రవేశించిన తరవాత అయిదు సంవత్సరాల వ్యవధిలో బ్రిటన్, తన జలచర వ్యవసాయము, పరిశ్రమలు, వ్యాపారములకు సంబంధించిన విధానాలను అన్నింటిని— ఆ విపణిలోని యితర సభ్య రాజ్యాల విధానాలతో సదృశమైన పరిస్థితిలోనికి తీసుకు రావలసి వుంటుంది. ఇటువంటి ఏర్పాట్ల మూలంగా బ్రిటన్, భారతదేశాల మధ్య వ్యాపారం, మరికొంత కష్టమైన స్థితిలో పడే సావకాశం వుంది— 1961 లో భారతదేశం, బ్రిటన్‌కు 1450 లక్షల పౌను స్టెర్లింగ్ విలువ చేసే సరుకులు ఎగుమతి చేసింది. 1970 లో యీ ఎగుమతులు 1060 లక్షల పౌను స్టెర్లింగ్ మాత్రంగా వున్నాయి. 1961 లో భారతదేశం సర్వమైన ఎగుమతులలోను 27 శాతం ఎగుమతులు బ్రిటన్‌కే జరుగుతూవుండేవి. దిగుమతులో 20 శాతం దాకా బ్రిటన్‌నుంచే దిగుమతి అయ్యేవి. 1970 లో పరిస్థితి యింకో విధంగా వుంది. భారతదేశం ఎగుమతులలో అప్పుడు 12 శాతం ఎగుమతులు మాత్రమే బ్రిటన్‌కు పోతూ వచ్చాయి. దిగుమతులలో గూడ బ్రిటన్ వాటా తగ్గింది. అది 7 శాతంగా మాత్రం వుంది. ఇప్పుడు సమిష్టి విపణి వున్నదంటే అక్కడ సుంకాలు, కోటాలు, పరిమితులు వంటి పద్ధతులు వున్నాయి—. అటువంటి బాధలను భారతదేశం యిప్పుడు ఎదుర్కొనవలసి వుంటుంది. భారతదేశం పరిశ్రమలలో తయారైన సరుకులకు 5 శాతం మొదలు 12 శాతం వరకు సుంకాలు చెల్లించుకోవలసి వస్తుంది. అంతేగాక యిరోపా సమిష్టి విపణి రాజ్యాలతో పోటీని తట్టుకోవలసి వుంటుంది. ప్రస్తుతానికి బ్రిటన్, కొన్ని కొన్ని భారతదేశపు సరకుల మీద సుంకాలను తగ్గించింది. భారతదేశం, ప్రధానంగా బ్రిటన్‌కు తేయాకు, పొగాకు, వస్త్రాలు, తెలగపిండులను ఎగుమతి చేస్తూ వుంటుంది. ఇప్పుడు యివి ప్రతికూల ఫలితాలను ఎదుర్కొనవలసి వుంటుంది. పొట్లాలుగా కట్టి పంపించే తేయాకుపై భారతదేశం సుంకాన్ని చెల్లించవలసి వుంటుంది.— సమిష్టి విపణి రాజ్యాలకు యీ బాధ వుండదు. బ్రిటన్ యిప్పుడు మన దగ్గర తేయాకును పెద్ద మొత్తాలలో కొని పొట్లాలు కట్టి యిరోపాలో బేరసారాలు సాగించ వచ్చు. సమిష్టి విపణిలోని తన సహరాజ్యాలకు ఆ సరుకును అమ్మవచ్చు. ఇది భారతదేశానికి అనుకూలమైన విషయం కాదు. బ్రిటన్‌కు భారతదేశం, 1939 ఒప్పందం ప్రకారం తన పొగాకు ఎగుమతులలో 30 మొదలు 35 శాతం వరకు ఎగుమతి చేస్తోంది. ఇక్కడ సరుకు మొత్తాన్ని గురించిన కొనుగోళ్ళ విషయంలో పోటీలు వున్నాయి. ముందు ముందు యీ సౌకర్యం మనకు వుండదు. బ్రిటన్‌లోనే పొగాకు వ్యాపారం విషయంలో పోటీలను భారతదేశం ఎదుర్కొనవలసి వస్తుంది. అమెరికా, గ్రీసు, టర్కీ వంటి దేశాలతో పోటీపడవలసి వస్తుంది. తెలకపిండులు వున్నాయంటే, అవి వ్యవసాయం పద్దుల క్రింద వర్గీకృతం చేయబడుతున్నాయి; అందువల్ల మన యీ సరుకు ఎగుమతుల మీద వేరు వేరు సుంకాలు పడతాయి. ఈ సరుకుల విషయంలో మనం ఆఫ్రికా దేశాలతో పోటీకి దిగవలసి వుంటుంది.

బ్రిటిష్ కామన్వెల్తులో వున్న దేశాలు అన్నింటి స్థితియిదే అని చెప్పటానికిలేదు. కెనడా, ఆస్ట్రేలియా వంటి రాజ్యాలు వున్నాయంటే అవి సంపన్న దేశాలు. బ్రిటన్‌లో తమ సరుకులకు పూర్వం వున్న సౌకర్యాలు పోయినందువల్ల వచ్చే నష్టాన్ని భరించటానికి సమర్థమైన రాజ్యాలు అవి. ఆఫ్రికా రాజ్యాలైన నైజీరియా, కెన్యా, టాంజానియా, ఉగాండాల స్థితి వేరు. అవి వర్ధమానదేశాలే అయినప్పటికీ, ఆరాజ్యాలు సహసభ్యత్వం కలిగి వుండటం వల్ల సుంకాలలో రాహిత్యాలను, సౌకర్యాలను అనుభవించగలవి అవుతున్నాయి. న్యూజిలాండు వెన్నకు, జున్నుకు బ్రిటన్‌లో సౌకర్యాలు కొనసాగుతూనే వుంటాయి. ఎటువచ్చి ఆసియాలో వున్న కామన్వెల్తు రాజ్యాలే బాధలకు అగ్రం అవుతున్నాయి.

భారతదేశం యొక్క ప్రధానమైన సమస్య ఏమిటంటే — బ్రిటన్‌తో సహా విశాలయిరోపా సమిష్టి విపణితో భవిష్యత్ ఆర్థిక సంబంధాలు, వ్యాపార వాణిజ్య సంబంధాలకు సంబంధించింది.

బ్రిటన్‌కు తాను చేస్తున్న ఎగుమతులకు వున్న సౌకర్యాలు రహితం అవుతున్నందువల్ల వచ్చే నష్టాన్ని భారతదేశం ఏవిధంగా భర్తీ చేసుకోవాలి? సాధారణ వ్యాపార సౌకర్యాలు ఎంతమేరకు తనయొక్క విదేశీ వ్యాపారపు లోటును సర్దుబాటు చేయగలుగుతాయి? ప్రస్తుతం భారతదేశం యొక్క యీ వ్యాపారపు లోటు సాలుకు 100 కోట్ల రూపాయలుగా వుంటున్నది.

1961 లో సమిష్టి విపణి దేశాలనుంచి భారతదేశం రు. 196 కోట్ల సరుకులను దిగుమతి చేసుకున్నది. కాని 1970 లో ఆ దిగుమతులు రు 170 కోట్లే. దీనికి తగినట్లుగానే ఎగుమతులు పెరిగాయి. 1961 లో విపణిదేశాలకు రు. 52 కోట్ల సరుకులను ఎగుమతి చేసిన భారతదేశం 1970 లో రు. 100 కోట్ల సరుకులను ఎగుమతి చేయగలిగింది. కాబట్టి భారతదేశం యిప్పుడు సమిష్టి విపణి దేశాలతో వ్యాపార వాణిజ్య సహకారం కోసము తగు ఏర్పాటు చేసుకోవలసి వుంటుంది. వస్తువుల మీద సుంకాలు, ఆర్థిక సహాయము మొదలైనవాటిని గురించి తగు ఏర్పాట్లు చేసుకొని వస్తూత్పత్తి వ్యవస్థను అందుకు అనువుగా సరిదిద్దుకొనటము, సాంకేతిక సహకారాన్ని పొందటము, మొదలైన కార్యాలను సాధించుకోవలసి వుంటుంది. అంతేగాక తన సరుకుల మీద సుంకాలకు సంబంధించి, యీ చెప్పిన యితర అంశాలను గురించి సమిష్టి విపణి రాజ్యాలతో వాణిజ్య సహకారరూపమైన ఒప్పందం కోసం భారతదేశం ప్రయత్నం చేయవలసి వుంటుంది. అనగా మనం యిచ్చట, ఆ దేశాలకు అవసరమయ్యే వస్తువులను ఉత్పత్తి చేయటం మొదలు పెట్టాలి. అందుకోసం మన పరిశ్రమలను మెరుగు పరుచుకోవాలి. మన పరిశ్రమల వ్యవస్థను సౌష్ఠవ పరచుకోవాలి ఇప్పుడు గనుక అమెరికా, చైనాలు సన్నిహితమైపోతే అప్పుడు యింకో విధమైన సమస్య ఏర్పడుతుంది. అమెరికాకు పూర్వం లాగా మనం సరుకులను, ఎగుమతి చేయలేక పోవచ్చు. ఎందుచేతననగా, చైనా సరుకులు మన సరుకులకంటే చౌకగా వుంటాయి కాబట్టి మనం, ఎగుమతి చేసే సరుకుల యొక్క ఉత్పత్తి ఖర్చులను తగ్గించుకోవలసి వుంటుంది. సరుకుల నాణ్యాన్ని మెరుగు పరచుకోవలసి వుంటుంది. ఎగుమతి ధరలను గురించి పరిశీలన చేసుకోవలసి వుంటుంది. అంతేగాక యింకో విధమైన సవాలును గూడా భారతదేశం ఎదుర్కొనవలసి వస్తుంది.

విజ్ఞానశాస్త్రం, సాంకేతిక విజ్ఞానం, ఆర్థికపరిస్థితులు, అతి వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. మన పరిశ్రమలు యింకా ముడిపదార్థాలను యింకా విడిసామానులను దిగుమతి చేసుకొంటూనే వున్నాయి. ప్రతి పరిశ్రమలే ఎగుమతి బాధ్యతలను నిర్వహించవలసి వుంటుంది. మనమైతే ఆహార రంగంలో స్వయం సమృద్ధిని స్వయం పోషకత్వాన్ని లక్ష్యంగా పెట్టుకొని పనిచేస్తూ వున్నప్పటికీ, విదేశీ ద్రవ్యాన్ని ఆర్జించవలసిన అవసరం అట్లాగే వుంది. ఈ పరిస్థితిలో ఎగుమతి, దిగుమతి వ్యాపారంపై ప్రభుత్వం యొక్క కంట్రోలు అంత హాంఫవీయంగా కనిపించదు.

యూరోప్ సమిష్టి విపణి, బ్రిటన్, భారతదేశం సమస్య యిట్లా వుంది. ఇది యిట్లా వున్నా మనం వ్యాపారాన్ని పెంపొందించుకోవటం కోసం ఆసియాదేశాల దిక్కుకు, ఆఫ్రికా దేశాలవైపుకు, యూరోప్ దేశాల దిశకు, రష్యా—జపాన్‌ల వంటి దేశాల వంకకు దృష్టిం బరపి వాణిజ్య సంబంధాలను స్నేహానుబంధాలను అన్వేషణ చేసుకోవలసి వుంటుంది. యూరోప్‌లో సమిష్టి విపణిలాగానే, మధ్య అమెరికాలో ఆఫ్రికాలో, కమ్యూనిస్టు రాజ్యాలలో సమిష్టి విపణుల వంటి పద్ధతులు చెల్లుబడి అవుతున్నాయి. మధ్యఅమెరికాలో నాలుగు రాజ్యాలు, ఒక సమిష్టి విపణిగా ఏర్పడ్డాయి. ఆఫ్రికా రాజ్యాల సమిష్టి విపణి అంటూ వుంది. కమ్యూనిస్టు రాజ్యాలకు సంబంధించి 'కామెకాన్' అంటూవుంది. ఇవిగాక ఆసియా దూరప్రాచ్య ఆర్థిక కమిషన్ అంటూ యింకొకటి వుంది. ఈ రకం వ్యవస్థలు పనిచేస్తున్న మేరకు, మనం వానితో తగిన ఏర్పాట్లు కుదుర్చుకొనవలసిన అవసరం వుంది.

ఇటీవల యిటీవల జాతీయవాదము, రాజకీయ అధికారాల తుల్యస్థితులు మొదలైన వానిని గురించి అధికంగా వింటూ వస్తున్నాము. ఇవి అన్నీ గూడా అంతర్జాతీయ సమాజంలో వ్యవహరిస్తూ వుండే రాజ్యాలయొక్క ఆర్థిక, సాంఘికజీవనపద్ధతులమీద తమ తమప్రభావాలనుచెల్లుబడి చేస్తూనేవుంటాయి. సంపన్నదేశాలు, వర్ధమాన దేశాలకు సహాయం చేస్తూనే వున్నాయి. అందులో అనుమానం ఏమీలేదు. అయితే యింతకంటే విశాలమైన దృష్టిలో సౌహార్దమూ నైతికమూనై ప్రయోజనముకలిగిన సహకారం గనుక అన్ని రాజ్యాల ప్రజల మధ్యను ప్రభుత్వాలమధ్యన పెంపొందినట్లయితే అప్పుడు ప్రపంచం, భద్రమై మానవజాతి సుఖసౌఖ్యాలతో వర్ధిల్లగలదు.

గతం నీది భవిష్యత్తు నాది!

శ్రీ కె. శివారెడ్డి

నువు చెప్పింది నిజమే
నీకు నిరుడు చెప్పిందే బాగుంది
నిరుడు పాడిందే బాగుంది
నిన్నమీద నీ కెంత మోజో
రేపుమీద నాకంత వ్యామోహం
అంతమాత్రంచేత
ఇది నేల విడచిన సాముగాదు

ఈ మొక్క
నిరుటిలా ఎలా వుంటుంది
కాలం గాలి పీల్చుకుంటూ
పరిస్థితుల పాదులోంచి
ఎదుగుతున్న వృక్షంకదా ఇది;
గతాన్ని బొట్టు పెట్టెలో పెట్టుకుని
కళ్ళకద్దుకుంటూ పూజించుకుంటావు
నేనుమాత్రం
ఈ వర్తమానం గుండెల్ని చీల్చి
రేపు సూర్యోదయంవైపు
ఎగబాకుతుంటాను.

అంత మాత్రంచేత
గతాన్ని
తోటకూరలోని పురుగులా
అసహ్యంతో విదలించుకోను
భూతకాలం
బంగారు పంజరం
నువ్వు
దాని ఆవరణలోనికి వెళ్ళి

ఆరాధనలో పడ్డావంటే
వర్తమానం నీకు పొట్టి కురుచ
భవిష్యత్తు అయోమయం.

గతాన్ని ద్వేషించను
గుణపాఠాన్ని నేర్చుకుంటాను
గుడ్డిగా ఆరాధించను
గుడ్డి వెలుగునైనా తోడుకుంటాను

నిన్నలో చతికిలబడ్డ నీకు
రేపులో నిలబడ్డ నేనెలా అందుతాను
'బతుకుతున్నావని' అనుకునే
చచ్చిపోయిన నీకు
ఉత్తుంగ చైతన్య శిఖరాంతరంగమైన
నేను కాని
సమస్త ప్రపంచాన్ని క్రమ్ముకొని
విద్యుత్తులా
ప్రతిగుండెలో జొరబడుతున్న
నా స్వేచ్ఛావాంఛానలం కాని
నీ కెలా అంతుబడతాయి !!

శీర్షాసనం వేసిన చరిత్ర వక్రగతుల్లో
వినోదాన్ని చేదుకుంటూ
'గతం బంగారు పతకం' తగిలించుకుని
శాసనాల గొప్పలు చెప్పుకుంటూ
దేశాలవెంట ఊరేగటం నీ మతం

రేపును
సమతా కాంతిలోకంగా తీర్చిదిద్దటం
సమగ్ర ఆర్థిక స్వాతంత్ర్యం సాధించటం
నిజం మాట్లాడితే
రేపును దీపంగా వెలిగించటం
నా కెంతో ఎంతో ఇష్టం

గతానికి భవిష్యత్తుకు ఎంత దూరమో
మాటకూ చేతకూ ఎంత దవ్వో
నీకూ నాకూ అంతే అంతరం

రాత్రికి పగటికి మధ్యనున్న మంచుపొర
మనిద్దరి మధ్య పాతుకున్న నీలితెర,

గతంలో నా పాదాలు
వర్తమానంలో నా రొమ్ము
భవిష్యత్తులో నా చూపులు
రూపు దిద్దుకుంటున్నాయి —
కొత్తనెత్తురు పుంజుకుంటున్నాయి

గతంలో వనమహోత్సవం చేసుకోవటం
కళ్ళుమూసుకు పాలు తాగటం నీకు పరిపాటి;

సంధ్యలో నిల్చున్నావు నీవు
ఉషస్సులో మొలుస్తున్నాను నేను

ఆశా ఉచ్ఛ్వాసాన్ని
అనంత స్పందనైక గీతాన్ని
అనూనక్రాంతిసస్యసర్వంసహా ఫలసాయాన్ని
రేపు రూపాన్ని
రేపు దీపాన్ని—
నా పేరే రేపు.

ఆకలి

"కొలకలూరి"

తెల్లారుగట్ల, ఎప్పుడో రాత్రి [illegible] గొంతుదగ్గ వచ్చింది. [illegible], [illegible] [illegible]. కన్ను [illegible] పోయాయి. పొట్ట [illegible] లాగ పట్టింది. పేగులు రక్తం [illegible] పులగంగా కలిసిపోయి, బంధిపడ్డాయి. కన్నీళ్ళు, [illegible] పోయాయి.

ఈ కప్ప ఇక [illegible]. ఇక దూకదు. ఇక వాన వచ్చినా వరదవచ్చినా బెకబెకలాడదు. [illegible] పలకదు. చచ్చేముందు చురుగ్గా దూకుతూ, చలాకీగా ఎగురుతూ వచ్చి [illegible] వుండేది. [illegible] ఎక్కించిందో! [illegible] చూపించిందో! చచ్చిపోయింది!!

చింతచెట్టు కింద కాళ్ళముడ్చుకుని [illegible] చేతులు [illegible] [illegible], చిన్ని, కప్పను చూసింది. అది చచ్చినది [illegible]. రెండు [illegible] అనంతత్వంలాగా వ్యాపించింది. రోడ్డు కవతల [illegible] కిరీటం లాగా ముళ్ళచెట్టుంది.

పదిరోజుల్నుంచి ఒకటేవాన! చింతచెట్టు కిందరాలిన [illegible] చిగుగులు, పువ్వులు, చింతబెరళ్ళ [illegible] పోస్తాయి. [illegible], రోడ్డు ప్రక్క [illegible]. కాలుమోపితే నరాలు [illegible]. చిన్ని [illegible] వచ్చిన చింత చెట్టు [illegible] కూర్చుంది. తడిసిన చింతచెట్టు మొదలికి [illegible] చిన్నినొంటికి తడితగులుతూ వుంది.

ఎదురుగాలి విదిలించి [illegible]. [illegible] [illegible]. ఉదయం [illegible]. వెలుతురు లేదు.

రోడ్డుకు రెండు ప్రక్కలా [illegible]. [illegible]. ఎడమ పక్కలో [illegible]. కుడి ఎడమను కాలికి [illegible]. [illegible], ఎడమ పళ్ళె కుడికిగాని, [illegible] అంచనలాగా రోడ్డు — [illegible] —— [illegible]. [illegible] వుంది. ఈ రోడ్డు కదలదు మారదు. [illegible] లేదు. ఆ పళ్ళె కీపళ్ళె, కనుచూపు మేర! కదిలవు, కలిసిపోవు!

చిన్ని కేడేళ్ళు! [illegible] కూర్చుని [illegible] రోడ్డు [illegible] చూస్తూ వుంది. చిన్ని అలాగా [illegible]. [illegible] పోయాయి. చిగుగులు [illegible] తిరిగిపోతున్నాయి.

చిన్ని అందమయిందే! ముక్కు [illegible] సూటిగా [illegible], [illegible]. [illegible], [illegible]. [illegible] కళ్ళలో కళవుంది.

అప్పుడొక [illegible] అప్పుడొకట కారో బస్సో లారో వస్తున్నాయి. [illegible]. [illegible] జటకాళ్ళ గొడ్డు తోలే క్రొత్త [illegible] అరుచుకుంటూ పోతున్నారు. [illegible] ఎదురుగాలితో [illegible].

చిన్ని చెరుకు [illegible] పిల్లవాడు అరటిపండు తింటూ, రోడ్డు [illegible] వచ్చాడు. [illegible] కొంచెం కొంచెం [illegible] తింటున్నాడు.

చిన్ని చూసింది. [illegible] కళ్ళు [illegible]. [illegible] తదేకదీక్షగా చూసింది. పిల్లవాడు ఎదురుగా రోడ్డు ప్రక్క [illegible] వున్నాడు. అరటిపండు [illegible] అయిపోతుందేమోనన్నట్టు, తినకుండా వుండలేని [illegible] కొరుక్కుతింటున్నాడు.

చిన్ని లేచి నిలబడింది. [illegible] రోడ్డు దాటి పిల్లవాడి దగ్గరకు [illegible]. [illegible] కదల్లేదు. ఆగలేదు. తింటున్నాడు. తింటు[illegible], [illegible]కుతున్నాడో, నాకుతున్నాడో, [illegible] కాని, అరటి [illegible] తరగటంలేదు. [illegible] అగటంలేదు.

చిన్ని పిల్లవాడి [illegible] చూసింది. వాడూ చూశాడు. చిన్ని చూస్తూ వుంది. వాడు [illegible]. [illegible], చేతపండు, [illegible], చేయి, [illegible] కళ్ళలోకి [illegible] అడుగుతూ వుంది వాడు [illegible] తప్పుకొన్నాడు.

'[illegible] పెట్టవా?'

చిన్ని అడిగింది.

పిల్లవాడు పలకలేదు.

'[illegible] జెట్టవా?'

'ఏందని?'

[illegible].

'కుంచెం.'

[illegible]

'[illegible] — [illegible] — [illegible].'

[illegible].

'కొంచెం, రొట్టంత'

'వుహూ.'

'కుంచెం'

'సెనగ సెనగ.'

'సేరు తలకాయంత'

'వుహూఁ'

చిన్ని నోటినిండా నీళ్ళూరాయి. కళ్ళనిండా నీళ్ళూరాయి. గుండెనిండా నీళ్ళూరాయి. చిన్ని ఏడుపు ఉటూహాసిలా అయిపోయింది. ఉత్సాహం పుంజుకొని చేయిచాపి, గద్ద కోడిపిల్లను తన్నుకుపోయినట్లు, లాక్కుబోయింది. పిల్లల్ని రక్షించుకొనే తల్లికోడిలాగా అరచేతులు రక్షించుకొన్న పిల్లవాడు కుడివల్లెలోకి పరుగెత్తాడు. వెంటబడబోయి, ముందుకుపడి, మోచేయి పిమ్మెంటూ రోడ్డుమీద పడి దోక్కుపోతే సురురుకు బురదయింది. రక్తం గూడుకట్టుకున్న మోచేయి నీళ్ళు కారుతున్నా కళ్ళు బురదయి బ్రహ్మరాత కనిపించని మదురు చిన్నిని అక్కడ నిలబడనీయలేదు. వెనుదిరిగి వస్తూ పిల్లవాడివైపు చూచింది. వాడు పండు వరాపి ఇవ్వబోతున్నట్లు చాసి, నాలుక బైటపెట్టి వెక్కిరిస్తూ ఎగతాళిచేస్తూ కుడివల్లెలోకి పోతున్నాడు.

చిన్ని ఏడుపు దిగమింగుకొని, కన్నీళ్ళు కళ్ళలో గుక్కుకొని, లంగా చివరతో ముక్కూ కళ్ళు మురురు మోచేయి తుడుచుకొని, వచ్చి, వింతనెట్టు మొదట్లో కూరుని వెక్కిళ్ళు అణుచుకుంటూ వుంది.

చిన్ని అన్నంతిని మూడురోజులయింది. చిన్నితోపాటు తల్లి, అక్క, తమ్ముడు కూడా తినలేదు. దాహంతో నీళ్ళు మక్కయినా మిగలకుండా తెల్లవారేసరికి చిన్నితోపాటు అక్కాతమ్ముడు తాగారు.

అమ్మ లేవలేదు. మంచం మీదే వుంది. వింత నెలలు. బలహీనత. తండ్రి కూలితెస్తే ఇంట్లో కూడు, లేకపోతే నీళ్ళు! తండ్రి ఇంటికొస్తే కనీసం నీళ్ళు. లేకపోతే కటికిపస్తు! తండ్రి మూడురోజులనుంచి ఇంటికి రాలేదు. రాలేక పోయాడు. అక్క నాన్నలాగా కనీసం గానినుంచి నీళ్ళయినా తెస్తుంది.

అమ్మ అక్కను ఇరుగింటికీ పొరుగింటికీ గిన్నెడు బియ్యమయినా అప్పు అడుక్కురమ్మని పంపించింది. ఎదంపల్లెలో ఎవరి బ్రతుకయినా అంతంత మాత్రమే! తమ లవ్వష్టం లాగా అప్పు దొరకలేదు. ఉత్త చేతులతో వచ్చి నిలుచున్న అక్కను చూస్తే చిన్నికి—ఎందుకో తెలియదు— కోపం వచ్చింది.

ఎక్కడ అన్నం వాసనవచ్చినా, ఎక్కడ పొగవచ్చినా, అనుమాన ప్రమాణం తెలియకపోయినా, ఆ యింటికిపోయి, తొంగిచూచి, ఆ యింటి చుట్టూ తిరిగి, వాళ్ళు అన్నంతినేవారు గిన్నెలుకడిగేవారు అన్నంకుండబోర్లించారు అని తెలిసేతర్వాత ఆ యింటినుంచి ఇంకో యింటికి, ఈ మూడురోజులనుంచి ఏడుస్తూ తిరుగుతోంది చిన్ని.

రాత్రి కడుపు నిప్పువల్ల పరిగడ్డివామిలాగ కుమిలి కుమిలి కాలింది. నిద్ర పట్టలేదు. వానకాలం ఒక్కి కడుపులో బ్రతుకుకంటే చావు సుఖమనిపించింది చిన్నికి.

మనసు ఎప్పుడయినా రాత్రివేళ అయితే, తెల్లవారితే ఒకవేళ దొరుకుతుందని ఆశ వుండటంలో, ఎప్పుడు తెల్లవారుతుందాఅని ఎదురు చూడటం చిన్నికి అలవాటే. ఇప్పుడు తెల్లవారింది. ఆకలి తీరలేదు. నిన్న తెల్లవారింది. ఆకలి ఆకలిగానే వుంది. ఇవాళ తెల్లవారింది. ఆకలి ఎక్కువయింది. ఇంకొక ఉదయం వస్తుందంటే చిన్నికి సంతోషం కంటే దుఃఖమే కలుగుతుంది. ఆకలికి ఎదురొచ్చి విజయం చిన్ని భరించలేదు.

రాత్రి, ఆకలితో మునగదీసుకు పడుకొంటే వర్షం—పేదవాడి శాపంలాగా ఇల్లంతా కురిసింది. చూరు తడిసి బట్టలన్నీ నిరుగుడు బట్ట తడిసి, ఆకలి మంటతో చలితో తల్లావెంటాడా ఎవరను భయంగా నువ్వొంగో, పట్టుకొని ముడుచుకు ముడుచుకు పడుకొన్న చిన్ని తెల్లవారితే బైటికి వచ్చి, రెక్కలొచ్చిన కన గొంతుకుపోయిన దొక్క పొరంతా చూస్తుంటే బాధ వేసింది.

వాళ్ళా వేకువనే వానలో ఒళ్ళు కడుపులో పెట్టుకొని ఎవతివెళ్ళ కింది వళ్ళని నొంచితే, పల్లెని బల్లలతో దిగులుగా కూర్చుంది చిన్ని. సూర్యుడింకా పుట్టలేదు. పుట్టి ఈ కర్మకాండకు సాక్ష్యం ఉండాలని కర్మసాక్షికి భయం. కొండమీంచి మబ్బు కురిస్తే అవిగిపోతానని, కరిగి పోతానని, తడిసి పోతానని, కదలకుండా కన్నెత్తి చూడకుండా, కులాసి ఆస్తులాగా కూర్చునిపోయింది.

'యూవే చిన్ని?'

గొంతు కఠినంగా వుంది.

చిన్ని తలెత్తి చూచింది. ఎదురుగా అరుగమీద నిలబడినాడు పెద్దవాడి అన్న.

చిన్ని భయంభయంగా లేచి నిలబడింది.

'యూవే మాట్టాడవ్?'

కోపంగా చూశాడు.

'ఏంది?'

చిన్ని వంగివంగిగా అడిగింది.

'కాయలాక్కున్నావా?'

'వుహూఁ!'

'నిజం జెప్పే?'

'వుహూఁ!'

'అబద్ధంవాడితే బుగలు తీయనా?'

'వుహూఁ!'

'చీ' అన్న కసురుకొన్నాడు. 'పీకో క్కిస్తే పిసికిత్తావా?' ముఖం ముకతుకతో లాడింది. 'మొద్దముండ' తిట్టాడు.

చిన్నికి ఏడుపు వచ్చింది.

'నువ్వే!'

'ఏందే? ఏంది చెప్పండే? నాకేసు చెంగలుగ్గొట్టా'

'నువ్వే!'

చిన్ని అంది. అన్న అప్పుడు ఏమి చెప్పక పోతే సత్యహరిశ్చంద్రుడికి పారణం కాకుండా పోదా? ఆడ తప్పుకుందా? ఏం చేస్తేట. కొట్టాడు. మూడు పదనకు నాడు, కోపంగాను కొట్టాడు. చెప్పడం వెంటనే.

చిన్ని చిన్నపిల్ల. ఆకలితో నకనకలాడుతూ మాట్లాడు చూస్తున్న పోతున్న కడుపు. బలహీనపు ఒళ్ళు. వెంట దెబ్బకు నేలమీద పడితే నేల దెబ్బ తగిలింది. 'అమ్మా' అని అంటే అమ్మ రాలేదు. వచ్చా నాడు, రాలేదు. వచ్చినా అతణ్ణి ఏమీ అనలేదు. అనను కొట్టలేదు. రోగే ఆగని మరాభవం. తండ్రి ఇంటిదగ్గర లేడు గాబట్టి నాడు. అందుచేత రాలేదు. దాంతో పిల్లవాడి అన్న ప్రమాదం లేకుండా వెళ్ళిపోయాడు.

చిన్నికి కడుపులో నొప్పి నొప్పి ఇంత ఎక్కువగా వుంది. కదిలే చోటునుంచి లేవాలంటే పోలికలేకపోయింది. మూడ్నాళ్ళనుంచి తనలాగా పస్తు కొని, దెయ్యంలా వెంటాడుతున్న ఆకలిని మరిపించగలిగినంత దెబ్బవేసి అన్న పుణ్యం చేసుకొన్నాడు. ఆ దెబ్బతో కడుపు నిండిపోయింది. ఆకలి తీరిపోయింది.

సన్నగా ఈదురుగాలి. సన్నగా జల్లు, తుంపర. కొండమీదమబ్బు గట్లా పెట్టేసినట్టుంది యజమానిలా కదల్లేదు. చింతచెట్టుకింద జల్లుపడటంలేదు.

రాత్రి వాన రోడ్డును కడిగింది. మళ్ళీ రోడ్డు మురికి కాలేదు. ఇంతలో మళ్ళీ జల్లు! దీంతో రోడ్డు శుభ్రంగా వుంది. వాననీరు పోయి చాలులో మట్టి కోసుకుపోగా పగిలిన పట్టీరాళ్ళు భూమి ఇకిలిస్తుంటే కనిపించే పళ్ళు లాగా ఉన్నాయి.

తలస్నానం చేసిన జుత్తులోనుంచి జారిపడే నీటి బొట్లులాగా అప్పుడో కటి ఇప్పుడో కటి బొట్లు జారిపడుతున్నాయి. లారీ ప్రక్కనున్న హోటల్లో రేడియో వెంటనే సన్నాయి గొంతు మ్రోగింది.

[illegible] నిద్రపోయిన [illegible] నిద్రపోవటంకోసం ఒడికి [illegible] అంట్రేని [illegible] ఆకలికి [illegible] పిచ్చిపిచ్చి [illegible] చిన్ని [illegible] తలదించుకొంది.

[illegible] ఇంటివాడు లేడు. మొన్నటిదాకా నాన్న కాలంలో కూలీనాలీ చేసి ఇంట్లో [illegible] గుడిసెలు [illegible] పాటలు [illegible] ప్రతిరోజూ పాయిలో పిల్లి లోలా [illegible] పిల్లలు [illegible] నాన్న ఇల్లు వదిలి [illegible] పోయింది. [illegible] పోయింది. మళ్ళీ రాలేదు.

[illegible] ఏలు [illegible] గాలివాన [illegible] వాగులు వంకలు [illegible] నిప్పు [illegible] గండులు పడ్డాయి. వచ్చేపోయే వాటి రాకపోకలకు [illegible] రోడ్డు బాగుచేయమని వచ్చి, [illegible] కోసం [illegible] చిన్ని తండ్రి మూటకట్టుకొన్నాడు [illegible] వరకు [illegible] రాలేదు.

పొట్టు తినేవాడు ప్రాప్తి అయింది, దేవో! వాన ఎప్పుడొస్తాదో దేవా! ఆకలి ఎప్పుడు తీరుతుందో దేవా! చిన్ని పిచ్చిమనిషిలా తాగినమనిషిలా ప్రాణం పోయిన మనిషిలా తూలిపోతూ వాడిపోతూ సోలిపోతూ వుంది.

[illegible] కడుపు [illegible] వుంది. ఆకలి [illegible] కాలుస్తూ వుంది.

మోచేతి దెబ్బ, చెంపదెబ్బ మరుపురాని తలుచుకొంటుంటే, [illegible] కళ్ళలో [illegible] ఏడుపు వచ్చేస్తూ వుంది.

పెద్ద పెద్ద కన్నీళ్ళు, అంతా కారిపోయిన కన్నీరు లాగా కురిసే [illegible] సన్నగా జల్లుగా తుంపరగా పడలేక ఆగిపోయింది. ఇంతకుముందు, ఆరాత్రి కురిసిన వాన చిన్ని రొమ్ముల మీదపడి, [illegible] గుండెల [illegible] మీదపడి [illegible] మూలుగుతూ పోతూ వుంది.

[illegible] పోతున్న లారీ దూరం నుంచి [illegible] వస్తా వుంది. చిన్ని లారీవైపు మొదట అనాసక్తంగా చూచి, ఇంతలో ఆసక్తితో చూచి, లేచి నిలబడింది. లారీ [illegible] దగ్గరకు వచ్చే సరికి ఆత్రాశపుట్టింది.

[illegible] బరువుతో నిండునెల స్త్రీలాగా [illegible] దూరంగా నెమ్మదిగా వస్తా వుంది. లారీ దగ్గరకు వచ్చేసరికి చిన్ని ప్రాణంలేని మనిషిలా ముందుకు పరిగెత్తింది.

చిన్నిని డ్రైవరు చూచి 'చేయ్' అని అరిచాడు. క్లీనరు చూచి 'లేయ్' అని అరిచాడు. లారీకి సడన్ బ్రేక్ వేశారు [illegible]. లారీ ఆగింది. కిరుకిరులాడుతూ ఆగింది. లారీ వుంది. చిన్ని వుంది. లారీముందు చిన్ని. అంగుళాల దూరపు సంబంధం. ఏనుగుని నంగనాచిలా తలవంచుకొని గిళ్ళు గిల్లుకుంటూ నిలబడింది లారీ. కేబిన్‌లోంచి నాలుగు కళ్ళు దిగటం చూసేసరికి చిన్నికి విపరీతంగా ఆకలితయ్యి విలవిలలాడిపోయింది. 'ఎవరివే నువ్వు, చద్దామనుకున్నావా యేంది' డ్రైవరు.

'యాంవే నువ్ వచ్చేదిగాక మమ్మల్ని జంపుదామనుకొన్నావా, యెట్టా?' క్లీనరు.

'లేయే లేయే.'

డ్రైవరు నెట్టాడు.

'పోయే పోయే.'

క్లీనరు తోశాడు.

చిన్ని మళ్ళీ చింతచెట్టు మొదట్లో పడింది. పాత చింతచెట్టు! మునుపటి చెట్టు! శాశ్వతంగా చింతచెట్టు! ఆ చెట్టు నిల్చొనుంది. కష్టంలో ఉన్న కూతుర్ని చూచి తల్లి కన్నీరు నించినట్టు చింతచెట్టు నీటిబొట్లు రాల్చింది.

రోడ్డు కడిగి తుడిచినట్టుంది. చెమ్మ ఆరుతూ వుంది. రోడ్డు ప్రక్క పిచ్చి చెట్లు మొదళ్ళకు ఆకులు అలుములు రాలిగాలి తగిల నిలిచి మట్టి పేరుకొని బురద బురదగా వుంది. ఆ ప్రక్క ఇసుకనేలమీద నీటి చాలు సాగిపోగా ఏర్పడ్డ గీతలు బక్క చాడి ప్రక్కటెముకల ఎత్తుపల్లాల్లాగా కనబడుతున్నాయి.

అక్క తమ్ముడు వచ్చేసరికి చిన్ని కళ్ళల్లో నీళ్ళు కనబడటంలేదు. నీళ్ళు ఎండమావులయ్యాయి. ఎండాకాలం గరువుబావుల్లో నీళ్ళులాగా అయిపోయాయి.

'ఏం దిట్టిందా?'

ఒళ్ళంతా మురికి ఎందుకుంది అన్నట్టుగా చూచింది అక్క.

చిన్ని మాట్లాడలేదు.

'చెప్పు! మాట్లాడవేంటే? ఇన్నావా యిన్లేదా?'

చిన్ని బదులు చెప్పలేదు.

అక్క ఎగాదిగా ముఖంలోకి చూచింది. చెల్లి ముఖం మరీ వంచుకొంది

'అప్పా! అప్పాచ్'

చిన్ని భుజం పట్టుకుని కుదిపాడు తమ్ముడు. వాడి చేతివేళ్ళు లేత బెండకాయల్లా, నవనవలాడుతున్నాయి.

అక్కా తమ్ముళ్ళ బట్టలు తడుపులు పడ్డాయి. తలలకు మానలేదు. తల లోంచి చెంపలలోంచి నీళ్ళు జారుతున్నాయి. తమ్ముడు చలికి వణుకుతున్నాడు.

'అమ్మ మూలుగుతా వుంది. నిన్ను నిన్ను అని అడుగతావుంది. దాయ— దా బోదాం!'

అమ్మ అనేమాట వినేసరికి చిన్నికి వణుకుపుట్టింది. నిండు నెలల్తో మంచం మీదించి లేవలేని అమ్మను తలుచుకొంటుంటే ఏడుపు వస్తా వుంది. తనకా తిండిలేదు. అమ్మకూ లేదు. తనా తిరగ గల్దు. అమ్మ తిరగలేదు. లేవలేదు. తనే నయం. తనకంటే అమ్మ కనాకష్టం. చిన్ని అమ్మకష్టం చూళ్ళేదు. చూచి ఏడుపు భరించ లేదు. ఏడిచే ఓపికలేదు. గుండెలో తడి అయింది. కళ్ళు ఎండిపోయాయి. తలమీది నీటిబొట్లు చెంపలమీదగా జారి పెదాల్లోకి పోయి మాయమయింది. రెండు చేతులతో జుత్తు పైకి ఎగదోసుకుని అక్కవైపు, తమ్ముడి వైపు మార్చిమార్చి చూచింది చిన్ని.

అక్కకు పదేళ్ళు! అక్క అమ్మకు చేదోడు వాదోడు. అమ్మలేవలేక పోతే అమ్మ పనులన్నీ అక్క చేయటం ఈమధ్యే మొదలయింది. చెల్లికి తమ్ముడికి నీళ్ళు

వోస్తుంది. ఒళ్ళు తుడుస్తుంది. ఊగితే బట్టలేస్తుంది. అక్కకు చిన్ని అంటే ఎక్కడ్లేని యిష్టం!

ఎవరైనా తమ్ముడికి పెట్టకుండా అక్క ఏం కొనుక్కున్నా తినదు. [illegible] పెట్టేందుకు లేకపోతే నోరుమూసుకొని [illegible] తిరుగుతూ వుంటుంది. [illegible] అయిపోయినా [illegible] తమ్ముడికి పెట్టి [illegible] అక్క.

[illegible] అక్క [illegible]. అక్క [illegible]. [illegible] తమ్ముణ్ణి [illegible]. నాలుగు [illegible] తమ్ముణ్ణి [illegible] వాడు [illegible] [illegible] వాడే [illegible] [illegible].

తమ్ముడు తిని, [illegible], [illegible] నిద్రపోయాడు. అక్క తనూ [illegible] నిద్రపట్టలేదు. [illegible] అమ్మ అక్కతో 'చిన్నది [illegible] పెద్దదై [illegible]', [illegible] తమ్ముడికి [illegible], [illegible] వుంటే వుంది, [illegible] లేదు [illegible].

వాళ్ళ సంభాషణ వింటూ చిన్ని సంతోషించింది గాని, ఆకలి — [illegible] పడలేదు. [illegible] అక్క నిద్రపోయినా చిన్నికి నిద్రరాలేదు. [illegible] [illegible] కళ్ళు [illegible].

తమ్ముడు పిచ్చివాడు. వాడికి [illegible] [illegible] కూడా [illegible]. [illegible] వుంటే [illegible]. వాడికి [illegible] కూడా లేదు.

అక్క [illegible] వాడు [illegible] [illegible] [illegible] ఉంటుంది. వాడి మాటలు [illegible] ఉంటాయి.

హోటల్ శంకరయ్యకు తమ్ముడంటే [illegible]! [illegible] [illegible] తమ్ముడు [illegible], శంకరయ్య [illegible] [illegible]. శంకరయ్య [illegible] తెలుసు. తమ్ముడికి, [illegible] [illegible].

తమ్ముడికి [illegible] [illegible]. అమ్మకీ అక్కకీ తెంటానికి లేకపోయినా వుంటారు. తమ్ముడికి ఎప్పుడూ తింటానికేదో [illegible] ఎక్కడో ఒక [illegible] [illegible]. [illegible] [illegible].

శంకరయ్య హోటల్ [illegible]! [illegible] [illegible]. చిన్ని తమ్ముడితోపాటు శంకరయ్య హోటలుకే పోదామని చిన్ని బయలుదేరింది. [illegible], [illegible] తమ్ముడికి [illegible] పెట్టలేక, తనకు లేదని, తమ్ముడికి పెడితే [illegible], తమ్ముడికి [illegible] [illegible], తమ్ముడి [illegible] [illegible] [illegible] — [illegible] తమ్ముడు [illegible] [illegible] [illegible] [illegible].

[illegible] [illegible] [illegible] [illegible] [illegible] చిన్ని దగ్గరకు వచ్చి [illegible] [illegible] [illegible] అని అయినా అడుక్కుండా నోరుతెరచి [illegible], కళ్ళు మూస్తూ, తెరుస్తూ, 'ఆకుందావా కుందాం' అంటూ అడుగుతూంటే సిగ్గు వచ్చింది. తమ్ముణ్ణి [illegible] [illegible] చిన్ని.

[illegible] పిల్లల్ని [illegible] [illegible] ఆడుకుంటూ [illegible] [illegible] పెరుగులతో పోయింది. అది చిమ్మిన బురద బట్టలమీద ఒంటిమీద పడింది. అక్క [illegible]. తమ్ముణ్ణి తుడిచింది. చిన్ని మాత్రం [illegible] [illegible] [illegible].

'[illegible] [illegible] పోదాం!'

[illegible].

'[illegible]!'

తమ్ముడు పిలిచాడు.

చిన్ని కదల్లేదు.

'[illegible]' అక్క బతిమాలుతూ కుడిచేయి పట్టుకొంది. 'దా,వా?' తమ్ముడు [illegible] [illegible] తిప్పుతూ ఎడం చేయి పట్టుకొన్నాడు. 'దా,లే' ఇద్దరూ పిలిచారు.

చిన్ని లేవలేదు.

'[illegible].'

అక్క, తమ్ముడు చేతులు వదల్లేదు.

'దా, లే.'

'[illegible]. [illegible] వుంటా! నువ్ పోయే, నువ్ పోరా.'

చిన్ని కదలకుండా కూర్చుంది.

'అమ్మ [illegible].'

అక్క చెప్పింది.

'[illegible] పోదాం దా.'

'[illegible]—[illegible]— నువ్ పో—పోరా.'

అక్క తమ్ముడు చిన్నిచేతులు వదిలిపెట్టారు. చిన్ని అక్కణ్ణుంచి లేవలేదు.

[illegible] తమ్ముణ్ణి [illegible] చిన్నికి అమ్మానాన్నా గుర్తుకువచ్చారు. అక్క అచ్చంగా నాన్నలాగా వుంటుంది. నాన్నకి తనంటే ఎంతో ఇష్టం! పూలు తెచ్చి తనకే ఇచ్చేవాడు. [illegible] నిద్రపోయేవాడు. తను లేకుండా— [illegible] వుంటే— [illegible].

'నా కూతుర్ని అదృష్టం' అని పొంగిపోయే తండ్రి గుర్తుకువచ్చి, చిన్ని [illegible] [illegible] అమృతంలాంటి [illegible] సోకింది. తను తండ్రి భుజాల మీద [illegible] [illegible].

రాత్రివేళ నిద్రపట్టకపోతే, నాన్న తనని గుండెలమీద వేసుకుని నిద్రపుచ్చేవాడు. తండ్రిగుండె చప్పుడు వింటూ గుండెకు దగ్గరగా వుంటూ, ఆ [illegible] వింటూ తను పెరిగింది.

నాన్న వుంటే [illegible] వుంటుంది. తిండిలేకపోయినా ఇంత ఆకలికాదు. నాన్న లేక, [illegible], నాన్నలో [illegible] [illegible], [illegible] సరిగాలేక, లేవలేని అమ్మ [illegible] [illegible] చిన్ని [illegible], [illegible], కంట్లో, చేతుల్లో, కాళ్ళలో ప్రతిరక్తం బొట్లులో ప్రతివెంట్రుకపాదులో ప్రతి స్వేద రంధ్రంలో ఆకలి [illegible] వేస్తూ వుంది.

తమ్ముడు పూర్తిగా అమ్మపోలిక. కనుముక్కు తీరులో అచ్చుగుద్దినట్టు అమ్మలాగా వుంటాడు. అమ్మ కళ్లలో ప్రేమలాగా తమ్ముడి చేయి చిన్ని భుజం మీద వుంది. చిన్ని ఎందుకయినా ఏడిస్తే తమ్ముడు చూళ్లేడు. చిన్ని చిన్ని చేతులతో తుడుస్తాడు.

అమ్మ ఎంతగా లేవలేకపోయినా, వదల్లేక పోయినా, మీరాడుకోండే నేచేస్తాలే అని అన్ని పనులూ చేసుకొనేది. తనకు ఏం కష్టం కలిగినా అమ్మ సహించదు. దోమకుట్టినా విలవిలలాడిపోతుంది.

అమ్మకు చినదంటే ఎంతో గురి! ఎక్కడికయినా పోవాలనుకొంటే, 'పోయెదా?' అనిఅడిగి 'పో' అంటే వెళ్తుంది. 'వద్దు' అంటే మానేస్తుంది.

ఒకప్పుడు చిన్ని చిన్నదిగా ఉన్నప్పుడు అమ్మబైటికి పోయి పొంతకుండ తోడించి రావాలని పోబోతుంటే ప్రాణమునిగిపోయినట్లు ఉయ్యాలలో ఉన్న చిన్ని గగ్గోలెత్తిపోయింది. బైటికి పోబోతూ ఆగి వెనుదిరిగి పోయి ఏమయిందోనని కిరసనాయిలుబుడ్డి తెచ్చి చూచి ఏమీలేదని, మళ్లీ బైటికి పోబోయింది. ఈసారి మునుపటికంటే పెద్దగ ప్రాణాంతకంగా ఏడ్చింది చిన్ని. పురుగో పుట్రో అయి వుంటుందని ఎంతగా వెతికినా ఏమీ కనబళ్లేదు.

అమ్మ ఉయ్యాల దగ్గరుంటే ఏడుపుమాని, వెళుతుంటే ఏడుస్తుండటంతో పిల్లభయపడిందని ఆమె అక్కణ్ణుంచి కదల్లేదు. అప్పుడే పొలంనుంచి వచ్చిన నాన్న వాకిట్లో ఉన్నదేమిటో కర్రతో కదిపితేసరి అని చూస్తే, పాము! ఆరాత్రి నాన పామును చంపి ఇంట్లోకి వచ్చాడు.

నాగుబాము చావుచూచి అమ్మ గగ్గోలెత్తిపోయింది. ఈబిడ్డ తనమూ పిని కోసిందని ఏడ్చింది. కనతల్లి, తనను బ్రతికించిందని వలవల విలపించింది. ఆ రోజునుండి చిన్ని వద్దన్నపని అమ్మచేయటం మానుకొంది.

వాన పడటంలేదు. ఆకాశంతెరిపివ్వలేదు. రోడ్డు చెమ్మ అక్కడక్కడ జారి, నూనెరాసిన తామరాకులాగా ఎత్తుపల్లాలలో తడిపొడిగా మెరుస్తూ వుంది. ఈదురుగాలి సన్నగా ప్రక్కటెముకల్లో దూరబడటానికి సిద్ధమవుతూ వుంది. కదిలిన చెట్లమీదుండి నీటిబొట్లు కన్నీటి బొట్లులాగా ఒంటుండి పడుతున్నాయి.

స్కూలునుంచి పదేళ్ల అమ్మాయి వస్తూవుంది. తలలో పూలు సిల్కు జాకెట్టు! సిల్కులంగా! అవసరం లేకపోయినా పరికిణీ! రెండు జడలు! జడలు చెర్నాకోళ్లల్లాగా ఎగురుతున్నాయి.

జడల్లాగా, చేతులు, చేతుల్లాగా కాళ్ళు, కాళ్లలాగా నడక ఉత్సాహంగా వుంది. తల ఉత్సాహంగావుంది. కళ్లు ఉత్సాహంగా వున్నాయి. ఒళ్ళంతా ఉత్సాహపు వెల్లువలాగా వుంది. కడుపులో అన్నకోశం నిండా కూడు ఉత్సాహంతో జీర్ణమవుతూ వుంది.

ఆ అమ్మాయికి అక్క వయస్సు. ఆ అమ్మాయిని అక్కనీ మార్చిమార్చి చూసింది. తల, ఒళ్ళు, కాళ్ళు, చేతులు బట్టలు, పూలు పుస్తకాలు—పుస్తకాలు, పుస్తకాలు మార్చిమార్చి చూచి అప్పురుమని ఏడ్చింది.

'యేందే? యేంది?'

అక్క అడిగింది.

'యేందప్పా యేంది?'

తమ్ముడడిగాడు.

'యాం లే!'

అక్క తమ్ముడు మళ్ళీ మాట్లాడలేదు. ఒకరిమొఖం ఒకరు చూచుకుంటూ నిలబడ్డారు. చిన్ని కళ్ళుతుడుచుకొంది.

బస్తీనుంచి బస్సువచ్చింది. రంగసామి కూతురు దిగింది. కొడుక్కు జ్వరం వస్తే బస్తీ హాస్పటల్‌కు తీసుకుపోయి వారంరోజులుండి తిరిగివచ్చింది. పిల్లవాణ్ణి తీసుకు పోతున్న బస్సులోనే వాడి జ్వరం వదిలిపోయి, అంతవెలితే కనబళ్లేదు. ఆ భయం హాస్పటల్‌లో వారంరోజులుండి. వారంరోజులూ పిల్లవాడు ఉన్నచోట వుండక హాస్పటల్ అరణ్యం చేస్తుంటే విసిగిపోయి డాక్టర్లు అందరూ చెప్పి చెప్పి, తలబొప్పికట్టి, వెళ్లకపోతే బయటికి నెడతారేమో అనిపించినప్పుడు హాస్పటల్ నుంచి బైటపడి ఆరోగ్యంగా ఉన్న కొడుక్కు అనారోగ్యం ఎక్కడుందో వెదుకుతూ దిగింది.

బస్సుదిగిన కూతుర్నిచూచి రంగసామి వచ్చాడు. నడుస్తూ వస్తూ వచ్చాడు. కూతురు కొడుక్కు ఒంటిమీద రంగవాలితే తన ప్రాణం తీసుకునే అల్లుణ్ణి కళ్లల్లో పెట్టుకుని వచ్చాడు. రంగసామి నడచిరాలేదు. గుండెతో ఎగిరివచ్చాడు. పొర్లి వచ్చాడు.

పైన రోడ్డుమీద పిల్లలు ఆనందంగా వుంటే అక్క తమ్ముణ్ణి నడిపించుకుపోయింది. వాళ్ళు పాముని ఎగరేసి ఎగరేసి చంపుతున్నారు. చిన్నిచూచింది. ఆ పాము వానకు తడిసి ముద్దయి వచ్చిపోయింది. జీతగాళ్ళకి పల్లెపిల్లలకి అది కంటికింపయిన దృశ్యం.

ఆ వచ్చిన పాముని రాళ్ళతో కొట్టి చంపారు. కర్రలతో బాది చంపారు. దగ్గరకు పోకుండా దూరందూరంగా ఉండి చంపారు. చచ్చిందని తెలిసింతర్వాత ఎగరేసి ఎగరేసి చంపారు.

పిల్లలు ఎగిరిందే ఎగరటం! ఒకటే గోల! అటునుంచి ఇటునుంచి పిల్లలు వెల్లువలో పరుగెత్తుకుంటూ పోతున్నారు. 'యేందంటే యేంది' ఎగబడి చూస్తున్నారు.

ఎవరు తెచ్చారో ఎండుకట్టెలు తెచ్చారు. ఎవరు తెచ్చారో అగ్గిపెట్టె తెచ్చారు. ఎవరు ముట్టించారో మంటపెట్టారు. చచ్చిన పాముకి శవసంస్కారం చేస్తున్నారు భావిపౌరులు.

చిన్ని చింతచెట్టు మొదట్లో కూర్చుని చూస్తూ వుంది. అక్కడ కాలిపోతున్న పాము! ఇక్కడ నేలకు కరుచుకుపోయిన కప్ప! కాలుతున్న పాముపొగ మేడలు మిద్దెలు దాటి పైకి పోతూ వుంది. కప్ప గుడిసెలు చూస్తూ నేల కరుచుకు పోయింది. కప్ప—పాము 'కరవమంటే కప్పకోపం—విడవమంటే పాముకోపం'—అమ్మ అనే సామెత చిన్నికి గుర్తుకు వచ్చింది.

అక్క తమ్ముడు వెళ్ళి భావిపౌరుల్లో కలిసిపోయారు. ఇక అక్కడపిల్లలు కాదు అల్లరి వుంది. ఒకటే రద్దీ! ధ్వని!!

చిన్నికి లేవబుద్ధిపుట్టలేదు. కదలబుద్ధికాలేదు. కాళ్ళు ఆరజాపి చింత చెట్టుకు పూర్తిగా ఆనుకుని చేరగిలబడింది. కళ్ళలో పాముపొగ కాపురు గమ్మింది. కప్ప కనిపించటంలేదు. లారీ కనబడుతూ వుంది.

ఏడాదిక్రితం ఆ రోడ్డుమీద ఇక్కడ ఈ చెట్టు దగ్గర్నుంచి ఆ చెట్టు దగ్గరకు పరుగెత్తుతూ పిల్లలు ఆడుకొంటున్నారు. ఎవరో ఏం ఆటలని తిట్టారు గాని పిల్లలు ఆట మానలేదు.

దూరం నుంచి వచ్చే లారీ తిన్నగా ఇక్కడికి రాకపోతే ముందే చిన్ని అయితే జటుపోయి, చెట్టుముకుట్టుకుని ఇటుతిరిగి రాగలదని, పెద్ద గుండెకలదని, చిన్ని ధైర్యవంతురాలని ఉత్సాహపరిచారు.

చిన్ని పరుగెత్తుకుంటూ పోయింది. చెట్టును తాకింది. వెనుదిరిగి పరుగెత్తుకుంటూ వస్తూవుంది. లారీ ఎంతదూరం వచ్చిందో చూసుకోలేదు.

పిల్లలు అరిచి గగ్గోలెత్తి పోతున్నారు. లారీవచ్చేసిందని అరిచారో, చిన్ని లారీకంటే ముందుగా తిరిగి వచ్చిందని అరిచారో, అది భయమో సంతోషమో చిన్నికి తెలియదు. పెద్ద అరుపు వింది. అంతే! మళ్ళీ ఏమీ వినలేదు.

చిన్ని కళ్ళువిప్పి చూచేసరికి గోల్లుమంటున్న ఇల్లు నిశ్శబ్దంగా అయింది. అమ్మని నాన్నని చూచేసరికి చిన్నికి ఏడుపు వచ్చింది. తను చావుదప్పి బ్రతికి నట్టు రక్తం బాగా పోయినట్టు విని, చనిపోనందుకు, ఎందుకో, సంతోషించింది చిన్ని.

చిన్నికి మెలకువ వచ్చిందాకా నౌకరు అక్కడే వున్నాం. స్పృహ వచ్చినంతర్వాత బండెడు బరువు దించినట్లయి, గట్టిగా నిట్టూర్చి, లారీ తోలించుకొని వెళ్ళిపోయాడు.

ఆ రోజు నుంచి నాలుగు నెలలు, నెలకు వందరూపాయలు ఆరు నెలలు చిన్నికి మంచి ఆహారం, నష్టపరిహారంగా నౌకరు తనంతటతనే నిర్ణయించుకొని ఇచ్చాడు.

ఆ రోజుల్లో చిన్ని సుఖమంచంలో స్వర్గసుఖాలు అనుభవించింది. నిద్ర లేస్తే ఎవరో ఒకరు పరిచర్య చేశారు. తన మంచిచెడ్డలు చూశారు. తను తిన్న తర్వాత తిన్నారు.

తనవల్ల నెలకు వంద! అమ్మనాన్నలు సంపాదించలేనంత డబ్బు. ఈ డబ్బు చిన్ని ఊపిరి ఓపిక కొట్టుమిట్టాడుతుంటే కలిగే చీకటి వెలుతురుల కలయికకు ప్రతినిధి! ఈ డబ్బు శవ సమాధిపై పుట్టిన గడ్డిపూవు! ఈ డబ్బు మనిషి రక్తం మట్టిలో కలిస్తే ఆ మట్టికి కట్టిన విలువ! ఈ డబ్బు ఉన్నవాడి ఔన్నత్యాన్ని, లేనివాడి అల్పత్వాన్ని ఎత్తిచూపే జెండా!

ఈ డబ్బు లేకపోయినా బిడ్డను ప్రేమించే తల్లిదండ్రులు, ఈ డబ్బుతో ఇంకా బాగా ప్రేమించారు. ఈ డబ్బు ఆనందమే కలిగించింది. ఈ డబ్బు సంపాదించింది తనేనని, దీంతో తల్లిదండ్రులకు ఏదెంతో ఉపకారం చేసినట్లు ఋణం తీర్చుకొన్నట్లు చిన్ని భావించింది. తృప్తి పొందింది.

బువ్వ తినటమంటే, చిన్ని దృష్టిలో, వరి మెతుకుల్లో పప్పువారు పోసుకు తాగటం! అది తాము తినే కూడులో అతి వాంఛనీయమైన ఆహారం! అంతకు మించి తినటానికి ఏమయినా కూడు వుంటుందని తెలియదు. బ్రెడ్డు గుడ్డు బువ్వతో సమానమని తెలియదు. బ్రెడ్డు బట్టరు, బ్రెడ్డు జాము నాలుకకు నాజూకుతనం కలిగిస్తాయని తెలియదు. లారీ నౌకరు బస్తీనుంచి తెచ్చి ఇచ్చే ఆహారం వల్ల తనెంత అమాయకురాలో చిన్ని తెలుసుకొన్నాననుకొంది.

బ్రెడ్డు గుడ్డు తింటుంటే నాలుకంతా పూసిన ఉద్యానవనంలాగా వింత వింత రుచులు రంగురంగుల పూలై నోరంతా వికసించాయి. బ్రెడ్డుబట్టరు తింటుంటే ఇనుపస్తంభం మీద చేయి రాసినట్లుగా, బురదలో కాలు జారినట్లుగా, అయిస్ ఫ్రూట్ చేతిలోంచి జారిపోయినట్లుగా ఒళ్ళంతా మెత్తగా దూదిలాగా అయిపోయినట్లు అనిపించింది. బ్రెడ్డు జాము తింటుంటే పుల్లపుల్లగా, తీపి, మెత్తగా గట్టిగా తగిలి గొంతు గొంతంతా వయ్యారాలు పోయింది.

ద్రాక్షపళ్ళు తొక్క చటుక్కని మింగితే, ఎండిపోయిన బావిలో వాన రాయి, కనిపిస్తూ పోయినట్లు, గొంతులోంచి పేగుల్లోంచి కడుపు లోలోపలికి దిగిపోయిందాకా చల్లగా జారిపోయింది. బత్తాయో, కమలాపండో, నారింజో, తొనతొక్కా వలిచి, గింజలు తీసి ముత్యాలమాత్రమే నోట్లో వేసుకొంటే నోరంతా ఊటబావి అయిపోయి, గొంతంతా ఎప్పుడూ చవి కమ్మని రుచి! లిచీ పండు తొక్కతీసి గింజలు తీసి ముక్కనోట్లో వేసుకుంటే మీగడే! నమిలే పనిలేదు. కొరికే పనిలేదు. పంటితో పనిలేదు. నాలుక వేడికి కరిగి గొంతులో దిగిపోవటమే! అరటిపండో, పచ్చరటిపండో, చక్కెరకేళో, రస్తాళో తింటుంటే యుగాల ఆకలి మాయమయి పోతుంది.

జిలేబీ నోట్లో వేసుకొంటే నోరంతా నీరు అయిపోయి తీపి! మైసూర్ పాక్ నములుతుంటే ప్రతివస్తు పరమార్థం దర్శించి ఆవులింత! లడ్డు తింటుంటే స్వర్గం పునాదులు కూలి పడ్డట్టు అమృతం! బూంది నోట్లో వేసుకొంటే నరనాడుల్లోంచి తృప్తి!

మునుపు బిస్కట్లు తినటం పంటికి బలమైన పరిశ్రమ. ఈ మధ్య బిస్కట్లు నోట్లోవేసుకుంటే ఏమయిందో తెలియక దిక్కులు చూచింది చిన్ని. తీపి బిస్కట్లు, ఉప్పు బిస్కట్లు, వగరు బిస్కట్లు, కారం బిస్కట్లు— ఒకటేమిటి, మనిషి దేవుళ్ళా షడ్రుచులు బిస్కట్లలో ఇమిడ్చినట్లు గుర్తించింది చిన్ని.

తను తినగా మిగిలిన వాటిని ఇంట్లో అందరూ తినేవాళ్ళు. నిజానికి చిన్ని కుటుంబంలో ఇటువంటి తిండి తినకలగటం, అలా ఆర్నెల్లు తినటం— అదృష్టం!

ఇంకోలా జరిగితే ఏమయ్యేది అన్న ప్రసక్తి అలావుంచి, రోజూ కనీసం కూడయినా ఉండని తనకు, ఇంతమంచి ఆహారం దొరికేలా ఇలా జరగటంవల్ల మేలే కలిగింది.

ప్రతిరోజూ చిన్ని రోడ్డుమీద లారీకోసం ఎదురు చూస్తూ నిలబడి, లారీ వస్తుంటే ఎగిరి గంతులువేసి. లారీ లోంచి నౌకరో, డ్రైవరో ఇచ్చిన ఆహార పదార్థాలు తీసుకొని ఇంటికిపోయే చిన్నికి లారీ అదృష్టంలా, నౌకరు దేవుళ్ళా, లారీ రాక అమ్మనాన్న ఆదరణలా గోచరించి ఆనందం కలుగుతూ వచ్చింది.

ఆర్నెల్లు అయిపోయి, నుదుటి దెబ్బ నయమయి, మాసిపోయిన తర్వాత లారీవచ్చినా పళ్ళు రాలేదు. నౌకరు నవ్వినా మిఠాయిలు ఇవ్వలేదు. లారీఆపి 'బాగుందా?' అని వెళ్ళిపోతే దిగులుపుట్టి ప్రతిసారీ ఏడ్చింది. క్రమక్రమంగా లారీ ఆపటం కూడా మానేశారు.

బ్రెడ్డు తిన్న నోటితో రొడ్డుగారెలు తినాలన్నా, పళ్ళరసం తాగినగొంతుతో పచ్చిపులుసుగాని పుల్లనీళ్ళుగాని తాగాలన్నా, స్వీట్‌లు తిన్న నాలుకతో పప్పువారు కూడు తినాలన్నా మొదట్లో వాంతి వచ్చినట్లుంది. ఆకలి దేవుడిచ్చిన వరం. క్రమంగా ఆకలిముందు వాంతి పరారయింది. చిన్ని మళ్ళీ మునుపటి తిండికి అలవాటు పడింది. కాని ఎప్పుడయినా, ఈ మధ్య తిన్న తిండి దొరికితే బాగుండునన్న ఆశ పొడసూపుతూ వుంది.

లారీ ఆగటంకోసం ఆర్నెల్లు నుంచి, ప్రతిరోజూ నిరీక్షించి, చిన్ని నిరాశ చెందింది. ఆ మధ్య లారీ నౌకరు ఎందుకు అంతగా తినబెట్టాడు? ఈ మధ్య ఎందుకు మానేశాడు? అన్న ప్రశ్నలకు సమాధానం తన సామర్థ్యం కొద్దీ ఆలోచించింది. అంతు దొరక లేదు.

మళ్ళీ, ఏం చేస్తే మళ్ళీ అలా తినే అవకాశం వస్తుందా అని ఆలోచించింది. ఆర్నెల్లు ఆ చిన్ని బుర్రలో తిరిగిన ఒకేఒక్క ప్రశ్న! ఏం చేయాలి?

రాత్రి ఆకలికి కడుపు కాలిపోతుంటే, చలికి ఒళ్ళు పగిలిపోతుంటే, వానకి ఇల్లు అదురుతుంటే, అమ్మ మూలుగుతుంటే, నాన్న దగ్గర లేకపోతే, ఉప్పొప్పిండి, ఆర్నెల్ల ప్రశ్నకు జవాబు లేతబుర్ర ఆకాశంలో సూర్యుళ్ళా పుట్టింది.

రాత్రంతా చిన్ని నిద్రకు దూరంగా ఉంది. తెల్లవారటం కోసం సూర్యుడి కంటే తొందరపడింది. మసకచీకటిలో నిద్ర లేచింది. పదిసార్లు అయినా రోడ్డు మీదికి వచ్చి చూచి ఇంటికి పోయింది. చివరికి రోడ్డు ప్రక్క చింత చెట్టు క్రింద తొమ్మిది గంటల్నుంచి కూర్చుంది.

సూర్యుడింకా ముసుగులన్ని గుర్రుపెట్టి నిద్రపోతున్నాడు. చలికి ముసగర దీసుకుపోయి, వెలుపలికి రాకుండా ఇంట్లో కొండకొమ్ముగన తారట్లాడుతున్న మబ్బు రిక్రూటింగ్ ఆఫీసరులాగా మేఘాలను పోగేసుకొని ముందుకు వచ్చింది. గాలికి కాళ్ళొచ్చి, మేఘాల మెడలుబట్టి నెట్టుకు వస్తూ వుంది. ఉన్నట్టుండి వాన మొదలయింది. వాన చినుకులు గురిచూచి వదలిన బుల్లెట్లలాగా పడుతున్నాయి.

చిన్ని కూర్చున్న చోటునుంచి లేవలేదు. ఏటవాలు చినుకులు ఒంట్లోకి దూసుకుపోయేట్టు పడుతున్నా, లేవలేదు. రోడ్డుమీద ఆడుకొంటున్న పిల్లలు ఇళ్ళకు పరుగెత్తారు. కుడి పల్లెలో వాన హోరు తప్ప జనం అలికిడి లేదు. ఎడం పల్లెలో వానజోరు మరీ ఎక్కువగా వుంది. రోడ్డు కనుచూపు మేర దాకా ఎడారిగా వుంది. ఎక్కడా మనిషి జాడలేదు.

ఎక్కడ చూచినా వానే! కొండమీద పొలంమీద ఇళ్ళమీద చెట్లమీద రోడ్డుమీద ఎక్కడ చూచినా వానే! వాన విశ్వసత్యమై కురుస్తూ వుంది. ఆకాశం వానను కంటుంటే నేల పలిని తాగుతూ వుంది. ఈ చలి, ఈ వాన చిన్నికి తోడు!

నీటి బొట్లుపడి, ఆకులు బరువై, కొమ్మలు బరువై, తలలు వంచుకొన్న చెట్లు బీదవాడి దైన్యం లాగా కనబడుతున్నాయి. వానకు తడిసి కుదించుకొని, ముసగర దీసుకుపోయిన గడ్డివామి ఆకలయిన కడుపులాగ వుంది.

చిన్ని రోడ్డుమీద తేరిపార జూస్తూ వుంది. తూర్పున ఉదయించిన సూర్యుణ్ని వస్తున్న లారీని చూచేసరికి చిన్ని ఆనందానికి పట్టపగ్గాలు లేకుండా పోయాయి. అదే లారీ! ఆ లారీ తనకి ఏడు బాగా పరిచయం. అది కనబడుతుంటే ఒంట్లో ప్రతిరక్తం బిందువూ వెలుపలికి ఉరుకుతూ వుంది. ముందుకు దూకుతూ వుంది.

ఆ లారీ,—వోనరు మంచితనంలా సాగివస్తూవుండే అమ్మ ప్రేమలాగా కనబడుతూ వుంది. దేవుడి దయలాగా ఎదుటికి వస్తూ వుంది. బ్రెడ్డుల్లా, పండుల్లా, లడ్డుల్లా, బిస్కట్లలా కడుపునింపే తిండిలా లారీ కదిలి వస్తూ వుంది.

చిన్ని లేచి నిలబడింది. లారీ క్షణక్షణానికి చేరువవుతూ వుంది. ఘడియ ఘడియకూ ఆశ పెరుగుతూ వుంది. రక్తం ఉబికి పడుతూ వుంది. ఆకలి తీరిపోతున్నట్టుగా వుంది.

లారీ నిండుగా బరువుతో వస్తూవుంది. వాన ఏటవాలుగా పడుతూ వుంది. ఆకాశం నుంచి భూమి మీదికి మసకపొర జారింది. పల్లె పట్టపగలు నిశ్శబ్దంగా వుంది. మనిషి అలికిడి లేదు.

లారీ దగ్గరగా వచ్చింది. చిన్ని రోడ్డుమీదికి పరుగెత్తింది. అంతదాకా చిన్నిని డ్రైవరు చూడలేదు. అప్పుడే చూశాడు. నవ్వుతున్న చిన్నిని చూశాడు. నవ్వుతున్న చిన్నిని చూచి గుర్తుపట్టి ఏడ్పుముఖం పెట్టాడు డ్రైవరు.

వోనరు నోట్లో ఉప్పుమట్టు చిన్నిని, నవ్వుతున్న చిన్నిని, లారీ ముందున్న చిన్నిని, చూచి, జారి క్రిందపడిపోయింది.

చిన్ని నవ్వుతూ వుంది. ఆ నవ్వులో నవ్వులేదు. ఏడుపుంది. ఆకలుంది. బాధవుంది. ఆ నవ్వులో కళలేదు. కాంతిలేదు. ఆ నవ్వు నవ్వుకాదు. ఆ నవ్వులో దిగులుంది. దుఃఖముంది. దైన్యముంది. ప్రార్థనవుంది. బతిమాలటముంది. ప్రాథేయపడటముంది.

రోజూ డ్రైవరు నవ్వటం రివాజు! ఇప్పుడ్నవ్వలేదు. ఎప్పుడూ నవ్వుకు బదులు నవ్వటం వోనరుకు ఆచారం! ఇప్పుణ్ణవ్వలేదు. చిన్ని ముఖం నవ్వుతూనే వుంది! ఇప్పుణ్ణవ్వలేదు.

డ్రైవరు చేతులు వణికాయి. కాళ్ళు వణికాయి. లారీ నిండుగా కవుకిస్తూ వస్తూ వుంది. వాన పడుతూ వుంది. రోడ్డు జారుతూ వుంది. బ్రేక్ వేశాడు డ్రైవరు. లారీ ఆగలేదు. బ్రేక్ పళ్ళేదు. లారీ ఆగే సూచనే లేదు. చూస్తున్నాడు.

ఎదురుగా దగ్గరగా చిన్ని. అందమైన చిన్ని. తెలిసిన చిన్ని. వాపుదన్ని బ్రతికిన చిన్ని! తన కిష్టమయిన చిన్ని.

వోనరు గుండెలు విలవిలలాడుతున్నాయి. నరాలు తెగుతున్నాయి. కాళ్ళూ చేతులు స్వాధీనం తప్పుతున్నాయి.

డ్రైవరు కాళ్ళు చేతులు బుద్ధి ఒళ్ళు చురుకుగా పని చేశాయి. స్టీరింగ్ ఒడుపుగా తిప్పాడు. లారీ ప్రక్కకు తిరిగింది. ఆగలేదు.

చిన్ని చూచింది. అమృతంలాంటి లారీ. అన్నంలాంటి లారీ తప్పించుకు పోతుంటే భరించలేక పోయింది. లారీ ఎటుతిరిగిందో చిన్ని అటు తిరిగింది. ఎటు పోయిందో అటుపోయింది. ఎదురుగా అడ్డంగా నిలబడింది.

'చిన్నా!'

అరిచాడు డ్రైవరు. లారీ స్టీరింగ్ మళ్ళీ తిప్పాడు. లారీ రోడ్డెక్కింది. బలంగా వోపికకొద్దీ బ్రేక్ తొక్కాడు. కర్‌కర్‌మంటూ ముసలవాడి గొణుగుడులాగా లారీ ఆగుతూ వుంది. చిన్ని కనబడ లేదు.

చిన్ని చూస్తూ వుంది. ఎదుట లారీ! కర్‌కర్ మని ధ్వని. నుదుటికి దెబ్బ! మునుపు తగిలిన చోట మళ్ళీ దెబ్బ!

చిన్ని పడుతున్నాను కాబోలు అనుకొంది. రోడ్డుమీద పడింది. మునుపు రోడ్డు ప్రక్కకు పడింది. ఇప్పుడు రోడ్డు మధ్య పడింది. మునుపు లారీకి ప్రక్కగా పడింది. ఇప్పుడు లారీకి ఎదుట పడింది. లారీ ఆగలేదు. స్పృహ తప్పుతుందనికొంది. తప్పింది.

పొట్టకు ఏదో తగిలింది. అమ్మచేయో, నాన్న చేయో అనుకోవచ్చు చిన్ని. స్పృహవస్తే ఎదుట అమ్మో, నాన్నో ఉండవచ్చుననుకోవచ్చు చిన్ని. ఆకలయిన కడుపుమీద అమ్మ చేత్తో రాస్తూ వుంది అనుకోవచ్చు.

చిన్నికి ఇక ఇప్పుడేం తెలియదు. లారీ వుంది. రోడ్డు వుంది. దానిమీద చిన్ని వుంది. లారీకి బ్రేక్ పడి ఆగింది. ఆగుతూ సాగింది. సాగి ఆగిపోయింది.

ముందు చక్రం తన క్రింద రాయిపడ్డట్టు అయితే ఎక్కిదిగింది. లారీ ఆగగానే అటు వోనరు, ఇటు డ్రైవరు లారీలోంచి క్రిందికి దూకారు.

ఆ చుట్టు ప్రక్కల చిన్నిలేదు. ఎటుపోయిందో కనబళ్ళేదు. లారి క్రింది నుంచి రక్తం వర్షంనీటిలో కలిసి ఎర్రగా రోడ్డు ప్రక్క నీటి జాలులోకి పోతూ వుంది.

రోడ్డు మధ్య లారి చక్రం క్రిందపడ, పొట్టపగిలి, రక్తం అన్ని ప్రక్కలకు చిమ్మి, కాళ్ళు చేతులు నేలకు ఇలకరుచుకుపోయి అప్పచ్చిలాగా అతుక్కుపోయివున్న గోంగ్రుడుగప్ప, పెద్దగోంగ్రుడుగప్ప, అరిచేది, ఎగిరేది, దూకేది, ఆలోచించేది, ఏడ్చేది, నవ్వేది, కడుపు కాలి అల్లాడేది, ప్రేగులు తునిగి, ఆకలికి దూరంగా పోయింది.

వార్తాప్రసార సౌకర్యాలు - ప్రజాస్వామ్య పద్ధతి

శ్రీ చంచల్ సర్కార్

ఇప్పుడు ప్రపంచంలోనేమి, భారతదేశంలోనేమి ఒక గమనించ దగిన విషయం గోచరం అవుతున్నది. అది ఏమిటంటే, ప్రజా స్వామ్యధర్మం వ్యాప్తి కొరకు సంపాదన చేసుకోగల్గుతూ ఉండటం. దానికి ఆ లక్షణాన్ని సంపాదన చేసిపెట్టడం దేనికి విషయమంటారు. కొన్ని కొన్ని సందర్భాలలో కనాయాస్పదంగా, చూసుస్పదంగా, ప్రజా స్వామ్య ధర్మంయొక్క ఉత్తమ లక్షణాలు నేల వదులై పోతున్నట్లు కన్పిస్తూ ఉంటాయి. అటువంటి సందర్భాలు తటస్థ మైనప్పుడు, మన జీవితంలోనైనా ఒక్కసారి గుర్తుచేసుకుంటాను. శ్రీ శ్రీనివాసశాస్త్రి సంచరణంచేసిన రోజులకేసి చూస్తాను. ఆయన ఏ ప్రజాస్వామ్యాన్ని చెప్పాడో అది ఇంతమాత్రము తొణకనిది, నిశ్చయాత్మకమైన లక్షణం గల్గినది అయిన ప్రజాస్వామ్యం.

ఆ రోజులలో భారతదేశంలో రాజకీయ పోరాటాలు, ఉద్యమాలు ఉద్ధృతంగా జరుగుతూ ఉండేవి. మహాత్మా గాంధియే వాటిలో ప్రముఖపాత్ర వహించుకొన్నారు. అప్పుడు దేశంలో శ్రీనివాసశాస్త్రులు ఎక్కువమంది లేకపోయినా, ఆయన వంటివారు, ఆయనవంటి ధారుణమనుష్యులు, ప్రయోజనశుద్ధిగల వారు, వాక్కులు, పొల్లుపోకుండా మాట్లాడగలవారు, ప్రతిభా వంతులు—సర్జిల్ అన్నట్లు—ప్రజాశ్రేయస్సే ఉత్తమమైన లక్ష్యంగా నమ్మినవాళ్ళు—ఇతరులు కూడా ఉండేవాళ్ళు.

ఆ మహాపురుషులు, మహాస్త్రీలు భారతదేశంలో ఒకరిని ఒకరు తెలుసుకొని వ్యవహరిస్తూ ఉండేవారు. బ్రిటిష్‌వారితో కూడా వారి వ్యవహారం ఉన్నతపద్ధతిలో ఉండేది. కారణం వారందరూ ఒకే భాషను, ఒకే రకమైన పదబంధాలను ప్రయోగం చేసుకునేవారు. ఆ రోజులలో భారతదేశంలో ప్రజా స్వామ్యం పరిమితమై ఉండేది. అపరిమితమై ఉండేదికాదు. అటు వంటి పరిస్థితిలో బ్రిటిష్‌వారికి కూడా విస్తృతమైన, సంక్లిష్ట మైన సమాచార ప్రసార సౌలభ్య పద్ధతులు అవసరంలేకపోయి నాయి. సాంకేతిక విజ్ఞానంపెరిగి రాజకీయ వ్యవహార పద్ధతులు విస్తృతమై ఆ పరిస్థితిని అంతటినీ మార్చివేశాయి.

వార్తా ప్రసార సౌకర్యము, సాంకేతికవిజ్ఞానముయొక్క అభివృద్ధి, దానికి ఈ ప్రసారంతోగల సంబంధము ఇవి అన్నీ కలిపి రాజకీయపు పరిసరాలనుపూర్తిగా మార్చివేశాయి. అధికార పదవు లలోవుండే వ్యక్తులను గురించిన అవగాహన లేక వారియొక్క ప్రతిష్ఠలు ఈ సౌలభ్యంతోపాటు మార్పుచెందుతూ వచ్చాయి. అదే విధంగా సమస్యలు, సంఘటనలయొక్క ముద్ర ఊహామాత్రంగా ఉండక దానికన్నా వేరైన యదార్థసత్యాను సమకూర్చుకోగలిగాయి. ఉదాహరణకు టెలివిజన్ రాకముందు వాల్టర్ లిప్‌మన్ వంటి మహా మనీషి జాతీయరంగాన్ని గురించి ఈ విధంగా వ్రాయగలిగాడు—

"యథార్థ పరిసరం చాలా పెద్దదిగావుంది. చాలాక్లిష్టంగా వుంది. అందేట్లుగా లేదు. ఆ పరిస్థితిలో ముఖాముఖి పరిచయం కుదరడం కష్టం. ఇంతటి సూక్ష్మాతిసూక్ష్మమైన వ్యవహార విశే షంలో, అందులోనివైవిధ్యంలో, అనేక రకాలైన కూడికలు, తీసి వేతలతో నెగ్గేందుకు తగిన ఉపకరణాలు పరికరాలు మనకు లేవు. ఈపరిస్థితిలోనే, ఈ ఆవరణంలోనే మనం పనిచేయవలసి వుంది. దానిని గురించి మనం ఏదో చేయాలని వూహించుకునేముందు దాన్ని అంతటికీ సంబంధించిన సంక్షిప్తమైన వ్యవస్థను లేక ప్రతిరూపాన్ని మనం పునర్నిర్మించుకోవలసి ఉంటుంది."

టెలివిజను, ఇంకా ఇతరమైన ప్రసార సాధనాలు వచ్చాక దానిలో అతి క్లిష్టమైన సమస్యలను గురించి విశేషంగా అవగాహన చేసుకోడానికివున్న నిజమైన కష్టం పూర్తిగా పోయిందని అన లేము. సామూహికమైన ప్రసారసౌకర్యాల మూలంగా అతః పూర్వం వ్యవస్థితమైవున్న పూర్వాపేక్షలుగాని, పక్షపాతాలుగానీ నాటంతట అవి మారిపోతాయని చెప్పడం కష్టం. ఈ ప్రసార సౌక ర్యాలు క్లిష్ట సమస్యలను తక్కువచేసి చూపవచ్చు. ఏకాకారభావాని సృష్టి చేస్తున్నట్లు కనిపించవచ్చు. ఈ సౌకర్యాలు రాజకీయాల లోను, అర్థికరంగంలోనూ స్వప్రయోజన సాధనమే లక్ష్యమైన శక్తులకు ఉపయోగపడవచ్చు. ఆదివరకే వ్యవస్థితమైవున్న పరి స్థితులను అట్లానే నిలిపివేయనూవచ్చు. జాగ్రత గా పరిమర్శ

కంగా ఆలోచన చేయగల శక్తిని, అలవాటును అవి తగ్గించవచ్చు. సౌందర్యభావనలో అభిరుచిని మందగింపజేయనూవచ్చు. సాంస్కృతిక ప్రమాణాలను దిగజార్చనూవచ్చు. కష్టపడి సాధించుకున్న సమాజ సంబంధమైన ప్రయోజనాలను—ముఖ్యంగా విద్యారంగంలో— ఈ సౌకర్యాలు రహితం అయ్యేట్లు చేయవచ్చు. అసలు ప్రజలు ప్రజాస్వామ్యంలో నిమగ్నులై మనసారా పనిచేసే పద్ధతికి పూర్తిగా అడ్డు తగలవచ్చు.

ఇవి అన్నీ కూడా అధునాతన ప్రసార సౌకర్యాలయొక్క ప్రతికూల లక్షణాలు. ఈ సౌకర్యాలలో ఎంతటి వ్యతిరేక లక్షణం ఇమిడి ఉన్నదో అంతటి అన్వయ ధోరణి ఇమిడివుంది. రాజకీయమైన చైతన్య సాధనలో, విద్యావ్యాప్తిలో, ప్రజాస్వామ్యధర్మంలో, సవిమర్శకమైన ఆలోచనాపద్ధతిని అలవరచుకోవడంలో సాంస్కృతికము, సామాజికము అయిన అభివృద్ధి సాధన విషయంలో ప్రజల యొక్క మంచికి ఉపయోగపడగలసామర్థ్యం కూడా ఈ ప్రసార సౌకర్యాలకు ఉంది.

ఇవాళ మనం ప్రజాస్వామ్యాన్ని గురించి మాట్లాడుతున్నాం. ఈ ప్రజాస్వామ్య రాజకీయ జీవన పద్ధతిమీద ఒక్క టెలివిజన్ యొక్క ముద్ర ఎంతగా ఉన్నదీ గుర్తించి ఎంచడానికి ప్రయత్నిస్తాను. ఈ ముద్ర పౌరజనునిమీద [illegible] పడలేదు. ఈ ముద్రవల్ల ప్రజాస్వామికవస్తువులతో జనసామాన్యం యొక్క నిమగ్నత అపర్యాప్తంగా పెరిగిపోతున్నది. ప్రజాస్వామ్య ధర్మంలోని ధోరణులను, సమస్యలను నాటి ముందుకు తెచ్చి పెడుతున్నది. నాయకులలో ప్రజలకు, వ్యక్తిపూర్వకమైన పరిచయాన్ని కల్పన చేస్తున్నది. పౌరునిలో స్వతంత్రంగా ఆలోచించే శక్తిని పెంచి రాజకీయపక్షాలయొక్క ప్రభావాన్ని అతనిమీద తగ్గిస్తున్నది. టెలివిజన్‌నాటకంవల్ల వోటరు ఆవేశాలలో గాక హేతువృష్టితో ఆలోచించి వోటు చేయగలుగుతున్నాడు. ఇప్పుడు వోటరును మభ్యపెట్టడం అంత తేలికగా సాగే పనికాదు. ఇప్పుడు మనం ఒక ప్రశ్న వేసుకోవలసివుంది. మన ప్రజాస్వామ్య పద్ధతిలో మనం రేడియోను, టెలివిజన్‌ను ఈ రకమైన పుష్టికరమైన మార్పును తీసుకొనిరావడానికి సరిగా ఉపయోగిస్తున్నామా అన్నదే ఆ ప్రశ్న.

ఇటీవల జరిగిన యుద్ధంలో రేడియో ప్రభావాన్ని గురించి కొంత తెలుసుకోగలిగాము. రాజకీయంగా జాతి అంతటి దగ్గరకువెళ్ళి, ఆ జాతిని సమైక్యసంఘటిత శక్తిగా రూపొందించడానికి ఈ రేడియో ఉపకరణం తోడ్పడిందని, కొత్తలోకొత్తగా గ్రహించగలిగాము. టెలివిజన్ ఇంతకంటె అద్భుతాలను సాధిస్తుంది. రాజకీయరంగంలో జరిగే ఘటనలను, సంఘటనలను, ఆ రాజకీయాలలో మసలే వ్యక్తులను, ఆ రాజకీయాలలో ఉండే నాటకీయతను, దృశ్యాన్ని, సాన్నిహిత్యాన్ని ఈ టెలివిజన్ ప్రదర్శిస్తుంది.

2

ప్రపంచంలో ప్రతిరకమైన ప్రభుత్వమూ తన్ను తాను ప్రజాస్వామ్యంగానే చెప్పుకుంటున్నది. ప్రజాస్వామ్యానికి బహు రూపాలు ఏర్పడ్డాయి. ప్రతిఒక్క ప్రజాస్వామ్యధర్మరూపానికీన్నీ కొన్ని కొన్ని గుణమైన, బాగా నాటుకుపోయిన ధర్మాలు లక్షణాలు ఏర్పడ్డాయి. వాటిని గురించి రాజకీయ శాస్త్రజ్ఞులు ఏళ్లకు ఏళ్లు అధ్యయనం చేస్తూవున్నారు. వీలుకోసం, సంక్షిప్తంగా వివరించి చెప్పడంకోసం ఈ ప్రజాస్వామ్యపద్ధతిని రెండు విధాలుగా విభజించి ఒక దానిని నిమగ్నప్రజాస్వామ్యమని, రెండవ దానిని జనవాక్యప్రజాస్వామ్యమని అనుకుందాం.

నిమగ్నప్రజాస్వామ్యంలో పద్ధతి ఏమిటంటే పౌరజనులలో ప్రతి ఒక్కరి మనస్సునా భక్తిని, నిర్ణయశక్తిని పెంచి అతనికి ఎంపిక చేసుకోగల సామర్థ్యం ఎక్కువగా అయ్యేట్లు చేయడం; ఈ రకమైన ప్రజాస్వామ్యంయొక్క రాజ్యాంగవిషయకమైన రూపం పార్లమెంటరీ పద్ధతి ప్రభుత్వంగా ఉంటుంది. ఈ రకమైన ప్రజాస్వామ్యంలో ఎంత ఇదిగా నిమగ్నత కుదురుతూ ఉంటుందో అంత ఇదిగా పార్లమెంటుయొక్క శక్తి ఉత్సాహదీప్త లక్షణం అవుతూ ఉంటాయి. రాష్ట్ర శాసనసభలు, అన్ని రకాలయిన స్థానిక ప్రభుత్వ సంస్థలు ఉజ్జ్వలంగా వెలుగొందుతాయి. నిమగ్న ప్రజాస్వామ్యంలో ఎన్నికలు చాలా ప్రధానమైనవి. అదేవిధంగా ఆ ఎన్నికలకు సంబంధించిన రాజకీయ పక్షాలయొక్క కార్యకలాపాలు కూడా ప్రధానమైనవే. అయితే అప్పటి రాజకీయ జీవనం యొక్క ప్రధాన కార్యకలాపాలు అవేకాదు. ఈ రాజకీయజీవనం బహుజనంతో కూడి, ప్రభుత్వ కార్యనిర్వాహక విభాగం నిర్ణయాలుచేసేముందు వారి మాటను పాటించేట్లు చూసుకోవడం ఈ పద్ధతిలో ఉంటుంది. బ్రిటిష్ లేబర్‌పార్టీ నాయకులలో ఒకరైన ఆర్. హెచ్. ఎస్. క్రాస్‌మన్ ఈ నిమగ్న రాజకీయాన్ని సమృద్ధంగా చైతన్యంకలిగినటువంటిదనిన్నీ, నిండుప్రాణంతో తొణికిసలాడుతున్నటువంటిదనిన్నీ, నానా ప్రతివాద సంకులమయినటువంటిదనిన్నీ, కొన్ని కొన్ని సందర్భాలలో వికారమైనటువంటిదనిన్నీ, కఠినమైన పద్ధతులను అనుసరించే ప్రభుత్వాలకు అంకుశంవంటిదనిన్నీ వర్ణించారు.

జనవాక్యానుప్రాణితమైన ప్రజాస్వామ్యానికి అధ్యక్ష పద్ధతి ప్రభుత్వం రాజ్యాంగ రూపం. అక్కడ ప్రభుత్వం అతిబలంగా ఉంటుంది. పనులు జరిగేట్లు చూస్తూవుంటుంది. జయప్రదంగా నిర్వహింపబడిన ఎన్నికలలో బహుజనులయొక్క మద్దతులో తనకు కావలసిన అధికారాన్ని చేపట్టుకుంటూ ఉంటుంది. ఈ జనవాక్యానుప్రాణితప్రజాస్వామ్యంలో బలమైన ప్రభుత్వం పార్లమెంటు తలమీదుగా ప్రజలకు విజ్ఞప్తులు చేసి తాను చేసే నిర్ణయాలకు ప్రజలయొక్క ఆమోదాన్ని పొందుతూ ఉంటుంది. ఇటువంటిచోట పార్లమెంటు సంవాదవ్యవస్థ

మాత్రంగా ఉండిపోతుంది. అనేక రూపాలు కలిగిన ప్రజాస్వామ్య పద్ధతులలో మనం భారతదేశంలో పార్లమెంటరీ పద్ధతి ప్రజాస్వామ్యాన్ని ఎన్నుకున్నాము. ఈ మన ప్రజాస్వామ్యం నిమగ్న ప్రజాస్వామ్యం అవునా, కాదా అంటే అది వేరే విషయం.

పెద్ద పెద్ద దేశాలు — ఫెడరల్ స్వరూపంలో ఉన్నవి, ముఖ్యంగా వెనుకబడివున్న దేశాలై, అనాది అయిన లేమితో అవిద్యతో బాధపడుతూ వున్నప్పుడు అక్కడ నిజమైన నిమగ్న ప్రజాస్వామ్యం ఉంటుందా అన్నవిషయం అనుమానాస్పదమేనని చెప్పక తప్పదు. రాజకీయచైతన్యం బాగా ఉండి, ప్రసారసౌకర్యాలు కూడా అభివృద్ధిచెందివున్న దేశాలలో కూడా ప్రజాస్వామ్యం నుంచి ప్రజలు అధికంగా పృథక్కృతులౌతూ ఉండటం చాలా దేశాలలో ఆందోళన కలిగిస్తూన్నది. అప్పుడే కొంతమంది రాజకీయ శాస్త్రజ్ఞులు ఈ నిమగ్నప్రజాస్వామ్యం అనివార్యంగా జనవాక్యానుప్రాణిత ప్రజాస్వామ్యం దిక్కుకు వంగిపోకతప్పదని అంటూఉన్నారు. ఇక నిమగ్నతను ఏమన్నా నిలుపుకోవాలి అంటే దానిని సామూహిక ప్రసార సాధనాల ద్వారానే నిలుపుకోవలసి ఉంటుందని అంటున్నారు. పోషరిస్ట్ ప్రజాస్వామ్యాలలో ప్రసార సాధనాల వినియోగం గురించి, దాని వలన నేర్చుకోవలసిన గుణపాఠములను గురించి తరువాత పరిశీలన చేస్తాను. ఇంతకీ ఇప్పుడు జనవాక్యపద్ధతి ప్రజాస్వామ్యం దిక్కుకు మనస్సులు వంగుతున్నాయి అంటే అందుకు తగిన ఒకవిధమైన కారణం కూడా అక్కడ ఏర్పడి కనిపిస్తోంది. ప్రభుత్వాలయొక్క పనులు ఇప్పుడు అనంతంగా పెరుగుతూ, క్లిష్టం అవుతూ, ఇంకా పెరుగుతూ ఉంటున్నాయి. ఇది ఇట్లా సాగుతూ వుండగా సాంకేతిక విజ్ఞానం ప్రబలి మానవుని చరిత్రలో ప్రథమ పర్యాయం జననిమగ్నతను, అసాధారణతను సంప్రదింపును సాధ్యమయ్యేట్లు చేసింది. నాకు తోచిన పద్ధతిలో ప్రజాస్వామ్యంలో ప్రసార సౌకర్యాల పాత్ర ఒకవిధంగా ఉండాలి. ఆ సౌకర్యాలు ప్రజలతో నిమగ్నతను పెంచి, నిర్ణయాలు జరిగే సందర్భంలో వారియొక్క భాగస్వామ్యాన్ని, ప్రాతినిధ్యాన్ని ఎక్కువగా పెంపొందించగలట్లు ఉండాలి. ఆ ప్రజలు జీవించే పరిసరాలలో వారి జీవితాలయొక్క ధర్మంలో గుణంలో మార్పునుతెచ్చే నిర్ణయాలు జరిగేటప్పుడు ఈ నిమగ్నత ఎక్కువగా ఉండితీరాలి. అందుకు ప్రసార సౌకర్యాలు ఉపకరణ వాహికలుకాగలగాలి.

ఇక్కడ ప్రశ్న ఇదే. ప్రజలను పట్టించుకోవడం ఎక్కువ అవుతున్నదా? తగ్గుతున్నదా? ప్రజలు ఎక్కువగా ప్రధానం కావాలి అంటే ఆ ప్రజలు తాము పూర్తిభాగస్వాములై పని చేయగలిగేట్లు, ఆ ప్రజల సంప్రదింపు అధికం కాగలట్టి పద్ధతి ఉండాలి. ఆ పద్ధతిలో ప్రజలు మనుగడ సాగిస్తూ ఉండాలి. నిమగ్నత, సంప్రదింపులు అన్నవి; ప్రసార సౌకర్యపద్ధతి; ప్రజాస్వామ్య ధర్మంతో అవిభాజ్యమైన అవయవాలుగా ఉంటున్నవని ఆ ప్రజలకు స్పష్టంగా తెలియాలి. బాగా పెంపొందిన ప్రజాస్వామ్యంలో ఎక్కువ సమాచారం తెలియడం, ఎక్కువ చర్చలు జరగడం విధిగా అవసరం. సమస్యలను గురించిన అవగాహన అప్పుడే ఎక్కువగా కలుగుతుంది. ప్రసార సౌకర్యం అజస్రమైనదిన్నీ ఖండముకానిదిన్నీ అయివుండాలి. అది రెండు అంచుల పద్ధతిగా ప్రవర్తిల్లాలి. ఇటువంటి ఆదాన ప్రదాన పద్ధతిని గురించి పని చేయాలంటే సాంకేతిక విజ్ఞానంలోనేమి, తత్సంబంధ పరికర విశేషాలలోనేమి ప్రాతిపదిక వ్యవస్థ కనీసమైన స్థాయిలోనే ఉండవలసి ఉంటుంది.

ఇచ్చట ప్రసారం చేయబడుతున్న విషయం ఏదివున్నదో అది గుణాంకలమై ఉత్తమమైనదై ఉండాలి. ఇది చాలా ముఖ్యం. అట్లాకానిపక్షంలో ఫ్రాంక్ లాయిడ్ రైట్ అన్నట్లు టెలివిజను కంటికి వ్యర్థవిలాసం మాదిరిగా పరిణామం చెందుతుంది. ఈ గుణసంపన్నత అన్నది లేకపోయినపక్షంలో ఆ టెలివిజన్ అభీష్ట ప్రయోజన విష్టమాత్రంగా పరిణమించి అక్కడ రాజకీయాలు విలాసప్రదర్శనాల మాదిరిగా పరిణమింపజేయబడి, ఉదాసీనులైన ప్రేక్షకజనంలో వినుకలిజనంయొక్క లెక్కల ఆధారంగా తేలి, ఆ జనాన్ని అమితవాగ్విలాసంతో బుజ్జగించే పద్ధతిలోకి దిగజారిపోతుంది. ప్రజాస్వామ్యంలో జనసముదాయంయొక్క సమస్యలు ఎక్కువ కావాలి అని మనసారా కోరుకొంటున్న వారికి ఈ ప్రసార సౌకర్యం అన్నది మందిని తృప్తిపరచే సాధనమాత్రమే కారాదు. అటువంటివారు ఆ ప్రసారసాధనాలలోనే అభీష్ట ప్రయోజన పద్ధతిని నిరసిస్తూ అసలైన కార్యకారిప్రయోజనంయొక్క అవగాహన పెంచుతూ పని చేయాలి. ఎందుచేతననగా ఆ కార్యకారి ప్రయోజకులయొక్క సామర్థ్యంమీదనే ప్రజాస్వామ్యంయొక్క ఓజస్సు, శక్తి ఆధారపడి ఉంటాయి.

కొన్ని కొన్ని దేశాలలో టెలివిజన్‌ను సమాజాయత్తతను సాధించడానికి శక్తివంతమైన ఉపకరణంగా భావించడం జరుగుతోంది. సమాజాయత్తత అనగా, ఆ సమాజంయొక్క పద్ధతులను నేర్పి, ఆ సమాజంలో పనిచేసే సభ్యుడుగా రూపు కట్టడం అన్నమాట. ఇంకొంచెం లోతుకుపోతే రేడియో, అంతకంటే ఎక్కువగా టెలివిజను అనేకమైన పద్ధతులకు, స్థితులకు, పరిస్థితులకు తగినవిధమైన ప్రవర్తనను అధ్యాపనం చేసే ఉపాధ్యాయునిస్థానంలో ఎక్కువ ఎక్కువగా చేరవచ్చు. ఈ సాధనలు వ్యక్తికి తన సన్నిహితానుభవానికి అతీతమైన సమాచారాన్ని అందించగలవు. ఇతరమైన ప్రసారణ సాధనాలు అందించలేనటువంటి అనేక విషయాలను ఈ సాధన విశేషాలు—జన నాగరికతయొక్క వివిధ రూపాలను తీసుకొని—ప్రదర్శించగలవు. సమాజాయత్త పద్ధతియొక్క వివిధాలైన సంస్థలు నిర్వహించే పనులకు పరోక్ష పోషకాలు, పరోక్షఉపోద్బలకాలూ కాగలవు. ఇక్కడ మనం చిన్న పిల్లలను గురించే మాట్లాడడంలేదు. విచారించడమూలేదు. విద్యావంతులైన, విద్యావంతులుకాని, వయోజనులను పెద్ద మనుష్యులను గురించే ఆలోచిస్తున్నాం. ఒక ప్రజా

స్వేచ్ఛా సమాజంలో వారంతా కూడా యథాప్రయోజనవ్యాసక్తులైన సభ్యులుగా రూపొందేందుకు సహాయపడితే — నేను ముందే చెప్పినట్టు, టెలివిజన్ ఉన్నదంటే — అది ఈ సాధనాలలో ఒక్కటి మాత్రమే. శిశువును, యువజనుల్నీ, పెద్దవారినీ కూడా సమాజాయత్తం చేసే సాధనవిశేషాలు ఇంకా అనేకం ఉన్నాయి. పౌరులు వివేకవంతులు అయ్యేట్టు వారికి ప్రోద్బలము, సహాయము ఇచ్చే ప్రసారసాధనవిశేషాలు, ఉపకరణాలూ ఇంకా చాలా ఉన్నాయి.

3

'సమాజాయత్తం' అనే మాట మన ఆలోచనల్లో చేరిపోయింది గాబట్టి, సోషలిస్టు ప్రపంచంలో ఈ ప్రసార సౌకర్యాల పద్ధతి ఏవిధంగా పనిచేసేదీ కొంత చెపుతాను. సోషలిస్టు పద్ధతిలో ప్రసారసౌకర్యపద్ధతి చాలా ప్రధానమైనదిగా భావింపబడుతోంది. ఉదాహరణకు లెనిన్ — సోవియట్ ప్రభుత్వం బలమంతను, బుజ్జగింపు పద్ధతియొక్క సామర్థ్యంమీద ఆధారపడి వున్నదని అన్నాడు. ప్రసార సౌకర్యాలు పుష్కలంగా ఉన్నప్పుడే బుజ్జగింపు ద్వారా లక్ష్యాలు సాధించడం తేలిక అవుతుంది. ఇది అతిప్రధానమయిన విషయం అవటంచేత రష్యాలో ప్రసార సౌకర్యాలన్నీ కూడా కమ్యూనిస్టుపార్టీ ఆధీనంలోనూ, వ్యవస్థలోను, సారథ్యంలోను ఉంటాయి. ప్రభుత్వానికి కూడా ఆ సాధనాలమీద ఏ విధమైన అధికారమున్నూ లేదు.

లెనిన్, స్టాలిన్‌లు ఇద్దరూ కూడ పత్రికలను గురించి రేడియోలను గురించి, ఇంకా ఇతర విధాలైన సాముదాయిక ప్రసార సాధనాలను గురించి మాట్లాడుతున్నారు. అవి పార్టీ చేతుల్లో పరికరాలని, పార్టీకి, జనసముదాయానికీ మధ్య ఒక అనుబంధపు పనిముట్టని భావించారు. లెనిన్ ఇట్లా అన్నాడు. 'పత్రిక వున్నదంటే అది సమష్టి ప్రచార సాధనమున్నూ, సమష్టి ఆందోళనా ఉపకరణమున్నూ మాత్రమేగాదు. అది సమష్టి వ్యవస్థాపక శక్తి కలిగిన సాధనం". ఈ పత్రికలను గురించే స్టాలిన్ "పత్రికల ద్వారానే ప్రభుత్వం ప్రతిదినము, ప్రతిగంటా కార్మికవర్గంతో తనయొక్క పరిభాషలో మాట్లాడుతూ ఉంటుంది. పార్టీకి వర్గానికి మధ్య ఆత్మీయమైన అనుబంధాలను వేయుటానికి ఇంత కంటె పట్టువిడుపు కలిగిన సాధనం ఇంకోటి ప్రకృతిలోనే లేదు" అన్నాడు.

లెనిన్ పై మాటలు చెప్పిన నాటికి రేడియో సౌకర్యాలు ఇంకా బాగా అభివృద్ధి చెందలేదు. అయితే ఆయన మంచి దూర దృష్టి కలవాడు. 1918 లో సోవియట్ రేడియో డైరెక్టర్‌కు ఒక ఉత్తరం వ్రాస్తూ, "కాగితంలేని పత్రిక అవధులులేని పత్రిక నీవు తలపెట్టావు. అది చాలా గొప్ప విశేషం" అని ఉద్ఘాటించాడు. స్టాలిన్ పై మాటలు చెప్పేనాటికి టెలివిజన్ ఇంకా రాలేదు. వచ్చినా అది ప్రతి ఇంటిలోనూ అవసరమైన దినుసు కాలేదు. కాబట్టి ఇక్కడ పత్రికలు అన్నా, పత్రిక అన్నా మనం ప్రసారసౌకర్యపద్ధతి అనే అర్థం చెప్పుకోవలసి ఉంటుంది. నేను ఇక్కడ చెప్పదలుచుకున్నది ఇది: సోషలిస్టు పద్ధతిలో అవగాహన, ప్రజలతో ప్రసరణము అత్యంతమూ ప్రధాన విషయంగా భావించబడుతున్నాయి.

సోషలిస్టు పద్ధతిలోనేమి, స్వతంత్రమైన ఇచ్ఛాశక్తితో పని చేసే సమాజాల్లోనేమి, సమాచార, ప్రసార పద్ధతిని గురించిన దృష్టి ఒక్కటిగానే ఉంటుంది. అయితే కొన్ని మౌలికమైన భేదాలు కూడా ఉన్నాయి. సోషలిస్టుపద్ధతిలో సమాజ లక్ష్యాలకు అమేయమైన ప్రాముఖ్యం ఉంటుంది. ప్రసార సౌకర్యం లక్ష్యాలతో బహుజనకల్యాణ సాధనం పద్ధతిగా పెట్టుకోబడుతుంది. స్వాతంత్ర్యపద్ధతిలో అభిప్రాయవ్యక్తీకరణ స్వాతంత్ర్యానికి, సమాచారముయొక్క అకతేని ప్రసరణకు ప్రాధాన్యం ఇవ్వబడుతుంది. వార్తలను సేకరించేపద్ధతి, వానిని ఎంపికచేసే విధానం, ప్రచురణ, ఆలస్యం లేకుండా ఆ వార్తలను ప్రసారం చెయ్యడము, ఈ స్వాతంత్ర్యపద్ధతిలో అత్యంతమూ ప్రాధాన్యం కలిగిఉంటాయి. సోషలిస్టు పద్ధతిలో వార్త అన్నది చాలా అల్ప విషయం; వార్త అన్నదానిని గురించిన భావన, వార్త అంటే ఏమిటి అన్న దానిని గురించిన ఆలోచన అక్కడ ఆ సమాజ పద్ధతిపై ఆధారపడి ఉంటాయి. సోషలిస్టు సిద్ధాంతం ఏమంటుందంటే, స్వేచ్ఛాసమాజాలుగల దేశాలలో ఒక సంఘటన జరిగిందంటే దానిలోని ఆసక్తిలక్షణాన్ని, ఉద్రేకాన్ని మాత్రమే గ్రహించడం జరుగుతుంది అని అంటుంది. సోషలిస్టు పద్ధతిలో — సంఘటనలు ముఖ్యంకావు. సమాజపు పద్ధతులు వార్తలుగా భావించబడతాయి. అవే ప్రచురణకు యోగ్యాలుగా పరిగణించబడతాయి. ఈ సమాజ పద్ధతులమీద ప్రాథమిక ఇష్టం వ్యవహరిస్తూ ఉండడంతో వార్తలో కొత్తదనంమీద, త్వరితగతిని వార్తలను అందించవలెనన్న కృషిమీద శ్రద్ధ తగ్గి ఉంటుంది.

ప్రజాభిప్రాయాన్ని గురించిన సిద్ధాంతం తక్కువ చేసింది అనుకోరాదు. కాని అక్కడ ఆ ప్రజాభిప్రాయాన్ని అనుసరించి పోవాలన్నదానికి స్థానమాత్రం ఉండదు. ఆ అభిప్రాయాన్ని మలచి, రూపొందించే దానికి ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

సోషలిస్టు దేశంలో ప్రసారసౌకర్యం అన్నదానిని అడుగులోంచి కదిలించే ప్రశ్నలు ఆ ప్రజలయొక్క ఆలోచనలను, బాధలను పట్టించుకోక లక్ష్యం మాత్రంగా మారిపోతుంది అని అనుకోనవసరం లేదు. అయితే పార్టీయొక్క [illegible] అనుకోరాదు. సామాజికమైన సమస్యలు ఉన్నాయి అంటే ఆ సమాజం ఏ లక్ష్యాలను సాధించాలని ప్రయత్నిస్తుందో ఆ లక్ష్యాల సాధనకు వాటిని కట్టి ఉపయోగించాలి అన్న ఆలోచనాపద్ధతిమీద పని చెయ్యడం జరుగుతుంది. ఈ సూత్రాన్ని తీసుకువచ్చి ప్రసార సాధన రంగానికి అనువర్తింపచేసినట్లయితే ఒక విషయం తేలుతుంది. సహజమైన సమాచారంయొక్క ప్రసరణమూ ఆ సమాజంయొక్క విలువలను బలపరిచే పద్ధతిగా వ్యవస్థీకరింప

వలసి ఉంటుంది. అంతేగాక ఆ సమాజం పెట్టుకున్న లక్ష్యాల సాధనకు ఇది ప్రోదిచెయ్యాలి అని కూడా పెట్టుకున్నట్లు తెలుతుంది. సోవియట్ సమాజంలో ప్రజల తరపున పార్టీ పని చేస్తుంది. పార్టీయే విలువలను ఎన్నుతుంది. లక్ష్యాలను నిర్ణయిస్తుంది.

సోషలిస్టు పద్ధతికిన్నీ, స్వతంత్రవాదపద్ధతికిన్నీ ఇంకో తేడా ఉంది. అది వస్తునిష్ఠతను గురించి ఉన్న భావనకు సంబంధించింది. సోషలిస్టు ఆలోచనలో—రః వస్తునిష్ఠతఅన్నది స్వతంత్ర సమాజాల్లో అక్కడ ఉనికి గొనివున్న సమాజనిర్మాణాన్ని వ్యవస్థను బలపరుస్తూ ఉంటుంది— అని. స్వతంత్రవాదులు అవలంబించే వస్తునిష్ఠత అనే భావనకు సోషలిస్టులు భౌతికవాదం అన్న భావనను ఎదురుగా ఉంచుతారు. ఉంచి, వస్తునిష్ఠమైన యథార్థాన్ని, యథార్థస్థితిలో చూడగలగాలి అంటే అది గతితార్కిక భౌతిక వాదం వల్లనే సాధ్యం కాగలదంటారు. సోషలిస్టు పద్ధతిలో స్వేచ్ఛ అన్నది రెండు ధ్రువాలు కలిగిన భావన. అది అచ్చట బాధ్యతతో, సమాజ లక్ష్యాలతో చేతులుకలుపుకు పోతూ ఉంటుంది.

ఒక విశేషజ్ఞుడయిన పండితుడు ఈ రెండు పద్ధతుల లోని భేదాలను గురించి వ్యాఖ్యానంచేస్తూ ఇలా అన్నాడు: "పత్రికా స్వాతంత్ర్యం అన్నది రెండు ధ్రువాలు కలిగిన భావంగా మనం గ్రహించగలిగినట్టయితే, అందులో స్వేచ్ఛ, బాధ్యత పెనవేసుకు ఉన్నాయని గ్రహించగలిగితే అప్పుడు పత్రికా స్వాతంత్ర్యాన్ని గురించి సోవియట్‌ల భావనకు, పాశ్చాత్య ప్రజాస్వామ్యాల లోని భావనకు వున్న తేడా ఇట్టే కనబడిపోతుంది. అమెరికాలోనేమి, బ్రిటన్‌లోనేమి దీనిని అభివ్యక్తిస్వాతంత్ర్యం అంటున్నారు. ఇది ఆధారం లేని హక్కు. దానికి మూర్తి లేదు. ఆ హక్కు ఇచ్చట ప్రాణప్రదంగా పరిగణించబడుతూ ఉంది. ఆ హక్కును వినియోగం చెయ్యడంలో సాధారణంగా అన్వయసంబంధమైన ఆలోచనలు ఏవీ పరిమితులను విధించవు. వ్యతిరేకపుటాలోచనలు మాత్రమే, అనగా బాధ్యతలేకపోవడం అన్నటువంటిది ఉండి, ఇతర స్వాతంత్ర్యాలను పరిమితం చేయడము, లేక అదేఅభివ్యక్తిస్వాతంత్ర్యాన్ని ఇతరులువినియోగించే శక్తిని పరిమితం చెయ్యడమూ జరుగుతూ ఉంటుంది. సోవియట్‌రష్యాలో ఇట్లా కాదు. అచ్చట స్వేచ్ఛను వినియోగం చెయ్యటంవల్ల సంభవం అయ్యే ఫలితాలు ముఖ్యం. స్వేచ్ఛ ఔపచారికం." సోషలిస్టు సిద్ధాంతులు కూడా స్వేచ్ఛా సమాజ పద్ధతులను విమర్శ చేశారు. సమాచారం అన్న దానిని స్వేచ్ఛగా సంపాదనచేసుకునే వీలు లేకుండా చేయబడినప్పుడు అభివ్యక్తిస్వాతంత్ర్యం అర్థంలేనిది అవుతున్నదని, స్వేచ్ఛా సమాజ పద్ధతిలో సమాచారాన్ని అంది పుచ్చుకొనడానికి స్వేచ్ఛ సమకూర్చబడటంలేదని వారి వాదం.

ఈ చర్చ భారతదేశానికి ఒక ప్రయోజనాన్ని చేకూర్చవచ్చు. ఎందుచేతనంటే ఈ రెండు రకాల స్వతంత్రవాద పద్ధతుల అనుభవాలనుంచి మనం ప్రయోజనకరమైన దానిని గ్రహించ గల స్థితిలో ఉన్నాము. పాశ్చాత్యదేశాలలో, ఉదాహరణకు ఇప్పుడు అభివ్యక్తి విషయంలో విశృంఖలమైన స్వేచ్ఛ నుండి బాధ్యతదిక్కుగా భావన కదులుతున్నది. ఫ్రెంచివారు, ఇంకా స్వేచ్ఛావాదులైన మరికొందరుకూడా అభివ్యక్తిస్వాతంత్ర్యాన్ని గురించి అదో పెద్ద విషయం అయినట్లు చెప్పడం మానివేశారు. వారు ఇప్పుడు సమాచారసాధనపద్ధతులను అవలంబిస్తూ, స్వేచ్ఛకు బాధ్యతకు సమన్వయం కల్పన చేస్తున్నారు.

అయితే భారతదేశంలో ప్రస్తుతం మనం సమాచార ప్రసార స్వాతంత్ర్యం అంటే ఏమిటో విశదమైన భావనను కలిగిఉండటం అవసరం. ఈ విషయంలో మన ప్రజాస్వామ్య ఆదర్శాలను బట్టి, సంప్రదాయాలనుబట్టి మనం ఆ భావనను గురించి సంకల్పం చేయవలసి ఉంటుంది. సామాజిక ప్రయోజనంతో కూడిన స్వేచ్ఛ, సామాజికసమగ్రతతో కూడిన స్వేచ్ఛ ఈ రెండూ కూడా చాలా ఉత్తమమైన లక్ష్యాలు. అయితే అవి నినాదాలుగా మాత్రమే మిగిలిపోతే ప్రయోజనం ఏమీవుండదు. కొందరు దద్దరిల్లేటట్లు అరిచి లాభం ఉండదు. సామాజిక ప్రయోజనము, సామాజికసమగ్రత, సామాజికబాధ్యత అని అన్నీ గొప్ప భావనలే. అయితే ఆ భావనలలోని సారాన్ని రాజకీయపక్షాలు, ఉద్యోగవర్గం, ప్రభుత్వకార్యనిర్వాహకవర్గాలు, పరకు పార్లమెంటులు నిగ్గుతేల్చి నిర్ధారణలు చేసి లాభంలేదు. ఆ భావనల యొక్క సారాన్ని నిపుణులైన ప్రజా సంస్థలు, వ్యవస్థలు మదించి నిగ్గు తేల్చవలసి ఉంటుంది. ఈరోజున మనం ఎదుర్కొంటున్న పెద్ద సమస్య ఇదే. ప్రజాస్వామ్యభారతదేశంలో ప్రసార సౌకర్య కర్తవ్యాన్ని గురించి పరిశీలన చేయాలంటే దీన్ని తెల్సుకోవలసివుంది. స్వాతంత్ర్యం, సృజనశక్తి, దౌర్జన్యము లేకుండా ఉండటమూ, ప్రసరణ మార్గాలు ఇవన్నీ ముఖ్యమైన విషయాలు. ఇటువంటి మహావిషయాలను ఒక్కసారి గనుక నినాదాలతో మాటలమాటలతో మూంచి ఎత్తివేయటం అంటే ఇక వాటికి కోలుకోవడం అనేది వుండదు.

భారతదేశం అభివృద్ధిచెందుతున్న దేశం. మిక్కిలి దూరాలు కలిగిన దేశం. జనాభా ఎక్కువగా వున్న దేశం. ఇచ్చట నూటికి 70 మందికి ఇంకా సరైన విద్యాగంధం లేదు. ప్రసార సౌకర్యాలు బాగా అభివృద్ధి చెందలేదు. దేశం ఎంతో వెనుకబడివుంది. పేదరికం అధికంగా వుంది. ఈ దేశానికి సంబంధించి ఒక్క విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తున్నది. ఇచ్చట ఒక్క అభివ్యక్తి స్వాతంత్ర్యాన్నే పట్టించుకొని వ్యవహరించడం అవాస్తవికంగా ఉంటుంది. సమాజలక్ష్యం ప్రకారం ఇంత పెద్ద సమాజాన్ని సంబాళించుకొని రావాలి అన్నా, సమానత్వపు న్యాయంలో అభివృద్ధిని సాధించుకుంటూ రావాలన్నా, ఇచ్చట పరిపాలన సాగించే సర్వస్వతంత్రులమనుకొనే — అధిక జనాభాకలిగిన వెనుకబాటుగావున్న సమాజాల్లో ప్రయోగించబడి, పరిమార్చబడిన సమసమాజ పద్ధతులను పరిశీలన చేయవలసి ఉంటుంది.

ఇప్పుడు ఈ మనకాలంలో మనం ఎదుర్కొంటున్న ప్రధాన రాజకీయ సమస్య ఇదే. దాన్ని ఈవిధంగా చెప్పవచ్చు. ఆర్థిక

సంబంధమైన అన్యాయానికి స్థానం లేకుండా, ఏ ప్రాతిపదికస్వాతంత్ర్యాలులేకపోతే మనిషి మానవమాత్రుడుకాకుండా పోతాడో అటువంటి ప్రాతిపదికహక్కులకు అభావం కలుగకుండా సమానత్వ లక్షణం కలిగిన సోషలిష్టు సమాజాన్ని స్థాపించడం ఎట్లాగ అన్నదే ఆ ప్రశ్న. పాశ్చాత్య ప్రపంచంలో స్కాండినేవియా దేశాల లోని సోషలిష్టు దేశాల పరిస్థితులు భారతదేశంలో గాని, లేక ఇండోనీసియాలోగానీ పని చేయవు. చైనా, ఉత్తర కొరియా, ఉత్తర వియత్నాంలలో అనుసరింప బడుతున్న సోషలిష్టు పద్ధతులు ఉన్నాయి అంటే అవి పూర్తిగా ఉద్దేశపూర్వకంగా ఒక పద్ధతిలో నడిపింపబడుతున్న పద్ధతులై ప్రసార సౌకర్య పద్ధతిమీద గట్టిఅదుపు పెడుతూవున్నవై వుంటూ, మనం ఏ సమాజాన్ని ఆశించి తయారుకుంటూ అయినా ముందుకు నడుస్తున్నామో, ఆ సమాజపద్ధతికి ఆ పద్ధతులు ఎంతమాత్రమూ తగినవిగా కనిపించవు. క్లుప్తంగా ఇది ఇప్పుడు మనం ఎదుర్కొంటున్న సమస్య. బాధ్యత అంటూ లేకుండా చెల్లుబడిఅయ్యే విశృంఖలమైన స్వేచ్ఛ మనకు పనికిరాదు. ఆ పద్ధతి మనదగ్గర పని చెయ్యదు. మన విషయంలో ఆ పద్ధతిలో ఇంకో కష్టం కూడా ఉంది. ఇప్పుడు ఆ రకమైన స్వేచ్ఛ, ప్రస్తుతం ఉండివున్న అసమానత్వాలకు ఉపోద్బలకంగా పని చేస్తూవుంది. ఇంకో విధంగా ఆలోచిస్తే విచక్షణలేని సమానతా ధోరణి కూడా భారతదేశంవంటి లేమితో నిండిన దేశాలలో వైనాశికపద్ధతులకు, ద్వేషాలకు, ప్రతిభా సంపత్తియొక్క అస్వస్థతకు దారి తీయగల ప్రమాదం ఉంది.

సోషలిష్టు పద్ధతికి స్వేచ్ఛావాదపద్ధతికి ఒకటి అంటే ఒక దానికి పడక, ఒకటి అంటే ఒకటి మత్సరంలో పని చేస్తూవున్న సందర్భంలో ఆ రెండు పద్ధతులయొక్క ప్రసార సౌకర్య పద్ధతులు ఆ మాత్సర్యాన్ని పోషిస్తూ, అది బిర బిగుసుకుపోయేట్లు చేస్తూ వుంటాయి. వార్తల ఎన్నికకూడా అదో రకమైన స్వయంచోదనపద్ధతిలో జరిగిపోతూ ఉంటుంది. ఉదాహరణం చెపుతాను. ఫిన్లెండు బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీవారు ఒక నివేదికను ప్రకటించారు. అందులో ఈ విషయంవుంది. ప్రపంచంలోవుండే జనాభాలో అయిదవ వంతు జనాభా మాత్రమే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన పాశ్చాత్య దేశాల్లో నివాసం కొని వుంటున్నది. అయినప్పటికీ ఫిన్లెండులో రేడియోలలో ప్రసారంచేసే వార్తలు ఆ కొన్ని దేశాలనుంచే వస్తాయి. ఆ వార్తలు కూడా ఇంతో అంతో అధికంగా, ఎక్కువ భాగం ఆ దేశాలలో సంఘటనలను గురించే చెపుతూ ఉంటాయి. ఈ విషయాలను తెలిపి ఆ నివేదిక ఇట్లా అంటున్నది: “ఇట్లా మనకు తెలిసే ప్రపంచం పూర్తిగా పెట్టుబడిదారీ దేశాలు కట్టే ప్రపంచం”. ఫిన్లెండు తన ప్రక్కనవున్న పెట్టుబడిదారీప్రపంచానికిచెందని, పెట్టుబడిదారీరాజ్యంకాని సోవియట్ యూనియన్‌తో అతిసన్నిహితమైన సంబంధాలు కలిగివున్నా అక్కడ ఇట్లా జరుగుతోంది. ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం ఒక్కటే. సోషలిష్టు దేశాలలో అనుసరించే ప్రసారసాధనాల పద్ధతులను పరిశీలించి అందువల్ల ప్రయోజనాన్ని పొందవచ్చు. అదేవిధంగా స్వేచ్ఛా పద్ధతిసమాజాల్లోవున్న ప్రసారసౌకర్యపద్ధతులను గురించి పరిశీలించి కూడా అంతే లాభం పొందవచ్చు. మనకుమనం సమతూకమైన ప్రసార పద్ధతులను నిర్మాణం చేసుకోవలసి ఉంటుంది. భారతదేశం ప్రజాస్వామ్య దేశం గనుక చర్చలకు, సమాచార ప్రసరణానికి ఎంతో విలువుంటుంది. ఉదారవాదులు అభివ్యక్తి స్వాతంత్ర్యాన్ని గురించి చెపుతున్న దానిని మనం అంగీకరించవచ్చు. అభివ్యక్తిస్వాతంత్ర్యం ఒక్కటే పరమంకాదు. ఆ స్వాతంత్ర్యాన్ని బాధ్యతతో వినియోగం చెయ్యాలి. ఇది వారు చెపుతున్నారు. ఏది ఏమయినా సోషలిష్టు ప్రజాస్వామ్యంలోను, స్వేచ్ఛా పద్ధతి ప్రజాస్వామ్యంలోనూ కూడా సమాచార ప్రసార పద్ధతి అతిముఖ్యమైన స్థానాన్ని పొందివున్నది. ఇది స్పష్టంగా తెలుస్తూనేవుంది. ఈ విషయాన్ని గట్టిగా అర్థం చేసుకున్నప్పుడే అందునుండి కొన్ని ముఖ్య విషయాలు ఆవిర్భావం చెందుతాయి.

(1) సమాచార ప్రసరణానికి అక్కడ తగిన అంతరంగ వ్యవస్థ **(Infra Structure)** ఉండాలి. ఇప్పుడు ప్రపంచంలో ఉపగ్రహాల ద్వారా ప్రసారాలు, ఎలక్ట్రానిక్ సౌకర్యాల ద్వారా ప్రసారాలు జరుగుతున్నాయి. పత్రికలు, పంచరంగుల టెలివిజన్లు వున్నాయి. వీని ముందు పూర్వపుపద్ధతులన్నీ టగదుడుపు అయిపోతున్నాయి. అయితే ఇక్కడ మనం 20 వ శతాబ్దంలో 19 వ శతాబ్దంనాటి ప్రసారసౌకర్య విశేషాలతో కాలం గడుపుతున్నాము. ఇది మన సమస్య. దీనిని చెప్పడం అవసరం. ఐక్యరాజ్యసమితి తాలూకు విద్యా వైజ్ఞానిక మండలి నిర్దేశించిన దాని ప్రకారం ప్రతి వెయ్యి మందికీ 100 పత్రికల సంచికలు, 500 రేడియోలు ఉండాలి. కానీ మనకు వెయ్యిమందికి 13 సంచికలు, 23 రేడియోలకు మించి లేవు.

ఎలక్ట్రానిక్ ప్రసార సౌకర్యాలను, ఇంకా ఇతరమైన ప్రసార సౌకర్యాలను రాజ్యమే సమకూర్చవలసి ఉంటుంది. అయితే ఈ సౌకర్యాలమీద పెత్తనం, ఖామందుగిరి రాజ్యం చేతుల్లోనే ఉండాలిగానీ ప్రభుత్వం చేతుల్లో కాదు.

హక్కులు ఏవిధంగా ఉంటాయో బాధ్యతలు కూడా ఆదేవిధంగా ఉండాలి. ప్రసార సౌకర్యాలను ఉపయోగించే విషయంలో బాధ్యతతో కూడిన పర్యవేక్షణవంటిది జరిపేందుకు ప్రత్యేక సంస్థలు ఉండటం అవసరం.

4

ప్రసార సౌకర్య వ్యవస్థ బాగా విస్తరించి, బాగా పాతుకుపోయిన దేశాలవంక అట్లా ఒకసారి చూస్తే చాలు, ఆ ప్రసార వ్యవస్థవలన ప్రజాస్వామ్యంయొక్క లక్షణం మారిపోయినట్లు స్పష్టంగా కనిపిస్తుంది. మనం ఉంటున్న కాలమూ సాంకేతిక విజ్ఞానం విస్ఫోటస్థాయిలో పెరిగిపోతూ ఉన్నటువంటికాలం. ఈ విస్ఫోటస్థితి సత్వరమైన సమాజపరివర్తనాలను వాంఛిస్తుంది. సమాజంలో అనేక వర్గాలమధ్య పరస్పరంగా ఉంటూవున్న సంబంధాలను ఈ విస్ఫోటం మార్చివేస్తుంది. ప్రసార సౌకర్యాలలో వస్తున్న

మార్పులే ఈ సంబంధాలను చాలావరకు నిర్ణయిస్తున్నాయి. పరిపాలించడము, అభివృద్ధి చెందడము, నిలబడిసాగించడము అన్నీ చాలా జటిలమైన విషయాలు అయిపోతున్నాయి. సమాజంలో బహువర్గాలకు లక్ష్యాలు ఏమిటో క్రమక్రమంగా అవగాహనకు అందనివి అవుతున్నాయి. ఇందువల్ల ఒక అనిష్టఫలం సంప్రాప్తం కావచ్చు. నిర్ణయనిర్ణాయకులకు ప్రజలకు మధ్య దూరాలు ఏర్పడవచ్చు. ఇందువల్ల నిర్ణయాలు జరగడం ఉంటూ జరుగుతున్నప్పుడు వానిపై తమ ప్రభావం పడేటు చేసుకోవడంలో ప్రజల శక్తి తగ్గిపోవచ్చు. మరి నిర్ణయాలు అన్నీ వారి నెత్తిమీద గట్టి ముద్రవేయగలవై వుంటాయికదా!

అమెరికా, జపాను, బ్రిటన్, ఫ్రాన్సు, క్యూబావంటి దేశాలలో రాజకీయాలు రేడియోకుపూర్వం ఉన్నట్టు గాలేవు. రేడియో వచ్చిన దగ్గరనుంచి అవి ఎంతో పరివర్తనం చెందాయి. టెలివిజన్ వచ్చిన తర్వాత ఆ మార్పు ఇంకా ఎక్కువ అయి కన్పిస్తున్నది. ఇప్పుడు భారతదేశాన్ని గురించి ఈమాట అనగలమా? నా అభిప్రాయంలో—అనలేము. ఈ ప్రసార సౌకర్యాలు మన దేశంలో ఎటువంటి విశిష్టమైన మార్పులను తీసుకొని రావడానికిగాని ఉపయోగించబడటంలేదు. ఇది నిజంగా దయనీయమైన విషయం. రేడియో, టెలివిజన్‌లవంటి ప్రసార సాధనాలు నిమగ్నప్రజాస్వామ్యాన్ని ఎక్కువ చేస్తాయి. అన్ని విషయాలను ప్రజలు ఖుద్దున వినేట్లు, ఖుద్దున దర్శించేటు చేస్తాయి. అంతేగాక బాధ్యతగల స్థానాలలోవున్న వారిని నిలవేసి అన్నింటినిగురించి అడగగల శక్తిని అవి ప్రజలకు ప్రసాదిస్తాయి.

ప్రసారసౌకర్యాలయొక్క రాజకీయ సంబంధమైన పరిణామాలు ఈవిధంగా ఉంటాయి గనుకనే, ప్రజలలో రాజకీయమైన ఎరుక పెరిగేందుకు వానిని ఉపయోగించడం ముఖ్యమైన విషయం అవుతున్నది. ఆ ఎరుకను సంపాదించే బాధ్యతను మనం వహించవలసివుంది. పార్లమెంటు మొదలైనటువంటి ప్రజాస్వామిక సంస్థలను, వ్యవస్థలను గురించి ప్రజలయొక్క ఎరుక పెరిగేట్టు చేయవలసివుంది. అందుచేతనే పార్లమెంటు విషయాలు బయటికి తెలియనిచోట్ల వానిని ప్రసారం చేయడానికి, టెలివిజన్‌లో చూపడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. ప్రజాస్వామ్యవ్యవస్థలో చాలా పెద్ద విషయం ఎన్నికలు. ఎన్నికలు ప్రజలను విద్యావంతులను చేస్తాయి. అటువంటి ఎన్నికల సందర్భంలో ప్రసారసౌకర్యాలు వినియోగం కావడంలేదు. అది నిజంగా ఆశ్చర్యాన్నే కల్గిస్తుంది. పార్లమెంటులో ప్రశ్నోత్తరాల సమయం ఉన్నదంటే, దాని పరిమితులు దానికి

వున్నా; ప్రజలకు ఆ సమయం ఎన్నో విషయాలను కరప గలుగుతుంది. పార్లమెంటులో ముఖ్యమైన సమస్యలపై చర్చలు జరిగి, నిర్ణయాలు జరుగుతున్నప్పుడు, ఆ చర్చలు, ఆ సమావేశాలు ప్రజలకు ప్రజల ఎరుకకు అందుబాటులో ఉండటం అన్నది గూడా చాలా ముఖ్యమైన విషయం. పార్లమెంటుయొక్క చర్చలను ప్రసారం చేయడమూ, టెలివిజన్ ద్వారా చూపడము జరిగినప్పుడు, భారత ప్రజాస్వామ్యంలో చెప్పుకోదగిన మార్పు విధిగా వస్తుంది. ఇందులో నాకు ఎటువంటి అనుమానములేదు. ఎన్నికల సమయంలో గనుక రాజకీయపక్షాలు రేడియోను ఉపయోగించుకోగల అవకాశం అంటూ కల్పించబడిన పక్షంలో దేశంలో వోటర్లు తమ వోట్లను ఎంతో జాగ్రత్తగా, ఎంతో తెలిసి ఉపయోగించగల్గుతారు. అట్లా చేయడంవలన ఎటువంటి చెరుపుగాని జరగదు సరిగదా, అందువల్ల ప్రజాస్వామ్య పద్ధతిలో అధికమైన విశ్వాసం కల్గి, బలపడుతుంది.

5

పత్రికలకన్నా రేడియో, టెలివిజన్‌లు ప్రయోజనకరమైన ప్రసారసాధనాలనడంలో సందేహం ఏమీలేదు. ప్రజాస్వామ్యంలో ఎదురయ్యే లేమి, పట్టణాలఅస్వస్థత, అనేక రకాల దురభిమానాలు మొదలైన సమస్యలను రేడియో, టెలివిజన్‌లు ప్రజలముందు అత్యంతము శక్తివంతంగావుంచి, వానియొక్క ఎరుకను ఎంతో గాఢంగా వారియందు వుంచగలవు. బ్రిటన్‌లో ఒక్క విషయం రుజువయింది. సామాన్యపు వోటర్ల విషయం గురించి; మేధావుల విషయంకాదు—సర్వేలు జరుపగా, ఆ వోటరు తాము పత్రికలలో చదివినదానియందుకన్నా, టెలివిజన్‌లో చూసిన దానియందు ఎక్కువ ప్రత్యయంవుంచి వ్యవహరిస్తారని నిరూపితమైంది. అమెరికాలో పట్టణాలలోవుండే అకించనులు గూడా ఇతర ప్రజలకన్నా రెండింతల కాలాన్ని టెలివిజన్‌లు చూస్తూ గడుపుతారు. తక్కువ ఆదాయాలుగల ప్రజలు ఏ ఇతరమైన ప్రసార సాధనంలోకన్నను, టెలివిజన్‌లోనే ఎక్కువ విశ్వాసం వుంచి పని చేసుకుంటారు. అమెరికాలో గూడా టెలివిజన్‌ను పలాయనవాద సాధనంగా విమర్శించేవాళ్ళు ఉన్నారు. కాని ఆ అమెరికాలో దౌర్జన్య చర్యల నివారణ సమస్యలను గురించి పరిశీలన జరిపివున్న జాతీయ విచారణసంఘం—ఆ టెలివిజన్ అతి ప్రశస్తమైన ప్రసార సాధనమని, ప్రజలకు తమ పరిసరాలు ఏమిటో అత్యంత వాస్తవికంగా చూపించి, వానిని గురించిన సకమమైన అభిప్రాయాలు ఏర్పడ్డానికి కారణం అవుతున్నదని అభిప్రాయపడింది.

వోటింగ్ హక్కును విస్తరించినందువల్ల, లేక వోటు అర్హత వయస్సును తగ్గించినందువల్ల ప్రజాస్వామ్యం పరుగెత్తుకుంటూ రాదు. ప్రసార సౌకర్యాలు ప్రజలలో ప్రజాస్వామ్యాన్ని గురించిన ఎరుకను పెంచుతాయి. అందువల్ల ప్రజాస్వామ్యంలో సమానత్వం ప్రవృద్ధం అవుతుంది. శ్రీనివాసశాస్త్రి ఇచ్ఛితంగా అన్నాడు. ప్రజలయొక్క పునాదిలేని ప్రజాస్వామ్యం ఎప్పుడూ బలహీనంగానే ఉంటుంది—అని. ఆ కాలంలో లిబరల్‌పార్టీ ఈ ప్రజలలో రాజకీయవిద్యయొక్క ఆవశ్యకతవిషయం ఎప్పుడూ పట్టించుకున్నదికాదు.

కాలం గడుస్తూవున్నకొద్దీ, పరిశోధనలు అవీ సాగుతున్నకొద్దీ, ప్రసార సాధనాల విషయం గురించిన అభిప్రాయాలలో గూడా మార్పు వస్తున్నది. ఒకప్పుడు—ఈ ప్రసార సాధనాలకన్నా శక్తివంతమైన సాధన విశేషాలు వేరే ఏమీ లేవన్నంత భావన ఒకటి వుంటూ ఉండేది. ఆ ప్రసార సాధన విశేషాలను పెట్టుకొని ప్రజలను ఎట్లాపడితే అట్లా త్రిప్పవచ్చునని, ఎట్లాపడితే అట్లా ఆడించవచ్చునని అనుకుంటూ వుండేవారు. అటువంటి సందర్భాన్ని పురస్కరించుకొని పడికట్టుమాటలు గూడా పుట్టిఉన్నాయి. "తంత్రం చెయ్యడం", "వాడుకోవడం", "వంచగల్గడం" మొదలైనటువంటి పడికట్లు అవి. కాని ఇప్పుడు అది అంత తేలిక అయిన ముక్కుకుసూటివిషయం కాదని, అక్కడ గూడా చాలా విషయాలు వున్నాయని తెలిసిపోయింది. ఒక ప్రసారాన్ని వింటున్న వ్యక్తిగాని, లేక ఒక టెలివిజన్ ప్రసారాన్ని దర్శిస్తున్న వ్యక్తిగాని వున్నారంటే, వారికి ఆ సాధన విశేషానికి మధ్య ఒకవిధమైన సంబంధం ఏర్పడుతున్నది. ఆ ప్రేక్షకుడుగాని, లేక ఆ శ్రోతగాని ఆ దృశ్యాన్ని, ఆ ప్రసారాన్ని వడపోయగల శక్తి కలిగి వుంటున్నాడని ఇప్పుడు తెలుస్తూవుంది. ఆ వడపోతలో అతని గతానుభవాలు, అతని వర్తమానఅనుభవాలు, భవిష్యత్తును గురించిన అతని అభిప్రాయాలు, ఆలోచనలు, ఆకాంక్షలు అన్నీ సంవలనం చెంది వుంటున్నాయి. ఇది ఇట్లా వున్నదని, ఆ ప్రసార సౌకర్యాల ప్రభావపు బలిమి తగ్గిందని అనకోరాదు. పలుకుబడి అన్నది ఒక విషయం. దృష్టిలో మార్పు అన్నది ఇంకో విషయం.

ప్రజాస్వామ్యంలో ప్రసార సౌకర్యాల ప్రయోజనాలు ఎన్ని అయినా ఉన్నాయి. అవి ఎన్ని మేళ్ళనైనా చేకూరుస్తాయి. ప్రసార సౌకర్యాలతో నిమిత్తం లేకుండా, ఇప్పుడు ప్రజాస్వామ్యంలో సారభూతమైన విషయాల విషయంలో, ఆ ప్రజాస్వామ్యాన్ని మాంసలం చేయగల విషయాల విషయంలో, పెద్ద అభ్యున్నతిని, ప్రగతిని సాధించడం అసాధ్యమైన విషయం అని తేలిపోతున్నది. అయితే ఈ సాధన విశేషాలను విస్తృతంగాను, వివేకంకలిగీ ఉపయోగం చేస్తూ ఉండాలి. ఆ ప్రసార సాధనాలు నారదీ కర్రల వంటివి కాదు. లేమిని పోలి, సమాజాన్ని మార్చి, సమానత్వాన్ని అట్లా స్థాపించివేయగల మంత్రదండాలుగా వానిని గురించి భావించవలసినకాదు. అవి అజ్ఞానపు చీకటిని అదిమి, సమాజపరివర్తన అను దీపాన్ని పెట్టే యంత్రాలు మాత్రమే. అవి—ప్రజలయొక్క స్వాతంత్ర్యాన్ని రక్షిస్తూ, ఆ స్వాతంత్ర్యానికి ఎక్కువ అర్థాన్ని, ప్రయోజనకరమైన విస్తృతిని చేకూరుస్తూ, బహుజనకల్యాణానికి మార్గాలను సరిదిద్దే ఉపకరణవిశేషాలు మాత్రమే.

6

భారతదేశంవంటి దేశంలో ప్రసార సౌకర్యాలు (టెలివిజన్‌ను గూడా చేరుస్తున్నాను) రాజ్యపు గుత్త హక్కులో ఉన్నాయి.

నేను రాజ్యానికి, ప్రభుత్వానికి భేదం చెబుతున్నాను. ప్రభుత్వాలు వస్తూ పోతూ ఉంటాయి. రాజ్యం పోదు. అది స్థిరము, శాశ్వతము అయినటువంటిది. ప్రభుత్వం ఎప్పుడూ ఒక పార్టీ ప్రయోజనాలనుబట్టి నడవవచ్చు. కాని రాజ్యం మాత్రం ప్రజల యొక్క శ్రేయస్సును, యోగక్షేమాలనుబట్టి మాత్రమే నడవాలి. అప్పుడు ప్రసార సాధనం అన్నది రాజ్యంయొక్క నిర్వహణ విషయం అయినప్పుడు, ఆ సాధనాన్ని ప్రజా సంక్షేమం కోసం, ప్రజల యోగక్షేమాల కోసము మాత్రమే వినియోగం చెయ్యాలి.

సోవియట్ రష్యాలో ప్రసారసాధనాలపై నియంత్రణ్యం విషయం చెబుతూ, అక్కడ ఏకపక్ష ప్రభుత్వాలని గురించి చెప్తూ—బాధ్యతతో కూడినటువంటి స్వాతంత్ర్యము, స్వేచ్ఛ లక్ష్యం లేనివని అన్నారు. ఎక్కడైతే ప్రతిపక్షాలన్నీ లేని ఏకపక్ష అధికారం ఎక్కువగా ఉంటుందో, అక్కడ [illegible] ఉండదు గనుక, అక్కడ గట్టి ప్రతిపక్షం కూడా ఉండదు గనుక, అటువంటి సందర్భంలో ఈ బాధ్యత మరి ఎక్కువగా ఉండవలసి ఉంటుంది. [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ప్రజలకు [illegible] బాధ్యతను ఎక్కువగా పాలించవలసి ఉంటుంది. ఇక్కడ నేను ఒక కొత్త అంశాన్ని ప్రస్తావిస్తున్నాను. అది ఇది. ప్రజాస్వామ్యపద్ధతిలో ప్రభుత్వ ప్రచారంయొక్క లక్ష్యం ఏమై ఉండాలి? ఈ లక్ష్యాన్ని గురించి వివాదాలు వస్తున్నాయి. ఇప్పుడు ఈ విషయం మరింత బలంగా [illegible]. దేశాన్ని గురించిన సమాచారాన్ని ప్రభుత్వం [illegible] నిరంతరంగా ప్రజలకు అందజేయవలసి ఉంటుంది. ఈ సమాచార ప్రసారాన్ని బాధ్యతతో [illegible] [illegible], ఆ ప్రసారానికి ఒక [illegible], ఆ ప్రసారానికి ఒక [illegible] [illegible], ప్రజల [illegible] [illegible] [illegible]—రాజ్యము, రాజ్యంయొక్క [illegible], [illegible] [illegible]; ప్రభుత్వము, పార్టీలు [illegible] [illegible] [illegible] ఈ వ్యత్యాసం [illegible] [illegible] [illegible] [illegible].

ప్రభుత్వసంబంధమైన సమాచారం సమగ్రంగాను, సత్యనిష్ఠమైనదిగాను ఉండి, సకాలంలో ప్రజలకు అందేటట్లు చేయడం అన్నది [illegible] [illegible] [illegible]. ఆ ప్రజలకు సమాచారాన్ని అందజేయాలనే బాధ్యతను గుర్తించవలసి ఉంటుంది. [illegible] [illegible] సమాచారం [illegible] [illegible] [illegible] ఉండాలంటే, ఆ సమాచారాన్ని [illegible] [illegible] [illegible] [illegible] [illegible] ఉండాలి. ప్రభుత్వంయొక్క సమాచార యంత్రాంగాన్ని [illegible] [illegible], [illegible] ప్రజాభిప్రాయ [illegible] [illegible] [illegible] [illegible]. ఈ ప్రమాదాన్ని [illegible] [illegible], పార్టీ [illegible], ప్రభుత్వ [illegible] [illegible] [illegible] [illegible]

చేయగల ఎన్నో సందర్భాలు ఇక్కడ ఉండాలి. ఇందువల్లనే రాజ్యంయొక్క ఆధీనంలో ఉన్న ప్రసారసాధనవిశేషాల పర్యవేక్షణ, నిర్వహణ కేవలం ఒక ప్రభుత్వం చేతుల్లో లేనందున, [illegible] అనుభవం కల్గిన స్వతంత్రులైన వ్యక్తుల చేతులలో ఉంచటం అవసరం అన్నవాదం ఉత్పన్నమవుతున్నది. అటువంటి సంస్థలకు తగిన అధికారాలు, స్వనిధి, డబ్బు సమకూర్చి ప్రజలకు మంచి కార్యక్రమాలను రూపొందించి ప్రసారం చేయగలిగేట్లు చేయడం ప్రభుత్వ బాధ్యత అయి ఉండవలసి ఉంటుంది.

1948 లోనే బ్రిటీష్ ఎకనామిస్ట్ పత్రిక వ్రాసింది—"ఈ విజ్ఞానశాస్త్రం తయారుచేసిన భయంకరమైన యంత్రం అయిపోయింది! అభిప్రాయ వ్యక్తీకరణంలో, సంస్కృతి విషయంలో బలవంతపు ఏకాకారతను తెచ్చిపెట్టే ఉపకరణంగా అది తయారవుతోంది." ఇటువంటి స్థితి ఏర్పడకుండా చూసుకునే నిమిత్తమే ప్రజాస్వామ్య సమాజాలు సామాజికమైన సంతులనం చేసుకునే పద్ధతిని రూపొందించుకోవలసి ఉంది. సరియైన సంతులనం పద్ధతి కన్పించలేదు గనుక, [illegible] [illegible] సర్వయత్నం దగ్గర మొదలు [illegible] [illegible] ప్రయత్నిస్తున్నాయి. ఈ వ్యవహారంలో మొత్తం సర్వోత్తమ పద్ధతి రూపొందలేదు అని ఒప్పుకోవలసిన వనిలేదు. స్వేచ్ఛా సమాజాల్లోను, కొన్ని సమాజాల్లోను ఇందుకు సంబంధించి కొత్త కొత్త పద్ధతులు అవలంబించబడినాయి. వాటిని గురించి ఇక్కడ కొంత పరిశీలన చేయవచ్చు.

7

నిజమైన ప్రజాస్వామ్యం ఎప్పుడూ అన్యోన్యమైన సలహా సంప్రదింపుల ఆధారంగానే నడవవలసి ఉంటుంది. అక్కడ ప్రజలకు సాధ్యమైనంత ఎక్కువ సమాచారం అందేట్లు చేయవలసి ఉంటుంది. ఇక్కడ ఒక బాధ్యత కూడా ఉండటం అవసరం. అది ప్రజలతో సంప్రదించడం అన్నది. సాంకేతికాభివృద్ధివలన ఇటువంటిది ఇప్పుడు సాధ్యమే అవుతున్నది. టెలివిజన్ యొక్క ప్రచారం అత్యధికంగాగల ఒకానొక దేశంలో ప్రసారసాధనాధిపతిగా పని చేస్తున్నాయన ఒకరు ఇలా అన్నారు:

"జనాభా అనేక మిలియనులకు మించిపోతే, ప్రజాస్వామ్య ధర్మం సాగటం కష్టమని అభిప్రాయాలు ఉన్నాయి. కాని ఆయన రోజులో టెలివిజన్ లేదు. టెలివిజన్ వుంటే జనాభా ఎంతైనా కొన్ని కోట్లైనా ప్రజాస్వామ్యాన్ని భద్రం చేసుకోవచ్చు. ప్రతిఒక్కరూ ప్రజాస్వామ్యంలో పాలుపంచుకొనేట్లు చెయ్యవచ్చు."

మార్షల్ మెక్‌లూహాన్ ప్రపంచాన్ని, "భౌగోళిక గ్రామం" అన్నాడు. సాంకేతిక విజ్ఞానాభివృద్ధివల్లనే ఇటువంటి వర్ణన సాధ్యమైంది. ఆ "భౌగోళిక గ్రామం" అన్నది ఇంకా మనకు ఎంతో దూరంలో వుంది. ప్రజాస్వామ్యం ఇంకా బాగా పాదుకుని, వేళ్ళు తన్ను కోవలసివున్న దేశాలలో ఈ భావన ఇంకా సరిగ్గా ప్రచారంలోనికి రాలేదు.

8

నూతన సాంకేతిక విజ్ఞానంవల్ల రాజ్యాంగవ్యవహారాలలో ప్రజలు అధికంగా, ఎక్కువ ప్రయోజనకరంగా నిమగ్నులు కాగల పరిస్థితులు ఏర్పడ్డాయి. నిజమే. ఈ నూతన సాంకేతిక విజ్ఞానం ప్రజలకు కొత్త అవసరాలను, తద్వారా నిమగ్నతను మరింత ముఖ్యము విస్తృతము చేసింది. రాజ్యాంగంయొక్క సంస్థలు, వ్యవస్థలు ఇప్పుడు ప్రజలలోవున్న సంఘాలలో సంస్థలలో నిరంతరము సంప్రదిస్తూ ఉండవచ్చు. అందుకు తగిన పరికరాలు ఉన్నాయి. ఆ ఉపకరణాలను ఎట్లా వినియోగించాలి; ఎంత మేరకు వినియోగించాలి—అన్నదే ప్రశ్న.

నిమగ్నత, పెరుగ అధికంకావాలి అంటే, ప్రచార, ప్రసార సాధనాలమీద ప్రజల మదింపు, ప్రజల పర్యవేక్షణ వుండే పద్ధతులను రూపొందించుకోవాలి. ఆ ఉపకరణాలు రాజ్యాధీనంలోవున్నా, లేక ప్రైవేటు వ్యక్తుల అధీనంలోవున్నా, ఇది అవసరమే. ప్రభుత్వ సంబంధి సమాచారం కూడా ప్రజలకు ఎక్కువ అందుబాటులో ఉండాలి. అతి రహస్యం—ప్రజాస్వామ్యం పంథాన్ని నాశనం చేయగలదు. ఇప్పటికి రెండు శతాబ్దాలుగా స్వీడన్ లో రహస్యానికి అంతంటూ లేని పద్ధతిమీద వ్యవహారం నడుస్తున్నది. ఫలానా, ఫలానా సమాచారాలను బయట పెట్టరాదని ఒక శాసనరూపంలో చెప్పబడి వుంటే తప్ప, ప్రభుత్వసంబంధి వ్యవహారపత్రాలేవీ అక్కడ రహస్యాలుకావు. అనగా అక్కడ రాజ్యవ్యవహారపత్రాలకు రహస్య వర్గీకరణం అంటూ ఉండదు. ఏ పౌరుడైనా, ఏ పత్రాన్నైనా సరే కావాలని అడగవచ్చు. చూడవచ్చు. దాన్ని ఇవ్వడమా, ఇవ్వకపోవడము అన్నది—అందుకు సంబంధించిన అధికారిమీదను లేక అతని పై అధికారులమీదను ఉంటుంది. ఒక పత్రాన్ని ఇవ్వడానికి నిరాకరించినప్పుడు—ఎందుకు నిరాకరించవలసి వచ్చింది—అధికారులు సకారణంగా చెప్పుకోవాలి. ఆ చెప్పే కారణాలు అందుకు సంబంధించిన శాసనాలలోని అంశాలకు సరిపోయినట్లు ఉండాలి. ఏ పత్రాలు, విషయాలు బయట పెట్టరాదో, అందుకు సంబంధించి ఒక జాబితావుంది. అయినా అది ఎక్కువమేర అసంతంగావుంది. ఒక వ్యక్తి ఒక పత్రాన్ని చూడాలని కోరినప్పుడు, అందులో తనకు న్యాయ సంబంధమైన ఆసక్తి అంటూ వున్నదని నిరూపణ చేసుకోవలసిన పని అక్కరలేదు.

బ్రిటన్ లో ఇట్లాగాక గుప్తిచాలా ఎక్కువ. ఫుల్టన్ సంఘం ఈ రహస్యబాహుళ్యాన్ని తగ్గిస్తే, ప్రజలకు ఎంతో మేలు చేయడం సాధ్యం అవుతుంది అన్నది. "ఈ రహస్య గోప్య పద్ధతి సంప్రదింపులపద్ధతిని దుర్వినియోగం చేస్తున్నది" అని కూడా ఆ ఫుల్టన్ సంఘం వ్రాసింది.

భారతదేశం సంగతిచూస్తే, ప్రపంచంలో ఇక్కడే ఎక్కువ మంది విద్యాగంధంలేనివాళ్ళు ఉన్నారు. ప్రపంచంలో అవిద్యావంతుల సంఖ్య 80 కోట్లు. వారిలో 30 కోట్లమంది మన భారత దేశంలోనే వున్నారు. ఇక మన విద్యా పద్ధతి వున్నదంటే, అక్కడ 1969 నాటి లెక్కల ప్రకారం పాఠశాలల్లో చేరిన పిల్లల్లో 100 కి 63 మంది ఐదోతరగతి చేరేలోపలే బడులు మానేస్తున్నారు. విద్యాగంధంలేని వారిని, ఇట్లా పాఠశాలల్లో చేరి, కాస్త చదువైనా పూర్తికాకుండా చదువులు మానుకున్నవారిని రాజకీయంగా సామాజికంగా చైతన్యవంతులుగాను, ఎరుకగలవారినిగాను చేయడం ఒక్క ఎలక్ట్రానిక్ ప్రసారసాధనాలవలన తప్ప, ఇంకో విధంగా ఎట్లా సాధ్యం అవుతుంది?

భారతదేశంలో వోటర్ల సంఖ్య చాలా ఎక్కువ. మనది చాలా పెద్ద ప్రజాస్వామ్యం. 2000 సంవత్సరం వచ్చేనాటికి ఈ సంఖ్య ఇంకా పెరిగిపోతుంది. మనం వున్న వారికి అయినా ఎన్నికలసమయంలో రేడియో ద్వారా రాజకీయంగా తెలియదగు విషయాలను ఉన్నంటని అందజేయడం ఇంకా సరిగ్గా ప్రారంభం చేయనేలేదు. 1970 లో మన విశ్వవిద్యాలయాలలో చదువుకుంటున్న వారి సంఖ్య 31 లక్షలుగావుంది. ఈ రకమైన రద్దీ, పరిశోధనలో సంక్షోభం వంటి వానివలన, ఇక విద్యా ప్రమాణాలను పెంచాలిఅంటే విద్యార్థులతో సంబంధం నిల్పుకోవాలి అంటే, అందుకు రేడియోలు, టెలివిజన్ లుతప్ప వేరే గత్యంతరమే ఉన్నట్లు కన్పించదు. ఇప్పుడు మన పాఠశాలల్లోగాని, విశ్వవిద్యాలయాలలో ఈరకమైన ప్రసారం ఎట్లావున్నదీ చూస్తే, ఇంకా అసలు మనం ప్రారంభ చేసినట్లే కన్పించదు.

9

ప్రసారసౌకర్యంయొక్క ప్రాముఖ్యతను గురించిగాని, లేక సంస్కృతికి దానివలన లభిస్తున్న ఉన్నతిని గురించిగాని ఏమి చెప్పాలన్నా, ఆ ప్రసారసౌకర్యంయొక్క ఆర్థిక పరిస్థితులను గురించి గూడా ఆలోచించవలసి వుంటుంది. ఎలక్ట్రానిక్ ప్రసార సౌకర్యాలను నెలకొల్పడానికి చాలా ఖర్చవుతుంది. పత్రికలను సాంకేతికమైన పునాదులమీద నిల్పాలన్నా అంతే. అయితే ఈ ప్రసార సౌకర్యాలు లేకుండా విద్యలేదు. చైతన్యంలేదు. ఎరుకరాదు. ఇవి లేకుండా ప్రజాస్వామ్యంలేదు. కాబట్టి ఇచ్చట ప్రసార సౌకర్యాలను గురించి, ప్రజోపయోగికార్యకలాపాలమీద పెట్టుబడులు విషయం ఎట్లాగో, అట్లాగే ఆలోచించాలి. ఇక్కడ నష్టంవుంటుంది. 1974కి బ్రిటిష్ బ్రాడ్కాస్టింగ్ కంపెనీకి వచ్చిన లోటు 90 కోట్ల రూపాయలదాకా ఉంది. ఈ ప్రసార సౌకర్యాలకు సంబంధించిన ఆయవ్యయవ్యవహారంలో ఇంకో విచిత్రం వుంది. ఇచ్చట పొదుపుపనులకు అంటూ, వ్యయకర్తనానికి అంటూ దిగినప్పుడు ముందు ప్రోగ్రాములకు దెబ్బ తగులుతుంది. సాంస్కృతిక ప్రమాణాలకు దెబ్బ తగులుతుంది. సాంకేతిక విషయాలను గురించి ఖర్చు తగ్గించే ఒత్తిడి ఉండదు. సర్ హ్యూ కార్ల్టన్—గ్రీన్ ఒక ప్రసంగంలో బి. బి. సి. వంటి సంస్థలకు కావలసిన ఖర్చుల పద్ధతి ప్రభుత్వానికి ఎప్పుడూ అర్థం కాలేదన్నారు. మరి ఈ సౌకర్యానికి డబ్బు కూర్చేది ఉద్యోగివర్గము, రాజకీయ నాయకత్వమూనూ కదా! ప్రసార సౌకర్యాల విషయంలో సాంకేతిక

విభాగానికి సంబంధించి వ్యయకర్తనానికి ఎడము ఉండదు గనుక ఈ కర్తనం తీవ్రత అంతా ప్రోగ్రాముల భాగంమీదనే పడుతుంది. ఒకసారి అటువంటి కర్తనం జరిగిందంటే దాన్ని పునరుద్ధరించడం అన్నది విశేషణంగా తయారై ఊరుకుంటుంది.

భారతదేశంలో ప్రసార సౌకర్యం పరిస్థితిని గురించి చూచినట్లయితే, కొన్ని కొన్ని విషయాలు స్పష్టంగా గోచరిస్తాయి. అభివ్యక్తికి, ఇతర ప్రసారాలకున్న మార్గాలు పరిమితంగా వున్నాయి. ఈ ప్రసారమార్గాలకు నిధులను కేటాయించడంలో గూడా సరియైన సూత్రాలు అనుసరించబడటంలేదు. సంస్కృతికి సంబంధించిన విషయాలలోగాని, లేక సాంస్కృతిక సంబంధమైన ఎరుకను ప్రజలకు ప్రసార విశేషాలచేత, టెలివిజన్ ద్వారా కల్గించడంలోగాని దేశం ఏటువంటి వైశిష్ట్యాన్ని సాధించలేని విధంగా ఆ సూత్రాలు ఉంటున్నాయి.

లైసెన్సు ఫీజులవల్ల, రేడియో ప్రసారాలవల్ల వచ్చిన ఆదాయాన్ని, ప్రస్తుతం అనుసరిస్తున్న సూత్రప్రకారం కేంద్ర ఆలిండియారేడియోకు జమకట్టరు. సమాచారము—ప్రసార శాఖవారికి 1971—72 లో మొత్తం బడ్జెట్‌లో కేటాయించ బడిన మొత్తం అత్యల్పమైనది. ఈ మొత్తంలోనే ఆలిండియా రేడియోకు, పెట్టుబడి ఖర్చులకు—అన్ని సర్దుబాట్లు చేసుకోవాలి. సరియైన దృష్టిలేకపోవడము, సమర్థమైన నాయకత్వం లేకపోవడము, ఆర్థిక వ్యవహారాలను సంబాళించుకునే విషయంలో తగిన దక్షత లేకపోవడమువల్ల ఆలిండియారేడియో భారత సాంస్కృతిక వైశిష్ట్య సాధనకుగాని, తన ప్రసారం ద్వారా ప్రజలలో జాతీయమైన చైతన్యాన్ని కల్గించడానికిగాని, శక్తివంతమైన ఉపకరణంగా రూపుకట్టలేక పోతున్నది.

ఇక్కడ ఒక ఉదాహరణం చెబుతాను. శ్రీ టి. తారాశంకర బెనర్జీ బెంగాల్ సాహిత్యరంగంలో చాలా గొప్పవారిలో ఒకరు. ఆయన ఒక పుస్తకం వ్రాశారు. "నా సాహిత్య జీవితము"—అని. అందులో ఆయన 1930 లలో తాను ఎదుర్కొనవలసి వచ్చిన ఒక సమస్యను గురించి వివరించారు. కలకత్తాలో స్థిరపడి, రచయితగా ఉండటమా? లేక తన బీర్‌భూమ్ జిల్లాకుపోయి జీవితం గడపడమా? అన్న సమస్య అప్పుడు ఆయనకు వచ్చిపడింది. ఆయన, ఆయన భార్య ఆలోచించారు. తాము ఇద్దరు; నలుగురు పిల్లలు—కలకత్తాలో బ్రతకాలి అంటే, వారికి నెలకు కనీసం వంద రూపాయలు కావాలి. చిన్న కథలు వ్రాస్తే పత్రికలవారు పదిహేను రూపాయలు ఇచ్చేవాళ్లు. నవల అయితే సంవత్సరంమీద 150 రూపాయలు వచ్చేవి. ఆలిండియా రేడియో ఒక ప్రసారానికి పది రూపాయలు ఇచ్చేది. అప్పుడే ఢాకా రేడియో కొత్తగా పెట్టారు. ఆ రేడియో 30—35 రూపాయలు ఇస్తూ వుండేది. అయితే రైలు ఖర్చులు పెట్టుకోవాలి. అది పోను ఏ పన్నెండు రూపాయలో మిగిలేవి.

ఒకసారి తారాశంకర్‌బాబు కుమార్తెకు పెద్ద జబ్బు చేసింది. ఆయనకు ప్రచురణ కర్తలనుంచి, పత్రికల సంపాదకులనుంచి రావలసిన మొత్తం ఇరవయ్యో ఇరవై అయిదు రూపాయలో వుంది. అప్పుడు తాను పడిన బాధను, పొందిన అవమానాన్ని ఆయన ఆ గ్రంథంలో వ్రాశారు.

ఇప్పుడు ప్రతిఫలాలు రేటు పెరిగింది. ఆ దాఖలాను లెక్కపెడితే, ఇప్పటికీ పత్రిక సంపాదకులుగాని, ప్రచురణకర్తలు గాని, పెద్ద పత్రికాసంస్థ అయిన ఆలిండియారేడియోగాని ఏమైనా గొప్పగా చెల్లిస్తున్నారా! దేశంలో సంస్కృతిని, సాహిత్యాన్ని, కళలను ప్రసార సాధనాలు ఇట్లా వినియోగం చేసుకోవడంవల్ల ఏర్పడబోయే సంఘటనల పరిణామాలను గురించి ఆలోచించవలసివుంది. తారాశంకర్ బెనర్జీ ఇట్లా వ్రాశారు: "ఇన్నేళ్ళ, నాకు అదృష్టంవలన డబ్బు దొరికింది. డా. బిధాన్‌బాబు సహాయం చేశారు. జమీందార్ (శిల్పి అయిన జమీన్‌దార్) నన్ను రక్షించారు. అయితే నా అదృష్టం యువ రచయితలకు వచ్చిందని అనుకోవడం లేదు; ఏ రోజునా లేదు. వారి అంతః శక్తులు, సంపదలు నశించిపోతూ ఉండవచ్చు".

భారతదేశంలో ప్రభుత్వంలోవున్న, ప్రైవేటురంగంలోవున్న ప్రచురణ, ప్రచురణ సాధనాలన్నీ ఇంతకన్నా గొప్ప విమర్శ ఏమి ఉంటుంది!

10

స్వాతంత్ర్యదినపత్రికాలు కొన్నింటిలో రేడియోలు, టెలివిజన్‌లు డబ్బు సంపాదన సాధనాలుగా ఉపయోగపడుతున్నాయి. టెలివిజన్ ద్వారా అయితే ఇప్పుడు అడ్వర్‌టైజ్‌మెంటు ఆదాయం బాగా పెరుగుతోంది. కొన్ని కొన్నిచోట్ల ఈ అడ్వర్‌టైజ్‌మెంటులకు దూరంగా వుంటూ, ప్రసారఉపకరణాలు పూర్తిగా లైసెన్సు రుసుములమీదనే నడుస్తున్నాయి. ఇందుకు ప్రశస్తమైన ఉదాహరణాలు బ్రిటిష్ బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషను; జపాను బ్రాడ్‌కాస్టింగ్ కార్పొరేషన్‌లు. వీని వార్షిక ఆదాయం లైసెన్సు రుసుములవల్ల 210 కోట్ల రూపాయలదాకా ఉంటున్నది. మిశ్రమ పద్ధతి సూత్రాలను అనుసరిస్తున్న దేశాలు—ఉదాహరణకు ఆస్ట్రేలియావంటివి—కొన్ని ఉన్నాయి. కాని భారతదేశంలో అంతా అది ఏమిటో అయోమయంగా ఉంటుంది. లైసెన్సు రుసుముల వల్ల వచ్చిన ఆదాయాన్నిగాని, లేక వ్యాపారప్రకటనలను ప్రసారం చేయడంవల్ల వచ్చిన ఆదాయాన్నిగాని ఆలిండియారేడియోకు జమకట్టరు. 1970—71 లో ఈ ఆదాయం రు. 3.16 కోట్లుగా ఉంది. 1971—72 లో ఆ ఆదాయం రు. 7.50 కోట్లు, కాగలదని అంచనా. ఇది మనదేశంలో ప్రభుత్వ శాఖలో, ఒక శాఖ. అందువల్ల అది ఆ ప్రభుత్వం ఇచ్చే గ్రాంటులమీద—బ్రతుకుతూ వుండవలసిందే. ఆ గ్రాంటులకు, అక్కడి అవసరాలకు ఏమీ సంబంధం వుండదు. ఆ ప్రసార సాధనవిశేషం ప్రాభవం, పలుకుబడి, లేక ప్రాముఖ్యం అక్కడ దృష్టిలోకి రావు. 1971—72 లో 16 కోట్ల 50 లక్షల రూపాయలు మంజూరు చేశారు.

1969—70 బడ్జెట్‌లో 62 లక్షల రూపాయలు లోటు కనిపించింది. ఆ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వానికి సమర్పించేశారు. ఇక టెలివిజను రేడియోలలో యంత్రాల విషయం చూస్తే వాటికి ముసలితనం ఎప్పుడో, ఎప్పుడో వచ్చేసింది.

ప్రభుత్వ గ్రాంటులతో పనులు నడిచే పద్ధతి ఎలా ఉంటుందో బ్రిటన్‌లో పిల్కింగ్టన్ నివేదికలో స్పష్టంగా వివరించబడింది. "ఈ కార్పొరేషన్ల [illegible] వచ్చే ఆదాయంవల్లగాక, పన్నులవల్ల వచ్చే ఆదాయం నుంచి నిధులు సమకూర్చి నిర్వహించడం అంటే, అప్పుడు కార్పొరేషన్ ప్రభుత్వశాఖతో సదృశమైన స్థితిలోకి వస్తుంది.... ఆ శాఖలో ఉండే పద్ధతుల అదుపులు అన్ని దానిలోకి వచ్చేస్తాయి. [illegible] పార్లమెంటు సభ్యుల బాధ్యునిగా ఉంటూ ఉంటుంది" అటువంటి విషయాలలో ఎటువంటి పార్లమెంటు అదుపు [illegible] నేను పెద్ద ఉపకారం కలగాలనుకోను.

ప్రసారసౌకర్యాల విషయంలో ఆర్థిక సంబంధమైన వ్యవహారాదికం ఆలోచనాయుక్తం అయినది కాకపోవడంవల్ల ఎన్ని ఎదుగు బొదుగులకు ఆస్కారం లేకుండా పోయింది.

ఈ రోజున సినిమాల్ని, నాటకాల్ని అభ్యసించే పల్లెలలో ఉన్నారు. వారికి నిజం ఏమి వినబడుతుంది? ఈ దేశం పెద్ద పల్లెటూరి వైవిధ్యం కల్పిస్తున్న దేశం. ఆ వైవిధ్యాన్ని బట్టి వారి జీవితంలోని ఉత్సాహాన్ని, ఉద్వేగాన్ని వారికి చూపించవలసి ఉన్నాము. ముఖ్యంగా, విద్యాగంధరహితులను, ఒక నాటిదీ [illegible] కున్న వారిని, అంతగా పెద్ద చదువులులేని వారిని చైతన్యవంతులను చేయడం కష్టతరం అవుతుంది. విజ్ఞానశాస్త్ర సంబంధమైన అభివృద్ధికి సంబంధించిన ప్రపంచాన్ని వారికి ఎంతో దగ్గరకు తీసుకువచ్చి, ఆ నవప్రపంచంలో వారు నిలదొక్కుకునేటట్లు చెయ్యవచ్చు. ఇలాంటి సామాన్య ప్రజలు. వారిని గురించే మనం ఆలోచిస్తున్నాము. ముందు గూడ వారిని గురించే ఆలోచించవలసి ఉంటుంది. 1983 నాటికి మనదేశం జనాభా 55 కోట్లు దాటి పోతుంది. పట్టణాలలో ప్రజలు 17 కోట్లు దాదాపుల్లో ఉంటారు. వారిలో చాలామందికి చేతి పూర్తిగా సోదు. 1960–61 ధరల ప్రకారం భారతదేశపు ప్రతి శిరస్సు ఆదాయం ఇప్పుడు దాదాపు 340 రూపాయలుగా ఉన్నది. అప్పటికి 518 రూపాయలు అవుతుంది. అనగా నెలకు 29 రూపాయలుగా ఉన్నది, 43 రూపాయలు కావచ్చునని అర్థం. ఈ ప్రమాణాలు పెద్ద విశేషమైనవేమీ కావు. పైకి ఎక్కడం అసాధ్యం కాదుగాని, కష్టం.

ఒకసారి సాంకేతికులలో ప్రమాణాలను నిర్ణయించినప్పుడు వారికి అదే ధోరణి అలవాటైపోతుంది. అప్పుడు అక్కడ ఉన్నత ప్రమాణాలను తప్పినట్లైతే, ఆ సాంకేతికులు వాటిని హఠాత్తుగా అరిగించుకోలేరు.

ఈ విధంగా ప్రసార సౌకర్యాలు, ప్రజాస్వామ్య పద్ధతిని గురించి పరిశీలన చేస్తున్నప్పుడు, అక్కడ ఒక్కటే కేంద్రీకృత మైన విధానం కనిపిస్తుంది. ఇప్పుడు ప్రతిది ప్రాసులో వున్నట్లు కనబడుతుంది. అదే పెద్దమైన తుల్య స్థితి సాధనవిశేషం విధానం ఆధార పడి ఉన్నట్టు కనిపిస్తుంది. ఒక స్థితి లేనప్పుడు, ప్రమాణాలకు సంబంధించింది. సర్ విలియం హేలీ ఇట్లా వ్రాశాడు. ప్రజాస్వామ్యం ప్రసార విశేషానికి సంబంధించినంతవరకు స్వేచ్ఛకు ప్రమాణాలతో సంబంధాన్ని సాధించడం అన్న ప్రాథమికమైన సమస్య. ప్రజాస్వామ్యాలు నిరంకుశప్రభుత్వాల ఆధీనంలో [illegible] అక్కడ ఉత్పన్నంకావు. అసలు [illegible] ప్రజలలో ప్రసారవిషయం బాధ్యత నిర్వహించి, ఆ ప్రసారవిషయం అన్ని స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఉండాలి'. సర్ విలియం హేలీ వ్రాసింది 1948 లో.

స్వేచ్ఛ, ఐక్యత సాధ్యమైనంత, స్వతంత్ర్యము, సమాజ ప్రయోజనాల పట్ల గౌరవం, సమన్వయము ఉండాలని మేము అంటున్నాము. మనదేశ ప్రజాస్వామ్యధర్మ పద్ధతుల్ని, [illegible] సమన్వయాన్ని తుల్యస్థితి సాధించడం అవసరం అంటున్నాము.

సాంకేతిక ప్రక్రియ పద్ధతులలో ప్రసార సౌకర్య విస్తరణను పెంచడం [illegible] ప్రక్రియ వంకోటలేదు. అన్ని ప్రక్రియలకూ [illegible] శక్తి అధికంగా ఉన్నట్టుంటుంది. సాంకేతికమైన యుక్తి [illegible] సాగే సంవిధానాలలో సాగే ప్రసారసౌకర్యంలో సంభాషణ [illegible] పోరాటం, పెద్దవిగా ఉన్నది ఇది. ఇదే సాంకేతిక ప్రశ్న. ఇప్పుడు కొన్ని ముఖ్యమైన విలువలు ఉన్నాయి— అంటా [illegible] సంపాదనకు. మనదేశంలో సామాన్య శక్తి, యుక్తి పెరగాలి; కొత్త శక్తులను, సామర్థ్యాలను సంపాదించుకోవాలి, అనుభవాన్ని పెంచుకోవాలి, వారిపైనున్న బాధ్యతలను ప్రజాస్వామ్యవ్యవస్థలను నిర్వహించడానికి, వారి జీవితాలకు వారే సారథులు కాగలవిధంగా ఆ శక్తి, యుక్తి, సామర్థ్యాలను పెంచుకోవాలి. కొత్త విజ్ఞానాన్ని తీసుకురావాలి అంటే, అందుకు నిరంతరమైన విచారధార, నిరంతర మైన ఆలోచన, విమర్శ, ఫలాపేక్షరహిత ప్రయోగ దక్షత— అవసరం. సృష్టి అన్నది కష్టం. నాశనం చెయ్యడం తేలిక. ఈ విషయాన్ని ఎప్పుడూ మరిచిపోకూడదు.

ఆత్మలహరి
(నేను)

కీ. శే. పింగళి లక్ష్మీకాంతం

గర్వపు మాటలేల గురుకారుణికత్వ మొకండుగాక, మా
పూర్వులు సూరనాదుల తపోబల సంపదకల్మి, సాహితీ
ధూర్వహుఁడన్న పేరునకు తోడు మహాకవి యన్నకీర్తి యాం
ధ్రోర్వి లభించె నిక్కమిది యోగ్యతలేని యశమ్ము మోసితిన్

ఏదో చదివితి కొంచెం
ఏదో వ్రాసితిని కొంచె మీ యల్పంబే
ఏదో పుణ్యవశంబున
మేదిని రాణించె నార్య మిత్రుల కృపచేన్...

ఈ తెలుగు భారతీ వి
ఖ్యాతికి నున్నతికి ప్రథమ కారణ భూతుల్
మా తిక్కన సూరన్నల
గౌతమ గోత్రజుఁడ ననుచు గర్వింతు మదిన్

అహమికయో కాని, నేనా
మహనీయుల గోత్రమునకు మచ్చయె యైతిన్
ఇహపరకారణ పంకే
రుహభవజాయా కటాక్ష రుచి దూరుఁడనై

విచ్చల విడి పత్రికలకు
రచ్చలకును బోవనేను, వ్రాసిన కొంచెం
బచ్చొత్తి చూచుకొనియెడి
ముచ్చట సాధారణముగ పొడమదు నాకున్

నాగరిక వృత్తి యెడలిన
వాగర్థంబుల ప్రయోగ వైఖరి యెరుఁగన్

తూగును సౌందరనందం
బీ గరువపుం బ్రతినకెందు దృష్టాంతంబై

ఆగ్రహ పరితప్తు లమూ
యాగ్రస్తులు విసరునట్టి యస్త్రంబులకున్
నా గ్రహబలమో, దైవా
నుగ్రహమో యడ్డుపడి నసున్ గాపాడున్

నా చే సుపకృతులయి, నా
కే చెరుపును గోరు మిత్రులెందరొ నాకున్
చీ, చీ, కృతఘ్నతాఘము
సైచుటకున్ శక్తిలేక స్వాంతం బెరియున్

సత్యము పల్కెద, నుపకృతి
నిత్యము స్మరియించుకొందు, నేనై మరలన్
ప్రత్యుపకృతి నొనరింపగ
నత్యంతము కోరుకొందు నా ఋణ మీగన్

సుందర సరస పదార్థపు
సందర్శన మిచ్చునాకు స్వర్గ సుఖంబున్
మందతయును, నైచ్యమ్మును
డెందమ్మును గలచి వైచెడిన్ హేయములై

ఖండిత వాదిని నోటన్
దండింతు నధర్మమును క్రుధాభరితుడనై,
మొండి తనమ్మును గండా
గొండితన మ్మనిన వెగటు గొల్పెడి మదికిన్.

త్వరపడి మాట యొసంగెద
నెరవేర్చెడు దన్క చాల నెంజలి పడుదున్
పొరపాటున మది మరపున
దురితమ్మొనరించి యెంతొ దుఃఖింతు మదిన్

అధికారము మన్నించెద
నధికారిని గుణముబట్టి నారాధింతున్
అధముడగునేని యాతని
పథమునకున్ దొలగి నిలుతు పామునకు బలెన్.

పిలిచిన పలుకని దేవున
కలిగెద ప్రియురాలు ప్రియున కలిగిన రీతిన్
విలుగెత్తి దేవు చెవి బడ
పిలువగలేనైతి నన్ను విజ్ఞతలేమిన్.

అలసియు డస్సియు ప్రాణం
బులు తావులు తప్పి మూర్ఛ మున్నెడిననుకన్
పలుకడు దేవుండనియెడు
పలుకులు రుజువయ్యె నాకు ప్రతి కార్యమునన్.

గడపితిని కొన్నియేండ్లు చీకటి మయములు
గుడ్డి వెన్నెలయైన నెరుఁగకుండ
సత్యమొక్కటి ఆత్మ విశ్వాస మొకటి
కను వెలుంగయి నాకు మార్గమ్ము చూపె.

సత్యసంధత యిహపర సాధనముగ
బ్రతికె మా తండ్రి వేంకటరత్న మంత్రి
అదియె మిగిలెను నాకు పిత్రార్జితముగ
వ్యర్థపుచ్చక దాని కాపాడు కొంటి.

దూరస్థులు ననుగని, గం
భీరుఁడు దుర్లభుడటంచు బెగ్గిల, చెంతన్
చేరిన వా రనుకొందురు
కూరిమి చవిజూచి గంగిగోవు నటంచున్.

ఘనుడనియు నల్పుడనియున్
మనమున నరమరలు లేక మన్నింతును నె
మ్మన మిచ్చినవానిని; నా
తనయులతో పాటు శిష్యతతి ప్రేమింతున్.

పాత్రాపాత్రత లెరుగక
ఆత్రముతో చేర్చుకొందు నక్కున నంతః
శత్రువులై, హృత్కోశ ల
విత్రములై నపుడు తెలిసి వేదురు గొందున్.

నచ్చిన పని యేదైనన్
పొచ్చెము లేకుండ జేతు పూజ్యతకెక్కన్
నచ్చని పని చేపట్టను
మెచ్చులకున్ ధనములకు భ్రమించి యొకప్డున్.

ఇచ్చుటయె గాని యొరుచే
పుచ్చుకొనెడి పేద తలపు పుట్టదు నాకున్
ఉచ్చై ర్ధనులకు నెక్కుడు
వెచ్చించెద ధనము వ్యయవివేచన లేమిన్.

నాపైని లేని నిందలు
మోపి ముదంపడెడు పుణ్యపురుషుల పట్లన్
కోపంబడపంజాలక
శాసింపగ నాల్క కదిపి శాంతి వహింతున్

సూనృతము పల్క మైత్రి
హానిని గలిగించుకొందు, అన్యుల మనమున్
తానొప్పించెడి సత్యము
మానంగావలయునన్న మర్మ మెరిగియున్

హితమైనను ప్రియమైనను
మితముగ స్మితపూర్వకముగ మృదువుగ సత్ స
మ్మతముగ సంభాషించెడి
మతిమంతుల దలచుకొని నమస్సులొనర్తున్.

మోయగ జాలని భారము
మోయుచు నాశిల్లి తూలిపోయెదు నపుడున్
చే[illegible]రాత కోప మించుక
సాయమ్మును గోరి యెరుగ స్వజనం బెవరిన్.

ధర్మములు రెండు నాకు నీ తనువునందు
ఋతము పల్కుట కృతము స్మరించుకొనుట
సత్య దూరులతో చెల్మి సల్పలేను
మేలు మరచిన వాని క్షమింప లేను.

గురులకు దేవునకుం గా
కొరులకు చేమోడ్చి యెరుగ నుద్యోగమునన్
పరువడము దారి బోవక
పరువును ప్రాభవము చెల్లుబడి సాగింతున్

చేయునప్పటి యాస్థ చేసిన యనంత
రమున నుండదు నాకు కార్యమ్ము పట్ల
ఎవ్వ రేమను కొన్న నుపేక్ష దక్క
మంచి చెడ్డల చర్చ పాటించి వినను.

పగ బూన వెరతు, నాప్తి
పగ బూనిన వానితోడ పల్కగ వెరతున్
పగవాడు చేతఁ జిక్కిన
మొగమోటమి వలన నణచి పుచ్చగ వెరతున్.

భావంబున కోరుదు భ
వ్యావేశుడనైన సమయమందున నా యా
జీవుడు నిర్ఝర తటినీ
ప్లావితుడయి భానుమండలము చొరబారన్.

అవధాన పరత నీశ
స్తవ మొనరించుచునె యాత్ర సాగింతు, పున
ర్భవ బాధ తొలగ నంత
స్తవాగ్నిని చిత్తకల్మషమ్ములు ప్రేల్తున్.

చేయని పాపమ్ముల వలె
చేయని పుణ్యములుకూడ చేకురు నాకున్
ఈ యుగము, కల్ల నిజముల
న్యాయాన్యాయముల నరయు నట్టిది గామిన్.

సంతోష విషాదమ్ములు
స్వాంతమ్మున నించుకైన నణపగ జాలన్
భ్రాంతుని వలె బాలుని వలె
వింతగ నుప్పొంగి క్రుంగి వేసట పడుదున్!

కామగవి చెంత కల్పవృక్షమ్ము నీడ
స్వేచ్ఛగా సంచరించు నప్డేని యొక్క
పండు కోరను పుడిసెడు పాలువేడ
ఆకలియు దప్పియును గల్గి నప్పుడైన.

విరతము వాంఛింతును సౌం
దర నందము చెట్టబట్టి నడయాడెడి సౌ
దరకృతి యొండు రచింపగ
తరమా యీ వయసునందు తాదృశరచనల్.

వేదాధ్యాయన పవిత్రుని
పాదములకు నతి యొనర్తు పతిజీవితయై
పాదు తనమ్మున మొలగెడి
మ్మైదువ సౌభాగ్యలక్ష్మి నారాధింతున్

లౌకికుడటంచు మంచి వివేకియంచు
తంత్రభేదకుడంచు స్వతంత్రుడంచు
నిక్క మెరుగక నన్ను వర్ణించు చుండ్రు
నన్ను బోలిన వట్టిఛాందసుడు లేడు

అడుగులు తడబడు నే పని
దొడరెడు నపుడైన శిరము దూర్చితినేనిన్
మెడ యుత్తరించుకొని పో
యెదు నదనునన్నైన నిర్వహించెద దానిన్.

సంక్రమించెను జనకుని సత్వగుణము
జనని రాజసమును నాకు జన్మవలన
ఉభయగుణ సమభాగ సంయోజితాత్మ
ప్రకృతి చోదిత నిత్యవర్తనము నాది

ఆటలలో మాటలలో
నోటమి వాటిల్లి నవ్వు డొకించుక యా
రాటము చెందక నెదిరికి
నోటమి గల్గినను జాలినొందెద మిగులన్.

రమణీయమ్మైన యర్థము
కమనీయమ్మయిన శైలిగల కావ్యము భా
వము వివరించెడి పట్టున
కమలాసను రాణికిన్ ముఖాముఖినిలుతున్

ఋణమీగుట విద్యావిత
రణ మొనరించుటయు నన్ను బ్రహ్మానందో
ల్బణ చిత్తుని గావించెడి
అణుమాత్ర పరోపకృతియు నట్లే చేయున్।

మెరమెచ్చు మాటలన్ నన్
మురిపించి యనేక లాభములు పొందిన యా
పురుషులె నను నవ్వెదరట
పరేంగితమ్మెరుగనట్టి పాదని ననుచున్

విచ్చల విడిగా ఋణముల
తెచ్చితి నడిగించు కొనక తీర్చితి విజ్ఞానం
బిచ్చిన గురునకు కావ్యం
బిచ్చి కృతార్థుడనైతి నీ పుట్టువునన్.

చిత్రకవిత - నిరోష్ఠ్య సాహిత్యము

శ్రీ శ్రీరంగాచార్య

ఆంధ్రసాహిత్య మతి విస్తృతి గలది—దీనియందు పలువిధములైన రచనలు— వివిధ పద్ధతులలో బయలుదేరినవి. ఆంధ్ర లాక్షణికులు ఆశు—మధుర — చిత్ర—విస్తరము లని చతుర్విధములుగా తెనుగు కవితా విభాగ మొనర్చినారు. చతుర్విధ కవితల లోని చిత్రకవితలో నిరోష్ఠ్య విభాగము గలదు—కావున ముందుగా చతుర్విధ కవితల గూర్చి తెలిసికొనుట అవసరము.

పొత్తపి వెంకటరమణకవి తన లక్షణదీపికలో చతుర్విధ కవితల గూర్చి తెల్పినాడు[1]— చిత్రకవితకు ఆతని నిర్ణయము తెల్పి— మిగతావానిని సంక్షిప్తముగా తెల్పుదును.

'చిత్రకవిత్వంబన్నది పాదగోపనంబును— పద్యభ్రమకంబును— పాదభ్రమకంబును— నామగోపనంబును— అనులోమ విలోమగతి పద్యంబులు — కంద గీత గర్భిత వృత్తంబులును— కందద్వయ గర్భిత మణిగణనికరంబును— క్రౌంచపద గర్భిత కంద ద్వయంబును . . . . ఓష్ఠ్య నిరోష్ఠ్య సంకర జిహ్వా అచల జిహ్వా వృత్తంబులును . . . . కంకణ సర్వతోభద్ర కవి కల్పిత కల్పవల్లరి నివి యాదిగా గల్గు బహువిధ చమత్కారంబులం చిత్రంబులు రచియించుటం జేసిన నిది చిత్రకవిత్వము. (సంక్షిప్తము.)

చిత్రకవిత యీ రచనలు గలదని వెంకటరమణకవి యభిప్రాయము. ఇక మిగిలిన— ఆశు— మధుర — విస్తరముల గూర్చి తెలిసి కొందము.

ఆశు కవిత:— అడిగిన వెంటనే త్వరితగతిలో చెప్పుకవిత్వము. ఇందలి భేదములే— అష్టావధాన— శతావధాన — సహస్రావధానములు— ఘటికాశతగ్రంథకల్పనలు.

మధురకవిత:— దేశికవితా భేదములైన— పదములు— రగడలు— యక్షగానములు మొదలైనవి.

విస్తరకవిత:— పురాణ ప్రబంధాది రచనలు.

చిత్రకవిత:— అక్షర శబ్ద చిత్రములతో కూడిన కవిత. దీనిలోనే— గర్భ— బంధ— కవిత్వ ప్రౌఢిమను జూపుదురు.[2]

ఈ చతుర్విధ కవితల ప్రస్తావన తెనుగులో ప్రప్రథమముగా నన్నయగారి భారతము (ఆదిపర్వ కృత్యాది)న గలదు. ఆశు కవితకు మారుగా 'మృదు'— అని దానిలో చెప్పబడినది. (దీనికి పాఠాంతరము గలదు.) నన్నయభట్టు తర్వాత శ్రీనాథుడు— వెన్నెలకంటి అన్నయ్య— పింగళి సూరన— గణపవరపు వేంకటకవి— మొదలైనవారు— చతుర్విధ కవితా ప్రస్తావన చేసిరి. అల్లసాని పెద్దన— 'చతుర్విధ కవితామతల్లిక—' అని తెల్పికొనినాడు.

చిత్రకవితకు సంస్కృత వాఙ్మయమే మూలమని చెప్పవచ్చును. కావ్యాదర్శము— కావ్య ప్రకాశము—సాహిత్య దర్పణము,— సాహిత్య రత్నాకరము— ప్రతాపరుద్రీయము, మొదలైన సంస్కృత రచనలలో చిత్రకవితా విషయములు మిక్కిలిగా ప్రపంచింపబడినవి. ఐనను చిత్ర కవితా కావ్యమును అధమ కావ్యముగా సంస్కృత లాక్షణికులే నిర్ధారించిరి. ప్రతాపరుద్రీయ కర్త త్రివిధ కావ్యముల తెల్పుచు— "వ్యంగ్యస్యాస్ఫుటత్వే ఒధమం కావ్యమితి గీయతే'— యనినాడు. సంస్కృత లాక్షణికులు చిత్రకవితను శబ్దాలంకార ప్రకరణమున చేర్చి వివరించినారు. కావ్యాదర్శ— సాహిత్య రత్నాకర— ప్రతాపరుద్రీయాది గ్రంథముల లోను, మాఘ—భారవి—రచనలలోను, ఏకాక్షరి— నిరోష్ఠ్యము— పాదభ్రమకము— మొదలైన అక్షర చిత్రములతోపాటు— బంధకవితయు చెప్పబడినది. ఇంకను — యమకరత్నాకరము వంటి చిత్రకవితాప్రధానములగు గ్రంథములే గలవు.[3] తెనుగున నన్నయగారు చతుర్విధ కవితా ప్రస్తావన చేసిరేగాని—దానిని ప్రయోగింపలేదు.[4] మనకు తెలిసినంతవరకు చిత్రకవితలోని బంధ గర్భ కవితలను కృతిలో ప్రప్రథమముగా తెల్పినకవి నన్నెచోడుడు. తన కుమార సంభవ కావ్యమున 12 వ ఆశ్వాసములో ఈ పద్యములు గలవు.[5]

---

1. ఉదాహరణ వాఙ్మయ చరిత్ర—నిడుదవోలు వెంకటరావు గారు. (పుట: 15.1968 ముద్రణ.)

2. వివరములు—విశేషములకు— చూ. తెలుగు ఛందోవికాసము— కోవెల సంపత్కుమార.

3. విశేషములకు చూ. తెలుగు భాషలో ఛందోరీతులు— రావూరి దొరసామిశర్మగారు (378, 379 పుటలు)

4. చిత్ర కవిత్వ వాగ్విభవజృంభితుని'గా—ఎఱ్ఱన్నను జక్కన స్తుతించుటలోని ఆంతర్యమేమో?

5. కుమార సంభవ పీఠిక—వావిళ్ల ప్రచురణము.

ఇక లక్షణ గ్రంథములలో మొట్టమొదట విన్నకోట పెద్దన తన కావ్యాలంకారచూడామణిలో తెల్పెను. ఈ విధముగా ఆరంభమైన చిత్రకవిత—16 వ శతాబ్దమున విస్తరిల్లి 17 వ శతాబ్దమున ప్రాబల్యము నంది—ప్రశస్తిగాంచినది.

అప్పకవి సమకాలీనుడైన గణపవరపు వేంకటకవి—ప్రబంధ రాజ వేంకటేశ్వర విజయ విలాసము—చిత్ర కవితా సర్వస్వము గదా? ఇట్లే—'ప్రబంధ రాజ శిరోభూషణ ప్రకృష్ట బలరామ చరిత్ర' 'ప్రబంధ సంబంధ నిబంధన గ్రంథము' అను చిత్ర కవితా గ్రంథములు బయలుదేరినవి.

చిత్రకవితను—శబ్దాక్షర చిత్ర కవిత—బంధ కవిత—గర్భకవిత—అని మూడు విధములుగా చెప్పవచ్చును[6]. వేంకటకవి తన ప్రబంధరాజమునందు 808 పద్యములలో ఎన్ని విధములుగా చిత్ర కవితా ప్రతిభను విచిత్రముగ వివరించినాడో చూచిన అతని ప్రతిభతో—పాండిత్య ప్రకర్షయు పరిస్ఫుటము లగును. ఒక పద్యము పేరే యింత పెద్దగా గలదు—దానియందు ఆ వృత్తము లన్నియు నుండును. అది సీస పద్యము—దాని పేరిది.

'బహువిధ చిత్ర కంకణ బంధ ద్విగుణిత సీస చరణ చతుష్టయ
గర్భిత ద్విపద కందద్వయ సమవృత్త చౌపద యుగళాటవెలది
తేటగీతి మదనవిలసిత తురంగ వృత్త బహువిధతాళ
వృత్తాష్టక, ధవళ—శోభన—గానార్తిక—గానజంపె—
త్రిపుటార్ధ చంద్రికా—సువ్వాల —లాలపదేలామంజరి—సమతా
డిండిమ తాళవృత్త మణిగణ నికర తురగవల్గన రగడో
దాహరణ—సంబుద్ధి కళికోత్కళికార్ధాహిరీ రాగ దళ
ముఖారి రాగాట దాళదళ—కాంభోజి రాగ రూపక
తాళదళ—కాంభోది రాగ సమపద—కన్నడ రాగ సాంగత్య
కొరవంజిదళ—రేవగుప్తి రాగ సమపద—సావేరీ రాగైక
తాళదళ—బిలహరి రాగాటతాళ సమపద—పుష్పమాలికా
బంధ గోమూత్రికాబంధ శార్ఙ్గబంధ షోడశదళపద్మ
బంధ పాదుకాబంధ నవరంగబంధ ఖడ్గబంధ గుచ్ఛబంధ
ఛత్రబంధ—చామర బంధ—గదాబంధ—చక్రబంధ— శకట
బంధ—నాగబంధ—రథబంధ—వీణాబంధ— శంఖబంధ—మృ
దంగ బంధ—పాద భ్రమకబంధ—పాదార్ధ భ్రమక వింశతి
బంధభేద—కందానుష్టుప్ శ్లోకాంతర్గత చతుర్భద్రనవ
రంగ సర్వతోభద్ర దాందోళికా బంధ యుక్తానులోమ
విలోమకంద భాషాశ్లేషకంద కందాటవెలది గర్భితాంత్య
తేటగీతియుక్త చౌషష్టి భేద చిత్రసీసము (808 పద్యము)

ఇది యీ పద్యము పేరు. కవి వ్రాయుటకు ఎంత శ్రమించెనోగాని—పద్యముపేరే మనకు శ్రమను కల్గించును. చిత్ర కవితయందలి పద్యార్థములు క్లిష్టములుగా నుండి పాఠకునకు నిఘంటువులను నిరంతర ముపయోగించు పని కల్పించును. కావుననే వేంకటకవి కొన్ని పద్యములకు అర్థములు స్వవ్యాఖ్యానములు గూడా యిచ్చినాడు.

ఈ కవి వ్రాసిన బంధ—గర్భ కవిత్వ పద్ధతులకు లక్షణము కన్పింపదు. దేనికైనను లక్షణమున్నగదా! లక్ష్యము బయలుదేరునది. అప్పకవి కొన్ని గర్భిత వృత్తములను వ్రాసినను—ఒక్క చతుర్విధ కందమునకు దప్ప దేనికిని లక్షణము కన్పింపదు. మరి అరువది నాల్గు పద్యముల గర్భితములుగా చేసి చెప్పిన వేంకటకవికి లక్షణ మెక్కడిది? ఏతావతా—వారివారి పాండితీప్రాగల్భ్యముల ననుసరించి గర్భ కవిత వ్రాయవచ్చునేమో? అని భావన చేయు నవకాశము కలదు.

చిత్ర కవితలో నిట్లేగాక—సభంగాభంగ శ్లేష—ద్వ్యర్థి—త్ర్యర్థి—చతురర్థి —అనేకార్థ కావ్యములు కూడా కలవుకదా?[7,8]

నేడు మనచే నిట్టి రచనలు సర్కసు ఫీట్లుగా భావింపబడు చున్నను ఆ నాడు వీనికి ఎంత ఆదరము గౌరవము! కవికి ఎంత కీర్తి ప్రతిష్ఠ లుండెడివో ఊహింపవచ్చును. కావుననే

'ఆశు కవిత్వంబు లల్లితేనే సరా
చిత్రము ప్రబంధముల్ సేయవలదె'— అని ముద్దు పళని ముద్దుగా తెల్పినది.

ఇక చిత్ర కవితలో చేరిన నిరోష్ఠ్యము—దాని నియములు—నిరోష్ఠ్య రచనల క్రమవికాసముల నరయుదము.

నిరోష్ఠ్య రచనా సంప్రదాయము

ఓష్ఠ మనగా పెదవి. వర్ణసమామ్నాయములో పెదవుల సాయమున ఉచ్చరింపబడు వర్ణములు—ఓష్ఠ్యములు. పవర్గాక్షరము లైన ప—ఫ—బ—భ—మ—యను ఈ యైదక్షరములను ఉచ్చరించునపుడు రెండు పెదవు లొకదానిని కొకటి తగులును. ఇవియేగాక అంతస్థములలోగల 'వ' యను అక్షరము పూర్తిగా పెదవులకు తగలకపోయినను వానితో కొద్ది సంయోగము కలది కావున నిదియును ఓష్ఠ్యవర్ణమే! కొందరి మతము ననుసరించి ఉ—ఊ—ఒ—ఓ—ఔ—అను నీ యైదక్షరములు కూడా ఓష్ఠ్యములే. వీనిని ఉచ్చరించుటకును పెదవుల సాయము మవసరముగదా!

నిరోష్ఠ్యములు:—అనగా ఓష్ఠ్యములుకాని యక్షరములు. అ—ఆ—ఇ—ఈ—ఎ—ఏ—ఐ— అను నిట్టి యచ్చులు. వీనితో

6. వీనిని గూర్చిన వివరములకు 'తెలుగు భాషలో ఛందో రీతులు' (378 పుట) చూడదగును.

7. కథాద్వయ కావ్యములు— శ్రీకాల శేషాచార్యులుగారు (భారతి—1958 జూన్).

8. ద్వ్యర్థి—త్ర్యర్థి కావ్యములు: ఈ. వి. వేం. రాఘవాచార్యులుగారు. వీనిలో అనేకార్థ కావ్యముల గూర్చియు గలదు. పరిషత్ పత్రిక 23 సం. 5 సం. 24 సం. 1 సం; భావ సం.1935)

9. దండి—దశకుమార చరిత్రలో ఈ యక్షరములు లేని నిరోష్ఠ్య రచన చేసెను. ముందు ప్రకరణమున—ఈ విషయము గలదు.

కూడుకొనిన హల్లులు, కవర్గాది పంచమాక్షరము (అను స్వార రహితములుగా); ఇవియేగాక ఋ—ౠ—ఌ—ౡ లు (గ్రాంథిక వ్యవహారమునందు నిరోష్ఠ్యములే. ఇట్లే అచ్చులలో గల ఋ—ౠ—ఌ—ౡలును ఓష్ఠ్యములుగావు. వీనికి ఇకార ధ్వని నియతము. కావుననే లాక్షణికులు ఋ—ఇ—రి లకు యతిని గూర్చిరి. (ఋ—రు—ఉ— అయినచో ఓష్ఠ్యము లగును).

ఇట్టి పద్ధతిలో అక్షరముల నన్నింటిని విభాగించుకొని ఒక్క పద్యమును వ్రాయుటయే కష్టమైనప్పుడు ఒక కావ్యమునే వ్రాయుట యనునది ఊహాతీతవిషయ మనవచ్చునుగదా! కత్తి మీది సామువంటి యీ నిరోష్ఠ్య రచనను ప్రథమముగా మచ్చునకు చూపిన కవి—నాచన సోమనాథుడు—ఉత్తర హరివంశములో

చని చని కాంచెనంత ఋషి సంహతి సారసకేసరాంతరా
సన సరసాళి సంగఁ దట చందనశాఖి చలత్తరంగ గాం
చన సరసీ జలార్ద్ర యతి సంచిత సైకత లింగఁ గంగ నం
జనగిరి గాఢ గంధగజసంగత శృంగ రథాంగ నత్తటిన్
(1—106)

నిరోష్ఠ్య లక్షణ యుక్తముగా సోముడు వ్రాసిన యీ పద్యమునకు లక్షణ మెక్కడిదో? తెలియదు. సాహిత్య రసపోషణమునకు పూర్వముగల సాహిత్య పరిశోధన చేసినచో ఎచ్చటనైన లక్షణము అకిగోచరమగునేమో?

సోముని యీ రచనను చూచియే కావచ్చు—విన్నకోట పెద్దన—కావ్యాలంకార చూడామణి[10]లో నిరోష్ఠ్య లక్షణము నిట్లు వ్రాసెను.

పంచమ వర్గాక్షరములు
వంచించి హితోచితార్థవంతంబులు గా
వించిన కబ్బము వీనుల
కంచితమై యది నిరోష్ఠ్యమన నొప్పారున్ (6-44)

దీనికి లక్ష్యముగా

చాళుక్య క్షితినాథు నార్జిత యశస్సంక్రాంతిచేఁ దూలు లో
కాలోకాద్రిఁ దనర్చు చీఁకటులు కైలాసోల్లసద్ధీధితుల్
సాలం దెల్లని చాయలం దనరు—నాశాదంతులంతంతకున్
గాలాకారత నుజ్జగించు ననుచుం గాంక్షింతు రత్యాకులన్ (6—45)

పెద్దన దీనిని నిరోష్ఠ్యమన్నను ఓష్ఠ్య వర్ణములుగా పరిగణింపబడు ఉ—ఊ మొదలైన అక్షరములు గలవు. సోముని పద్యము ప్రకారముగా చూచినచో పెద్దన యీ పద్యము లక్షణ విరుద్ధమగును. పెద్దన పద్ధతి యిట్లుండగా రామరాజ భూషణుడగు మూర్తికవి నరసభూపాలీయ నామాంతరమైన "కావ్యాలంకార సంగ్రహము"[11]లో ద్వితీయ పంచమాశ్వాసముల చివరలయందు ఓష్ఠ్య, ఓష్ఠ్య—నిరోష్ఠ్య సంకరములుగా రెండు పద్యములు వ్రాసెను. ఆ పద్యములు

ఓష్ఠ్యము—భూమి సుమనోమర్దుమ
భామా!......(2—175)

సంకరము:—భూనాథోత్తమ జంభభంజన హరి భోగాభ
రామక్రియా—(5—89)

వీనిలో మొదటి కంద పద్యము పూర్తిగా ఓష్ఠ్య వర్ణములతో నుండవలెను, కాని 'మర్దుమ' అనునప్పుడు 'ర' యనునది నిరోష్ఠ్యాక్షరము. ఇక ఓష్ఠ్య నిరోష్ఠ్య సంకరమైన రెండవ పద్యము (ఓష్ఠ్య నిరోష్ఠ్య సంకరమనగా ఒక ఓష్ఠ్యాక్షరము—వెంటనే ఒక నిరోష్ఠ్యమగు అక్షరము గల రచన) 'జంభ భంజన' అనునప్పుడు భ, భ, యను రెండును ఓష్ఠ్యాక్షరములే. ఇది లక్షణ భంగముగదా?

పై పద్యములను

మర్దుమ అనుటకు మరుద్రుమ. (రు—ఓష్ఠ్యము)
"జంభ భంజన—" జంభ జంభన' (జంభుని స్తంభింపజేసినవాడని యర్థము)

అని సవరించినచో కవి హృదయము వ్యక్తమగును[12]. ఈ విధముగా ముద్రణమగుట పొరపాటే. మూర్తికవి సోముని పద్ధతినే అనుకరించినట్లు వ్యక్తమగుచున్నది. ఈ ఉభయుల తర్వాత ప్రముఖ లాక్షణికుడు — చిత్రకవి పెద్దన లక్షణసారసంగ్రహమునందు నిరోష్ఠ్యమును గూర్చి యిట్లు తెల్పెను.

లక్షణము:—కలయ నో జౌ లుకార వకారములను
నల ప వర్గంబు మాని మిగిలిన లిపులు
నమర పద్యంబు రచియింప నది నిరోష్ఠ్య
మనుచు బల్కిరి సత్కవు లనిలతనయ - (3-131)

దీనికి లక్ష్యము:—తనరంగనేఁ దలంచెద
ఘన దశరథనందన హితకార్యాసక్తిన్
ఘన రసనిధి దాటిన ని
కనదతిరయ చరిత తీక్ష్ణ కర తనయ హితా!
(3—132)

(ఆంధ్ర సాహిత్య పరిషత్ ప్రచురణ — 1961—పుట—115)

పెద్దన యీ లక్షణము లక్ష్యము సరిగా గలవు. తనకు ముందు ఇంత చక్కగా నిరోష్ఠ్యమునకు నియమము - దాని నను

10. కావ్యాలంకార చూడామణి—వేదంవారి ప్రచురణ 1964

11. కావ్యాలంకార సంగ్రహము—సన్నిధానంవారి వివరణము

12. సన్నిధానంవారి వివరణలో సవరణలేదు. వ్రాత ప్రతుల పాఠము సరిగా గలదు. గ్రంథముద్రణమున ప్రత్యక్షర పరిశీలన ఎంత అవసరమో! ఇట్టి చోట్ల తెలియును. ఈ పద్యముల ప్రసంగవశాత్తు నా దృష్టికి తెచ్చి లిఖిత ప్రతుల చూపి పాఠము లొసంగిన ఆచార్య శ్రీ నిడుదవోలు వెంకటరావుగారికి కృతజ్ఞుడను. వారి వద్ద ఎన్ని సవరణలో చేయబడిన కావ్యాలంకార సంగ్రహము గలదు.

రించి లాక్షణిక రచన మున్నను లాక్షణికాగ్రేసరుడగు అప్పకవి చిత్రకవితను 'తెలివి మీర వాని వచియింతు' (4—5,49)—నని నిరోష్ఠ్యమునకు లక్ష్య లక్షణములను—

పావన పాఘౌబాభా
మావాయను నాఱు లిపులు మారి పద్యములో
భావింప దొరలకుండిన
భూవలయమున న్నిరోష్ఠ్యమన నొప్పారున్—(4—552)

అని లక్షణము చెప్పి—లక్ష్యముగా

నరహర్యక్ష దయాకర
కరిరక్షణ చక్రహస్త కాంచనచేలా
గిరుడతురంగ జనార్దన
ఖర దైత్య నికృంతన హరి కంజదళాక్షా (4—552)

యీ పద్యమును వ్రాసెను. బాగుగానే ఉన్నది. కాని లక్షణమున అచ్చుల విషయములేదు. లక్ష్యమున రు, తు అను అక్షరములు గలవు. ఇవి ఓష్ఠ్యములుగదా! అప్పకవి తనకు పూర్వములైన గ్రంథములను ఎట్లు పరిశీలించెనో! ఇక అప్పకవికి దాదాపు సమకాలీనుడైన గణపవరపు వేంకటకవి ప్రబంధరాజ వేంకటేశ్వర విజయ విలాసమున నోష్ఠ్య భుజంగ ప్రయాతమును—

పయోమగ్నిభా భవ్య భాభాగ్ని భావా
వయోభావయుగ్గోపవామా విభావ్యా
భయోగ్యోపమా కుంభిపా పాపభీమా
వయోగోప నాగ్మావ నాగ్మావ భూమా!—

అనివ్రాసెను. ఇది పూర్తిగా ఓష్ఠ్యాక్షర మయము—లక్షణయుతము. నిరోష్ఠ్య రచనా నియమములు—వాని లక్ష్య లక్షణములను పరిశీలన చేసినచో లాక్షణికులు వారి వారి యిష్టానుసారముగానే వ్యవహరించినారని భావింప వీలగుచున్నది. అందుకే అప్పకవి—లక్షణ విషయములో చెప్పిన

ఒకదాని కంటె మరి వే
రొకటి విశేషంబు జెప్పుచుండు కతమునన్
సకల గ్రంథములను జదు
వక తెలియునె లక్షణ ప్రపంచంబెల్లన్ (1-6)

అను పద్యమును మననము చేసికోవలయును.

నిరోష్ఠ్య విషయమున లాక్షణికుల పద్ధతులను గనుగొంటిమి. ఇక సంస్కృతాంధ్రములలో గల నిరోష్ఠ్య రచనా భాగ గ్రంథముల పరిశీలింతము.

సారస్వతమునందు ఏ రచనయైనను—తమకు ముందుగల కావ్యములలో వైశిష్ట్యము గలిగి నూతనమైన పద్ధతితో ఏ ఒక్క పద్యమున్నను—దాని ననుసరించి ఒక కావ్యమే వ్రాయుట పరిపాటి. ఇది ముఖ్యముగా ఆంధ్రసాహిత్యములో రెండర్థముల పద్యమును జూచి ద్వ్యర్థి కావ్య రచన చేయుటయు, అచ్చ తెనుగు పద్యమును జూచి కావ్యమునే అచ్చ తెనుగులో వ్రాయుటయు, అట్లే నిర్వచనము, మాలికాకవిత్వము దండక సాహిత్యము మొదలగునవి బయలుదేరినవి. 'అచ్చ తెనుంగు బద్దె మొకటైనను......' అను పొన్నికంటి తెలగన్న పద్యమే ప్రమాణము. దీని ననుసరించియే యాతడు యయాతి చరిత్రను వ్రాసినాడుగదా.[13] నిరోష్ఠ్య గ్రంథకర్తలు కూడా యిట్లే వ్రాసిరి కావున తెనుగులో నిరోష్ఠ్య రచనాభాగములు గల గ్రంథముల చూతము:

సింహాసనద్వాత్రింశిక: — కథాకావ్యశిరోమణియైన కొరవి గోపరాజు దీనిలో ఒక నిరోష్ఠ్యదండకమును ముక్తపదగ్రస్తముగా వ్రాసెను. ఇది ఏడవ బొమ్మ కథలో కృష్ణస్తుతి సందర్భమున గలదు. మచ్చునకందుండి కొన్ని కొన్ని భాగములు—

'జయ కృష్ణ జయకృష్ణ! కృష్ణ! స్థిరాస్యందనస్థాన
నానాదినధ్యాన నానాసితానేక సేనా రజోనీక రథ్యాతి రథ్యాళి సన్నాహ
సన్నద్ధ రాజన్య జన్యాగతానన్య సాదృశ్య దృశ్యాంగ హృష్య
జ్జరాసంధ సంధాన యంత్రాది యత్నక్షయాదాయ.....
దుష్టాహితా భేదనాకాల సంజాత రాగాఢ్య నేత్రాంత
కంసారి హింసా కళాదక్ష! దక్షక్రియానాశ నాకార
కాశాకరేశాది గర్జద్గణాధీశ శస్త్రీ సహస్రీ జయశ్రీ
రణాసార నిస్సారితాకారి నీరంధ్ర తేజోలసచ్చక్ర......
కాంతి చ్ఛటాకాంతసంధానితాలీల! లీలా లసచ్చారిణీ
గీత నీరాజ సంచారిణీ రాజరాజాగ్రణీ[14] (4—24)

నంద నందన విలాసము:—ముద్రితము. లక్ష్మణాపరిణయమను నామాంతరముగల యీ కృతి కర్త ముడుంబ లక్ష్మణాచార్యులు[15]. ఈయన నల్లగొండ జిల్లాలోని బేతవోలు సంస్థాన కవి. ఈ గ్రంథములో నిరోష్ఠ్య గణనమ దండకమును వ్రాసినాడు. అందుండి కొంత:

జయ జయ జలారాశి కన్యా స్తనాగ్రస్థలీ న్యస్త కస్తూరికా
చిహ్నితోరస్థలా! కుండలాలంకృతాదర్శగండస్థలా!....
రాజితశ్రీయశోదా యకా శత్రుసంసద్ధరత్రాయ
కా రాధికా నాయకా నీరతానందితారోగ్ఖికాంచీధరా!
కంజరాగాధరా! రక్షితశ్రీధరా!..... (4—101)

సారంగ శైల మాహాత్మ్యము:—ఈ గ్రంథ మముద్రితము—కవి స్వహస్త లిఖిత ప్రతి నాసద గలదు. గోనర్సం వెంకట

13. తెలగన్న—సింగరాచార్యులు—వీరిలో ప్రప్రథమముగా అచ్చ తెనుగు కావ్య రచన చేసిన దెవరను విషయము పరిశోధింపవలసి యున్నది.

14. సింహాసనద్వాత్రింశిక—ఆంధ్ర సాహిత్య పరిషన్ముద్రణము (1960, పుటలు 139—140)

15. ముడుంబ లక్ష్మణాచార్యులు—నంద నందన విలాసము అను నా వ్యాసము ('భారతి' 1967 జులై).

నరసింహాచార్యులు[16] అను కవి దీని కర్త. దినిలో ఒక నిరోష్ఠ్య దండకము—గుహుడు శ్రీరాముని స్తుతించు సందర్భములో గలదు.

దండకములను నిరోష్ఠ్యముగా వ్రాసినవారు వీరు—ఇక రగడలు— ద్విపదలు వ్రాసినవారు గలరు.

గణపవరపు వేంకటకవి:—తన ప్రబంధరాజము నందు—'అచుంబిత రచన చతుర్దశ యమకాన్త్య నియమ భరణ గరిష్ఠ నిరోష్ఠ్య విరాజిత రగడ రాజము—'ను వ్రాసెను. 32 చరణములు గల దీని నుండి కొన్ని భాగములు—

కలికి కలికితనాన నానది గట్టి గట్టిగ నంటి నంటిని
కలికి కలికచ నిన్న నిన్నన గాక గాకడ కంటిగంటిని......
నిచ్చ నిచ్చన నయ్యె నయ్యెడ నెన్న నెన్నడ రేక రేకగ
నచ్చి నచ్చిన కాని కాని గయాళి యాళిది సాక సాగగ....
నాతి, నాతిలకాళి కాళిది నాగ నాగకి కాన కానె
నీతి నీతిలకాన కాన జనించ నించదె నాగనాగనె
లలన లలనల తతిని తతినిల లాగి లాగి గిడించి డించగ
ననల ననలన గతిగ గతిగన నాదెనాచెయిగట్టు గట్టగ
ననిచె ననిచెననంగనంగజయంత యంతట జెట్టజెట్టగ
యింతి యింతియె యేనయేనల నించ నిండగ నేననేనన
కాంత కాంత తతాళి తాళిచె గల కలసి కలసిరి తానతానన'

కంకంటి నరసింహకవి:— కంకటి పాపరాజునకు సోదర పుత్రుడైన యీ నరసింహకవి—తన విష్ణు మాయా విలాసమును[17] యక్షగానకావ్యములో నిరోష్ఠ్య ముక్తపదగ్రస్త ద్విపదను వ్రాసెను—

ఇందిరా తటిదలంకృత దేహ కంద
కంద కంద దళాసి రక్ష క్రియానంద
నంద కాదిక సాధనచ్ఛటా చ్ఛంద
చ్ఛందశ్శిరస్థాన సంక్రాన్తి చరణ
రణ రంగ నిహతారి రాత్రించరగణ
గణనీయ దాక్షిణ్య ఘన ధైర్య సత్య
సత్యాది నీల కచాకేళి కృత్య
కృత్యనీకానేక కీర్తినా సదయ
సదయ రంజన నిరంజన కథా సదన....
కారణకార్యాది కారణ కృష్ణ
కృష్ణ జలాశయాహిత శాఖ కృష్ణ
కృష్ణార్తి హరణ......(5 ఆశ్వాసము)

ఇట్లే— తమ గ్రంథములలో ఒకటి రెండు నిరోష్ఠ్య పద్యములు వ్రాసిన కవులు గలరు.

కంకంటి పాపరాజు—ఉత్తర రామాయణము 5—233
హరిభట్టు—నరసింహ పురాణము 1—116
కూచిమంచి తిమ్మన—అచ్చ తెనుగు రామాయణము—2 ఆశ్వా
చిత్రకవి సింగరార్యుడు—బిల్హణీయము—2 అ. చివర— (సోష్ఠ్య—నిరోష్ఠ్య కందము)
పురిగంటి వెంకట నరసింహాచార్యులు—తాలాంకనందనీ పరిణయము[18] (అను) (3 ఆ. చివర)
అయ్యనకోట పార్థసారధి—సత్య విజయము
కణాదము పెద్దన—ముకుంద విలాసము 3—295
మాడభూషి వెంకటాచార్యులు—భరతాభ్యుదయము 1—91.

ఇట్లే మరికొందరు కవులును నిరోష్ఠ్య పద్యములు వ్రాసిరి. తెనుగునకు సంస్కృత భాషా సంపర్కము వీడరానిది గదా! తెనుగు నిరోష్ఠ్యముగా పూర్తి కావ్యములను వ్రాసిన వారిని తెలిసికొనుటకు ముందు సంస్కృతములోని నిరోష్ఠ్య రచనల గమనింతము:—

సంస్కృతమునందు 'చాలా ప్రాచీనమునుండియే చిత్ర—గర్భ—కవితలు గలవు. కాని తెనుగంత వ్యాప్తిలోకి రాలేదు. సంస్కృతమునందును—మచ్చునకు నిరోష్ఠ్యమును వ్రాసినవారే గాక— నిరోష్ఠ్య గ్రంథములు కూడా వ్రాసినవారు గలరు. అంతే గాదు—శాసనములందును—సంస్కృత నిరోష్ఠ్యము గలదు—తెలంగాణ మండలి మహబూబ్‌నగరం జిల్లా బూదపూరు శాసనములో అసమగ్ర శ్లోక మొకటి (నిరోష్ఠ్యము) గలదు.

కేదారాతత శిలి శాలజనతా చేతస్సదానంద కృ
త్తారా గౌర నిరంతి నీరజ రజ స్సంచార....లః
నైజా...సలిల సాగర సదాహంకార శంకాకుల[19]...

ఇక రచనలలో

దశ కుమార చరిత్ర:—దండిమహాకవి—దీనిలో సప్తమోచ్ఛ్వాసమున నిరోష్ఠ్య రచన చేసెను. అట్లు నిరోష్ఠ్యముగా వ్రాయుటకును సందర్భము చక్కగా కుదిరినది. ఆ సందర్భ మిది. మంత్రగుప్తునకు ఒక రాజకన్యాసంసర్గమున పెదవులు దంతక్షతములై ఒకదాని కొకటి చేర్చునట్లు లేవు. అట్టి

16. చూ. నా వ్యాసము. గోవర్ధనం వెంకట నరసింహాచార్యులు కృతులు (పరిషత్ పత్రిక—సం. 57. సం. 1.3—కలక—చైత్ర—వైశాఖ—శ్రావణ—భాద్రపదములు)

17. 1968 లో ఈ గ్రంథము ముద్రణమైనది. కొన్ని ప్రయోగాల నిందుండి శ. ర. గ్రహించెను. చూ. విష్ణు మాయా విలాసము—విమర్శ — నిడుదవోలు వారి వ్యాసము ('ఆంధ్ర' ఆగస్టు 1940)

పిఠాపురంనుండి 1940 లో — మధునాపంతులవారు—'ఆంధ్రి' పత్రిక నడిపెడివారు.

18. తాలాంకనందనీ పరిణయము—ఒక పరిశీలన. నా వ్యాసము (భారతి 1967 సెప్టెంబరు).

19. తెలంగాణ శాసనములు 1 భా. శాసన సంఖ్య 21 పు. 55—61; 1935 ముద్రణ). లక్ష్మణ రాయ పరిశోధక మండలి—హైదరాబాదు.

సమయమునందు రాజవాహనునకు—తన వృత్తాన్తమును వివరింప వలసి వచ్చినది. అందుకే కవి—'సకల కరకమలేన కించిత్సంవృతానన: లలితవల్లభా రభస దన్తక్షత వ్యసన విహ్వలాధరమణి ర్నిరోష్ఠ్య వర్ణ మాత్మచరిత మాచచక్షే—' అని తెల్పి—తరువాత ఆ వృత్తాన్తమును ఇట్లు చెప్పించినాడు.

"రాజాధిరాజనందన నగరంధ్రగతస్య తే గతిం జ్ఞాస్యన్న హంచగత:—కదాచిత్కళింగాన్ కళింగనగరస్య నాత్యాసన్న సంస్థిత జనదాహస్థాన సంసక్తస్య కస్యచిత్కాంతార ధరణి రజస్యాస్తీర్ణ సరస కిసలయ సంస్తరే తలే నిషణ్ణ్య నిద్రాలీఢ దృష్టి రశయిషి—

(161. పు.)

అధ కదాచిదాయాసిత జాయా రహిత చేతసి లాలసాతి
లంఘనగ్లాన ఘన కేసరే రాజదరణ్య స్థలీ లలాటలీలాయిత
తిలకే లలితానంగ రాజాంగీకృత నిర్నిద్ర కాంచన
చ్ఛత్రే—దక్షిణ దహనసారధి రయాహ్వాత—సహకార సంచల
కలికే కాలాండజకంఠ రాగ రక్త రక్తాధరా రతిరణాగ్ర సన్నాహ
శాలినీ కన్య కాన్త:కరణ సంక్రాన్త రాగలింగితలజ్జే

ఇట్లు చాలా పెద్దగా గలదు. తెనుగు చేసిన వారెవ్వరును నిరోష్ఠ్యముగా ఈ సందర్భమును వ్రాయలేదు.

నిరోష్ఠ్య రామాయణము:—1330 ప్రాంతమునందున్న తెనుగు దేశపు సంస్కృత కవి—సంస్కృతములో నిరోష్ఠ్య రామాయణమును వ్రాసినట్లు—తెనుగున ప్రప్రథమ నిరోష్ఠ్య రామాయణమైన దశరథ రాజనందన చరిత్ర కృతికర్తయగు శతఘంటావధాన మరింగంటి సింగరాచార్యులు ఇట్లు తెల్పెను.

మును రామాయణము న్నిరోష్ఠ్యముగ నింపుల్ మీర శాకల్లె మ
ల్లన దా సంస్కృతభాష జేసె నని నాలాగున్ చెవుల్ నిండగా
వినుటేగాని—ధరిత్రిపై నిజముగా వీక్షింపలేదట్టి దే
తెనుగుం జేసెద భూమిపై గవిజనాధ్యక్షు ల్ప్రశంసింపగన్

(1—32)

సింగరాచార్యులేగాక ప్రతాపచరిత్ర సిద్ధేశ్వరచరిత్రములును ఈ విషయమును తెల్పినవి. కాని గ్రంథము నేటికీ అలభ్యము. మల్లన వ్రాసిన యితర కృతులు ఉదారరాఘవము[20] అవ్యయ సంగ్రహ నిఘంటువు[21] గలవు. చతుర్భాషా కవితా పితామహాంక' అని మల్లనకు బిరుదమున్నట్లు అ. సం. నిఘంటువు గద్య తెల్పు చున్నది. అప్పకవి శాకల్య మల్లన లక్షణ గ్రంథమును రచించి నట్లు (1—4) తెల్పినాడు. కాని యాతనిది నిఘంటువుగదా! మరి యప్పకవి వ్రాతకు ఆధారము?

శాకల్య మల్లన నిరోష్ఠ్య రామాయణము లభింపక పోవుట సంస్కృతాంధ్ర సారస్వతాలకు మిక్కిలి లోటు[22].

వారణాసి ధర్మసూరి సాహిత్య రత్నాకరములోను-మాఘ—భారవి—రచనలలోను నిరోష్ఠ్య రచన గలదు.

సంస్కృతములో నిరోష్ఠ్య సాహిత్యమును గూర్చి పరిశోధించిన యింకను విశేషములు బయల్పడ గలవు.

120 సం. పూర్వుడగు కవి కంఠీరవ కృష్ణమాచార్యులు జటప్రోలు ఆస్థానకవి సంస్కృత నిరోష్ఠ్య రామాయణమును వ్రాసినట్లు విజ్ఞాన సర్వస్వము. (4 భా. 1179 పుటలో) గలదు.

సంస్కృత నిరోష్ఠ్య సాహిత్యమును తెలిసికొంటిమి. ఇక తెనుగులోని నిరోష్ఠ్య రచనల పర్యాలోకించుదము.

ఆంధ్ర సారస్వమున 16 వ. శతాబ్దమునుండియే నిరోష్ఠ్య కావ్య రచన జరిగినట్లు భావించవచ్చును. గోలకొండ సామ్రాజ్య పరిపాలకుడైన మల్కిభరాం కాలము (1550-80) లో నున్న మరింగంటి సింగరాచార్యుల వారు— నిరోష్ఠ్య కావ్య రచనకు శ్రీకారమును చుట్టి యీ ప్రక్రియకు స్థాపకుడై—ఆచార్యత్వము వహించినాడు. శతఘంటావధాన శారదా ప్రశ్న వివరణ బిరుదాభిరాముడైన యీతని నిరోష్ఠ్య కృతులు రెండు—1. దశరథరాజనందన చరిత్ర. 2 శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణము.[23] ఈయన బహుగ్రంథ నిర్మాతయే[24]య్యెనను ఈ రెండు రచనలు మాత్రమే లభ్యమైనవి. వానిలో—

దశరథ రాజనందన చరిత్ర:— అయిదాశ్వాసములు గల యీ కృతి గద్యపద్యములతో నున్నది. కృత్యాది—కృత్యంతములయందు దప్ప—అంతటను నిరోష్ఠ్యమే. పిన్నకోట పెద్దననుసరించి ఈయనకూడా ఉ. ఊ ఒ. ఓ. ఔ లతో కూడిన యక్షరములను— నిరోష్ఠ్యములుగా భావించి— వానిని ధారాళముగా వాడినాడు. ఈ గ్రంథమున ఒక నాగబంధము (5—308) ఒక ఖడ్గబంధము (5—309) లును గలవు. సింగరాచార్యులు దీనిలోను సీతాకల్యాణములోను తన వంశావతారవర్ణన చేసెను. ప్రప్రథమ కృతియైన దీనిలో తన నిరోష్ఠ్య నియమమును తెల్పలేదు—కాని సీతాకల్యాణమున—

---

20. ఉదార రాఘవము—'విశ్వబోధినిటిప్పణి'తో గోపాల నారాయణ కంపెని (బొంబాయి)వారు 1891 లో ముద్రించిరి. 18 సర్గల యీ కావ్యము 9 సర్గలు లభించగా 5 సర్గలు ముద్రించిరి.)

21. అవ్యయ సంగ్రహ నిఘంటువు:—**Catalogue of Sanskrit Manuscripts T. M. S. S. Library-Kavyas Vol. XX. 29:** ఇంకను విశేషములకు **'History of the Reddi Kingdom's—MallamPalli SomasekharaSarma (Pages 490—491, 1948 Edi.)**

22. మల్లనను గూర్చి— సంస్కృత కవి జీవితములు (I. భా. పు. 159, 1950. ము.) మల్లాదివారు; దశరథరాజనందన చరిత్ర (పీఠిక—56—59 పుటలు; సుపరిష్కృత ముద్రణ 1970 ఆం. ప్ర. సాహిత్య ఎకాడమీ—హైదరాబాదు.)

23. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య కావ్యముల గూర్చిన విషయములో —శు.ని.సీ. కల్యాణమును గూర్చి గలదు.

24. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతాకల్యాణ కృత్యాదిలో తానేయే వయస్సున ఏయే గ్రంథమును వ్రాసినది తెల్పినాడు—

అరయు క గ చ జ ట డ త ద నా యు ల స హ
ర ద్వయుమె కాని యొండక్షరములు సొరవు
మరియు నొత్వోత్వములు కొమ్ము మామిడియును
వలపదాసీద—సురభాష నిలుపరాదు— (1—39)

అని వ్రాసికొనినాడు—

ప్రప్రథమముగా నీ గ్రంథము 1917 న సంవత్సరమున ముద్రణమైనది. 1970 సంవత్సరమున ఆంధ్రప్రదేశ సాహిత్య ఎకాడమీవారు— నా పరిష్కరణ— విపులపీఠికా యుక్తముగా ప్రకటించి[25]— సాహితీలోక కృతజ్ఞతా పాత్రు లైనారు.

ఈ గ్రంథము నుండి ఒక పద్య ముదాహరింతును—

కరకాచిన్నదిగంతశాఖయయి నిర్ఘాతాహతాగారయై
హరినాగేంద్రకరాతిచండశతధారాశ్లేషశేషాహి శే .
ఖర గండస్థలియై ఘనాఘనతటిద్గర్జాతిరేకస్థితిన్
ధరయెల్లం జడి నిండసాగె జనచింతాకారణస్థానియై

సింగరాచార్యులు రెండునూ రామకథాపరములైన నిరోష్ఠ్య రచనలనే చేసెను. వీని తర్వాత వచ్చిన నిరోష్ఠ్య రచన కూడా రామకథా పరమైనదే— అది—

2. నిరోష్ఠ్య జానకీకల్యాణము:—అముద్రితముగా[26] నున్న యీ రచన నాల్గాశ్వాసముల పరిమితి గలది. పిడుపర్తి బసువప్ప దీనిని రచించి అరివీరగండాంకిత బసువనృపాల తనూజుడైన పంట చింతభూపతి (1650 ప్రాం)కి అంకితమొసంగెను. దీనికి అవతారికలేదు.

చతుర్థాశ్వాస గద్య యిట్లున్నది.

ఇది శ్రీ దక్షిణామూర్తి ప్రసాదసమాసాదిత సరస సాహిత్యానువర్తి పిడుపర్తి బసువణాచార్య సత్పుత్ర బసువప్పకవి ప్రణీతంబయిన సీతాకల్యాణ చరిత్రంబను నిరోష్ఠ్యకథాప్రబంధంబు నందు చతుర్థాశ్వాసము.

తెనుగు సాహిత్యమునందు ప్రసిద్ధులైన పిడుపర్తి (శైవ) కవులకు —ఈతనికి ఎట్టి సంబంధము లేదు. వారేమో జంగములు బసువణాచార్య[27]యుని యుండుటవలన యీయన విశ్వబ్రాహ్మణుడు—బసువప్ప యీ రచన తర్వాత—

2, నిరోష్ఠ్యజానకీకల్యాణము:—సుప్రసిద్ధముగు శివరామాభ్యుదయ గ్రంథకర్తయైన పోడూరి పెదరామకవి సోదరుడగు రామకవి యీ గ్రంథమును వ్రాసినట్లు శివరామాభ్యుదయకర్తతో కృతిభర్త యిట్లనెనట—

నీ తమ్ము డసమ ఉండె నిరోష్ఠ్య జానకీ
కల్యాణకృతి రామకవి వరుండు—ఇదియే ఆధారము—
గ్రంథ ములభ్యము.

4 శేషము తిరుమలాచార్యులను కవి ఒక నిరోష్ఠ్య ప్రబంధము వ్రాసినట్లు—అంబరీసోపాఖ్యానములోని—

రూఢిదలిర్చ నిరోష్ఠ్య ప్రబంధంబు
నిచ్చినారలు వెంకటేశ్వరునకు— అనే పద్యము ద్వారా తెలియుచున్నది. ఇదియును అలభ్యము.

5. నిరోష్ఠ్యదశరథరాజనందన చరిత్ర:— సింగరాచార్యుల రచనకువలెనే తన రచనకును పేరుపెట్టి ద్వాదశాశ్వాసపరిమితముగా —ఈ కృతి నిర్మించిన కవి—సురవరపు కేశవయ్య. ఈయన మహబూబునగర్ జిల్లాలోని—ఆత్మకూరు సంస్థానమునకు చెందినవాడు. (సుమారు 200 సంవత్సరముల క్రిందివాడు). ఈ గ్రంథములో మరింగంటి సింగరాచార్యులను నిరోష్ఠ్య కవితకు గురుస్థానీయునిగా పేర్కొని వర్ణించెను.[28] ఈ విధముగా కొన్ని రచనలు నిలిచినవి. నామమాత్రావశేషితములుగా ఈ క్రింది రచనలు. రామకవి నిరోష్ఠ్యజానకీకల్యాణముతోపాటు—శేషం తిరుమలాచార్యుల ప్రబంధమును—దిట్టకవి విశ్వనాథకవి[29] హరిశ్చంద్ర చరిత్రము కాల గర్భమున కలిసిపోయినవి.

6. నిరోష్ఠ్య నలచరిత్ర : ధరాత్మజా పరిణయమను ద్వ్యర్థి కావ్యమును, బృహన్నారదీయమును—వ్రాసిన క్రొత్తలంక మృత్యుంజయకవి యీ గ్రంథకర్త. ఇది అయిదాశ్వాసాల ప్రబంధము[30]. చక్కని రచన మచ్చున కొక పద్యము:

అల్లలితాంగి చంచల కటాక్ష నిశాత శరాళి నేయగాఁ
గల్లరియైన చిత్తజుని గాసిఁ దలంకిలి దాసరీతి—సం
ధిల్లఁగ గీరసంతతికి దీనత గాంచిలి రాక రాక నే
జల్లని తల్లడిల్లితిని జల్లని గాలికి సంచరించితిన్'

ఈ విధముగా తత్సమ భాషామయముతైన నిరోష్ఠ్య కావ్య రచన వికాసమంది మరియొక క్రొత్త బాటలో ప్రవేశించి అచ్చాంధ్రములో—నిరోష్ఠ్యముగను నిరోష్ఠ్య ద్వ్యర్థిగాను బయలుదేరినది. అట్టి రచనలను చూతము.

అచ్చ తెనుగులో ఒక్క పద్యము వ్రాయుటయే కష్టము. అట్టి అచ్చ తెనుగుతోబాటు నిరోష్ఠ్య గ్రంథమును సిద్ధమొనర్చుట ఎంత శ్రమావహమైన విషయమో! ఊహింపవచ్చును. అట్టి వానిలో మొదటిది.

---

25. మరింగంటి సింగరాచార్యులను గూర్చిన సంపూర్ణ వివరములు —దశరథరాజనందనచరిత్ర పీఠికలో గలవు.

26. తంజావూరి పుస్తకశాల—గ్రంథసంఖ్య 169; 38—39. పుటలు.

27. బసవనామనిర్వచనము—శ్రీ నిడుదవోలు వెంకటరావు గారు. ఆంధ్రపత్రిక—సారస్వతానుబంధము. (8.6.1923)

28. ఈ గ్రంథమును గూర్చి తెల్పిన మిత్రులు—నాగలింగ శివయోగిగారికి కృతజ్ఞతలు.

29. ఆంధ్రకవి తరంగిణి – (12 సం. 156 పుట— 1958 ము.)

30, ఆంధ్ర కవుల చరిత్ర–(235 పుట. 1949 ము)

1. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కల్యాణము'[31]. దశరథ రాజనందన చరిత్ర వ్రాసి అంతతో తృప్తినందక—సింగరాచార్యులవారు—శుద్ధాంధ్రములో నిరోష్ఠ్య సీతా కల్యాణమును వ్రాసిరి. వింశతి వర్ష ప్రాయమున దీనిని రచించినట్లు కవి తెల్పెను. ఇది 300 పద్యములతోనున్న మూడాశ్వాసాల కావ్యము. కృత్యాదియందు కవి కృతినిర్మాణమును గూర్చి—

తెనుఁగున కొన్ని కావ్యములు తేల్లముగా రచియింపవచ్చుఁ జే
ర్కొనఁగ నిరోష్ఠ్య కావ్యములుఁ గొన్ని యొనర్పఁగ వచ్చు గాక చ
క్కన నివి రెండు చందములు గ్రచ్చర గూరిచి నేర్పుచేత నె
వ్వనికి రచింప శక్యమగు వాంఛ యొనర్చితి దానిసేయఁగన్
(1—27)

తొలుతటి సుకవులు ఘనులై
యిల నాంధ్ర నిరోష్ఠ్య కావ్య మేలా చేయం
దలచిరో నాకుఁ బ్రసిద్ధము
గలుగఁగ నొనరించుకొరకు గావలె నరయన్
(1—29)

అని—యిట్లే మరికొన్ని పద్యములలో తెల్పెను. నిరోష్ఠ్య నియమ పద్యములు వెనుకప్రకరణములో వివరించితిని. పొన్నికంటి తెలగన్న యయాతి చరిత్రయే మొట్ట మొదటి అచ్చ తెనుగ రచన యని సాహిత్య లోకాభిప్రాయము. కాని—సింగరాచార్యులే మొదట అట్టి రచన చేసినవాడు. రాజాదరములేక—నరాంకితము గాక ఈయన కృతి వ్యాప్తికి రాలేదు.

యయాతి చరిత్రలోను—సింగరాచార్యుల యీ కృతిలోను రెండు పద్యము లొకే రీతిగా గలవు. వానిని ఎవరు చూచి ఎవరి దానిలో వ్రాసికొనిరో! ఆ పద్యాదు లివి.

క. 'మున్నెవ్వరు నుడువని యీ—
...........'

ఉ. అచ్చ తెనుంగు బద్దె మొకటైనను గబ్బములోన నుండినన్

మొదటి పద్యములో—సింగిరాచార్యులు 'అచ్చతెనుగు నిరోష్ఠ్యం....' అని వ్రాయగా తెలగన్న 'తెనుగుం గబ్బం—' అనినాడు. ఇదే భేదము. యయాతిచరిత్రలోని యీ పద్యములు తెలగన్నవేనా? సింగరాచార్యుల అగ్రజుడు—'ముగురు రాజులచేత మెప్పులు గొన్న'— అప్పలాచార్యులవారు—తెలుగన్న కృతిని అమీనుఖానున కంకిత మిప్పించెను. ఆ సందర్భములో—ఆచార్యులవారు చెప్పినవే యీ పద్యములు. (సింగరాచార్యుల కృతిలోనివి చెప్పవచ్చును).అంతే కాని కవులందరివలెనే—తెలగన్న వీనిని చెప్పలేదు. శాకల్య మల్లన సంస్కృత నిరోష్ఠ్య రామాయణమును వ్రాసినట్లు తెల్పిన సింగరాచార్యులు—మొదటి అచ్చ తెనుగు రచన తెలగన్నదే యైనచో ఎందుకు తెల్పడు? సమకాలీన స్పర్ధ యుద్ధ తగిలిన దీ యిరువురిలో ఎవరికో! ఇంకను పరిశోధన చేయవలెను. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య సీతా కల్యాణ రచన బాగుగా నున్నది. అందుండి ఒక పద్య ముదాహరింతును.

జిగి చన్గట్టనియాడఁ దీరయిన లే చెక్కిళ్ల చక్కి న్నిగ
న్నిగ లీనంగ గడారికంటి సిరిడాల్ నిండంగఁ గై చిన్నియల్
తెగలై నల్దెసలాని చక్కఁగ జికిల్ సేయన్ నెఱాసిగ్గడన్
దగలన్ రానెలఁజేరి కాళ్ల కడ చెంతన్ సాగిలెన్ నాతి దాన్
(2—63)

2. అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన హరిశ్చంద్ర నలోపాఖ్యానము:

సింగరాచార్యుల రచన తర్వాత మరికొన్ని నియమములతో ఈ రచన బయలుదేరినది. అచ్చ తెనుగు రచనలో గండర గండనిగా ఖ్యాతి గాంచిన తంగెడ గంగన దీనిని రచించెను. చిట్టి ఎల్లనార్యు డితని తండ్రి. ఈ గంగనది గొప్ప కృషి. నిరోష్ఠ్యము, అచ్చ తెనుగు, నిర్వచనము—వీనితో హరిశ్చంద్ర—నల కథాద్వయ సమ్మేళన మొనరించుట. 1898 నాటికే జీర్ణముగా నున్న తాళపత్ర ప్రతి నుద్ధరించి ప్రాతః స్మరణీయులు పూండ్ల రామకృష్ణయ్యగారు. తమ 'అముద్రిత గ్రంథ చింతామణి' (సం.11 సం. 10; అక్టోబర్ 1898 ద్వారా సాహితీసూర్యాలోక భాగ్యమును కలుగజేసిరి. గంగన రచన తర్వాత బృహన్నియమములతో బయలు దేరిన రెండవ రచన—

3. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన కుశచరిత్ర:

మచ్చ వెంకట కవి (1856–1903) దీనిని వ్రాసెను. 1876 లో కృతి రచన ముగింపబడెను 1893 లో పూండ్ల వారి పీఠికతో ముద్రింపబడినది. నాడిది ముద్రణ కాగానే—పెద్దల ప్రశంసలనందినది. అట్టి వారలలో మండపాక పార్వతీశ్వరశాస్త్రిగారు—దర్భా సుబ్రహ్మణ్యశర్మగారు గలరు.

మచ్చరము లేదు కయితలో మచ్చలేదు
మచ్చయిన లేదు నుతికి సామ్మచ్చలేదు
మచ్చయిన మెచ్చనగు పుట్టు మచ్చగాన
మచ్చ వెంకట కవి నామ మచ్చమయ్యె'— అని అచ్చ తెనుగులో (2–2–1894 న బొబ్బిలినుండి మండపాకవారు) వ్రాసిరి. దర్భావారి పద్యములు—నిరోష్ఠ్యముగా అచ్చ తెనుగులో నుండుట గమనింపదగిన విషయము. కృతి యట్టిదే గదా.

ఈ మచ్చ వెంకటకవికి పర్లాకిమిడి రాజావారి కళాశాలలో కళాప్రపూర్ణులైన చిలుకూరి నారాయణరావుగారు, గిడుగు సీతాపతిగారు మరియు తాపీ ధర్మారావుగారు శిష్యులు—[32]. ఈయన రచన చేతను— లబ్ధ ప్రతిష్ఠులైన అంతేవాసులతోను—సాహితీ లోక పరిచితుడు.

4. శుద్ధాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన నైషధము:

గద్య తిక్కనయైన కందుకూరు వీరేశలింగముగారి రచన (1883) నిర్వచన కుశ చరిత్రకన్న యిది మొదటి ముద్రింపబడి వ్యాప్తి చెందినది. ఈ కృతిని ప్రశంసించుచు కొక్కొండవారు—

---

31. మొదట యిది 'ప్రబంధ కల్పవల్లి' యను పత్రికలో ప్రచురింపబడి తర్వాత 1910లో గుంటూరునందు గుంటుపల్లి సోమయ్యగారిచే గ్రంథముగా ముద్రింపబడినది. ప్రస్తుత మీ గ్రంథ మలభ్యము.

32. మచ్చ వెంకటకవినిగూర్చి—ఆంధ్రరచయితలు(143–147 పుటలు—1950 ముద్రణ)

అచ్చ తెనుగు గబ్బ మలవరించుట కూచి
మంచి తిమ్మనయును—మంచి తెలగ
నయును లింగనయును సయామున ప్రియభా
షాభిమాన మాన్యులని నుతింతు—అని తమ

బిల్వేశ్వరీయమున వ్రాసిరి. పంతులు గారి రచనానంతరము—

5. అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన హరిశ్చంద్ర చరిత్ర :

—బయలు దేరినది—శతాధిక గ్రంథకర్తలు—కవి సార్వభౌములు, ఆస్థాన కవులైన—శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారి యీ రచన—1938లో ముద్రణమై—ఆనాడు మద్రాసు రాష్ట్రమునకుతాత్కాలిక గవర్నరుగా నున్న కూర్మా వెంకటరెడ్డినాయుడు గారికి అంకితమీయ బడినది. దీని తర్వాత—

6. అచ్చాంధ్ర నిర్గద్య నిరోష్ఠ్య సారంగధర చరిత్ర :

—1898లో ముద్రణమైన దీనిని—దేవులపల్లి నరసింహశాస్త్రి గారు వ్రాసిరి. మూడాశ్వాసములలో 265 పద్యములుగల యీగ్రంథమునకు—కాశీభట్ట బ్రహ్మయ శాస్త్రి గారు—పీఠిక వ్రాసిరి. కాని వారప్పుడు ప్రభుత్వోద్యోగులు గావున 'K. B' అని మాత్రమే పేరుంచిరి. పీఠిక యందు— అనేక అమూల్య విషయాలలో శుద్ధాంధ్ర భాషాచర్చ గలదు.

7. అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య కేకయరాజనందన చరిత్ర :33

—వరంగల్లు వాస్తవ్యులైన శ్రీమాన్ రంయా లక్ష్మీనరసింహాచార్యులవారు—దీనినే గాక— అచ్చాంధ్రములో కుబ్జాకృష్ణ విలాసమును వ్రాసిరి—(ము).

వీరి కవితలో చిత్రకవిత హెచ్చు. క్రీ. శ. 1884–1960 వీరి జీవిత కాలము.

8. అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్వచన హరిశ్చంద్ర చరిత్ర (ము–1915).

9. అచ్చాంధ్ర నిరోష్ఠ్య నిర్గద్య దాశరథీ చరిత్ర:—(1927) అబ్బరాజు హనుమంతరాయ శర్మ సోమయాజిగారు దీనిని వ్రాసిరి. ప్రసిద్ధములు.

10. నిర్దుష్ట నిరోష్ఠ్య దాశరథీ శతకము:—పేరయ సూరి గారు.

11. నిరోష్ఠ్య దశరథ తనయ శతకము (ము. 1917) వేదుల నారాయణ కవి.

ఈ విధముగా—సంస్కృతాంధ్ర సారస్వతములో క్రమముగా బయలు దేరిన నిరోష్ఠ్య-అచ్చాంధ్ర నిరోష్ఠ్య రచనలను-రచనలు గల భాగముల గూర్చి నా పరిశీలన కందినంతవరకు సాహితీ లోకమున కందించుచున్నాను. ఇంకను—ఎక్కడో డొక్కో అణగి—మణగి ఎన్ని కృతులు గలవో!!

చిత్ర కవితలో చేరిన యీ నిరోష్ఠ్య రచనల గూర్చి పరిశోధించిననాడు— మన సారస్వతోద్యానము దివ్య—నవ్య—కావ్య పుష్ప కవితా పరిమళముచే పాఠక లోక హృదయములను నింపగలదు.

నేటి మన పద్ధతి—ముఖ్యముగా సాహితికముగా సంప్రదాయ రహితమగుచున్నది. కాని సంప్రదాయ తిరస్కృత రచనకు మనుగడ ఎంతకాలము! ప్రాచీన కావ్యములయందును అందలి కవితా కళ యందును—అభినివేశము తగ్గినది. వ్యాసంగము లేకపోవుచున్నది. ఇట్టి స్థితిలో—ఇట్టి నిరోష్ఠ్య రచనలను 'సర్కసుఫీట్లు'గా భావింపగలము. కాని వారి యపరిమిత మేధాశక్తిని తలంచినచో మనకే ఆశ్చర్యము కలుగును.

సాహిత్యమునందు—సమగ్ర వాఙ్మయ చరిత్రకు—నిరోష్ఠ్య కావ్య వికాసమును గూర్చిన పరిశ్రమ యావసరము. అప్పటిని న్యూనపరచినచో మన పూర్వ సాహితీ—సంస్కృతులనే మనము విస్మరించిన వారమగుదుముగదా!

---

33. ఈకవిని—కృతులను గూర్చి తెల్పిన—మిత్రులు డా: సుప్రసన్నగారు, (రీడర్—తెనుగువిభాగము, స్నాతకోత్తర విద్యా కేంద్రము. (P. G. center) ఓరుగల్లు.

అనల తోరణం

శ్రీ మాదిరాజు రంగారావు

ఈ
గాలిలో అణువణువులో
సోనార్ బంగ్లా స్వరారకం
ఈ
భూమిలో అణువణువునా
అమర్ బంగ్లా శక్తినాదం.

శరీరంలో ప్రవహించే
రక్తధునీ తతులవలె
మహానదులు ఉపనదులూ
అయినా ప్రజ దరిద్ర తప్తం.

స్వేచ్ఛావాయువులను
గదిలో బంధింపగోరే
స్వాతంత్ర్యాకాంక్షలను
చీకటిలో దాచగోరే
ఎవరు వీరు?
విషకీలాకాలాహులు
సమరభావ దూషితులు
ఏకదేశ సోదరులా?

కాలాహివిహారంలో
కుటిలనీతి కరాళగతికి
ప్రాణా లరచేతుల్లో
బంధించి భయంతో
పరుగెత్తేవారెవ్వరు?
పరిశుష్కిత రూపులు.

కాదు కాదు అన్నార్తులు
మరెవరీ శోకమూర్తులు
కాదు కాదు సంగ్వంధులు
అంతకంటే భిక్షువులు.

ధనమానం కొల్లబోయి
మిగిలి ఒకేఒక ప్రాణం
ఎగిరిఎగిరిపోయే పక్షులు
సీమదాటి ఆకులవలె,

వేవేల సూర్యులు వెలిగి
ఆకసాన ఆరినట్లు,
కోటికోటి చంద్రులు వెలిగి
ఒక్కసారు మాసినట్లు,
మానవ మహాశోకం
పిండుకట్టిన స్థలం.

అబ్దాలనుండివచ్చే
సంస్కారం భగ్నమై
నియంతృత్వ భావనతో
జ్వలించే శ్మశానంలో
పోరాడే వెలుగులతో
పాలుపోక తారాడేను
భుగ్నభావ లసిత క్షణం.

ఈ శ్మశానవాటికలో
చూచేనా పచ్చదనం?
అవు ఏ మంటలే చివరకు
ఇచ్చేను మహోత్సాహం

దురూహ ననుసరించి సాగే
దుష్క్రియా పర్యవసానం
ఏ భుజపీఠం వహిస్తుంది?
ఏ ఋజులోకం బింబిస్తుంది?

ఉదయకాలపు నీడలు
సాయంవేళల నీడలు
ఎదురెదురై క్రమ్ముకొని
నిల్చాయి పందిరివలె,

గుట్టకొకడు పుట్టకొకడు
ప్రజాప్రతినిధులూ,
సాధారణ ప్రజలూ,

కిటికీనుండి తొంగిచూచి
వెలుగు వెనక్కుపోతూంది.
నాల్కపై మాయమైై ఊహలు
విదలో ఎగసేను వేదనతో.
గాలి చదువుతూంది గొంతెత్తి.
ప్రతినదీ ఘోషిస్తూంది వింతగా.

జరిగే విషాద ఘటనలు
అంతా చరిత్రలోని భాగమే.

వివరికీ అర్థం కానట్టు
అంతా భద్రమే నంటారు.
విలపిస్తూంది ఖండం
విరచుకపడిన సముద్రం.

ఇవి ఒకనాటిది కాదు
అంతమెరుగ దెపుడో ?

నక్కలూ సింహాలూ పులులూ
వచ్చిచేరాయి జనపదాల్లోకి
అనుమానంకాదు, నిశ్చయంగానే
తరుముతున్నాయి ప్రజల నడవుల్లోకి.
చెట్లు కొండలు సైతం
కుటిల భ్రూకుటు లయ్యాయి.
ఇదికాదు మానవులేలే రాజ్యం
ఇక్కడ సమాధిపొందింది సంస్కారం.

ప్రతి నిముసం ఇక్కడ
చీకటిలోతిరిగే అగ్నిగోళం
ధ్వని—నిశ్శబ్దం-ధ్వని
పొగస్థూటిగా ధ్వని ననుసరించి.
వత్తికాదు ఆరిపోవడానికి ప్రాణం
అందునా బ్రతుకుపై వింతెంతో ఆశతో.

హిమశిలవలె బిగిసింది రాత్రి
కత్తులవలె నిలచినవి ఊహలు.

వీరిబ్రతుకు పరమార్థమంతా
యుద్ధమే నన్నట్టుంది చూస్తే తీరు.

సాధారణ మానవు డతడు
వెనుక మహో జన సందోహం.
చూపులు ప్రసరిస్తున్నాయి
దిక్కులలోకి బాకులవలె.

నిశ్శబ్దం వ్రాలింది బరువుగా
నిశ్చలంగా నిలచిం దెదురుగా.
నిశ్శబ్దం తెగిపోతూంది
ఎక్కడి దక్కడే స్లైసులుగా,
బూట్ల చప్పుడుకూ.
బులెట్ల ధ్వనులకూ.

పక్షు లరుస్తున్నాయి
ఏదో పసిగట్టినట్లు.
కదలికలేదు, ప్రాణముంది
ఊహలేదు, మతిఉంది.

అందరూ రాళ్ళైనా ?
కాకపోతే యంత్రాలా ?

శరీరమూ రాయే !
ఊహా రాయే !

ఏ అనుభూతి ఉన్నట్లు లేదు
ఒక్క రాక్షసం తప్ప సైనికులకు.

మెరపులు ! పిడుగులు !
మొగిళ్ళు ఎక్కడ ?
లేదు మొగిలు
అది మృగతృష్ణ.

చెట్లపై నిలుకడ ఎరుగని
పక్షు లరుస్తూనే ఉన్నవి
అతడు పలుకలేదు
పక్కకు తిరిగాడు
కళ్ళనుండి రెండుచుక్కలు
రాళ్ళు స్పందించాయి అగ్నికి.
భూమి లావా అయింది
ఆకాశం అరుణిమ వహించింది.

ఆతె డెవరు ?
విప్లవమూర్తి.
నెత్తురి మడుగులో
విరిసిన అగ్ని పద్మం.

నరరూప విశేషాలు
వెంటాడేను మనుషులను.
రక్షోభావ కృత్యాలను
భయపెట్టేను మనసులను.

ఎప్పుడో ఒకనాడు కావలసింది
అయిందిప్పటి కప్పుడే మొదలు,
ఒక మహామతం పేరిట
పీడకలల పరంపరతో.

నిదురపోతున్నారంతా
రాత్రి సరస్సులో చుక్కలవలె
మ్రోగింది మెషిన్ గన్
శాంత పద్మ పత్రాలపై.

బరువుగా కదలేక్షణం
అందుకుందొక్కమారు వేగం.
వచ్చాడు ముజీబ్ బయటికి
ఊయెలలూగాయి కళ్ళముందు
సైనికులూ, రైఫిళ్ళూ మెషిన్ గన్ లూ
నడచాడు మౌనంగా దీపంవలె.

తుపానుముందు ఘడియవలె
అంతటా స్తంభించింది వాతావరణం
కత్తివలె నిలచినరాత్రి
నెత్తురి చుక్కవలెఉంది క్షణం.

అతని కళ్ళనుండి కపోతాలు
శ్రేణులు శ్రేణులుగా తీర్చిసాగి
సైనికుల శిరస్త్రాణాలపై
ఆయుధాల చివరలపై
ఆగి ఎగసినవి పైకి.

అతడు మారాడు
ఆకు పచ్చని పిట్టగా
బంధించారతని
మసి పూసిన అద్దాల గదిలో.
కన్పించదు బయటి ప్రపంచం
ఆఖరికి నీడైనా పడని ప్రదేశం.

వత్తులు వణుకుతున్నాయి
విపరీతపు గాలికి
ప్రతిక్షణమూ
ముని వేళ్లపై నిలచి.

నిశ్శబ్దపు సెలయేళ్ళు ప్రవహించాయి
అబద్ధాల కుతంత్రాలల్లుకున్నాయి.
స్వేచ్ఛాభావన అణగేనా?
స్వాతంత్ర్యానలమారేనా ?

*   *   *

పిచ్చెక్కినట్లు వీచే తుపానులో
ఒడ్డుకోసి పొంగి పొరలే నదిలో
పయనించే వేళ నావ
జారిపోయాడు నావికుడు.

చీకటిలో దీపశిఖ
అడవిలో సరస్సు
దైన్యంలో వసంతం
ఆతడే వంగనేత.

ప్రాణాలు బిగపట్టుకొని
సాగేరు ప్రయాణికులు.
నాయకుడు తిరిగి వస్తాడనీ
తుపాను శమిస్తుందనీ
నది పొంగు తగ్గేననీ
ఆశతో అహరహమూ !
దేనికైనా ఉద్ధృతి ఎంతసేపు ?
దానికి వ్యతిరిక్తం తప్పదా పైన.

దిక్కులేడుస్తున్నాయి పంచముతో
ప్రజలెదుర చూస్తున్నారతనికై
వినబడుతూనే ఉంది స్వరం
లోలోన మ్రోగే ప్రబోధ తరంగం.

కనబడుతూంది ముఖబింబం
సాంధ్యవేళ గగనవలయం.
ఇంతటి బీభత్సంలోనూ
భవిష్యత్తు రేఖా శిల్పమై.

హాహా పారావతాలు
ఎగసి వందుకో నాతని
ఊహో జలధరాలు
తరలేను చుట్టుకో నాతని.

నిలచింది
అతని పేరు—విప్లవం
వెలసింది
అతని ఊరు—స్వాతంత్ర్యం

తురుష్కులు - సంస్కృత సేవ

శ్రీ వై. గోపాలరెడ్డి

సంస్కృతమున అనల్ప కల్పనా విలసితములగు గ్రంథముల రచించి అజరామరమగు యశఃకాయమున ప్రకాశించు విద్వత్ప్రభువులు, కవితల్లజు లనేకులు గలరు. అందు శ్రీహర్షుడు, భోజరాజు, పెదకోమటి వేమారెడ్డి, సర్వజ్ఞ సింగభూపాలుడు, బాణుడు, భాసుడు, కాళిదాసు మున్నగు మహానుభావుల కావ్య కళా సౌందర్యములచే భావుక లోకము పరవశమగుచున్నది.

సంస్కృత సరస్వతీ కళ్యాణ మండపమునకు అలంకారములు దిద్దిన వాఙ్మయ శిల్పులలో తురుష్కులకును పరిగణనీయమైన స్థానము కలదు. వారి గొడుగు నీడలలో సంస్కృత వాఙ్మయ సరస్వతి నవనవోన్మేషమును పొందినది. తురుష్కులు సంస్కృతభాషకు చేసిన సేవ నొకింత పరిశీలించుటయే ఈ వ్యాస ముఖ్యోద్దేశ్యము.

తురుష్కులు సంస్కృతమును పలువిధములుగా వ్యాప్తిలోనికి దెచ్చిరి. హిందూ సంస్కృతవిద్వాంసులను పాదుషాలు పోషించి వారిచే పలుకావ్యముల రచింపజేసిరి. కొందరు సంస్కృత కావ్యములను అరబ్బి, పారశీక భాషలలోనికి అనువదింపజేసిరి. మరికొందరు సంస్కృతమున స్వతంత్ర కావ్యముల రచించి వారి కా భాషలోనున్న వైదుష్యమును, సాహితీజగత్తులో సంస్కృతమునకున్న విలువను వెలువరించిరి.

తురుష్క పాదుషాల సంస్థానము లందుండి వారిచే పారితోషికములందుకొని అమూల్య గ్రంథముల రచించిన హైందవ కవి శేఖరులలో భానుకరుడు, అగ్బరీయ కాళిదాసు, జగన్నాథ పండితరాయలు, అచ్యుతదత్తుడు, పుండరీక విఠలుడు, హరినారాయణ మిశ్రుడు, వంశీధరమిశ్రుడు, చతర్భుజుడు, లక్ష్మీపతి ప్రముఖులు.

భానుకరుడు:—

భానుకరునకు మరియొక నామము భానుదత్తుడు. తండ్రి గణపతి—'గణపతి పుత్ర భానుకరస్య'. ఆతని కాలము క్రీ. శ. పదునారవ శతాబ్ది ప్రారంభము. విజయ నగర రాజులలో గణనీయుడగు శ్రీకృష్ణ దేవరాయలు, రీవాను పరిపాలించిన వీర భానుడు, నిజాంషా, సూరువంశశిఖామణియైన షర్షా, భానుకరుని పోషించినట్లు ఆధారము లున్నవి. జె. బి. చౌదరి భానుకరుని గురించి ఈ క్రింది విధముగా చెప్పిరి.

"Bhanukara was liberally patronised both by the Hindu and Moslem rulers of his time. He adorned the courts of Krishnadevaraya of Vijayanagar, Virabhanu of Rewa, Shersha and Nizam Shah. Therefore, he seems to have been wandering from place to place, from one court to the other, although we have no means of knowing the exact period of his stay in each....

His verses on the Nizam Shah are of paramount interest establishing as they do a good relationship between the poet and his patron. This shows that Mohammadan patronage for Sanskrit learning was not lacking in India in the sixteenth century A. D. (Prachyavani Research Series, VOL. 8, pp. 10 & 21)

భానుకరుడు రచించిన గ్రంథములు

కావ్యదీపిక
గీత గౌరీశ
రస మంజరి
రస తరంగిణి
} ఇవి ముద్రితములు

కుమార భార్గవీయము
అలంకార తిలకము
శృంగార దీపిక
} ఇవి అముద్రితములు

అగ్బరీయ కాళిదాసు:

ఇతని అసలు పేరు గోవిందభట్టు. ఈతని రచనలలో 'రామచంద్ర యశః ప్రశస్తి' మాత్రమే దొరకినది. రీవాను పరిపాలించుచుండిన రామచంద్రుని గురించి వ్రాసిన గ్రంథమిది. ఇతడు మొగలుపాదుషాయైన అగ్బరునకు సమకాలికుడు. దీనిని బట్టి అగ్బరీయ కాళిదాసు క్రీ. శ. పదునారవ శతాబ్ద తృతీయార్ధమున నుండెనని తెలియుచున్నది. జె. బి. చౌదరి ఈ కవిని గురించి ఇట్లు చెప్పిరి.

"Akbariya—Kalidasa is indeed a great Sanskrit Poet. His verses are inspiring and really enjoyable. Almost every verse has some figure of speech or other in it, such as the Metaphor including Malarupaka, Utpreksha, Atisayokti, Slesha and so on. No where in his composition, is there any looseness. The

style of Akbariya-Kalidasa reminds one of the excellent styles of his illustrious predecessors whose name he shares- though at a much later period. One is apt to think that his name Akbariya-Kalidasa is really a pen-name so designed as to please Akbar as well as to suit his own capacity as a supposed rival of the best poet of Hindu India." (Prachyavani Research Series, Vol. 8, p. 45.)

జగన్నాథ పండితరాయలు:

పండితరాయలు ఆంధ్రుడు. వేంగినాటి బ్రాహ్మణుడు. తండ్రి పేరు పేరుభట్టు. తల్లి లక్ష్మీదేవి. కోనసీమలోని ముంగండ గ్రామ మీతని జన్మస్థానము. చిన్నతనముననే ఇతడు సకల విద్యల నేర్చెను. పండితరాయలు కాశికిపోయి అచ్చట శేష వీరేశ్వరునికి శిష్యుడై వ్యాకరణ నిష్ణాతు డాయెను. ఈ కవి శిఖామణి కాలము గురించి జె. బి. చౌదరి ఇట్లు చెప్పిరి.

"Most probably our poet came to the court of Delhi when Jahingir was the ruler. Internal evidence shows that Jagannatha Panditaraja enjoyed the full confidence and liberal patronage of Shahjahan. If 'Jagat' of the work 'Jagadabharana' may be taken to refer to Dara Shikoh as some Mss show, Jagannatha Panditaraja may be supposed to have continued to enjoy the patronage of the Mughal Raja till the murder of the eldest son of ShahJahan (1659—60). Therefore our poet appears to have enjoyed the patronage of the two Mughal emperors and one Mughal prince. It is only likely that Jagannatha was born in the second half of the sixteenth century and continued to cantribute to Sanskrit literature till the murder of the unfortunate Mughal prince Dara shikoh as court poet of Delhi." (Ibid pp 51 ff).

భారతీయ అలంకార శాస్త్ర శిఖరారోహణము చేసిన గౌరవము తెలుగు వారికి దక్కించిన ప్రజ్ఞాశాలి జగన్నాథపండిత రాయలు.

జగన్నాథుని — నానాశాస్త్రపారంగతుడు, వశిష్ఠసముడు, అష్టభాషాకవిత్వక్షముడు అని 'సంగ్రామసార' గ్రంథకర్త కొని యాడినాడు.

జగన్నాథ విరచితమగు 'ఆసఫ విలాసము' వలన షాజహాను ఈ కవి పుంగవునికి 'పండిత రాజ' బిరుదము లిచ్చి సత్కరించి నటుల తెలియుచున్నది. షాజహాను కుమారుడైన ధారాషుకో పండిత రాయల శిష్యుడై శాస్త్రములను దర్శనములను అభ్యసించెను.

జగన్నాథ పండితరాయలు రచించిన గ్రంథములు:—

	గ్రంథములు	విషయము	
1.	అమృతలహరి	యమునాస్తుతి	11 శ్లో.
2.	కరుణాలహరి	విష్ణుస్తుతి	43 శ్లో.
3.	గంగా లహరి	గంగాస్తుతి	52 శ్లో.
4.	లక్ష్మీ లహరి	లక్ష్మీస్తుతి	41 శ్లో.
5.	సుధాలహరి	సూర్యస్తుతి	30 శ్లో.
6.	జగదాభరణము	పాదుషాస్తుతి	?
7.	ప్రాణాభరణము	ప్రాణనారాయణప్రశంస	53 శ్లో.
8.	ఆసఫ విలాసము	అసఫ్‌ఖాను ప్రశంస	?
9.	భామినీ విలాసము	ముక్తక కావ్యము	376 శ్లో.
10.	చిత్ర మీమాంస ఖండనము	అలంకారశాస్త్రము	
11.	రస గంగాధరము	అలంకారశాస్త్రము	
12.	మనోరమాకుచమర్దనము	వ్యాకరణము	
13.	యమునావర్ణనము	చంపూగ్రంథము	

పండిత రాయల కృతులలో 'రసగంగాధరము' సర్వోత్తమము. అలంకార శాస్త్రజగత్తులో నిది, ధ్వన్యాలోకమువలె, కావ్యప్రకాశమువలె ప్రామాణిక గ్రంథము. వ్యాకరణమున పతంజలి భాష్యమువలె, వేదాంతమున శంకర భాష్యమువలె, సాహిత్యమున రసగంగాధరము, పండిత భాష్యమై ప్రశస్తికనినది.

పుండరీక విఠలుడు:

ఇతడు పదునారవ శతాబ్ద మందున్న కవి. అందవల్లిని రాజధానిగా పరిపాలించుచుండిన బురహానుఖాను, కచ్ఛప వంశమునకు చెందిన మాధవసింహుడు, పుండరీక విఠలు నాదరించిరి. ఇతడు సంగీతశాస్త్రమందు దిట్ట. ఇతడు రచించిన గ్రంథములలో 'రసమంజరి' మాత్రము లభ్యము. అగ్బరు పాదుషాకు పుండరీక విఠలుడు బహుప్రియమైన కవి యని జె. బి. చౌదరి యభిప్రాయము.

హరినారాయణ మిశ్రుడు:

ఇతనిచే విరచితమైన రెండు శ్లోకములు 'పద్యవేణి' గ్రంథమందు కానవచ్చుచున్నవి. ఆ శ్లోకములలో నితడు మొగలు పాదుషాయైన షాజహానును స్తుతించినాడు. దీనినిబట్టి హరినారాయణ మిశ్రుడు పదునేడవ శతాబ్దపు ద్వితీయ భాగమునందు పరిపాలించిన షాజహానుచే పోషింపబడిన కవులలో నొకడై యుండవచ్చునని సాహితీపరుల ఊహ. ఇంతకుమించి ఈ కవీశ్వరుని జీవితమును గురించిగాని, వ్రాసిన గ్రంథముల గురించిగాని ఏమియు తెలియుటలేదు.

వంశీధర మిశ్రుడు:

'పద్యామృత తరంగణి' యం దీతడు రచించిన శ్లోక మొకటున్నది. ఇంతకుమించి ఈతని గ్రంథము లేమియు లభ్యము కాలేదు, షాజహాను సతీమణి ఈతనిని ప్రేమాభిమానములతో పోషించెనట,

చతుర్భుజుడు:

ఇతడు ఔరంగజేబు మేనమామయైన సయిస్తఖాను నాస్థానకవి. చతుర్భుజుడు రచించిన గ్రంథము 'రసకల్పద్రుమము'.

ఇది అముద్రితము. ఇందు ఇరువది ఐదు అధ్యాయములు, వేయి శ్లోకములు గలవు. దీనిని క్రీ. శ. 1689 లో రచించెను.

లక్ష్మీపతి :

లక్ష్మీపతి క్రీ. శ. 1721 లో 'అబ్దుల్లా చరిత్ర' అను గ్రంథమును రచించెను. ఇతడు అబ్దుల్లా ఆస్థానకవి. ఈ అబ్దుల్లా, ఔరంగజేబు కుమారుడైన మహమ్మదు షాకు మంత్రి.

లక్ష్మీపతి న్యాయ, జ్యోతిష, తంత్రశాస్త్రములందు అద్వితీయమైన ప్రతిభ గల కవి. భాగవతము, భగవద్గీత, ఖురానుల నుండి ఎన్నియో విషయముల నీకవి స్వీకరించి తన గ్రంథము నందు పొందుపరచినాడు. లక్ష్మీపతికి అరబ్బీ, పారశీక భాషలందు అద్వితీయమైన వైదుష్య మున్నదనుట కాధారము తను రచించిన 'అబ్దుల్లా చరిత్ర'లో అరబ్బీ, పారశీక పదములు లెక్కకు మిక్కుటముగ నుండుటయే.

అమృతదత్తుడు :

అమృతదత్తునిచే రచింపబడిన కొన్ని శ్లోకములు, శ్రీధర దాసుని 'సదుక్తికర్ణామృతము' నందును, జల్హణుని 'సూక్తిముక్తావళి' యందును కలవు. క్రీ. శ. పదిరెండవ శతాబ్దమందు పరిపాలించిన సహబుద్దీనుచే నీతడు పోషింపబడియెను.

తురుష్కులు హైందవపండితుల నాదరించి వారిచే సంస్కృతములో గ్రంథముల రచింపజేయుటయేగాక, వారు పలు సంస్కృత గ్రంథములను ఇతర భాషలలోనికి అనువదింపజేసి, సంస్కృత భాష కెనలేని సేవ చేసినారు. ఇందు మధ్యయుగమందు వంగ దేశమును పాలించిన తురుష్క పాదుషాలు ప్రథములు.

మహాభారతమును మొట్టమొదట వంగభాషలోని కనువదింపజేసిన ఘనత వజీరుషా (1282-1325)కు దక్కినది. రామాయణమును వంగభాషలోనికి కృత్తివాసుడు అనువదించెను. ఈ కవిశిఖామణి వజీరుషా ప్రాపులో నుండెనో లేక కంసనారాయణుని ఆదేశానుసారము అనువాదము చేసెనో ఒకింత నొక్కి చెప్పుటకు ఆధారములు లేవు. కృత్తివాసుడు, వజీరుషా, కంసనారాయణుల ఆదరాభిమానములతో రామాయణానువాదముచేసియుండ వచ్చునని నా ఊహ.

మాలాధరబాసు, హుస్సేనుషా పాదుషా ప్రోత్సాహముతో భాగవత పురాణమును వంగభాషలోనికి తర్జుమా చేసెను. హుస్సేనుషా సైన్యాధిపతియైన పారగలుఖాను పనుపున కవీంద్ర పరమేశ్వరుడు మహాభారతమును స్త్రీపర్వము వరకు అనువదించెను. పారగలుఖాను తనయుడైన చుటిఖాను, శ్రీకరనంది చేత మహాభారతము నందలి అశ్వమేధపర్వమును అనువదింప జేసెను.

మొగలు వంశ స్థాపకుడైన బాబరునకు ఖగోళ శాస్త్రమం దభిలాష మెండు. ఇతడు సంస్కృత పండితుల పోషించి వారిచే ఖగోళ శాస్త్ర సంబంధమైన గ్రంథముల పారశీక, అరబ్బీ భాషల లోనికి అనువదింపజేసినాడని సాహితీపరుల అభిప్రాయము. బాబరు సమర్కండునందు ఖగోళ శాస్త్ర పరిశోధన కేంద్ర మొకదానిని కూడ నిర్మించెను.

బాబరు మనుమడైన అక్బరు సంస్కృతమునకు చేసినసేవ అపారము. 'తారీకీ బదౌని' (Tarik -Badauni) గ్రంథకర్తయైన అబ్దుల్లాఖాదరును, నజీరుషాను మహాభారతమును, అరబ్బీ పారశీక భాషలలోనికి అనువదింప ఆదేశించెను. ఈ మహాభారతానువాదమునకు 'రాజంనమా' (Razm-Namah) అను నామకరణము చేసెను. ఈ గ్రంథముయొక్క వ్రాత ప్రతికి 40,000 రూకలు అక్బరు వెచ్చించెనట. దీనికి పరిచయ వాక్యములు అక్బరు ఆస్థాన కవులలో నగ్రగణ్యుడైన అబుల్ ఫజుల్ వ్రాసెను. దీని ప్రతులు అక్బరు తన సామంతరాజులకు పంచిపెట్టినట్లు ఆధారములున్నవి. (**Gladwin; Ain-i-Akbari; p. 85**).

అక్బరు ఆదేశానుసారముగ అబ్దులుఖాదరీ రామాయణమును కూడ అనువదించెను. ఈ పనిని క్రీ. శ. 1585 లో ప్రారంభించి క్రీ. శ. 1589 లో ముగించెను. (**Elliot & Dowson—The History of India as told by Her own Historians; Vol. 5, pp. 537-538**).

అబ్దులు ఖాదరీ, ఫెక్షీజి, హాజి ఇబ్రహాం ఏక్ హిందీ మతియొక ఇస్లాము మత మవలంబించిన దాక్షిణాత్యకవిపుంగవుడు అధర్వ వేదమును అనువదించిరి (**Lowe: Muntakhabul—Tawarik, Vol. II, p. 216**).

మవులానా షా మహమ్మదు షాహబాది, సంస్కృత మందున్న 'కాశ్మీర దేశ చరిత్ర'ను పారశీకములోనికి తర్జుమా చేసెను. ఈ విధముగనే కల్హణ విరచితమైన 'రాజ తరంగిణి'ని మౌలానా ఇమాముద్దీను అనువదించెను. (**Elliot & Dowson; op. cit, p. 478; Asiatic Researches, XV, p. 2**).

నస్రుల్లా ముస్తఫా, 'హరివంశము'ను పారశీకములోనికి అనువదించెను. మౌలానా హుస్సేయూ నిమాయుజ్ 'పంచతంత్రము'ను 'కలీలా దామనా' (**Kallilah Damanah**) అను పేరుతో అనువదించెను. దీనినే మరికొంత సులభశైలిలో 'ఆయార్ దానిష్' (**Ayar—Danish**) అను పేరుతో అనువదించిరి.

అబ్దులు ఖాదరీ 'సింహాసన ద్వాత్రింశిక'ను 'శింగాసన భట్టీస' అను పేరుతో అనువదించిరి. (**Elliot & Dowson, op. cit, p. 513**). (అక్బరు ఆస్థానమందున్న మరియొక కవియైన ఫైజి 'లీలావతి' యను గ్రంథమును అనువదించినట్లు ఆధారములున్నవి.

ఇంతవరకు తురుష్క పాదుషాలు పోషించిన సంస్కృత పండితులు, వారి రచనల గురించి, వారి ఆదేశానుసారముసై అనువదింపజేయబడిన పలుసంస్కృత గ్రంథముల గురించి ప్రస్తావించితిమి. ప్రస్తుతము తురుష్క పాదుషాలు, వారి సామంతు లెవరయినను స్వతంత్రముగ సంస్కృత గ్రంథముల రచించినారేమో ఒకింత పరికింతము.

అబ్దురు రహీం నవాబ్ ఖాన్ ఖానన్ తురుష్క సంస్కృత కవిశ్వరులలో సుత్తమోత్తముడు. క్రీ. శ. 1557 లో లాహోరు నందితుడు జన్మించెను. బైరాంఖానుపుత్రుడు. బైరాంఖాను, హుమయూను, అక్బరు పాదుషాల రాజ్య పరిపాలనలలో గణుతి కెక్కిన మహామనీషి. ఇతని తనయుడైన అబ్దురు రహీంను అక్బరు తన తనయునిగా ఆదరించి సత్కరించెను. అబ్దురు రహీం సంస్కృత, హిందీ భాషలం దద్వితీయమైన ప్రజ్ఞాశాలి. ఇతడు రచించిన గ్రంథములలో ముఖ్యమైనవి 'రహీం కావ్యము' 'ఖేటకౌతుకము'. 'మదనశతకము'. పైన పేర్కొన్న మూడు గ్రంథములు హిందీ, సంస్కృత భాషా సమ్మిశ్రమములు. హిందీ, సంస్కృత భాషల నుపయోగించి మొట్టమొదటిసారిగ గ్రంథ రచన సలిపిన కవి 'సారంగధర పద్ధతి' రచించిన సారంగధరుడు. (క్రీ. శ. 1360.)

అబ్దురు రహీం సంస్కృత గ్రంథముల రచించుటయే గాక పెక్కు హైందవ సంస్కృత పండితుల పోషణములతో పోషించెనని జె. బి. చౌదరి అభిప్రాయము.

"He was a patron of Ganga, Prasiddha, Mandara, Sant, Lakshminarayana, Bana and many other Hindu poets. They have all acknowledged sincere and heart felt gratitude to him. Rahim is reputed to have made a present of 36 lakhs of rupees to Ganga for composing a chaopai. Kesava composed the Jahingir-chandrika as an aid for the coaching of Alak Bahadur, son of Abdur Rahim. Even the Barve Ramayana of Tulasidas is said to be an outcome of Rami's inspiration imported to Goswani Tulasidasa" (Khan Khanan and Sanskrit Learning, Calcutta 1954, p. 7).

శ్రీ కృష్ణ దైవజ్ఞుడు జాతకవర్త్యుద్ధరణ' మను గ్రంథమును రచించెను. ఇది అబ్దురు రహీంయొక్క జాతకమును తెలుపు గ్రంథము.

రుద్రకవి 'నవాబ్ ఖాన్ ఖానన్ చరిత్ర', 'జహింగీరు చరిత్ర' 'కీర్తి సముల్లాసము', 'దానసాహ చరిత్ర' మొదలగు గ్రంథముల రచించెను. 'నవాబ్ ఖాన్ ఖానన్ చరిత్ర' అబ్దురు రహీంపై రచించినది. 'కీర్తి సముల్లాసము' జహింగీరుపాదుషా కుమారుడైన ఖుస్రమును గూర్చిన ప్రశంస. 'దాన సాహ చరిత్ర' అక్బరు తనయుడైన దానసాహుని ప్రశంస. ఈ గ్రంథముల రచించుటలో రుద్రకవ్యుద్దేశ్యమును గురించి జె. బి. చౌదరి ఇట్లు చెప్పిరి.

"The purpose of the composition of the works has been clearly stated by the poet (Rudrakavi) in the first verse of the fourth ullasa of the Khan—Khanan-Charita herein he asks for the royal patronage of the Muslim rulers or his local chief (Pratapa Shah)"

షాజహాను ప్రథమకుమారుడైన ధారాషుకో, సంస్కృత భాషయందు అద్వితీయమైన వైదుష్యమున్నవాడు. ఇతడు జగన్నాథ పండిత రాయల ప్రియతమ శిష్యుడు. ఇతడు పెక్కు హిందూ సంస్కృత పండితుల సహాయముతో ఉపనిషత్తులను పారశీకభాషలోనికి అనువదించెను. ఈ అనువాద గ్రంథమునకు 'సిరుల్ అక్బరు' (Sirr—ul -Akbar or the Great Secret) అని పేరు పెట్టెను. 'యోగవాశిష్ఠ' మను సంస్కృత గ్రంథమును కూడ నితడు అనువదించెను. క్రీ. శ. 1654 లో దారాషుకో 'సముద్ర సంగమ'మను ఒక ఉద్గ్రంథమును రచించెను. సంస్కృత భాషపై గల అపారప్రేమ మూలముగ నీతడు తన వజ్రపు టుంగరముపై ఇతరమైన విలువైన వస్తువులపై 'ప్రభు' అను పదమును చెక్కించుకొనియె నని కొందరి సాహిత్య ప్రియుల అభిప్రాయము (Sarkar. Auraagazeb, Vol. I, p. 271, Quanungo: Dhara Shukoh, Vol. I. ch. VI).

సయిస్తఖాను, సంస్కృత భాషయందు అపారమైన అభినివేశము గలవాడు. దారాషుకోకు మేనమామ. ఇతనిచే రచింపబడిన కొన్ని శ్లోకములు చతుర్భుజ విరచితమైన 'రస కల్పద్రుమము'లో నున్నవి. ఇంతకుమించి ఈతని గ్రంథము లేమియు దొరకలేదు.

భారతీయ చక్రవర్తులైన హిందూ ప్రభువులు భారతీయ తత్త్వమును, హైందవ జీవిత రీతిని ప్రతిబింబించు సంస్కృత భాషా సాహిత్య పోషణము చేయుట సముచితము. విధి. కాని అన్యదేశీయులైన మహమ్మదీయులు సంస్కృత భాషను పోషించుట, కవుల నుద్ధరించుట, సాహిత్య సేన కావించుట ప్రశంసాపాత్రము. అంతమాత్రమేగాక, తురుష్క పాదుషాలు రాజ్య బాధ్యతల నడుమ తలమున్కలగుచును, సంస్కృత మభ్యసించి, తన్నిష్ణాతులై, కావ్యరచనచేయుట గమనార్హము. అత్యంత స్తుత్యము.

శ్రీ అరవిందుల యోగసాధన ప్రగతి

శ్రీ కమలాకర వేంకటరావు

పూర్ణయోగం పేరిటి అపూర్వ నవ్యయోగ ప్రవర్తకులు శ్రీ అరవిందులు.[1] పూర్వయోగ మార్గములన్నీ వేర్వేరు రీతులలో పరతత్వమును చేరుటకు మాత్రమే ప్రాధాన్య మిచ్చాయి. జనన మరణ రూప సంసార బంధమునుండి విముక్తి పొందే ఉపాయ ముప దేశించడమే వాటి పరమ లక్ష్యం. వాటి దృష్టిలో, జీవితం అజ్ఞాన మూలకమూ దుఃఖభూయిష్ఠమూ గనుక, పరిత్యజించబడుట కుద్దిష్టమైనది మాత్రమే. అంతకుమించిన పరమార్థం జీవితాని కున్నట్లు అవి అంగీకరించవు. శ్రీ అరవిందు లట్లుగాక జీవితమున కొక పరమార్థం కలదని చాటి, అతిమానస దివ్య విజ్ఞానావతరణ ముచే అద్దాని దివ్య పరివర్తనము సాధింపవలసి యుండుటే ఆ పరమార్థమని నిరూపించుటచేతనే వారి నవ్యయోగ మార్గము అపూర్వమై విలసిల్లినది.

జీవితమును దివ్య పరివర్తన మొందించడమంటే, జీవితోప కరణములైన మనఃప్రాణదేహములను దివ్య పరివర్తన మొందిం చడ మన్నమాట. మనఃప్రాణదేహముల ప్రవృత్తి ప్రస్తుతము అజ్ఞాన మూలకముగా నున్నమాట నిజమే. కాని, ఎల్లకాలానికీ అది అటులే కొనసాగుతూ ఉండడం ప్రకృతి లక్ష్యమూ, ప్రకృతిని వెనుకవుండి నడిపే ఈశ్వర లక్ష్యమూ కాదు. జీవితమునూ, ఈ సృష్టివికాసక్రమమునూ ప్రకృతి కొనసాగించే ఒక మహా యోగంగా శ్రీ అరవిందులు దర్శించారు. సచ్చిదానంద పరతత్వ స్థాయిలోనుండి జడస్థితిలోనికవతరించి తిరిగి క్రమేణా ఆ పరతత్వస్థాయిలోనికి ఆరోహింప నుత్సహించే బృహల్లీలా విశేష మిది. జడమున ప్రాణ విలసనమూ, ప్రాణమున మనో విలస నమూ క్రమవికాసమూ నొందుతూ వచ్చి సృష్టిలో మానవా ర్భావమైనది యీ అరోహణక్రమంలోనే. కాని, ఇది ఇంతటితో ఆగిపోనేరదనీ, అతిమానస విజ్ఞాన విలసనముగల అతిమానస దివ్య మానవావిర్భావము సైతము పృథ్విపై జరగవలసి యున్నదనీ శ్రీ అరవిందులు తమ దివ్య దర్శనానుభవ సాక్షాత్కార ముతో వక్కాణించి, ఆ శుభ పరిణామమును సన్నిహితం చెయ్య డానికే యీ నవ్య యోగ మార్గమును కనుకొని అనుష్ఠించి, అద్దానికి ప్రవర్తకులై విలసిల్లినారు.

మనస్సు అజ్ఞాన కలితమేకాని అతిమానస మట్లు కాదు. అది దివ్య విజ్ఞాన శోభితము. అభేద దృష్టి దాని సహజ లక్షణము. అట్టి అతిమానసము మానవునిలోనికి అవతరించినపుడు, అతడు సాక్షాత్తుగ దివ్య మానవుడుగనే పరివర్తనము చెందక తప్పదు. మనః ప్రాణ దేహముల నుండి విడివడి వాటి కతీతమై విలసిల్లు పరతత్వముతో సాలోక్య, సామీప్య, సాధర్మ్య, సాయుజ్యముల ననుభవించువరకే ఇతర యోగములు లక్ష్యముగా నిడుకొని ప్రవర్తించినవిగాని, ఆ పరతత్వ దివ్య విజ్ఞానావతరణము ద్వారా మనః ప్రాణ దేహముల పరివర్తనమును లక్షించి యుండ లేదు. అట్టిది సాధ్య విషయముగ నవి యెన్నడును భావించి యుండకపోవుటే దీనికి ముఖ్య కారణమని చెప్పక తప్పదు. మనః ప్రాణ దేహము లెప్పటికీ అజ్ఞాన స్థాయిలోనివేననీ, జ్ఞానస్థాయి వాటి కెప్పటికీ పైదేననీ, జీవపురుషుడు వాటి నతిక్రమించి జ్ఞానస్థాయిలోనికి పైకి పోవలసినదే తప్ప, ఆ జ్ఞానస్థాయి క్రిందికి దిగడం జరగనేరదనీ వాటి నిశ్చయం.

విశ్వసృష్టి విధానమునే ఒక మహాయోగ ప్రణాళికగా దర్శించిన శ్రీ అరవిందులు మనస్సునకూ అతిమానస విజ్ఞానము నకూ మధ్య శాశ్వతమైన అడ్డుగోడ ఉన్నట్లు భావించి మిన్నకుండలేకపోయినారు. ఈ అడ్డుగోడను క్రమముగా విచ్ఛిన్నముచేయుటే ప్రకృతి కొనసాగించు నీ మహాయోగలక్ష్యముగా వారికి సాక్షాత్కరించినది. ఈ లక్ష్య సాధనలో మానవుడే ఆమెకు ఉపకరణము. సామాన్య సరణిలో లక్షలకొలది సంవత్సరాల పరిశ్రమతో ప్రకృతి సాధించు వికాసమును మానవుడు లక్ష్యమెరిగి చేయు, తన యోగసాధనచే అల్పకాలములోనే సాధించగలడు. కాని యింత కాలమునూ ఈ యోగ సాధన ఆరోహణ విధానమున మనః ప్రాణ దేహముల నతిక్రమించి పరతత్వమును చూరగొను టకే ఉపయోగపడుతూ వచ్చినదేకాని, ఆ పరతత్వ జ్ఞానమును క్రింది కవతరింపజేసి, మనః ప్రాణ దేహముల దివ్య పరివర్తనము సాధించి ఇలపైని మానవ జీవితమును దివ్యము గావించుటకు వినియుక్తమై యుండలేదు. శ్రీ అరవిందు లీ అపూర్వ లక్ష్యముతో నవ్యయోగమును ప్రపంచించుటచేతనే యిది అపూర్వమై విరాజిల్లుచున్నది.

---

1. శ్రీ అరవిందుల జన్మకు నాలుగు సంవత్సరాలముందు యోగ సాధనయందొక వినూత్న పంథా త్రొక్కి అపర విశ్వామిత్రునివలె దీపించిన మరొక మహాపురుషుని దైవం కుంభకోణంలో ఉద్భవింపజేసింది. —మాస్టర్ సి. వి. వి.

జీవితము, జీవితోపకరణములైన మనః ప్రాణ దేహముల దివ్య పరివర్తనము గాంచవలెనన్నప్పుడు, యోగసాధన ఈ అన్నింటినీ తనలో సంతర్భుక్తము చేసుకోగలదై యుండవలెను. గాని, ఏదో ఒక పరిమితక్షేత్రములో మాత్రమే ప్రవర్తిల్లునది కానేరదు. జీవితమునంతనూ అట్లు అంతర్భుక్తము చేసుకొనజాలక, పైపెచ్చు కడకు పరిహరించు లక్ష్యముతోనే మనః ప్రాణ దేహములకు చెందిన ఏదో ఒక శక్తి విశేషమును మాత్రము వూతగా గొని ప్రవర్తిల్లినందుననే ఇతర యోగము లన్నియు మహనీయసిద్ధి ప్రదములేయైననూ పాక్షికములే యైనవి. శ్రీ అరవిందులు కనుగొన్న యోగపద్ధతి అట్లుగాక మనః ప్రాణ దేహముల నిసర్గశక్తులన్నిటిని విశుద్ధిపూర్వకముగా దివ్య పరివర్తనకు వాటిని యోగ్య మొనర్చి తద్వారా జీవితమునంతనూ దివ్యమొనర్చబూనినందుచేతనే పూర్ణ యోగమను అన్వర్థ నామమును గడించుకొన్నది. భక్తి, జ్ఞాన, కర్మ యోగములయు తంత్రసాధనలయు అద్భుత సమన్వయ మిచట మనకు సుప్రత్యక్షము.

జీవితమునంతనూ అంతర్భుక్తము చేసికొనుట వలననే కాదు, పరతత్త్వమును అద్దాని విభిన్నస్వరూపములతోసహా లక్షించి ఉపాసించుటవలన కూడా ఈ యోగము పూర్ణయోగమైనది. సగుణమును కాదని నిర్గుణమును, నిర్గుణమును కాదని సగుణమును ఆరాధించుట దీని లక్ష్యముకాదు. సగుణ నిర్గుణముల కతీతమై వెలయుచునే ఈ ఉభయమును తానేయై విరాజిల్లు తత్త్వము దాని యారాధ్యము. ఏకమయ్యూ అనేకమై ఒకమహాయోగలీలను నడుపుచున్న తత్త్వ మది. సర్వాతీతమయ్యునూ వ్యష్టి, సమష్టి రూపములలో సర్వమునూ తానెయై తాను గాక ఇతరములేని అద్వయ స్వరూపము. వేర్వేరు అంతస్తులలో బహుభంగులలో నడచు విశ్వవ్యాపారమెల్ల దాని వ్యాపారమే. ఇది గుర్తించి, అహంకారమును విడనాడి, పరమాత్మునికే ఆత్మసమర్పణ మొనర్చుకొని, ఆతనితో సాయుజ్యము భజించి, అతని యిచ్ఛానుసారముగ విశ్వములో, ఈ పృథ్వీజీవనములో, ఆతని శక్తి కేంద్రముగ వ్యవహరించుటను నేర్చుకొనుటయే మానవుడు చేయవలసియున్న పని. అందులకు బాటలువేసి చూపు ప్రత్యేక కార్యము నిమిత్తమై పరమేశ్వరునిచే ప్రత్యక్షముగా పంపబడిన మహావ్యక్తియే శ్రీ అరవిందులు.

డెబ్బది యెనిమిది సంవత్సరాల జీవిత కాలంలో ఆయన సాధించిన అత్యంత విశిష్ట మహాకార్యమునంతనూ సింహావలోకనం చేసి చూచినప్పుడు, ఆయన నిజముగా భగవంతునిచే ప్రత్యేకముగా పంపబడిన మహనీయుడేయని మనం నిశ్చయించుకోకుండా ఉండలేము. భగవంతుడు ఎప్పుడెప్పుడు ఎవ రెవరిని ఏయే పనుల నిమిత్తం పంపుతూ ఉంటాడో మనం చెప్పుకోలేము. అలా పంపబడే వారంతా భగవదంశస్వరూపులనుగనే మనం పరిగణించక తప్పదు. వారిని అనేకులు సాక్షాత్తుగా భగవదవతారులుగనే కూడ ఆరాధిస్తూ వుండవచ్చు. ఫలాని మహనీయుడు భగవదవతారమా, భగవదంశము అనే వ్యర్థ మీమాంసలోనికి మనం దిగరాదు. తత్త్వతః ప్రతి మానవుడూ కూడ భగవదవతారమేయైన స్థితిలో ఈ మీమాంసతో మనసును మనం కలవర పరచుకోడం అనుచితం. భగవన్నిర్దిష్టమైన ఒక్కొక్క మహాకార్యమునకు ఒక్కొక్క మహాత్మ డవతరించాడని వినమ్రులమై చేతులు జోడించి నమస్కరించడమే మనం చేయవలసిన పని.

ఏలనంటే గత శతాబ్దిలో భారతదేశమున, వివిధ భగవద్విభూతి విశేషములతో జన్మించిన యితర మహా పురుషుల మాట అలా వుంచి ఆధ్యాత్మిక యోగ సాధనా క్షేత్రంలో తాము నిర్వర్తించిన మహాకార్యముల అసదృశ వైశిష్ట్యముచే లోకోత్తరముగ నెన్నబడక తప్పని మహావ్యక్తు లిరువు రుద్భవించారు—ఒకరు శ్రీరామకృష్ణులు, రెండవవారు శ్రీ అరవిందులు. శ్రీరామకృష్ణులవతారం చాలించుసరికి శ్రీ అరవిందులు పదునాలుగేండ్ల వయస్సులో ఇంగ్లండులో విద్యాభ్యాసం చేస్తున్నారు. భగవత్సాక్షాత్కారమును పొందు నుపాయములుగా శాస్త్రములందు వివరించబడిన వివిధ సాధన ప్రక్రియల నన్నిటినీ తా ననుష్ఠించి అన్నింటిలోనూ అత్యాశ్చర్యకరంగా అత్యల్ప కాలములోనే ఆయా లక్ష్యసిద్ధులను సాధించి చూపి, అన్నీ భగవంతుని చేరు మార్గములేయని నిరూపించి, సర్వ మత సామరస్యమును చాటి, నిర్వికల్ప సమాధి యనబడునది సైతమూ సాధ్యమేయని తెలుపుటకు తాను ప్రత్యక్ష నిదర్శనమై తన వలెనే కారణజన్ముడై జన్మించిన శ్రీ వివేకానందుని ద్వారమున యావత్ప్రపంచములోనూ మహత్తరమైన ఆధ్యాత్మికోన్మేషమునకు కారణభూతులైన దివ్య పురుషులు శ్రీరామకృష్ణులు. కాని, ఆ పని ఆయనచేత అట్లు చేయిస్తున్న కాలంలోనే భగవద్విలాసం మరొక మహత్కార్యమును కూడా సంకల్పించి, శ్రీ అరవిందుల జన్మరూపంలో దానికి అంకురార్పణ గావించింది.

ఆధునిక విజ్ఞాన నాగరికతా సంస్పర్శలేని పల్లెటూరి సనాతన సాంప్రదాయిక వాతావరణంలో శ్రీరామకృష్ణుని జన్మింపజేసిన భగవల్లీలయే శ్రీ అరవిందుని సనాతన సంప్రదాయపు పొడయే గిట్టని పాశ్చాత్యనాగరకతా వ్యామోహపరుని కుమారునిగా పుట్టించి, ఆ బాలుని విద్యాభ్యాసంలోకూడా ఈ సనాతన సంప్రదాయపు సొక్కు సోకకుండునట్లు ఇంగ్లండులోనే విద్యాభ్యాసం సైతం జరిగేటట్లు చేసింది. కాని అపూర్వమైన ఒక ప్రత్యేక యోగ పంథాను లోకమున ప్రవర్తింప చేయడానికై అవతరించిన వానిని ఈ విజాతీయవాతావరణం ఎంత కాలం నిరోధించి ఉంచగలదు? నిరోధించలేకపోవడం అట్లుండగా, అతడు మున్ముందు నిర్వర్తించవలసియున్న మహాకార్యానికి ఈ పాశ్చాత్య విజ్ఞాన సముపార్జనం ఒక విధమైన పుష్టిని చేకూర్చటానికే ఉపయోగపడింది. తా నొక మహాకార్యం సాధించడానికై జన్మించినట్లు పదునాలుగేండ్లవయస్సులోనే మహా ప్రేరణ ఒకటి ఆయనలోంచి బయలుదేరింది.

మొట్టమొదటగా ఇది దేశభక్తి రూపంలో బయలుదేరిన ప్రేరణ. మాతృదేశంనుండి ఆరువేల మైళ్ళ దూరంలోకి

విసరివేయబడినా ఆయనలోకి యీ ప్రేరణ రానే వచ్చింది. దేశం ఆయనకు నదులూ, కొండలు, అడవులు, పల్లెలు, పట్టణాలుగా మాత్రమే గోచరించలేదు. సాక్షాత్తూ మాతృమూర్తిగా అది ఆయనకు పొడగట్టింది. దేశమాతను శృంఖలాబంధవిముక్తం చెయ్యాలనే తహతహ పుట్టింది. కత్తులతో, తుపాకులతో యీ పని సాధించబడదని కూడా ఆయన గ్రహించారు. క్షాత్ర తేజస్సు కంటె బ్రహ్మతేజస్సు దీనికి అవసరమని ఆ అల్ప వయస్సులోనే ఆయనకు స్ఫురించింది. సనాతన ధర్మ వాతావరణానికి బహుదూరంగా విద్యాభ్యాసం చేస్తున్న ఆ బాలునిలో యీ సనాతన ధర్మ కుసుమ మొట్టమొగ్గ తొడిగి వికసింప నారంభించి నదో ఆశ్చర్యకరమే. పదునెనిమిదేండ్ల వయస్సు వచ్చుసరికి యీ భావం తనలో బాగా బలపడినదని తన భార్యయైన శ్రీమతి మణాలినీదేవికి తాను వ్రాసిన ఒక ముఖ్యమైన లేఖలో ఆయన స్వయంగా చెప్పుకున్నారు. ఐ. ఏ. ఎస్. పరీక్షలో అదివరకే ఉత్తీర్ణుడైనా దానికి పరిపూర్తి ఘటించచేసే అశ్వారోహణ పరీక్షకు వెళ్లడం బుద్ధిపూర్వకంగా మానివేసి, బ్రిటిషుప్రభుత్వంక్రింద సివిల్ సర్వీస్ ఉద్యోగానికి అనర్హతను ఆయన కావాలని గడించుకొన్నది యీ కారణం వలననే అనుటకు సందేహం లేదు.

లండన్‌లో ఇండియన్‌మజ్లిస్ అనే యువక సంఘమున సభ్యుడయి ఆ బాలకిశోరం చేస్తూవచ్చిన గర్జనలు చెవిని పడగా బ్రిటీషుప్రభుత్వం అంతకుముందే ఒక 'బ్లాకుమార్కు' ఆయనపై వేసి వుంచింది. బరోడా మహారాజు ఆహ్వానంపై బరోడా సంస్థానం సర్వీసులో పని చేయడానికి ఆయన అంగీకరించి, ఇరువదియొక్క సంవత్సరాల వయస్సులో బొంబాయి పోరుబందరు రేవునందు స్టీమరు దిగి భారతభూమిపై అడుగుపెట్టగానే అపురూపమైన మహాశాంతి ఒకటి తనలోనికి పైనుంచి దిగివచ్చినట్లుగా ఆయనకు అనుభూతమయింది. ఇది నిశ్చయంగా అసాధారణమైన ఆధ్యాత్మికానుభూతి లక్షణం. యోగ సాధన అంటూ అప్పటివరకూ ఆయన ఏదీ ప్రారంభించకపోయినా కలిగిన అనుభూతి ఇది. తాను అనుకోకుండానే తనంతట అది జాగ్రదవస్థలో కలిగిన అనుభూతి. తరువాత కొన్నినెలల వరకూ కూడ అది ఆయనలో నెలకొని వుండడం గమనించదగినది.

శ్రీరామకృష్ణ పరమహంసకు పది, పదకొండేండ్ల వయస్సులో ఆకాశమున నల్లని మబ్బుల ముందర ఎగిరే తెల్లని కొంగల బారును చూడడంతోటే మొట్టమొదటి భావ సమాధి కలిగింది. శ్రీ అరవిందుని బాల్య దశలో ఇట్టి అనుభూతు లింకేమైన కలిగినవో లేదో తెలియదు. కాని, భారతభూమిపై అడుగిడగానే ఆయనకు కలిగిన యీ అనుభూతి అప్పటికే ఆయనలోని ఆధ్యాత్మిక పరిపక్వతను తెలియజేస్తుంది. తరువాత కొన్ని సంవత్సరాలకు ఒకసారి కాశ్మీరు రాజధానియైన శ్రీనగరంలో శ్రీ శంకరాచార్య పర్వత మనబడే దానిపై నడుస్తూ వుండగా మరొక రకమైన అనుభూతి ఇదేవిధంగా ఆయనకు కలిగింది. పైనా, క్రిందా, చుట్టూ అంతటా అంతులేని ఒక శూన్యాకాశం మధ్య తానున్నట్లుగా అనుభవ మది. జాగ్రదవస్థలో కనులు తెరచి చూస్తూ వుండగానే కలిగిన అనుభవం. ఇది ఎందుకు కలిగినదో ఆయనకే తెలియదు. అనుకోకుండానే ఇట్టి అనుభవం కలగడం ఆయనకే ఆశ్చర్యం గొలిపింది. కాని, దానిని గురించి తరువాత ఆయన పెద్దగా ఏమీ ఆలోచించలేదు. శ్రీ రామకృష్ణుని వలెనే, ఆధ్యాత్మికానుభూతు లాయనకు సహజప్రాప్తము లనుట కివి నిదర్శనములు.

శ్రీ అరవిందులు ఇంగ్లండునుండి భారతదేశానికి చేరుకున్న సంవత్సరమే శ్రీ వివేకానందులు షికాగోలో అఖిల మత మహాసభా వేదికపై భారత సనాతన ధర్మ సందేశమును వినిపిస్తూ వేదాంతకేసరియై గర్జించిన సంవత్సరం. శ్రీ రామకృష్ణ వివేకానందుల జీవిత సందేశముల ప్రభావం శ్రీ అరవిందులపై విస్తారంగా ప్రసరించింది. దానికితోడు, భారత సంస్కృతి విజ్ఞానము నంతనూ ఆపోశనంపట్టే విద్యా వ్యాసంగమును ఆయన ప్రారంభించారు. ఏ పని తలపెట్టినా అందు అనన్యైకాగ్రనిష్ఠ ఆయన సహజ లక్షణం. సునిశితమైన బుద్ధి బలమే కాక, సుగంభీరమైన హృదయ భావావేశం, మహోన్నతమైన బోధ స్ఫూర్తి కలిగినవాడు కావడంచేత ఆయనకు యీ వ్యాసంగ మొక మహోల్బణమై వెల్లివిరిసింది. భారతదేశానికి రాకముందూ, వచ్చినతరువాతా కూడా మహోత్కృష్ట భావనా విశిష్ట వర్ణనలతో ఆయన ఎడనెడ రచిస్తూవచ్చిన కవితా రచనలే ఆయనలో తేజోరిల్లుతూ వుండిన అసాధారణ ప్రతిభా విశేషమునకు నిదర్శనాలు. భారత సనాతన ధర్మపు పరమ గంభీర మహనీయ స్వరూపం ఇప్పు డాయనకు బాగుగా పొడగట్టినది. కాని, దేశోద్ధరణముకోసమై బ్రహ్మతేజోబలం సంపాదించవలెనన్న చిన్ననాటి కోర్కె యింకా తీరని కోర్కెగానే ఉండిపోయింది. అది సాధించడంకోసమే ఆయన 1904 లో ముప్పది రెండేండ్ల వయస్సున యోగసాధనను ప్రారంభించారు.

దీనికిముందు మూడేండ్లక్రిందటే మృణాళినీదేవితో ఆయనకు వివాహమయింది. కాని ఆయనతో ఆమె కాపురం చేసినది అత్యల్పకాలం. దీర్ఘకాలం పుట్టింటనే గడపవలసిన పరిస్థితు లామెకు ఏర్పడ్డాయి. తీవ్రమైన మార్పు లీ సమయమున శ్రీ అరవిందునిలో రావడం మొదలు పెట్టాయి. తోటి దేశ ప్రజానీకం దుర్భర దారిద్ర్యంలో దొప్పదోగుతూ వుండగా సాంసారిక సుఖ భోగాలలో తేలియాడుటయం దాయనలో ఆసక్తి బొత్తిగా హరించిపోయింది. సామాన్యునివలెనే భావిస్తూ, అవసరమైనంత మేరకే తన కొరకు ఖర్చు పెట్టుకుంటూ, తక్కిన తన ఆర్జనమంతా దేశప్రజాక్షేమం కోసమై వినియోగించవలెనన్న తహతహ బయలుదేరింది. అవసరమునుమించి ఇన్నాళ్లూ తన సుఖాలకై ఖర్చు పెట్టుతున్నదంతా గీతలో భగవానుడు చెప్పినట్లు, దొంగతనంగా స్ఫురించి, ఆ వెనుకటి జీవన పద్ధతిపై రోత పుట్టగా, ఇకముం దట్లు జరగరాదని నిశ్చయించుకొన్నాడు. దేశమాత అస్వతంత్రావస్థ తలచుకొన్న కొలదీ ఆయనకు పిచ్చి

యొత్తుతున్నట్లయింది. తల్లిరొమ్ముపై ఎవడైనా ఎక్కి కూర్చుండి ఆమె రక్తపానం చేస్తుంటే కుమారుడేమి చెయ్యాలి! విశ్రాంతగా మృష్టాన్నములు భుజిస్తూ భార్యతో భోగా లనుభవించగలడా? తన భార్యకు వ్రాసిన ఉత్తరంలో ఈ ప్రశ్ననే వేసి ఆయన తన హృదయావేదనను వెల్లడించుకున్నారు.

దేశం కోసమై బ్రహ్మతేజోబలం సంపాదించవలెననే తహతహ ఆయనలో మరొక తీవ్రోత్కంఠను కూడా మేల్కొలిపింది. భగవంతుని సాక్షాత్కారం పొందవలెననేదే ఆ ఉత్కంఠ. ఇదొక ఉన్మాదమై ఆయన నావహించగా దక్షిణేశ్వరంలో శ్రీరామకృష్ణునివలెనే అందుకొరకై తీవ్రసాధనలో నిమగ్నులైనారు. శ్రీరామకృష్ణునివలెనే శ్రీ అరవిందుని సాధన కూడా స్వయం ప్రేరితమూ స్వోపదిష్టమూ ననేది ఇచట మనం గమనించవలసి వున్నది. వివిధ సాధన ప్రక్రియలలో శ్రీ రామకృష్ణునికి గురువులుగా చెప్పబడేవారంతా నిమిత్తమాత్రులనీ పూర్వ సంప్రదాయమును గౌరవించే నిమిత్తం అట్టి వారిని ఆయన గురువులుగా స్వీకరించారనీ విజ్ఞ లోక మెరిగినదే. తన సాధనల కాలంలో తనలోనుంచే ఒక యతీశ్వరుడు త్రిశూలధారియై వెలికివచ్చి వివిధ సాధన ప్రక్రియలన్నీ తనకు బోధిస్తూవుండేవాడనీ, వాటినే తరువాత బ్రాహ్మణి, తోతాపురి మొదలైనవారు తనకు బోధించడం జరిగిందనీ శ్రీ రామకృష్ణులే కాలాంతరమున తన శిష్యులతో వక్కాణించి వున్నారు.

శ్రీ అరవిందులకు కూడా, యోగ సాధనకు ప్రేరణలన్నీ ఆయనలోపలనుండియే వచ్చాయి. ఆయన తనకు తానే గురువు. ప్రాణాయామప్రక్రియను మాత్రం నర్మదాతీరవాసియు సుప్రసిద్ధ బ్రహ్మానందుల శిష్యుడనునగు దేవధర్ అను ఇంజనీరు వద్ద తెలుసుకొని అభ్యాసం మొదలుపెట్టారు. ఉదయం మూడు గంటలు, సాయంకాలం రెండు మూడు గంటలు సాధన చేస్తూవుండేవారు. ప్రాణాయామంవలన శరీరారోగ్యమూ, శక్తి వృద్ధిపొందినవనీ, మేధాశక్తి ఇనుమడించినదనీ ఆయన కాలాంతరమున తెలియజేశారు. పూర్వం కవితా రచన రెండు వందల పంక్తులు చెయ్యడానికి నెలరోజులు పట్టగా, ప్రాణాయామాభ్యాస ఫలితంగా ఇప్పుడు ఒక్క అరగంటలోనే ఏకధాటిగా చేయుగల శక్తి అలవడింది. మనస్సులోనే రచననంతా పూర్తిచేసి పిమ్మట కాగితంపై పెట్టడానికి కూర్చోగా క్రమం తప్పకుండా అంతా వడిగా వ్రాయగల ధారణాశక్తి కూడా పెంపొందింది. కాని, ఇంతకుమించి ఆధ్యాత్మికంగా కలిగిన ప్రయోజనమేమీ లేదనీ ఆయన గ్రహించిన తరువాత కాలక్రమాన దానిని తమ సాధనలోనుంచి తొలగించి వేసుకొన్నారు.

ఉపనిషత్తులు, గీత—ఇవే ఆయనకు సాధనలో ఉత్సాహం పూరిస్తూ వచ్చిన గ్రంథాలు. అంతర్ బోధ స్ఫూర్తుల కారణంగానూ, శర ప్రయోగమును బోలిన ఏకాగ్రతానిష్ఠ మూలమునను ఈ సాధన అతి వేగంగా, సద్యః ఫలదాయకమవుతూ కొనసాగింది. సనాతన ధర్మ మహత్వం సుప్రత్యక్షంగా అంతరంగమున భాసించింది. భగవంతుని ఇచ్ఛకు అర్పణ చేసుకునే నేర్పు ఆయనకు మొదట్లోనే అలవడింది. యోగ సాధనను ఆయన ప్రారంభించినది దేశోద్ధరణ కోసమైన బ్రహ్మతేజస్సంపాదన నిమిత్తమనేది మనం మరచిపోరాదు. తనకు తాను ముక్తి సాధించుకొనే లక్ష్యమాయనను ఎన్నడూ ఆకర్షించలేదు. పైపెచ్చు, ఆ ధోరణిపట్ల ఆయన పూర్తిగా విముఖుడు. కావుననే, యోగ సాధన కార్యాచరణకు ప్రతిబంధక మగుటకు బదులు ఉత్తేజకం కావాలని ఆశించి, ఆ లక్ష్యంతోనే ఆయన యోగసాధన కొనసాగించారు.

యోగసాధన ప్రారంభించిన రెండు సంవత్సరములకే, దేశ రాజకీయములలో ప్రత్యక్షంగా పాల్గొనవలసిన అవసర మాయనకు ఏర్పడింది. భగవంతుని చేతిలో యంత్రప్రాయంగా ఈ పనులు నిర్వహించడం ఆయనకు కుదిరింది. తనకు స్వతంత్రేచ్ఛ అంటూ ఏమీ లేదు. అంతా భగవదిచ్ఛయే. భగవదిచ్ఛానుసారం పని చెయ్యడం మాత్రమే తన వంతు. భగవంతుని చేతిలో తాను యంత్రమైపోతినన్న యీ పరమ రహస్యమును ఆయన ఒక్క తన భార్యకు మాత్రమే ఒక ఉత్తరంలో తెలియజేసి, దానిని పరమ గోప్యంగా ఉంచవలసినదని కోరారు. భర్తకు భార్య శక్తియనీ, భర్త ఆశయాలతో ఆమె ఏకీభవించి సహధర్మచారిణియై ప్రోత్సహిస్తూవుంటే అతని శక్తి ఇనుమడించగలదనీ ఆయన ఆశయం. ఈ కోర్కెతోనే ఆయన భార్యకు అనేక విధములుగా బోధించి, ఆమెను తన మార్గంలో ప్రవేశపెట్టుకొని తనవెంట నడిపించుకొని పోవాలని ఎంతగానో అభిలషించారు. కాని, దైవ నిర్ణయం వేరయింది. దైవాదేశానుసారంగా ఆయన రాజకీయరంగమునే వీడి మరొక మహత్కార్య సాధనకై పుదుచ్చేరి చేరుకొనవలసి రావడం, భర్తను చేరుకొనడానికి అనుమతిని పొంది 1918 లో పుదుచ్చేరికి పయనం కట్టి ఆమె సిద్ధమైన తరుణంలో ఇన్‌ఫ్లూయెంజా జ్వరంవలన ఆమె మరణించడం సంభవించినది. అది ఒక ప్రత్యేక గాథ.

కలకత్తాలో జాతీయ కళాశాల పదవి నంగీకరించి, 'వందే మాతరం', 'యుగాంతర' పత్రికలకు వ్యాసాలు వ్రాస్తూ, భారత జాతీయ కాంగ్రెసులోని మితవాద ధోరణులకు వ్యతిరేకంగా తీవ్ర జాతీయ వాద నాయకులలో ముఖ్యులై జాతీయవాద శక్తులను కూడగట్టే మహాసంరంభమున మునిగివున్న సందర్భమున కూడా శ్రీ అరవిందుల యోగ సాధన సాగుతూనే వచ్చింది. సూరతు కాంగ్రెసు విచ్ఛిత్తి అనంతరం ఆయన కార్యభారం మరింత పెరిగింది. ఇంతలో సాధనయం దొకవిధమైన స్తబ్ధత్వం ఏర్పడగా, తన పశ్చిమ భారత పర్యటన సందర్భంలో బరోడా నగరమున విష్ణు భాస్కర లేలే అను మహారాష్ట్ర యోగితో సంప్రతించారు. లేలే సలహాలు శ్రీ అరవిందుల ఆధ్యాత్మిక సాధనలో క్రొత్త అనుభవాలకు దారి తీశాయి.

ధ్యానమునకు కూర్చున్నప్పుడు, దేనిని గురించియు ధ్యానించక, మనస్సును నిశ్చలపరచి ఖాళీగా వుంచి, మనస్సులోకి ఏది వచ్చినా బయటికి త్రోసివేయవలసిందని సలహా యిచ్చాడు, లేలే. ఈ పని శ్రీ అరవిందులు అవలీలగా సాధించడం ఆయనకు

ఆశ్చర్యం కలుగజేసింది. కాని, యీ సాధన పర్యవసానంగా శ్రీ అరవిందులకు అక్షర పరబ్రహ్మ సాక్షాత్కారమయింది. అందుకని ప్రశాంతి హృదయంలో నిండుకొన్నది. ప్రపంచంలోని వస్తువులన్నీ తెరవెనుకది పట్టే బొమ్మలుగా కనిపించసాగాయి. ఇది అద్వైత వేదాంతానుభవం. నిష్క్రియత్వానికి దారితీసే యీ అనుభవం అరవిందులు వాంఛించినదికాదు. లేలే యోగి వూహించినదియు కాదు. అంతట, ఈ చిక్కులోనుంచి బయటపడే నిమిత్తం అంతర్యామియైన యీశ్వరునకు సాధన యావత్తూ సమర్పించుకొని ఆయన ఆదేశం చూడవలసినదిగా లేలే మరల ఉపదేశించాడు. శ్రీ అరవిందు లప్పటి యొనర్చి ఇక తరువాత తన సమస్త సాధనలకు ఆ అంతర్యామినే గురువుగా చేకొన్నారు. లేలే ఉపదేశం వలన, బహిరంగ సభలందు మనస్సుతో పని లేకుండా మనస్సు కతీతమైన స్థాయిలోంచి ప్రసంగించడం కూడా ఆయనకు కుదిరింది. బొంబాయి, పూనా, నాసిక్, అమరావతి మొదలైన నగరాలలో పర్యటన సందర్భాన ఆయన ఉపన్యాసములన్నీ ఈ స్థాయిలోనుంచే జరిగాయి.

లేలే యోగితో శ్రీ అరవిందుల సాంగత్యం ఎంతోకాలం సాగలేదు. రెండు మూడు నెలలకే అది ముగియవలసి వచ్చింది. ఏలనంటే, విప్లవకారులకు యోగ శిక్షణ యిచ్చే విషయమున సంప్రతించుటకై లేలేను కలకత్తాకు ఆహ్వానించచూసినప్పుడు, ఇది భగవదాదేశంగా కనిపించడం లేదనీ అరవిందుడు ఈశ్వర శక్తికి గాక అసురశక్తికి వశుడైనట్లు కనిపిస్తున్నదనీ, అట్టి సందర్భంలో ఆయన యోగ సాధన విషయమున తానిక బాధ్యత వహింపజాలననీ, లేలే చెప్పివేయడంతో అతని కా బాధ్యతను తప్పించివేసి, తన అంతర్యామిపై తాను ఆధారపడుటకే శ్రీ అరవిందు లిటుపై నిశ్చయించుకొన్నారు. విప్లవకారులకు యోగ శిక్షణ నిప్పించే ఉద్దేశం తరువాత విరమించుకోబడింది. పిమ్మట కొలది కాలానికే, ఆలీపూరు బాంబు కేసు సందర్భమున శ్రీ అరవిందులు అరెస్టయి సుమారొక సంవత్సర కాలం ఆలీపూరు జెయిలులో గడపవలసి రావడంతో ఆయన సాధన మరొక కొత్త భూమిక నధిరోహించింది.

ఈ అరెస్టుకు నెల రోజుల క్రితమే ఏకాంతవాసమునకు పోవలసినదిగా శ్రీ అరవిందులకు అంతర్యామినుండి ఆదేశం వచ్చింది. కాని, అది ఆయన అంతగా పట్టించుకొనలేదు. ఆ ఆదేశోల్లంఘన ఫలితమే ఈ అరెస్టు కావచ్చు. ఏమైనప్పటికీ, బలాత్కారముగ విశ్రాంతి నిచ్చి సాధనలో ఆయనను మరొక మెట్టు పైకి ఎక్కించాలని దైవం సంకల్పించింది. అదియే సర్వమునూ వాసుదేవమయంగా చూచే దివ్య సాక్షాత్కారం. తన సాధన ప్రగతిని భగవంతుని చేతులలోనికే అర్పించుకొన్నవాడుకావడంచేత తోటి ఖైదీల మధ్య రద్దీలో రోజులు గడపవలసివచ్చినా కూడ అది ఆయన యోగసాధనకు అంతరాయం కాలేదు. జైలులో కలిగిన సాక్షాత్కారాన్ని ఆయన తన విడుదల అనంతరం ఉత్తరపరా ఉపన్యాసంలో విశదంగా వివరించారు. పరమాణలు మొదలు క్రొత్తగా పుట్టిన నక్షత్రం వరకూ, ప్రప్రథమ జీవకణం లగాయతు నూతనంగా జన్మించిన మానవ శిశువు వరకూ సమస్తమూ కృష్ణమయంగా దర్శనమయింది. నిర్గుణ నిరాకార అక్షర పురుషుడు, సగుణ సాకార క్షర పురుషుడే కాక, ఉభయులకూ అతీతుడై వెలయు పురుషోత్తమ సాక్షాత్కార మది.

ఎత్తయిన జైలు గోడలు తనను బందీ చేస్తున్నట్లుగా ఇప్పు డాయనకు కనిపించలేదు. వాసుదేవుడే తనను చుట్టుకొని వున్నట్లుగా కనిపించింది. జైలుగది ఎదుటనున్న చెట్టుక్రింద నడుస్తున్నప్పుడు, అది చెట్టుగా కనిపించలేదు. వాసుదేవుడే అచట నిలువబడి తనకు నీడ నిస్తున్న ట్లగుపడింది. జైలు కటకటాలు కటకటాలుగా గాక, వాసుదేవుడే తనను కాపాడడానికి కావలి ఉన్నట్లుగా గోచరించాయి. పడుకోడానికీ, కప్పుకోడానికీ తనకు ఇవ్వబడిన ముతకకంబళ్లలో వాసుదేవుని కరస్పర్శను ఆయన అనుభవించారు. జైలులోని చోరులను, హంతకులను, వంచకులను చూచినప్పుడు, ఆ తమోమయాత్ములు, కళంకిత శరీరాలలో కూడా వాసుదేవుడే కనిపించాడు. ఆయన సంశయములన్నీ పటాపంచలై పోయాయి. తన నిర్బంధం భగవత్కార్యమునకు అంతరాయముగా భావించుటచే ఆయన విశ్వాసం మొదట్లో చలించింది. కాని మూడు రోజుల అనంతరం 'వేచి చూడు' అనే వాణి ఆయనకు వినిపించింది. ఆ వేచి చూచినదానిఫలితమే యీ దివ్య సాక్షాత్కారం.

సామాన్య సాధకులైతే ఈ సాక్షాత్కారంతోనే తమ జన్మ సాఫల్యం సిద్ధించినదనీ, ఇక సాధించవలసినది లేదనీ అనుకొని వుండేవారు. శ్రీ అరవిందుల సాధన ఆయన చేతులలో లేదు. ఆయన సర్వసమర్పణం చేసుకొన్న భగవంతుని చేతులలో ఉన్నది. భగవంతు డాయనకు వేరొక పని నిర్దేశించి ఉంచాడు. ఈ 'వాసుదేవస్పర్శ' మనే సాక్షాత్కారం ఆ మహత్కార్య సాధన కొక సోపానం వంటిది మాత్రమే. లోకాని కొక నూతన లక్ష్యాన్నీ, నూతన సాధనాప్రణాళికనూ ప్రకటించి ఆచరణ పూర్వకముగ మార్గదర్శకుడై ఆయన వెలయవలసి వున్నది. దానికి బీజారోపణం కూడా ఈ కారాగారవాస కాలంలోనే జరిగింది. ఏలనంటే ఏ అతిమానస విజ్ఞానం పృథ్వీ జీవనంలోనికి అవతరించనున్నదని ఆయన మున్ముందు ప్రవచించనున్నారో దాని రూపురేఖలు కొంతవర కాయనకు ఇచటనే గోచరించాయి. అప్పటికి ఆరు సంవత్సరాల క్రితం మహాసమాధి నొందిన వివేకానందస్వామివాణి కొన్ని రోజులపాటు వరుసగా తనకు వినిపిస్తూ, ఈ అతిమానసమును గురించిన నిర్దేశం చేస్తూ వచ్చినదనీ, ఆయన సన్నిధి తనకు స్పష్టంగా స్ఫురిస్తూ వచ్చినదనీ, ఆయన కాలాంతరంలో వివరించారు. ఆ అతిమానస విజ్ఞానమునకు తాను పెట్టిన Supermind అనే పేరు వివేకానందులు స్వయంగా ఉపయోగించకపోయినా దాని లక్షణం ఇది, ఇది అంటూ నిర్దేశించడం జరిగిందనీ, తాను చెప్పవలసినదంతా చెప్పడం పూర్తి అయిన పిమ్మట ఆ వాణి ఇక వినిపించడ మాగిపోయినదనీ శ్రీ అరవిందులు తెలియజేశారు.

జైలునుండి విడుదలైన పిమ్మట ఒక సంవత్సరంపాటు ఆయన ఇంకా రాజకీయక్షేత్రంలోనే వుంటూ 'కర్మయోగి' అనే ఇంగ్లీషు పత్రికనూ, 'ధర్మ' అనే బెంగాలీ పత్రికనూ నడుపుతూ వచ్చినా, అందలి వ్రాతల స్వరూపం పూర్తిగా మారిపోయి వినూత్నమైన ఆధ్యాత్మిక తేజస్సును విరజిమ్ముకొన్నది. రాజకీయాలనుండి ఆయన విరమించనున్న సూచన ప్రచ్ఛన్నంగా 'దేశీయులకు బహిరంగ లేఖ' అను దానిలో ఆరు నెలల ముందుగానే కనిపించి, స్వరాజ్యసమరం కొనసాగించగల నాయకుడు భగవన్నిర్దిష్టుడై రాగలడనీ, నేషనలిస్టు పార్టీ అట్టి నాయకుని రాక కొరకై వేచి ఉండాలనీ అందులో ఆయన హెచ్చరించారు. ఆ భగవన్నిర్దిష్టుడు తాను కాదని ఆయనకు స్పష్టంగా తెలిసిపోయింది. తనకు వేరే పనిని భగవంతుడు నిర్దేశించాడు. పరిస్థితి ఇట్లుండగా, అరెస్టుకు భయపడి ఆయన దేశంనుంచి పారిపోయారనుకోడం ఎంత అవివేకం! భగవంతుని చేతిలో ఆయన ఉపకరణం. యంత్రప్రాయంగా ఆడించబడినట్లు తాను ఆడవలసిన వాడు మాత్రమే.

కావున భగవన్నిర్దేశానుసారంగానే 1910 లో ఆయన కార్యస్థానం పుదుచ్చేరికి మారింది. రాజకీయాలను పూర్తిగా వదలివేశారు. ఇప్పుడాయన కార్యం అలీపూరు జైలులో తనకు సూచితమైన అతిమానసవిజ్ఞానావతరణమును గురించిన సందేశమును చాటి, తత్సాధనకు అవసరమైన పూర్ణయోగ స్వరూపమును తీర్చి దిద్దడమే. అసహాయశూరుడై ఇక ఆయన ఆ కార్యక్రమంలో నిమగ్నులైనారు. పుదుచ్చేరి చేరిన తరువాత మొదటి నాలుగు సంవత్సరాలూ పూర్ణయోగ సాధన ననుష్ఠిస్తూ దానికి రూపురేఖలు దిద్దడంలోనే గడిపారు. ఇంతలో పాల్ రిచర్డ్సు, మీరా రిచర్డ్ దంపతుల పరిచయమై, వారి ఆర్థిక సహకారంతో 'ఆర్య' అనే తాత్వికమాస పత్రికను ప్రచురించ యేర్పాటు జరగడం సంభవించింది. అది 1914 వ సంవత్సరం. 'ఆర్య' పత్రికాప్రారంభానంతరం కొంతకాలానికి ప్రథమ ప్రపంచ సంగ్రామం సంప్రాప్తంకాగా, ఫ్రెంచిప్రభుత్వపు ఆదేశమున రిచర్డ్సు దంపతులు ఫ్రాన్సుకు వెడలిపోవలసి వచ్చింది. కాని 'ఆర్య' ప్రచురణ మాత్రం ఆగిపోలేదు. శ్రీ అరవిందులే అందలి వ్యాసములన్నీ తానే రచిస్తూ ఆరున్నర సంవత్సరాలు దానిని అవిచ్ఛిన్నంగా నడిపి, ఒక్క యోగ విషయముననేకాక ఇంకా పెక్కు విద్యా విషయములపై క్రొత్త వెలుగులను ప్రసరింపజేస్తూ పరమాశ్చర్యకరమైన వాఙ్మయ సృష్టి విధాతయై విరాజిల్లినారు.

అచ్చులో అరువది నాల్గు పేజీలను నింపగల వివిధ వ్యాసరాజములను ప్రతినెలా పత్రికకు అందించడానికై ఆయన ఎంత మాత్రమూ శ్రమపడలేదన్నది ఇచట మనం గమనించవలసి వున్నది. కాగితముపై కలము పెట్టుటయే తడవుగా లేక టైప్ రైటర్‌పై వేళ్ళు వేయుట తడవుగా వాక్యములు వాటంతటవియే దొర్లుకుంటూ వచ్చేసేవి. అవి పైనుంచి ఎవరో వ్రాయించినవిగాని తాను వ్రాసినవి కావు. క్రొత్తగా ఆలోచించి వ్రాయవలసిన పని ఆయనకు ఏమీ లేదు. వాగ్రూపం ధరించవలసిన విషయ దర్శనమంతా ఆయనకు అంతకు పూర్వమే యోగసాధనానుభూతుల సందర్భంలో అయింది. అవి యోగ దృష్టితో, దివ్యానుభూతులను పురస్కరించుకొని వ్రాసిన వ్రాతలుగాని బుద్ధితో ఊహాకల్పనచేసి వ్రాసినవి కావు. మొదట ఋషియై దర్శించి పిమ్మట మనీషిగా ఆదర్శనములను ఆయన వివరించారు. కాని, ఆయన మనీషలో కూడా భావచిత్రణలతో కూడిన కవితా వైభవమే వెల్లి విరుస్తూ వుంటుంది.

1920 లో మీరా రిచర్డ్సు ఫ్రాన్సునుంచి పుదుచ్చేరికి తిరిగివచ్చి శ్రీ అరవిందునికి సహకారిణిగ అచటనే నిలిచిపోవడంతో ఆయన సాధన చరిత్రయందు నూతనాధ్యాయం ప్రారంభమయింది. చిన్ననాటినుండియే గొప్ప ఆధ్యాత్మికానుభూతులను పొందుతూ వచ్చిన జీవిత మామెది. శ్రీ అరవిందుల నామె చూడక మునుపే దివ్యస్వప్నములం దాయన తనకు గోచరించి సాధన మార్గములు తన కుపదేశిస్తున్నట్లామెకు అనుభూతమవుతూ వచ్చింది. పుదుచ్చేరిలో శ్రీ అరవిందులను చూచుటతోడనే ఆమె తన ఆంతరంగిక గురువును పోల్చుకున్నది. ఆయన జీవిత సందేశ వ్యాప్తికి ఆయన శక్తిగా కార్యకర్త్రియై విలసిల్లుటకు భగవన్నిర్దిష్టురాలు ఈమెయే అని తరువాత చరిత్ర రుజువు చేసింది. ఏలయన, ఆమె రానంతవరకూ అచట ఆశ్రమమని చెప్పుకోదగినదియే లేదు. తగిన జీవన సౌకర్యములు సైతం శ్రీ అరవిందులకు అమరియుండలేదు. ఈమె వచ్చుటయే తడవుగా అవి అన్నియు ఒనగూర్చుట కామె శ్రద్ధ వహించింది. అచిరకాలంలో ఆశ్రమ వ్యవస్థ కూడ ఆమె అసాధారణ ప్రజ్ఞా విశేషములచేత పెంపొందినదే.

అన్నిటికంటె ముఖ్యంగా యోగ సాధనలో సైతం ఆమె ఆయనకు తోడ్పడగల శక్తి సంపన్నురాలయింది. ముఖ్యంగా సాధనలో శిష్యులకు తోడ్పడే ఉపాయం మొదట్లో తనకు కుదరలేదనీ ఆమె వలననే తానా మెలకువ నేర్చుకున్నాననీ శ్రీ అరవిందులే ఒక సందర్భంలో వక్కాణించివున్నారు. యోగసాధనలో బయటి సహాయం విష్ణు భాస్కర లెలే తరువాత ఆమె నుంచియే తాను పొందినట్లాయన ప్రకటించుకొనటం, యోగసాధనలో ఆమె అందుకొన్న ఉన్నత స్థాయికి సూచకం. 'మదర్'—'శ్రీమాత' అను పేరు ఆమెకు రూఢమైపోయింది. శిష్యులేకాదు. శ్రీ అరవిందులామెను గురించి పేర్కొనవలసి వచ్చినా 'మదర్' అనియే పేర్కొనేవారు. ఆయన సాధనలో ఒకానొక సిద్ధి దినముగా పరిగణించబడే 1926 నవంబరు 24 తరువాత ఆయన పూర్తిగా ఏకాంతవాసము లోనికి వెడలిపోయిన తరువాత శిష్యులకూ, ఆయనకూ అనుసంధాన కర్త్రి ఆమెయే. సంవత్సరమునకు మూడు నాలుగు దినములందు మాత్రమే శిష్యులకూ, తదితరులకు దర్శనమిస్తూ తక్కిన రోజుల్లో సాధన విషయమున శిష్యులు వ్రాసిన ఉత్తరాలకు సమాధానములు వ్రాయడంలో రోజుకు ఒక్కొక్కసారి పది గంటలు కూడ వెచ్చించి 1938 వరకూ ఆయన చేసిన రచన పూర్ణయోగ సాధకులకు ఒక పెన్నిధిగా తరువాత రూపొందినది. శ్రీమాతయు, తానును ఒక్కటే అని ఒకానొక లేఖలో ఆయన వక్కాణించడం గమనించదగినది.

సిద్ధిదినంగా ప్రకటించబడిన 1926 నవంబరు 24 ప్రాముఖ్యం ఇచట వివరించవలసి వున్నది. అతి మానస చేతనను క్రిందికి గొనితెచ్చుటకదా శ్రీ అరవిందుల యోగ సాధనలక్ష్యము. అతిమానసమును సాక్షాత్కరించుకొనవచ్చునేతప్ప దానిని క్రిందికి గొనితెచ్చుట సాధ్యమా అనే సంశయం లోకంలో ఉన్నది. అది సాధ్యమేనని విశ్వగతిలోని క్రమ వికాసం ఆ లక్ష్యం వైపునకే అని శ్రీ అరవిందులు చాటుతున్నారు. ఆ శుభావతరణను సన్నిహితం చెయ్యడానికే తమ పూర్ణయోగసాధన యని కూడా వక్కాణించి వున్నారు. మనోభూమికకుపైన అతిమానస భూమికకు దిగువ, ఆధ్యాత్మిక భూమికలు కొన్ని ఉన్నవి. వీని నన్నింటినీ దాటిన గాని అతిమానసభూమికకు చేరుకొనజాలము. అతిమానసము (uper Mind)నకు క్రింది మెట్టులోనిదే, అధిమానస(Overmind) మను భూమిక. అజ్ఞానరహితమగు తేజో భూమికయే అయినా అతిమానస సత్యతేజః ప్రపూర్ణత్వమిందుండదు— అవిభాజ్యమైన అతిమానససత్యతేజము నిది స్వీకరించి వివిధ రూపములలో దాని విభజనను కొనసాగిస్తుంది. శ్రీ అరవిందుల సాధన ఫలితంగా ఈ అధిమానసం క్రిందికి అవతరించిన దినమే పైన చెప్పిన నవంబరు 24. అధిమానసపు అవతరణంవల్లనే అతిమానసావతరణం సునిశ్చయముగా పరిగణింపబడుచున్నది.

శ్రీ మాతారవిందుల దివ్య పర్యవేక్షణలో ఆశ్రమం కొత్త పద్ధతిని ఒక మహాసంస్థగా విస్తరిల్ల నారంభించినది. బాల బాలికలకు అపూర్వ రీతిలో ఆత్మావబోధక విద్యా శిక్షణ నొసగుటకై అంతర్జాతీయ విద్యా శిక్షణ కేంద్ర మొకటికూడ 1947 లో ప్రారంభించబడింది. ఇంతలో భావి క్రమ భారమునంతనూ శ్రీమాతకే వదిలి శ్రీ అరవిందులు 1950 లో శరీర యాత్ర చాలించారు. కాని, కానరాకుండా ఆయన ప్రేరణ ప్రబోధములు ఈ దివ్య లక్ష్య సాధనకు ఉండనే ఉన్నాయి. గడచిన ఇరువది యొక్క సంవత్సరాలలోనూ ఆశ్రమ వ్యవస్థ మరింత వైవిధ్యంతో కూడిన కార్యకలాపాలతో విస్తరిల్లిపోయింది. దైవమునకు శ్రీమాతకు—సర్వార్పణగా సకల కార్యములూ అహంతావిహీనముగ నిర్వర్తించ బడడమే ఇచట కానవచ్చే ప్రవృత్తి లక్షణం. ప్రపంచం లోని సకలసంస్కృతులను ప్రతిబింబిస్తూ, సకల దేశాల వారూ అన్యోన్యం ఆత్మీయభావంతో జీవించుటకు వీలిచ్చే 'అరో విల్' అను అంతర్జాతీయ నగర మొకటి పుదుచ్చేరికి ఆరుమైళ్ల దూరాన సముద్రతీరంలోనే శ్రీమాత పర్యవేక్షణ క్రింద అత్యాధునిక సకలవిధ సదుపాయసమృద్ధితోను త్వరితగతిని నిర్మాణ మవుతూ వున్నది. 1972 శ్రీ అరవిందుల శత వార్షికోత్సవ సంవత్సరమగుటచే ఆయన సందేశ వ్యాప్తికై అనేక కార్యక్రమాలు విస్తృతంగా తలపెట్టబడి కొనసాగింపబడుతున్నాయి.

మాతృ దేశోద్ధరణాభినివేశంతో ప్రారంభమైన శ్రీ అరవిందుల సాధన యీ రీతిగా విశ్వ మానవ దివ్య ప్రగతి సాధన రూపమై విస్తరిల్లింది. దీని కేంద్ర స్థానం భారతమే అయినా పరిధిలో సకలప్రపంచమూ అంతర్భూతం. ప్రాక్పశ్చిమముల యీ సమైక్య లక్ష్యానికి సూచకంగానే శ్రీ మాతారవింద యుగళ మూర్తి కల్పన దైవ నిర్దిష్టమైనదా అనిపిస్తుంది. ప్రాచీన భారతీయ మహర్షుల ఆధ్యాత్మిక దివ్యానుభవ సంపత్తియే శ్రీ అరవిందుల సాధనకు పునాదియైన మాట నిజం. కాని, ఆ పునాది పైననే ఒక వినూత్న మహాద్భుత సౌధ నిర్మాణం ఆయన చేశారు. పృథ్విపై దివ్య మానవ జాతి నిలసిల్లవలెననే లక్ష్యంతో కొనసాగింపబడుచున్న యీ పూర్ణయోగ మొక వినూత్న పంథా యని చెప్పక తప్పదు. అతిమానస జ్యోతిఃశక్తి చైతన్యములు' నేలపైకి ధారావాహికముగా ప్రవహించెననియు, అతిమానసావతరణము తథ్యమనియు ఈ మహాసంఘటన 1956 ఫిబ్రవరి 29 న జరిగెననియు శ్రీమాత వెల్లడించిరి. సర్వమునూ దైవేచ్ఛకు వదలి సమర్పణభావంతో కృషి చేయడమే పూర్ణయోగుల లక్ష్యం కూడ. ముందు రాబోయే కృతయుగ మిట్టి దివ్య మానవులకే స్వాగతం పలుకుతుందేమో ఎవరు చెప్పగలరు?

చక్రదర్శనం

శ్రీ ఇంద్రగంటి భానుమూర్తి

చక్రం,
బండి, బస్, ట్రైన్, ప్లేన్ చక్రం—
గిరగిర, జరజర, గిర గిర, జర జర
బండిదాటి, బస్, ట్రైన్‌దాటి, ప్లేన్‌దాటి
ఆగకుండా పరిగెడుతూ,
అంతకంతకీ వేగంతో పరిగెడుతూ,
అశ్వవేగంతో, వాయువేగంతో,
శబ్దవేగంతో, మనోవేగవేగంతో పరిగెడుతూ,
చక్రం—
దూరంగా, దూరదూరంగా, సుదూరంగా,
చెట్లూ, చేమలూ, పుట్టలూ గుట్టలూ అన్నీ
పచ్చగా, పచ్చపచ్చగా ఒకే ఒక్క ఆకుపచ్చగా,
వెనక్కి వెనక్కి జరిగి చెరిగి పోతూవుంటే,
ముందు ముందుకి దూసుకొంటూ పోతూ చక్రం—

* * *

అరణ్యాలు,
అరణ్యాల మధ్య లీలగా చెట్లచాటున అడివి మనుషులూ
మైదానాలు,
పొలాలు, పచ్చనిపట్లు, పిటికగట్లు,
బర్రెల్, గొర్రెల్, గొల్లల్, గోవులు,
గొల్లల చేతుల్లో పిల్లంగోవులు,
పిల్లంగోవుల్లో వినిపించని పల్లెగీతాలు—
నగరాలు,
ఉత్తుంగ సౌధసౌధాలు, విద్యుద్దీపములు,
మనుషులు, మనుషులు, హడావిడి, రద్దీ

రోడ్లమీదా, గుండెలమీదా, యంత్రంమీదా—
ఎక్కడో పొలిమేరల్లో బిక్కుబిక్కుమంటూ
బెంగగా విచ్చిపోయి! నిశ్శబ్దం—
'విధి' చేతుల్లో గిర్రున తిరిగే అందమైన కాగితం పువ్వులు (ఇవి)

ఎడారులు,
ఎడారుల్లో బజారులు, గుడారాలు
ఆకాశాన్ని, ఇసకని విడదీస్తూ
సరిహద్దుగీతల్లా సాగుతూ సన్నగా ఒంటెల బారులు—
వెనక్కి, వెనక్కి జరిగిపోతూవుంటే
ముందు ముందుకి దూసుకుంటూ పోతూ చక్రం
హరప్పా, మొహంజదారో, సుమేరియన్, ఈజిప్షియన్
నాగరికతలు, గుప్తస్వర్ణయుగం, గాంధార
శిల్పం, గోపురాలు, కోటలు, మాణిక్యకిరీటాలు,
వజ్రసౌందర్యాలు, మహానగరాలు పగిలిపోయిన
అద్దాలై, అద్దాల ముక్కలై కూలిపోయి,
భూమికింద మూసుకుపోయి,
వెనక్కి వెనక్కి జరిగి చెరిగిపోతూ వుంటే
ముందు ముందుకి దూసుకొంటూ పోతూ చక్రం—

గిర గిర జర జర
గిర గిర జర జర
నిరంతరం దీని గమనం
నిత్య సత్యం దీని గమనం

తెల్లని పగళ్లూ, నల్లని రాత్రిళ్లూ, నాళ్లూ, నెళ్లూ
ఈ చక్రపు జాడలు, ఈ చక్రపు నీడలు—

వసంతహాసం, వర్షామానం,
మంచుజీరా, వెన్నెల చారా
ఈ చక్రపు సన్నని గీతలు—

* * *

ఈ చక్రం ఎన్నడూ ఆగదు—
ఈ చక్రం ఎప్పుడూ వెనక్కి సాగదు—
కాని,

ఒక మహాత్ముని ఊపిరి ఆగిపోయి
ప్రపంచపు నానా విచిత్ర స్వర సంకుల సంగీతమూ
చటుక్కున నిలిచిపోయినప్పుడూ,
శిశిరాన్నీ వసంతాన్నీ కలిపే కాంతి తంతువు కనిపించనప్పుడూ,
విశ్వ సంస్పందనం ఎక్కడో లయతప్పినప్పుడూ,
చక్రం హఠాత్తుగా ఆగిపోయినట్టనిపిస్తుంది—
ఠక్కున నిలిచిపోయినట్టు కనిపిస్తుంది—

* * *

అనంతానంత భావదీప్తి దీన్ని చుట్టుకొని,
అనంత ప్రాణికోటి ప్రాణశక్తి దీన్ని అంటుకొని,
వలయ, వలయ, వలయ చలనంలో,
లయతప్పని గమనంలో,
మునుముందుకు సాగుతూనే ఉంటుంది—
ప్రస్ఫురత్ భావవలయ జాలం సృజించి,
మానవ చైతన్య ప్రపంచం కదిలించి,
నిరంతర సంక్షుబ్ధ భావ సంఘర్షణల్లోంచి
ప్రపంచాలు తీర్చి, ప్రపంచాలు కూల్చి
తాను మనిషిని వెంటాడుతూ, తనను మనిషి వెన్నంటుతూంటే
ముందుకు మునుముందుకు సాగుతూనే ఉంటుంది—
ప్రణయం, ప్రలయం—మహావలయం!
డబ్బు, జబ్బు—కన్నీటి మబ్బు!
స్వార్థం, పరార్థం—అదృశ్య పరమార్థం!
మంచి, చెడు—చెడుగుడు!
సమత్వం, అసమత్వం-అంతస్తత్వం ??
ఫ్యూడలిజం, కేపిటలిజం, కమ్యూనిజం, కాన్యానలిజం,
సోషలిజం, ఇజం, ఇజం, ఇజమ్
ఇది సప్తవర్ణరోచిర్విచిత్ర చక్రం, నిర్వక్రం—
గిరగిర, జరజర, గిరగిర, జరజర,
ఆగకుండా, వెనక్కి చూడకుండా
ముందుకు మునుముందుకు సాగుతూనే ఉంటుంది—

* * *

గతం ఎంత గొప్పది కానీ చివరికి చీకట్లోకే వెళుతుంది—
చిన్నదైనా పెద్దదైనా వెలుగు ఎప్పుడూ
రేపటి బాటవిగాదే వాలుతుంది—

విచారించకు,
ఈ చక్రమార్గంలో మళ్ళా, మళ్ళా
క్రొంగ్రొత్త ఉదయం తగులుతుంది తప్పదు—
విచారించకు,
ఏ నిశాత భావ హేతి హతికో
తమస్సు తెగిపడు చోటికే
ఈ చక్రం చేరుతుంది తప్పదు—



ఆంధ్రవాఙ్మయంలో చరిత్రాత్మక నవల

శ్రీ పి. గణపతి శాస్త్రి

ఆంధ్ర వాఙ్మయంలో చరిత్రాత్మక నవల అనగానే ఇంచుమించుగా వీరేశలింగం యుగంలోను, ఆటుపిమ్మట వెలువడిన 'విమలాదేవి', 'రాణీ సంయుక్త' వంటి చారిత్రిక నవలలు కొన్ని జ్ఞాపకం వస్తాయి. నిజానికి వీరేశలింగయుగంలోనే మన నవలా రచన కంకురార్పణ జరిగింది. అదే సమయంలో మన చరిత్రాత్మక నవల రచన కూడా ప్రారంభమయింది. విజ్ఞానచంద్రికా గ్రంథమండలివంటి సంస్థలు కొన్ని బహుమతులందించి, ఇటువంటి నవలల రచన కెంతయినా ప్రోత్సాహం కలిగించాయి. అవి మన జాతీయ పునరుజ్జీవనంకోసం బహుమార్గాలలో గట్టి పునాదుల నిర్మాణా లారంభించిన రోజులు.

'నవలా' అన్న అచ్చ తెనుగుపదంలోనించే 'నవల'చ అన్న పేరు బయలుదేరిందని కొందరు ఊహిస్తున్నారుగాని, అది సరికాదు. 'నోవల్' అన్న ఆంగ్లభాషాపదంలోనించే నవల అన్న మాట పుట్టింది. అంతేకాదు. ఆ రోజుల్లో ఆంగ్ల నవల మన నవల ప్రాదుర్భావాని కెంతో చేయూత నిచ్చింది. అనేక విధాల సాంఘిక చరిత్రాత్మక నవలల రచనల కెంతో ప్రోద్బలం కలిగించింది. సర్ వాల్టర్‌స్కాట్, డికెన్స్ మొదలయిన సుప్రసిద్ధాంగ్ల రచయితల చారిత్రిక నవలలు కొన్ని మన చరిత్రాత్మక నవల రచనమీద కొద్దిగానో, గొప్పగానో ముద్ర వేశాయి. అంతేకాదు. పాశ్చాత్య నవలాకారులలో విఖ్యాతులు అలెగ్జాండర్ డ్యూమాస్ వంటి వారి చరిత్రాత్మక నవలల రచనా ధోరణి ప్రభావం కూడా మన చారిత్రిక నవలమీద పడిందని అంగీకరించాలి.

సంస్కృత వాఙ్మయంలో కాదంబరి, దశకుమారచరిత్ర మొదలయినవి కొంతవరకు నవలల వంటివే. కాని ఈ గ్రంథాల ప్రభావం మన చరిత్రాత్మక నవలమీద చాలా స్వల్పము.

చరిత్రాత్మక నవల నిర్వచనం

చరిత్రాత్మక నవల అంటే చరిత్ర కెక్కిన ఆ యా వ్యక్తులను గురించి, ఆ యా సంఘటనలను గురించి, ఆ యా దేశ కాలాల చరిత్రల ననుసరించి చేసిన రచన అని కొంత స్థూలంగా నిర్ణయించవచ్చును. నవలాకారులందరు తమ తమ గడించిన అనుభూతుల పునాదులమీద కొన్ని కల్పనలతో వాస్తవం మేళవించిన పిమ్మటే రచనలు కొనసాగిస్తారు. నిజమే. అంత మాత్రంచేత అవి చరిత్రాత్మక నవలలు కాజాలవు. ఇది చరిత్ర, ఇది నవీనకాలీనత అని నిర్ణయించడానికి ఖచ్చితమయిన సరిహద్దు లేవి లేవు. కాని ఇంచుమించుగా ఒక అర్ధ శతాబ్ది కాలమయినా గడిస్తేనేగాని అది చరిత్ర కాజాలదని కొంత స్థూల దృష్టితో నిర్ణయించుకోవచ్చును. అంతేగాని గతించిన తరానికిగాని, అంతకుముందు కాలానికిగాని సంబంధించిన రచన అయినంతమాత్రాన, అది చరిత్రాత్మక నవల అనిపించుకోవడంలేదు. మొత్తంమీద: బాగా చరిత్ర కెక్కిన కాలానికి సంబంధించిన రచనే చారిత్రిక నవల అవుతున్నది.

వంగనవలానువాదాలు

పాశ్చాత్య నవలా వాఙ్మయం మన చరిత్ర నవల ప్రాదుర్భావానికి బాగా దోహదం కలిగించినా, ఆ రోజుల్లో వంగ నవలానువాదాలు కూడా మన చరిత్రాత్మక నవలమీద గట్టి ముద్ర వేశాయి. ఈ సందర్భంలో ఆంధ్ర ప్రచారిణీ గ్రంథమాలతోబాటు వెంకట పార్వతీశ్వర కవుల నిద్దరిని ముఖ్యంగా పేర్కొనాలి. ఈ కవు లిరువురు ఈ గ్రంథమాలలో సుప్రసిద్ధ వంగ నవలానువాదాలేకాక, స్వతంత్ర చరిత్రాత్మక నవలలు కూడా కొన్ని వెలయించారు. ఇవి ఆ రోజుల్లో పాఠక లోకంలో కొంగ్రొత్త అభిరుచి, సంచలనము రేకెత్తించాయి. వీరి వంగ నవలానువాదాలలో ఆనందమఠము, కపాలకుండల ముఖ్యంగా పేర్కొనదగినవి. స్వతంత్ర చరిత్రాత్మక నవలలో వసుమతీ వసంతము, ప్రమదావనము ఎన్నదగినవి. చిలకమర్తి లక్ష్మీనరసింహకవి కూడా ఈ సందర్భంలో సంస్మరించుకోదగినవారే! ఈయన రచించిన కర్పూరమంజరి, హేమలత మొదలయిన కొన్ని నవలలు ఆనాటి పాఠక లోకాన్ని విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇంకా ఆ రోజుల్లో భారతిలో వెలువడిన కావ్యకంఠ గణపతి ముని పూర్ణ, మొసలి కంటి తిరుమలరావు రచించిన మొగలాయీ దర్బారు, శశాంక నరేంద్రగుప్తుడు, చక్రరేఖ, హేమగిరిదుర్గము మొదలయిన నవలలు కూడా గుర్తించదగినవే. ఇలాగే నాడు, నేడు ఎదురుబదురుగా చరిత్రాత్మక నవలలు కొన్ని వెలువరించిన రచయితలు కొందరున్నారు. అయితే మన చారిత్రిక నవల కొక ఎశి

స్మృతి చేకూర్చిన వారి రచనల పరిశీలనమే ఈ చిన్న వ్యాసం లక్ష్యము. కనక వారినందరిని ఇక్కడ వేర్వేరుగా పేర్కొనడం లేదు.

శ్రీ విశ్వనాథ

ఆపైన మరి కొంతకాలం గడిచిన తరవాత తెలుగు చారిత్రిక నవల ఇంకా కొంత పరిపుష్ట స్వరూపంతో ఎన్నదగిన ఉత్తమ స్థితికి చేరుకున్నది. దీనికి కారణభూతులయిన ముగ్గురు చరిత్ర నవలాకారుల నిక్కడ పేర్కొనాలి. వీరిలో మొదటివారు శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు. రెండవవారు శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు. మూడవవారు స్వర్గీయులు అడివి బాపిరాజుగారు.

వీరిలో శ్రీ విశ్వనాథ తమ అసంఖ్యాక చారిత్రిక నవలలతో తెలుగు వాఙ్మయాని కొక క్రొంగొత్త నవలల సంపత్తి చేకూర్చారు. చాలాకాలం క్రితం వీరు భారతిలో ప్రచురించిన 'ఏకవీర' అలనాటి పాఠక లోకాన్ని ఒక నిరూతన రసానుభూతితో ఉర్రూత లూగించింది. అంతేకాదు. అది నాటికి, నేటికి శ్రీ విశ్వనాథ రచించిన అత్యుత్తమ చరిత్రాత్మక నవలలలో ఎన్నుకోదగిన నవలగా నిలిచింది. 'ఏకవీర' ఒకసారి చదివిన వారు ఆ నవల మాధురి మరిచిపోలేరనుకుంటాను. ఆ తరవాత శ్రీ విశ్వనాథ కండ గలిగిన లేఖినినుండి తేలికగా లెక్క పెట్టలేనన్ని చారిత్రిక నవల లెన్నో వెలువడ్డాయి. ఆ నవల లన్నింటిని గురించి వివరించడానికింకా పెద్ద వ్యాసం వ్రాయవలసి వస్తుంది. అందు చేత ఆ నవలలలో కొన్ని ముఖ్యమయిన వర్గాలను గురించి ధోరణులను గురించి మాత్రమే నే నిక్కడ పేర్కొనగలను.

శ్రీ విశ్వనాథ చరిత్రాత్మక నవలలలో కొన్ని ప్రాచీనార్వాచీనాంధ్ర చరిత్ర ఘట్టాలకు సంబంధించినవి. మరికొన్ని బౌద్ధ యుగానికి చెందినవి. ఇటీవల రచించిన ఇంకా కొన్ని నవలలు, ఆ యా భారతీయ చరిత్ర ఘట్టాలకు, నేపాల దేశ చరిత్రకు సంబంధించినవి. బద్దన్న సేనాని, వీరవల్లడు, ధర్మచక్రము, భ్రమరవాసిని, సంజీవకరణి, దిండుక్రింద పోకచెక్క మొదలయినవి వీరు రచించిన అసంఖ్యాత చరిత్ర నవలలలో కొన్ని మాత్రమే. నిజానికి శ్రీ విశ్వనాథ రచించిన నవల లన్నింటిలోను చరిత్రాత్మక నవలల సంఖ్యే రవంత ఎక్కువ. కనక వీరిని ప్రధానంగా చరిత్ర నవలాకారులనడమే సముచితము.

ఇంతేకాదు. ఈయన రచించిన 'వేయి పడగలు' గడిచిపోయిన మన సాంఘిక వ్యవస్థ వైభవం మహనీయమని, మహోజ్జ్వలమని వేనోళ్ల అభివర్ణిస్తుంది. నిజానికిది అన్ని విధాల సాంఘికమే అయినా, అవలంబించిన దృక్పథాన్నిబట్టి, ధోరణినిబట్టి చూస్తే ఈ నవల ఎన్నదగిన చరిత్రాత్మక నవల అనడమే న్యాయమేమో!

సనాతన ధార్మిక దృక్పథము

విశ్వనాథవారిది ముఖ్యంగా సాంప్రదాయికమయిన సనాతన ధార్మిక దృక్పథము. ఇది వీరి చారిత్రిక నవల లన్నింటిలోనుండి కొద్దిగానో, గొప్పగానో కొట్టవచ్చినట్టు తొంగి చూస్తూనే ఉంటుంది. ఇటువంటి ధర్మోద్ధరణం కోసమే ఈయన దీక్షా కంకణం ధరించినట్లు స్ఫురింప జేయుస్తుంది వీరి నవలల రచనా ధోరణి. అయితే శ్రీ విశ్వనాథ సాంప్రదాయిక ధార్మికదృష్టి నిజంగా సాంప్రదాయికమేనా? అచ్చమయిన హైందవ ధార్మిక దృక్పథమేనా? అన్న ప్రశ్న బయలుదేరుతున్నది.

మన భారతీయ ధార్మిక దృష్టి సువిశాలమయినది. సువిస్తృతమయినది. ఒక్కొక్కప్పుడు ఇది మిక్కిలి అగాధమై అనేక విధాల జటిలంగా పరిణమిస్తున్నది. దీనికివి మాత్రమే కొలత బద్దలని నిర్ణయించడం దుస్సాధ్యము. మన మహా భారతంలో నుండి ఇటువంటి ధార్మిక జటిలతపై ఎన్నయినా ఉదాహరణ లియ్యవచ్చును. కనకనే ధర్మ స్వరూపం మిక్కిలి గహనమన్ని, ధర్మసూక్ష్మం దురవగాహమని మహాభారతం మాటి మాటికి హెచ్చరిస్తున్నది. ఈ ధర్మ జటిలత నిరూపించడమే ఆ మహా సంహిత లక్ష్యమన్నా అది అత్యుక్తి కాజాలదు!

ఇదే సందర్భంలో, రవీంద్రునితో విశ్వనాథవారిని పరిపోల్చి పరిశీలించినప్పుడు, ఆ విశ్వకవి 'గోరా' అన్న నవలలో సువిశాలమయిన భారతీయ ధార్మిక దృక్పథం ధ్వనింపజేస్తున్నాడని మన కిట్టే స్ఫురిస్తుంది.

ఈ దృష్టితో పరిశీలిస్తే, విశ్వనాథవారు మన సనాతన ధార్మిక దృక్పథం తలస్పర్శిగా అవగాహన చేసుకోలేదని, ఈ విషయంలో ఆయన ధోరణి కొంత కుంటుపడిందని, దానితోబాటు కొంత సంకుచితత్వం కూడా దాని కేర్పడిందని నిర్ణయించాలి.

ఇంతేకాదు. మరీ ఇటీవల రచించిన వీరి చరిత్రాత్మక నవలలలో ఆ యా దేశ కాలాల పరిస్థితులే కనిపించవు. పురాణ వైర గ్రంథమాల అన్న శీర్షికలో వెలువడిన చరిత్రాత్మక నవలలలో ఈలోపం మరింత ఎక్కువగా కనిపిస్తుంది. ఆ యా గత కాలాలకు సంబంధించిన కథలచుట్టు, గాథలచుట్టు అల్లిన నవల లయినందువల్లనే ఈ రచనల నన్నింటిని చారిత్రక నవలలని వర్గీకరించాలి. అంతేగాని నిజాని కివి చరిత్రాత్మక రచనలు కానేకావు. ఈ నవలలలో కొన్ని చిత్ర విచిత్రమయిన కాశీ మజిలీ కథల లాగ సాగిపోతాయి.. ఇవి విశేషంగా సామాన్య పాఠకుల నాకర్షించడాని కిదే ప్రధాన కారణమనుకుంటాను. బౌద్ధ ధర్మాన్ని గురించి కూడా విశ్వనాథ వారికి లోతయిన అవగాహనకాని, ఆత్మీయమయిన సానుభూతిగాని ఉన్నట్టు కనబడదు. దిండుక్రింద పోకచెక్కవంటి నవలలు చదువుతూంటే కొంత బౌద్ధ ధర్మ విద్వేషం కూడా విస్పష్టంగా బయటపడుతుంది. ఈయన రచించిన ఇటీవలి పురాణ వైర గ్రంథమాలలోని కొన్ని చరిత్రాత్మక నవలలు మరీ దిగజారిపోతున్నట్టు కనిపిస్తాయి. వీటిలో కొన్ని చదవడం ప్రారంభిస్తే చిట్ట చివరిదాకా నెట్టడమే గగనమయిపోతుంది. అయితే విశ్వనాథవారు రచించిన చారిత్రిక నవలలో అక్కడక్కడ కొన్ని అమూల్య రత్నాలున్నాయన్న సంగతి మాత్రం మనం గుర్తుంచుకోవాలి.

శ్రీ నోరి నరసింహ శాస్త్రి

ఇక మన ప్రముఖ చరిత్రాత్మక నవలా రచయితలలో రెండవవారు శ్రీ నోరి నరసింహశాస్త్రిగారు. వీరు రచించిన నారాయణభట్టు, రుద్రమదేవి, కవి సార్వభౌముడు, మల్లారెడ్డి, కవి ద్వయము, ధూర్జటి అన్న నవల లారు చరిత్రాత్మకాలే! అంతే కాదు. ఇవి ప్రత్యేకించి ఆంధ్రుల చరిత్ర ఆధారంగా మలిచినవి. శ్రీ నరసింహశాస్త్రి ఈ నవలల కాలాలకు సంబంధించిన చరిత్ర లోతుగా పరిశీలించినవారు. అయితే శ్రీ విశ్వనాథలాగే ఈయన కూడా సాంప్రదాయికమయిన ధార్మిక దృష్టి అవలంబించినవారే. కాని ఈయన నవల లన్నిటిలోను చరిత్రాత్మకమయిన వాస్తవికత బాగా విస్పష్టంగా గోచరిస్తుంది. శ్రీ నోరివారి కాకతీయ చరిత్రాత్మక మయిన 'రుద్రమదేవి', ఈయన రచించిన మిగిలిన నవల లన్నింటి కన్న ఎక్కువగా విమర్శకుల మన్నన లందుకున్నది.

శ్రీ విశ్వనాథవారి చారిత్రిక నవలలతోబాటు, శ్రీ నరసింహశాస్త్రిగారి నవలలన్నీ మన పురాతన సంప్రదాయాచారాలు, చరిత్ర, సంస్కృతి మొదలయినవన్నీ మహనీయాలని ధ్వనింపజేసేవే! అయితే స్వాతంత్ర్యానికిముందు, ఆపైన మన దృష్టి ఎక్కువగా చరిత్రతో మన ప్రాచీనమయినదంతా మహనీయమే అని, అటు పాశ్చాత్య భావ ధోరణి, ఆధునిక సంస్కార నైఋరి లోపభూయిష్ఠాలే అని భావించే ఆవేశంతో కొనసాగింది. ఈ నవలా రచయిత లిద్దరిలోను ఈ ఆవేశముద్ర విస్పష్టముగా కనిపిస్తుంది. వీరి చారిత్రిక నవలలలో కూడా ఇదే ధోరణి మాటి మాటికి ప్రతి ధ్వనిస్తూంటుంది. ఇందువల్ల అచ్చమయిన చారిత్రిక వాస్తవికత వీరి నవలలలో కొంతవరకు కొరవడింది.

అడివి బాపిరాజు

ఇక మన ప్రముఖ చరిత్ర నవలాకారులలో స్వర్గీయులు అడివి బాపిరాజుగారు కూడా ప్రధానంగా పరిగణనీయులే. ఈయన రచించిన నవల లన్నింటిలోను హిమబిందు, అడివి శాంతిశ్రీ, గోన గన్నారెడ్డి ఎన్నుకోదగిన చరిత్రాత్మక నవలలు. ఈ రచనలలో మొదటివి రెండు ప్రాచీనాంధ్ర చరిత్ర ఆధారంగా మలిచినవి. ఇక మూడవది మన చరిత్రలో కొంతవరకు రెడ్డి యుగానికి సంబంధించినది. బాపిరాజుగారు ముఖ్యంగా చిత్రకారులు. ఆపైన కథకులు. వీరిది ప్రధానంగా రసమయ దృష్టి. ఇందువల్ల ఈయన నవలలలో ఇవే గుణాలు విస్పష్టంగా ప్రతిబింబిస్తాయి. అంతేగాని ఏవేవో ఆవేశాలుగాని, అభినివేశాలుగాని ప్రధాన భూమికలు స్వీకరించవు. ఆయా వర్ణనలలో, ఘట్టాలలో వ్యక్తులు కొందరు పూర్తిగా స్వాప్నిక జగత్తులోనుండి వెలువడినట్లు భాసిస్తారు. ఈయన నవలలలో భావ దౌర్బల్యం sentimentality పాలెక్కువ. కనకనే ఈయన చరిత్రాత్మక నవలలు మనమీద బలమయిన గట్టి ముద్ర వెయ్యవు. అయినా మన చారిత్రాత్మక నవలల రచనా పరిణతిలో బాపిరాజుగారి నవలల కొక ప్రత్యేక వ్యక్తిత్వ మున్నది. స్థానమున్నది.

వీరేశలింగ యుగంలో మన చరిత్రాత్మక నవల కంకురార్పణ జరిగిందని అనుకున్నాము. చిలకమర్తి వారి నవలలలోగాని, వెంకట పార్వతీశ్వర కవుల నవలలలోగాని మన చరిత్రాత్మక నవల పూర్తిగా రూపుదిద్దుకోలేదు. కథా కథనంలోగాని, ఆయా పాత్రల వ్యక్తిత్వాలలోగాని తగినంత సజీవత, పరిపుష్టి కనిపించవు. ఇవి చారిత్రిక నవలల కొక విధమయిన ప్రారంభాలు మాత్రమే.

ఇక ఆ తరవాత బయలుదేరిన శ్రీ విశ్వనాథ, శ్రీ నరసింహశాస్త్రి, బాపిరాజు మన చరిత్ర నవలకు మరికొంత బలిమి, పరిపుష్టి చేకూర్చారు. వీరేశలింగయుగంలోకన్న మన చారిత్రిక నవలకు మరికొంత ఉత్తమ స్థితి, పరిపుష్టి, గౌరవము కలిగించారు. పాఠకులలోను, విమర్శకులలోను ఇంకా ఎక్కువ ఆసక్తి లోతయిన పరిశీలన రేకెత్తించారు.

అయితే మనకున్న చరిత్రాధారాలు చాలా తక్కువ. ఆ ఆధారాలలోనయినా కొన్ని నేటివరకు వివాదాస్పదాలే. ఇటువంటి పరిస్థితులలో నేటి కాలపు ఆవేశాలతో, అభినివేశాలతో చారిత్రిక నవలా రచన సముచితంకాదు. నిజానికి మన కిప్పుడు అందుబాటులోవున్న చరిత్రాధారాలమీద నవలా రచన చాలా క్లిష్టమయిన వ్యవహారము.

అచ్చమయిన చరిత్రాత్మక నవల రచించాలనుకుంటే, ఆధునిక కాలపు ఆవేశాభినివేశాలు దూర దూరంగా నెట్టివెయ్యాలి. ఆపైన ఆ యా పురాతనకాలాల ఆచార వ్యవహారాలు, సాంఘికార్థికాది పరిస్థితులు ఆ మూలాగ్రంగా అవగాహన చేసుకోవాలి. అన్నింటికన్న ముఖ్యంగా సజీవ చారిత్రిక వ్యక్తులతోబాటు వారి యదార్థ వేష భాషలు, పరిస్థితులు, పరిసరాలు వాస్తవికంగా చిత్రించాలి.

రచయితలకందరికి ఏవేవో బలిష్ఠమయిన ఆదర్శాలు, అభినివేశాలు, ఆశయాలు ఉండి తీరతాయి. చారిత్రిక నవలా రచయిత లెవరయినా అచ్చమయిన భారత జాతీయతా దృష్టి అవలంబించవచ్చును. మరికొందరు మార్క్సిస్టు పంథామీద సాగిపోవచ్చును. ఇంకా కొందరు కేవలం సాంప్రదాయికమయిన సనాతన ధార్మిక దృష్టితోనే చరిత్ర నవలా రచన కుపక్రమించవచ్చును. మరికొందరు కేవలం చారిత్రిక దృక్పథంకాని, ఇంకా వేర్వేరు దృక్పథాలుగాని స్వీకరించవచ్చును.

ఏ దృష్టి అవలంబించినా, ఆ యా ఆదర్శాలు, సిద్ధాంతాలు వల్లె వెయ్యడం మాత్రమే, పట్టి శుష్క ప్రచారం మాత్రమే చరిత్రాత్మక నవల లక్ష్యం కాదనుకుంటాను. అటువంటి ప్రచారం మాత్రమే పరమ లక్ష్యమయినప్పుడు ప్రత్యేకించి నవల వ్రాయడం దేనికి? ఆ యా ఆదర్శాలమీద సిద్ధాంతాలమీద పని కట్టుకుని బరువయిన గ్రంథాలు వ్రాసి, బహుళ ప్రచారం కొనసాగించవచ్చునుగదా! అలాగే కేవలం వాస్తవిక చరిత్ర కథనమే చరిత్రాత్మక నవల లక్ష్యం కాదనుకుంటాను. మన చరిత్రమీద ఆయా

సుప్రసిద్ధ చరిత్రకారులు ప్రచురించిన గొప్ప గొప్ప గ్రంథాలున్నాయి గదా! అటువంటప్పుడు ప్రత్యేకించి చారిత్రిక నవల వ్రాయడం దేనికి?

అయితే అచ్చమయిన చరిత్రాత్మక నవల లక్ష్యమేమన్న జిజ్ఞాస పొటమరించవచ్చును. ఎక్కడ ఏ మాత్రము, అరలుగాని అడ్డు గోడలుగాని లేని సువిశాలమయిన గభీర మానవతా దృక్పథమే మనిషిమీద, మనుగడమీద ఆత్మీయమయిన ఆర్ద్ర కారుణ్యమే చరిత్రాత్మక నవల లక్ష్యమని నే ననుకుంటాను. దీనితో బాటు ఆ యా చరిత్ర ఘట్టాల, వ్యక్తుల విశిష్టత (Significance) వ్యక్తీకరణం కూడా చరిత్ర నవల ప్రధాన లక్ష్యమే. ప్రపంచ సాహిత్యాలలోను, భారతీయ సారస్వతాలలోను కొన్ని గొప్ప నవలలు పరిశీలించినప్పుడు మనకీ భావమే స్ఫురిస్తున్నది.

ఇటువంటి నవలలు రచించిన మహనీయులు ఏవేవో గొప్ప ఆదర్శాలు, అభినివేశాలు ఉన్నవారే. అంతమాత్రంచేత వారెవ్వరు ఆ యా ఆదర్శాల సిద్ధాంతాల పరిధులలో పరిమితులయిపోయి నట్లు, సంకుచితులయిపోయినట్లు కనిపించరు. వారి నవలలలో ప్రతి సంఘటనమీద, ప్రతి వ్యక్తిమీద మన కెంతో ఆత్మీయత, ఆర్ద్రమయిన సానుభూతి ఏర్పడతాయి. ఆ మహనీయ నవలా రచయితలు విశాల నీలాకాశంలా అవధు లేమాత్రములేనివారని మన కెంతో గౌరవం కలుగుతుంది.

టాల్‌స్టాయి రచించిన వార్ అండ్ పీస్ (War and peace) ప్రపంచంలో నవల లన్నింటికన్న గొప్ప నవల అని 'టెన్ నోవల్స్ అండ్ దెయిర్ ఆథర్స్' (Ten novels and their authors) అన్న పది గొప్ప నవలల పరిశీలన గ్రంథంలో సోమర్‌సెట్‌మామ్ విశేషంగా ప్రశంసిస్తాడు. అది టాల్‌స్టాయి జన్మించడానికి రెండేళ్ళ క్రితం నెపోలియన్ రష్యామీద జరిపిన జైత్రయాత్ర పూర్వరంగంతో రూపొందించిన గొప్ప చరిత్రాత్మక నవల.

దానిలో ఆ మహా రచయిత లెక్క లేనంత మంది సంపూర్ణ సజీవ వ్యక్తులతో, సంఘటనలతో జీవ చైతన్యంతో తొణికిస లాడుతున్న ఒక వినూతన ప్రపంచమే సృజిస్తాడు. ఇటువంటి విశాల దృష్టితో గొప్ప నవలలు రచించగలిగిన మహనీయులు చాలా అరుదుగా జన్మిస్తారు. ఆ నవల సమగ్రదృష్టిలో విస్తృత విశ్వజనీనత సాక్షాత్కరిస్తుంది. కనకనే దాని కంతటి అపూర్వగౌరవం కలిగింది.

ఇదే సందర్భంలో తన నవలల పరిశీలనలో సోమర్‌సెట్ మామ్ చెప్పిన ఇంకొక మాట కూడా ముఖ్యంగా గుర్తుంచుకోవాలి. నవల లెవ్వరయినా ఆనందం (Pleasure) కోసమే చదువుతా రంటాడు ఆ సుప్రసిద్ధ నవలా రచయిత. అది చాలా వరకు యథార్థమని నా నమ్మిక. పట్టించిన రసవద్ఘట్టాలతో, బిగువయిన కథా కథన వైచిత్రితో, వేర్వేరు వ్యక్తి స్వభావ చిత్రణా వైవిధ్యాలతో, ఆత్మీయమయిన ఆర్ద్ర మానవతతో చవు

లూరించే చరిత్రాత్మక నవలలే సహృదయ పాఠకుల నెక్కువగా ఆకట్టుకుంటాయనుకుంటాను. అంతేగాని ఆ యా ఆదర్శాల సిద్ధాంతాలు, రాద్ధాంతాలు, చర్చలు వాదోపవాదాలు వారి నాక ర్షించవు.

వీరేశలింగయుగంలోనే కొంతవరకు రూపు దిద్దుకున్న మన తెనుగు చారిత్రిక నవల శ్రీ విశ్వనాథ, శ్రీ నోరి నరసింహ శాస్త్రి, బాపిరాజువంటి ప్రముఖుల రచనలతో మరింతగా పరి పుష్టమై, సర్వాంగ సుందరమై విస్పష్ట స్వరూపంతో సాక్షాత్క రించింది. నేటి తెనుగు వాఙ్మయంలో ఏకవీరవంటి ఎన్నుకో దగిన ఉత్తమ చరిత్రాత్మక నవలలు కొన్ని వెలువడ్డాయి. అయితే ప్రపంచ ప్రసిద్ధులయిన చరిత్రాత్మక నవలాకారుల రచనలతో సరిపోల్చి చూసినప్పుడు మన చారిత్రిక నవల స్థాయి ఇంకా పెంపొంద వలసి ఉన్నదని నా కనిపిస్తున్నది.

తెనుగు నవల కీనాడు నూరేళ్ళు నిండాయి. మన చరిత్రా త్మక నవల కూడా ఇదేవిధంగా ఇంచుమించుగా నూరేళ్ళ పుట్టిన నాటి పండుగ జరుపుకుంటున్నది. ఈనాడు నవలల రచయి త్రులు, రచయితలు చాలా ఎక్కువ మంది కనిపిస్తున్నారు. ఎమెస్కో వారివంటి ప్రముఖ ప్రచురణకర్తలు వీరి నవల లెక్కు వగా పాఠకుల కందిస్తున్నారు. కవితకన్న, కథానికకన్న, రూపకం కన్న ఈనాడు నవల విశేషంగా పాఠకుల నాకర్షిస్తున్నది. మన వార పత్రికలు, మాస పత్రికలు నవలల ప్రచురణల కెంతో దోహదం కలిగిస్తున్నాయి. ఇది సహజమయిన సారస్వత పరిణా మమే. అపైన మన ఆంధ్ర చరిత్ర సంపత్తి, భారతీయ చరిత్ర ఐశ్వర్యము అపారమయినవి. అయినా మన యువ రచయితలలో చారిత్రక నవలాకారులంతగా కానరావడంలేదు. దీని కేమి కార ణమో తెలియదు. ఇకముందయినా యువ రచయితల దృష్టి మన జాతీయ చరిత్రవైపు మరలగలదని, మున్ముందు మరింత గొప్ప చారిత్రిక నవల లుదయించగలవని ఆశిద్దాము.

ఇదే సందర్భంలో కల్హణ కవి రచించిన కాశ్మీర చరిత్ర కావ్యం రాజతరంగిణి వైఖరి ఒకసారి గుర్తు చేసుకోవడం చాలా ముఖ్యమనుకుంటాను. ఆ మహాకవి ఆ సంస్కృత చరిత్ర కావ్యంలో చిరస్మరణీయులయిన కాశ్మీర రాజన్యుల రాణుల ఆదర్శ పూర్ణ సచ్చరిత్రలు, కథలు, గాథలు ఎంతో గౌరవంతో, భక్తి ప్రపత్తు లతో అభివర్ణించి, అనేక విధాల వినుతిస్తాడు. కాని వెనువెంటనే వారి దుర్గుణాలు, దుశ్చర్యలు, అమానుష కృత్యాలు గట్టిగా ఉట్టంకించి నోరారా దుయ్యబట్టడాని కేమాత్రము వెనుదియ్యడు. కల్హణ కవి క్రీస్తుశకం పన్నెండవ శతాబ్ది పూర్వార్థంలో కాశ్మీరం పరిపాలిస్తున్న విజయసింహుని మహామాత్యుడు చంపక ప్రభున్న కుమారుడు. అయినా పురాతన కాశ్మీర చరిత్ర కథనంలో ఆ మహా కవి వాణి ఏ మాత్రము చెక్కు చెదరక, నిష్పక్షపాతమయిన న్యాయ వైఖరితో సాగిపోతుంది—న్యాయాధిపతివలె.

రాగద్వేషవివర్జితమై న్యాయాధిపతివలె గత చరిత్ర యథార్థంగా అభివర్ణించి వాణితో విలసిల్లుతున్న కవి ఒక్కడే ధన్యుడని కల్హణ కవి రాజతరంగిణి ప్రారంభంలోనే తన వైఖరి విస్పష్టంగా వ్యక్తీకరిస్తాడు.

ఆ మహాకవి అదే సూక్తి ఇక్కడ ఉదాహరిస్తున్నాను.

"శ్లాఘ్యఃస ఏవ గుణవాన్
రాగద్వేష వివర్జితా
భూతార్థ కథనే యస్య
స్థే యాం సీవ సరస్వతీ."
—రాజ తరంగిణి, ప్రథమ తరంగము.

పిచ్చి గీతలు

శ్రీమతి ఆర్. వసుంధర

1

నేను ఎప్పుడూ ఏకాకినే.

అనుబంధాలనేవి నాకులేవు. అన్ని బంధాలూ సాంఘికమైనవేనని నా నమ్మకం. అంతకుమించిన విలువ దేనికీలేదు.

నిజంగా నాకు తోడు పరమేశ్వరు డొక్కడే. అతడే నిజం.

నా పేరు పరమేశ్వర్రావు.

పరమేశ్వరం, ఏంపేరు! ఉత్త పిచ్చి పాత కాలపు పేరు అనేవాడు కామరాజు ఎప్పుడూ. నాకు చాల కోపం వచ్చేది. నా పేరులో ఎంత గొప్ప అర్థం ఉన్నదో వాడికి తెలియదు. వాడిపేరు ఏం గొప్పగా ఏడ్చింది గనుక అనుకునేవాణ్ణి కోపంగా.

నేనెరిగిన పేర్లన్నిటిలోనూ నాపేరు తర్వాత నా కిష్టమైన పేరు చైతన్యప్రభుది.

ఈ ముప్ఫై ఏళ్ళలో మా ముగ్గురి జీవితాలు దూరమవుతూ మళ్ళీ దగ్గరవుతూ ఎన్నివిధాలుగా మారినా చిత్రంగా పెనవేసుకు పోయినై. అందువలననేమో మా ముగ్గురి జీవితాలకూ ఏదో అవినాభావసంబంధం ఏర్పడిపోయింది.

ప్రపంచంలో కనిపించని నిజాన్ని కనుక్కోవాలనేది చిన్నతనంనుంచీ కూడా నా ఆరాటం, అన్వేషణ. ఆ ప్రయత్నంలో భాగస్థుడుగా నాకు ఆత్మీయుడైన వాడు చైతన్య. అందరూ అతణ్ణి 'ప్రభూ' అని పిలిచేవాళ్ళు. నేను మాత్రం 'చైతన్యా' అనేవాణ్ణి. అలా పిలవడం నాకో తృప్తినీ, గర్వాన్నీ కలిగించేది. నన్నుడికించడానికే అన్నట్లు తర్వాత కామరాజు కూడా అతణ్ణి 'చైతన్యా' అని పిలవడం ప్రారంభించాడు. అది నాకు చాల ఉడుకుమోత్తనం తెప్పించేది. చైతన్య నా ఒక్కడికే స్నేహితుడు కావాలనీ, మిగతా వాళ్ళను లక్ష్యపెట్టగూడదనీ, ముఖ్యంగా కామరాజును చేరనివ్వగూడదనీ అనుకునేవాణ్ణి. చైతన్య మాత్రం అందరితో నూ సమానమైన ఉత్సాహంతో మెసిలేవాడు.

ఎప్పుడో చిన్నతనంలో నన్ను మా అత్త చేతికి ఒప్పగిస్తూ ఎవరో నన్ను గట్టిగా కౌగలించుకున్నట్లు, కన్నీళ్ళు కార్చినట్లు, చిన్న గుర్తు నాలో ఎక్కడో. 'మీ అమ్మ దేవత. మీ నాన్న ఉత్తముడు' అన్నారు బంధువులైనవాళ్ళు, ఎప్పుడైనా మా యింటికి వచ్చినప్పుడు. కాని వాళ్ళు నాకు గుర్తులేరు.

నేనెరిగినప్పటి నుంచీ నేను తిరుపతిలో మా అత్త దగ్గరే పెరిగాను. అక్కడ హైస్కూల్లో మేము ముగ్గురం కలుసుకున్నాం. దగ్గర్లో ఉన్న పల్లెలో కామరాజువాళ్ళకు భూములున్నై. ఇంటి దగ్గర్నుంచీ కావలసినంత డబ్బు తెచ్చుకుని ఒక గదిలో ఉంటూ మా క్లాసులో చదివేవాడు. చైతన్య చదువుకోసం వాళ్ళమ్మ వాళ్ళ స్వగ్రామమైన ముంగిల్‌పట్టునుంచి వచ్చేసి తిరుపతిలో కాపురం పెట్టింది.

నేను మా క్లాసులో చదువులో ఎప్పుడూ ఫస్ట్‌రాంక్‌లో ఉండేవాణ్ణి. చైతన్య పదోస్థానం దగ్గర్లో ఉండేవాడు. అయినా అతని మరుకుదనం వలననేమో చాలమంది పిల్లలు అతని చుట్టూ చేరేవారు. చదువులో సామాన్యంగా ఉండే కామరాజు కూడా అప్పుడప్పుడు వాళ్ళింటికొచ్చేవాడు చైతన్య కోసం.

'ప్రపంచంలో చెడ్డవాళ్ళు చాలమంది ఉంటారు. వాళ్ళను దగ్గరకు చేరనివ్వకూడదు' 'బావి గట్టుమీదికి వెళ్ళేవు. తోటి పిల్లలు తమాషాకే తోసేస్తారు.' 'ఎవర్నీ నమ్మరానికాలం'— మా అత్త రోజూ నా చెవిలో ఇల్లుకట్టుకుబోధించే బోధనల సారాంశమది. ఆమె మాటలు ఎప్పుడు ఏదీటిపాడుగోల అనుకునేవాణ్ణి. ఆమెమీద ద్వేషం పుట్టుకొచ్చేది. కాని నేను చిన్నవాణ్ణి. మా క్లాసంతటిలోకీ చిన్నవాణ్ణి. సన్నగా, పీలగా తెల్లగా పాలిపోయినట్లుండి తరచూ జ్వరం పడుతూ ఉండేవాణ్ణి. నేను బలహీనుణ్ణని నాకు తెలుసు. అందువలన అత్తంటే ఎంతకోపం ఉన్నా, ఆత్మసంరక్షణార్థం ఆవిడ మాటలు మనసులో మెదులుతూనే ఉండేవి ఎప్పుడూ. సద్దుకుంటూనే ఆమె మాటల్ని పొల్లుపోకుండా ఆచరించేవాణ్ణి. నమ్మేవాణ్ణి. బావి గట్టునేకాదు, ఎక్కడా ఎవర్నీ నమ్మలేదు నేను.

మా క్లాసులో అందరూ నాకంటే పెద్దవాళ్ళు. బలవంతులు. కామరాజు అందరికంటే బలంగా దృఢంగా ఉండేవాడు. మంచి ధైర్యశాలి. కాని మంచివాడుమాత్రంకాదు. నేను స్కూలుకు వెళ్తుంటే 'ఒరే పరమం, నా పుస్తకాలు కూడా మోసుకు రారా' అని నా చేతిలో పెట్టేవాడు, దోవలో కనపడగానే. 'నేను ఎందుకు

మొదట్నించి? మొదట్నుంచీ' అంటూనని నాకు మనస్సులో ఉండేది. కాని అలా అంటే ఏమిచేస్తాడోనని భయపడి, మాట్లాడకుండా వాడి పుస్తకాలు రోజూ మోసేవాణ్ణి. వాడంటే లోపల కోపం. ఆటల్లోనైనా వాడుముందుగా ఉండేవాడు. నేను ఆటలజోలికి పోయేవాణ్ణికాదు. స్కూల్లో చదువుతున్న రోజుల్లోగాని తర్వాత గాని నేను నిజంగా స్నేహభావంతో దగ్గరకు రానిచ్చింది చైతన్యను మాత్రమే.

2

చదువులయ్యాక నేను రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌లో చేరాను. చైతన్య ఫారెస్ట్ రేంజర్‌గా చేరాడు. ఆ డిపార్టుమెంట్‌లోని అవినీతి, లంచగొండితనాలకు దూరంగా ఉండాలని ప్రయత్నించాడు. కాని అతని పద్ధతి వలన అతని క్రింది ఉద్యోగస్థులకు మామూళ్ళు దొరక్క నష్టం కలిగింది. అది సహించలేక, ఒకరోజు రాత్రిపూట ఒక గార్డు బాగా తాగి అతణ్ణి పొడవడానికి కత్తి తీసుకువచ్చాడు. తర్వాత చైతన్య ఆ శాఖలోనే రిసెర్చి విభాగానికి మార్పించు కున్నాడు. పై రాబడిలేని ఆ ఉద్యోగం కావాలనే వాళ్ళుండరు గనుక అందులోనే ఉండిపోయాడు. తాను లంచం పట్టడు గనుక, పట్టే వాళ్ళను హీనంగా తలవటం అతని పద్ధతికాదు. వాళ్ళతోనూ సరదాగా స్నేహభావంతోనే ఉండేవాడు. 'నాకు జీవితాన్ని గురించిన దృక్పథమంటూ ఏమీలేదు. చేయవలసిన పనిని మనసుకు తోచి నట్లు సక్రమంగా న్యాయంగా చేసుకు పోవడం, ఉన్నదానితో తృప్తి పడటం, అందినంతవరకూ ఆనందంగా జీవితాన్ని అనుభవించడం —ఇదే నాకు తెలిసింది' అనేవాడు. ప్రవర్తనలో మా యిద్దరిదీ ఒక్కటే పంథా. కాని లోకాన్ని చూచే దృష్టిలో ఇద్దరికీ తేడా ఉన్నది. యం. యస్సీలో క్లాసురాక, సొంత వూళ్ళోనే హైస్కూలు టీచరుగా చేరాడు కామరాజు.

తరువాత చైతన్య పెళ్ళిలో కలుసుకున్నాం ముగ్గురం. డబ్బు ఎక్కువలేకపోయినా, మంచి కుటుంబానికి చెందిన చక్కని పిల్ల శ్రీలక్ష్మిని వరించి చేసుకున్నాడు చైతన్య.

కామరాజుకు అప్పటికే పెళ్ళయింది. చదువు కుంటున్న ప్పుడు తోటి విద్యార్థిని అయిన ఒక అమ్మాయిని పెళ్ళిచేసుకుందా మనుకున్నాడు. కొంత ప్రేమకథ నడిచాక తల్లిదండ్రులు ఏర్పాటు చేసిన, అందమూ, డబ్బూ కూడా తెచ్చిన పిల్లను చేసుకున్నాడు.

నేను అందరికంటే ఆలస్యంగా పెళ్ళి చేసుకున్నాను. అత్త తన కూతురు నిర్మలను నేను చేసుకోవడం నిశ్చయమైపోయినట్లే భావించేది. నా యిష్టానిష్టాలతో ప్రమేయం లేకుం డానే నాచేత తాను తలపెట్టిన పనులు చేయించగల శక్తి ఉండేది ఆమెకు మొదట్నుండీ. ఆమె అనుకున్న పనులు నేను చేస్తున్న కొద్దీ ఆమెమీద అసహ్యం పెరిగిపోయేది నాలో. ఆడవాళ్ళ అచ్చెమ్మ బుచ్చెమ్మ కబుర్లు తప్ప మరేం మాట్లాడలేని నిర్మలతో, పెళ్ళయినా, నా కేవిధమైన అనుబంధమూ ఏర్పడనేలేదు. కాని పెళ్ళి చేసుకున్నందుకు నిర్మలనూ మా ఇద్దరు కొడుకులనూ భరించవలసిన బాధ్యతను అంగీకరించాను. బాధ్యతల్నుండీ పారిపోవ పోవడం నా స్వభావంకాదు.

ఈ విధంగా మా మా జీవితాల్లో స్థిరపడిపోయిన వాళ్ళం, ఇన్ని సంవత్సరాల తర్వాత మళ్ళీ ఈ చిత్తూరిలో తటస్థపడ్డాం. నాకు చిత్తూరికి ట్రాన్సఫరయిన కొద్దికాలానికే చైతన్య డి. ఎఫ్. ఒ. ర్యాంక్‌లో ఒక రిసెర్చి పాజెక్టులో చిత్తూరికి వచ్చాడు.

నేను వూరి కో పెడగా దూరంగా ఉండే ఇంట్లో ఉంటు న్నాను, ప్రశాంతంగా ఉంటుందని. ఇంటికి ఎదురుగా కొద్దిదూరంలో పెద్దకొండ—ఎత్తుగా, హుందాగా, నీలాకాశంలో అర్థంకాని ఆకారాన్ని గీస్తూ. ఆ కొండపైన అవతలి ప్రక్కన సుబ్రహ్మణ్యే శ్వరుడి గుడి కూడా ఉన్నది. అది మా వైపుకు కనిపించదు. ఇటు వైపు కనిపించేది, మా యింటి కెదురుగా చిన్న మంగుళూరు పెంకుల ఇల్లు. దానివెనుక నుంచీ ప్రారంభమై కొండపాదం వరకూ ఏవో కట్టడాలు. కాలంతో నల్లబడి, విశీర్ణమవుతున్న ముస్లిం సాంప్రదాయం కట్టడాలు. ఏవో పురాతన శిథిలాల్లాగా, జీవితానికి సంకేతం లాగా నిలిచిఉన్న ఆ కొండ క్రింద యీ శిథి లాలు ఎంతో అందంగా కనిపించేవి. తర్వాత అవి గత శతాబ్దికి చెందిన తెల్లదొరల సమాధులని తెలిసింది. 'ఛీ, సమాధులా!' అని ఏవగించుకున్నా, ఆ దృశ్యపటంలో అవీ భాగంగా నిలిచిపోయాయి.

తీరిక చిక్కినప్పుడంతా ఆ దృశ్యాన్ని చూస్తూ దాని అర్థాన్ని వెతకటం అలవాటైపోయింది నాకు. ఉషఃకాలంలో, మిడిసిపడే ఎండలో, వాన ముసురులో, మబ్బులో —ఎన్నో విధాలుగా ఆ కొండని చూచాను. ఒక్కోసారి ఒక్కోరకంగా దర్శనమిచ్చింది అది. కొండదగ్గరగా, కొండప్రక్కనే, కొండతో కలిసి జీవించడం ఒక అరపూర్వమయిన అనుభవం.

అప్పుడప్పుడు చైతన్య మా యింటికొచ్చేవాడు. ఇద్దరం కలిసి కొండపైకి వెళ్ళేవాళ్ళం. ఒక్కోసారి ఏదైనా చర్చించుకునే వాళ్ళం. ఒక్కోసారి వూరికే, మాట్లాడకుండా, వెళ్ళికూర్చుని తిరిగి వచ్చేవాళ్ళం. ఆకాశానికీ కొండలకీ ప్రకృతికీ చెందిన ఏదో ప్రశాంతత మా మనసుల్లో, శరీరాల్లో చల్లగా నిండిపోయేది. ఈ విధంగా మేము పాలుపంచుకున్న అనుభవాలు నా కెంతో విలు వైనవి. చైతన్యకు ఇతర స్నేహితులుండేవారు. అతను యీ అనుభవానికెంత విలువనిచ్చేవాడో ఆ స్నేహితులతోడి లోకాభి రామాయణానికీ, పేకాటకూ, రాజకీయ చర్చలకూ, సినిమాలకు కూడా అంతవిలువనిస్తున్నట్లు కనిపించేవాడు. క్షణికమైన ఈ జీవితానికి విలువలేదు నా దృష్టిలో. ఈ జీవితానికి పరిమితంకానిదీ, దానికి సంబంధించనిదీ అయిన 'నిజాన్ని' కనుక్కోవాలని నా ప్రయత్నం. దేవు డను, జీవాత్మ అను, లేక వూరికే జీవితం అనో, కారణం అనో ఏమైనా అను—ఏ కారణం వలన మనకు ఈ జీవితం కలిగిందో, ఆ కారణం వలననే మనం దాన్ని నిండుగా ఆనం దంతో అనుభవించవలసిన అవసరం కూడా కలిగిందని నా నమ్మ కం. జీవితాన్నుంచి దూరంగా పోవటం సరియైన పద్ధతి కాదు, అంటాడు చైతన్య. కాని అతను పైకి ఎలా చెప్పినా, అనుకున్నా, జీవితపు లోతుల్ని తరచిచూచి ఆ నిజాన్ని కనుక్కోవలసిన అవసరం అతనికీ తీవ్రంగా ఉన్నదని నాకు తెలుసు.

ఇక్కడికి దగ్గర్లోనే ఉన్న తన స్వగ్రామంలో హైస్కూలు హెడ్మాస్టరుగా ఉంటున్న కామరాజు ఏ పని మీదనో ఊళ్ళోకి వచ్చినప్పుడు మమ్మల్ని పలకరించకుండా వెళ్ళేవాడుకాదు. మా ఇద్దరి కంటే ఎంతో అధికుడైనందున ఏదో ఉన్నత స్థానంలో ఉండవలసిన తాను, దురదృష్టం వలన మా కంటే ఉద్యోగరీత్యా తక్కువ స్థాయిలో ఉండవలసివచ్చినందుకు అతని బాధ, కుళ్ళూ అతని మాటల్లో తొంగి చూచేవి. ఒక్కో సాయంత్రం చైతన్యతో కలిసివచ్చి మాతో కొండమీదకు వచ్చేవాడు. మా ఏకాంతంలోనికి అతను జొరబడడం నాకు సహించరానిదిగా ఉండేది. ఏదీ అర్థం కాకుండానే అన్నీ తెలిసినట్లు మాట్లాడ్డం, ప్రతి విషయంలోనూ వితండవాదం చెయ్యడం, అతని అహంభావం—అన్నీ ఇదివరకు ఇంటర్ చదివేరోజుల్లో ఎలా ఉండేవో ఇప్పుడూ అలానే ఉన్నాయి. అప్పుడూ కొండరోడ్డున సాయంత్రాలు షికారుగా వెళ్తున్నప్పుడు యిలాగే ప్రతిదాంట్లో కలగజేసుకునేవాడు. అప్పుడు మేము చిన్న విషయాల్ని గొప్ప సమస్యలుగా చర్చించుకునే రోజులు. ఆనాటి వాదనల్లో కొన్ని నాకు గుర్తున్నవి. ఇంకా. ఒకనాడు ఏదో విషయం మీద మాట్లాడుతూ 'మనం తినడానికి బ్రతుకున్నామా? బ్రతకడానికి తింటున్నామా?' అన్నాను. తిండి అవసరం బ్రతకడం వరకే అన్న ఉద్దేశంలో అన్నాను కాని ప్రశ్నగా అడగలేదు. ఇంతలోనే కామరాజు కలగజేసుకుని పెద్ద తెలివిగలవాడి పోజుపెట్టి 'బ్రతుకులో తిండి యిచ్చినంత తృప్తి మరేదీ యివ్వనప్పుడు తినడానికే బ్రతుకుతున్నామంటే తప్పేమిటి? తినడంలో తృప్తి లేనట్లు వేషాలు వేస్తూ బ్రతకడానికే తింటున్నాం అనే వాళ్ళను చూస్తే నాకు గిట్టదు' అన్నాడు. కావాలని నన్నుద్దేశించే అంటున్నాడని నాకు తెలుసు. 'స్పష్టంగా అందరికీ తెలుస్తుండే విషయాన్ని కాదని వాదించినంతమాత్రాన పెద్ద సైంటిస్టువు కాబోవులే' అన్నాను. 'పుట్టి బుద్దెరిగినప్పట్నుంచీ ఎవరో చెప్పినమాటల్ని నమ్మి సొంత ఆలోచన ఎరగని పెద్దలు మన చెవుల్లో నూరిపోస్తే దాన్ని నీవు గొప్ప విషయంగా నమ్ముతున్నావు. ప్రతిదాన్ని ప్రశ్నించే శాస్త్రజ్ఞుణ్ణి నేను!' అన్నాడు కామరాజు. అతను సైన్సుగ్రూపు నేను ఫిలాసఫీ గ్రూపూ తీసుకున్నప్పట్నుంచీ తను పెద్ద శాస్త్రజ్ఞుడైపోయినట్లు వితండవాదాలు చేస్తూ, పోజులు పెట్టడం జాస్తి చేశాడు కామరాజు. అతని మాటల్తో నాకు తిక్కోమిటున్నట్లు చైతన్య అభిప్రాయం కోసం చూశాను. 'బ్రతికి సాధించవలసిందీ ఉన్నది, తినడంలో తృప్తీ ఉన్నది. ఆ రెండింట్లో ఏదో ఒకటి ఎన్నుకోవాలని ఎక్కడున్నదీ' అన్నాడు పెద్ద అమాయకుడిలాగా చైతన్య. ఒకటి విలువైందిగా ఎన్నుకోవాల్సిన అవసరం లేనట్టూ, అన్నీ అందరూ కావలసినట్టూ 'మాట్లాడ్డం' అతని ప్రత్యేకత. కామరాజు నడిమధ్యన దూరకుంటే నా మాటల్ని సుళువుగా అంగీకరించి ఉండేవాడని నాకు తెలుసు.

మేం ముగ్గురం కలిసివెళ్తే కామరాజు లోకాభిరామాయణం తప్ప మరే అనుభవమూ ఉండదు. కామరాజుకు వాదనల్లో ఆసక్తి గాని, ఏ విషయాన్నైనా తరచి చూడగలశక్తిగాని లేదు. అందువలన తనలోతుకు మించిన దేన్నైనా నేనడిగితే 'ఏం గోల నాయనలారా, ఇహ ఆపండి' అని కేకలేస్తాడు. నిజానికి అతను మాతో కలిసి రావలసిన అవసరం లేదు. అసలెందుకు వస్తాడనేది నాకు అర్థమయ్యేకాదు. మా దగ్గర అతనెప్పుడూ పెరవాడే.

ఇప్పుడదీ లేదు గాని, చదువుకునే రోజుల్లో ఇలా బయటకు వచ్చినప్పుడు కామరాజు పాటలు పాడేవాడు. అతనికి ఒక రకం పాటలు పాడటం బాగానే వచ్చును. సరదాగా పెద్దగా పాడేవాడు. చైతన్యకు పాటలో కరిగిపోయే గుణం ఉన్నది. నాకు పాటలో అర్థం ముఖ్యం. ఆ పాటను విని ఆనందిస్తున్న 'నేను' ఎప్పుడూ మరుగుకుపోదు. అదికూడా మా చర్చలకు కారణమయ్యేది అప్పుడు.

'సరస్వతీదేవి చేతిలో అంత ప్రముఖంగా వీణ ఎందుకున్నది? సంగీతం యొక్క స్థానాన్ని నిరూపించడానికే' అన్నాడు చైతన్య ఒకసారి.

'ఆమె వాగ్దేవి గనుక. సంగీతం కూడా సాహిత్యం లాగా వాక్కు లాగా అందని దాన్ని చూపేది గనుక' అన్నాను నేను.

'సాహిత్యానికి సంగీతంతో సమానమైన స్థానం ఎక్కడున్నది! మాట పరిమితమైనది. పరిమితమైన దానిద్వారా అపరిమితమైనదాన్ని ఎలా చూడగలం? సంగీతం అట్లాకాదు. మాటకు అర్థానికీ అతీతమైన పథంలో మనస్సుని అందుకొని లాక్కెళ్ళే శక్తి దానికున్నది. అది సాహిత్యం కంటే గొప్పది అన్నాడు' చైతన్య.

'దానికి శాశ్వతత్వంలేదు. విన్నంతసేపే దాని ప్రభావం. అర్థం అనేది మనసులో ఏర్పడితే మరి చెరిగిపోదు. అందువలన సాహిత్యమే గొప్పది' అన్నాను.

చైతన్యా నేనూ ఏ వాదనలోనూ ఏకీభవించకుండానే ఒకరొకరు అర్థం చేసుకోగలం.

3

ఒక మొగ్గ పుడుతుంది. ఒక పువ్వు పూస్తుంది. మరోటి వాడి రాలిపోతుంది. అన్ని పనులూ ఎంతో సామాన్యంగా జరిగిపోతాయి. మనిషి జీవితంలోనూ అంతే. ఆ సంఘటనలకు పరస్పర సంబంధాన్ని ఆరోపించేదీ, అర్థం కల్పించుకునేదీ మనస్సు. జరిగేవి మాత్రం ఏ ఆర్భాటం లేకుండా జరిగిపోతూనే ఉంటాయి.

'...... ఇదేమాదిరిగా ఉత్తరాన్ని పద్నాలుగు కార్డుల మీద వ్రాసి నీకు తెలిసిన వాళ్ళు పద్నాలుగురికి వారంరోజుల్లోగా పంపాలి. ఇది తప్పినచో నెలరోజులలోపుగా నీవు సర్వనాశనమైపోతావు' కామరాజు సంతకంతో చైతన్యకు వచ్చింది ఉత్తరం. కూతురి పెళ్ళి మధ్యలో ఉన్నాడు చైతన్య. చైతన్యకు భార్యాబిడ్డలమీద మమకారం జాస్తి. ఆ పిల్లకు అనుకోకుండా గొప్ప సంబంధం కలిసివచ్చి యీ పెళ్ళి జరుగుతున్నది. చాలా సంతోషంగా ఉత్సాహంగా ఉన్నాడు చైతన్య. ఆ ఉత్తరాన్ని నాకు చూపించి నవ్వి 'నాకు ఇటువంటివాటిలో నమ్మకంలేదు' అంటూ చించేశాడు.

పెండ్లికి రాకపోగా, శుభాకాంక్షలైనా పంపకపోగా, పైగా ఇటువంటి ఉత్తరం పంపడం కామరాజు స్వభావానికి తగినట్లుగానే

ఉన్నది అనుకున్నాను. కామరాజు కూతురికి ఇంతకుముందే పెళ్లి చేశాడు. డబ్బు బాగా ఖర్చుపెట్టి ఘనంగా చేశాడు. కాని అతని అల్లుడు సామాన్యుడైన నరుడు. చైతన్య క్లుప్తంగా పెళ్లి చేస్తున్నాడు. ఇతని అల్లుడు అందంలో బుద్ధిలో డబ్బులో ఉద్యోగంలో మిన్నగా ఉన్నాడు.

పెళ్ళి వారందరూ చైతన్య స్వగ్రామమైన ముంగిలిపట్టు వెళ్ళిపోయారు. తిరుపతికి పదిమైళ్ళ దూరంలో చిత్తూరు రోడ్డులో ఉండే చిన్నపల్లె అది. దేవుడి కొండ ముంగిట్లో ఉండే చిన్న పల్లెపట్టు. ఎత్తైన కొండల నడుమ కోనలో ఏటి వారన పది మిద్దెలూ పదిపూరిళ్ళూ, వాటి చుట్టూ కొద్దిపాటి పంట భూములూ కలిసి ఏర్పడింది ఆ వూరు. చుట్టూ ఐదు మైళ్లలో వున్న మరో పల్లెగాని జనసంచారం గాని ఏదీ ఉండదు. అది నిజంగా వూరుకాదు. చైతన్యను ప్రసవించడానికే ఏర్పడ్డ ప్రకృతి మాత గర్భం.

అందరూ కలిసి వూరిబయటగా వాళ్ళ మామిడితోటలో వనభోజనం ఏర్పాటు చేసుకున్నారు. పులిహోర, దద్ధోజనం, గారెలు, మిఠాయిలు, పండ్లూ, తమలపాకులకట్టలూ, కంబళ్ళూ తీసుకుని వెళ్ళారు. మధ్యాహ్నం భోజనాలయ్యాక చేతులు కడుక్కోడానికి అక్కడే కరెంట్‌మిషన్ వేసివున్న బావినీళ్ళు తీసుకు రావడానికి చైతన్య భార్యా, కొడుకూ, అల్లుడూ వెళ్ళారు. తొట్టిలో నీళ్ళు ముంచిన ఎలక్ట్రిక్ కరెంట్ షాకుతో వెర్రికేక వేసింది. ప్రక్కనేఉన్న కొడుకూ అల్లుడూ ఆమెను లాగబోయి వాళ్ళూ విద్యుద్ఘాతానికి గురి అయ్యారు. కేక విన్న చైతన్య ఒక్క పరుగున వెళ్ళాడు. భార్యా, కొడుకూ, అల్లుడూ అతని కళ్ళముందర విలవిలా తన్నుకొంటున్నారు. మరో ఆలోచన లేకుండా భుజంమీద టవలు తీసి ముందున్న ఎలక్ట్రిక్ చుట్టూ వేసి బలం కొద్దీ లాగాడు. వాళ్ళు ముగ్గురూ ఇవతల పడిపోయారు. అదే వూపులో చైతన్య ప్రక్కనేఉన్న ప్రమాదకరమైన కరెంటుస్తంభంమీద పడిపోయాడు. ఏ ప్రకృతిమాత అతనికి జీవశక్తి నిచ్చి లోకంలో ఆడుకోడానికి పంపిందో, అదే తల్లిలో లీనమై పోయింది అతని ప్రాణశక్తి.

ఆ పెళ్లిలో అతన్ని చూడ్డమే ఆఖరు చూపునాకు. చైతన్య లేడనే విషయం నా మనసుకు అందటంలేదు. మా యింటి ఎదురుగా ఉండే కొండను చూస్తాను. 'ఆకాశంలోని నల్లమబ్బులు నా జటలైనట్లు, భూనభోంతరాలు నిండిన రూపంగల పరమశివుణ్ణై నేను యీ కొండమీద నిలుచున్నట్లు ఉన్నది' అన్నాడు చైతన్య ఒకసారి. ఆ కొండమీద ఆకాశం క్రింద సుబ్రహ్మణ్యేశ్వరుడి గుడి గంటల మ్రోతలో అర్చకుల మంత్రపఠనపు శబ్దంలో నా ప్రక్కనే చైతన్య లేకుండా ఎలా ఉంటాడు! అయోమయంలో పడిపోయింది నా మనసు. నా ఆలోచన, తర్కం, అన్వేషణ ఏమైపోయాయి? పుట్టినవాళ్ళు చావడం సహజం. ఎవరున్నా లేకున్నా యీ విశ్వం కాలప్రవాహంలో కదిలిపోతూనే ఉంటుందనీ తెలుసు. కానీ..... ఈ ప్రపంచాన్ని మాయ అని, అన్ని అనుబంధాలూ సాంఘిక బంధాలు మాత్రమేనని నిశ్చయించుకోగల నా మనసు ఇంగా చైతన్య విషయంలో యిలా చిక్కుబడి పోయిందే! మేము స్నేహితులం. నిజాన్ని గురించిన అన్వేషణలో భాగస్తులం. అంతే. అంతకుమించిన ఆర్ద్రత అతని ఎడల నాకెప్పుడూ తోచనేలేదు. అతను సంవత్సరాలు తరబడీ కనిపించకపోయినా నాకు అదొక లోటుగా కనిపించలేదు. చిరకాలానికి అతను కనిపించినప్పుడు గొప్ప ఆనందమేమీ కలగలేదు. కాని... ఇప్పుడు.....

'మన మిత్రుడు చైతన్యప్రభు చాలమంచివాడు. కాని ముందు చూపు కలవాడు మాత్రంకాదు. ఇంకో పదేళ్ళపాటు ఉద్యోగం చేసి కొడుకుల్ని చదివించుకుని పైకి తేగలనన్న నమ్మకంతో కుటుంబం కోసం అతను ఏమీ నిలువ చెయ్యలేదు. అతని కుటుంబానికి సహాయం చెయ్యాలన్న ఉద్దేశంతో చైతన్యప్రభు కుటుంబ సంక్షేమనిధి అనే పేరుతో ఒకనిధి ప్రారంభిస్తున్నాము. దానిగ్గానూ ఒకకమిటీ ఏర్పాటైంది. మిత్రులందరూ తోచినవిధంగా ఆ కుటుంబమునకు సహాయపడవలసిందిగా అర్థిస్తున్నాము.'

కామరాజు మిత్రులందరికీ వ్రాశాడు. అతను అయిదు వందలు వేశాడు నిధికి.

చైతన్య ఆత్మగౌరవం కల మనిషి. న్యాయంగా తనకు లభించిన దానితో సర్దుకు పోయి తృప్తిపడటం అతని స్వభావం. డబ్బు ఎక్కువగా కావాలనీ, అదే మనిషి మనుగడకు ముఖ్యమైనదనీ, అది ఉన్న కొద్దీ ఎక్కువ సుఖంగా బ్రతకొచ్చుననీ అతను ఎప్పుడూ అనుకోలేదు. అతను తన కుటుంబాన్ని ప్రేమించాడు. వాళ్ళ సుఖంగా ఉండాలనే అనుకున్నాడు. బాధ్యతారహితంగా అతను ఎప్పుడూ ప్రవర్తించలేదు. ముంగిల్‌పట్టులో అతనికి ఇల్లున్నది. కొద్దిగా తోటా, భూమీ ఉన్నది. అతని ప్రావిడెంటు ఫండు కొద్దిగావస్తుంది. అతని కుటుంబానికి తిండికి లోటుండదు. వాళ్ళు యిప్పుడున్న స్థాయిలో జీవించలేక పోవచ్చును. అతని కొడుకులు పెద్ద చదువులు చదువుకోలేక పోవచ్చును. అయినా చైతన్య జీవితాన్నే అబద్ధం చేస్తూ హేళనచేస్తూ ఉన్నది యీ నిధి.కొంత వెసులుబాటుకోసంఅతని కుటుంబంఇతరులదయాధర్మాల్ని స్వీకరించడంఅతనికి దుఃఖం కలిగించదా? ఇతరుల డబ్బు ఒక్క పైసాకూడా ముట్టుకునే మనిషి కాదతను. ఆ నిధి సంగతి తలచుకున్నకొద్దీ నాలో ఉద్రేకం పొంగుకొచ్చింది. చైతన్యమీద గెలుపొందడానికి కామరాజు ప్రయత్నమా యిది!

'..... నేను అదే ఉత్తరం పధ్నాలుగురికి పంపాను. వాళ్ళు చావాలని పంపలేదు. వూరికే పంపాను. అది చదివి అతనిష్టప్రకారం చేసుకుంటాడు. అది చదివి అతను చస్తానని భయపడ్డాడా? నన్నేమైనా అన్నాడా? మధ్యన నీ బాధ ఏమిటి?'

నీ ఆదర్శాలూ, వట్టి మాటలూ అతని కొడుకులకు చదువులు చెప్పిస్తాయా? మనిషి బ్రతకటానికి కావలసింది మాటలు కాదు, డబ్బు. డబ్బుయివ్వాల్సి వస్తుందంటే అందరూ తలొక ఆదర్శమూ వల్లిస్తారు, తప్పించుకోడానికి. ఈ దేశమే దొంగ సన్యాసుల దేశమయ్యా. అది మన జాతిగుణం. చిన్ని నా బొజ్జకు శ్రీరామ

రక్ష అంటూ కడుపునిండా కావలసినవన్నీ మెక్కి కూర్చుని అవతలి వాళ్లకి అవన్నీ అక్కర్లేదనీ మిధ్య అనీ బోధించే రకం.

'ఆయనే వుంటే మంగలెందుకన్నట్లు ఆ చైతన్య వుంటే అతని కుటుంబానికి ఒకరు సాయపడాల్సిన పనేముంటుంది! అతను లేడనికదా చెయ్యాల్సి వస్తున్నది! ఒక మంచిపని చెయ్యాలంటే అడ్డుపుల్లలు వేసేవాళ్ళు కొల్లలుగా ఉంటారు.

'నీవు డబ్బు యివ్వకపోతే మానెగానీ వెళ్ళు స్వామీ, నీకో నమస్కారం. మేము అన్నం తిని బ్రతికే సామాన్యులం. సామాన్యంగానే బ్రతుకుతాం.....' అన్నాడు కామరాజు.

అక్కణ్ణుంచీ మారు మాట్లాడకుండా వచ్చేశాను. నా మనస్సు ఆవేశంతో ఆవేదనతో ఉడికిపోతున్నది. అతని ఆరోపణలకి నా దగ్గర సమాధానం లేదా? ఇందులోని నిజం చెప్పగల వారెవరు? రెండువైపులా పదును గలిగి ఎటైనా నరుక్కుపోగల మనసులాంటిదేనా నిజం కూడా? చైతన్య అలా ఒప్పుకోడు. 'నాకు తెలుసు' అంటాడు. 'నాక్కావలసిందంతా నాకు తెలుసు.' 'నాకు సందేహాలు లేవు' అనేవాడు ఎన్నోసార్లు. ఇప్పుడతనికి అన్నీ ఇంకా ఎక్కువగా తెలిసుండాలి. కాని అతనికి తెలిసిందేమిటో నాకెలా తెలుస్తుంది!

కొన్నిసార్లు విషమ పరిస్థితుల్లో శరీరాన్ని విడిచి రూపరహితమైన ఆత్మలు పాతరూపాన్ని ధరించి మనుష్యులతో మాట్లాడినట్లు చెబుతారు. ఒక ప్రాణి యీ దేహంతోనే నశించిపోకుండా ఏమైనా మిగిలుంటే ఈ పరిస్థితుల్లో చైతన్య నాకు ఎందుకు కనబడడు? అలాగ చైతన్య స్వయంగా వచ్చి "పరమం, మనిషంటే భౌతిక విషయాలకు బద్ధమై కనిపించేది మాత్రమే కాదు. ఈ కనిపించేది శాశ్వతమైంది కాదు. ఒకే పరిస్థితుల్లో ఉన్నా ఒక మనిషికీ ఇంకో మనిషికీ తేడా ఉంటుంది. అది అతని 'నిజం.' అతనిపైన గుణాలకు మూలం. అతని జీవాత్మ. అది ఉన్నది ... నేను ఆత్మాభిమానం కలవాణ్ణి. నా భార్యాబిడ్డలూ మరొకరి దయాభిక్షతో పైకి రావాలని నేను అనుకోను. అది నాకు ఇష్టం ఉండదు. వాళ్ళు నా వాళ్ళు ... 'నా' వాళ్ళు ... నన్ను సరిగ్గా తెలుసుకున్నవాడివి నువ్వే .... మనిద్దరం ఒకటి ...." అని చెప్పాలి. ఎందుకు చెప్పడు? అతనికోసం నేనుపడే ఆవేదన అతనికి తెలియదూ! అతను నాకు ఆత్మీయుడు. నేను తీవ్రంగా వాంఛిస్తే అతను నాకు కన్పించి తీరుతాడు. నాకు తెలుసు!

మనసును కేంద్రీకరించి తీవ్రంగా అతణ్ణే భావిస్తూ కళ్లు మూసుకు కూర్చున్నాను.

ఎంతసేపు కూర్చున్నా అతను కన్పించ లేదు.

అలసట కలిగింది. పడక్కుర్చీలో కళ్లు మూసుకు పడుకొని నిద్రపోయాను.

4

నిద్రనుండి లేచేసరికి ఉదయం నుండి నేనుపడిన ఆవేదన తాలూకు ఛాయకూడా లేకుండా మనసు తేటపడింది.

కళ్లు తెరవగానే ఎదురుగా కిటికీలోంచి కనిపిస్తున్న దృశ్యం అసాధారణంగా ఉన్నది. కిటికీలోంచి ఎర్రటి వెల్తురు కళ్లను తాకుతున్నది. ఎరుపు. బయటంతా అసహజమైన ఎరుపు. ఏమిటి సంగతి? ఇంత ఎరుపు ఎక్కణ్ణుంచి వస్తున్నది? అనుకుంటూ లేచి కిటికీ దగ్గరకు వెళ్లాను. ఎదురింటి మంగుళూరు పెంకులు యీా స్వచ్ఛమైన ఎరుపును యీనుతున్నవి. నేను రోజూ ఎన్నోసార్లు ఆ యింటిని చూస్తూనే వుంటాను. కాని అది యిటువంటి కాంతితో ఎప్పుడూ కనిపించలేదు. ప్రపంచాన్ని ఏదో 'స్వచ్ఛత' ఆవరించింది. ఎదురుగా ఎత్తుగా ఆకాశాన్నంటుతున్న కొండలోని పెద్దగుండ్లు వేటికవిగా విడివిడిగా ప్రత్యేకమైన వ్యక్తిత్వాలతో దర్శన మిస్తున్నాయి. వాటి మధ్యనుండే గడ్డి తుప్పలు ఎప్పుడూ లేనంత పచ్చగా కూర్చుని ఉన్నాయి. దూరాన ఉన్న రకరకాల చెట్లన్నీ ఎంతో తేటైన పచ్చదనాలతో వాటి వాటి ప్రత్యేకమైన రూపాల్ని స్ఫుటంగా లోపింపజేస్తూ చాల సుందరంగా ఉన్నాయి.

చీకట్లో అవి లేనేలేవు. వెలుగులో, ఎండలో, అది ఒక పెద్ద కొండ. అవి చెట్లు. ఇప్పుడు వాటి పచ్చదనాల్లోనూ, రూపాల్లోనూఉండే భేదాలన్నీస్ఫుటమైనాయి—ఈవెలుగు లేమిటో!

ఈ ప్రపంచంలోకి యింత పచ్చదనం, యింత తేటదనం ఎలా వచ్చాయి? చీకట్లలోనికి జారిపోబోతున్న సూర్యుడు మరణాసన్నసమయంలోని చావుతెలివిలాంటి నిశితమైన చూపుతో ఇంతవరకూ తాను లక్ష్యంలేకుండా చూచిన ప్రపంచపు నిజస్వరూపాన్ని చూస్తున్నట్లున్నాడు. ఎంత సౌందర్యం! ఎంత ఆనందం!

మెరుపూ ఎండాలేని యీా ప్రపంచం తపస్సమాధిలో వున్న యోగి లాగా ఉన్నది. సూర్యుని తీక్షణమైన కాంతి లోపించడంతో అన్ని వస్తువులూ వాటి సొంతమైన నిర్మలమైన కాంతుల నీనుతూ ప్రకాశిస్తున్నాయి. సూర్యుని కాంతికి నీడ ఉంటుంది. ఈ వెలుగులో నీడలేదు. ఇది నిజం!

ఆలోచిస్తున్న వాడిని ఎందుకో ప్రక్కకు తిరిగాను. వాకిట్లో నిలబడి ఉన్నాడు ఎవరో అతను. మారూ పలుకూ లేకుండా, ఏభావం లేకుండా నిలుచుని ఉన్నాడు. అతని చొక్కా చిరుగులోంచి పచ్చగా మెరిసే ఒళ్లు కనిపిస్తున్నది. ఆకలితో ఉన్నట్లు కనబడుతున్నాడు. అతను నవ్వడం లేదుగాని అతని మొహంలో ఏదో చిరునవ్వు కనిపిస్తూ చూచేవాళ్లకు సద్భావం కల్గిస్తున్నది. అతను స్నేహపాత్రుడుగా కనిపిస్తున్నాడు.

అతన్ని ఇంతకుముందు ఎక్కడో చూచానన్నభావం మెదుల్తున్నది గాని సరిగ్గా గుర్తులోకి రావటంలేదు.

'ఎవరండీ మీరు?' అడిగాను.

'నన్ను మీా రెరుగుదురు. మరచిపోయారేమో. మీరు నాకు బాగా తెలుసు' అన్నాడు నవ్వకుండా నవ్వుతూ.

నాకు జ్ఞాపకం రాలేదు. ఆలోచించినకొద్దీ అసలతణ్ణి ఎరగననీ తోచింది.

'క్షమించండి. మీా పేరు?' అన్నాను దగ్గరగా వెళ్ళి.

అతను మాట్లాడకుండా చిన్నగా మడిచిన కాగితం ఒకటి తీసి నా చేతి కిచ్చాడు. అది చేతిలోకి తీసుకున్నాను. ఏదో పనిమీాద వచ్చినట్లున్నాడు. రికమెండేషన్ లెటరు కాబోలు. 'కూర్చోండి' అంటూ అతనికి కుర్చీ చూపించి నేనూ పడక్కుర్చీలో కూర్చున్నాను.

అతను లోపలికి రాలేదు. కూర్చోలేదు. తలెత్తి అతని కోసం చూచాను. వాకిట్లో లేడు. ఇంతలోనే ఏమైపోయాడా అనుకుంటూ కిటికీలోంచి రోడ్డు మీాదికి రెండు దిక్కులా చూచాను. ఎక్కడా కనిపించ లేదు. ఏమైపోయాడు? అనుకున్నాను

అకస్మాత్తుగా అతనెవరో నాకు తోచింది. అతను చైతన్య. అవును. సందేహంలేదు. ఆ నవ్వు ... అతను చైతన్యే! నా కోసం వచ్చాడు. నాకు చెప్పాలని వచ్చాడు. ఆ లోకం నుంచి నాకు నిజం తెలపాలని వచ్చాడు! అవును, రాకుండా ఎట్లా ఉంటాడు? నిజమైన స్నేహితుడు. అతడే నిజం! నా తీవ్రమైన కోరికను కాదన లేడు. తన ఉనికిని, తన నిజాన్ని నిరూపించుకోవడానికి వచ్చాడు. వస్తాడని నాకూ తెలుసు! ఆ కాగితంలో నా కేదో సందేశంఉన్నది.

కాగితం మడతలు విప్పి చూచాను. నా కళ్ళు నేనే నమ్మలేకపోయాను. కాగితం నిండా పిచ్చిగీతలు! చిన్నపిల్లలు ఓపిగ్గా కూర్చుని పేజీనిండా వ్రాసే గీతలూ, సున్నాలూ! ఆలోచన లేని ఆ పిల్లలకి మాత్రమే నిజంగా కనిపించే గీతలూ, సున్నాలూ!

ఈ పిచ్చిగీతల్ని నా కివ్వడానికే వచ్చాడా చైతన్య?
అర్థం లేకపోవడమే అర్థమా యీా ప్రపంచానికి?
అర్థం లేనిది కనిపిస్తుందా?
ఎవరు నాక్కనిపించింది?

...

నిజం నాకు తెలియలేదు ఇప్పటికీ.

ఊహలో ఉగాది

"సాంధ్యశ్రీ"

అమవస నిశిలో
అరణి జ్యోతిలా—
ఇచ్ఛలు తీర్చే ఉత్సవంలా —
నూత్నవత్సరం ఉత్సాహంగా—వస్తుందని
ఉద్వేగంతో ఊహలుచేసిన నేను
ఈ ఉగాదికి ఏమివ్రాయను...?
సగానికి సగం తీయని—అబద్ధాలు
సగంపైగా శ్లేషార్థాలు...తప్ప

ప్రస్తుత స్థితిని ప్రస్తుతిస్తూ పరామర్శిస్తే
ప్రబంధకవుల లేఖిని ప్రఖ్యాణాలు
ప్రతిముక్త ప్రతిష్ఠలు
ప్రబంధ బంధ ప్రహేళికః
ప్రబంధ ప్రమదల విరహోపలభములు
ప్రబంధాలు
ప్రతిబంధాలు...;

ప్రకృతిని నందనంగా
సుందరంగా—
అంతకంటె—అందంగా...
పరిచయం చెయ్యబోతే
సగటుమనిషి తన సంగతేమిటంటూ
ముక్కుమీద వ్రేలుతో మూతి ముడుస్తాడు...
ఏమైనా వ్రాయక తప్పదు...
లేకపోతే లోకం కనువిప్పదు...

ప్రబంధ పరిచయం;

వలపు జిష్ణుకువు జరాభీరువు
మందార సుమాల నారి మ్రోయిస్తున్నాడు

కందళించిన వలపు కంథా పాటంలో
సందడించిన తొలిప్రేమ విందులో

చెలి సందోహంలో
సందె జాములో
చెలి గోము మోములో
అందంగా—ఆనందంగా...!

గండుకోయిల దండు
నవరసాల నవకోమల పల్లవాలను—చిదుముతున్నది
క్లీతక గీతికలను ఆలపిస్తున్నది...
గరువ తుమ్మెద పిండు
వలపుసుమాల క్రొందేనెలు జుఱ్ఱి
శృంగార ఝంకార స్వరాలు పలికిస్తున్నది
కాంతా విచికలవు వలపు వీచికల అలరిస్తున్నది
నూత్న వధువుకు
సిగ్గు బరువుతో—వేపథువు...
కొమరు తీవ ముద్దుపూవు
కొనలుసాగ—డోల లూగ
మధుర మకరంద ఝరుల
ప్రమర పరిమళ లహరుల
ఆశాంతము లెల్ల నిండెను...
భాస్వన్నవ నవమంజుల
మంజుల మహనీయ
మధా మాధుర్య సౌందర్య
సమ్మోదము లొలికెను
ప్రకృతి పులకించెను
యమునా స్రవంతి పొంగెను ;
రేకు రేకుగ మొగ్గ విప్పెను...
జానికి—సిగ్గు కప్పెను—;
ఆమని పిలిచింది—
అవని, ఓయని పలికింది...
జగానికి...పునాది
జనానికి...ఉగాది...

సగటు మానవ సంచితము :

సగటు మనిషి—
సగటు జీవితంలో సాగిలబడుతున్నాడు
మదనుడు వేయదోయేబాణం ఆపివేశాడు...
తంద పరిమృజాడై
కంబళించని వలపు కంధావాటంలో
వాడి వత్తలైన ఉమ్మెత్తల్లో
ఉసూరు మంటున్నాడు...
గండుకోయిల దండు...
కుటజముల కోసం...
కనలిన కిసలయాలకోసం...పోతున్నది
సామాన్యుని జీవిత మింతేనన్నది...
గరుస తుమ్మెద సిందు...
సాలిపోయిన పూలమీద
తల బరువుతో—తలపు బరువుతో రోదిస్తున్నది
అది సగటుమనిషి జీవిత సారమన్నది...
కాంత లేదు...
కౌగిలి—లేదు...
పుట పుటలో కదులుతున్నది
వలపు మధుపు ఎద కాలుస్తున్నది
వనిత వలపుజీవితానికి ప్రశ్నగా నిలుస్తున్నది...

హంజులగానం బదులు—
కాలంలో—
భవిష్యద్గగనం, విరిగినచప్పుడు వినవస్తున్నది
అవనీతల మవతల పక్క హాహాగ్గర్జనం వినదిస్తున్నది...
సామాన్యుడు...

కుత్తులో...
క్షత జగత్తులో
నిరంతర నిరీక్షణలో
స్వర్గాల మార్గాలు—
స్వప్నాల దుర్గాలు—
వెదుకుతున్నాడు...
ఊహలో—తప
ఊపిరిలో—శాంతిలేదు...

నిర్మ్రష్ట్రదుఃఖ బాష్పమ్ముల్లో తప్ప
ఆర్ద్రత అంతు చిక్కడం లేదు...
ఆశల వెచ్చని పాన్పుమీద...
స్వప్నాల పుష్పాలు తప్ప...
ఆవేదన మిగిల్చిన...
సురివెచ్చని బాష్పాలు తప్ప
ఆశించిందిలేదు...అంతకన్న మరేదీరాదు...
కత్తి వాదరకు తెగిన...కంఠంలో గీతం

నిశ్శబ్ద సంగీతం
సామాన్యుని మతం...

శ్రీ మతంలో
సగటుమనిషి అభిమతంలో...
ఏటావచ్చే...ఉగాది పేరేమిటి...?
దాని నిర్వచనం ఏమిటి...?
సగటుమనిషి నిర్వచనం ఇది...

"ప్రబంధంలోని ప్రతిదీ ఒక అమావాస్య
పిలుస్తూ—మెరుస్తూ వచ్చే ప్రతిఉగాది- ఒక ఆశావేశ్య."

"ఆంధ్రసాహిత్యంలో శ్రీ తిరుపతి వేంకటకవుల యుగం"

శ్రీ చెళ్లపిళ్ల దుర్గేశ్వర శాస్త్రి

పై శీర్షికతో విరోధికృన్నామ సంవత్సర ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో శ్రీ నిడుదవోలు వేంకటరావుగారిచే నొక వ్యాసము ప్రకటింపబడింది. ఇదిగాక 1971 ఏప్రిల్ నెల భారతి పత్రికలో

"తిరుపతి వేంకట కవులు—సరస్వతీ పత్రిక"

అను శీర్షికతో వేరొక వ్యాసం గూడా ప్రకటింపబడింది. ఇవి రెండున్ను వారిచే సేకరింపబడిన మరికొన్ని వ్యాసాలున్ను కల్పి ఒక పుస్తకంగా నేను నా పబ్లికేషను ద్వారా ప్రకటిస్తే బాగుంటుందని కొందరి మిత్రుల సలహాపై శ్రీ రావుగారు నా అంగీకారాన్ని జాబు ద్వారా కోరియున్నారు.

దీనిపై ఆ పత్రికల సంచికలు సంపాదించి చూస్తినిగదా వాట్లల్లో కొన్ని పొరపాట్లు ఉన్నట్లు నా బుద్ధికి తోచి వాట్ల విషయంలో కొన్ని ఆధారాలు గ్రంథస్థం అయిన వాట్లను పరిశీలించాను. నా ఊహ సరిఅయినదే అని తోచింది. ఇది చారిత్రిక విషయం గనుక వాట్లను ఆంధ్ర ప్రజల సమక్షంలో ఉంచుట అవసరమని యెంచి యీ వ్యాస రూపేణా లోకానికి సమర్పిస్తున్నాను.

శ్రీ వేంకటరావుగారు తిరుపతి వేంకట కవుల "నానా రాజ సందర్శనం" లోని "ఏనుగు నెక్కినాము ధరణీంద్రులు మ్రొక్కగ నెక్కినాము" అన్న పద్యాన్ని యెత్తుకుని "అది సర్వే సర్వత్ర యావ దాంధ్ర దేశానికీ వర్తింపదు" అని వ్రాస్తూనే, విజయ నగర సంస్థాన ప్రసక్తి తెచ్చి ఆ సంస్థానంలో పేరి కాశీనాథశాస్త్రిగారికి వాదంలో జవాబు చెప్పలేక ఓడిపోయినట్లుగా అనువర్తింప జేశారు. ఈలా అనువర్తింప జేయడానికి కారణం "సాహిత్య వాఙ్మయ చరిత్రకారు లెప్పుడును సత్యముగా ప్రవర్తిల్లిన సంగతులకే ప్రామాణ్యము నివ్వడముగా" వారు పేర్కొన్నారు.

వీరి పరిశోధనలో వెంకటశాస్త్రిగారు "కథలు గాథలు" ద్వితీయ భాగములో "ఏనుగు నెక్కినాము" అన్న పద్యానికి వ్యాఖ్యాన ప్రాయంగా వ్రాసిన పంక్తులు ఆ పద్యభావం యావదాంధ్ర దేశానికీ ఎందుకు వర్తింపదో స్పష్టంగా తెలుపుతూవున్నా గమనింప బడకుండానే సత్యంగా ప్రవర్తిల్లిన సంగతులకు అపార్థ సృష్టి చేయడం వంటిదిగా పరిణమించింది. ఆనాటి విజయ నగరసంస్థాన స్వరూప సందర్భాచార ప్రసక్తులు చెళ్లపిళ్లవారి వాక్యాలతోనే వర్ణించిన వేంకటరావుగారు పై పద్య భావ సమన్వయ విషయంలో గూడా చెళ్లపిళ్లవారి వాక్యాలే ఉదాహరించి వ్యాస రచన చేస్తే బాగుండేది. అలా చేయకపోవడంవల్ల యీ విషయం పైవరి జ్ఞానానికిన్నీ శ్రీ రావుగారి నిర్దుష్ట హృదయాన్ని శంకించడానికిన్నీ అవకాశం కల్గిస్తోంది. కాబట్టి ఆ వాక్యాలేవో—కథలు, గాథలు ద్వితీయ భాగం 520, 521, 522 పుటలనుండి ఉదాహరిస్తాను.

"అట్టి శత్రు మధ్యంలో ఆ గ్రంథాన్ని (శ్రీనివాస విలాసొన్నప్పటి మాట) రాజసభలో వినిపించాలి. గజారోహణాది సన్మానాలు అసలు సంస్కృత గ్రంథం రచించిన కృష్ణమాచార్యులుగారితో పాటుగా పొందాలి. అద్వైతులంటే ఆ సంస్థానాల్లో, అందులో ఆత్మకూరిలో బొత్తిగా గౌరవంలేదు.....ఏదో శబ్దాన్ని గూర్చిగాని అర్థాన్ని గూర్చిగాని మనం అబద్ధమాడితే వచ్చే హానేముంటుంది? యిది ధనమా? ధాన్యమా! దీనివల్ల ఎవరి కేమపకారం జరుగుతుంది? అనుకోకూడదు.....శబ్దార్థాలనగా పార్వతీ పరమేశ్వరులే. వాట్లను గూర్చి అపచారం చేయడమంటే! వారినిగూర్చి అపచారం చేయడమే అని తెలుసుకోవాలి. అజ్ఞాన కృతమైతే తప్ప యీ అపచారం బుద్ధి కృతమైతే బొత్తిగా క్షంతవ్యం గాదు..... దీన్ని లేశమూ కూడా ఉల్లంఘించకుండానే ఆత్మకూరి వారి గ్రంథంలో ప్రతిపక్షులు చేసిన ఆక్షేపణలలో వకటీ కూడా మిగలకుండా సమర్థించి ఏనుగు నెక్కడం తటస్థించింది. కనకనే దాన్ని పెద్ద గౌరవంగా భావించి మేము—"ఏనుగు నెక్కినాము" అని వ్రాసుకోవలసి వచ్చింది.....

అట్లాటప్పా యెక్కడాలు తిరుపతిశాస్త్రి జీవితకాలంలో వక మాటున్నూ, పిమ్మట యింకో మాటున్ను జరిగి ఉన్నాయి. వాట్లను ఎక్కడా జీవిత చరిత్రలో మేము స్పృశింపనే లేదు."

పై పంక్తులవల్ల, ఆ పద్యభావం తదితర సంస్థానాలకు యెందుకు సంబంధింపదో తెలుస్తూ వుండగా అందుకు భిన్నంగా విజయనగరానికి దాన్ని సంబంధింపజేసి కాశీనాధశాస్త్రిగారికి ఇచ్చినట్లు వ్రాయడం "సత్యంగా ప్రవర్తిల్లిన సంగతులకు" అపార్ధాన్ని కల్పించే చరిత్ర రచనగా భావించక తప్పదు.

వెంకటశాస్త్రిగారి జీవితకాలంలోనే వేరొకరు (శ్రీపాదవారు) కూడా యీ ప్రసక్తి వారి వివాదల్లో వ్రాసియుండగా దానిపై కథలు, గాథలు తృతీయభాగంలోని 101 వ పుటలో వారేలా వ్రాసియున్నారో పరిశీలించండి?

"అయితే శ్రీ విజయనగరం మహారాజావారి సభలో శ్రీ శాస్త్రుల్ని (కాశీనాథ) గారికిన్నీ నాకున్నూ వ్యాకరణశాస్త్రంలో వాదం పెట్టినట్టున్నూ మమ్మల్ని ఆయన ఓడబుచ్చినట్టున్నూ ఆక్షేపకులు (శ్రీపాదవారు) వ్రాసినట్టు జ్ఞాపకం. "సుధ్యుపాస్యః" అనే స్థలంలో శాస్త్రార్థం శ్రీ మహారాజావారి ఆజ్ఞానుసారంగా (శ్రీ ఆనంద గజపతి తర్క వ్యాకరణాలలో వాదించుకుంటే విని గెలుపు వోటములు నిర్ణయించే శక్తి వున్న విద్వన్మహారాజు) కొంత వరకు జరిగింది. యింకా జరిగితే ఆయన మమ్మల్ని నెగ్గేవారేమో కాని ఒకటి, రెండు, మూడు పల్లిటీలలో శ్రీ మహారాజావారు సెలవిచ్చారుకదా? "వారి కవిత్వం విన్నాము. వారు కేవల కవులో! విద్వత్కవులో! తెలుసుకోవడానికి దీన్ని కూడా కొంచెం అడగమన్నాం. అడిగారు. చాలును" అని ఆపుచేసి మళ్లా వారు స్వయంగా "వృపుచ్ఛ మవనామితన్" అన్నచోట "శేష పుచ్ఛ లాంగూల రేషు శునః" అని అలుక్కు యెందుకు రాలేదు? (దీన్ని బట్టి మహారాజావారి శాస్త్ర ప్రవేశం విజ్ఞులు గుర్తించెదరుగాక) అని ప్రశ్నించారు. అది సంజ్ఞా విషయకమేమో గ్రంథం చూచికాని నిర్ధారించి మనవి చేయడానికి తగ్గంత జ్ఞాపకం లేదన్నాను. దానితో శ్రీవారు "బస్" అని సెలవిచ్చి ఆపు చేసి సభ కూడా ఆపి వెన్నువెంటి ప్రయాణానికి రైలుకు దయ చేశారు."

పై పంక్తులవల్ల వాదం ఎక్కడ యేవిధంగా ఎంత వరకూ జరిగిందో? ఏ రీతిగా ఆగిందో? అందులో గెలుపు వోటముల ప్రసక్తులు ఏవిధంగా లేవో? తెలుస్తూండగా—కౌముది మొదటి సూత్ర పూర్వపక్షానికి జవాబు చెప్పలేకపోయారని వ్రాయడం వల్ల, ఆ వ్రాత వీరికి పాణినీయ ప్రవేశం బొత్తిగా లేదన్నట్టు బుజువు చేస్తోంది. ఈ విషయాన్ని ఆంధ్రపత్రిక శోధిస్తూ ఉగాది సంచికలోని 65 వ పుటలో వెంకటరావుగారు ఆనుముఖంగా ప్రచురించిన వ్యాసంలో రెండు దఫాలుగా ప్రయోగింపబడిన "మహాత్త్వవంతము" అను పద ప్రయోగం కూడా బలపరుస్తోంది.

పై విధంగా జరిగిన విషయాన్ని మరికొంత అదనంగా పెంచి—అంతే

"ఎందరి జూచెనేని వరియింపదు మా కవితా కుమారి క
న్నందుకు దేశముల్ తిరుగుటబ్బెను సౌఖ్యము లేకపోయె నా
నంద నృపాల! నీదు సుగుణంబులఁ జెప్పిన నాలకించి వెం
టందల యూచెఁ గావునఁ దటాలున దీనిఁ బరిగ్రహింపుమా?"

అన్న పద్యం దాకా పెంచి "ఇంతమందికి చూపిన తర్వాతనా మా రాజావారివద్దకు తీసుకుని వచ్చారు?" అని కూడా ఆక్షేపించారనిన్నీ, అంతతో ఆ సమావేశం ముగిసిందనీ మళ్లీ యెన్నడూ విజయనగరంలో అడుగు పెట్టనేలేదనీ వ్రాశారు.

ఇంచుమించు ప్రతి అక్షరాస్యుడున్నూ జవాబివ్వగలిగే పై ఆక్షేపణ యెంత నిస్సారమో! వేరే వివరింప నక్కరలేదుగదా? ఆ ఆక్షేపణ వేంకటరావుగారి దృష్టిలో సమంజసమైనదే అయితే తను తన గ్రంథాలతో స్వయంవరాల్ని వర్ణించిన ప్రతికవీశ్వరునికిన్నీ వర్తింపవలసే వస్తుంది. స్వయంవరాలలో కన్యకలు కొంతమందిని చూచాకనేకదా వారికి నచ్చినవార్ని వరించడం? అక్కడక్కడల్లా యీదేవిధంగా ప్రశ్నించే యెడల అట్టి కవిత్వాలు రాసిన పూర్వ కవులంతా పై ఆక్షేపణకు అర్హులే కావలసివస్తుంది. కాబట్టి పై ఆక్షేపణకు విలువ నివ్వడం అనవసరం. సరికదా! అట్టి ఆక్షేపణ జరగడమే సంభవిస్తే వెం. శా. గారిచే తగ్గ జవాబు పొందకుండా ఉంటారనే మాట కూడా నమ్మడానికి వీల్లేదు.

ప్రశ్న—ఏం? యెందుకు వీల్లేదు?

జవాబు—దర్మిలాకాలంలో కాశీనాధశాస్త్రుల్లుగారు తి॥వెం॥ కవుల విద్వత్పట్టాభిషేక నాటకాన్ని విమర్శిస్తూ అందు యీలాటి చొప్పదంటు శంకలు చొప్పిచేసి — తగిన జవాబు పొందినిన్నీ మళ్లీ యేమీ వ్రాయలేకపోవడంచేత!

ప్రశ్న—ఆ మాటలకు ఆధార మేమేనా వుందా?

జవాబు—ఆ! ఉంది! తి. వెం. కవుల వాక్యాలలోనే ఉదాహరిస్తాను. పరిశీలించండి. 1908వ సం. రం. లో కాశీనాధశాస్త్రులుగారి పూర్వశాకుంతలాన్ని విమర్శిస్తో తి. వెం. కవులీ విధంగా వ్రాశారు.

"ఇప్పటికి 5 సంవత్సరములకుఁ బూర్వమున మాచే రచింపఁబడిన విద్వత్పట్టాభిషేకముపై బ్ర. శ్రీ. వేరి కాశీనాధవిద్వత్కవీంద్రులవారు తమకుఁ దోఁచిన రీతిని విమర్శనమును స్వహస్తముతో వ్రాసి శ్రీ పెదవరప్పు జమీందారు గారి సన్నిధి కంపిరి. అది చూచి "పెద్ద పండితులని వాడుక వెందిన వీ రింతమాత్రమును బరిశీలింపక యసందర్భపు వ్రాత వ్రాసిరిగదా?" అని చింతించి. . . . . వీరు కష్టపడి శాస్త్రములు నభ్యసించినను లక్ష్యజ్ఞానము కొంతగాకున్నఁ గొంతైన సంపాదించినవారు కారు" అని స్థిరపరచుకొని. . . . . తోఁచిన సమాధానములను వ్రాసి మంజువాణిలోఁ బ్రచురించితిమి. పెద్ద పడి మహోపాధ్యాయులవారు మమ్ముఁ గరుణించియో! విరసించియో! లేక ఇదివరలోఁ జేసిన పనియే తప్పు—ఇది మరింత తప్పుగా నుండుననియో! మేమెంత దురుసుగా. . . . . వ్రాసినను నేటికిని ప్రత్యుత్తర మీయరైరి." కనుకనే పై ఆక్షేపణ ప్రసక్తి జరిగియుండదనిన్నీ—దానికి విలువ నివ్వ నక్కరలేదనీ—నా నిశ్చయము.

ప్రశ్న—అలా అయితే ఆ యెడ్వర్డు పట్టాభిషేక నాటక విమర్శలోనుంచి కూడా ఒక శంక చూపించి దాని ఖండనాన్ని ఉదాహరిస్తే బాగుంటుందేమో?

జవాబు—అలాగే!

(శంక)

"శిరసావహింతు ననుట యాంధ్ర విభక్త్యంతముగాదు"

(సమాధానము)

ఈ శంక మరియును శోచనీయము. ఇది యాంధ్ర విభక్త్యంతము కాదని శంకింపఁ గూడదు. తెలుఁగులో శిరసావహింతుననునది యేకపదముగా వాడుటచే నంతమం దాంధ్ర మేల లేదో తెలియరాకున్నయది. శంక యెటున్నను "శిరసా" అనునది తెలుఁగులో నెట్లు నిలిచినదని యభిప్రాయము కావచ్చును. అయ్యా! తమరు కేవల సంస్కృతమే చదువుటచే శ్లో. —ఆంధ్ర భాషామయం కావ్య మయోమయ విభూషణమ్, గీర్వాణారణ్య సంచారి విద్వన్మత్తేభ శృంఖలమ్ -అన్నట్లు తమ కీయాంధ్రము చిరకాల మభ్యసించినమీఁదగాని కొరకబడదు. ఈ యాంధ్రమునకు దిఙ్మాత్ర ప్రదర్శకములేకాని విరివిగ బోధించు వ్యాకరణము లింకను బుట్టలేదు. కావునఁ బూర్వ మహాకవు లన్నఁగా నప్పకవి మొదలగు లాక్షణికాగ్రగణ్యు లంగీకరించిన వారి సుప్రయోగములే శరణములు. ఈ ప్రయోగము ననేకులు మహాకవులు వాడియున్నారు. గ్రంథ విస్తరభీతిచే నొక్కటి మాత్ర మిచ్చెదము. తక్కినవి శ్రద్ధ గలిగి చూచుకొన్నచో నాంధ్ర భాషాపరిజ్ఞానము కలిగిన పిమ్మటఁ దమకే గోచరింపఁగలవు. విజయవిలాస పీఠికలో—

మ. "కలిగెంగా తన సమ్ముఖం బనియు సత్కారమ్ముఖాఁజేయు నా
తల నందే శిరసావహింతరనియున్. . . .

అను పద్యమును జూచుకొనుఁడు."

ప్రశ్న—అసలీ కాశీనాథశాస్త్రుల్లుగారు పాణిగృహీతా ప్రబంధ పీఠికలో "కాశినాథ బుధనేత విధాన వృథా వివాదముల్ పెంచకు డాగ్రహించకుఁడు పెప్పెపెయందురు మే మెదుర్కొనన్" అన్న పద్యంలో వ్రాయబడ్డ విద్వత్కవులు కారు గదా?

జవాబు— అవును. వారే! ఆదికాలంలో కృతివూహ్వానాన్ని సృష్టించి తి. వెం. కవులు విజయనగరం రావడానికి కారకులైనవారు. అనంద గజపతి మహారాజులుంగారికి గురువులైన ఆస్థాన విద్యాంసులు కూడాను.

ప్రశ్న— అయితే ఆ యూహ్వానానికి పూర్వం తి. వెం. కవులు విజయనగర సంస్థానాన్ని చూడనేలేదన్నమాట?

జవాబు—లేదు. విశాఖపట్టణందాకా వచ్చిన్నీ చూడడానికి వెళ్లలేదు. ఈ వెళ్లకపోవడం అక్కడి పండితులకు భయపడేనని కొందరి యూహ.

ప్రశ్న—అదుగో! కొందరి ఊహంటున్నావు. ఆ పక్షంలో అభిమానించేవారు కూడా కొందఱు పండితు లా నగరంలో ఉన్నారన్నమాటేగదా? అయితే తి॥ వెం॥ కవులు వెళ్లడానికి యెందుకు సందేహించారో?

జవాబు—ఎందుకా? విజయనగరంలో మహారాజావారి దర్శనంకావడం మహాకష్టం అని ఎవరో చెప్పినందువల్లనే—

ప్రశ్న—అయితే ఆ కృతివూహ్వానంలో సంతకం ఎవరిది?

జవాబు—తాతారాయుడు శాస్త్రుల్లు గారిది. వెళ్లి ఆ ఉత్తరం వారికి చూపిస్తే వారు ఆశ్చర్యపోయి ఇది నాచేవ్రాలు కాదు. ఇదిగో నా దస్కూరీ చూడండి అని సంతకంచేసి చూపించారు.

ప్రశ్న—అయితే ఆవిధంగా కాశీనాథశాస్త్రుల్లుగారే సంతకంచేసి పంపించారనడానికి దృష్టాంతమేమిటి?

జవాబు—అప్పటి ఆ నగరంలోని పండితలోకంలో ఏర్పడివున్న పరిస్థితుల, నాధారం చేసుకొని రాయుడుశాస్త్రులు నా రూహించిన వ్యక్తి దరిమిలా కాశీనాథ శాస్త్రుల్లుగారు కావడమేగాని వేరే దృష్టాంతం యేమీలేదు.

ప్రశ్న—ఈయన కవిత్వం కూడా చెప్పగలరా?

జవాబు—చెప్పగలరు. అవధానమున్ను చేయగలరని చెప్పడం వుంది. ఇటీవల పూర్వ శాకుంతల మనే నాటకం తెలుఁగులో వ్రాయడం జరిగింది. అది తి. వెం. కవులచే విమర్శింపబడి కామేశ్వరీ పత్రికలో ప్రచురింపబడింది. దానితోపాటే ఎడ్వర్డు పట్టాభిషేక విమర్శన ఖండనమున్ను ప్రకటింపబడింది. ఈ గ్రంథ విషయంలోనే—కథలు—గాథలు మూడో భాగం 101 వ పుటలో— శాస్త్రవాద ప్రసక్తిలో వేంకటశాస్త్రిగా రీలా వ్రాశారు.

"సర్వదా కవిత్వంలోనే కృషిచేసి శాస్త్రభగ్నత్వాన్ని సంపాదించుకున్న మమ్మును దానిలోనే పఠన పాఠనాలు జరుపుతూ వ్యాఖ్యానాలు వ్రాస్తూ, శాస్త్రార్థాలుచేస్తూ, ప్రసిద్ధిచెందిన శ్రీ కాశీనాథశాస్త్రుల్లుగారుగాని వేఱొకరుగాని సెల్లగొడతారన్నందుకు సర్వులూ అంగీకరిస్తారు. కాని, మాకున్ను మాకున్ను అట్టి ప్రసక్తి సంఘటించలేదు భగవంతుడు. కవిత్వవిషయంలోనే లక్ష్యలక్షణాలతో సంబంధించినచర్చ సమకూర్చాడు. కొంత చర్చ జరిగింది. ఏదో అయింది. అది గ్రంథరూపంగా అచ్చుపడేవుంది. యిప్పుడు కూడా ఆ రికార్డు నా వద్ద జాగ్రత్తలో వుంది."

ప్రశ్న— ఆ గ్రంథంపేరే ఎడ్వర్డు పట్టాభిషేక విమర్శన ఖండనముతో గూడిన పూర్వశాకుంతల విమర్శన మన్నమాట? సరే! ఆ గ్రంథం సంగతి అలావుంచి నువ్వు పైనచెప్పిన విషయాలకు వుండే ఆధారా లేమిటో చూపించగలవా? లేక పుక్కిటి పురాణమా?

జవాబు— చూపించ గలను. పుక్కిటి పురాణం కాదు. వేంకటరామ్యగారు వారి కట్టుకథలోని విషయాలు వారి తండ్రి

గొప్పైన సుందరం పంతులుగారివల్లా, ఆదిభట్ల నారాయణదాసు గారివల్లా తెలుసుకున్నానని వ్రాసినవ్రాత పుక్కిటి పురాణం అయితే కావచ్చు— ఎందుకంటారా? వెంకటశాస్త్రిగారి జీవితకాలంలో పై విషయాలు ముఖస్థంగా అడిగి తెలుసుకొనే అవకాశం బోలెడంతవున్నా వెంకటరావుగారు ఆ విధంగా చేయక వెం. శా. శతావధానిగారు స్వయంగా వ్రాసుకొన్న వారి జీవిత చరిత్రకు భిన్నంగా వ్రాశారు కనక వారిది పుక్కిటి పురాణం అయితే కావచ్చు. (నారాయణదాసుగారి మరణానంతరం కూడా సుమారు 4 ఏండ్లు వెం. శా. జీవించియే యున్నారు). నాకా విధంగా చెప్పాల్సిన అవసరం లేదు. జాతక చర్యనుండి పద్యాలే ఉదాహరిస్తున్నాను. పరిశీలించండి.

గీ. రమణ నయ్యనఘాత్ము దర్శనము జేసి
విభుని సెలవాయెనని తను పేర నచటి
పండితులు బూటకమ్మను బన్ని వ్రాసి
నటి యుత్తరమును జూపి యుట్టులనిరి

గీ. ఈ మహారాజు దర్శన మేరికేని
మగుట దుర్లభ మనియెంచి ఆత్మనెపుడు
నిటకు రాజాడ మెవ్వరో యిట్టి యుత్త
రమును వ్రాసిరి వేవేగ రండటంచు"

ఉ. రాయడు శాస్త్రి వ్రా లని భరమ్ముగ దీన నెపంగుటన్ ధగన్
బోయి తదీయ సన్నిధికి బొచ్చమొకింతయులేక యుత్తరం
బాయనకిచ్చి మీదయిన యాజ్ఞకు బద్ధులమై యిమున్ గడున్
రోయుచు వచ్చినారమన రోజుచు నాతఁడు మాకు నిట్లనెన్

గీ. ఇది యొకఁడు బూటకము పన్ని యిట్లు వ్రాసె
నంతియేకాని యేనేడ? నవనిపాలుఁ
డేడ? నీ యుత్తర మదేడ? నిదుగొ నాదు
లిపినిఁ జూడుఁ డటం చాత్మ లిపినిఁ జూపి

సీ. గత వత్సరము మీరు కదలి విశాఖపట్నణ మేగుదెంచి యట బహుదినము
లవధాన కారణ మగు వాస మొనరించి పదపడి యిప్పురవరము రాక
వెనుక కేగుటఁజేసి విద్వజ్జనులు కొంద రది తమ భయమున నంచు నెంచ
మరికొంద రవ్వారి కరిపక్షము వహించి మీ విశేషములు పేర్మిని గణించి

గీ. రిదియె కారణమంచు నే నెంతు దీని
కింతయేల? తనంతన సృష్టికర్త
మీకుఁబోడకట్టు నాతని వాకు గట్టెఁ
గలరు మీర లతండును గవితనల్లు

కం. అవధాన మొనర్చెద నాకవనిన్ సాటెవ్వరంచు నతఁడస్మా ద్వృ
క్పవిధమున వి అవీగు నొక విషయమే మీకు నిట్టి గర్వమడఁ
చుటల్.

గీ. ఏది యెటులైన మీరిట కేగుదెంచు
టస్మదాదులకెల్ల మోదావహమ్ము
దైవ వశమున మీకిటఁ దగిన లాభ
మబ్బెనేని నిమిత్తంబ నగుదునేను.

కం. అని యా బుధవర్యుఁడు వల్కెను నాతఁడు దొసిగాఁడు
కృత్రిమ మిదియె
ల్లను "గాశినాథ" నామంబునఁ దగు పండితునిదనియెఁ బోల్చె
నతఁ డొగిన్.

ప్రశ్న—ఇంక చాలును. ఇంతకీ అప్పట్లో రాజసన్మానాదికం తి. వెం. కవులకు జరిగినట్లేనా?

జవాబు—ఆహా! జరక్కేం? రాజదర్శనం కావడానికే సుమారు రెండు మాసాలకాలం పట్టింది. ఆ కాలంలో ఆ నగరంలో కొంతమంది వీర్ని ప్రోత్సహించి అవధానాలు చేయించి బంగారు బిరుదులతో సత్కరించారు. ఆ విషయం వనపర్తి సంస్థానంలో చెప్పిన:—సీ. గళమున బిరుదులు గైసేసె నముల పూర్వద్వాల విజయనగర పురములు— అన్న పద్యంలో ఉటంకరించారు. ఏమైనా రాజదర్శనం చేసికొనిగాని ఆ వూరు వదలిపెట్టడానికి తి. వెం. కవుల కిష్టంలేదు— రాజదర్శనమే కాకపోతే కవిత్వాన్నే వదలుకుంటామని (అత్రాపి దర్శనం నోచే త్కవితాయై నమోనమః) గట్టి శపథం చేశారు. చివరకు దర్శనం జరిగింది. సన్మానమున్ను జరిగింది. ఆ సందర్భం యీ పద్యాల్లో వుంది వినండి.

గీ. సరస పండిత మండలీ సహితుఁ డగుచు
నతఁడు తనమీఁది పద్యము లన్నియు విని
సంతసించి శాస్త్రంపుఁ బ్రసక్తియుఁ గని
కవుల కిట్లనె నాదృతి చవుకళింప.

కం. రామావతార మెద నెంతే మోదమువెంది మీకు నిచ్చెగదా? యీ
హేమంపు బిరుదు లియ్యది సామాన్యముగాదు మెచ్చఁ జను
మీ శక్తిన్.

కం. అని ప్రతి వత్సరమును రండని ఆనతియిచ్చి నూరులారు
లొసంగి మ
న్ననఁ జేసె నట్టిరేనిం గనఁబోల దతండు ఘనుఁడు కళలందెల్లన్.

ప్రశ్న—ఇంకేం. విస్పష్టంగా అరటిపండు వొల్చి చేతిలో పెట్టినట్లు విషయం చరిత్రలో వ్రాయబడే వుంది. దానిలోని కొన్ని సూత్రప్రాయ విషయాలకు వ్యాసావళిలో వివరణలున్ను కనిపిస్తూనే ఉన్నాయి— అయితే ఆ ఎడ్వర్డు పట్టాభిషేకము "నేటి సంపూర్ణ కృతులలో కానవచ్చుటలేదు" అని వ్రాస్తారేమిటి?

జవాబు— కానరాకేం! వేంకటశాస్త్రి షష్టిపూర్తి కమిటీవారు 1936 లో సంపూర్ణ గ్రంథావళిలో ముద్రించారు.

ప్రశ్న—ఆలాగా? అది వేంకటరావుగారు చూడలేదు కాబోలును. మరైతే తూర్పు గోదావరి— విశాఖ మండలాల సంస్థానాలకు—అందులోనూ 1. విజయనగరం 2. గొడేవారి (విశాఖ పట్టణం) సంస్థానములకు వొక్కమాటేగాని మళ్లీ మళ్లీ తి. వెం. కవులు వెళ్లలేదనీ, అసలు తునిదాటి ఆపైకి వెళ్లే భాగ్యం వారికి పట్టనేలేదనీ, బొబ్బిలికి వెళ్లకుండానే— ఒకవేళ వెడితే అక్కడ ఉద్దండులైన—అభినవాంధ్ర కవితా పితామహులు, మహామేధావులు—మహాకవులూ వున్నందున — గౌరవ సత్కారాలు జరగవని చెప్పి— ఆ సంస్థాన ప్రభువు శ్వేతాచలపతి రంగారావుగారు వీరిని విశాఖపట్టణం మకాముకు రప్పించి చెరి ఒక నూట పదార్లు ఇచ్చి సత్కరించారనీ, యీ సన్నివేశం 1896 లో జరిగిందనీ వ్రాశారే రావుగారు? యీ విషయాల మాటేమిటి?

జవాబు—ఇవన్నీ రావుగారు సప్రమాణంగా వ్రాసినవి కావు. ముందు విజయనగరం ఆనంద గజపతి కాలంలో వొకమాటు వెళ్లిన సంగతి యిప్పుడు తెలుసుకున్నదేగదా? ఆ పిదప మళ్లీ మరుచటి సంవత్సరం వెళ్లాలనైతే బయలుదేరడం జరిగింది. కాని మధ్య మకాం కాకినాడలో కొన్ని సభలు జరుగుతూ వచ్చి రెండునెలలపాటు ఆనందంగా కాలక్షేపం జరిగిపోవడంవల్ల ఆ ప్రయాణం కొనసాగా జరగలేదు. ఈ విషయం జాతకచర్య 99 వ పుటలో చూస్తే తెలుస్తుంది.

ఆ తర్వాత మళ్లీ శార్వరి (1900) నామ సం. రం. లో పొలతేరు జమీందారువారి గృహంలో జరిగిన వివాహానికి వెళ్ళి, తిరిగివస్తూ—కం. "నిజ దేశంబున కేగుచు గజపతినగరంబున సభను గావించియు బై విజయనగరమును గని" అని వ్రాసి ఉండడంవల్ల రెండోమాటు విజయనగరం రావడం జరిగింది. కాని అప్పటికే ఆనంద గజపతి గతించినందున ఆస్థాన సందర్శనం జరిగినట్లులేదు. ఆ తర్వాత 1929 సం. రం. లో బొబ్బిలి నుంచి తిరిగివస్తూ (కాశీయాత్ర 63 పుట చూ.) కళాశాలా విద్యార్థుల కోరికపై విజయనగరం వచ్చారు. ఈవిధంగా మొత్తం ముమ్మారు వెళ్ళడం జరిగింది.

ఇహ విశాఖపట్టణం గొడే గజపతిరావుగారి విషయమంటారా? నానారాజసందర్శనంలోని ' 'సంగర శక్తిలేదు" అన్న పద్యంవల్ల పురిటిలోనే సంది కొట్టినట్లు అవగతమవుతూనే వుంది.

ప్రశ్న—అవును—ఇంక బొబ్బిలి విషయం వుంది.

జవాబు—దీని విషయంలో 1896 లో విశాఖపట్టణంలో తి. వెం. కవు లిద్దరికిన్ని చెరివొక నూటపదహార్లూ ఇచ్చి పంపేరని వ్రాయడానికిగల ఉపపత్తి యేమిటో ప్రామాణి

కంగా రావుగారు సూచించలేదు. అక్కడి పండితులకు భయపడి వెళ్ళలేదనే మాట విశ్వాసార్హంకాదు. అలా పండితులకు భయపడే స్వభావం తి. వెం. కవులకు వుండేయెడల యున్ని రాజసంస్థానాలను వారు చూడడమే తటస్థించదుగదా? అదీగాక ఆ కాలంలో మాటపదహార్ల సన్మానం అంటే చాలా గొప్ప విషయంగా భావించేవారు. అట్టి సత్కారాన్ని ఆవిధంగా వారి వల్ల పొందివుండిన్నీ చరిత్రలో ఆ విషయం వ్రాయకుండా వుంటారా? పాలతేరు వివాహానికి వెళ్ళినపుడు అక్కడి అవధానంలో ఎవరో కోరగా ఒక సీసపద్యమున్ను—

("శతావధాన సారము 69 పుటనుండి) బొబ్బిలిరాజాగారు"

సీ. పోషించుచున్నాఁడు బుధవర్గములు జాలి
నంత ద్రవ్యము నిచ్చి యనుదినంబు
ఆర్జించినాఁడు ద్రవ్యంబు లక్షలకు ల
క్షలు స్వీయమైన రాజ్యమ్ము పెంచి
కట్టించినాఁడు చక్కని రీతి గోపాల
దేవుని కొప్పగు దేవళంబు
కావించినాఁడు నౌకా మార్గమున లండ
నున కేగి రాణి దర్శన సుకృతము

గీ. ఏలుచున్నాఁడు బొబ్బిలి నేలఁ గలఁడు
ప్రోచుచున్నాఁడు ప్రజలను బ్రోవఁగలఁడు
ఇచ్చుచున్నాఁడు కవులకు నీయఁగలఁడు
రన్న్య గుణపాళి శ్రీరంగరాయమౌళి.

ఆ వివాహ వర్ణన ప్రసక్తిలో నొక ఉత్పలమాలయున్ను

("నానారాజసందర్శనం 99 వ పుటనుండి")

ఉ. బెబ్బులిఁ బోలువాఁడహితభీముఁడు సౌమ్యుఁడు రాజమానితుం
డబ్బురమైన మేటి ధన మార్జన చేసినవాఁడు నేఁడుకన్
బొబ్బిలి నేలువాఁడు పరిపోషిత భృత్యుఁడు వచ్చెఁ బెండ్లికై
నిబ్బరమైన పేర్మి ధరణీపరిణేత సిరంగరా వొగిన్.

అప్పటి బొబ్బిలి రాజావార్ని గూర్చి చెప్పినట్లు పై శతావధానసార— నానారాజ సందర్శనముల వల్ల తెలుస్తోంది—ఈ ప్రసక్తికిన్ని వెంకటరావుగారు వ్రాసిన సన్నివేశానికిన్ని సంబంధంలేదు. ధర్మేలా వారి పౌత్రుని పట్టాభిషేక మహోత్సవానికి 1927 ఆహ్వానింపపడి వెళ్ళినప్పుడు చెప్పిన పద్యాలలోనైనా పై విషయం జరిగేవుంటే స్మరించకుండా ఉంటారా? యీ పద్యం చూడండి!

మ. ఎలమిన్ దిర్పతివేంకటేశ్వరులచే నెందున్ దెలుంగున్ ధరాస్థలి రాజుల్ ప్రతివారు చూడబడుటల్ దత్తద్యశంబుల్ నభస్థలి రిక్కల్‌బలె వెల్గ బొబ్బిలికి దద్భాగ్యంబు లే దన్న యున్నలుపున్ నీ పరిపాలనంబు దొలఁచెన్ వస్నీవు రప్పించుటన్

దీన్నిబట్టి అంతకుముం దెప్పుడున్ను ఆ సంస్థానంతో వీరికి ప్రసక్తి లేనట్లే ధ్రువపడుతూందిగదా?

ప్రశ్న—అందుకని 1896 లో జరిగిందని వెంకటరావుగారు వ్రాసిన సన్నివేశం జరుగలేదంటావు—సరే! ఆ తర్వాత మరి 37 ఏండ్లకు 1933 సం. రం. లో వేంకటశాస్త్రిగారు బొబ్బిలి యుద్ధ నాటకాన్ని రచించి వారి పౌత్రులకు అంకితం చేశా రంటున్నారే? మరి దాని మాటేమిటి?

జవాబు—వెంకటశాస్త్రిగారు రచించింది బొబ్బిలియుద్ధ నాటకంకాదు. బొబ్బిలి పట్టాభిషేకమనే ప్రబంధం—దీని రచన 1927—28 సం. రాలలో జరిగిందిగాని 1933 లో కాదు. 1929 సం. రం. లో దీని కృతిసమర్పణ బొబ్బిలి సంస్థానంలోనే జరిగింది. కాబట్టి పట్టాభిషేక (1927) మహోత్సవాని కొకమాటు—కృతి సమర్పణ (1929) మహోత్సవానికొకమాటు వెరశి రెండుమార్లు వెం. శా. గారు బొబ్బిలి వెళ్ళడం జరిగింది. వెంకటరావుగా రీ సందర్భంలో రాసిన "అప్పుడైనా వారు బొబ్బిలి రాలేదు" అనే వాక్యాలు పూర్తిగా ప్రమాద పతితాలు.

ప్రశ్న—కనుక 1891 సం. రం. మొదలుకొని 1920 సం. రం. వరకు జరిపిన దేశాటనంలో తి. వెం. కవులు విజయనగరం రెండుసార్లున్ను విశాఖపట్నం గోదేవారి సంస్థానానికి వొకసారిన్ని వెళ్ళడం జరిగినట్లున్ను—బొబ్బిలి పిఠాపురాలకు వెళ్ళనట్లున్ను తేలింది.

జవాబు—అవును. 1896 లో బొబ్బిలిరాజావారు విశాఖపట్నంవచ్చి సత్కరించారని వెంకటరావుగారు వ్రాసినదానికి గల ఆధారమేమిటో వారు వ్రాస్తే దాని విషయంలో ఆలోచిద్దాము. పిఠాపురం ఎందుకు వెళ్ళలేదో గీరతం సమగ్రంగా తెలుపుతుంది. అందులో ఆ యీ విషయాన్ని వ్యంగ్యంగాను వాచ్యంగానున్ను తెల్పేవి కొన్ని పద్యాలు వున్నాయి. చూచుకోండి—అవి అన్నీ ఇక్కడ రాయాలంటే తేలే విషయంకాదు. వెంకటరామకృష్ణ కవులతో గల వివాదయే తి. వెం. కవులకు పిఠాపురాస్థానంలో ప్రవేశం కంగక పోవడానికి కారణం అనేమాట నమ్మదగ్గదికాదు. ఆ మాటకువస్తే వెం. రా. కవుల ప్రవేశానికిముందే ఆ యాస్థాన సందర్శనం చేసియుండవచ్చునుగదా? అలా కూడా జరిగియుండలేదు. ఇందుకు రాజకీయంగా ఆలోచిస్తే ఆ రాజావారికి ప్రతికక్షులైన అప్పటి జమీందార్లతో అతిసన్నిహితమైన సారస్వత సంబంధం—తి. వెం. కవులకు వుండడమే ముఖ్యహేతువుగా పేర్కొనవలసి వుంటుంది. అదిన్నీగాక గీరతంలోని—

ఉ. రేఁడు పరాపరోక్తుల నెరింగి విచారణ సేయఁడేని నా
రేఁడును రేఁడె తన్ననుసరించిన శ్రీఫల మిచ్చుచుండు—నే
రేఁడును రేఁడె అయ్యది భరించు ద్విజప్రకరమ్ము నెల్లఁ బూ
రేఁడును రేఁడె అయ్యది చరించెడి సత్పథమందు పొందుగన్"

ఇత్యాది పద్యములున్ను "పిండిబొమ్మ" వగైరా పద్యములున్ను ఇందుకు తార్కాణములు—ఈ విషయం ఇల్లా వుంచుదాం.

వెంకట రామకృష్ణ కవులు రాసిన "శతఘ్ని" పాండవాశ్వమేధముమీది విమర్శగాని పాండవ రాజసూయముమీద రాసింది కాదు. పై శతఘ్నిని ఖండిస్తో తి. వెం. కవులు రచించిన "పాశుపతము" మీద "పరాస్త పాశుపతమును" వెంకట రామకృష్ణ కవులు వ్రాయగా దాన్ని తి. వెం. కవులు "పురశ్చరణము" అనే గ్రంథం

వ్రాసి ఖండించారు. ఇది వేంకటరావుగారు వ్రాయని విషయం. ఇవి చారిత్రక విషయాలు గనుక వేంకటరావుగారి రాతలోగల పొరపాట్లు సూచించాను.

ప్రశ్న—నిర్మొహమాటంగా సూచించవలసిందే! అయితే "1920 లో తిరుపతి శాస్త్రిగారి జ్ఞాపకార్థం విశాఖపట్టణం హిందూ పఠన మందిరంలో నెలకొల్పిన ఛాయాచిత్రాన్ని ఆవిష్కరించడానికి వెంకటశాస్త్రిగారి నాహ్వానిస్తే తునిదాటి ఆ పైకి వెళ్లే భాగ్యం నాకు కలగలేదు" అని జవాబివ్వడం నిజమే నంటావా?

జవాబు—ఎల్లా అంటాను? నిజం కాదనే అంటాను. అదే కాదు. ఇపుడు జీవించివున్న తిరుపతిశాస్త్రిగారి కుమారుడు వేంకటావధానిగారు "కాశీ సహస్రము" లభ్యం కాలేదని చెప్పిన సంగతిన్ని—పోలవరం సంస్థాన ప్రభువు తి. శా. గారికి కాకినాడలో స్థిరముగా నివసించుటకు నొక వసతిని గూడ నిర్మించి ఇచ్చినట్టు 1971 ఏప్రిల్‌నెల భారతీ పత్రిక 34 పుటలో వ్రాసిన విషయమున్ను నిజం కావనే అంటాను.

ప్రశ్న—ఎందుచేత?

జవాబు—కాశీసహస్రం అచ్చైన ప్రతి నూపద్ద ప్రండమం చేతనున్ను—తిరుపతిశాస్త్రిగారు యావజ్జీవితమూ అదే యింటిలోనే ఉండడంచేతనున్ను ఇవి నిజాలు కావుగదా? ఇహ వెంకటశాస్త్రిగారు కథలు—గాథలు తృతీయభాగం 243 వ పుటలో వ్రాసి ప్రచురించిన

"తూర్పుదేశ ప్రయాణం పెట్టుకుని తాల్కాలికవాసం విజయవాడనుంచి బయలుదేరి మొదటి మకాం కాకినాడకు వచ్చి తి. శా. ని రమ్మని నూమోలుగా పిలిచాను. జమీందారుగారు సెలవిస్తారో యివ్వరో యితడు నాతోని అడక్కుండానే యీలా జవాబిచ్చాడు—"నేను సభనాటికి వస్తాను. నీవు సర్వ సంసిద్ధం చేసి తంతి నివ్వవలసింది". అనేటప్పటికి నాకు కొంచెం భారంగా తోచి మనస్సులో అనుకున్నాను. యేమనంటె—"సరే! నేను అసహాయంగా సభ నిర్వహించలేకపోతే ఆరాగే తంతినిచ్చి నిన్ను సభవేళకు రప్పించుకుంటానులే!" యీలా అనుకొని సన్నిహిత సహాయానికి మా పినతండ్రి కొడుకు ఐన వేంకటశాస్త్రిని వెంట బెట్టుకుని ప్రయాణం సాగించి అనకాపల్లి మొదలుకొని మందసా వరకున్ను అవధానాలు చేశాను."

పై వాక్యాలవల్ల తునిదాటి వెళ్లినట్టు స్పష్టపడుతున్నందున వేంకటరావుగారి రాతలు సరి కావు.

ప్రశ్న—1920 లో తిరుపతిశాస్త్రిగారి మరణానంతరం కూడా వెంకటశాస్త్రిగారు చెప్పినా తునిదాటి రాలేదు అనె వెంకటరావుగారి వాక్యాల మాటేమిటి?

జవాబు—ఇవి మరీ పొరపాటు వాక్యాలు. 1927 లో బొబ్బిలికి వెళ్లడం అక్కడ

"ఉ—జనపతివల్ల మేల్మిపని సొలువు లర్ధ సహస్ర రూప్యముల్ కనకమయమ్ము కంకణ యుగమ్మును సత్కృతిగాంచి"

రావడమున్ను—మళ్ళీ 1929 లో వెళ్లినప్పుడు — బొబ్బిలి సంస్థాధీశ్వరు ప్రబంధ కృతి సమర్పణ మహోత్సవానంతరం—

గీ. వేయిన్నూటపదార్లు నాణెములు, నిలువు జోడునం
గరాపాలశేఖరుండు
గౌరవ మొసర్చి యిచ్చెను గదిసి మాకు, లారు పంపించు"

వాస్తవ ఘటన గౌరవం పొందడమున్ను జరిగి వున్నాయి.

ప్రశ్న - ఇంతేనా! ఇంకా యేమైనా వున్నాయా?

జవాబు - ఇవి చాలవేమిటి? యింకా విక్రమదేవవర్మ (జయపూరు సంస్థానం) మహారాజావారు నేయిన్నూటపదార్లతో (1935) లో విశాఖపట్టణంలో సన్మానించారు—"విక్రమ వెళ్ళ పెళ్ళి" అప్పుడు రాసినదే! యీలా వున్నప్పటికీ "తునిదాటి వెళ్ళలేదనడం" నిజ మెరిగి వ్రాసిన వ్రాత యేలా అవుతుందో సెలవివ్వండి?

ప్రశ్న అట్లను—మరి పిఠాపురం మహారాజావారి పెద పల్లిపేరు చెరిగాని వెల్లయ్యమ్మారావుగారేనా?

జవాబు - పై మహారాజావారికి వెల్లయ్యమ్మారావుగారు సవితల్లి కాని పెద్దతల్లికారు. వెల్లయ్యమ్మారావుగారి యింటిపేరు వాసువారు. చెలికానివారు కాదు.

ప్రశ్న - అయితే వీరి బంధువులు కారు విన్నారావుగారేనా? తిరుపతి వెంకటకవుల్ని బాగా ఆదరించేవారట! వారిపై వ్రాసిన పద్యం—"నానారాజ"లో ఉదాహరించలేదట నిజమేనా?

జవాబు— తి. వెం. కవుల్ని బాగా ఆదరించే విన్నారావుగారి యింటిపేరు "ఇనుగంటి" వారు కాని రావువారు కాదు. వీరు కీర్తంపూడి జమీందార్లు. వీరు గొప్ప కవితా రసజ్ఞులు. ఇంత అందగాణ్ణి యెక్కడా చూడలేమంటూ నానారాజసందర్శనంలో చాలా గొప్పగా వీరిని వర్ణించారు. ఆ సందర్భంలోనే వేంకటరావుగారు రుదాహరించిన "శ్రీ ఉండరము" అన్న శార్దూలం ప్రకటితము. ఆ ఘట్టంలో అంతకన్న రసవత్తరమైన పద్యాలు ఇంకా ఉన్నాయి. పరిశీలించండి! మహాకావ్య గ్రంథంలో ప్రతి రసవత్తరమైన పద్యమున్ను ఉదాహరించడం సాధ్యపడుతుందా?

ప్రశ్న సరే! 1971 ఏప్రియల్ నెల భారతీ పత్రికలో తి. వెం. కవులు ఇద్దరున్ను పోలవర సంస్థానాధిపతివద్ద ప్రవేశించడం మాటేమిటి? అది నిజమేనా?

జవాబు - నిజంకాదు. వారివద్ద వున్నారు తిరుపతి శాస్త్రిగారు మాత్రమే. వేంకటశాస్త్రిగారే మహారాజువద్దను స్థిరనివాసం చేయలేరు. అటి వారికి నచ్చలేదు.

మం. ఏరనాథుని వలయునని మిత్రులంటు యున్నంగాని వత్సప్రథిని
స్థిరవాసం బొనరించుమనటి వని నాడేనాడు"

అని కాకేశ్వర శతకంలో కూడా వ్రాసుకున్నారు. జీవిత చరిత్రలో సైతం - "ఆ క్షిష్మ రాయనియొక్క నొక్కరుండిరి ఘనముగు పండిత పదంబు సైకొని" అని వ్రాశారు. ఆ ఘట్ట సందర్భంలో

"దివాకరాస్తమయము"లో గూడా కొంత వ్రాయబడివుంది. చూచు కోండి!

బందరు హిందూ హైస్కూలులో ఉపాధ్యాయులుగా 13 సం. లు పనిచేసినను, ఆ కాలం యావత్తూ సర్వస్వతంత్రంగానే నడచినట్లు విషయజ్ఞులైన శిష్యులు చెప్పుకుంటారు.

ప్రశ్న—తిరుపతి వేంకట కవుల గ్రంథములు వెలుగు లోనికి రావడానికి పోలవరం సంస్థానాధిపతులు నడిపే "సరస్వతీ పత్రిక" ఒక్కటియే కారణమా?

జవాబు—దేశాటన రీత్యా అప్పటికే కీర్తిమంతులైన తి.వెం. కవుల ఆంధ్రీకృతులలో కొన్నిన్నీ, స్వతంత్ర రచనలలో కొన్నిన్నీ సరస్వతీ పత్రికవల్ల వెలుగులోకి వచ్చినప్పటికి—సర్వ జనాకర్ష ణీయమైన వారి కవితారసోల్బణశక్తియున్ను, దానితోపాటు బందరు భైరవ ప్రెస్సున్ను గూడా పేర్కోవలసియుంటుంది. ఇది వారికి స్వంతప్రెస్సువలె గ్రంథాలు ముద్రింపుకోవడానికి ఉపయో గించింది. సరస్వతీపత్రిక 1912 లో నిలిచిపోయింది. భైరవ ప్రెస్సుతో సంబంధం 1916 లో సడలిపోయింది. కావున ఎటు చూసినా ఒక పుష్కరకాలంపాటు మాత్రం యీ రెండూ కూడా కారణాలనే నిర్ణయించవలసి వుంటుంది.

ప్రశ్న—ఇహ వ్యావహారిక భాషలో వ్రాసిన "పల్లె టూళ్ళ పట్టుదలలు" అనే ప్రహసనం వుంది—ఇది వెంకట శాస్త్రిగారితో గలసి తిరుపతిశాస్త్రిగారు రచించినదేనా?

జవాబు—కాదు. "ఆంధ్ర భాషా నధూటికి. . . . మాత్రములు తెంపకుం డాంధ్రభూరులార?" అని వ్రాసిన తిరు పతి శాస్త్రిగారి గ్రాంధిక భాషావాదానికి పరోక్ష ఖండనరూపంలో అపవాదగా నుండుటకై వెంకటరావుగా రావిధంగా వ్రాసి వుంటారు గాని ఆ ప్రహసనం కేవలమూ వేంకటశాస్త్రిగారు వ్రాసింది మాత్రమే. తిరుపతి శాస్త్రిగారు ఆమరణాంతమూ గ్రాంధిక భాషావాదులేగాని గ్రామ్యభాషా రచయితలుకారు.

పల్లెటూళ్ల పట్టుదలలు

కాకినాడ తాలూకా ఇంజరం గ్రామంలో జరిగిన యితి వృత్తము. దాని రచనానాటికి వెం. శా. గారి నివాసం ఇంజరం. అందలి "బంధువిరోధి" పాత్ర వేంకటశాస్త్రిగారిదే. తక్కిన పాత్రల నిజనామధేయాలు తత్తత్కులైన పెద్దలు నేటికీ చెప్పేవా రున్నారు. జాతక చర్యలో పై ప్రహసన విషయంలో యిలా వ్రాశారు.

గీ. పైని దగు బంధువులు వృథా వైరమూని
యితర శాఖీయులగు వారి కెగ్గొనర్చ
గడగుటయు న్యాయమనుయుద్దిగాని వారి
నితడు వారించె గవితచే హితము గఱపి"

పై పద్యంలోని కవితయే ఆ ప్రహసనము. ఇది వారి నియ మానుసారం ఉభయకర్తృకంగా ప్రకటీకృతమైనది. అంతేగాని ఆ రచనతో తి శా. గారికి సంబంధంలేదు. ఇదేగాక బందరులో ఉద్యోగంచేసే కాలంలో "స్కూలు పిల్లల ప్రహసనము"—"రసా భాసము" అనే రెండు చిన్న ప్రహసనములు కూడా వ్యావహారిక భాషలోనే వెం. శా. గారు రచించారు. ఆ రచనలతో గూడా తి. శా. గారికి ప్రమేయంలేదు.

ప్రశ్న—బాగుందయ్యా! క్రొత్త విషయం చెప్పేవు! దీనివల్ల, వీరి గ్రామ్య భాషా రచన గిడుగువారి వాదాని కిటీవలిది కాదని కూడా తేలింది. అయితే "గిడుగా? పిడుగా?" అన్న వ్యాసం 1937 లో రాసిన దర్మిలానే వెంకటశాస్త్రిగారు చాలా వ్యాసాలు వ్యావహారికంలో వ్రాశారంటారే—దాని సంగతేమిటి?

జవాబు—అదీ పొరపాటే. 1903 సం. రం. లో పల్లెటూళ్ళ పట్టుదలలు వ్రాసిన పిదప వ్రాసిన స్కూలుపిల్లలప్రహసనము వచ్చేరాకు తరువాత బహుకాలానికి వెం. శా. గారు 1934 లో "కాశీయాత్ర" అను దీర్ఘ వ్యాసాన్ని వ్రాసి కృష్ణాపత్రికలో ప్రచు రించారు. దానిపై భాషాలోకంలో ఒక పెద్ద సంచలనం కలిగింది. అప్పట్లో—తాము పై వ్యావహారికభాషను ఉపయోగించడంలో గల ఔచిత్యాన్ని "కవిత్వమంటే యేమిటి?" అనే వ్యాసంలో విప దిస్తో వారి యుద్దేశ్యాలన్నీ యుక్తియుక్తంగా వివరించారు. తదారభ్య వారు వ్యావహారికాన్నే వచనాలలో వాడుతూ "విక్రమ చెళ్లపిళ్ల" "షష్టిపూర్తి" లోనైన గ్రంథాలు వ్రాస్తూవచ్చారు. కాని "గిడుగా! పిడుగా" అనే వ్యాస రచన చేసిన తర్వాత మాత్రం కాదు.

ప్రశ్న—తిరుపతి శాస్త్రిగారి మరణానంతరం రాజమహేంద్ర వరంలో గిడుగువారు చేయించారని వ్రాసే సభలో పంతులుగారు తి. వెం. కవుల "దోసమటంచెఱింగియును" అన్న విసాల పద్యంలోని "గెల్చిరేని" అను క్రియా పద ప్రయోగం తప్పని చూపించి వెం. శా. గారిచేత తమ పాండిత్యానికి జోహార్లందుకున్నట్లు వెంకటరావుగారు వ్రాస్తో ఆ సభానంతరమున మఱికొన్ని దినము లకే చెళ్లపిళ్లవారు కృష్ణా పత్రికలో—గిడుగా! పిడుగా!—అన్నవ్యాసం రాశారని వ్రాస్తారే? దీని మాటేమిటి?

జవాబు—"గిడుగా! పిడుగా!" అన్న వ్యాసం 1937 లో వ్రాశారు. తిరుపతిశాస్త్రిగారు 1920 లో గదా చనిపోయింది? ఓం ప్రథమంగా కృష్ణాపత్రికలో వెం. శా. గారు వ్రాసిన గ్రామ్య భాషా వచన వ్యాసం 1934 లో ప్రచురింపబడింది. వారు చెప్పే సమావేశం ఎప్పుడు జరిగిందో మనం తెలుసుకోవాలంటే—పై సంవత్సరాల వ్యత్యాసాన్ని దృష్టిలో ఉంచుకుని వెం. శా. గారు కథలు—గాథలు ద్వితీయభాగం 376 వ పుటలో వ్రాసిన—

"సుమారు ముప్ఫై యేళ్ళకు పూర్వం వీరు (గిడుగువారు) బందరు దయచేసినప్పుడు నన్ను కలుసుకుని కొంచెం ప్రయో గాల విషయమైన ప్రస్తావన చేశారు. ఏవో నాలుగు మాటలు నాకు తోచినవి వ్యతిరేకంగానే మాట్లాడినట్టు జ్ఞాపకం. . . . ఇటీవల మా తిరుపతిశాస్త్రుల్లున్ను వారున్ను కలుసుకున్నారుగాని

నే నెప్పుడున్నూ కలుసుకోనేలేదు" అనే వాక్యాలు చదువుకుంటే వేంకటరావుగారు వ్రాసిన సభా సందర్భం జరుగలేదనే నిష్కర్షగా తెలుస్తుంది. ఇక మీసాల పద్యంలోని "గెల్వలేని" అనే క్రియా పద ప్రయోగాన్ని గూర్చి పరిశీలిస్తే అది యిప్పటి ప్రతులలో "గెల్వ లేని" అని ముద్రింపబడి కనుపిస్తూన్నందున వేంకట రావుగారి కల్పన నిజమేమోనని కొందరు అనుమానపడడాని కైతే అవకాశం లేకపోలేదు గాని దాని విషయంలో గూడా— కథలు—గాథలు—ద్వితీయ భాగంలో 298 వ పుటలో ఏవిధంగా వ్రాశారో చూడండి?

"యిక మధ్యమపురుషార్థమున గెల్వలేని. . . . అనే దాన్ని గూర్చి వ్రాస్తాను. సామాన్యులకు యిక్కడవున్న విశేషం బోధపడ దనే ఉద్దేశంతో వారి వారికి పంపే సందర్భాన వ్రాస్తకాలలో "గెల్వ లేని" అని దిద్దియే పంపిస్తున్నాను. . .. యిక అక్కడ వున్న విశేషమేమిటంటే? వినండి! గౌరవార్థకమైన భవచ్ఛబ్దార్థకమైన మీరు అనే కర్తకు సంస్కృతంలోవలెనే ప్రథమ పురుషమును ప్రయోగించుట యుక్తమని పాశుపతంలో— "మీర లుండిరనెడి కారణమ్మునని" అనేచోట వ్రాసి వున్నాను. అట్లే యిక్కడా గూడ మేము తలలు పాదములవద్ద వుంచి మ్రొక్కం దగువారు మాకెంతో గౌరవించదగ్గవారుగా ఉండాలనే మాటకు వప్పుకోని వారుండరు గనుక ఆ గౌరవాన్ని తెలిపే నిమిత్తం అక్కడవున్న "మీ" అనేది భవచ్ఛబ్దార్థకమంటే సరిపోతుంది. ఇంతవరకు విచారించి ప్రయోగించిందో కాదో గాని ఆక్షేపకులు (శ్రీపాదవారు) వాడుకొన్న "చ. అని మొన మీరలుండి రనినంత" అనే ప్రయోగం కూడా యీ మార్గంచేతే సాధించవలసి ఉంటుంది. కాదు కూడదు దిద్దుకుంటాము మేము అని విమర్శకు లనే ఎడల వారితోపాటు మేమున్నూ దిద్దుకొందుము. వట్టి పటాటోపం వస్తే మాత్రం దిద్దనక్కరలేదని పైన వ్రాసి ఉన్నాను"

పై వాక్యాలవల్ల—గిడుగువారు—గెల్వలేని తప్పు ప్రయోగ మనడమున్నూ అక్కడి పండితులు చెప్పలేక పోవడమున్నూ అసంగతమే అని నిర్ధారణ అవుతూనేవుంది కదా? అంతేగాని ఆ క్రియ యేవిధంగా ప్రయోగించాలో తెలియనంతటి అపండితులు తి. వెం. కవు లనుకోవడంకంటే అమాయకత్వం వేరే వుండ దనుకుంటాను. ఎవరి గ్రంథాలలోని పదప్రయోగాల్ని మనం విమర్శింప దలచుకొన్నామో ఆనాటికి అచ్చుయివున్న వారి గ్రంథాలన్నీ బాగా పరిశీలించిగాని అందుకు పూనుకోగూడదు. మధ్యకాలంలో యథార్థంగా జరిగిన విషయాలైతే మనకు పరిగ్రాహ్యాలే. కాని ఆవిధంగా కూడా యీ వ్యాకరణ దోష విషయ ప్రసంగం జరిగియుండలేదన్నట్లు "గిడుగా! పిడుగా" వ్యాసంలోని వెం. శా. గారి వాక్యాలే సాక్ష్యమిస్తున్నాయి. పై విధంగా వెంకట రావుగారు వ్రాసి గిడుగువారి పాండిత్య ప్రకర్షను ఒక విధంగా కించపరచడమే జరిగిందిగాని యే విధమైన ప్రయోజ నాన్ని సాధించలేదుగదా? గిడుగువారి పాండిత్యాన్ని వెంకటశాస్త్రి గారు ప్రశంసించేమాట నిజం. కాని వారి వాదానికి అంగీకరించి మాత్రం కాదు. గిడుగువారు చూపించే పదాలలో చాలా భాగం వెం. శా. గారు పూర్వకవి ప్రయోగాలు చూపించి సమర్థించేవే! ఏ స్వల్పమో గ్రామ్యా లున్నాయున్నంత మాత్రంచేత కవియొక్క కవిత్వమంతా అదేవిధంగా ఉండాలనే వాదాన్ని మాత్రం ఎన్నడూ వారు సమర్థించి యుండలేదు.

వెంకటశాస్త్రిగారిచే వ్రాయబడిన జాతక చర్య—ఇటీవలి చర్య—అనే గ్రంథాలున్నూ, వీటి కనుబంధంగా వుండే నానారాజ సందర్శన శతావధానసారములున్నూ, కథలు—గాథలు వ్యాసావళి యున్నూ తి. వెం. కవుల సమగ్ర సారస్వత జీవిత వైభవాన్ని యదార్థ స్థాయిలో తెలిపేవిగా ప్రకటీకృతమై యుండగా ఏవేవో పుక్కిటి పురాణాల నాధారం చేసుకుని చరిత్రలో సంగతపడని విషయాలు యథార్థ విషయాలుగా చిత్రించడంలో వెంకటరావుగారు చేసిన కృషి చూస్తే వీరు తిరుపతి వెంకట కవుల గ్రంథాలన్నీ పరిశీలించని పరిస్థితిలోనే "తిరుపతి కవుల సాహిత్య సమీక్షా" గ్రంథంమీద కొన్ని సవరణలు ఉపపాదించే ప్రత్యక్ష పరోక్ష విమర్శా స్వరూపాలలో లోకాన్ని సందిగ్ధావస్థలో పెడుతున్నారనీ తి. వెం. కవుల లోకోత్తర ప్రజ్ఞా విశేషాలను ఆకాశానికి ఎత్తుతోనే వారి జీవిత పవిత్ర రచనకు భిన్నత్వాన్ని ఆపాదిస్తున్నారనీ వెల్లడి అవుతోంది.

చూడండీ—లబ్ధ ప్రతిష్ఠులైన హరికథా పితామహులు శ్రీ మదజ్జాడాదిభట్ల నారాయణదాసుగార్ని శృంగభంగ ప్రసక్తిలో నుదాహరించి— తమ తండ్రిగారున్నూ—నారాయణదాసుగారున్నూ ఆ విషయం తమకు చెప్పినట్లుగా వెంకట్రావుగారు వ్రాశారు.

శ్రీ నారాయణదాసుగారు ఏ ప్రసక్తిలో ఎక్కడ ఎందుకు వీరి కీ శృంగభంగ విషయం చెప్పవలసి వచ్చిందో మాత్రం ఉదాహరించలేదు. వ్యాకరణశాస్త్రంలో కూడా విద్వన్మణులైన నారాయణ దాసుగారు కౌముదిలోని మొదటి సూత్ర పూర్వపక్షానికే తి. వెం కవులు జవాబు చెప్పలేక పోయారని చెప్పినట్లు రాయడంవల్ల ఆ నారాయణదాసుగారికిన్నీ కౌముదిలో మొదటి సూత్రమేదో—సంధి ప్రకరణంలోని మొదటి సూత్రమేదో—తెలియదన్నంతవరకు వెంకటరావుగారు వారి పాణినీయ ప్రవేశాన్ని చరిత్రలో సూచించినట్లు అవుతోంది—అదిన్నీగాక వీరి కీ విషయంలో ఏదో అనుమానం కల్గితేనేగదా వార్ని ప్రశ్నించవలసి వస్తుంది? వారు అలా చెప్పలే అనుకుందాం.

"జీవతః కవేః ప్రష్టవ్యః"

అనికదా అభియుక్తోక్తి. అట్టి విధంగా అప్పటికింకా జీవించియే వున్న వెంకటశాస్త్రిగారినే అడిగి నిజ సందర్భం వేంకటరావుగారు తెలుసుకోవచ్చునుగదా? నారాయణదాసుగారు 1944 సం. రం. లో జీవయాత్ర చాలించారు. వెంకటశాస్త్రిగారు 1950 సం. రం. లో శివ సాయుజ్య మలంకరించారు. 1944 లోనే పరమపదించిన

నారాయణదాసుగారు చెప్పినట్లు [illegible]—నిజమా? కాదా? అని తెల్సుకోవడానికి [illegible] కూడా వుంది. అట్టి సందర్భంలో—ఏమండీ శాస్త్రిగారూ! మీరు "నేను వెక్కిరించాను" అని ఘంటాపథంగా వ్రాశారే? [illegible] మీకు జరిగిన "[illegible]" [illegible] జరిగివున్నదిప్పు వెంకటశాస్త్రిగారే స్వయంగా [illegible]? అసలు ఒకరు చెప్పటం ఎందుకు? ఆ విషయం 1939 సం. రం. లో ఆంధ్ర పత్రికలో [illegible] తమై వుండనేవుంది. అయితే అది [illegible] వుంటుందంటారా? అలా [illegible] వెం. శా. గారి ద్వారా తీర్చుకోవడానికి అభ్యంతరంలేదుగదా?

వెంకటరావుగారు ఈ విధానాలలో దేనినీ [illegible] డాన్నిబట్టే నేను వారి హృదయాన్ని [illegible].

ప్రశ్న-అంతేనంటారా? [illegible] శాస్త్రిగారి [illegible] పద్యంలో ఏవో కొంచెం భేదం ఉండవచ్చు [illegible].

జవాబు—ప్రతి [illegible] ఏవో [illegible] వుండకుండా ఉండవు. ఈ [illegible] శాస్త్రిగారి వ్యాసంలో వెం. శా. గారి [illegible] (ఆ. [illegible] 148 పుట) [illegible] వ్రాయడమున్నూ—ఆత్మకూరు [illegible] సందర్భంలో వ్రాసిన "గుణాంగుడు" "దేవతలు ధర్మపర్తులు" అన్న రెండు పదములున్నూ [illegible] వెంకట కవులవిగానే [illegible] భేదాలు గోచరించడంలేదు. "గుణాంగుడు" పదము తి. వెం. కవులు దేవీభాగవతంలో వాడినది—దాన్ని ఆత్మకూరి పండితులు [illegible] భారతంలో "దేవతలు ధర్మపర్తులు" అనే పద ప్రయోగాన్ని చూపి తప్పుకాదని తి. వెం. కవులు సమర్థించుకున్నారు—ఇది విషయం—మిగిలినవి అన్నీ వారి జీవిత చరిత్రకు సంబంధించినవే ఉన్నాయి.

వెంకటరావుగారే [illegible] కట్టుకథలు (ఏప్రిల్ 71 భారతిలో—పోలవరపు సంస్థానాధిపతితో ఒక [illegible] చేసుకున్నారట, ఉగాది సంచికలో [illegible] అసలు [illegible] ఇత్యాదిగ) యిన్ని అసందర్భ విషయాలు చరిత్ర కెక్కించాలని కృషి చేస్తున్నారు—[illegible] పాఠకలోకం గుర్తించగలుగుతుంది.

ప్రశ్న--ఎందుకు గుర్తించదు? తప్పకుండా గుర్తిస్తుంది. సర్వ విషయాలూ తమ జీవిత చరిత్రలో [illegible] తి. వెం. కవులు వ్రాసుకున్నదానికన్న ప్రామాణికం [illegible] లోకంలో [illegible] ముంటుంది? కాబట్టి [illegible] వ్రాసినా లోకులు దాన్ని అంగీకరించబోరు—సరే! ఆ విషయం [illegible]—ముద్రిత గ్రంథ చింతామణిలో [illegible] ప్రయోగాలు అంటూ వెంకటరావుగారు [illegible] శబ్దాల మాటేమిటి?

జవాబు--ఏది? "కృష్ణరాయడు" అన్నదాని మాటేనా? అది తప్పు కాదని వారే వ్రాశారే?

ప్రశ్న—అదికాదయ్యా! "వ్రేరి పడుచుఁడవు" అన్న శబ్దం మాట. ఇది తప్పేనా?

జవాబు—తప్పుకాదు. పడుచు శబ్దం ఉభయలింగం గనుక పుంలింగ వివక్షకై "డు" ప్రత్యయం చేర్చనక్కరలేదని వెంకటరావుగారు వ్రాశారు. అంతేగాని సహజంగా లింగ వివక్షతలో మహ విభక్తి ప్రత్యయాదులు రావనే నిషేధం శాస్త్ర రీత్యా వారు చూపించలేదు. కనక "పడుచుఁడు" అనే శబ్దం తప్పుశబ్దం కాదన్న అవసరాన్నిబట్టి దాన్ని కూడా వాడుకోవచ్చుననీ గ్రహించాలి.

ప్రశ్న—అలా అయితే "బిడి పిల్లఁడు" శబ్దం మాటేమిటి? ఇదిన్నీ పై పడుచు శబ్దం వంటిదేననీ—ఓడ్డ శబ్దాన్ని పోలిన శబ్దమనీ—పిల్ల+వాడు—పిల్లాఁడు కావాలిగాని పిల్లఁడు కాదనీ—కవి ప్రయోగాలు లేవనీ—కనక తప్పని వ్రాశారే? అంతేనా?

జవాబు--ఇదిన్నీ తప్పుకాదు. ఓడ్డ శబ్దాన్ని పోలినది కనుకనే ఓడ్డ-ఓడ్డఁడు అయినట్లు—పిల్ల–పిల్లఁడు–అని అవుతుంది—పిల్ల+వాడు అని విడదీసి యిక్కడ తచ్ఛబ్ద వకారలోపం చేయాలనిన ప్రసక్తి సంతమాత్రమున్నూ సహృదయ సమ్మతం కాదు. ఇట్లే మగఁడు, గొల్లఁడు, బండఁడు, లోనైన పదాలున్న చూచుకోవాలి. వీట్నిటికు ప్రయోగాలు అక్కరలేదు. అవి ప్రయోగాలున్నూ కావు.

ప్రశ్న—మరి "బంట్రౌతు" పదం మాటో?

జవాబు—అదిన్నీ అప్రయోగంకాదు—బంటు+రౌతు—బంటురౌతు—ఉత్వ లోపంలో బంట్రౌతు—అని అవుతుంది. లోక వ్యవహారంలోని బంట్రోతు అనే రూపానికి పర్యాయరూపంగా బంట్రౌతు శబ్దాన్ని పరిగ్రహించుకోవడంలో ఆక్షేపణ లేదు. వీట్నికు కవి ప్రయోగా లక్కరలేదు. వ్యవహారాన్నిబట్టి అర్థం చేసుకోదగ్గవే. "ఈరి ధాత్వర్థ మనుగ్రహింప గదనే వీరేజ పత్రేక్షణా!" అన్న శ్రీనాథ మహాకవి ప్రయోగంలోని ఈరిధాత్వర్థానికి పూర్వకవి ప్రయోగం కావాలంటే దొరుకుతుందా దొరకదు—దొరక నవసరం కూడా లేదు. అదిన్నీగాక 1901 సం. రం. లో అచ్చైన బుద్ధ చరిత్రపై 1903 సం. రం. లో పై ప్రయోగాది విమర్శ జరిగింది. అందు ఐదు దోషాలు వారు సూచించారు. అందులో ఒకటి యతిభంగం. ఇది తరువాతి ముద్రణలో సవరణ అయింది. మిగిలిన నాలుగున్నూ యథాతథంగానే కవులు అట్టేవుంచి గ్రంథాన్ని ముద్రిస్తూ వచ్చారంటే! అవి దోషాలు కానే కావని గ్రంథకర్తలు భావించినట్లు నిస్పష్టమేగదా? ఆ నాలుగింటిలోను ఒకటి తప్పు కాదని వెంకటరావుగారున్నూ ఒప్పుకుంటున్నారు. మిగిలినమూడున్నూ ఏవిధంగా తప్పులుకావో వెంకటరావుగారు గుర్తింపలేకపోయినా భాషావేత్తలంతా గుర్తిస్తారనడంలో నాకు సందేహం లేదు.

ప్రశ్న—పై వివరణవల్ల తప్పక గుర్తిస్తారు. అయితే తి. వెం. కవులు "రెండు బాసలకు మేమె కవీంద్రులము" మంటూ

సవాల్ చేశారుగదా? వారు రచించిన సంస్కృత రచనలు ఏమేమి వున్నవో! అందు ముద్రితము లెన్నో అముద్రితము లెన్నో! ఆ రచనల పూర్వాపరము లెట్టివో తెలియాల్సివుంది. కాశీ సహస్రమ్—వారి ప్రాథమిక రచన అని వెంకటరావుగారు అంటున్నారు—మీరేమంటారు?

జవాబు—కాదు. వారి ప్రాథమిక రచన— కాళికాదిస్తోత్రమాల—(1889). ఇది ముమ్మారు ముద్రింపబడింది. రెండవది—ధాతు రత్నాకరమ్ (1890). ఇది అముద్రితము. మూడవది—శృంగార శృంగాటకమ్ (1891).ఇది వీధీ రూపకము—అముద్రితమే గాక ప్రస్తుతం నామ మాత్రావశేషమున్నూ—నాలుగోది. కాశీ సహస్రమ్(1892). ఇది బందరు భైరవ ప్రెస్సులో ముద్రితమే—అయిదవది శుకరంభాసంవాదమ్ (1893). ఇదిన్నీ ముద్రితమే—ఆరవది మూలస్థానేశ్వర స్తుతి శతకమ్—(1894). ఇది ముద్రితమేగదా? ఇంక వెంకటశాస్త్రిగారు వృద్ధాప్యదశలో ఓన్నమశ్శివాయ స్తోత్రాన్ని రచించారు. ఇది మదరాసులో ముద్రితమైనట్టిదే—పిమ్మట శ్రీపాదవారితో వివాద జరిగే కాలంలో క్షమాపణమ్—అను గ్రంథం వ్రాయబడ్డది—ఇది ఎనిమిదో రచన—ఇప్పటి కింకా ముద్రింపబడియుండలేదు—కాలానుకూలత లేక ఆదినుండిన్నీ సంస్కృత గ్రంథాలు షష్ఠిపూర్తిసన్మాన సంఘంవారు ముద్రింపలేకపోయారు—పై గ్రంథ రచనల (ఆరింటి) వివరాలన్నీ జాతకచర్యలో వున్నట్టివే. చూచుకోక వెంకటావుగారు కాశీ సహస్రానికి అగ్రతాంబూలం యిచ్చారు.

ప్రశ్న—కర్పూర మంజరీ సట్టకము (అసంపూర్ణం) తి. వెం. కవుల తొలి నాటక రచనయే అంటారా?

జవాబు—కాదు. వారి తొలి నాటకము పండితరాజమే—ఇది పోలవర సంస్థాన ప్రవేశమునకు ముందే రచింపబడింది. వారి అనువాదములన్నీ ఇంచుమించు సరస్వతీ పత్రికకు ఉద్దేశింపబడినవే. అగుటచే విద్యాభ్యాస కాలంలోనే రచించిన పై నాటకమునకు తరువాతివేగాని ముందటివి కాజాలవు—పై సట్టక ప్రస్తావనలోని "ఆ మహాకవి రచించిన—బాల రామాయణము—బాల భారతము—కర్పూర మంజరి, విద్ధసాలభంజిక—అను నాల్గును నీ తిరుపతి వేంకటేశ్వరులే తెలిగించిరి" అన్న వాక్యములను బట్టి చూచినా—అన్నింటినీ తెనిగించాలన్న ఉద్దేశ్యంతో "తెలిగించిరి" అనే భూతకాలిక క్రియా ప్రయోగం చేశారేగాని బాలరామాయణం మినహాయించి వేరేమిన్ని పై గ్రంథాలు తెలిగించినట్లు లేదు. ఉంటే—బాల రామాయణ ప్రస్తావనలో గూడ సూచించేవారేకదా? ఆ యీ సట్టకమున్ను—అసంపూర్ణ నాటకాలలోదే—

ఇదిన్నీగాక వీరి రచనలు కొన్ని మాతృకలు జాగ్రత్త పెట్టబడనందున నశించిపోయినట్లుగా యీ దిగువ పంక్తులు సాక్ష్యం యిస్తున్నాయి.

"బందరులో నాటక కంపెనీల కోరికనుబట్టి శాకుంతలం వగైరా కొన్ని వచన నాటకాలున్ను వాసుదేవమననం (సంస్కృతం) తెలిగించడం వగైరాలున్ను మావద్ద మాతృకలు ఉంచుకోకపోవడం చేత ప్రకటించలేకపోయాము. . . . .ఆ యీ కంపెనీలకు వ్రాసి

యిచ్చిన బాపతు మా రచనలో ఒక్క శుకరంభా సంవాద శ్లోకాలు తప్ప తక్కినవి అన్నీ అంతరించినట్టే—అవన్నీ వుండే యెడల ఒక సంపుటానికి తక్కువ ఉండవు" (కథలు—గాథలు 3 వ సంపుటం 234 పేజీనుండి) పై వాక్యాలనుబట్టి కొన్ని గ్రంథాలు పోయినట్లు తెలుస్తోందిగదా?

ప్రశ్న—అవును. సాంఘిక నాటకాల ప్రసక్తిలో "సువర్ణ పాత్రికము" అనే సంపూర్ణ ప్రకరణాన్ని ఉదాహరించి—వెంకటరావుగారు

"ఇంతవరకు తిరుపతి వేంకట కవులను గూర్చిన యే విమర్శక గ్రంథములయందుగాని వ్యాసములయందుగాని దీని ప్రసక్తి కనుపట్టదు. దీనిని గూర్చి తొలుత నేనే లోకమునకు వెల్లడించినాను" అని వ్రాశారుగదా? యీ అగ్ర తాంబూలం వీరికివ్వవచ్చునా?

జవాబు—ఇవ్వడానికి వీల్లేదు. కథలు–గాథలు 3 వ సంపుటం 249 వ పేజీలో వేంకటశాస్త్రిగారే స్వయంగా "యింకా సువర్ణ పాత్రికం అంటూ వకటి (ప్రకరణం) ప్రారంభించి సరస్వతిలో రెండంకాలదాకా ప్రచురించాడు. . . . ఆ రెండంకాలూ చాలా బాగానే ఉంటాయి. షష్టిపూర్తి ముద్రణంలో అది చేర్చలేదు. అసంపూర్తి స్థితిలోనేవున్న వ్యసనవిజయాన్ని మాత్రం చేర్చారు" అని వ్రాస్తే ఆ విషయం లోకానికి వెం. శా. గారే ఓంప్రథమంగా తెలియజేసినప్పటికి ఆ సందర్భం గమనించక వెంకటరావుగారు తామే వెల్లడించామంటూ వ్రాయడంలో అర్థం లేదు.

ప్రశ్న—ఇహ "తవిటి రొట్టె" విషయం కొంచెం తెలియజెప్పండి?

జవాబు—ఇది ప్రహసనం అని వెంకటరావుగా రన్నారు. కాని ప్రహసనంకాదు— గద్య రచనల విషయంలో చేయబడిన గద్యపద్యాత్మక విమర్శ. ఆదిలో నిది యొక చిన్న పుస్తకంగా ముద్రింపబడిందిగాని దరిమిలా కాలంలో షష్టి పూర్తి సన్మాన సంఘంవారు దానిలోని గద్య భాగాన్ని వదలివేసి పద్య భాగాన్ని మాత్రం "కలగూరగంప"లో చేర్చి ముద్రించారు.

ఏది యెట్లున్నా వేంకటరావుగారు చాలా గ్రంథాలు అచ్చయివున్న వాట్లనే పరిశీలించకుండా వ్రాత కుపక్రమించారనితోస్తోంది. అందు ప్రధానంగా తిరుపతి కవుల సాహిత్య సమీక్షపై విమర్శగా 1966—సెప్టెంబరు—అక్టోబరు నెలల భారతీ పత్రికలో కొన్ని అసంగత విషయాలు వ్రాసినట్లు నాకు నా మిత్రులు కొందరు తెల్పినారు. గాని ఆ పత్రికలు నాకు లభింపక సవివరంగా ఆ విమర్శను నేను చూడలేకపోయాను. కాని దాని స్థూల రూపాన్ని యీ వ్యాసాలలో కొంత గ్రహించాను. నోరి నరసింహశాస్త్రిగారు వారి విజయనగర సంస్థాన రచనా ప్రసక్తిలో—

"విజయ నగర సభలో కవులను వ్యాకరణ మహా భాష్యములో పరీక్ష చేయింపగా వారు నిలువలేకపోయిరని యొకరు వ్రాసినది నిజము తెలిసి వ్రాసినదిగా తోపదు"

అంటూ వ్రాసిన వ్రాత గూడా 1966 సెప్టెంబరు—అక్టోబరు నెలల భారతి పత్రికలలో ప్రచురింపబడ్డ శృంగ భంగ ప్రస్తావనకు సంబంధించినదే అయి ఉంటుందనే నే ననుకుంటూను. పుక్కిటి పురాణ కల్పన ఆధారంగా గాక— సప్రమాణంగా వేంకటరావుగారు వ్రాస్తే సంతోషమే—ఇట్టి అభూత కల్పనలు చేసే విమర్శకులు భావి కాలంలో తప్పకుండా ఉంటారనే అనుమానంవల్లనే కాబోలును—వెంకట శాస్త్రిగారు జాతక చర్య 190 వ పుటలో—

కం. ఇందరి సూత్రములకు వృ
త్తిం దెలియంగోరువారు తేకువ నల రా
ట్సందర్శనమ్ము జదివిన
సందేహ నివృత్తి గొంత జరుగగ వచ్చున్

గీ. పుక్కిటి పురాణ కల్పనముల నొనర్చు
వారుగాక యెల్లెడలను వాస్తవ ప్ర
చారము వచించు శిష్యులు సారమతులు
గలరు వారలు సందర్భములు వచింత్రు

కం. అని యెంచి కడుంగడు క్లి
ష్ట నియతి నిది కూర్చబడియె"—

అని లోకమునకు వెల్లడి చేసుకున్నారు. వారి అనుమానం సరిగ్గా నిజమేనన్నట్లు వారు స్వయంగా విపులీకరించిన విషయాలను గూడా పెడదారి బట్టించి వేంకటరావుగారు యథార్థంగా జరిగిన విషయాలకు ప్రామాణ్యం యివ్వడం పేరుతో ఆంధ్ర సారస్వత చరిత్రలో అద్వితీయ స్థానాన్ని అధిష్టించి శాశ్వతులైపోయిన తిరుపతి వేంకట కవుల కీర్తికి కళంకు నాపాదించే అభూత కల్పనలతో విమర్శలు వ్రాయబూనడం ఆంధ్రుల దురదృష్టమేమో? లోకమే పరిశీలించాలి.—నమో మహద్భ్యః

బేతంచెర్ల త్రవ్వకాలు రాతియుగపు సంస్కృతి

డా. కొండపేట శివమ్మారెడ్డి ★ డా. మల్లాది లీలాకృష్ణమూర్తి

ఇటీవల పూనావిశ్వవిద్యాలయపు పురాతత్త్వ విభాగము, ఆంధ్ర విశ్వవిద్యాలయపు ఆంత్రోపాలజీ విభాగములు కలసి కర్నూలు జిల్లా ధోన్ తాలూకాయందలి బేతంచెర్ల గ్రామ1 పరిసర ప్రాంతాల యందుగల కొన్ని గుహాలలో త్రవ్వకాలు జరిపిరి. త్రవ్వకాలను గూర్చి అందు లభ్యమైన విశేషాల గూర్చి వివరించటానికిముందు ఆంధ్రప్రదేశమందు రాతియుగపు మానవ సంస్కృతులను గూర్చి క్లుప్తంగా తెలుసుకొనుట అవసరం. ఆంధ్రప్రదేశమందు ఇప్పటి వరకు జరిపిన పరిశోధనలవల్ల రాతియుగపు మానవ సాంకేతిక సాంస్కృతి కాభివృద్ధిని కొన్ని దశలుగా విభజించ వీలైనది. వాటిని పూర్వ, మధ్య, చరమ లేక అంత్య రాతియుగాలుగా (Early, Middle and Late Stone Ages) గుర్తించారు. పై యుగాలలో రాతిపనిముట్లు తయారు చేసేవిధానంలోనూ, సరికొత్త పరికరాల వాడకంలోనూ కొంత అభివృద్ధిని చూడనగును. (Technological and Typological development). పై మార్పులను బట్టియే రాతియుగపు మానవ సంస్కృతులను వివిధ దశలుగా గుర్తించటం జరుగుతుంది. ఆంధ్ర ప్రదేశమందే కాక భారతఉపఖండంలో లభ్యమైన ఆధారాలుకూడా రాతియుగపు మానవ సాంస్కృతిక పురోభివృద్ధిలో పై దశలనే సూచిస్తున్నవి.

రెండు సంవత్సరాలక్రితం చిత్తూరుజిల్లా రేణిగుంట సమీపంలో రాళ్ళకాలువ నదియొడ్డున, ప్రస్తుతం ఒంగోలు జిల్లాయందలి ఎర్రగొండపాలెం ప్రాంతంలో చెరువువాగు వొడ్డున ఒకే సాంకేతిక (Technological) విధానాన్ని సూచించే బ్లేడ్ల (Blades)2 పరిశ్రమ కనబడింది. ఇందు బ్లేడ్లు వాటిపై చేసిన చిరుకత్తులు (Pen knives) మొనలు (Points), ఉలిఅంచుమొనలు (Chisel edged tools or Burins) గోకుడు రాళ్లు (Scrapers), బాణపు మొనలు (Arrow heads) మొదలగు పరికరాలు (Tools) కలవు. ఈ బ్లేడ్ల పరిశ్రమ భారతదేశమందు క్రొంగొత్తగా కనుగొనబడిందని చెప్పటం నిర్వివాదం. వివిధ అంశాల పరిశీలన తర్వాత ఈ పరిశ్రమ ఇదివరకు తెల్పిన దశలలో దేనికి చెందదని, మధ్యరాతియుగం (Middle Stone Age), అంత్య రాతియుగపు (Late Stone Age),




బిలసర్గము గవి

మధ్యకాలమునకు సంబంధించిన సంస్కృతిగా భావించబడింది. అనగా ఈ సంస్కృతి ఐరోపా (Europe) ఖండంలోను, పశ్చిమ ఆశియాలోను ఉత్తర ప్రాచీన రాతియుగపు సంస్కృతి (Upper Palaeolithic Culture) కాలమునకు చెందినదిగా తోస్తున్నది. ఇది పాశ్చాత్యసీమలలో పై సంస్కృతినాటి మానవ సమాజపు సాంకేతిక, నైతిక (Technological & spiritual) ఔన్నత్యాన్ని చాటుతున్నది. రాతి పరికరాలతోపాటు జంతువుల ఎముకలతో ఆయుధాలను చేసేవారు. వారి అద్వితీయ కళా నైపుణ్యంవారు నివసించిన గుహాల గోడలపైనను, పైకప్పునను వేసిన వర్ణచిత్రాలద్వారా తెలుస్తున్నది. వారాకాలపు జంతు జాలాన్ని, వాటిని వేటాడే విధానాలను, మతసంబంధమైన జీవిత విధానాలను చూపుతూవేసిన వర్ణచిత్రాలు ఎన్నో బయల్పడినవి. అత్యంత ముఖ్య విషయం ఏమంటే పై సాంస్కృతిక కాలానికి చెందిన మానవుడు (Home sapien) నేటి మానవునకు

1. బేతంచెర్ల గ్రామము గుంటూరు— గుంతకల్ రైలు మార్గంలో, నంద్యాల— ద్రోణాచలం రైలు స్టేషన్ల మధ్యన కలదు.

2. సమాంతరమైన అంచులుండి, వెడల్పునకు రెట్టింపుకన్న ఎక్కువ పొడవుగల రాతి పెచ్చులకు బ్లేడ్లని పరిభాష.



కొట్టాల పొలిమేర గవి

(Homo sapien sapien) సమీప పూర్వికుడు (direct ancestor) అని తెల్పు ఆధారాలు బయల్పడటం. ఈ సంస్కృతి సుమారు క్రీ. పూ. 40,000 నుంచి క్రీ. పూ. 10,000 వరకు వర్ధిల్లిందని C 14 కాల నిర్ణయ పద్ధతి (Carbon 14 dating method) ద్వారా తెలుస్తున్నది.

రేణిగుంట, ఎర్రగొండపాలెం ప్రాంతాలలో కనుగొనబడ్డ బ్లేడ్ పరిశ్రమ పాశ్చాత్య ఖండాలలో పైన వివరించిన ఉత్తర ప్రాచీన రాతి యుగపు సంస్కృతియందు రాతి పరిశ్రమను మాత్రమే పోలివున్నది. సంపూర్ణ సాంకేతిక, నైతికవికాసాలను తెల్పు ఆధారాలకై జరుపుతున్న అన్వేషణలో భాగంగా త్రవ్వకాలు కొన్ని గుహలలో మొదలు పెట్టినాము.

బేతంచర్ల పరిసర ప్రాంతాలు సున్నపురాతికి సుప్రసిద్ధం. సున్నపురాతి కొండలలో అనేకమైన గుహలు కలవు. చిరుగుట్టలలో—మిట్ట పల్లాలలో అడ్డదిడ్డంగా వ్యాపించిన చిన్న చిన్న లోయలలో విస్తరించిన నిటారైన సున్నపురాతి ప్రదేశాలలో ఈ గుహలు నెలకొనివున్నాయి. పై వాటిలో బిల్లసర్గము, సన్యాసులగవి, ఎర్రజారిగబ్బిగవి అను స్థానిక వ్యవహారం గల గుహలు వైశాల్యమునందు ప్రాముఖ్యం వహిస్తున్నవి. బిల్లసర్గమందు క్రీ. శ. 1884 సం. లో రాబర్టు బ్రూస్ ఫూట్ అతని కుమారుడు హెన్రీ త్రవ్వకాలు జరిపారు. కొన్ని ఎముకల పనిముట్లు లభ్యమైనట్లున్నా — అవి ఇంగ్లాండునకు తీసుకపోతున్నప్పుడు మధ్యమార్గమున పోయినట్లున్న (lost in transition) తెల్పినారు. కావున వాటికి సంబంధించిన విశేషములేవీ మనకు తెలియవు.

ఈ ప్రాంతమందున్న గుహలను రెండు శ్రేణులుగా విభజింప వీలగును. మొదటి శ్రేణియందలి గుహలకు విశాలమైన ప్రవేశ ద్వారాలు కలవు. రెండవ శ్రేణియందు గుహలకు ప్రవేశద్వారంనుంచియే ఇరుకైన మార్గాలు కలవు. మొదటి శ్రేణి గుహలలో లోపలికిపోవుకొలది వైశాల్యము తగ్గుటయే కాక పోను పోను చాలా ఇరుకైనమార్గము కనబడుతుంది. వీటి యందు లోపలికి పోవుటకు కొన్ని వందల మీటర్ల వరకు సాధ్యమవుతుందని తెలుస్తున్నది. కాగా రెండవ శ్రేణి గుహలలో ఇరుకు మార్గాలే ఒక గదిని పోలు విశాల ప్రదేశానికి దారి తీస్తున్నాయి.

ప్రస్తుతం త్రవ్వకం జరుపుతున్న గుహలను బిల్లసర్గము, పెద్దపావురాళ్లబద్దెగవి, ముచ్చట్లచింతమానుగవి, మరియు కొట్టాల పొలిమేరగవి అని స్థానికులు పిలుస్తారు. మొదటి రెండు గుహలు మొదటి శ్రేణికి, చివరి రెండు గుహలు రెండవ శ్రేణికి చెందినవి. బిల్లసర్గము లేక బిలేజ్ఞము ఆ పరిసరాలలో కనబడు గుహలకన్న చాలా పెద్దది. ఈ గవి బేతంచెర్లకు తూర్పుదిశను సుమారు 5 కి. మీ. దూరమున నున్నది. వర్షంవల్ల కొండలపై నుండి ప్రవహించే నీరు ఒక కొండగుట్ట ద్వారా సొరంగాన్ని ఏర్పరచుకొని ప్రవహించి ఉండవచ్చు. ఈ సొరంగానికి ఇరువైపుల కూడా గుహలు కలవు. వాటిలో కొన్ని చాలా లోపలికి చొచ్చుకొని పోతున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం పరిశీలనలోవున్న గుహ నేల మట్టానికి (Bed of the stream) 2 మీ. ఎత్తులో నున్నది. ఈ కాలువలో ప్రస్తుతం నీరు ప్రవహించకపోయినను ఒకప్పుడు చాలా ఎత్తులో ప్రవహించి రాను రాను నీటి కోతవల్ల ప్రస్తుతపు మట్టం ఏర్పడినట్లు తెలుస్తున్నది. ఎందుకనగా త్రవ్వకాలలో బయల్పడిన మట్టి కొంత ఇసుకను కలిగియుండటంవల్లను, కొన్ని నత్త గుల్లల (Water Snails or Mollescan shells)



పెద్దపావురాళ్ల బద్దె గవి



ఎముకలతో చేసిన పనిముట్లు

అవశేషాలు బయల్పడటంవల్లను పై విషయం తెలుస్తున్నది. ఇకపోతే పెద్ద పావురాళ్లబద్దెగవి బేతంచెర్లకు తూర్పున సుమారు 3 కి. మీ. దూరాన వున్నది. 25 మీ. ఎత్తునఉండి అత్యంతవిశాల ప్రవేశద్వారముకల్గి లోనికి పోయినకొలది ప్రవేశద్వారము ఇరుకుగా మారుతుంది. ప్రవేశ ద్వారానికి ఎడమవైపున మరియొక ఇరుకు మార్గం ఒక గదిని కలియుచున్నది. ముచ్చట్లచింతమానుగవి బేతంచెర్లకు ఆగ్నేయదిశలో సుమారు 6 కి. మీ.దూరాన ఉంది. ఈ గుహ నేలమట్టానికి సుమారు20 మీ. ఎత్తులో వున్నది. ఇచ్చట మూడు ఇరుకైన మార్గాలు(2 మీ, 5 మీ, 8 మీ పొడవు కలిగి) లోపల ఒక గదియందు కలుస్తాయి. కొట్టాపాలిమేరగవి బేతంచెర్లకు తూర్పు దిశలో సుమారు 7 కి. మీ. దూరమందున్నది. ఇచ్చట ప్రవేశమార్గము కొన్నిచోట్ల సుమారు 45 సెంటిమీటర్ల వెడల్పు కలదు. ఈ మార్గం దాదాపు 20మీ. పొడవు కలిగి లోపలికి పోవుకొలది ఇరువైపుల రెండు గదులకు దారి తీస్తుంది. ఈ గదులను చేరటం అత్యంత ప్రయాసతో కూడిన శ్రమ అని మార్గంయొక్క పొడవు, వెడల్పులనుబట్టి తెలిసికోవచ్చు.


పై గుహలయందు జరిపిన త్రవ్వకాలవల్ల, అందలి మట్టిని (deposition) మూడు పొరలుగా (layers) విభజించవచ్చు. మొదటి పొర (layer. 1) సుమారు 1 నుంచి 30 సెం. మీ. లోతువరకు కనబడుతుంది. ఈ పొరలో నల్లటి గోధుమవర్ణంకలమట్టి (black-brown silt), సున్నపురాతి పలకలు కనబడుతాయి. పై భాగాన కొంత లోతువరకు గబ్బిలాల పెంట (Bat dung) కలిసి ఉంటుంది. ఇంచుమించు రాతి పనిముట్లు (stone tools), ఎముకల పనిముట్లు (Bone tools), కోసిన ఎముకలు (cut bones) లభ్యమగుచున్నవి.

రెండవ పొర మొదటి శ్రేణి గుహలలో 100నుంచి 200 సెం. మీ. వరకును, రెండవ శ్రేణి గుహలలో సుమారు 50 సెం మీ. నుంచి 100 సెం. మీ. వరకు మందము కలిగి వున్నది. ఈ మట్టి ఎరుపు రంగు కలిగి (Red cave earth) ఉంది. ఈ పొరయందు సున్నపురాతిపలకలు కొంతవరకు తక్కువగా కనబడుతున్నవి. ఇందు బ్లేడ్ల పరిశ్రమకు చెందిన రాతి పనిముట్లుకాక ఎముకలతో చేసిన పరికరాలు కూడా లభిస్తున్నవి. ఈ పొరను 'Blade-Burin industry horizon' అనవచ్చును.

మూడవ పొరయందు కొంతవరకు పొడిగా మారిన రాయి (Weathered Bed Rock) ఉంది. తర్వాత రాయి కనబడుతుంది. రాతిపొడిని Red Mare' అని అంటారు. ఈ మట్టి కంకరను పోలి ఉంది. త్రవ్వకానికి చాలా కఠినంగా ఉంటుంది.

పై మూడు పొరంలోకన్న మధ్య-పొరయందు బ్లేడ్లు పెచ్చులు మూలములు (Cores), కొన్ని జంతువుల అవశేషములు, ఎముకల పనిముట్లు హెచ్చుగా కనబడుతున్నవి. రెండవ పొరక్రిందిభాగాన మూడవ పొర పైభాగాన పనిముట్లపై కంకర అతికిపోయి ఉండుట (Lime in crustation) గమనించదగినది.ఎముకలను గుర్తించటం గూడా కొంతవరకు కష్టంగా తోస్తుంది. కాని పై రెండు శ్రేణుల గుహలయందు దొక భేదం గమనించదగినదివుంది. మొదటి శ్రేణి గుహలందు నాటి మానవుడు హెచ్చుగా రాతిపరికరాలను తయారు చేసుకొనేవాడు. అచ్చట మూలములు పెచ్చులు చిన్నచిన్నపెచ్చులు కొన్ని బ్లేడ్లు కనబడటంవల్ల ఈ గుహలను రాతి పనిముట్ల కర్మాగార ప్రాంతాలు (factory sites) అని పిలువవచ్చు. కొన్ని కోసిన ఎముకలు (cut bones), ఇతరత్రా లభించినప్పటికి ఎముకలతోచేసిన ఆయుధాలు స్వల్పంగా లభిస్తున్నవి. రెండవ శ్రేణి గుహలందు వివిధ జంతువుల అవశేషాలు అధికసంఖ్యలో లభ్యమగుటేకాక, ఎముకలతో చేసిన ఆయుధాలు అత్యధికంగా లభిస్తున్నవి. ఇచ్చట రాతి పనిముట్లసంఖ్య అత్యల్పమని చెప్పకతప్పదు.

త్రవ్వకాలలో లభించిన అవశేషాలు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నందున పూర్తి వివరాలు పేర్కొనడం వీలుకాదు. కాని రాతి పరిశ్రమయందు హెచ్చుగా గోకుడురాళ్లు (Scrapers) బ్లేడ్లు ఉలిమొనలు (Burins), సాధారణపు మొనలు, బాణపు మొనలు (Arrow heads) కనబడుతున్నవి. ఇకపోతే ఎముకలను నిడివికి చీల్చి (Split longitudinally) ఆ ముక్కలతో గోకుడు



రాతి పనిముట్లు

పనిముట్లు, బరమాలు (perforators), ఉలి అంచుమొనలు, బాణపు మొనలు, సూది మొనలను (Needles) పోలిన సన్నని మొనలు, సన్నని గరిటెలను (Spoon like) పోలు పరికరాలు, ఈటెలకు వాడే రెక్కలు (Barbs for harpoons) తయారు చేసేవారని తెలుస్తున్నది. పై పరికరాలలో రాతితోచేసిన బాణాలేకాక ఎముకలతో చేసిన బాణపుమొనలు, ఈటెలను జంతువులను వేటాడటానికి ఉపయోగించి ఉండవచ్చు. గోకుడు పనిముట్లతో జంతువులనుంచి బహుశా చర్మమును వేరు చేసెడి వారేమో అని వూహించవచ్చు. కొన్ని ఎముకల మొనలు ముఖ్యంగా బరమాలు, ఉలి అంచులు, సూది మొనలు బహుశా నాటి మానవుడు చర్మపుదుస్తులు తయారు చేసికొనటంలో ఉపయోగించి ఉండవచ్చు. కొన్ని చిన్న గరిటెలను పోలు పరికరాలు ఎముకలనుంచి పప్పును (Marrow) తీయుటాని కుపయోగించి ఉండవచ్చు. రాతి బ్లేడ్‌లు మాంసాన్ని కోయటానికేకాక కంద మూలాలను కోయటానికి కూడా ఉపయోగపడి ఉండవచ్చు. పై పరికరాలన్ని వేటపై ఆధారపడిన జీవనవిధానాన్ని (Hunting Economy) హెచ్చుగా సూచించి నప్పటికి కందమూలాల ద్వారా శాకాహారాన్ని కూడా భుజించేవారని కూడా వూహించవచ్చు. బహుశా వారు వేటాడిన జంతువులను తాము నివసించే గుహలకు తెచ్చి భుజించేవారని తెలియు చున్నది. కొన్ని ఎముకలు కాలి ఉండటాన్నిబట్టి వారు అట్టి జంతువులను కాల్చి తినేవారేమో?

పై జంతువుల అవశేషాలు కొంత పరిశీలన పిమ్మట దుప్పుల్లు, లేళ్లు, అడవిపందులు, ఏదు పందులు, కొరెనుబోతులు, గుర్రాలు మొదలైన జంతువులకు చెందినట్లు భారత ప్రభుత్వపు భూగర్భశాఖకు చెందిన డా. కే. యస్. ప్రసాదుగారు అభిప్రాయ పడ్డారు. వీటిలో కొన్ని జంతువులు ప్లీస్టొసీన్ చివరదశ (Upper Pleistocene) కు చెందినట్లు భావించటం జరిగింది. ఇంతకు ముసుపు వివరించిన సాంస్కృతికాధారాలు ఐరోపా, పశ్చిమఆశియా ఖండాలలోని ఉత్తరప్రాచీనరాతియుగపు ఆధారాల పోలికలనుబట్టి కూడా బేతంచెర్ల గుహల సంస్కృతి రమారమి క్రీ. పూ. 20,000 నుంచి క్రీ. పూ. 10,000 కాలమందు వర్ధిల్లి ఉండవచ్చుననుట నిస్సందేహం. కొన్ని కాలిన ఎముకలు Burnt Bones), నత్త గుల్లల అవశేషాలను బట్టి C 14 ప్రమాణపు పద్ధతిలో కాలనిర్ణయం చేయవీలగును. అట్టి పరీక్ష బహుశా పైకాలాన్నే నిర్ధారణ చేయువచ్చు.

ఒక్క మాటలో బేతంచెర్ల పరిసర ప్రాంతాలందు సుమారు ప్లీస్టొసీన్ చివరిదశలో రాతియుగమునందు అత్యంతం ఉన్నతమైన సంస్కృతి విలసిల్లినది. వేటాడి జంతు మాంసాన్ని సంపాదించే విధానాన్నేకాక శాకాహారసముపార్జనపై ఆధారపడిన జీవన విధానాన్నికూడా (Hunting and food Collecting) పై సంస్కృతిని వ్యక్తీకరిస్తున్నది. భారతదేశమందు రాతియుగంలో ఈ దశ వర్ధిల్లలేదను అభిప్రాయం చాలామంది పురాతత్వశాస్త్రజ్ఞులకు కలదు. పై త్రవ్వకాలవల్ల అట్టి అభిప్రాయాన్ని మార్చుకొనుటయేకాక భారతదేశమందు రాతియుగపు సంస్కృతులకు ఒక కొత్త నిర్వచన మీయవలసిన దశ ఆసన్నమైనదని తెల్పుట అతిశయోక్తికాదు.

*పరీధావి!!

శ్రీ వి. సంపత్కుమారాచార్య

కాలవాహినిలో
కొత్త అలలు చెలరేగుతుంటే
పాతవి నాటికి స్వాగతం చెప్తూ ప్రక్కకు తప్పుకుంటున్నాయి!........
నేడు నిన్నలో కలిసిపోతోంది......
రేపటి కలలు పండకపోయినా
రేపు నేడై పోతోంది !........
జీవితం పరుగెత్తి పోతూంటే
ఆ పరుగు పందెంలో
ఓడిపోతూన్న కొద్దీ...పడుతూ...లేస్తూ
అనుభవాలు గాకాటి చిప్పలని చెక్కేస్తున్నా
దేకుతూ...సాగిపోతున్నాడు మానవుడు !!...
నిరాశా వారాశిలో ఈదులాడుతూన్నా
ప్రతీరాన్ని అందుకుందామన్న ఆశతో
సాగిపోయే పరీధావి జీవనయానంలో
ఎదురయ్యే మరో నవ్యోల్లాలం "పరీధావి"
పరితాపాలను పోగొట్టి
పరిశాంతిని కలిగిస్తే !...
పరితో వ్యాప్తంగా
పురోభివృద్ధి నిస్తే!! .....

* * *

---

* (పరితః ధావతీతి పరీధావి=అభ్యుదయ పథికుడు పరీధావి)

విప్లవము: సాహిత్యము

శ్రీ ఆర్. ఎస్. సుదర్శనం

తిరుగుబాటుకీ విప్లవానికీ తేడా ఉన్నది. తిరుగుబాటు పరిమితమైనది. పరిస్థితులు దుర్భరమై విషమించడంవల్ల ఆ పరిస్థితుల్నీ అందుకు కారణభూతమైన వ్యవస్థనీ ఏదోవిధంగా వెంటనే అంతమొందించే ప్రవృత్తి తిరుగుబాటులో కనిపిస్తుంది. విప్లవం అలాకాదు. అది నిర్దిష్టమైన కొత్త విలువల్నీ నూతన వ్యవస్థనీ అన్వేషించి స్థాపించే ప్రయత్నం చేస్తుంది. పాతవిలువల్ని త్రోసిరాజనే 'తిరుగుబాటు' కొత్త విలువల్ని రూపొందించుకొనే విస్తృత ప్రయత్నంచేసి, కొత్త వ్యవస్థని సాధించినప్పుడే 'విప్లవం' అవుతుంది. నక్సల్‌బరీ, శ్రీకాకుళంలలో కొంతకాలం క్రితం జరిగినవి తిరుగుబాట్లు. దేశంలోని కర్షక, శ్రామిక వర్గాలవంటి పీడిత ప్రజానీకం మార్క్సిస్టుదర్శనం మూలాధారంగా కొత్త సామాజిక వ్యవస్థని రూపొందించుకోవడానికి చేస్తున్న ప్రయత్నం నేటి విప్లవం. విప్లవ శక్తులు నేడు రాజకీయరంగంలో ఏకముఖంగా లేవు. సంస్కృతిపరంగా చూస్తే, నేటి సమాజంలో ఆచార వ్యవహారాల్లో, మనుష్యుల సంబంధాల్లో, జీవిత వైఖరివంటి విషయాల్లో, ఎన్నో విభేదాలు ఉన్నాయి. వర్గ విభేదాలులేని ఆర్థిక వ్యవస్థను సాధించడంతో పై విభేదాలు నశించి క్రమబద్ధం అవుతాయని, నశింపని వాటిని ప్రయత్నపూర్వకంగా నిర్మూలించడం లేక సమాజ వ్యవస్థకు అవి భంగకరం కాకుండా జాగ్రత్త తీసుకోవడం కర్తవ్యమని మార్క్సిస్ట్ విప్లవంలో నమ్మకమున్న వాళ్ళందరి అంచనా. కాని ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా విప్లవాన్ని బహుముఖంగా సాధించడంలో, వర్గరహితమైన ఆర్థిక వ్యవస్థ, సాంస్కృతికమైన భావ విప్లవమూ క్రమపరిణామంలో, కొంత ఆలస్యమైనా, రెండూ ఇందుమించు ఒకేసారి సిద్ధిస్తాయని ఒక పక్షం విశ్వసిస్తున్నది. ఇందులో జాప్యమే కాదు, విప్లవానికి మొదటికే మోసం వచ్చే భ్రమ ఉన్నది కాబట్టి, వీలైనన్ని చోట్ల తిరుగుబాట్లు లేవదీసి, ప్రజాస్వామ్యాన్ని కూలద్రోయడం ద్వారానే కర్షక శ్రామికవర్గ నియంతృత్వ స్థాపనమూ, రాజకీయ ఆర్థిక వ్యవస్థలని చేజిక్కించుకోవడమూ ప్రథమ కర్తవ్యమని, తర్వాత సంస్కృతిపరంగా వచ్చే విప్లవం సులువుగా ప్రవేశపెట్టవచ్చునని కొన్నిపక్షాల విశ్వాసం. వీరిలో తీవ్రవాదులు రాజకీయ పక్షాలుగా వ్యవహరించడంమాని ఎక్కడికక్కడ విప్లవ యోధులుగా (గెరిల్లాలు) వ్యక్తిగత సాహసంతో వ్యవస్థని నాశనం చెయ్యబూనుకొని, ప్రజల్లో చైతన్యాన్ని శీఘ్రగతిని రేకెత్తించడానికి అది ఒక్కటే మార్గమనీ విశ్వసిస్తున్నారు. ఇది స్థూలంగా దేశంలో నెలకొనివున్న సామాజిక విప్లవ వాతావరణం.

మానవుని మనుగడలో, ప్రపంచ చరిత్రలో, తిరుగుబాట్లూ, విప్లవాలూ కొత్తగా నేడు వచ్చినవి కావు. 'విప్లవము' లేకపోతే చరిత్రే లేదు. విప్లవము మానవత్వంయొక్క చైతన్య దీప్తికి పతాక. ఒక గుంపు మరియొక గుంపుమీదా (ఆర్యులు—ద్రావిడులు), ఒక మతం మరియొక మతంమీదా (ఇస్లాం—హైందవ), ఒక జాతి మరొక జాతిమీదా (ఆంగ్లేయులు—భారతీయులు) చేసిన ఆక్రమణలూ, తత్ఫలితంగా ఏర్పడిన రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరిణామాలూ తప్పకుండా విప్లవం కోవకు చెందినవే. కాని వీటికి ప్రాదేశికమైన పరిమితి ఉన్నది. ఒకే జాతిలో ఒక మతం మరొక మతం మీద (కాథలిక్కులు—ప్రొటెస్టెంటులు— ప్యూరిటన్లు) లేక ఆస్తికతమీద నాస్తికత లేవదీసిన మత విప్లవాలూ, వివిధ దేశాల్లో రాజుమీద ప్రజలు సాధించిన రాజకీయ విప్లవాలూ జాతీయమైనవి. స్థూలంగా చూస్తే నేటివరకూ ప్రపంచ పరివ్యాప్తంగా మానవ సమాజంలో జరిగిన విప్లవాలు రెండని చెప్పవచ్చు— ఒకటి మత విప్లవం, రెండు రాజకీయ విప్లవం. అటువంటి ప్రపంచ పరివ్యాప్తమైన మూడో విప్లవం ఈ శతాబ్దిలో ఆర్థిక వ్యవస్థపరంగా జరుగుతున్నది. మార్క్సిస్ట్, దృక్పథంరీత్యా మొదటి రెండు ప్రపంచ విప్లవాల్ని కూడా ఆర్థిక వ్యవస్థపరంగానే వ్యాఖ్యానించవచ్చు, కాని ఆ విప్లవాలు సాధించిన నిర్దిష్ట ప్రయోజనాలు, మౌలిక సూత్రాలు సవ్యంగా అర్థం చేసుకున్నట్లయితే ఆ విప్లవాల స్వరూపం ఏమిటో బోధపడుతుంది. మతం సాధించిన విప్లవంలో ఆస్తికత లేక నాస్తికత మౌలికమైన విలువగా వుంటూ, దాన్ని ఆధారం చేసుకున్న ధర్మసూత్రాలు సమాజంలో నిలబడి సాగించాయి. రాజకీయ విప్లవంలో వ్యక్తి స్వామ్యం మౌలికమైన విలువగా మెజారిటీ సూత్రం ప్రధానధర్మంగా ఏర్పడింది. నేటి మార్క్సిస్ట్ విప్లవంలో మనిషియొక్క శ్రామికశక్తి మౌలిక

మైన విలువ, ప్రతి మనిషీ తన శ్రామిక శక్తిని సమిష్టి సంక్షేమానికి దత్తం చేయడం ప్రధాన ధర్మం. ఇక్కడ ఉదయించే ప్రశ్న: మార్క్సిస్ట్ విప్లవం, అంటే ఆర్థిక వ్యవస్థా విప్లవం ప్రపంచ చరిత్రలో చివరి విప్లవమా? మార్క్సిస్ట్‌లు చివరి విప్లవమే అంటారు. ఉత్పత్తి సాధనాలు ఉమ్మడి సొత్తు కావడం ద్వారా ఆర్థికంగా వర్గ రహిత సమాజం ఏర్పడితే, తర్వాత రాజ్య వ్యవస్థ (State) అదృశ్యమై మానవుడు స్వచ్ఛంద జీవిగా వసుధైక కుటుంబం ఏర్పడుతుందనే సిద్ధాంతాన్ని చరిత్రాంతాన్ని మార్క్స్ చెప్పాడంటారు. కాని ఆ మధ్యకాలంలో అవసరమూ అనివార్యమూ అయ్యే సాంస్కృతిక విప్లవాల తీరుతెన్నులని మార్క్స్ సూచించినట్లు లేదు. అలా నిర్దిష్టంగా సూచించడం కూడా నిజంగా అసాధ్యమే. మార్క్స్ సూచించలేదు కాబట్టి వర్గ రహిత సమాజం వెంబడే అవ్యవహితంగా స్వచ్ఛంద సమాజమూ సిద్ధిస్తుందని భావించడం సమంజసం కాదు. అందువల్ల నేటి కమ్యూనిస్టు దేశాల్లో సాంస్కృతిక విప్లవాలు తప్పనిసరి అయ్యాయి. ఈ విప్లవాల విషయంలో మార్క్స్ దర్శనానికి సందర్భోచితంగా అధికారంలోవున్నవారు వ్యాఖ్యానంచేసి వాటిని సాగిస్తున్నారు. ఇక్కడ మార్క్స్ దర్శనానికి ఉన్న పరిమితులేమిటో మనం గ్రహించవచ్చు. మార్క్స్‌మతస్థులుగాని మేధావులు మార్క్సిస్ట్ విప్లవం చరిత్రలో తుది విప్లవం అనే మాటని సులువుగా ఆమోదించలేరు. ఇది వివాదాంశం.

ఒక విప్లవం సాధించే విలువలు, తద్వారా ఏర్పడే వ్యవస్థ ఒక నైతిక దృక్పథాన్ని సృష్టిస్తాయి. ఆ విలువలు తర్వాతవచ్చే విప్లవంలో కొంతవరకు 'రియాక్షనరీ' పాత్ర వహించడం సహజమే. మత వ్యవస్థ తాలూకు విలువలు రాజకీయ విప్లవ సమయంలో చాలవరకు 'రాజు' అధికారాన్ని సమర్థిస్తూ ప్రజల ఉద్యమానికి అవరోధం కలిగించాయి. ఆదర్శానికీ వ్యవస్థకూ గల తేడాను గమనించాలి. మతానికి కూడా ఆదర్శం సర్వమానవ సౌభ్రాత్రమే., కాని మత వ్యవస్థ, మతాధికారులు ఆచరణలో భిన్నంగా ప్రవర్తించారు. ప్రజాస్వామ్య విప్లవం వచ్చినప్పుడు వాళ్లు రాజు అధికారాన్నే సమర్థించారు. అలాగే ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎన్నికలూ, మెజారిటీలూ, పెట్టుబడిదారులకూ, ఆస్తిపరులకూ ఉపయోగిస్తూ, విప్లవానికి అవరోధం కావడంచూస్తూనే ఉన్నాము. ఇది కారణంగానే ప్రజాస్వామ్య పద్ధతుల ద్వారా శ్రామిక విప్లవం సాధ్యంకాదేమోననే సందేహం కొన్ని పక్షాల్లో ఏర్పడింది. కాని సామాజిక చైతన్యం ఏ ధోరణిలో నడుస్తున్నదో, ఇటీవల వచ్చిన రాజకీయ పరిణామాలు ఎటువంటివో గమనించినవారికి ఆయా సందేహం నిరాధారంగా తోస్తుంది. అలాగే భవిష్యత్తులో శ్రామిక విప్లవానంతర సమాజంలో, 'వ్యక్తి తన శ్రామిక శక్తిని సమాజ సంక్షేమానికి దత్తం చెయ్యాలి' అనే మౌలిక సూత్రం ఏవిధంగా తర్వాతి విప్లవానికి అవరోధం అవుతుందో లేక తోడ్పడుతుందో చెప్పడం కష్టం. దీన్నిబట్టి చూస్తే ప్రపంచ చరిత్రలో మార్క్సిస్ట్ దర్శనం ఆధారంగా ఏర్పడుతున్న నేటి విప్లవం తొలి విప్లవమూ కాదు, తుది విప్లవమూ కాదు. అది అన్వేషించే విలువలూ, ప్రవచించే ధర్మసూత్రాలూ కాలానుగత మైనవి. కాలాంతాన్ని చరిత్ర పరిసమాప్తిని సూచిస్తాయనుకోవడం భ్రమే అవుతుంది.

ప్రపంచ విప్లవాల తీరును మానవుని, వారసత్వాన్నీ పరిశీలించి చూస్తే మరొక విషయం కూడా బోధ పడుతుంది. ఏ విప్లవమూ గతంలో మానవాళి సాధించిన విలువల్నీ, ధర్మసూత్రాలనీ సమూలంగా తుడిచి పెట్టలేదు. ఒకనాటి విలువలూ, ధర్మసూత్రాలూ యుగ ధర్మంగా ప్రాభవాన్ని కోల్పోయినా, వాటికి ఎన్నో మార్పులూ చేర్పులూ సంభవించినా, వ్యక్తుల్లో సమాజంలో అవి సజీవంగానే ఉన్నాయి. మరొక విషయం ఏమిటంటే ప్రతి విప్లవమూ మనిషియొక్క బాధ్యతని గురుతరం చేస్తూ రావడం. భగవంతుడు లేడు అనే విప్లవం ఏ సిద్ధాంతపరంగా వచ్చినా— బౌద్ధం రూపంలోనో, భౌతికవాదంగానో, హేతువాదంగానో— అది మనిషికి వ్యక్తిగతంగా ధార్మిక భారాన్ని ఎక్కువ చేసిందే తప్ప తక్కువ చేయలేదు. భగవంతుని స్థానాన్ని సంఘమో పదార్థశాస్త్రమో అంతరాత్మో ఏదో ఒకటి ఆక్రమించక తప్పదు. అలాగే ప్రజాస్వామ్యంలో రాజు అధికారాన్ని ప్రధానమంత్రి లేక ప్రెసిడెంటు వహిస్తాడు. ప్రతి విప్లవం తర్వాతా జనంమీద రాజ్యవ్యవస్థ అధికారం కూడా పెరుగుతూనే వస్తున్నది. శ్రామిక విప్లవానంతరం పెట్టుబడిదారు లేకపోయినా ఫాక్టరీ మానేజరు ఉంటాడు. వర్గరహిత సమాజంలో వ్యక్తిమీద రాజ్యవ్యవస్థ చేసే ఆజమాయిషి మరింత ఎక్కువే అవుతుందిగాని తగ్గదు. అయితే రాజ్యవ్యవస్థ అదృశ్యం కావడం ఎప్పుడు? మానవుడు స్వచ్ఛంద జీవి అయేదెలాగ? ఎంత కాలంలో?

ఆ గమ్యం సాధించేందుకే మార్క్సిస్ట్ విప్లవ నాయకులు సాంస్కృతిక విప్లవం అవసరమంటూ, వ్యక్తుల్లో మిగిలివున్న పూర్వవాసనల్ని తుడిచి పెట్టేందుకు కమ్యూనిస్టుదేశాల్లో ప్రయత్నిస్తున్నారు. స్టాలినిస్టు రష్యాలో జరిగింది. మావో చైనాలో జరుగుతున్నది! శ్రామిక విప్లవానికి మౌలికమైన, 'శ్రామిక శక్తి— సమాజము' అనే విలువలతో సంబంధంలేని వ్యక్తిగతమైన విలువల్నీ వాసనల్నీ ప్రజల్లో అంత మొందించే ప్రయత్నం ఇది. రాజ్యవ్యవస్థ అధికార బలంతో, మనో వైజ్ఞానికశాస్త్ర సహాయంతో ప్రతివ్యక్తి మనసునీ క్షాళనంచేసి దిద్దేందుకు ప్రయత్నిస్తుంది. ఈ క్షాళనక్రియ ఎప్పుడు పూర్తి అవుతుంది అంటే సమాధానం— ప్రపంచ మంతటా శ్రామిక విప్లవం నెలకొని స్థిరం కావాలి. అప్పుడు పై చెప్పిన సాంస్కృతిక క్షాళనం పూర్తి చెయ్యడం సాధ్య మౌతుంది. అటుపైన వ్యక్తి పూర్తిగా సామాజికుడు కావడంతో రాజ్యవ్యవస్థ అనవసరమై అదృశ్యమై పోతుంది.

మార్క్సిస్టులు ఇచ్చే పై సమాధానాలకు వెనుక ఒక తాత్త్విక దృక్పథం ఉన్నది. ఆ దృక్పథంతో అందరూ అంగీకరించక పోవచ్చు. ఈ తాత్త్విక దృక్పథం మనిషి నైజాన్ని గురించి ఒక సిద్ధాంతం చేస్తున్నది. మనిషి సామాజికుడు, మనిషిలో సామాజిక చైతన్యం తప్ప మరేమీ లేదు అని ఆ సిద్ధాంతం. అందువల్ల సమాజాన్ని శ్రామికుల విప్లవం మార్చినప్పుడు, ప్రతివ్యక్తి నైజమూ ఆ విప్లవానికి మౌలికమైన విలువల్ని ఆధారం చేసుకొని రూపొందుతుంది. అలా రూపొందక తప్పదు. ఆ పరిణామం పూర్తయినప్పుడు చరిత్ర అంతమౌతుంది, భూతల స్వర్గం సిద్ధిస్తుంది. ఈ విషయంలో పాత విలువల వాసనలు గలిగిన సిద్ధాంతాలు ఉన్నవాళ్ల దృక్పథం భిన్నంగా ఉంటుంది— ఒకటి, ప్రతి వ్యక్తిలో ఆత్మ ఉన్నది లేదా ప్రతి వ్యక్తికీ ఏకాంతం ఉన్నది, అది సామాజిక చైతన్యానికి భిన్నమైనది. రెండు, ప్రతి వ్యక్తి విశిష్టుడు. అతని వ్యక్తిత్వం స్వయంప్రతిభతో స్వేచ్ఛగా వికసింపజేసుకోవడానికి అతనికి హక్కు ఉన్నది. ఆ విషయంలో అతను సమాజంమీద తిరుగుబాటు చేయగలడు. అతను వ్యక్తిగా సమాజంలో చేరాడే తప్ప సమాజం అతణ్ణి సృష్టించ లేదు. ఇటువంటి తాత్త్విక దృక్పథాలు భావవాదం (idealism) నుంచీ లేదా మతంనుంచి వచ్చాయి. మార్క్సిస్టు దృక్పథం శాస్త్రీయ భౌతికవాదం నుంచి వచ్చింది. ఈ భౌతిక వాదం ప్రకారం పదార్థం మనసుకి అతీతమై ఆధారభూతమైనట్టిది. పదార్థం వివృతి పొందుతూ మానవ సమాజం ఏర్పడి, ఉత్పత్తి సాధనాలు ఆధారంగా గతితార్కిక పద్ధతిని (dialectical) పరిణామాలు చెందుతూ వచ్చింది. దాని పరిణతావస్థ వర్గరహిత సమతా విలసిత సమాజం. ఇక్కడ చరిత్ర ఒక ప్రధానాంశం, చరిత్ర గతి అనివార్యం అని సిద్ధాంతం. పోనీ ఈ సిద్ధాంతం సకారమేఅయినా శ్రామిక విప్లవానంతర సమాజంలో మానవుడు గత చరిత్ర అంతటికీ వారసుడు కాడా? క్షాళనం ఎందుకు? అని ప్రశ్నిస్తే, వారసుడైనప్పుడు అతనిలో పాత వాసనలు అతణ్ణి కొత్త సమాజానికి పనికిరాకుండా చేస్తాయి కాబట్టి అంతమేర ఆ వాసనల్ని క్షాళనంచేసి తీరాలి అని మార్క్సిస్టుల సమాధానం.

అలా మనిషి మనస్సుని చాకలి బట్టలుతికి ఇస్త్రీ చేసినట్లుగా చెయ్యడంలో ఎంత బాధ, ఎంత కష్టం ఉన్నది! మరి భూతలస్వర్గం, తిరుగులేని వసుధైక సమాజం కావాలంటే పూరికే వస్తుందా? ఇక్కడ మరొక ఆసక్తికరమైన విషయాన్ని గుర్తించాలి. ఈ సిద్ధాంతం ప్రకారమే చరిత్ర తాలూకు స్మృతుల్ని అంటే ఇటీవల జరిగిన చరిత్ర స్వరూపాన్ని కూడా నేటి సమాజానికి అనుగుణంగా ఎప్పటికప్పుడు మార్చుకుంటూ పోవాలి. మార్చుకోవడమే కాదు, అలా మారిన చరిత్రను సామాజికుల మనస్సుల్లో అలాగే ముద్రిస్తూ పోవాలి. వాళ్ళు తదనుగుణంగా భావించాలి, నడుచుకోవాలి. ఈ పద్ధతి ప్రకారమే స్టాలిన్, రష్యాలో జరిగిన కమ్యూనిస్టు విప్లవ చరిత్రను ట్రాట్స్కీ వగైరాల ఛాయలు లేకుండా సంస్కరించాడు. కృశ్చేవ్ స్టాలిన్ చేసిన తప్పుల్ని నిరసించి చరిత్రని తిరుగ వ్రాయించాడు. కృశ్చేవ్ తరువాత మళ్లీ చరిత్ర నేటి పాలకుల అభిప్రాయానుసారంగా సంస్కరింపబడింది. ఇక్కడ చరిత్ర అనేది ఇంకా పూర్తి కాకపోవడంవల్ల సవరిస్తూ ఉండవలసిన విషయమనిన్నీ, దానికి ప్రకృతంలో స్వతహా అస్తిత్వమూ, స్వరూపమూ లేదనీ, అటువంటి నిర్దిష్ట స్వరూపం— చరిత్ర ముగిసినప్పుడే లభిస్తుందనీ, అంతటితో సవరింపులు కూడా ముగుస్తాయనీ వాళ్లవాదం. అంతదాకా సమకాలీన సమాజానికి (అంటే అధికార వర్గానికి) అనుగుణంగా గడచిన చరిత్రను దిద్దుకుంటూ పోవలసిందే.

కమ్యూనిస్టు దేశాల్లో రాజ్య వ్యవస్థను నడుపుతున్న నియంతలు సమాజంలోని వ్యక్తులమీద నెరపుతున్న మానసిక నియంత్రణం ఎంతవరకు సమర్థనీయం అనే ప్రశ్న మనలాంటి వాళ్లలో ఉద్భవిస్తుంది. ఏ విప్లవంకానీ మనిషికి న్యాయంజరగాలి అనే ధ్యేయంతోనే బయల్దేరుతుంది. కమ్యూనిస్టు దేశాల్లో నేడు ఆ 'న్యాయం' జరుగుతోందా? ఇక్కడ 'న్యాయం' అనే భావాన్ని గూర్చి కొంత జిజ్ఞాస చెయ్యాలి. మతం స్థాపించిన విలువల దృష్ట్యా నిర్వచింపబడిన ఆదర్శ మానవత్వం, సాధారణవ్యక్తి అందుకోలేని అంతరిక్షాన ఉండటంవల్లే మానవుడికి న్యాయం జరగలేదు. మనిషిని కొలిచే కొలబద్ద మారవలసి వచ్చింది. న్యాయం భగవంతునివల్ల, రాజువల్ల జరగనప్పుడు అది తోటి మానవుని వలననే జరుగవలెననే మానవతా దృక్పథం ఏర్పడింది. ప్రజాస్వామ్య విప్లవంలో మానవునికి మానవుడే కొలబద్ద. కాని ఆర్థిక వ్యవస్థవల్ల జరుగుతున్న దురన్యాయం మూలంగా ఆర్థిక సమానత్వాన్ని కూడా సాధించడానికి మార్క్సిస్టు విప్లవాన్ని ఆశ్రయించాడు మానవుడు. ఇంతదాకా ఆర్థిక వ్యవస్థా విప్లవం నడిచిన తీరుచూస్తే, మొదట్ల అది రష్యా, చైనా వంటి దేశాలలో రావడం ద్వారా, మార్క్స్ పథకం ప్రకారం, వూహించిన అంచనాల మేరకు జరగలేదు. పైగా అది అనతికాలంలోనే ప్రపంచ వ్యాప్తం కావడానికి ఫాసిజం, రెండవ ప్రపంచ యుద్ధం అడ్డు వచ్చాయి. యుద్ధం కూడా విప్లవ వ్యాప్తికి ఒక సాధనమే అని భావిస్తే, ఆటంబాంబు మూలంగా యుద్ధ స్వరూపమే మారిపోయి అది నిషిద్ధం అయి కూర్చుంది. అందువల్ల యుద్ధంద్వారా ఇతర దేశాల్లో విప్లవం తెచ్చే ఆశ అడుగంటింది. మార్క్స్ అంచనాలకు భిన్నంగా అతి పారిశ్రామిక దేశాలైన అమెరికా వంటి దేశాల్లో విప్లవం వచ్చే అవకాశాలు మరీ తక్కువైపోయాయి. ఇలా ప్రపంచ చరిత్రగతి గడచిన ముప్పైఏళ్లలో సూటిగా ఉండకపోగా, పరిస్థితి మరింత క్లిష్టమైపోతూవస్తే, శ్రామిక విప్లవం ప్రపంచమంతటా ఎప్పుడు పూర్తి అవుతుందో ఇదమిత్థంగా చెప్పలేనిస్థితి నేడు ఏర్పడిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా విప్లవం పూర్తి అయితేగాని రాజ్య వ్యవస్థయొక్క సర్వాధికారం సన్నగిల్లే అవకాశం ఏర్పడదు. ఇది ఇలా ఉండగా, శ్రామిక విప్లవం సాధించి నియంతృత్వాన్ని ఏర్పరచిన పురోగామి

దేశాలు రష్యా, చైనాలు చూస్తే పరస్పరం సహకరించేందుకు బదులు తీవ్రంగా విరోధించి ఇద్దరి మధ్యా పచ్చగడ్డి వేస్తే భగ్గున మండే స్థితిలో ఉన్నాయి. ప్రపంచవ్యాప్తంగా శ్రామిక విప్లవం పూర్తి కావడం ఎప్పుడో ఒకప్పుడు, ఎలాగో ఒకలాగ తథ్యమేనని మనం అందరం విశ్వసించినా, దానికి ఒక కాల పరిమితి అంటూ కనిపించకపోతున్నది. అది పూర్తయ్యేదాకా మనిషి కమ్యూనిస్టు దేశాల్లో, రాజ్యవ్యవస్థ 'నిఘా' లో వుంటూ, అది ఆదేశించిన ప్రకారంగా తన వ్యక్తిచైతన్యాన్ని సామాజిక చైతన్యంగా ఎప్పటికప్పుడు రూపొందించుకుంటూ వుండవలసిందే అని సిద్ధాంతీకరించి, అలా చేస్తూవుండడం కొత్త రకం బానిసత్వంకాక మనిషి అనుభవిస్తున్న స్వాతంత్ర్యమా? మనిషికి జరుగుతున్నది దురన్యాయంకాక న్యాయమా? సామాజిక చైతన్యమూ, సామాజిక నీతి అనేది నేటి కమ్యూనిస్టు దేశాల్లో క్షణం క్షణం మారుతూ అనిశ్చితంగా ఉండటంవల్ల అది ఎంత మొరకుగా, కరకుగా, ఇనుపచట్రంగా వ్యక్తుల్ని నలిపివేస్తున్నదో వాళ్ల జీవితాల్ని నాశనం చేస్తున్నదో అక్కడి పరిస్థితుల్ని అవగాహన చేసుకునే శ్రమ తీసుకుంటేగాని మనకు బోధపడదు. గతంలో భగవంతుడు లేక రాజు కారణంగా కొన్ని ధర్మసూత్రాలూ, విశ్వాసాలూ కారణంగా మనిషి దురన్యాయానికి గురి అయితే, నేడు భగవంతుడు—రాజ్యవ్యవస్థ—ఆర్థిక వ్యవస్థ మూడూ ఏకమైన నిరంకుశాధికారం, చరిత్ర గమ్యం పేరిట మనిషిని వ్యక్తిగా రూపు మాపుతున్నది.

మానవుని మానవత్వానికి నిర్వచనం ఏమిటి? ఆధ్యాత్మిక ఆదర్శాలూ, విశ్వాసాలూ కానప్పుడు, రాజు చేసిన చట్టాలు కానప్పుడు, దాన్ని అన్వేషిస్తూ సమానత్వాన్ని ఆనందంగా బ్రతికే అవకాశాన్ని సాధించదలచుకొని, మార్క్స్ దర్శనంమీద విశ్వాసం పెట్టుకొని మనిషి చేస్తున్న ప్రయాణానికి పర్యవసానం ఏమిటి? సమ సామాజిక వ్యవస్థ అనే గమ్యం ఇంకా చేరుకోలేదు. మనిషి వ్యక్తిగా తన జీవితకాలంలో దాన్ని చేరుకునే ఆశ కనిపించనప్పుడు తన భవిష్యత్తుకు బలి కావలసిందేనా? లక్ష్యాన్ని విస్మరించకుండా, నేటి బ్రతుకుని బానిసత్వానికి బలి పెట్టకుండా గమ్యం వైపు పయనించే మార్గమేలేదా? ఈ సమస్యకు సమాధానాన్ని ఆలోచించవలసిన బాధ్యత అందరిమీదా ఉన్నది. ఇక్కడ నేటి కమ్యూనిస్టు దేశాలనుంచి మనం నేర్చుకోవలసినది ఏమీ కనిపించదు. అక్కడి యదార్థ పరిస్థితులని సరిగా అవగాహన చేసుకోవలసిన అవసరమే కనిపిస్తున్నది.

కమ్యూనిస్టు దేశాలలో 'న్యాయానికి' ఎటువంటి కొలబద్దా లేకపోవడాన్ని ప్రస్తావించాను. అలా ఎందుకు లేదంటే కారణం చరిత్ర గతి అనిశ్చితంగా వుండి ఎప్పటికప్పుడు దాని స్వరూపం కమ్యూనిస్టు దేశాల్లో అధికారవర్గంతోపాటు మారుతున్నది కాబట్టి. అటువంటి స్థితే సిద్ధాంత రీత్యా పరోక్షవిధంగా మనదేశంలో కమ్యూనిస్టు పార్టీకి కూడా పట్టింది. ఉద్యమం

నడపడంలో ఏ సమయంలో ఎలా తప్పు జరిగిందో ఎవరివల్ల జరిగిందో చరిత్రగతి అవగాహన ద్వారా (అంటే గడచిన ముప్పై ఏళ్లలో సంభవించిన జయాపజయాల ద్వారా) ఎప్పటి కప్పుడు నిర్ణయించుకోబూనడంవలన ఇంతవరకు యీ దేశంలో కమ్యూనిస్టు పార్టీకి చరిత్రే లేకుండాపోయే పరిస్థితి ఏర్పడింది. ఉదాహరణకు 1948 ప్రాంతాల్లో తెలంగాణాలో ఉద్యమాన్ని కమ్యూనిస్టుపార్టీ ఎందుకు విరమింపజేసింది? అని తెలంగాణా యువకులు నేడు ప్రశ్నిస్తున్నారు. దానికి ఎన్ని యుక్తులు చెప్పినా, సిద్ధాంత రీత్యా 'మేము చరిత్రతోక పట్టుకుని నడవడానికి ప్రయత్నిస్తున్నాము' అనే సమాధానమే నిగ్గు తేలుతున్నది. అంటే యీ దేశంలో సోషలిస్టు విప్లవం తేవడంలో 25 ఏళ్లుగా అన్ని రాజకీయపక్షాలూ సమంగానే విఫలమయ్యాయి అన్న భావం యువకుల్లో నేడు వ్యాపించి నిర్ధారితమైపోయింది. ఈ ధోరణి నిర్వేదం 1965 నుంచీ ప్రస్ఫుటమౌతూ వచ్చింది. ఆంధ్రదేశంలోనేకాదు, దేశం నలు మూలలా విప్లవాకాంక్ష, రాజకీయ పార్టీలపట్ల అవిశ్వాసం ముమ్మరంగా పెరిగింది. యువకుల్లోని అసంతృప్తి నక్సలైట్ ఉద్యమంగా పెల్లుబికింది.

నక్సల్‌బరీ, శ్రీకాకుళంవంటి ప్రాంతాల్లో జరిగిన తిరుగుబాట్లు ఆదర్శంగా భావించి ఆ తిరుగుబాట్లని దేశంలో వ్యాపింపజేసి 'విప్లవం'గా రూపొందించాలనే ఉద్యమం నక్సలైట్ ఉద్యమం. కాని ఇతర ప్రాంతాల్లో శ్రీకాకుళ ప్రాంతంలో సంఘటితమైన ఆర్థిక సామాజిక పరిస్థితులు లేకపోవడంతో, ఈ ఉద్యమం వైయక్తికమైన 'టెర్రరిస్ట్' ఉద్యమంగానే భాసించింది. ఈ ఉద్యమంలో పాల్గొన్న యువకులందరూ ఒక వర్గంనుంచీ వచ్చినవారు కారు. వీళ్లవి భిన్న మనస్తత్వాలు. ధనికవర్గంనుంచీ వచ్చిన యువకులు జీవితం 'బోర్'గా ఉండటంవల్ల సాహస క్రియల్లో జీవితాన్ని క్రొత్తగా అనుభవించే ఉద్దేశంతో ఉద్యమంలో ప్రవేశించినవారు. ఏ ఆదర్శమైనాసరే ప్రాణాల్ని బలిపెట్టే సాహసం చేస్తేగాని అది సిద్ధించదనే విశ్వాసంతో ముందుకు వచ్చిన ఆదర్శవాదులు కొందరు. 'ఈ సమాజం ఈ వ్యవస్థ నాకుగిట్టదు. నాకు జీవనోపాధి చూపించని ఈ సంఘంతో సంబంధంలేదు. నేను ఏ అడ్డంకులూ భయాలూ లెక్కచెయ్యను, అనే తెగింపుతో లేక స్వేచ్ఛా నిరూపణకోసం వచ్చినవారు కొంతమంది. వీళ్లందర్నీ 'నిహిలిస్టు'లు (Nihilists) అనడంలో ఏమాత్రం పొరపాటులేదు. వీళ్లను ఉపయోగించుకున్నవాళ్ళు మార్క్సిస్టుపార్టీలోని తీవ్రవాదులు.

ఇక్కడ 'నిహిలిజం'ను గురించి కొంత చెప్పాలి. 1860 ప్రాంతాల రష్యాలో జార్ నిరంకుశ ప్రభుత్వంమీద సాగిన టెర్రరిస్ట్ చర్యల్లో పాల్గొన్న విద్యార్థుల మనస్తత్వానికి యీ పదం వర్తిస్తుంది. "గతాన్ని నిర్మూలించడమే భవిష్యత్తుని పుట్టించడం" అంటాడు హెర్జన్. (The annihilation of the past in the procreation of the future.) "ఈ వ్యవస్థతో నాకు ఏమీ సంబంధంలేదు" అంటాడు పిసారెవ్. (I am a straner to the order of existing things. I have nothing to do with it.) వీళ్లందరూ యువక టెర్రరిస్టులు. సర్వాన్నీ నిరాకరించడమే దృఢ విశ్వాసంగా రూపొందింది. (Their personal solution consists of endowing their negation with the intransigence and passion of faith). నిర్మూలించాలనే ఉద్రేకం అది సృజనాత్మకమైన ఉద్రేకమే' అంటాడు బకూనిన్, మరొక టెర్రరిస్ట్. కర్షకుల తిరుగుబాటులో నాయకత్వం వహించిన దొంగలనాయకుణ్ణి బకూనిన్ మెచ్చుకున్నాడు. కారణం వాళ్లు ఏ సిద్ధాంతం కోసమో, విలువ కోసమో కాకుండా కేవలం మానవ స్వేచ్ఛ కోసమే పోరాడటం అతణ్ణి ముగ్ధుణ్ణి చేసిందట. 'ఝంఝామారుతమూ జీవితమూ కావాలి. మరో ప్రపంచం అంటే బంధించే ధర్మాలులేని స్వచ్ఛందమైన ప్రపంచం కావాలి' అన్నాడు బకూనిన్. (The tempest and life, that is what we need. A new world, without laws, and consequently free) ఆనాటి యీ టెర్రరిస్టుల కుర్రకారు (**adolescent**) మన సత్త్వమే విద్యావంతులైన మన యువక నక్సలైట్లలో ప్రతిఫలించిందని నేరుగా చెప్పనక్కర్లేదు. వీళ్లకు సిద్ధాంతాలూ సామాజిక అవగాహనా అక్కర్లేదు. నిరాకరించడమే నిర్మూలించడమే లక్ష్యం. శ్రీకాకుళంలో నిహతులైన తిరుగుబాటు నాయకులు వీళ్లని ఆకర్షించిన కారణం—సిద్ధాంతాలూ విలువలూ కావు. ఆ తిరుగుబాటులో ద్యోతకమైన స్వచ్ఛంద మానవత్వం ఒక్కటే. తిరుగుబాటులో మెరసిన చైతన్యదీప్తి వీళ్ల కళ్లని మిరుమిట్లు గొల్పింది.

కాని స్వచ్ఛందమైన మానవత్వమూ, హద్దులులేని సమాజమూ సాధ్యమా? ఈ ప్రశ్నకు సమాధానం అన్వేషించేముందు తెలుగు సాహిత్యంలో, ముఖ్యంగా వచన కవిత్వంలో 1965 లో వచ్చిన దిగంబర కవులను గూర్చి ప్రస్తావించాలి. వీరి తొలి సంపుటిలో (1965 మే) సమకాలీన సమాజంపట్ల జుగుప్స, దానితోపాటు స్వచ్ఛందమైన మానవత్వాన్ని (దిగంబర మానవుణ్ణి) దర్శించాలనే తపన వ్యక్తమయ్యాయి. ఇవి సెక్స్ ఇమేజరీ ద్వారా సమాజాన్ని చిత్రించే ఖండికల్లో వ్యక్తం కావడం గమనించదగింది. "నగరం నడి రోడ్డుమీద నాగరకత బొడ్డుమీద నగ్నంగా నిలబడ్డా, మనిషీ....మనిషీ...మనిషీ...ఎలుగెత్తి పిలుస్తున్నా" (మహాస్వప్న).రెండవ సంపుటిలో (1966 డిసెంబర్) మార్క్సిస్ట్ దృక్పథంవైపు మొగ్గు చూపుతున్నట్లు ప్రకటించారు. "ఈ భూగోళంపై దారిద్ర్యం, ఆకలి అలముకున్నంతవరకు మార్క్సిస్ట్ దృక్పథాన్ని సవాల్‌చేసే అధికారం ఎవరికీలేదు. అయితే వ్యక్తి స్వేచ్ఛ జనబాహుళ్యానికి అడ్డుకారాదు. కాని నియమాల నిరంకుశత్వంతో సిద్ధాంతాల వక్ర భాష్యంతో మనిషిని కీలుబొమ్మగా, యంత్రపు విడిభాగంగా తయారుచేసే నియంతృత్వానికి అది

మార్గం కారాదు" (ఆముఖం). ఈ రెండవ సంపుటిలో వీరికవిత్వ రీతి పరిణతికి వచ్చింది. ప్రౌఢమయింది. కాని మూడవ సంపుటి (1968 జూన్) నాటికి చాల ఖండికల్లో చవకబారు దూషణ, కవితాగుణంలేని వచనమూ కనిపిస్తుంది. "దేశం ఒక లేవ్రేటిగా తయారై కంపు గొడుతూంటే, దాని క్కారణా లేమిటోఏమాత్రం చూడకుండా పేడ పురుగుకన్నా హీనంగా బ్రతికేస్తున్న ఆంధ్రుడు ఇప్పటికైనా తన ముండమోపి బతుకుని గురించి తెలుసుకోవడం అవసరం" (ఆముఖం). మొదటి రెండు సంపుటాల కవిత్వంతో దేశంలో ఏదో మానసిక విప్లవం వచ్చేస్తుందని నమ్మి, అలా జరక్కపోవడంతో వీళ్ళు పొందిన నైరాశ్యం మూడవ సంపుటిలో బజారు తిట్లకు లంకించుకోవడంగా వ్యక్తమైనట్లు తోస్తుంది. అటుపైన వీళ్ళు 'దిగంబరత్వాన్ని' వదలి 1970 లో విప్లవ కవులుగా ప్రకటించుకొన్నారు. "మహోన్నతమైన సోషలిస్టు మానవతావాద వైఖరిని అవలంబించి మార్క్సియన్ సోషలిజంను శాస్త్రంగానేకాక శస్త్రంగా కూడా ఆమోదిస్తూ రాజకీయ మహోద్యమానికి చేదోడు వాదోడు కావాలి" (జ్వాలాముఖి: తరుణ: డిసెంబర్ 1971) అని నిశ్చయించుకున్నారట! అంతటితో వీళ్ళలో చీలికలు కూడా బయలు దేరినవి. అది విషయాంతరం. కాని దిగంబర కవులు విప్లవ కవులుగా మారడంలో 'నిహిలిజం' నుంచి మార్క్సిజంలోకి నిజంగా పరివర్తన చెందారా? అనే విషయం పరిశీలింపదగింది. విప్లవ కవులు ప్రచురించిన గేయాలు కేవలం నక్సలైట్ ఉద్యమాన్ని పొగడి ప్రోత్సహించేవిగానే ఉన్నాయి. ఈ దృష్టితోచూస్తే వీళ్ళ మార్క్సిస్ట్ అవగాహనని గూర్చి సందేహం వెలిబుచ్చవలసి వస్తున్నది.

1965—70 సంవత్సరాలలో దేశంలోని రాజకీయ పరిస్థితి దృష్ట్యైనా, యువత పొందిన నిర్వేదం దృష్ట్యైనా సమాజంలో పెల్లుబికిన నిహిలిస్ట్ మనస్తత్వం యొక్క స్వచ్ఛంద మైన సాహిత్యాభివ్యక్తి దిగంబర కవిత్వం. అందుకే అది స్మరణీయమైన సృష్టిగా నిలుస్తుంది. చిత్రమేమంటే దానిలోని కవిత్వ లక్షణం విప్లవ కవులుగా మారిన దిగంబరుల గేయాల్లో నేడు ఏమాత్రం కనిపించడంలేదు.

ఇంతవరకూ వచ్చిన విప్లవ కవిత్వంలో మార్క్సిస్ట్ అవగాహన ఛాయలు కనిపించవు. ఈ కవిత్వం కేకలతో అరుపులతో ప్రజల్లో హింసాప్రవృత్తినీ తిరుగుబాటుభావాన్నీ రెచ్చగొట్టే ధోరణిలో ఉంటూ, నిజమైన రాజకీయ సంచలనానికి ప్రత్యామ్నాయంగా మాత్రమే చలామణీ అవుతూ వున్నదా? అనే సందేహం కూడా కలుగుతున్నది. ఆమధ్య హైకోర్ట్సువారూ అటువంటి తీర్పే యిచ్చి విప్లవకవుల వల్ల నేటి వ్యవస్థకు వాటిల్లే ప్రమాదం ఏమీ లేదంటూ వాళ్ళని విడిచిపెట్టినట్టున్నారు! నేటి సామాజిక చైతన్యదీప్తి దృష్ట్యా చూస్తే వీళ్ళ విప్లవ కవిత్వం దాన్ని ప్రతిబింబించడానికి బదులు గతాన్ని నెమరు వేసుకుంటూ (నడచిన నక్సలైట్ వీరగాథలు పాడుతూ) ఉన్నట్లే తోస్తుంది. రాత్రి వేగడానికి ఇంకా వ్యవధి వుండగా, మెరసిన ఒక మెరుపుని పగలుగా భ్రమించి అనుక్షణమూ అటువంటి మెరుపు కోసమే, ఆ మెరుపు అలాగే నిలిచిపోవడం కోసమే తపనపడే ఆలోచనాశూన్యత్వాన్ని గుర్తు తెస్తున్నారు వీళ్ళు. మార్క్సిస్ట్ అవగాహనతో వీళ్ళు నేటి సామాజిక చైతన్య స్వరూపాన్ని బహుముఖంగా సమగ్రంగా దర్శిస్తున్నట్లు దాఖలా కనిపించదు. పైగా ఇప్పటికే శ్రామిక విప్లవ నియంతృత్వ మేదో కాస్త వీళ్ళకి చేజిక్కినట్లు, సాంస్కృతిక విప్లవం సాధించడానికి, కమ్యూనిస్టు దేశాల్లో రచయితల్నీ మేధావుల్నీ అనుశాసిస్తున్న రీతిగా, యిక్కడ వీళ్ళు విప్లవ సాహిత్యం ఎలా వుండాలి అన్న విషయమై నిర్వచించే అధికారం తమకొక్కరికే వున్న రీతిగా అహమికతో వ్యవహరిస్తున్నారు. దేశంలో మార్క్సిస్ట్ అవగాహన వున్న కమ్యూనిస్టు పార్టీలు మాత్రం ఈ సాహసానికి పూనుకోలేదు.

"There is no question that literature is least of subject to the mechanical adjustment and levelling to the rule of the majority over the minority There is no question either, that in this field greater scope must definitely be allowed for personal initiative, individual inclination, thought and fantasy, form and content.' అన్న Lenin మాటల్ని ఉదహరించి కె. వి.రమణారెడ్డి సంస్కృతి—సాహిత్యం అనే వ్యాసంలో (సృజన ఫిబ్రవరి 1971) "సంప్రదాయ నిరసన ధోరణి అతిశయించినప్పుడు సంస్కృతిని మొత్తంగానే నిరాకరించే ప్రమాదం" ఉన్నదని హెచ్చరిస్తూ "లెనిన్‌గాని మావోగాని సాహిత్యాన్ని ఇతర ఉద్యమ రూపాలనూ ఒకేగాటకు కట్టివేయలేదు" అని హితవు చెప్పినా దాన్ని వీళ్ళు గమనించినట్లులేదు. జ్వాలాముఖి "వేకువ" (డిసెంబర్ 1971లో) తెలుగు సాహిత్య చరిత్రని పరామర్శించిన ధోరణి చూస్తే తెలుస్తుంది. అందులో నిహిలిస్టుల లక్షణమైన స్వోత్కర్ష (rationalized egoism) ఒకటే కనిపిస్తున్నది. "నక్సలైట్ కార్యాచరణ ఎంతవరకు సరైంది? దానిలో విప్లవ నిర్ణాయక శక్తి వుందా? అనేది నిర్ణయించాల్సింది ప్రజలు, రాజకీయపక్షాలు" (జ్వాలాముఖి: తరుణ : డిసెంబర్ 1971) అంటూనే, నక్సలైట్ల స్తుతిగీతాలలో హోరెత్తిస్తూ సంతృప్తి చెందుతున్న వీళ్ళు 'నిహిలిజం' నుంచీ మార్క్సిజంకీ పరివర్తన చెందారంటే అది అర్థం లేనిమాట! 1860 నాటి రష్యన్ నిహిలిస్టులు కూడా యిలానే ప్రవర్తించారట! "They believed in nothing but reason and self-interest But instead of scepticism they chose the apostolate and became

socialists. Therein lies their basic contradiction.'. (The Rebel - Albert camus). రష్యన్ నిహిలిస్టులు నిజమైన పెద్దరిస్టులైతే, వీళ్ళు సాహిత్య పెద్దరిస్టులు. అంతే తేడా.

తెలుగుదేశంలో కథలు వ్రాస్తున్న కొందరు రచయితల్లో పీడిత వర్గ చైతన్యాన్ని గూర్చిన అవగాహన చక్కగా ప్రస్ఫుటమౌతూనే వున్నది. అందులో కొన్ని రచనలు ఉత్తమ సాహిత్య పరిగణనకు అర్హమైనవని కూడా వుంటున్నాయి. కాని వీళ్ళకి విప్లవ రచయితలు అనే లేబిల్ లేదు. కొలకలూరి ఇనాక్ జనవరి 72 భారతిలో ప్రచురించిన 'తలలేనోడు' అనే కథ ఇందుకు ఒక ఉదాహరణ. ఇక్కడ చెప్పవలసింది ఏమిటంటే రచయిత సామాజిక చైతన్యదీప్తికి దూరం కాకుండా సాహిత్యాన్ని సృష్టిస్తున్నప్పుడు, విప్లవోన్ముఖమైనవీ కళాత్మకమైనవీ రచనలు తప్పక వస్తాయి. అంతేగాని విప్లవ రచయిత అనే బిరుదు తగిలించుకున్నందు వల్ల సాహిత్యాభివృద్ధి జరగదు. పోతే తోటి రచయితలకు యిలా వ్రాయాలి అని చెప్పడం అనుశాసించడం ఎక్కడా సహ్యమైన విషయంకాదు. ఏ వ్యవస్థలో అయినా లెనిన్ చెప్పినట్లు రచయితకు కొంత స్వాతంత్ర్యం అవసరం. కమ్యూనిస్టు దేశాల్లో కూడా సాంస్కృతిక విప్లవాన్ని నడిపే భారం ఏ ఒక్క రచయితల ముఠాకో అప్పగించటం అరుదు. తోటి రచయితలను అనుశాసించే అధికారం ఏ రచయితల ముఠాకో పొందితే పేనుకు "పెత్తనం యిచ్చిన" సామెతవలె అవుతుంది.

విప్లవానికీ సాహిత్యానికీ గల సంబంధాన్ని గూర్చి ఆలోచిస్తే, విప్లవం నూతన సామాజిక సృష్టి అయినట్లుగానే సాహిత్యం కొత్త విలువల్ని దర్శించి జీవితానికి వాటిని అన్వయించే భావనాత్మక సృష్టి. విప్లవానికి దారితీసే విలువల్ని సృష్టించి మానసిక విప్లవం తెచ్చి మానవాళిని ప్రభావితం చేసిన రచయితలు నీట్షే, హెగెల్, కారల్‌మార్క్స్ వంటి, దార్శనికులు. నిజంలో కారల్‌మార్క్స్ నేటి ప్రపంచవిప్లవానికి మూలపురుషుడయ్యాడు. విప్లవం మొదట మానవుల మనసుల్లో పుట్టి తర్వాత భూమి మీద (అంటే సామాజిక వ్యవస్థగా) రూపం దిద్దుకుంటుంది. అంటే మార్క్స్ భౌతిక వాదానికి విప్రతిపత్తి ఏమీలేదు. కవుల కంటే మేధావుల దర్శనాలే మౌలికంగా విప్లవానికి కారణం అయ్యాయి అని తోస్తుంది. కవులకు అశక్తిని ఆపాదిస్తూ 'Poets are the unacknowledged legislators of the world' అన్న షెల్లీ పెద్ద రొమాంటిసిస్ట్ అన్న విషయం మనం మరచి పోకూడదు. షెల్లీ నాస్తికతను గూర్చి పుస్తకం వ్రాసినా, అతని కవిత్వానికి మౌలికమైన ప్రేరణ గుడ్విన్, రూసో వంటి మేధావుల్నుంచి వచ్చిందని విస్మరించరాదు. అయితే కేవలం దర్శనాలకు లేని గుణం ఒకటి కవిత్వం, కథ, నవల వంటి ప్రక్రియలకు ఉంది. అది సామాజిక చైతన్యాన్ని ఎప్పటికప్పుడు దాన్ని సంక్లిష్ట స్వరూపంతో అనుభూతిపరంగా ప్రతిబింబించడం. ఇటువంటి ప్రక్రియ నేడు తెలుగు కథానికలో నవలలో జరుగుతున్నట్లుగా కవిత్వంలో జరగడంలేదు. 'తిరగబడు' 'కొట్టు' 'చంపు' 'మార్చ్' అంటూ కేకలు పెట్టడం కవిత్వంకాదు. వేదికలమీద రాజకీయ ప్రచారానికి ఈ గేయాలూ, కవితలూ ఉపయోగిస్తే ఉపయోగించవచ్చునుగాని, వీటికి సాహిత్య ప్రతిపత్తిని ఆపాదించడం సాధ్యంకాదు. సాహిత్య ప్రతిపత్తి ప్రచారంవల్ల రాదు. 'మా కొద్దీ తెల్ల దొరతనమూ' 'నడకు నడకు కదుర, నడకవే కదురా!' 'కొల్లాయి గట్టితేనేమి' సాహిత్యంగా నిలవలేదు. అందువల్ల విప్లవ సాహిత్యం అంటే కొత్త దృష్టిని కల్పించే సృజనాత్మక రచన; పాత కొత్తలకి వంతెన, భావినిగూర్చి మనస్సును ఉన్ముఖం చేసే స్వప్నం, సమాజంలో నూతన సంబంధాల కిచ్చే నిర్వచనం. యుద్ధంలో పొలికేక (battle-cry) కీ, యుద్ధ వీరుల పొగడ్తలకీ సాహిత్య ప్రతిపత్తి ఎప్పటికీ రాదు!

రష్యన్ నిహిలిస్ట్ పిసారెవ్ అన్నాడట: "నేను రష్యన్ రాఫెల్ (చిత్రకారుడు) కావడానికంటే రష్యన్ చర్మకారుణ్ణి కావడానికే యిష్టపడతాను" (I would rather be a Russian shoe-maker than a Russian Raphael). ఈ మాటనే సాహిత్యపరంగా అన్వయిస్తే విప్లవానికి సృజనాత్మక రచయిత కంటె ప్రచార పత్రికా రచయితే ఎక్కువగా ఉపయోగిస్తాడనే భావం తోస్తుంది. విప్లవానికి సాహిత్య ప్రయోజనాన్ని నిర్ణయించే పద్ధతి యిదికాదు! సృజనాత్మక రచనా, ప్రచారపత్రికారచనా రెండూ సమాజానికి అవసరమే. ఆ యీ రచనలమధ్య విభేదమూ అనివార్యమే! ఆ విభేదాన్ని ఈ 'అత్యయిక పరిస్థితి'లో విస్మరించమని వాదించేవాళ్ళు సృజనాత్మక సాహిత్యానికీ, తద్వారా సామాజిక విప్లవంయొక్క మూలతత్వానికీ బద్ధ విరోధులు!

నవల జీవితాన్ని గూర్చిన భావనాత్మక చిత్రాలని సృష్టిస్తుంది. యదార్థ సంఘటనలని ఏర్చి కూర్చడంలో కొత్త దృక్పథాన్ని కల్పిస్తుంది. మానవునిలోని సృజనాత్మక శక్తికి అభివ్యక్తి కల్పిస్తుంది. నవల కల్పించే వినోదం, ఆనందం, పాఠకునిలోని సృజనాత్మక ప్రవృత్తియైన భావనకు కలిగే స్పందన రూపంలో ఉంటుంది. సద్యః రాజకీయ ప్రయోజనాన్ని ఆశించే వాళ్ళు ఆ వినోదాన్ని, ఆనందాన్ని నిరసించి, పాఠకుని ఆలోచనల్ని తమ కార్యక్రమానికి అనుకూలంగా మళ్ళించే నవలలే కావాలంటారు. ఇది సమర్థనీయంకాదు. జీవితాన్ని సమగ్రంగా, ఎన్నో రీతుల్లో, బహుముఖాలుగా చూసిలిలోపట్టి ఆస్వాదించాలనే మనిషి

కోరికని నవలలు తీరుస్తాయి. ఇది మనిషిలో పలాయనవాదం కాదు! మనిషి జీవితాన్నుంచి పారిపోవాలనుకోడు. ఎన్ని అవకతవకలున్నా జీవితాన్ని జుర్రుకోవాలనే చూస్తాడు. స్వీయ జీవితానుభవంలో దీపాల్లా మెరిసే విడిక్షణాల్లో ఉద్రేకాల్లా తప్ప జీవిత స్వరూపం ఏమిటో, అసలు దానికి ఒక రూపం ఉన్నదో లేదో అతనికి అవగతంకాదు. జీవితాన్ని తన మనస్సుముందు నిలిపి, తనివితీరా దాని వంపులూ సొంపులూ చూసుకొమ్మని అవకాశం కల్పించేది నవల మాత్రమే. ఇది దాని విశిష్ట ప్రయోజనం. అందుకే నవల అంటే అందరికీ ఆసక్తి. నిజానికి జీవితానికి నిశ్చిత స్వరూపం ఏమీ లేదు. ఆ స్వరూపం ఉన్నదనే భ్రమతో దాన్ని నిరంతరం అన్వేషించడం మానవుని సృజనాత్మక ప్రవృత్తి; అతని చైతన్యం. అదే నవలలో వ్యక్తమౌతూ నవల ద్వారా పరితృప్తి పొందుతూ ఉంటుంది. ఆకృతిలేని యాదార్థ్యానికి ఆకృతి కల్పించడంలో, పాతని కొత్తగా పునస్సృష్టించడంలో నవలసాధించే ప్రయోజనమూ, విప్లవం సాధించే ప్రయోజనమూ ఒకటే!

మార్క్సుని మతప్రవక్తగా దైవంగా కాకుండా, ఒక మహామనీషిగా మేధావిగా పరిగణిస్తే ఆయన సిద్ధాంతంతో భేదించడం తప్పుకాదు. మానవత్వం (మనిషి చైతన్యం) పూర్తిగా సామాజికమనే మార్క్సిస్ట్ సిద్ధాంతం దృష్ట్యా నేటి కమ్యూనిస్టు రాజ్యాల్లో జరుగుతున్న వైజ్ఞానిక నియంత్రణమూ, సాంస్కృతిక విప్లవాలూ మనిషి మనస్సుని ఎలా చిత్రిక పడుతున్నాయో యిదివరకే ప్రస్తావించాను. అలాగే మానవత్వం ఏ హద్దులూలేని వైయక్తిక స్వచ్ఛందతతో ఆవిష్కరింపబడాలనే నిహిలిస్ట్ ఆకాంక్షను కూడా పేర్కొన్నాను. మానవ చైతన్యానికి సమాజమూ—వ్యక్తీ రెండూ రెండు ఒడ్డుల్లాంటివి. ఈ రెండింటి మధ్యా అది ప్రవహిస్తూ తద్వారానే నిత్య నూతనంగా ఉంటుంది. వ్యక్తిలోని తిరుగుబాటు ప్రవృత్తి—సమాజం అంతవరకూ ఎరగని దాన్ని దర్శించి దానికోసం చేయిజాచే సృజనాత్మక శక్తి—సామాజిక వ్యవస్థతో ఎప్పుడూ ఘర్షణ పడుతూనే వచ్చింది. అటువంటి ఘర్షణకు అవకాశం లేకుండా చేసి వైయక్తిక స్వేచ్ఛను సమాజ శక్తి పూర్తిగా అణచివేసినప్పుడు వ్యక్తి నలిగిపోతాడు—ఆవేదనకు గురియై జీవచ్ఛవమైన యంత్రపు బొమ్మగా మారిపోతాడు. అయితే అటువంటి సమస్యలూ బాధలూ చరిత్రాంతంలో వుండవని మార్క్సిస్టుల సమాధానం. అప్పుడు అన్నిద్వంద్వాలూ నశిస్తాయట!

("Communism in so far as it is real appropriation of the human essence by man and for man....it is the real end of the quarrel between man and nature, between man and man, between essence and existence, between externalization and the affirmation of self, between liberty and necessity, between the individual and the species. It solves the mystery of history and is aware of having solved it."). ఇహంలోలేని సుఖం స్వర్గంలో ఉన్నదని మురిపించే ఒకనాటి మత వ్యవస్థకూ, ఈనాడు కమ్యూనిస్టు రాజ్యాలలో దుర్లభమై పోయిన వైయక్తిక స్వేచ్ఛ చరిత్రాంతంలో అందరికీ లభిస్తుందని మురిపించే మార్క్సిస్టు మతానికీ ఏమిటీ భేదం? "భేదం ఉన్నది. ఇది శాస్త్రీయమైన, భౌతిక ప్రపంచంలో కాలంలో సాధ్యమైన గమ్యం" అని వాళ్ళు వాదించినా, కనుచూపు మేర కాల గమనంలో అది లేకపోవడంవల్ల నేడు జీవించివున్న మనందరికీ అది దుర్లభమే! అలా అనగానే "రేపటి మనిషికోసం నువ్వు యివ్వాళ త్యాగం చెయ్యి" అంటారు. ఇక్కడ 'నేనూ—సమాజం' అనే ద్వంద్వం తలెత్తుతుంది మళ్ళీ. వాదం పునరావృత్తమౌతుంది. వ్యక్తి స్వేచ్ఛకూ విప్లవ గతికీ కలిగే ఘర్షణలో ఎప్పటికప్పుడు సమన్వయాన్ని సాధిస్తూ పోవడమే సృజనాత్మకమైన మానవత్వ ప్రగతి అవుతుంది. అందులో విప్లవం పేరు పెట్టుకున్న రాజ్య వ్యవస్థ వ్యక్తిని నలిపి వేస్తున్న పద్ధతికి స్వస్తి జరగాలి. అప్పుడే మార్క్సిజమ్ నిజమైన మానవతావాదంగా రూపొంది, చరిత్రాంత స్వప్నంలో కాకుండా జీవితయాదార్థ్యంలో మానవుణ్ణి సార్థకుణ్ణి చేస్తుంది, మానవునికి న్యాయం జరుగుతుంది.

మనస్సులో మహోదయం

శ్రీ మిరియాల రామకృష్ణ

ఈవేళ మనస్సులో మహోదయమయింది
అకాలవార్ధకాన్ని వెనక్కు తిరిగి విసిరివేశాం

నడుంవంగని వయస్సుని ఈ నవోషస్సులో చూశాం.
సార్థకంగా వేకువ ముస్తాబు జరుగుతోంది.

వీథిమీద నిన్న రాత్రంతా నిశ్శబ్దయుద్ధంచేసి
మెత్తని చివుళ్ల వెలుగుజెండా లెత్తిన ఆశలు
చిత్త స్వాతంత్ర్యాన్ని పెత్తనంతో ప్రకటిస్తున్నాయి
చివుళ్ల జెండాల వెనక చిరుగాలి స్వచ్ఛశీలంలా సందడిస్తోంది

ధర్మంలో విజయరేఖల మర్మం దాగుందని
ధైర్యంలో వివేకం తన జీవితాన్ని దాచుకుందని
ఈ ప్రభాతంలో ప్రపంచం పాడుకుంటోంది
ఈ పాటకి ప్రతిమనిషి ఒక విపంచి
ఈ గీతికి ప్రతికవిత ఒక పల్లవి.

మొన్న దౌర్జన్యాల దున్నపోతులు ఆశయాల్ని కుమ్మివేశాయి
ఆశయాలు హాస్పిటల్‌లో చికిత్సపొంది ఇన్ని మెతుకులు తిన్నట్లు
మనస్సులోకి చిరునవ్వులతో అడుగుపెడుతున్నాయి
పగ ఎరగని పగళ్ళువచ్చి కుశల ప్రశ్నలు అడుగుతున్నాయి
క్షమించే సుమనస్సులువచ్చి సుహాసం బహూకరిస్తున్నాయి
సౌజన్యం మూర్ఛపోయిందన్న వార్త అబద్ధమని
అన్ని దేశాల రేడియోలూ పత్రికలూ తాజాగా ప్రకటించాయి
హాస్పిటల్ ముఖద్వారంమీద శాంతిగీతం రాయించారు.

ఈతిబాధలు కరకుగోళ్లతో ఏటవాలుగా దిగుతూ నిన్న
అమాంగల్యకాలం పెంపుడు పక్షుల్ని తన్నుకుపోయాయి.
జనావళి ఆక్రోశతిమిరంలో నేటి వేకువ కొత్తరెక్కలాడించింది
పక్షిగళాల్లోంచి అక్షతకాలం అభయం పలికింది

వెళ్ళిపోయిన కాంతిరథాలవేగం రాబోయే వెలుగువాహనాల
గమనానికి మనశ్చక్రాల్ని నిర్మిస్తుందని చరిత్ర చెప్పింది
కాలానికి నాశంలేదని గణితం వాకొంది
వయస్సుని వాడుకోవడం కర్తవ్యమని జీవితం బోధించింది.

వాస్తవాలు కురిపించిన తుపాకిగుళ్ళ బారినిపడి
తాతముత్తాతలు రాసిన అనుభవాల సవాళ్ళని
ప్రభాతం కాంతి పుస్తకంలో కెక్కిస్తున్నది.
ప్రతిప్రభాతం వెనకాల ఒక చీకటిగుయ్యారం కరిగిఉంటుంది
ప్రతి ఉషస్సులో వెనకటి గాథలు వేలాడుతూ ఉంటాయి.
హత్యలతో దోపిడీలతో బలాత్కారరతులతో భయంకరాగ్నిదుర్తులతో
మానవత్వంమీదపడి మైలపరిచిన శత్రువులది నిన్న రాత్రి
వాళ్ల పచ్చినెత్తురులో మహాత్యాగవీరుల కవోష్ణరుధిరం కలిసి
ప్రతిప్రభాత కృత్యాది వర్ణనలోనూ ప్రవహిస్తున్నది.

జీవితాలకి అన్యాయాన్ని అంటుకడతాయి కొన్ని వ్యవస్థలు
అన్యాయాన్ని చూసి ఊరుకోలేకనే నరుడు పురహరుడుగా మారతాడు
వ్యవస్థల హస్తాల్ని ఖండించడానికి
ప్రతివీరుణ్ణీ ఒక కత్తిగా చేసుకుంటున్న ఉద్రేకం
విరిని కిసలయాలతో మెరిసే చెట్టులా కనిపిస్తుంది
ప్రతిజాతి చరిత్రలో అదే ఒక మహోత్సవం
ప్రతిఉత్సవానికీ ఒక ఉజ్వల చరిత్ర ఉంటుంది
ఎండలో వానలో గాలిలో చెట్లుపడ్డ వ్యథలన్నీ తీరి
చివరికొక ప్రభాతంలో కిసలయిస్తూ
శ్రీ మన్నారాయణుడిలా సహస్రబాహువులతో అభయమిస్తూ
సమస్తజన నమస్సులందుకుంటూ
సమంగా పత్రపుష్పఫలాల నందిస్తాయి
జగన్మనోహరుల్ని తమ సన్నిధిలో చూపిస్తాయి.

సంఖ్యా సంచయాలు

డా. విశ్వనాథ అరుణాచలం

1. ఉపోద్ఘాతము

అనాదినుండి మానవుడు గణించడం అలవాటు చేసుకొన్నాడు. "ఎన్ని?" అన్న ప్రశ్నకు సమాధానంగా పూర్ణాంకాలు సృష్టించుకొన్నాడు. "ఎంత?" అన్న ప్రశ్నకు సమాధానంగా భిన్నాలను సృజించుకొన్నాడు. బహుశః, మనుజుని చేతి వ్రేళ్ళు పది; మొట్టమొదట తాను లెక్కించేందుకు చేతివ్రేళ్ళను ఉపయోగించాడు కాబట్టి మనకు 0, 1, 2, 3, 4, 5, 6, 7, 8, 9, అనే పదిసంఖ్యలు ఏర్పడ్డాయి అనుకోవటం అసమంజసంకాదు.

మనం తరచూ గణితంలో ఉపయోగించే సంఖ్యల్ని అవి అవతరించిన కాలక్రమాన్నిబట్టి ఐదు సంచయాలుగా విభజిస్తాము. మొదటిది, చాల సులువైనది. ధన పూర్ణాంక సంచయము— 1, 2, 3, 4,............లు. రెండవది కొంత పైస్థాయికి చెందింది: శూన్యసహితమైన ధన, ఋణ పూర్ణాంకాల సంచయము,.......... —4,—3,—2,—1, 0, 1, 2, 3,...... మూడవది అకరణీయ సంఖ్యా (Rational Numbers) సంచయము (మొదటిది, రెండవది ఇందు అంతర్గతాలు): $\frac{1}{2}$,—1, 0, 3, 3/4, 1/19...మొదలైనవి. నాల్గవది వాస్తవ (Real) సంఖ్యా సంచయము. మొదటి మూడుసంచయాలు నాల్గవ సంచయంలో ఉప సమితులు. కరణీయ (Irrational) సంఖ్యలు, ఉదాహరణకు $\sqrt{-1}$, $3+2\sqrt{-1}$ లాంటివి ఈ సంచయంలోనివే. ఐదవది చాల సార్వత్రికమైన సంఖ్యా సంచయము. పైన పేర్కొన్న సంచయాలన్నీ ఐదవ సంచయంలోని అంతర్భాగాలే. అంతేకాక $\sqrt{2}$, e, π $\sqrt{}$ లాంటి కల్పిత సంఖ్యలు, సంకీర్ణ సంఖ్యలు ఉంటాయి ఈ ఐదవ సంచయంలో.

2. వాస్తవ సంఖ్యలు

మొదటి సంచయంలోని ధనపూర్ణాంకాల్ని మనం చిన్నతనంలోనే నేర్చుకొంటాము. ప్రపంచంలో అన్ని దేశాలవారు వీటిని 1, 2, 3, 4.........అని వ్రాస్తారు. ఈవిధంగా ధన పూర్ణాంకాల్ని వ్రాయడం భారతదేశం గణిత శాస్త్రానికి ఇచ్చిన విలువైన కానుకల్లో ఒక్కటి. గణిత చరిత్రను పరిశీలిస్తే ఒక్కొక్క కాలంలో ఒక్కొక్క నాగరకత ఒక్కొక్క విధంగా ఈ సంఖ్యల్ని రూపొందించిందని తెలుస్తుంది.

ఈజిప్టు:	|	||	|||	||||	||| ||	||| |||	|||| |||	|||| ||||	||| ||| |||	∩	∩|	∩||	∩|||	∩||||	∩||| ||	∩||| |||
మయన్లు	•	••	•••	••••	—	• —	•• —	••• —	•••• —	— —	• — —	•• — —	••• — —	•••• — —	— — —	• — — —
గ్రీకులు	A	B	Γ	Δ	E	F	Z	H	Θ	I	IA	IB	IΓ	IΔ	IE	IF
రోమన్లు	I	II	III	IV	V	VI	VII	VIII	IX	X	XI	XII	XIII	XIV	XV	XVI
భారతీయులు	0 1	2	3	4	5	6	7	8	9	10	11	12	13	14	15	16
ద్వ్యంకాంశములు	00001	00010	00011	00100	00101	00110	00111	01000	01001	01010	01011	01100	01101	01110	01111	10000

సంఖ్యల్ని సూచించేందుకు ఉపయోగించే సంకేతాలు వేర్వేరైనప్పటికీ ఆ సంకేతాల వెనుక భావం మాత్రం సర్వత్రా ఒక్కటే. ప్రాక్తనమానవుడు తన నిత్యావసరాలకు ఏవో కొన్ని పూర్ణాంకాల్ని మాత్రం వాడేవాడు. నాగరకత పెరిగినకొద్దీ, అవసరాలు అధికమైనాయి. అందువల్ల అంచెలవారీగా మానవుడు క్రొత్త క్రొత్త సంఖ్యాసంచయాల్ని ఆవిష్కరిస్తూ వస్తున్నాడు. ప్రాథమికమైన పూర్ణాంకాల్ని చక్కగా వ్రాయటం అలవరచుకోవటమేగాక గ్రీకులు పూర్ణాంకాల్లో అనుగమన (Induction) భావాన్ని ప్రవేశపెట్టి అనంతరాశి (Infinity) ని వూహించకలిగినారు. ఇది అతిప్రశంసనీయమైన విషయం. ' 'భౌతికమైన ప్రకృతి పరిమితమైనది. విశ్వము పరిమితమైనది.' అనే వేదాంత చింతనల్ని సమూలంగా పడవేసింది ఈ అనంతరాశి భావన. ఈ అనంతరాశి భావన సాహసోపేతమై ఒక వైపు గణిత వికాసానికి దోహదమిస్తూ మరోవైపు విరోధాభాసాల్ని కల్పించింది.

ఈనాడు మనకు అతిసహజంగానూ, సాధారణంగానూ అగుపించే ఋణపూర్ణాంకాలు మొదట ఆమోదయోగ్యాలయ్యేందుకు ఎంతో కాలం పట్టింది. ఒక సందర్భంలో ఉష్ణోగ్రత 0° కంటే 10° తక్కువ అనే భావనను సులభంగా తెలుసుకొంటారు ఈ నాటి బాలురు కూడ. భారతదేశంలో ఈ ఋణ పూర్ణాంకాల్ని చాల శతాబ్దాలక్రితం ఆమోదించారుగాని పాశ్చాత్యులు మాత్రం క్రీ. శ. 1545 లో గిరోలామొ కార్డానొ (Girolamo Cardano) రచించిన Ars Magna వెలువడిన తరువాతనే ఒప్పుకొన్నారు.

గణిత చరిత్ర చిత్రాల్లో ఒకటి; భిన్నాలు లేదా అకరణీయ సంఖ్యలు [ఒక సంఖ్యను లవ, హారములు పూర్ణాంకములుగా ఉండే భిన్నంతో సూచించకలిగితే ఆ సంఖ్యను అకరణీయ సంఖ్య అంటాము. ఉదా॥ $\frac{1}{2}$, $\frac{3}{4}$, 8, 2 లు అకరణీయాలు.

$\sqrt{\frac{2}{3}}, \sqrt{\frac{3}{4}}, \pi, e$ మొదలైనవి అకరణీయాలు.] ఋణ పూర్ణాంకాలకంటే ముందుగా గణిత శాస్త్రంలో ప్రవేశించినాయి. పాశ్చాత్య దేశాలలో కరణీయ సంఖ్యలు ఏలా ప్రవేశించాయో కొంత పరిశీలిద్దాము. క్రీ. పూ. ఆరవ శతాబ్దంలో ఉండిన సుప్రసిద్ధ మేధావంతుడు పైథాగొరస్ పూర్ణాంకాలకు, భిన్నాంకాలకు రెంటికీ సరిపడని కొత్త సంఖ్యను మొట్టమొదట ఎదుర్కొన్నాడు. ఒక యూనిట్ పొడవు, ఒక యూనిట్ వెడల్పు చతురస్రమునకుగల వికర్ణం పొడవు $\sqrt{2}$ అన్న సంఖ్యను, రెండు పూర్ణాంకములు p,q ల ద్వారా p/q అని సూచింపలేమని తెలుసుకొన్న గ్రీకులు చాల తికమక పడ్డారు. సంఖ్యలన్నీ అకరణీయాలుగానే ఉండవలెనని గాఢంగా విశ్వసించిన నాటి గ్రీకులకు $\sqrt{2}$ సంఖ్య దిగ్భ్రాంతిని కలిగించడం సహజమే. ఈ చిక్కును తొలగించేందుకు, సంఖ్యల్ని పొడవుల ద్వారా సూచిస్తే బాగుంటుందని ఆలోచించి గణిత శాస్త్ర పురోభివృద్ధికి నాంది పలికారు.

$\sqrt{2}$ అనే సంఖ్య నిజస్వరూపాన్ని చక్కగా అర్థం చేసుకొనేందుకు గణితశాస్త్రజ్ఞులకు అనేక శతాబ్దాలు పట్టినవి. ఇప్పుడు విద్యున్మస్తిష్కం ద్వారా ఒక బొత్తాము నొక్కి $\sqrt{2} = 1.4142135623$................ఫలితాన్ని త్రుటి కాలంలో తె గలుగుతున్నాము. దశాంశభిన్నాల ద్వారా, ఏ సంఖ్యనైనా, దశాంశచిహ్నానికి ఎడమవైపున పరిమిత పూర్ణాంకాలు కుడివైపున అనంతంగా ధన పూర్ణాంకాలు ఉండేటట్లు సూచించకలిగితే ఆ సంఖ్య వాస్తవ సంఖ్య అవుతుందని మనం ఇప్పుడు తెలుసుకొన్నాము. ఉదాహరణకు

$2 = 2.000000$..............
$10/3 = 3.33333$..............
$-5/2 = -2.500000$..............
$1/7 = 0.142857\ 142857\ 142857$..........
$\sqrt{2} = 1.414213\ 5623$..............
$\pi = 3.1415926535$..............

అన్నీ వాస్తవ సంఖ్యలే. ఇందు చివరి రెండు సంఖ్యల్ని మినహాయిస్తే తక్కిన వాటిల్లో దశాంశ తిలకానికి కుడివైపున ఏర్పడే అంకెల సరళిలో ఒక విశేషం ఉన్నది. ఒకటో, కొన్నో అంకెలు పునరావృత్తము లౌతాయి. ఇట్లాంటి లక్షణంకల వాస్తవ సంఖ్యలు అకరణీయాలు. చివరి రెండు సంఖ్యల్లో ($\sqrt{2}, \pi$) ఈ లక్షణం కన్పడదు. ఎంతదూరం వ్రాసినప్పటికి ఏ అంకె కా అంకె స్వతంత్రంగా ఏర్పడుతోంది. ఒక క్రమం కలిగి పునరావృత్తం కావటం లేదు. ఈలాంటివే కరణీయ సంఖ్యలు.

ఇంతవరకు చర్చించిన సంఖ్యలన్నీ దశాంశములు. అంటే 10 ప్రాతిపదికగా నిర్మింపబడినవి. ప్రాతిపదిక పదే ఎందుకు ఉండవలెనని ప్రశ్నించిన ఫలితంగా మనకు నేటి కంప్యూటర్లలో ఉపయోగపడుతూవుండే ద్వంద్వాంశ (Binary సంఖ్యలు మూడు వందల ఏళ్ళ క్రితమే పుట్టినాయి. మనకు నచ్చిన సంఖ్యను ప్రాతిపదికగా తీసుకొని క్రొత్త క్రొత్త సంఖ్యా సంచయాల్ని సృష్టించవచ్చు.

3. సంకీర్ణ సంఖ్యలు

ఒక ధన సంఖ్యనైనా, ఋణ సంఖ్యనైనా వర్గించితే ధన సంఖ్య ఏర్పడుతుంది. కాబట్టి ధన సంఖ్యకు వర్గమూలం కనుక్కొంటే ఆ వర్గమూలం ధన సంఖ్యగానో, ఋణ సంఖ్యగానో ఉండవలె. అయితే ఋణసంఖ్యకు వర్గమూలం ఏలా ఉంటుంది? ఈ ప్రశ్నకు సమాధానంగా, కల్పిత (Imaginary) సంఖ్యలుత్పన్నమైనాయి. $\sqrt{-1}$ ఒక కల్పిత సంఖ్య. ఈ సంఖ్యను ఏలా నిర్వచించవలె? ఏసంఖ్యను వర్గించితే ఫలితము -1 అవుతుందో ఆ సంఖ్యను $\sqrt{-1}$ అందాము. పైన పేర్కొన్నట్లు ఈ సంఖ్య ధనము కాదు, ఋణమూకాదు. అందువల్లే దీన్ని కల్పిత సంఖ్య అన్నారు. క్రీ. శ. 1702 లో జర్మనీదేశంలో ఉండిన గణిత

శాస్త్రజ్ఞుడు, తాత్త్వికుడు అయిన లైబ్నిట్జ్ ఈ సంఖ్యల్ని గురించి వ్రాస్తూ "అద్భుతములైన, కల్పిత సంఖ్యలు భగవంతుని సృష్టి. 'అస్తి', 'నాస్తి'కి నడుమ ఉన్న ఒకానొక దశను ఈ సంఖ్యలు సూచిస్తాయి" అన్నాడు.

నికాసయుగంనుండి ఈ క్రొత్త సంఖ్యల్ని $a+b\sqrt{-1}$, (a, b లు వాస్తవ సంఖ్యలు) అని వ్రాయటం అలవాటు చేసుకొని గణిత శాస్త్రజ్ఞులు ఎన్నో సమస్యల్ని సాధించినారు. క్రొత్త సిద్ధాంతాల్ని కూడా కనుక్కొన్నారు. $(\cos x+i\sin x)^n=(\cos nx+i\sin nx)$, $i=\sqrt{-1}$ అనే సుప్రసిద్ధమైన డిమాయ్‌వర్ సిద్ధాంతాన్ని ఉదాహరించవచ్చు. $e^{\pi i}=-1$ అనే సూత్రాన్ని లియోనార్డ్ ఆయిలర్ (క్రీ. శ. 1707—1793) కనుక్కొన్నాడు. అయినప్పటికీ 19 వ శతాబ్దం వరకు ఈ సంకీర్ణ సంఖ్యల్ని గురించి గణితజ్ఞులు పూర్తిగా తెలుసుకోలేదు. కాస్పర్ వెసల్ (Caspar Wessel) అనే నార్వే దేశస్థుడు ఈ సంఖ్యల్ని జ్యామితీయంగా గుర్తించవచ్చునని చూపిన తరువాతనే సంకీర్ణ విశ్లేషణ మనే కొత్త గణితశాఖ అవిర్భవించింది. తరువాత ఐర్లండు దేశస్థుడు విలియం రోవాన్ హేమిల్టన్ (క్రీ.శ. 1788—1856) ఈ సంఖ్యలకు సంబంధించిన కొన్ని నిర్వచనాల్ని ఏర్పరచినాడు. వీనికి బీజగణితీయ రూపాన్ని కల్పించినాడు. రెండు సాధారణ వాస్తవ సంఖ్యల క్రమ యుగ్మమే ఒక సంకీర్ణ సంఖ్య అనే వివరణ నుంచే బీజ గణితానికి నేడు అలవడిఉన్న లాఘవత్వం, లాక్షణికత, తార్కిక సంపద చేకూరింది.

దాదాపు అప్పుడే ఈ సంకీర్ణ సంఖ్యలకు భౌతికశాస్త్రంలో ఉపయోగం కనబడ్డది. విద్యుత్‌శాస్త్రము, ద్రవగతిశాస్త్రము, వాయువేగశాస్త్రము మొదలైన పెక్కు భౌతిక శాస్త్ర విభాగాల్లో, ఇంజనీరింగ్ శాస్త్ర విభాగాల్లోనూ దీని ప్రాముఖ్యం పెరిగింది.

పంతొమ్మిదవ శతాబ్దంలో గణిత శాస్త్రజ్ఞులు మరికొన్ని కొత్త సంఖ్యా సంచయాల్ని ప్రవేశ పెట్టినారు. వీటిలో మూడింటిని గురించి స్థూలంగా చర్చిస్తాము. అవి

1) క్వాటర్నియన్లు (Quaternions)
2) మాత్రికలు (Matrices)
3) అత్యనంతసంఖ్యలు (Transfinite Numbers)

4. క్వాటర్నియన్లు

హేమిల్టన్ పరిశోధనల్లో ముఖ్యంగా పేర్కొనవలసినవి క్వాటర్నియన్లు. రెండు సంకీర్ణ సంఖ్యల గుణన లబ్ధాన్ని జ్యామితీయంగా వివరిస్తూ, అవి ఏర్పరచే సమతలాన్ని నియమితకోణం ద్వారా పరిభ్రమింపచేస్తే వచ్చే ఫలితంలో సమానింపవచ్చునుగదా! అట్లాగే ఈ పరిశీలనను వ్యాపకీకృతం చేస్తే: ఒక త్రిపరిమాణాత్మక అవకాశాన్ని పరిభ్రమింపచేస్తే పర్యవసానము రెండు కొత్త సంఖ్యల లబ్ధంగా పరిణమించవలె. ఈలాంటి క్రొత్త సంఖ్యలు ఉన్నాయా? అనే ప్రశ్న చాలకాలం హేమిల్టన్‌ను వేధించింది. అట్లాంటి సంఖ్యల్ని హేమిల్టన్ త్ర్యంశము (Triplet) అన్నాడు. మామూలు సంకీర్ణ సంఖ్యల్ని వెస్సెల్, అర్గ్యాండ్ ప్రభృతులు సమతల అవకాశంలో జ్యామితీయ బిందువుల ద్వారా సూచించినట్లు త్ర్యంశాల్ని త్రిపరిమాణావకాశంలో బిందువుల ద్వారా సూచించవచ్చు. తన కుటుంబంలోని వారి కందరికి జాలి, విసుగు, కలిగేటంతటి విచారవంతుడైనాడు హేమిల్టన్ త్ర్యంశములకు గణిత ప్రక్రియల్ని అనుసంధానించడంలో. సంకలన, వ్యవకలనాలు సహజంగా నిర్వహింపవచ్చు, కాని గుణన ప్రక్రియను నిర్వచించడం అంత సులభంగా స్ఫురించలేదు హేమిల్టన్‌కు.

క్రీ. శ. 1843 లో, ఒకనాటి సాయం సమయం తదేక ధ్యాన తత్పరుడై సతీమణితో కలసి వాహ్యాళికి పోతుంటే హేమిల్టన్‌కు ఈ సంఖ్యల్ని క్రింద సూచించినట్లు గుణింపవచ్చునని స్ఫురించింది. దరిదాపుల్లో వంతెన ఉంటే వెంటనే దాని గోడలమీద

$i^2=j^2=k^2=ijk=-1$ అని వ్రాశాడు. ఎంతో ఆనందంలో ఇంటికి వచ్చి తనసృష్టియైన క్వాటర్నియన్లక ప్రాణంపోశాడు i, j, k లు అతిసంకీర్ణ (Hyper Complex) సంఖ్యలు, తద్ద్వారా రచితమైన $a+ib+jc+kd$ (a, b, c, d లు వాస్తవ సంఖ్యలు) లను క్వాటర్నియన్లు అన్నాడు హేమిల్టన్. మామూలు వాస్తవ సంఖ్యలకు, సంకీర్ణ సంఖ్యలకు చెల్లే గుణనస్థిత్యంతరన్యాయము క్వాటర్నియన్లకు చెల్లదు.

5. మాత్రికలు

దాదాపు సమకాలికులైన హేమిల్టన్, బ్రిటీషు గణిత శాస్త్రజ్ఞులు సిల్వెస్టర్ (Sylvester,) కేయిలే (Cayley) ముగ్గురూ కలసి మాత్రికలనే క్రొత్త సంఖ్యా సంచయాన్ని సృష్టించారు. దీర్ఘ చతురస్రాకారంగా అమర్చిన సంఖ్యల పంక్తులు, శ్రేణులు గల రచనను మాత్రిక అందాము. గణిత లాఘవం లాక్షణికత బాగా అభివృద్ధి చెందిన ఈ రోజుల్లో మాత్రికను ఈవిధంగా నిర్వచిస్తే చాలమంది ఈసడించుకొంటారు. "ఇది బజారు నిర్వచనం" అని కొందరు ఆగ్రహిస్తారు. మాత్రికను వెక్టరు అవకాశంలో పరివర్తన (జ్యామితీయం అనుకోవచ్చు.) సూచించే గణిత పరికరంగా నిర్వచిస్తారు. ఈ పరికరంలోని సంఖ్యలు ఏ సంచయం లోనివో స్పష్టంగా చెప్పవలె. ప్రస్తుతానికి మొదటి నిర్వచనం చాలు.

$$\begin{pmatrix}1 & 6 & 7\\ 2 & 3 & 1\end{pmatrix}$$

రెండు పంక్తులు, మూడు శ్రేణులు గల మాత్రిక. దీన్ని 2×3 మాత్రిక అంటాము. కొన్ని అనుకూల పరిస్థితుల్లో మాత్రికల మధ్య సంకలన, వ్యవకలన గుణన భాగ ప్రక్రియల్ని నిర్వచించవచ్చు. అనేక సందర్భాల్లో మామూలు సంఖ్యా సంచ

యానికి మళ్ళీ కనబడే ఈ క్రొత్త సంఖ్యలు నేడు పెక్కు విజ్ఞాన శాఖల్లో ఉపయోగపడుతూ ఉన్నాయి.

6. అత్యనంత సంఖ్యలు

అత్యనంత సంఖ్యలు చాల కొత్తవి, విచిత్రమైనవిన్నీ. వీటిని ఈ శతాబ్దంలోని సుప్రసిద్ధ గణిత మేధావుల్లో ఒకరైన డేవిడ్ హిల్‌బర్ట్ (David Hilbert క్రీ. శ. 1862—1943) ఒక హోటల్‌ను ఊహించుకోమని తద్వారా వివరిస్తాడు. గణితజ్ఞులు సరదాగా ఈ హోటల్‌ను హిల్‌బర్ట్ హోటల్ అంటారు. ఈ హిల్‌బర్ట్ హోటల్ టూరిస్ట్ హోటల్ అనుకొందాము. ఒక టూరిస్టు వచ్చి మేనేజర్‌ని కలుసుకొని బస చేసేందుకు గది కావాలంటాడు. మామూలుగానే మేనేజరు "మాస్టారూ! ఖాళీ గదులు లేవండీ" అంటూనే "అయినా చూద్దాం. ఉండండి" అని 1 వ నంబరు గదిలో ఉండే వ్యక్తిని 2 వ నంబరు గదిలోకి 2 వ నంబరు గదిలో ఉండే వ్యక్తిని 3 వ నంబరు గదిలోకి......... ఈలాగే n— వ గదిలో ఉండే వ్యక్తిని (n+1) గదిలోకి మారమని సర్దుకోమంటాడు. ఈ విధంగా 1 వ నంబరు గది ఖాళీ ఏర్పడగా వచ్చిన టూరిస్టుకు బస దొరుకుతుంది. ఈలాగా ఎంత మంది టూరిస్టులు వచ్చినా హిల్‌బర్ట్ హోటల్లో గదులకు కొరత ఉండదు. ఎందుకు? హోటల్లో గదులు అనంత సంఖ్యాకంగా ఉన్నాయి.

గెలిలియో (క్రీ. శ. 1564—1642) ఈ విరోధాభాసాన్ని చర్చించినాడు. ప్రతిపూర్ణాంకానికి వర్గం ఉంది. అందువల్ల ఎన్ని పూర్ణాంకాలుంటే అన్ని వర్గ సంఖ్యలుండవలె. కానీ పూర్ణాంకాలన్నీ వర్గ సంఖ్యలు కావు. ఇది విరోధాభాసము. ఎందుకంటే 3, 5, 7.........లాంటి పూర్ణాంకాలు వర్గ సంఖ్యలు కావే! గణితశాస్త్రంలో చింతలలో, విరోధాభాసాలనుండి అద్భుతమైన గణిత సత్యాలు క్రొత్త క్రొత్త గణిత ప్రపంచాలు రేపడం ఒకటి. ఇప్పుడు వర్ణించిన విరోధాభాసం నుండి జార్జి కాన్టర్ (Georg Canter 1845—1918) క్రొత్త సంఖ్యా సంచయాన్ని సృష్టించినాడు. అదే అనంతరాశుల అంకగణితము.

జార్జి కాన్టర్ మొట్టమొదట అనంత సమితిని నిర్వచించినాడు. ఒక సమితిలోని మూలకములు, దాని శుద్ధోపసమితిలోని మూలకాలతో అన్యోన్య అనురూపత (1—1 Correspondence) కలిగిఉంటే ఆ సమితిని అనంతసమితి అన్నాడు కాన్టర్. పూర్ణాంక సమితి, దానికి ఉపసమితియైన వర్గసంఖ్యల సమితిలో అన్యోన్య అనురూపత కలిగిఉంది కాబట్టి పూర్ణాంక సమితి అనంత అనంత సమితి. ఇట్లాంటి ఒక అనంతసమితిలోని మూలకాల సంఖ్య N_0 (అలెఫ్‌నాట్ అని చదువవలెను.) అన్నాడు కాన్టర్. N_0 అత్యనంత సంఖ్యాసంచయంలో మొదటిది. వాస్తవ సంఖ్యా సమితిలోని సంఖ్యలకు ధన పూర్ణాంక సమితిలోని సంఖ్యలకు అన్యోన్యానురూపతలేదని నిరూపించి, తద్ద్వారా వాస్తవ సంఖ్యా సమితిలో ధనపూర్ణాంక సమితికంటే అనంతంగా మూలకాలున్నాయని ధ్రువపరచి, వాస్తవ సంఖ్యలు N_1 అలెఫ్ ఒన్ ఉన్నాయి అన్నాడు కాన్టర్. ఇట్లాగ క్రొత్త సంఖ్యల్ని సృష్టించి ఇదివరకు ఉన్న సంఖ్యలకు ఈ సంఖ్యలకు మధ్య చెల్లే సూత్రాలను ప్రక్రియలను నిర్వచించినాడు. ఈ సంఖ్యాసంచయంలో మనకు విభ్రాంతిని కలిగించే ఫలితాలు కొన్ని ఉన్నాయి.

$$N_0 + 1 = N_0 \;,\; N_0 - 1 = N_0 \;,\; N_0 + N_0 = N_0$$

7. ఉపసంహారము

ఈ అత్యనంతసంఖ్యలకు భౌతిక శాస్త్రాల్లో ఇంకా ప్రయోజనం కనబడలేదు. కాని గణితచర్చలలో, తద్ద్వారా వేదాంత భావనలలో ఎంతో పరివర్తన తెచ్చినవి ఈ కొత్త సంఖ్యలు. ఈ సంఖ్యల్ని తలచుకొన్నప్పుడు మన బృహదారణ్యకోపనిషత్ వాక్యము

> ఓమ్ పూర్ణమదః పూర్ణమిదం పూర్ణా త్పూర్ణముదచ్యతే"
> పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే"

జ్ఞాపకాని కొస్తుంది.

గణిత తత్త్వంలో ప్రముఖపాత్రను వహిస్తున్న అవిచ్ఛిన్న తత్త్వ స్వీకృతము (Continuum Hypothesis) కూడా కాన్టర్ కల్పనయే. ఈ స్వీకృతం అత్యనంత సంఖ్యా సంబంధము. ఒక సమితిలోని మూలసంఖ్య N_0 అయితే ఆ సమితిని గణనసమితి (Denumerable set) అందాము. ఒక గణన సమితి నుండి మనం అన్ని ఉపసమితుల్ని ఏర్పరచి, ఈ ఉపసమితులే మూలకాలుగా ఉండే ఇంకోసమితిని కల్పిస్తే, ఈ సమితిలోని మూలకాలు N_1 ఉంటాయి. ఈ సమితి గణన సమితి కాదు. అందువల్ల దీనిని అగణన (Non-denumerable) సమితి అని పేర్కొంటాము. N_0 కంటే పెద్దదై, N_1 కంటే చిన్నదైన అత్యనంత సంఖ్య ఉన్నదా? ఈ ప్రశ్నకు సమాధానంగ అట్లాంటి సంఖ్య లేదు అని తీసుకోవడమే అవిచ్ఛిన్నతత్త్వస్వీకృతము. ఈ స్వీకృత్యాన్ని ప్రతి సమితికి అన్వయింప చేసేందుకు వ్యాపకీకృత అవిచ్ఛిన్నతత్త్వస్వీకృతము (Genaralised Continuum Hypothesis) ఏర్పడింది.

గోడెల్ (Godel), పాల్‌కొహెన్ (Paul Cohen), ఆల్‌ఫ్రెడ్ టార్‌స్కీ (Alfred Tarski), రౌబాట్టమ్ (Rowbottom) ప్రభృతులు ఈ సంఖ్యల్ని గురించి ఇంకా కొత్త కొత్త సత్యాలు బయల్పరుస్తున్నారు.—

"కథా సాహిత్యంలో న్యూవేవ్"

శ్రీ కొడవంటి లీలామోహనరావు

కాలం గడుస్తున్న కొద్దీ రాజకీయాలు మారుతుంటాయి. సాంఘిక మర్యాదలు మారుతుంటాయి. శాస్త్ర విజ్ఞానం పెరుగుతుంది. ఇంతవరకూ నమ్మిన సిద్ధాంతం కాదని క్రొత్త సిద్ధాంతం పుడుతుంది. సాంఘిక జీవనం సాహిత్యంపై ప్రభావం కలిగి ఉంటుందన్నది నిర్వివాదాంశం. అందుచేత సాంఘికమైన మార్పులతో పాటు సాహిత్యపువిలువలు కూడా మారిపోతాయి. నూతన భావావిష్కరణానికి అదే నాంది. ఒక క్రొత్త భావము పుట్టినపుడల్లా అందులో నాటకాలు, గేయాలు, కథలు, వ్యాసాలూ అన్నీ భాగం పంచుకుంటాయి.

ఇటీవల కథాసాహిత్యంలో ఒక క్రొత్త పంథా చోటుచేసుకుంది. అదే న్యూ వేవ్. అదే మానవతావాదం. ఈ కథలలో రెండు జడల సీత వెంటపడుతూ సుబ్బారావు ప్రేమించేయడం ఉండదు. టైపిస్టు అమ్మాయితో ఆఫీసరుగారు సరసాలాడడం ఉండదు. సెక్సును రెచ్చగొట్టి యువతరాన్ని జీవితసమస్యలకు పెడత్రోవను తీసుకు పోవడం ఈ రచయితలకు నచ్చదు. యువకులలో రోజురోజుకూ బలపడుతున్న (easy going) మనస్తత్వం వీరిని బాధించింది. యువతరంలో వ్యక్తిత్వాన్ని నిర్మించి జీవితసమస్యలను ఎత్తిచూపి, వాటిని ఎదుర్కొనే ధైర్యాన్ని, స్థైర్యాన్ని, ఆ సమస్యలు ఉత్పన్నమవడానికి గల కారణాలను గ్రహించే జ్ఞానాన్ని కలగజేయడం వారి లక్ష్యం. సోషలిస్టు సమాజ స్థాపన ప్రభుత్వం యొక్క ధ్యేయంగా పెట్టుకున్న మనదేశంలో సనాతన ధర్మాలను, కుల వ్యవస్థను, ధనిక స్వామిక వ్యవస్థను బలపరచే రచనలు చేయడం వీ రంగీకరించరు. వాటిపై మానసికమైన తిరుగుబాటుకు పాఠకులను సిద్ధం చేయడం వారి పని.

ఇంతకు ముందు అప్పుడప్పుడు ఈ జాతి కథలు వచ్చాయి. కాని ఒక యజ్ఞంలాగా, ఒక (crusade) లాగా, ఒక మహాకెరటం వచ్చినట్లుగా ఈ మాదిరి రచనలు సాగడం ఇదే మొదలు.

కథారచనకు కావలసిన ప్రేరణ జీవితంలో నుంచే రావాలి. న్యూవేవ్ రచయితలకు జీవితంలో ఎన్నో సమస్యలు కన్పించాయి. ఎందరో అనాథలు, దగాపడిన తమ్ములు కన్పించారు. ఎంతో బాధ కన్పించింది. ఇదంతా కథా సాహిత్యంలో కన్పడదేం? కథకులు సమాజానికి దూరంగా వెళ్లిపోతున్నారా? లేక దూరం పట్టేస్తున్నారా? కుటుంబరావుగారు అన్నారు: "అధిక సంఖ్యాకులైన ప్రజల జీవితాన్ని శాసించే సాంఘిక శక్తుల ప్రభావాలనుఅర్థం చేసుకొని చిత్రిస్తూ రాయడం సక్రమమైనపని." న్యూవేవ్ రచయితలు ఆ బాధ్యతను తీసుకున్నారు. ఈ రచయితలకు మనిషి ముఖ్యం. అతని జీవితం ముఖ్యం. మగవాడు ఆడదాన్ని చేసే శారీరక, మానసిక దోపిడీని చలంగారు బట్టబయలు చేసినట్టుగానే, వీరు సంఘంలోని సామాన్యుని ఆరాటానికి అద్దం పట్టుతున్నారు.

సాహిత్యంలో కాలానుగుణంగా క్రొత్తపంథా వస్తూ ఉంటుంది. రానివ్వండి. ఇప్పటి క్రొత్త పంథా రేపటికి పాతదవుతుంది. దానిని నిరోధించడానికి మనం ప్రయత్నిస్తే రేపటి పౌరులు మన పిరికితనానికి, సంకుచితత్వానికి నవ్వుకోగలరు. అయితే ఈ క్రొత్త దృక్పథంతో వ్రాసిన కథలు జీవితంలోని వాస్తవాన్ని ఎంతమేరకు ప్రతిబింబించగలుగుతున్నాయి అన్నది మనం గమనించాలి. ఆ దృష్టితోనే మనం ఈ న్యూవేవ్ రచయితల రచనలను పరిశీలించాలి.

జీవితంలో స్వార్థం, దురాశ ఎంత ప్రమాణంలో ఉంటాయో అంత ప్రమాణంలోనూ తిరుగుబాటు ధోరణి ఉంటుందనేది వి. రాజారామమోహనరావుగారి 'వరద' కథలోని భావం. ఏటికి వరదవచ్చి కట్ట తెగిపోతుంది. ఊళ్లో ఉన్న కొద్దిపాటి పాకలు జలమయమౌతాయి. ఊళ్లో రెండే పెంకుటిళ్ళు ఎత్తుగా దిబ్బపైన ఉంటాయి. అందులో నరసింహం ఇంటివద్ద ఆ ఊరి జనానికి ఆశ్రయం దొరుకుతుంది. కాని పిల్లలకు, పెద్దలకు రెండు రోజులబట్టి తిండిలేక గిలగిల్లాడిపోతున్నారు. రెండవ ఇల్లు రంగయ్యది. అతను వ్యాపారి. బియ్యం బస్తాలు మూలుగుతున్నాయి. సమయం వచ్చినప్పుడే డబ్బు చేసుకోవాలనుకునే రకం. అసలు ధరకు మూడింతలిస్తామన్నా చాలదన్నాడు. దానితో యువకులందరూ వరదలాగా అతని ఇంటిపైకి వచ్చి దౌర్జన్యంగా వారికి కావలసిన రెండు బస్తాలు తీసుకుపోతారు. ఈ కథలో వరద భీభత్సం చాలా చక్కగా రచయిత చిత్రించాడు. ముగింపు మాత్రం అసహజంగా ఉంది.

మతకలహాలు ఎంత భయంకరంగానూ, క్రూరంగానూ ఉంటాయో యం.పినాకి గారి 'ఎర్రదీపం' కథలో తెలుస్తుంది. మానభంగాలు, హత్యలు, గృహదహనాలు మతకలహాలు చెలరేగినప్పుడు జరిగే సామాన్యమైన విషయాలు. అందులో ఒకరికొకరు తీసిపోరు.

మతంలో అంతటి నిష్ఠ ఉందా? అదిఅంతటి పగ కోరుతుందా? ఆ సమయంలో పూర్వపు మిత్రులు బద్ధశత్రువులౌతారు. ఆ సమయంలో వాతావరణం ఎంత భీతావహంగా ఉంటుందో ఈ కథలో చక్కగా చిత్రించబడింది.

ఎక్కడైతే బాధ అవధులను మించి ఉంటుందో అదే తిరుగుబాటుకు స్థానమౌతుంది. తోటి మానవుడు దరిద్రుడైనా సరే మనిషిలాగ చూడండి. చేతనైన సహాయం చేయడానికి ప్రయత్నించండి. బాధ తెగసాగితే అతనికే ఓర్పు నశిస్తుంది. ఈ విషయం ఎస్. ఎస్. ప్రకాశరావుగారి 'పేపర్ టైగర్' కథలో వెల్లడవుతుంది. ప్లీడరీ వృత్తిలో శ్రీమంతుల అండ నిలిచి బాగా డబ్బు గడించి ప్రస్తుతం విశ్రాంతి జీవితం గడుపుతున్నారు నరసింహంగారు. ఎక్కడైనా తన పలుకుబడితో ఒక ఉద్యోగం ఇప్పించవలసిందని వరప్రసాదరావనే కుర్రవాడు వస్తాడు. వర్షంపడుతుండడం చేతనూ ఆ కుర్రవాడు తన చిన్ననాటి స్నేహితుని మనవడవ్వడం చేతనూ నరసింహంగారు అతన్ని ఇంట్లో కూర్చోబెడతాడు. తన గొప్పతనం గూర్చి, తన పిల్లల గొప్పతనం గూర్చి ఎంతసేపూ వాగుతాడే కాని ఆ కుర్రవాని ఉద్యోగం గూర్చిమాత్రం కమిట్ కాడు. ఇంతలో వర్షంలో పూర్తిగా తడిసిపోయి ఒక ముసలాడు, ఒక పడుచుపిల్లా వచ్చి తలుపు కొట్టారు. ముసలాడు జ్వరంతో ఉన్నాడు, వర్షం తగ్గేవరకు లోపల కూర్చుంటాం అని బ్రతిమాలుకుం దా మనిషి. నరసింహంగారు కసురుకుని తలుపు వేసేసుకున్నారు. పేదవారి మీద, వారి దౌర్భాగ్యం మీద తనకున్న జుగుప్సనంతా వెళ్లగక్కుతూ ఆయన కుర్రవాడితో మాట్లాడసాగాడు. వర్షం జోరు ఎక్కువయింది. దానికి గాలి తోడయింది. మళ్ళీ తలుపు బాదారెవరో. నరసింహంగారికి చిర్రెత్తుకొచ్చింది. కోపంతో తలుపు తీసేసరికి 'సర్' మని గాలివానతోపాటు ఆ పడుచుపిల్ల ముసలతని చెయ్యి పట్టుకొని లోపలికి వచ్చి ఒక మూల కూచుంది. నరసింహంగారు వాళ్లని పొమ్మని, పోలీసులను పిలుస్తాననీ కోపంతో అరుస్తారు. ఆమె మాట్లాడదు. ఆయన పోలీసులను పిలుస్తానని ఫోను దగ్గరకు వెళ్తాడు. వర్షం తగ్గితేగాని తాను వెళ్లననీ, ముసలాడికి జ్వరం కాబట్టి తాను లోపల కూచుంటానన్నదికాని అంతకంటే ఎక్కువ కోరలేదనీ, కావాలంటే పోలీసోళ్లనో, మిలిటరోళ్లనో పిలిపించుకోమని ఆమె నిష్కర్షగా చెప్పేసింది. నరసింహంగారు చేసేది లేక ఫోను దించేసారు. వెధవలకి చెప్తే అర్థంకాదని గొణుక్కున్నారు.

జీవితంలోని అశాంతి ఇస్మాయిల్ గారి 'సిగరెట్' లోని కథా వస్తువు. అతని భార్య రెండవకాన్పప్పుడు పోయింది— నెల క్రిందట. అప్పటినుండి అతనికి నిద్రలేదు. అతనికి పదహారేళ్ల కూతురు రాణి ఉంది. ఆమె డేవిడ్‌ను పెళ్లి చేసుకుందామనుకుంది కాని అతను మరెవర్తినో మూడ్రోజుల క్రిందట లేవదీసుకుపోయాడు. అప్పటినుండి ఆమెకు నిద్రలేదు. తండ్రికి, కూతురుకు ఒంటరితనం బాధిస్తోంది. ఒంటరితనం జీవితంలో ఒక బరువు. అది జీవితాన్ని శూన్యంగా చేస్తుంది. ఒంటరితనం ఎడారిలాంటిది. ఆ ఎడారిలో ఒయాసిస్సును చూసుకుంటేనే తప్ప జీవించడంలో అర్థంలేదు. అతను తన భార్యను మరచిపోలేడు. అతనికూతురు డేవిడ్‌ను మరచిపోలేదు. పాత జ్ఞాపకాలు అతనికి విసుగూ, చికాకూ కలిగిస్తున్నాయి. ఈ అస్తిత్వం ముల్లులాగ గుచ్చుకుంటోంది. అతనింక గదిలో ఉండలేక బయటికివెళ్లాడు— ఒయాసిస్సును వెదుక్కుంటూ. వెళ్లేముందు ప్రక్కగదిలో చూసాడు. రాణి సిగరెట్ కాలుస్తోంది. ఒంటరిగా. కథ అంతా చైతన్యస్రవంతి బాణీలో నడిచింది.

ఈ నాగరికప్రపంచంలో అధునాతనంగా ఉన్న ఒక బోర్డింగు మరియు లాడ్జింగు హోటలులో ఒకనాటిరాత్రి. అదే చివరిరాత్రిగా గడిపిన ఒక పడుపుకత్తె అనుభవం డి. వెంకట్రామయ్యగారు వ్రాసిన 'మనుష్యుల్ని తినేవాళ్ళ' కథావస్తువు. ఆడదాని కోసం, బుడ్డి కోసం మదించిఉన్నవాళ్లు ఆ హోటల్లో దిగుతారు. ఒకరు అన్యాయార్జితంతో మదించిపోయి, తమ విలాసం కోసం నాలుగు డబ్బులు ఖర్చుపెడితే, అవే నాలుగు డబ్బులకోసం వస్తున్న శరీరాన్ని బాధగా తమ అధీనం చేస్తారు మరొకరు. ఒకగదిలో అంతవరకూ పేకాడుతున్న ముగ్గురు దున్నపోతుల్లాంటి వ్యాపారులు పిల్లకావాలన్నారు. పని కుర్రవాడు రంగడు ఆ హోటల్లో ఒక మూలనున్న గదిలోకివెళ్లి చూసాడు. వరహాలు ఒక్కర్తే ఉంది. ఆమెకు వయస్సు ముదిరింది. పస్తులతో ఒళ్లు ఉడిగింది. బిడ్డలను పెంచవలసి ఉంది. దున్నపోతుల్లాంటి ఆ ముగ్గురుకీ ఈ బక్కచిక్కిన దాన్నివశం చెయ్యడానికి రంగడు సందేహించాడు. కాని బిడ్డలను పోషించాలి, వారంనుండి దమ్మిడీ లేదు. రెండ్రోజులనుండి తిండిలేదు అని వరహాలు బ్రతిమాలుకుంది. తన బిడ్డల కోసం సిద్ధమేనంది. రంగడు జాలిపడి ఆమెను పన్నెండోనంబరు గదిలోం పంపాడు. క్రిందకు వచ్చి తిండితింటూ వరహాలు కోసం కొంత అన్నందాచి పెట్టాడు. ఆమెకోసం ఎదురుచూస్తూ నిద్రపోయాడు. ఉదయం లేచి చూస్తే ఇంకెక్కడి వరహాలు?

అడవిలో ఒకమారుమూల గ్రామంలో పంచాయతి ఎలక్షను జరిపించడానికి వెళ్లిన నిర్వాహకుల అవస్థలు తాడిగిరి పోతరాజు గారి 'ఎర్రబుట్ట' లోని కథావస్తువు. ఈ ప్రజాస్వామ్యం పోలీసురాజ్యం అని రచయిత ఉద్దేశం. రాజులూ, జమీందారులూ పోయినా, వారే ప్రజానాయకులుగా తిరిగి వర్ధిల్లుతున్నారు. వీళ్ళంతా పోలీసుల ఎర్రబుట్టను చూపి రాజ్యాలేలుతున్నారు. అంటాడు రచయిత. టాపులేని లారీలో ఎన్నికల నిర్వాహకులంతా మండుటెండలో బయలుదేరుతారు. ఎలక్షను ఆఫీసరు. అంతవరకూ ఉపాధ్యాయుడు. ఈ రెండు రోజులకూ ఆఫీసరు. మిగిలిన పోలింగ్ ఆఫీసర్లు చిన్న ఉపాధ్యాయులు. దేశంలో ఇటువంటి పనులకు ఉపాధ్యాయులే పనికివస్తారు. వారితోపాటు గోనె సంచిలో ఎలక్షన్ సామగ్రి. రక్షణకు పోలీసులు. త్రోవలో వర్షం పడుతుంది. అందరూ తడిసి ముద్దవుతారు. ఎలాగైతేనేం ఊరుచేరతారు. బడిలో బస. డబ్బు ఖర్చుచేసినా తిండి దొరికే మార్గం లేదు. ఒక పోలీసు భోజనపు ఏర్పాటుకు ప్రయత్నిస్తానని మామూలు

డ్రెస్‌లో ఫూర్లోకి వెళ్తాడు. పెద్ద మనుషు లనుకునే వాళ్ళందర్నీ తిండిపెట్టమని బ్రతిమాల్తాడు. కనీసం డబ్బుతీసుకొనైనా పెట్టమంటాడు. కాని వాళ్ళు ఒప్పుకోరు. పోలీసు ఒకటి గమనించాడు. ఈ పెద్దమనుషులందరికీ లైసెన్సు లేకుండా సారాబట్టీలుఉన్నాయి. తిరిగివచ్చి మిగతాపోలీసుల నందర్నీ బయలుదేరదీస్తాడు. ఈసారి యూనిఫారాల్లో వెళ్తారు. వీళ్ళను చూసి బట్టీలనుండి మనుషులు పారిపోసాగారు. కొంతమందిని పట్టుకోగా రాజీ కుదిరింది. ఈ రెండు రోజులూ ఎంక్వైరీ పనిమీద వచ్చిన సిబ్బందికి సుష్టుగా భోజనం పెట్టడానికి ఏర్పాటు కుదిరింది. మామూలు మనిషి సాధించలేని పని ఎర్రబట్ట సాధించింది.

ఎన్ని చదువులు చదివినా ఈ చదువులు కామందులకు కంచుకోటను కట్టేవే కాని అన్యాయాన్ని ఒడ్డగించేవీ, అనవసాన తను తొలగించేవీకావు అనేది సి. ఎస్. రావు గారి 'రాజనీతి' కథ చెబుతుంది. ఆ యేడాది కోతల సమయానికి దాదాపు రెండు వందలమంది కూలీలు రైలు దిగారు. తిన్నగా గ్రామంలోకిపోక స్టేషను దగ్గర చెట్టుక్రింద మకాం పెట్టారు. ఈసారి వాళ్ళక్కు కొండయ్య అనే కుర్రవాడు నాయకుడు. 'ఆళ్ళకి కూలీలు కావలసొస్తే ఆళ్ళే మనకాడకొస్తారు' అంటాడు. ఆ కుర్రాడు కొద్దిగా చదువుకున్నాడు. బలవంతులు బలహీనుల్ని దోచుకుంటున్నారు, ప్రకృతి సంపద వాళ్ళ సొంతం చేసుకొంటున్నారు అని అతని మేష్టారు ఏవేవో చెప్పేవాడు. అప్పటినుండి కొండయ్యకు ఆలోచన పెరిగింది. ఆ స్టేషను దగ్గర దిగిననాడే కొండయ్య ఒక సంగతి తెలుసుకున్నాడు. కూలీలు దొరక్క అక్కడ ఇబ్బంది పడుతున్నారు. రోజుకి నాలుగు రూపాయలు రేటు. ఆ మర్నాడు మూడు గ్రామాల కామందులు నారాయుడు, సూరన్న, వరసయ్య వచ్చి వీళ్ళను పనిలోకి రమ్మంటారు. కూలీ మొదట నిర్ణయించమంటాడు కొండయ్య. మగవాడికి మూడు, ఆడదానికి రెండున్నర ఇస్తామంటారు. ఆడా మగా తేడా లేకుండా అందరికీ నాల్గు రూపాయలివ్మంటాడు కొండయ్య. వాళ్ళు ఒప్పుకోక వెళ్ళిపోతారు. వెళ్ళిపోయి నారాయుడింట్లో చర్చించుకుంటారు. నారాయుడి కొడుకు కృష్ణమూర్తి బాగా చదువుకున్నాడు. అతను ఈ పరిస్థితి చక్కబెడతానని బయలుదేరుతాడు. కొండయ్య అడిగినట్లు కూలి ఇస్తానంటాడు కృష్ణమూర్తి. కూలీలందరూ సంతోషించి పనిలోకి వస్తారు. మూడుగ్రామాలలోనూ కోతలు పూర్తవుతాయి. ఆ పదిహేనురోజులూ రెండు కిరాణాదుకాణాల్లో వారికి కావలసిన సామాన్లు రోజూ వాడుకునేవారు. ఆఖరున కృష్ణమూర్తి వారి కూలీ వారికిచ్చివేస్తాడు. కిరాణాఖర్చు చెల్లిద్దామని షావుకార్ల పద్దుచూస్తాడు కొండయ్య. అతనికళ్ళు బైర్లు కమ్ముతాయి. ప్రతియేడుకన్నా ఈసారి చాలా పెద్ద మొత్తమయింది. అడిగితే ధరలు పెరిగిపోయాయిఅన్నారు షావుకార్లు. కొండయ్య ఆ సొమ్ము చెల్లించి మిగిలినది అందరికీ పంచుతాడు. గతయేడాదికన్నా ఈసారి అందరికీ తక్కువవస్తుంది. కొండయ్య కృంగిపోతాడు. షావుకార్లు తాము ఎక్కువ వసూలు చేసిన తేడాను కృష్ణమూర్తికి ఇచ్చివేస్తారు. అది పదిహేను వందలు. ఆ సొమ్మును కృష్ణమూర్తి కామందులు ముగ్గురికీ ఇచ్చివేస్తాడు. చదువుకున్న కృష్ణమూర్తి షావుకార్లతో లాలూచీ అయి కూలీలను మోసగిస్తాడు.

మన ప్రజాస్వామ్యంలో ధనవంతులు సుఖపడడానికే అవకాశముంది కాని, పేదలు బ్రతకడానికి అవకాశం లేదు అనేది మరువాడ రాజేశ్వరరావుగారి 'గోడ' కథలోని భావం. ఒక ధనవంతుని మేడ చుట్టూ ఎత్తుగా గోడ ఉంది. గోడ అవతల మురికిపేట ఉంది. ఆ పేటలోని గుడిసెలో ఒక ముసలమ్మ ఒంటరిగా ఉంది. మరి యే పని చేయడానికీ శక్తిలేక ఆ గోడపై పిడకలు పెట్టుకొని అవమ్ముకొని రోజులు నెట్టుకొస్తోంది. ఎన్నికలు వచ్చాయి. గోడ నిండా పోస్టర్లు అంటించేసారు. ఆకలిబాధ తెలిసిన ముసలమ్మ పిడకలు పెట్టుకోపోతే కడుపు నింపుకునే మార్గంలేదు. ఆ పోస్టర్లమీద పిడకలు పెట్టింది. అంతలో పార్టీ వర్కర్లనబడే రవుడీలు వచ్చారు. ముసలమ్మ అడ్డుపడితే వెనక్కి తోసేసి, ఆపేడ ముద్దల్ని తీసేసి, తిరిగిపోస్టర్లు అంటించి వెళ్ళిపోయారు. ఎన్నికలు పూర్తయేవరకూ ముసలమ్మకు తిండిలేదు. ఎన్నికలరోజున శక్తిలేక పడున్న ముసలమ్మను వర్కర్లు పోలింగు బూతు దగ్గరకు తీసుకుపోయారు. కాని ముసలమ్మ వోటు వెయ్యక తిరిగి వచ్చింది. రేపటి నుండి పిడకలు పెట్టుకోవచ్చుకదా అని సంతోషంగా గోడదగ్గరకు వచ్చింది. చూస్తే ఏముంది. ఒక రేడియో కంపెనీ వారు ఆ గోడని అద్దెకు తీసుకుని దానిపై ఎడ్వర్టయిజమెంటు వ్రాస్తున్నారు. ముసలమ్మ వోపికలేక కూలబడిపోయింది.

దైవభక్తి కొన్ని సందర్భాల్లో ఎంత మూర్ఖంగానూ, గుడ్డిగానూ ఉంటుందో, దానివల్ల ఎంతమందికి అన్యాయం జరిగిపోతుందో 'దేవుడు' కథలో మల్లంపల్లి కృష్ణారావుగారు తెలియజేస్తారు. బాబాయిగారు పెద్ద భక్తుడుగాను, వేదాంతిగానూ ప్రసిద్ధి. ప్రతి శనివారం వారింట్లో భజనలు జరుగుతాయి. ఆ రోజు అతని మేనల్లుడు రాఘవకు దేవుడు పూనుతుంటాడు. రాఘవకు తెలివితేటల్లేవు. చదువు అబ్బే అంటలేదు. అతని ఆస్తిని అతని మామయ్యే దక్కించుకుని అతన్ని తనింట్లో ఉంచుకుంటాడు. అతనికి చిన్నప్పటినుండి భక్తి లావు. అతన్ని వివేకానందుడంతటి వాణ్ణి చేస్తానంటుంటాడు బాబాయి. రాఘవకు మొదట జ్వరం వస్తే దేవుడు పూనాడంటాడు బాబాయి. రాఘవ అమాయకుడు. నిజమేననుకుంటాడు. అదొక జబ్బు, దేవుడుపూనడంలేదు, ఏమీలేదూ అని రచయిత చెప్పేసరికి రాఘవ కళ్ళు తెరుస్తాడు. బాబాయి రాఘవను చదివించలేదు సరికదా, తన కూతుర్ని కూడా అతనికి ఇవ్వనన్నాడు. తన కొడుకుకి మాత్రం పెద్ద చదువులు చదివించుకున్నాడు. దేవాలయం కోసం చందాలు పుచ్చుకొని తన కూతురు పెళ్ళి చేయడానికి సిద్ధపడ్డాడు. రాఘవ తనకు జరిగిన అన్యాయాన్ని తెలుసుకుని ఆత్మహత్య చేసుకుంటాడు.

ప్రజలకు ప్రభుత్వం చేసే సహాయం కాగితాల మీదే ఉంటుంది కాని ప్రజలకు చేరదు అనేది రుద్రాభట్ల నరసింహరావుగారి

'ఉదారులకు ఉద్బోధన'లోని కథావస్తువు. రామచందర్ అనే టి.బి. పేషెంటుకు ఆసుపత్రిలో సీటు దొరకలేదు. పేదవాడు. తిండి తిప్పలూ సరిగాలేవు. సీటు దొరికే నాటికి జబ్బు ముదిరిపోయింది. వైద్యం లాభంలేదని ఆసుపత్రి నుండి పంపించేసారు. టి. బి. పేషెంటుకు ప్రభుత్వ సహాయం ఏమైనా ఉంటుందేమోనని తెలుసుకోడానికి అతను ఆఫీసు చుట్టూ తిరిగాడు. కాని ఎవరూ ఆ సహాయం గూర్చి చెప్పలేక పోయారు. ఆ ఆఫీసులో కామేశ్వరి అనే యువతి ఒక ఆఫీసరు. ఆమె ఇతన్ని చూసి జాలిపడి ఒక లెటరు వ్రాసింది ఇంగ్లీషులో. అది ఇతనికి సహాయం చేయమని ఉదారులకు ఉద్బోదన. రామచందర్ ఆ ఉత్తరాన్ని ఆసుపత్రిలోని తన స్నేహితునికి చూపించాడు. అతను దాన్ని తెలుగులోకి అనువదించి కామేశ్వరి పేర పత్రికకు పంపించాడు. కొన్నాళ్ళ తర్వాత కామేశ్వరి తన పేరుతో పత్రికలో వచ్చిన రచన చూసి ఆశ్చర్య పడింది.

గ్రామాలలో పెద్దమనుషులేం చేసినా పేద ప్రజానీకం మాట్లాడక వూరుకోవలసిందే, ఏదైనా తగువువస్తే పెద్ద మనుషులదే పైచేయి అనేది శ్రీపతి గారి 'తగువు' కథలో వెల్లడవుతుంది. సీతమ్మ చాలా పేదది. మొగుడుపోయి రెండేళ్ళయింది. ఆమెకొడుకు సుబ్బడికి, సూరయ్యగారి కొడుకు రవీందర్‌బాబుకి స్నేహం ఉంది. రవీందర్‌బాబు కోరితే వాళ్ళ తోటలో సుబ్బడు చెట్టెక్కి తేనెపట్టు తీస్తాడు. కొన్నితేనెటీగలు రవీందర్‌బాబును కుట్టాయి. అతను ఏడుస్తూ ఇంటికి వెళ్ళిపోయాడు. సూరయ్యకి కోపం వచ్చి సుబ్బణ్ణి చితగ్గొడతాడు. కొడుకుని చూచి సీతమ్మ గుండెలు బాదుకొంది. ఏడుస్తూ సూరయ్యను తిట్టిపోసింది. ఇప్పుడు సర్పంచ్ ముందర తగువు. సీతమ్మతో, లచ్చుమయ్యకు సంబంధం ఉంది. కాని అతను కూడా పెద్ద మనుషుల్లో కలిసి పోయాడు. రవీందర్‌బాబు రుజువు ఇవ్వలేదు. ఎవ్వరూ సీతమ్మను మాట్లాడనివ్వడంలేదు. ఆ తల్లీకొడుకులమీది నేరాన్ని రుద్దివేయడానికి అందరూ చూస్తున్నారు. దానితో ఆమె నిస్పృహతో వాళ్ళ నందర్నీ తిట్టి మీ ఇష్టమొచ్చింది చేయండని వెళ్ళి పోతుంది. ఆమె ఆ విధంగా పోవడం అవమానంగా తీసుకొని ఆ తల్లీకొడుకులు గ్రామం వదలిపోవాలని పెద్దమనుషులు తీర్మానిస్తారు.

ఉద్యోగుల వలన వారికి కావలసిన పనులను ఏ విధంగా వ్యాపారస్తులుచేయించుకుంటారోనగ్నమునిగారు వ్రాసిన'తిమింగలం'కథలో తెలుస్తుంది. బాబూభాయ్‌పటేల్ అనే బిజినెస్‌మన్ ఒక తిమింగలం. అతనికి ప్రభుత్వ రహస్యాలు కొన్నికావాలి. అవి వెల్లడైపోతే దానివల్ల ప్రభుత్వానికి కొన్నికోట్ల నష్టం. ఆ రహస్యాల కోసం అతను అనుసరించే పద్ధతులు వేరు. నోట్లతో మనుష్యుల్ని కొంటాడు. అలా కొనబడని వాళ్ళ దగ్గరకి అందమైన అమ్మాయిలను పంపుతాడు. సీసాలను పంపుతాడు. రావు ఢిల్లీ సెక్రటేరియట్‌లో పెద్ద ఆఫీసరు. అతను కొన్ని రహస్యపత్రాలతో హైదరాబాదు పనిమీద వస్తాడు. హోటల్ రంభలో దిగుతాడు. అతని వద్దకు బాబూభాయ్‌పటేల్, విమల అనే అమ్మాయిని పంపుతాడు. ఆమె వచ్చిన పని రావు పసిగడతాడు. అతను విమలతో మాట్లాడుతుండగా రావుగారి కొడుకు సుధాకర్ వస్తాడు. కొడుకుని గదిలో ఉంచి రావు, విమల భోజనానికి వెళ్తారు. కాని సుధాకర్ కూడా బాబూభాయ్‌పటేల్‌కు రహస్యాలు అమ్మవలసిన వాడేనన్న సంగతి రావుకు తెలీదు. సుధాకర్ ఆ పత్రాలకు ఫోటోలుతీసి జాగ్రత్త పెట్టుకుంటాడు. వాళ్ళు గదికి తిరిగిరాగానే వెళ్ళిపోతాడు. విమల, రావు చేత త్రాగిస్తుంది. రావు బాత్‌రూములోకి వెళ్ళినప్పుడు ఆమె కూడా ఆ పత్రాలు ఫోటోలు తీసి బాగ్‌లో పెట్టుకుంటుంది. వెళ్ళిపోయేముందు రావును ముద్దుపెట్టుకుంటుంది. ఆ సమయంలో రావు ఆ ఫోటో రీలును బాగ్‌లో నుండి తస్కరిస్తాడు. ఆమె వెళ్ళిపోయిన తరువాత ఆ ఫోటో రీలును కాల్చివేస్తాడు. బాబూభాయ్‌పటేల్ సుధాకర్ దగ్గరకు వెళ్ళి అతనిచ్చిన ఫోటో రీలును తీసుకుంటాడు. ప్రతిఫలంగా అతనికి కొంత సొమ్ము ఇచ్చి, ఆ రాత్రి గడపడానికి విమలను అతని దగ్గర వదిలేసి వెళ్ళిపోతాడు. ఉద్యోగి ఎంత జాగ్రత్త పడినా వ్యాపారిదే పైచేయి అయింది.

స్త్రీ పురుషుల ప్రేమగాథలతో తలమునకలుగా ఉన్న కథా సాహిత్యానికి క్రొత్తత్రోవ చూపిస్తున్నారీ రచయితలు. దోపిడీయొక్క విశ్వరూపాన్ని వెలుగులోకి తీసుకు వస్తున్నారు. వీరు చెప్పదలచుకున్న విషయాన్ని సూటిగానూ, వాడిగనూ చెప్తారు. అందులో డొంకతిరుగుడులేదు. సందిగ్ధ రచనలేదు. వారిమాటలు గురి తప్పవు. గుండెలు దూసుకుపోతాయి. ఆలోచన రగులుస్తాయి.

ఈ రచయితలు ఆశావాదులు. వీరి కథలలోని పాత్రలకు జీవితం అంటే వెగటులేదు. కష్టాలంటే భయంలేదు. శ్రీమంతుల పట్ల దాస్యంలేదు. బాధను అనుభవిస్తారు. అవసరమొస్తే తిరగబడతారు. దేనికైనా వీరికి గుండెబలం ఉంది. మన కథా సాహిత్యంలో ఈ తరహా క్రొత్తది. సాహిత్య దృక్పథంతోనే ఈ రచనలు గమనించండి. నాలుగు కాలాలపాటు నిలవడం నిలవకపోవడం వారింకా చేసే రచనలపై ఆధారపడి ఉంటుంది. వారు చేసే రచనలు ఒకే మాదిరి ముగింపులు, ఒకేమాదిరి భావం కలిగి ఉంటే ఏముఖత కలుగుతుంది. వైవిధ్యం ఉంటే ఆదరణ ఉంటుంది.

Printed and Published by S. Nageswara Rao at the Andhra Patrika Press, 6 & 7, Thumbu Chetty Street, Madras-1. Editor: S. Sambhu Prasad.

శ్రీరస్తు - శ్రీ త్రిపురసుందరీ పరశివాభ్యాం నమః

శ్రీ పరీధావినామ సంవత్సర పూర్ణశాస్త్రీయ (ఆంధ్రపత్రికా) పంచాంగమ్

బ్రహ్మశ్రీ శ్రీమత్పిడపర్తి సుబ్రహ్మణ్యశాస్త్రిణః పుత్రాభ్యాం
చినకృష్ణమూర్తిశాస్త్రి - సుబ్రహ్మణ్యశాస్త్రిభ్యాం ప్రణీతమ్

విఘ్నేశ విధిమార్తాండ చంద్రేంద్రోపేంద్ర వందిత నమో గణపతే తుభ్యం బ్రహ్మణాం బ్రహ్మణస్పతే.
వేదమయీం నాదమయీం పరపదోద్గ్ల బిందుమయీం
మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వవికృతిమయీం.

గమనిక

ఈ సంవత్సరమున రాజు, మంత్రియు గురుడు. సర్వ సస్య వృద్ధి దాయకుడగు ౧౬ వీసములలో ౧౧ వీసములు పంట పలించును. శ్రీకృష్ణుడు పశుపాలకుడు. గోప ప్రాపకుడు, గోష్ఠ బహిష్కర్తయు బలరాముడు. పశువులకు సుభిక్షముగ నుండును. నాల్గు కుంచముల వర్షము. పగటియందు ఆర్ద్రకార్తె ప్రవేశము. వత్సరాది లగాయతు బ౫ శుక్రవార పర్యం. బాల గణికా హస్తమున, తదారభ్య జ్యేష్ఠ బ ౧ శనివారం ప. యువతీ గణికా హస్తమున, తదారభ్యావత్సరం వృద్ధగణికా హస్తమున కుంచముండును. పౌష బహుళ ౭ గురువాసరమున (25—1—1973) తుంగభద్రా నదీ పుష్కర ప్రవేశము.



మౌఢ్యములు

జ్యేష్ఠ శు ౨ సం. (13—6—1972) లగా ఆశు ౧౨ శుక్ర (23—6—1972) వరకు శుక్ర మౌఢ్యము. మార్గశిర బ౯ గురు (28—12—1972) లగా పౌష బ ౭ గురువారము (25—1—1973) వరకు గురు మౌఢ్యము. మాఘ బ ౧౦ సో 27—2—1973 లగా ఆవత్సరం తిర్గి శుక్ర మౌఢ్యము

కల్యాద్యబ్దాః	౫౦౭౩
శాలివాహనశక	౧౮౯౪
ఫసలీసన్	౧౩౮౧—౮౨
హిజరీసన్	౧౩౯౨—౯౩
క్రీస్తుశకము	1972—73
భారత స్వాతంత్ర్యశకము	25—26

ఆంధ్రపత్రికా కార్యాలయము, మద్రాసు-1.

పంచాంగ పద్ధతి వివరణము

ఇందు కాలమానము యథాప్రకారముగ విజయవాడ, గుంటూరు, ఏలూరు మొదలగు ఆంధ్ర ప్రదేశ్ మధ్యభాగమునకు చూపబడినది. తిథి, నక్షత్రములు ఘటికలలోను, గంటలలోను కూడ చూపబడినవి. శుభ ముహూర్తములు—దుర్ముహూర్తములు—వర్జ్యములు—మహాపాతలు గంటలలో మాత్రం చూపబడినవి. యోగకరణ, అమృత, గ్రహ ప్రవేశములు ఘటికలలో మాత్రం చూపబడినవి. భారత ప్రభుత్వముచే నియమింపబడిన కాలెండరు రిఫార్మ్సు కమిటీవారి నిర్ణయమును ననుసరించి ప్రకటింపబడిన ఇండియన్ ఎఫెమెరీసు అండ్ నాటికల్ అల్మనాక్కునకు సరిపడునట్లు చూపబడినవి. నూతన వేధశాలల యందు కనుగొనబడిన భూకేంద్రమునకు సరిపడు వాస్తవిక రవి చంద్రులచే సాధింపబడిన తిథ్యాధికము, గ్రహసంచారము. ఇందు ప్రాధాన్యముగ చూపబడినవి. ఈ తిథ్యాధి గ్రహ సంచారములే పంచాంగమున వ్రాసినట్లు ఆకసమున సరిపడుచున్నవి. న్యాయమును లోకము తెలిసికొనుటకొరకు భేదమును గుర్తింపగలందులకు పూర్వపద్ధతి పంచాంగముకూడ ఇందు సంగ్రహముగ చూపబడినది. ఇందు చూపబడిన పూర్ణశాస్త్రీయ పద్ధతియే శాస్త్రీయమని గ్రహింపనగునని మా విశ్చితాభిప్రాయము. ఇందు తిథ్యాది, ఘటికలు, ఉదయాస్తమయములు, శుభముహూర్తములు, చూపబడినవి. అగ్నాంతకాలములు, విరయణ గ్రహస్ఫుటములును విజయవాడ, గుంటూరు, ఏలూరు ప్రాంతములకు చూపబడినవి. దేశాంతర చక్రములును చూపబడినవి. ఇందు వేదాంగ జ్యోతిషమున సూచింపబడిన అశ్విన్యాదిని గ్రహించి ఈ పంచాంగ రచన చేసియున్నాము—గావున వైదికము సనాతనము గూడ యగుచున్నది. 10 అక్షాంశ లగాయతు 30 అక్షాంశ వరకు లగ్న ప్రమాణములు యివ్వబడినవి. శాస్త్రమునకు ప్రత్యక్షమునకు సముచితమైన యొప్పు ఈ పంచాంగమును గ్రహించి శ్రౌత స్మార్త కర్మల నాచరింప గోరుచున్నాము.

తిథ్యాదికమునందు దేశాంతర చక్రము

	చైత్ర మేష	వైశాఖ వృషభ	జ్యేష్ఠ మిథున	ఆషాఢ కర్కాట	శ్రావణ సింహ	భాద్ర కన్యా	ఆశ్వీన తులా	కార్తిక వృశ్చిక	మార్గశిర ధను	పౌష మకర	మాఘ కుంభ	ఫాల్గున మీన
మైసూరు	—౩౯	—౪౯	—౫౬	—౫౯	—౫౬	—౪౯	—౩౯	—౩౦	—౨౩	—౨౦	—౨౩	—౩౦
బెంగుళూరు	—౩౦	—౩౮	—౪౪	—౪౭	—౪౪	—౩౮	—౩౦	—౨౨	—౧౬	—౧౪	—౧౬	—౨౨
అనంతపురం	—౩౦	—౩౪	—౩౭	—౩౯	—౩౭	—౩౪	—౩౦	—౨౬	—౨౩	—౨౧	—౨౩	—౨౬
బళ్లారి	—౩౭	—౪౦	—౪౩	—౪౪	—౪౩	—౪౦	—౩౭	—౩౪	—౩౨	—౩౧	+౩౨	—౩౪
కర్నూలు	—౨౬	—౨౭	—౨౮	—౨౯	—౨౮	—౨౭	౨౬	—౨౪	—౨౩	—౨౨	—౨౩	—౨౪
హైదరాబాదు	—౨౧	—౨౦	—౧౮	—౧౮	—౧౮	—౨౦	౨౧	—౨౩	—౨౫	—౨౫	—౨౫	—౨౩
వరంగల్లు	—౧౦	—౭	—౪	—౩	—౪	—౭	—౧౦	—౧౩	—౧౬	—౧౭	—౧౬	—౧౩
తిరుపతి	—౧౩	—౧౯	—౨౪	—౨౭	—౨౪	—౧౯	—౧౩	—౭	—౨	+౦	—౨	—౭
నెల్లూరు	—౬	—౧౧	—౧౪	—౧౬	—౧౪	—౧౧	—౬	—౨	+౨	+౪	+౨	—౨
కుంభకోణం	—౧౨	—౨౪	—౩౪	—౩౮	—౩౪	—౨౪	—౧౨	—౦	+౯	+౧౩	+౯	—౦
కాంచీపురం	—౯	—౧౭	—౨౪	—౨౬	—౨౪	—౧౭	—౯	—౧	+౬	+౮	+౬	—౧
మద్రాస్	—౪	—౧౧	—౧౭	—౨౦	—౧౭	—౧౧	—౪	+౪	+౧౦	+౧౨	+౧౦	+౪
భద్రాచలం	+౩	+౫	+౭	+౮	+౭	+౫	+౩	+౦	—౨	—౩	—౨	+౦
బందరు	+౫	+౫	+౪	+౪	+౪	+౫	+౫	+౬	+౭	+౭	+౭	+౬
రాజమండ్రి	+౧౧	+౧౩	+౧౩	+౧౪	+౧౩	+౧౩	+౧౧	+౧౦	+౯	+౯	+౯	+౧౦
విజయనగరం	+౨౮	+౩౨	+౩౪	+౩౬	+౩౪	+౩౨	+౨౮	+౨౪	+౨౧	+౨౦	+౨౧	+౨౪
బరహంపురం	+౪౨	+౪౮	+౫౩	+౫౫	+౫౩	+౪౮	+౪౨	+౩౬	+౩౧	+౨౯	+౩౧	+౩౬

సూచన

విజయవాడనుండి భారత ప్రభుత్వము వారిచే నిర్ణయింపబడిన చైత్రాది మాసారంభము (అనగా మేషాది సాయన మాసారంభము) ల యందు కలుగు దేశాంతర విఘటికలు యీ పై చక్రమునందు చూపబడినవి. స్వగ్రామమునకు సమీపమందున్న పట్టణమునకు అభీష్ట మాసాదియందు గల విఘటికలను యీ చక్రమునను సరించి విజయవాడకు పశ్చిమదేశములయందుండువారు యీ పంచాంగమందలి తిథ్యాదులలో తీసివేయగాను, ప్రాగ్దేశములవారు కలుపగాను స్వస్థానమునకు సూర్యోదయాది తిథ్యాదికాలము లగుచున్నవి. యీ విజయవాడ యామ్యోత్తర రేఖకు సమీపమందుగల దక్షిణోత్తర దేశములవారు ఇందు ఆయామాసములలో చూపిన +,— ధనర్ణ చిహ్నములను గుర్తించి సంస్కరించుకొన వలయును - ఇందు చూపిన విఘడియలు మాసాదియందు చూపబడినవి. మాసమధ్యయందు త్రైరాశికముచే దేశాంతరమును గ్రహించి సంస్కరించినచో సూర్యోదయాది స్పుటతిథ్యాది కాలములగును. ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలు పై ప్రకారము దేశాంతర విఘటికల కగు నిమిషములను ఈ విజయవాడ కగు సూర్యోదయ గంటలలో ధనర్ణ చిహ్నములకు వ్యత్యస్తముగా (అనగా విజయవాడకు పశ్చిమదేశమందుండువారు కలుపగను, ప్రాగ్దేశవాసులు తీసివేయగను) సంస్కరించినయెడల స్టాండర్డ్ టైము ననుసరించి ఇష్టగ్రామమునకు సూర్యోదయ గంటలగును; ఈ ప్రకారము సూర్యాస్తమయ కాలమును చేయదగును.

లగ్నాంత కాలములయందు దేశాంతర చక్రము

	మీన	మేష	వృష	మిథు	కర్క	సింహ	కన్య	తుల	వృశ్చి	ధను	మక	కుంభ
మైసూరు	+19	+22	+24	+23	+20	+17	+13	+10	+ 8	+ 9	+11	+15
బెంగుళూరు	+14	+17	+19	+18	+16	+13	+10	+ 7	+ 5	+ 6	+ 8	+11
అనంతపురం	+13	+15	+15	+15	+14	+12	+11	+ 9	+ 9	+ 9	+10	+11
బళ్లారి	+16	+17	+17	+17	+16	+15	+14	+13	+12	+13	+13	+15
కర్నూలు	+11	+11	+12	+11	+11	+10	+10	+ 9	+ 9	+ 9	+10	+10
హైదరాబాదు	+ 8	+ 7	+ 7	+ 7	+ 8	+ 8	+ 9	+10	+10	+10	+ 9	+ 9
వరంగల్లు	+ 3	+ 2	+ 1	+ 1	+ 2	+ 4	+ 5	+ 6	+ 7	+ 6	+ 5	+ 4
తిరుపతి	+ 7	+ 9	+11	+10	+ 8	+ 6	+ 3	+ 1	— 0	+ 0	+ 2	+ 5
నెల్లూరు	+ 4	+ 5	+ 6	+ 6	+ 5	+ 3	+ 1	— 1	— 1	— 1	+ 0	+ 2
మదరాస్	+ 4	+ 6	+ 8	+ 7	+ 5	+ 2	— 1	— 4	— 5	— 4	— 2	+ 1
కుంభకోణం	+ 9	+13	+15	+14	+11	+ 6	+ 1	— 3	— 5	— 4	— 1	+ 4
కాంచీపురం	+ 6	+ 9	+10	+10	+ 7	+ 4	+ 1	— 2	— 3	— 3	— 0	+ 3
భద్రాచలం	— 2	— 3	— 3	— 3	— 2	— 1	— 0	+ 1	+ 1	+ 1	+ 0	— 1
బందరు	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 2	— 3	— 3	— 3	— 3	— 2
రాజమండ్రి	— 5	— 5	— 5	— 5	— 5	— 5	— 4	— 4	— 4	— 4	— 4	— 4
విజయనగరం	—12	—14	—14	—14	—13	—12	—10	— 9	— 8	— 8	— 9	—11
బరహంపురం	—19	—21	—22	—22	—20	—17	—15	—13	—11	—12	—14	—16

ఇందు చూపబడిన లగ్నాంతకాలములు స్టాండర్డు టైము ననుసరించి విజయవాడకు లగ్నాంతకాలము లగుచున్నవి. ఇతర దేశములవారు, ఈ చూపబడిన దేశాంతర చక్రము ననుసరించి, ఆయా లగ్నాంత కాలములకు చూపబడిన నిమిషములను, విజయవాడకు పశ్చిమదేశమున నుండు వారలు ఆయా కాలములలో కలుపగాను, ప్రాగ్దేశములయందుండువారు తీసివేయగను, స్టాండర్డు టైము ననుసరించి ఇష్టమగు ఆయా నగరములకు లగ్నాంత కాలము లగును. తిథులలో ప్రతిమాసము దిగువను ప్రతిరోజున లగ్నాంతకాలములు చూపబడినవి.

భారతదేశమున ఆ యా అక్షాంశ ప్రదేశములకు మేషాది నిరయణ రాశి ప్రమాణములు — ఘటికలు-విఘటికలు-పరలు.

అక్షాంశ	మేషము	వృషభము	మిథునము	కర్కాటకము	సింహము	కన్య	తుల	వృశ్చికం	ధనుస్సు	మకరం	కుంభం	మీనం
	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.	ఘ.విఘ.పర.
10	౪-౩౫-౧౬	౫- ౮-౧౦	౫-౨౮-౧౧	౫-౨౦- ౧	౫- ౨-౧౯	౪-౫౭-౫౧	౫-౧౧-౧౩	౫-౨౭-౨౧	౫-౨౦-౫౧	౪-౫౦-౧౬	౪-౨౨-౧౭	౪-౧౬-౧౪
11	౪-౩౩-౨౬	౫- ౭-౧౦	౫-౨౮-౩౫	౫-౨౧-౩౨	౫- ౪-౨౨	౪-౫౯-౫౯	౫-౧౩- ౪	౫-౨౮-౨౦	౫-౨౦-౨౮	౪-౪౮-౪౪	౪-౨౦-౧౪	౪-౧౪- ౬
12	౪-౩౧-౩౪	౫- ౬-౧౧	౫-౨౮-౫౭	౫-౨౩- ౫	౫- ౬-౨౬	౫- ౨- ౮	౫-౧౪-౫౫	౫-౨౯-౨౦	౫-౨౦- ౫	౪-౪౭-౧౨	౪-౧౮-౧౦	౪-౧౧-౫౭
13	౪-౨౯-౪౧	౫- ౫-౧౧	౫-౨౯-౨౦	౫-౨౪-౩౮	౫- ౮-౩౧	౫- ౪-౧౮	౫-౧౬-౪౭	౫-౩౦-౨౧	౫-౧౯-౪౨	౪-౪౫-౩౮	౪-౧౬- ౫	౪- ౯-౪౮
14	౪-౨౭-౪౮	౫- ౪- ౯	౫-౨౯-౪౪	౫-౨౬-౧౨	౫-౧౦-౩౮	౫- ౬-౨౮	౫-౧౮-౪౧	౫-౩౧-౨౧	౫-౧౯-౧౯	౪-౪౪- ౪	౪-౧౩-౫౯	౪- ౭-౩౭
15	౪-౨౫-౫౩	౫- ౩- ౯	౫-౩౦- ౭	౫-౨౭-౪౭	౫-౧౨-౪౫	౫- ౮-౩౯	౫-౨౦-౩౬	౫-౩౨-౨౩	౫-౧౮-౫౫	౪-౪౨-౨౯	౪-౧౧-౫౨	౪- ౫-౨౫
16	౪-౨౩-౫౮	౫- ౨- ౭	౫-౩౦-౩౦	౫-౨౯-౨౩	౫-౧౪-౫౩	౫-౧౦-౫౩	౫-౨౨-౩౧	౫-౩౩-౨౫	౫-౧౮-౩౧	౪-౪౦-౫౩	౪- ౯-౪౩	౪- ౩-౧౨
17	౪-౨౨- ౧	౫- ౧- ౩	౫-౩౦-౫౫	౫-౩౧- ౧	౫-౧౭- ౨	౫-౧౩- ౮	౫-౨౪-౨౮	౫-౩౪-౨౮	౫-౧౮- ౭	౪-౩౯-౧౬	౪- ౭-౩౪	౪- ౦-౫౭
18	౪-౨౦- ౩	౪-౫౯-౫౯	౫-౩౧-౨౦	౫-౩౨-౩౯	౫-౧౯-౧౩	౫-౧౫-౨౪	౫-౨౬-౨౭	౫-౩౫-౩౨	౫-౧౭-౪౨	౪-౩౭-౩౮	౪- ౫-౨౩	౩-౫౮-౪౧
19	౪-౧౮- ౩	౪-౫౮-౫౪	౫-౩౧-౪౫	౫-౩౪-౧౯	౫-౨౧-౨౬	౫-౧౭-౪౧	౫-౨౮-౨౭	౫-౩౬-౩౭	౫-౧౭-౧౭	౪-౩౫-౫౮	౪- ౩- ౯	౩-౫౬-౨౪
20	౪-౧౬- ౧	౪-౫౭-౪౮	౫-౩౨-౧౦	౫-౩౬- ౦	౫-౨౩-౪౧	౫-౨౦- ౧	౫-౩౦-౨౮	౫-౩౭-౪౨	౫-౧౬-౫౩	౪-౩౪-౧౬	౪- ౦-౫౫	౩-౫౪- ౫
21	౪-౧౩-౫౮	౪-౫౬-౪౧	౫-౩౨-౩౬	౫-౩౭-౪౩	౫-౨౫-౫౭	౫-౨౨-౨౨	౫-౩౨-౩౧	౫-౩౮-౪౯	౫-౧౬-౨౭	౪-౩౨-౩౩	౩-౫౮-౩౯	౩-౫౧-౪౪
22	౪-౧౧-౫౨	౪-౫౫-౩౪	౫-౩౩- ౨	౫-౩౯-౨౭	౫-౨౮-౧౫	౫-౨౪-౪౫	౫-౩౪-౫౬	౫-౩౯-౫౭	౫-౧౬- ౧	౪-౩౦-౪౯	౩-౫౬-౨౧	౩-౪౯-౨౧
23	౪- ౯-౪౫	౪-౫౪-౨౫	౫-౩౩-౨౮	౫-౪౧-౧౪	౫-౩౦-౩౫	౫-౨౭-౧౦	౫-౩౬-౪౩	౫-౪౧- ౭	౫-౧౫-౩౩	౪-౨౯- ౩	౩-౫౪- ౧	౩-౪౬-౫౬
24	౪- ౭-౩౭	౪-౫౩-౧౪	౫-౩౩-౫౫	౫-౪౩- ౨	౫-౩౨-౫౮	౫-౨౯-౩౭	౫-౩౮-౫౩	౫-౪౨-౧౭	౫-౧౫- ౬	౪-౨౭-౧౫	౩-౫౧-౩౯	౩-౪౪-౨౮
25	౪- ౫-౨౫	౪-౫౨- ౨	౫-౩౪-౨౩	౫-౪౪-౫౨	౫-౩౫-౨౨	౫-౩౨- ౬	౫-౪౧- ౩	౫-౪౩-౨౯	౫-౧౪-౩౯	౪-౨౫-౨౫	౩-౪౯-౧౪	౩-౪౧-౫౯
26	౪- ౩-౧౧	౪-౫౦-౪౮	౫-౩౪-౫౨	౫-౪౬-౪౪	౫-౩౭-౫౦	౫-౩౪-౩౮	౫-౪౩-౧౭	౫-౪౪-౪౩	౫-౧౪-౧౧	౪-౨౩-౩౨	౩-౪౬-౪౭	౩-౩౯-౨౭
27	౪- ౦-౫౪	౪-౪౯-౩౪	౫-౩౫-౨౦	౫-౪౮-౩౯	౫-౪౦-౧౯	౫-౩౭-౧౩	౫-౪౫-౩౪	౫-౪౫-౫౮	౫-౧౩-౪౧	౪-౨౧-౩౮	౩-౪౪-౧౭	౩-౩౬-౫౩
28	౩-౫౮-౩౫	౪-౪౮-౧౭	౫-౩౫-౫౧	౫-౫౦-౩౫	౫-౪౨-౫౨	౫-౩౯-౫౦	౫-౪౭-౫౩	౫-౪౭-౧౪	౫-౧౩-౧౨	౪-౧౯-౪౧	౩-౪౧-౪౪	౩-౩౪-౧౫
29	౩-౫౬-౧౪	౪-౪౬-౫౮	౫-౩౬-౨౧	౫-౫౨-౩౫	౫-౪౫-౨౭	౫-౪౨-౩౧	౫-౫౦-౧౫	౫-౪౮-౩౩	౫-౧౨-౪౧	౪-౧౭-౪౧	౩-౩౯- ౯	౩-౩౧-౩౪
30	౩-౫౩-౪౮	౪-౪౫-౩౮	౫-౩౬-౫౨	౫-౫౪-౩౮	౫-౪౮- ౬	౫-౪౫-౧౪	౫-౫౨-౪౦	౫-౪౯-౫౪	౫-౧౨-౧౦	౪-౧౫-౩౯	౩-౩౬-౨౯	౩-౨౮-౫౧

N. B. పది అక్షాంశ ప్రదేశమున గల పుర ప్రాంతములు మొదలు ముప్పది అక్షాంశ ప్రదేశమున గల పట్టణ ప్రాంతములవరకు ఈ చూపిన నిరయణ మేషాది లగ్న ప్రమాణములను స్వీకరించవచ్చును. భారతదేశమున చాలాభాగము వరకు ఈ లగ్న ప్రమాణములను చూచి వ్యవహరించుకొనవచ్చును.

విజయవాడ ప్రాంతములకు
మేషాది నిరయణ లగ్న ప్రమాణములు—పుష్కరలు

లగ్న ప్రమాణములు			పుష్కర ప్రమాణములు		
మేషము	౪-౨౩	కం 1-45	మేషము	౩- ౪	కం 1-14
వృషభము	౫- ౨	కం 2- 1	వృషభము	౨-౨౦	కం 0-56
మిథునము	౫-౩౦	కం 2-12	మిథునము	౪-౨౪	కం 1-46
కర్కాటకము	౫-౩౧	కం 2-12	కర్కాటకము	౧-౧౭	కం 0-31
సింహము	౫-౧౬	కం 2- 6	సింహము	౩-౪౧	కం 1-28
కన్య	౫-౧౨	కం 2- 5	కన్య	౨-౨౬	కం 0-58
తుల	౫-౨౪	కం 2-10	తుల	౪-౧౯	కం 1-44
వృశ్చికం	౫-౩౪	కం 2-14	వృశ్చికం	౧-౧౮	కం 0-31
ధనుస్సు	౫-౧౮	కం 2- 7	ధనుస్సు	౩-౪౩	కం 1-29
మకరం	౪-౪౦	కం 1-52	మకరము	౨-౧౧	కం 0-52
కుంభము	౪- ౮	కం 1-39	కుంభము	౩-౧౮	కం 1-19
మీనము	౪- ౨	కం 1-37	మీనము	౦-౫౬	కం 0-22

N.B:—గత లగ్నాంత కాలములో ముహూర్తలగ్న సంబంధమైన పుష్కర గంటలను కలిపిన శుభ ముహూర్త లగ్నమందు పుష్కర సమయము వచ్చును.

రాజమండ్రి ప్రాంతములకు
మేషాది నిరయణ రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౨	తులాయాః	౫-౨౪
వృషభస్య	౫- ౧	వృశ్చికస్య	౫-౩౫
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౮
కర్కటకస్య	౫-౩౧	మకరస్య	౪-౩౯
సింహస్య	౫-౧౭	కుంభస్య	౪- ౮
కన్యాయాః	౫-౧౩	మీనస్య	౪- ౨

విజయనగర ప్రాంతములకు
మేషాది నిరయణ రాశి ప్రమాణములు

మేషస్య	౪-౨౦	తులాయాః	౫-౨౭
వృషభస్య	౫- ౦	వృశ్చికస్య	౫-౩౬
మిథునస్య	౫-౩౧	ధనుషః	౫-౧౭
కర్కటకస్య	౫-౩౩	మకరస్య	౪-౩౮
సింహస్య	౫-౧౯	కుంభస్య	౪- ౫
కన్యాయాః	౫-౧౬	మీనస్య	౩-౫౮

విజ్ఞప్తి

ఆస్తిక మహాశయులారా!

మా పిడపర్తి వారి వంశమునందు చిరకాలమునుండి (సుమారు 4 శతాబ్దముల పైబడి) జ్యోతిశ్శాస్త్రాధ్యయనము పంచాంగ రచన పరంపరయా ప్రాప్తమగుచున్నది. కీ॥ శే॥ మా పితామహులు శ్రీ చిన పూర్ణయ్య సిద్ధాన్తిగారు ప్రాచీన పద్ధతిచే తిథ్యాదికము వాస్తవమునకు చాల దూరమగుటచే సర్వసిద్ధాన్తముల మథించి సారమును గ్రహించి పూర్ణశాస్త్రీయ (దృక్సిద్ధ) పద్ధతియనగా వాస్తవమునకు సరిపడునట్లు పంచాంగ రచనను సరిచేసిరి. శ్రీ మా తాతగారి వద్దనే మా తండ్రిగారు శ్రీ సుబ్రహ్మణ్యశాస్త్రిగారు బాల్యమున నే వరంపరాగత జ్యోతిశ్శాస్త్రము నభ్యసించి విశాఖపట్టణం అబ్జర్వేటరీనందు నూతన పద్ధతిగ పంచాంగ రచన నలవరచుకొని జ్యోతిశ్శాస్త్రమునందు ఉద్గ్రంథముల పఠించుటకు శ్రీ కాశీ వెళ్లి అచట మహామహోపాధ్యాయ శ్రీశ్రీశ్రీ మురళీధర ఝూ వారివద్ద జ్యోతిశ్శాస్త్రమును కూలంకషముగ నభ్యసించిరి. గత రౌద్రి సంవత్సరమున వారి పితృపాదులతో రాజమండ్రి గోదావరి పుష్కరసభయందు దుర్మతి సంవత్సరమున బెజవాడ కృష్ణా పుష్కరసభయందు పాల్గొని జయభేరిని మ్రోగించిరి. శ్రీ మా పితామహులు చిన పూర్ణయ్య సిద్ధాన్తిగారు వారి 70వ యేట క్రోధన సం॥ర॥ చైత్ర బ ౩ రోజున దివంగతులయిరి. అది లగాయతు శ్రీ మా నాయనగారు సుబ్రహ్మణ్యశాస్త్రిగారు విశాఖపట్టణం, మైసూరు, విజయవాడ పిఠాపురం మొదలగు అనేక సభలలో పాల్గొని జయస్తంభములను ప్రతిష్ఠ చేసిరి. వనపర్తి, గద్వాల, ఆత్మకూరు, జటప్రోలు, జయపూర్, పర్లాకిమిడి మొదలగు సంస్థానాధీశులచే గౌరవింపబడిరి. విజయనగరసంస్థానము నందు ముఖ్యదైవజ్ఞులుగ ఆహ్వానించబడి మహారాజులచే అంగీకరించబడిరి. భారత ప్రభుత్వము వీరి పద్ధతినే శాస్త్రీయమైనదని తీర్పు నిచ్చినది. శ్రీ 1008 శ్రీ కంచి కామకోటి పీఠాధీశ్వరులు గూడ వీరి పంచాంగమునే హవ్యకవ్యములయందు గ్రహింపవలయునని శ్రీముఖము ననుగ్రహించిరి. శ్రీ మా నాయనగారు 50 సంవత్సరముల పైబడి జ్యోతిశ్శాస్త్రమును పరిశోధనచేసి అనేక సభలలో నిర్ణయము చేయించి ఆ విధముగా ప్రత్యక్షానుగుణమగు పంచాంగ రచన చేయుటవలన ప్రభుత్వముచేతను పీఠాధిపతుల చేతను ఆమోదముద్ర బడసిరి. మేము శ్రీ మా నాయనగారివద్ద జ్యోతిశ్శాస్త్రమును సంపూర్ణముగ నభ్యసించి అనేక సంవత్సరముల నుండి వారిచే పంచాంగ రచనయందు సుశిక్షితులమగుటచే జ్యోతిశ్శాస్త్రమున తగు కౌశలమును సంపాదించియున్నాము. ఇంతేగాక వారి సమక్షమందునే వారి సలహా సంప్రదింపుల ననుసరించి 15 సంవత్సరముల నుండియు సంపూర్తిగ పంచాంగ రచన మేమే చేయుచు మధ్యమధ్య అనేక రహస్యముల తెలుసుకొనియున్నాము. శ్రీ మా నాయనగారు సాధారణ సం.ర. కార్తిక ౯(7—11—1970) రోజున వారి 77వ యేట దివంగతులైరి. మా కుటుంబమునందుద్భవించిన ప్రసిద్ధ పురుషులనేక మందిలో ఏ ఒక్కరితోను సమానము కాకపోయినను మేము "మంద: కవి యశః ప్రార్థీ" అనునట్లు సాహసముగ పంచాంగ రచనకు పూనుకొనియున్నాము. శ్రీ మా తాతగారు చినపూర్ణయ్య సిద్ధాన్తిగారి ఆశయముననుసరించి శ్రీ మా నాయనగారు రచించినట్లు మేమును శ్రీ మా నాయనగారి ఆశయప్రకారం వారి అడుగుజాడలలోనే పంచాంగ రచన చేయగలమని సవినయముగ మనవి చేయుచున్నాము. కావున మా పూర్వులయందు గల ఆదరాభిమానములను మా యందుగూడ ఉంచి మాకు తగు ప్రోత్సాహమును ఇప్పించవలసినదిగ గోరుచున్నాము.

పూర్ణశాస్త్రీయ జ్యోతిషాలయము,
పాడగట్లపల్లి P. O.
(వయా) ర్యాలి, తూ. గో. జిల్లా
(బ్రాంచి విజయనగరం, విశాఖజిల్లా)

ఇట్లు నివేదించు సోదరులు,
పిడపర్తి చినకృష్ణమూర్తిశాస్త్రి,
సుబ్రహ్మణ్యశాస్త్రి.

అయనాంశలు { నూతన సంస్కార సంస్కృతి చైత్రి పక్షయనాంశలు
సంవత్సరాదికి 23°-28′-22″ వార్షికాయనగతి 50″—26

ఆంధ్రప్రదేశ్ భారతదేశముల సౌభాగ్యము

వర్షలగ్న కుండలి

మి	వృ	మే	మీ
	శ	శు కు	ర చం బు
కే	వర్షలగ్న కుండలి		
ల			రా
			గు

జగల్లగ్న కుండలి

మి	వృ	మే	మీ
	శ కు శు	ర	చం బు
కే ల	జగల్లగ్న కుండలి		
			రా
			గు

వర్షలగ్నాపేక్షయా లగ్నాధిపతి యగు రవి, ధనలాభాధిపతియగు బుధునితోను, వ్యయాధిపతి చంద్రునితోను కలసి అష్టమమందుండెను. తృతీయ రాజ్యాధిపతియగు శుక్రునకు, వాహన భాగ్యాధిపతియగు కుజునితో భాగ్యస్థితి. పంచమాష్టమాధిపతియగు గురునిచే పంచమ దృష్టి చూడబడుచుండెను. షష్ఠ సప్తమాధిపతియగు శనికి రాజ్యస్థితి. వర్షలగ్నాపేక్షయా ఆరింట రాహువు, వ్యయమందు కేతువు కలరు. పంచమాష్టమాధిపతి గురునకు పంచమస్థితి. రాష్ట్రప్రభుత్వమునందు ఆదాయముకంటే వ్యయము అధికముగ నగును. స్వవర్గముతోను శత్రువర్గముతోను కొన్ని అనివార్యమగు చిక్కులు తప్పవు. అభివృద్ధి ప్రణాళికలు, దివర్కు పెట్టినపెట్టుబడి ఫలవంతములై చేతి అందివచ్చును. ప్రభుత్వమునందు నాయకులలో కొంత మార్పిడి తప్పదు. రాష్ట్రమునందు కొన్ని నూతనమగు పేచీలు వచ్చుటకు సావకాశము కలదు.

జగల్లగ్నాపేక్షయా లగ్నాధిపతియగు చంద్రుడు తృతీయ వ్యయాధిపతితో కలసి భాగ్యమందుండెను. ధనాధిపతి రవికి రాజ్యస్థితి. వాహనలాభాధిపతియగు శుక్రునకు, పంచమరాజ్యాధిపతియగు కుజునితోను, సప్తమాష్టమాధిపతి శనితోను కలసి లాభస్థితి. షష్ఠ భాగ్యాధిపతి గురునకు షష్ఠస్థితి. లగ్నమునందు కేతువు, సప్తమమునందు రాహువు కలరు. భారతప్రభుత్వము అన్నిరంగముల యందు చురుకుగ ముందంజ వేయగలదు. అధికఖర్చు కూడ కనుబడుచున్నది. దేశారిష్ట యోగములబట్టి విచారణ చేయగ సరిహద్దు రాజ్యాలతో పోరు తప్పదనిపించుచున్నది. కొన్ని అగ్రరాజ్యాల సహాయసంపత్తి కూడా మన భారతదేశమునకు యుండును. కొన్ని కొన్ని నూతన విధానములు అమలులోనికి రాగలవు అనిపించుచున్నది. ప్రజలయందు, ప్రభుత్వమునకు ప్రభుత్వమునందు ప్రజలకు అన్యోన్యము ఇది వరకుగల సుహృద్భావము పెంపొందును. యావత్ప్రపంచ రాజ్యాలలోను భారతదేశము సమర్థవంతమై నదిగను, న్యాయమైనదిగను పన్నెకెక్కును. కేంద్రములో కొంత కొంతమంది నాయకులకు తారుమారయ్యే అవస్థలు కూడా రావచ్చును. ప్రజలకు కొంత నష్టము, పీడ, సస్య హాని, ధరలు హెచ్చుకూడ కలుగవచ్చును. రాష్ట్ర కేంద్ర ప్రభుత్వములకు మధ్య మధ్య అభిప్రాయ భేదములు కలుగును. పై అధికారులు చాకచక్యముచే ఏకవాక్యానుయాయులగుదురు.

కార్తులు - ఫలములు

నిజ వైశాఖ శు ౧౩ బుధ	మే	24	రోహిణీ కార్తి	స్వల్ప వృష్టి.
బ ౧౦ బుధ	జూన్	7	మృగశిర కార్తి	అప్పుడప్పుడు వృష్టి.

జ్యేష్ఠ	శు	౧౦ బుధ	జూన్ 21	ఆర్ద్రకార్తె	సాధారణ వృష్టి.
	బ	౯ బుధ	జూలై 5	పునర్వసు—కార్తె	సామాన్య వృష్టి.
ఆషాఢ	శు	౯ బుధ	జూలై 19	పుష్యకార్తె	అత్యల్ప వృష్టి.
	బ	౭ బుధ	ఆగ 2	ఆశ్లేష కార్తె	మధ్య మధ్య వృష్టి
శ్రావణ	శు	౭ బుధ	ఆగ 16	మఘ కార్తె	అల్ప వృష్టి.
	బ	౬ బుధ	ఆగ 30	పూర్వకార్తె	ఉత్తరార్థం సువృష్టి.
భాద్రపద	శు	౫ మం(బుధ)	సెప్టెం 12	ఉత్తకార్తె	సువృష్టి.
	బ	౪ మం	సెప్టెం 26	హస్తకార్తె	సువృష్టి.
ఆశ్వయుజ	శు	౩ మం	అక్టో 10	చిత్తకార్తె	సవాతచిత్ర వృష్టి.
	బ	౧ సోమ	అక్టో 23	స్వాతికార్తె	సవాతాల్ప వృష్టి.
		౩౦ సోమ	నవం 5	విశాఖ కార్తె	సువృష్టి.
కార్తిక	బ	౧౩ ఆది	నవం 19	అనూరాధకార్తె	పూర్వార్థం సువృష్టి.

ధరలు

ధాన్యాదులకు అవర వస్తువులకు (కందులు మొ.) రసవస్తువులకు ధరలు విశేషముగ హెచ్చు తగ్గులతో నుండును. స్థిరోపాధుల విలువ క్రమేపియు తగ్గుముఖమునకు వచ్చును.

ధర్మశాస్త్ర సందేహములు

సరస్వతీపూజా నిర్ణయః

ఆశ్వయుజ శు ౬ బు ౫౬-౫౨ జ్యే ౭-౩౫ పుస్తకరూపాయాః సరస్వత్యాః పూజా॥ తదుక్తం ధర్మసింధౌ తత్ర మూలస్య ప్రథమే పాదే పూర్వాస్తాత్రిక్తి ముహూర్త వ్యాపిని సరస్వత్యావాహనమితి॥ నచ మూలస్య జ్యేష్ఠావేధ దూషితత్వే న తాదృశ మూలనక్షత్రే సరస్వత్యావాహనం న కార్యమితివాచ్యం॥ జ్యేష్ఠా విద్ధంతు యన్మూలం అనద్యాహోర్సనం నచ ... ఇత్యాది ప్రమాణానురోధేన జ్యేష్ఠా విద్ధ మూలస్య వృషభ పూజనే దోషదూషితత్వాత్.

ఆశ్వయుజ శు ౯ సో ౨-౩౦ ఉషా ౪౪-౫౬ రాత్రౌ పుస్తకరూపాయాః సరస్వత్యా ఉద్వాసనం॥ తదుక్తం ధర్మసింధౌ విసర్జనం తు శ్రవణ ప్రథమపాదే రాత్రిభాగ గతేపి కార్యం విశేషవచనాత్ తచ్చ రాత్రేః ప్రథమ ప్రహర పర్యంతమేవేతి భాతి. కించ నిర్ణయసింధౌ ఆదిభాగో విశాయాంతు శ్రవణస్య యదా భవేత్. సంప్రేషణం తదాదేవ్యాః దశమ్యాం చ మహోత్సవ ఇత్యలం.

తా. ఆశ్వయుజ శు ౬ శుక్రవారమున పగలు సరస్వతీ దేవీ పూజా ప్రారంభము. శు ౯ సోమవారమున రాత్రి సరస్వత్యుద్వాసనం చేయవలయునని పై ప్రమాణముల అభిప్రాయం.

తిథి నిర్ణయః

కార్తిక శు ౧౨ శ ౨౩-౨౨ అపరాహ్ణాంతః ౨౨-౫౪ తిథిద్వయం
౧౩ ఆ ౧౪ ౫౫ అపరాహ్ణాదిః ౧౬-౫౫ చతుర్దశీతిథిః

అత్ర త్రయోదశీ పూర్వదినే అపరాహ్ణవతిత్య ప్రవృత్తా. పరదినే అపరాహ్ణమస్పృష్ట్వైవ సమాప్తా. ఏతాదృశస్థలే త్రయోదశీ ప్రయుక్త మైత్రకం కదావా కార్యమితి విచికిత్సాయాం కాలమాధవీయే॥ యదా దినద్వయే స్వపరాహ్ణ మస్పృశ్యైవ విశిష్టం కంచిత్కాలం వ్యాప్నోతి తదా పూర్వ విద్ధా ప్రతిపద్య గ్రహీతవ్యా. తదాహ మనుః సద్యస్పృహాద్వ్యాపినీ చేత్స్యాన్నృతాహేతు యదా తిథిః పూర్వ విద్ధైవ కర్తవ్యా త్రిముహూర్తా యదా భవేత్ ఇతి॥ సంక్షేప నిర్ణయేపి॥ యదాతు దినద్వయే వ్యపరాహ్ణ స్పర్శోనాస్తి తదా యద్యపివేద్యః కుతపవ్యాప్తిరస్తి తథాపి తత్పరిత్యజ్య పూర్వ విద్ధైవ కర్తవ్యా॥ ఇతి॥ అత్ర ధర్మసింధుః॥ యత్ర పూర్వ విద్ధా గ్రాహ్యా తయోర్వ్యతే. తత్రాప్తా త్పూర్వం ద్విముహూర్తాదికాయా గ్రాహ్యత్వం జ్ఞేయం. నన్యూనాయా ఇతి॥ అత ఏవ మాధవః॥ అవశిష్టం కంచిత్కాలమితి. కంచిత్కాల మిత్యత్ర ఏకముహూర్త మిత్యర్థః యదా పూర్వదినే తిథే స్సూర్యాస్తా త్ప్రాక్ప్రతీయే ముహూర్తే ప్రవేశో నాస్తి తదైవ పరదిన ఇతి పర్యేషాం గ్రంథానా మాశయః. యత్ర యత్ర సాయం శబ్దోవర్తతే తత్ర తత్ర ద్విముహూర్తాల్పత్వ మిత్యర్థః. యత్ర యత్ర త్రిముహూర్త శబ్దోవర్తతే తత్ర తత్ర ద్విముహూర్తాధికత్వ మిత్యర్థః ఏవం సతి. సర్వేషాం స్మృతి వచనానాం విబంధన గ్రంథానాం ద్వైక వాక్యతా స్యాదతః ద్వాదశీ స్థిరవాసరే త్రయోదశ్యా స్సూర్యాస్తా త్ప్రాగ్ద్విముహూర్తాధికతయా స్థిర వాసరే ఏవ త్రయోదశీ ప్రయుక్త మైత్రక మితి సిద్ధాన్తః॥

తా:—త్రయోద సంబంధమగు ప్రత్యాబ్దికములు వగైరా ద్వాదశీ శనివారమునవే నిర్వర్తించవలెనని పై ప్రమాణముల నిర్ణయం.

శ్రీ మేధా దక్షిణామూర్తి సమేతాయై శ్రీ బాలా మహా త్రిపుర సుందర్యై నమః

శ్రీ పరిధావి నామ సంవత్సర పఞ్చాఙ్గ పీఠికా

అచిన్త్య వ్యక్తరూపాయ నిర్గుణాయ గుణాత్మనే। సమస్త జగదాధార మూర్తయే బ్రహ్మణే నమః॥౧॥ లంబోదరం ద్విపముఖం ప్రణమామ్యుపవీత శ్రీ సర్వస్వహార్యస్వహ మర్చయామః। యదర్చయా బ్రహ్మముఖామరేశా నిరంతరాయం సఫలీకృతార్థాః॥౨॥ ప్రావృట్పయోదమేఘ నిభౌ భుజంగశయ్యా విభూషౌ విహగేశ్వర వాహనౌ గోపాలమల్లేశ్వరదేవదేవౌ మృత్యుః ప్రియాదత్త హృదర్ధదేహౌ॥౩॥ వేదమయీంనాదమయీం బిందుమయీం పరపదోద్య దిందుమయీం మంత్రమయీం తంత్రమయీం ప్రకృతిమయీం నౌమి విశ్వ వికృతిమయీం॥౪॥ లక్ష్మీ ప్రదాన సమయే నవవిద్రుమాభాం విద్యా ప్రదానసమయే శరదిందు శుభ్రాం। విద్వేషివర్గ విజయేచ తమాలనీలాం బాలాం త్రిలోక జననీం శరణం ప్రపద్యే॥౫॥

గురుస్తుతిః

ఉచ్చైస్త్రాగ్రహ విగ్రహం ప్రవితత జ్యోతిః పదైకాశ్రయం.
విద్యా గోచర మాహతోరుతమసం త్రయ్యాత్మకం విస్తృతం।
శ్రీమన్సోరికులాగ్రణీమణి మిమం శ్రీ సూర్య నారాయణం।
విద్వాంసం తమిమేవయం శుభధియా నిర్విష్ణు మారాధ్నుమః॥౬॥

స్వీయ వంశక్రమః

శ్రీ కౌండిన్యస గోత్రే పిడపర్త్యాఖ్యాన్వయే ప్రసిద్ధతమే. త్రిస్కంధశాస్త్ర కృతినోభవన్తి శశ్వద్బుహాః కాలాత్॥౭॥ చలమాఖ్య వేంకట చలాఖ్య స్తతా భవద్బుధః యోలుప్తమాన విషయక వాదేనా గణయ దపి చ విశ్వజితిం॥౮॥ తస్య సుతస్తత్సదృశ శ్శేషాచల దైవవిత్ప్రవరః జజ్ఞాతే తస్య సుతౌ పూర్ణా విద్యా సుపరిపూర్ణా॥౯॥ తయోర్ద్వితీయో ద్వితీయ ప్రతిభావా న్సుధోత్తమః శ్రీ పూర్ణార్యః పుష్కరాది సంప్రాప్తోజ్జ్వలద్యశాః॥౧౦॥ తస్యార్య వర్యస్య పితృప్రసాద ప్రాప్తాఖిల జ్యౌతిష సద్రహస్యః త్రిస్కంధ శాస్త్రాబ్ధి కృతాధిక శ్రమాః పంచాత్మజా స్సద్గణిత ప్రవీణాః॥౧౧॥ శాంతస్వేషు ద్వితీయ శ్రీసుబ్రహ్మణ్య సుధీమణిః బాల్యే వయ సితా తేన జ్యోతిశ్శాస్త్రేషు శిక్షితః॥౧౨॥ వారణస్యాం సురుర్యస్య రఘోపాధ్యా మురళీధరః తదనుగ్రహ సంప్రాప్త గోల విద్యా విచక్షణః॥౧౩॥ బాపూ దేవోక్త టిప్పణ్యా వివరణ విశాలధీః సుధాకరయోక్త మర్మజ్ఞశ్చేషైస్య ప్రియదర్శనః॥౧౪॥ సర్వ సిద్ధాన్త వేత్తా చ సర్వ తంత్ర స్వతంత్రధీః ధర్మశాస్త్రే మహాప్రాజ్ఞశ్చాబ్దేకృత పరిశ్రమః॥౧౫॥ జేతా సభాసు శత్రూణాం గణితే భీమ విక్రమః మహారాజస్య విజయనగర్యాం దైవ విణ్ణిః॥౧౬॥ శైవ బాలా మహామంత్ర జప పూజాపరాయణః యస్మైదత్తం శ్రీముఖం శ్రీ కామకోటి మఠేశ్వరైః॥౧౭॥ గజానన గుహౌ శంభో

మంత్రి గురుడు - ఫలము

శ్లో॥ జీవేత్వమాత్యే బహుధాన్యసంపదః ప్రభూతవర్షాశ్చ భవన్తి లోకాః।
ఫలన్తి సస్యాని బహూని చ క్షితౌ ద్విజా గోకుల సంకులానదా॥

తా. ధాన్యసంపద, గొప్ప వర్షములు, సస్యసంపద, పశుసంపద కల్గును.

రాజ మంత్రులు ఒకరగుచో ఫలము

శ్లో॥ స్వయం రాజా స్వయం మన్త్రీ యస్మిన్నబ్దే యదాభవేత్।
చోరాగ్ని శస్త్రబాధాభిః పీడ్యన్తే భూభుగాదయః॥

తా. చోర భయము, అగ్నిభయము, రాజభీతి ఎక్కువగా నుండును.

సేనాధిపతి బుధుడు - ఫలము

శ్లో॥ వాతాహతా వారిధరాః కదావిద్వర్షన్తి సస్యాని ఫలాన్వితాని।
లోకాస్సదా పీడిత కామచారా సైన్యాధిపత్యే ఖలు చంద్రజస్య॥

తా. మేఘములు గాలిచే కొట్టబడును. ఒకానొకప్పుడు వర్షించును. సస్యములు ఫలములతో కూడి యుండును. జనులు కామపీడితులగుదురు.

సస్యాధిపతి సూర్యుడు - ఫలము

శ్లో॥ సస్యాధీశే భాస్వతి విరళానివ సర్వసస్యాని
అతివిపులం ప్రీతిభయం కుళుత్థ చణాది సంపూర్ణం॥

తా. సస్యములు స్వల్పముగ ఫలించును. ఈతి బాధలు ఎక్కువగ నుండును. సెనగలు, ఉలవలు మొ॥ సంపూర్ణముగా ఫలించును.

ధాన్యాధిపతి శుక్రుడు - ఫలము

శ్లో॥ అతివృష్టి స్సుభిక్షంచ ఫలితా సస్యజాతయః।
మానవానాం రుజ స్సర్వే శుక్రే ధాన్యాధిపే సతి॥

తా. వర్షము లెక్కువ. సుభిక్షము, సస్యవృద్ధి, ఆరోగ్యము, కలుగును.

అర్ఘాధిపతి బుధుడు - ఫలము

శ్లో॥ అర్ఘాధినాథే రజనీకరాత్మజే వృష్టి ర్వరా సస్యాని బహూనివస్యుః।
కౌమారపాషణ్డజ నేన్ద్ర జాలికాః ప్రభూత శోభాస్స్యు ర్వరేణ తద్వశాః॥

తా. వర్షము, ధరలు, సస్యములు, తరమగ నుండును. కౌమారు (మతభేద)లకు పాషణ్డులకు జైనులకు ఇన్ద్రజాలికులకు వృద్ధిగ నుండును. ఇతర జనుల కట్లుగాదు.

మేఘాధిపతి బుధుడు - ఫలము

శ్లో॥ మధ్యవృష్టి ర్మందసస్యం మేఘా వాయు సమన్వితాః।
మధ్యదేశే మహద్వర్షం బుధే మేఘాధిపే సతి॥

తా. వర్షములు, సస్యములు, సాధారణముగ నుండును. మేఘములు వాయువుచే కొట్టబడును. మధ్యదేశమునందు వర్షము లెక్కువ.

రసాధిపతి చంద్రుడు - ఫలము

శ్లో॥ రసస్వామిని సోమేతు రసాశ్చ ఫలితా స్సదా।
ఆనందదో రాజవర్గో వృష్టి రత్యధికా భవేత్॥

తా. రసజాతులు ఫలించును. ప్రభువర్గమునకు ఆనందము, అధిక వర్షములు కల్గును.

నీరసాధిపతి సూర్యుడు - ఫలము

శ్లో॥ నీరసాధిపతౌ సూర్యే తామ్ర చన్దనయోరపి
రక్తవాణిక్య ముక్తానాం జాయతే వృద్ధి రుత్తమా॥

తా. రాగి, మంచిగంధము, ఎర్రనిమాణిక్యములు, ముత్యములు వీటికి అధిక ధర కల్గి యుండును.

పురోహితాదుల - ఫలము

శ్లో॥ క్రూర గ్రహఫలం క్రూరం శుభగ్రహఫలం శుభం।
పురోహితాది సర్వేషాం భవేదేశ సముద్భవమ్॥

తా. పురోహితాదులు క్రూరులగునో క్రూర ఫలమును శుభులగుచో శుభఫలమును చేతురు.

సావన వర్షారంభః

(15—3—1972 బుధవారే)

సావన వర్షాధిపతి బుధుడు - ఫలము

శ్లో॥ ప్రభూత వాయు ర్నాతి మధ్యవృష్టి, ర్నదాహవ ప్రోద్ధత రాజకోపః।
బుధేబ్దనాథే స్వపరంచ సస్యం క్షేమం చ వృద్ధి ర్లిపిలేఖకానాం॥

N. B.:— ధరలు విమర్శించ తగిన పద్ధతి ప్రతి అమావాస్యరోజున కలిగిన వృష్ట్యనావృష్టి సూర్యోదయాస్తమయ సమయములయందు కలిగిన వైషమ్యము వలన తత్తద్వస్తువులకు ధరలు నిర్ణయించమని శాస్త్రము. అట్లు చేయుట పంచాంగ రచనా కాలమునందు సాధ్యముకాదు. కేవలగ్రహ యోగములచే విమర్శించి వ్రాసినారము. వర్తకులు కూడ ఈ విషయమును గుర్తించ గోరుచున్నాము. చంద్ర శృంగోన్నతి వలన సంక్రాంతుల వలన కూడ ధరవరలు హెచ్చు తగ్గులలో నుండును. ఈ విషయము సౌరార్షులు — చాంద్రార్షులలో వ్రాసినాము. అదియు కూడ గమనించ గోరుచున్నాము.

గో చా ర ఫ ల ము లు

N. B.—ఇందు ఫలములను స్థితి గోచారవశమున, వేధగోచార వశమున నక్షత్రరాసుల ననుసరించియు, విమర్శించి వ్రాసినాము. ఇంకను అష్టకవర్గ గోచారమును, జాతకమును మేలవించి చూచుకొనిన ఋజువుగనుండును. సౌర చాంద్ర గోచారములను మేలవించి చూచుకొనవలెను.

మేషము : సౌరగోచారము : మేషమాసములో జన్మించినవారికి

చాంద్రగోచారము: (అశ్విని. భరణి. కృ 1 పా.)

వత్సరాది ప్ర 25—1—1973 వరకు భాగ్యమున గురుడు రజత మూర్తి, పూర్తి శుభుడు. తదాదిగా ఆవత్సరము రాజ్యమున గురుడు తామ్రమూర్తి, పాదశుభుడు. ఈ వత్సరమంతయు ద్వితీయమున శని రజితమూర్తి అర్ధాల్పశుభుడు. వత్సరాది ప్ర 5—9—1972 వర్కు రాహు కేతువులు 10.4 రాసులయందు తామ్రమూర్తులు, సామాన్యులు. తత్పూర్వత్వత్సరం 9—3—రాసులయందు లోహ మూర్తులు, అధిక శుభులు. వేధగోచారముచే నీ వత్సరమంతయు గురుడు పాపి. వత్సరమంతయు రాహువు శుభుడు. 4 జూలై ఆగా 13 మార్చి 1973 వర్కు కేతువు పాపి. పర్యవేక్షణచేయగా నీ రాశివారికి మిశ్రమముగా నుండును. వ్యయ ప్రయాసలతో తలచిన పనులు సకాలమునకు నెఱవేరును. శుభకార్యములు, నిర్మాణ కార్యక్రమములు జనవరి లోగా పూర్తియగును. వర్తకులకు లాభమున శాతము తక్కువగనుండును. వ్యవసాయదారులకు తొలకరి బాగుగ ఫలించును. రాజకీయ నాయకులకు ప్రజా

గౌరవ మున్నను విశేష పదవులను పొందజాలరు. విద్యార్థులకు మార్చి ఫామ్సు అనుకూలముగా నుండును. ఉద్యోగులకు బదిలీలు అయ్యే సూచన కలదు. కోర్టు వ్యాపారములు రాజీ చేసుకొనుట మంచిది. కంట్రాక్టరులకు ఒనవరి వరకు లాభశాతము బాగుండును. కుటుంబములో ఔషధసేవ మద్యేమద్యే కావలసి వచ్చుచుండును. శనికి జపము. తైలాభిషేకము చేయించుకొనుట వలనను, నీలమును ధరించిన మేలు కల్గును. ఈ రాశి వారికి 20, 1, 13 25, 5 తారీఖులు. సోమ. వి. గురు వారములు, మంచిని అశ్విని వారికి ఈ వత్సరమంతయు శని శుభుడు. 72—9—5ల రాహువు పాపి. కేతువు శుభుడు.

భరణి వారికి వత్సరాది మొదలు ఏప్రి 7 వర్కు శని పాపి, వత్సరమంతా రాహువు శుభుడు. కేతువు శుభుడు.

వృషభము: సౌరగోచారము: వృషభ మాసములో జన్మించిన వారికి -

చాంద్రగోచారము: (కృ. 2. 3. 4. పా. రో. మృగ 1. 2 పా)

వత్సరాది మొ 25—1—73 వరకు అష్టమమున గురుడు లోహమూర్తి, పూర్తి పాపి. శ్రమను చేయును. అది మొదలు సంవత్సరాంతము భాగ్యమున సువర్ణమూర్తి, పూర్తి శుభుడు. ఈవత్సరమంతయు జన్మమున శని సువర్ణమూర్తి, అర్ధ శుభుడు. వత్సరాది మొ 5—9—72 వరకు 9—3 రాసులయందు రాహు కేతువులు సువర్ణ మూర్తులు, త్రిపాదాధిక శుభులు. తత్పశ్చాత్వత్సరం 8—2 రాసులయందు తామ్ర మూర్తులు, సామాన్యులు. వేదిగోచారముచే ఈ వత్సరమంతయు గురుడు పాపి. ఈ వత్సరమంతయు శని శుభుడు. రాహువు వత్సరమంతయు శుభుడు. జూలై 4 లగా 73.3.13 వర్కు కేతువు పాపి. పరిశీలన చేయగ ఈ రాశివారికి శుభాశుభ మిశ్రమముగ నుండును. తలచినపనులు ఆలస్యముగ వ్యయ ప్రయాసలతో నెరవేరును. మానసిక మాంద్యమేర్పడును. కుటుంబమున చీకాకు హెచ్చును. వర్తకులు జాయింటు వ్యాపారములలో డిపోవుట మంచిది. కోర్టు వ్యాపారములు జనవరి లగాయతు జయప్రదమగును. ఉద్యోగులు బదిలీల కోరుట మంచిదికాదు. వ్యవసాయదారులక తొలకరి పంట కంటె పైరు ఫలించును. కంట్రాక్టరులు పెద్ద మొత్తములతో వ్యాపారము చేయుట మంచిదికాదు. రాజకీయ నాయకులు తగిన గౌరవమును పొంద జాలరు. విద్యార్థులు శ్రమపడినకాని ఉత్తీర్ణులు కాజాలరు. పుష్పరాగము గాని నీలము గాని ధరించుట మంచిది. విష్ణు సహస్రనామపారాయణ చేయుట, తైలాభిషేకము చేయించుట మంచిది. ఈ రా. వార్కి 2, 6, 14, 21, 26 తారీఖులు మం. ఆ. శు. వారములు మంచివి.

కృత్తిక వారికి వత్సరాది లగా 73—3—12 వరకు గురుడు పాపి. వత్సరమంతయు శని పాపి. రాహువు కేతువు వత్సరమంతయు శుభులు.

రోహిణి వారికి వత్సరమంతా గురుడు పాపి, శని శుభుడు. రాహువు శుభుడు 5—9—72 లగా ఆవత్సరం కేతువు పాపి.

మృగశిర్షవారికి 73 1-11 లగా మార్చి 12వర్కు గురుడు శుభుడు. వత్సరమంతా శని శుభుడు. వత్సరాది లగా 7—11—72 వరకు రాహువు పాపి. వత్సరాది ల 5—9—72 వరకు కేతువు శుభుడు.

మిథునము: సౌరగోచారము; మిథున మాసములో పుట్టినవారికి

చాంద్రగోచారము: (మృగ 3 పా. 4 పా. ఆర్ద్ర. పున 1. 2. 3 పా)

వత్సరాది మొదలు 25—1—73 వరకు సప్తమమున గురుడు తామ్రమూర్తి అర్ధ శుభుడు. తదారభ్యాత్ వత్సరము అష్టమమున రజతమూర్తి, అర్ధ శుభుడు. ఈ వత్సరమంతయు ద్వాదశమున శని లోహమూర్తి, పూర్తిపాపి. వత్సరాది మొదలు 5—9—72 వరకు రాహు కేతువులు 8—2 రాసులయందు రజతమూర్తులు, సామాన్యులు. తదాది ఆవత్సరం 7—1 రాసులయందు రజతమూర్తులు, సామాన్యులు వేధగోచారముచే ఈ వత్సరమంతయు గురుడు పాపి. ఏప్రియల్ 8 మొ. 27 జూలై వర్కు తిరిగి డిశంబరు 12 లగా. ఆవత్సరం, శనిపాపి. ఈ వత్సరమంతా రాహువు శుభుడు. వత్సరాది పిఫ్రవరి జూలై 4 వరకు. కేతువు పాపి. ఆలోచించగా ఈ రాశివారికి వత్సరాద్యంతములయందు శ్రమగా నుండి మధ్యయందు బాగనిపించును. ఉద్యోగ ప్రాప్తిలో కాలవిలంబము, మంగళకార్య ఆచరణకు అడ్డంకులు హెచ్చుగ నుండును. ఉద్యోగులకు అధికారుల ఒత్తిడి హెచ్చును. రాజకీయనాయకులు ప్రజల పలుకుబడి పొందలేరు. కోర్టు వ్యాపారములు వాయిదా వేయించుట మంచిది. కంట్రాక్టర్లకు మధ్య మధ్య నష్టములు కలుగును. వర్తకులకు ముందు వెనుకలు చూచుకొనుచు ముందుకుపోవుట మేలు. వ్యవసాయదారులకు తొలకరి పైరులు సమముగా నుండును. విద్యార్థులు శ్రమపడిగాని రెండు చాన్సులయందునను ఉత్తీర్ణులు కాజాలరు. శనికి జపము, తైలాభిషేకము చేయించుట, నవగ్రహస్తోత్ర పారాయణంచేయుటవలన, నీలముగాని గోమేధికముగాని ధరించుటవలన శుభములు పొందవచ్చును. 3, 7, 15, 22, 27 తారీఖులు, బుధ, సోమ, శనివారములు మంచివి.

ఆర్ద్రవారికి 72—3—24లగా ఏప్రియల్ 26 వరకు, తిరిగి నవంబరు 11లగా 73-1-10 వర్కు గురుడు శుభుడు. వత్సరమంతయు శని శుభుడు. 7—11—72 ల ఆవత్సరం రాహువు పాపి. కేతువు పాపి.

పునర్వసువారికి ఏప్రియల్ 26 లగా నవం 11 వరకు గురుడు శుభుడు; వత్సరమంతా శని పాపి. రాహువు, కేతువు వత్సరమంతయు శుభులు.

కర్కాటకము: సౌరగోచారము: కర్కాటకమాసములో పుట్టినవారికి

చాంద్రగోచారము: (పున 4 పా. పుష్య. ఆశ్లేష.)

వత్సరాది మొ 25—1—1973 వరకు ఆరింట గురుడు రజతమూర్తి, అర్ధ శుభుడు. తదారభ్యావత్సరం సప్తమమున గురుడు లోహమూర్తి, అర్ధశుభుడు. ఈ వత్సరమంతా లాభమున శని సువర్ణమూర్తి, పూర్తి శుభుడు. వత్సరాదిమొదలు 5—9—72వరకు 7—1 రాసుల యందు రాహు కేతువులు లోహమూర్తులు, పాపులు. తత్పశ్చాత్వత్సరం 12—6 రాసులయందు సువర్ణమూర్తులు, త్రిపాద శుభులు. వేధగోచారము చే ఈ వత్సరమంతయు గురుడు పాపి. జూలై 27 లగా 12 డిశంబరు వర్కు శనిపాపి. ఈ వత్సరమంతా రాహువు శుభుడు. ఈ వత్సరమంతా కేతువు శుభుడు. పర్యవేక్షణ చేయగా ఈ రాశివారికి విశేషలాభము లేకపోయినను ఏ వ్యాపారము నందు నష్టము కలుగదు. వ్యవహారములయందు కొన్ని కొన్ని చిక్కులు మధ్య మధ్య కలిగినను క్రమముగా చిక్కులు తగ్గి కార్యానుకూలతకు తగు సూచనలు కలుగును. కుటుంబమునందు వారాప్తులు తామలకు అనారోగ్యసూచన కలిగినను ఉత్తరార్థమున క్రమముగా ఆరోగ్యము కలిగి సుఖమనిపించును. ఉద్యోగులకు పూర్వార్థమున అధికారుల ఒత్తిడి హెచ్చుగ నుండును. రాజకీయ నాయకులకు ప్రజలలో కొంత వైషమ్య మేర్పడును. కోర్టు వ్యాపారములయందు సాధ్యమైనంత వర్కు రాజీలు మంచివి. కంట్రాక్టరులకు ఉత్తరార్థము ఫలదాయకము. వర్తకులకు లాభ నష్టములు సమానముగా నుండును. వ్యవసాయదారులకు తొలకరిపంట కంటే పైరు పంటలు బాగుగా ఫలించును. విద్యార్థులకు ఉన్నత శ్రేణి వచ్చుటకష్టము. గురునకు జపము చేయించుట, సుందరకాండ పారాయణము, ముత్యము, పుష్యరాగము ధరించుట శ్రేయోదాయకము. 4, 8, 16, 23, 28 తారీఖులు ఆది, మంగ, గురు వారములు శుభము.

పుష్యమి వారలకు వత్సరమంతయు గురుడు పాపి. వత్సరమంతయు శని, రాహువులు శుభులు. వత్సరాది లగా 72—9—5 వర్కు కేతువు శుభుడు.

ఆశ్లేషవార్కి వత్సరమంతయు గురుడు పాపి. శని, రాహువులు శుభులు 72—9—5 లగా ఆవత్సరం కేతువు శుభుడు.

సింహము: సౌరగోచారము: సింహ మాసములో పుట్టినవారికి

చాంద్ర గోచారము: (మఘ పూ. ఫ. ఉ. ఫ. 1 పా)

వత్సరాది ప్ర 25 1.1973 వరకు పంచమమున గురుడు సువర్ణమూర్తి, పూర్తి శుభుడు. తదారభ్యావత్సరం ఆరింట తామ్రమూర్తి, పాపి. ఈ వత్సర మంతయు రాజ్యమునశని తామ్రమూర్తి పాదాధిక శుభుడు. వత్సరాది మొదలు 5—9—72 వరకు 6—12 రాసులయందు రాహుకేతువులు తామ్రమూర్తులు, పాదాధిక శుభులు. తత్పశ్చాద్వత్సరం5—11 రాసులయందు లోహమూర్తులు, పాదశుభులు. వేధగోచారముచే వత్సరాదిలగా 73—3—12 వర్కు గురుడు పాపి. జూలై 27 లగా డిశం 12 వర్కు శని పాపి. వత్సరాది ప్ర 5.9.72 వర్కు రాహు కేతువులు పాపులు. పరిశీలించగ ఈ రాశిలో జన్మించిన వారలకు శుభకార్యాచరణ చేతను కుటుంబ సౌఖ్యముల కొరకు ఋణములను చేయకతప్పదు. ఉద్యోగమున చూర్పాంతములకు బదిలీలు పై అధికారులతో జగడములు అనివార్యములగును. అనారోగ్య అపుష్ఠ సేవలకుగూడ వ్యయము తప్పదు. రాజకీయ నాయకులకు ప్రభుత్వములో ప్రజలలోను గూడ విశ్వాసము సన్నగిలి మోసమునకు లోనగుదురు. కోర్టు

వ్యాపారములయందు చిక్కులు విడుట చాల కష్టము. కంట్రాక్టరులు శ్రమకు తగిన ఫలమును పొందజాలరు. వర్తకులకు వ్యాపారము స్తంభించును. కృషీవలులకు సామాన్యముగ నుండును. విద్యార్థులకు ఫలితములు శ్రమ మీదగాని సంతృప్తిగనుండవు. మొత్తము ఈ రాశివార్కి శ్రమ అధికము, ఫలము స్వల్పము. ద్రవ్యమునకు కటకటలాడుదురు. ఈ రాశివారలు కెంపు, నీలము ధరించుట మంచిది. తైలాభిషేకము ఆదిత్య హృదయ పారాయణ శుభమును చేకూర్చును. ఈ రాశివార్కి 5, 9, 17, 24, 28 తారీఖులు శుక్ర, బుధ, సోమ వారములు మంచివి.

మఘవారికి వత్సరాది ప్ర 25—1—1973 వర్కు గురుడు పాపి. వత్సరమంతా శని శుభుడు. వత్సరాది ప్ర 5—9—72 వరకు రాహువు పాపి. కేతువు శుభుడు.

పూర్వఫల్గుని వారికి వత్సరాది ప్ర. 25—1—1973 వరకు గురుడు శుభుడు. వత్సరమంతయు శని శుభుడు. వత్సరాది లగా 5-9-72వర్కు రాహువు శుభుడు. 4-7-72లగా ఆవత్సరం కేతువు శుభుడు.

కన్య: సౌరగోచారము : కన్యామాసములో పుట్టినవారికి

చాంద్రగోచారము : (ఉ ఫ. 2. 3. 4 పా. హస్త. చిత్త 1. 2 పా)

వత్సరాది ప్ర 25—1—1973 వరకు అర్ధాష్టమమున గురుడు లోహమూర్తి, పూర్తిపాపి. తదారభ్యావత్సరము పంచమమున రజతమూర్తి శుభుడు. ఈ వత్సర మంతయు భాగ్యమున శని రజత మూర్తి, అర్ధాధిక శుభుడు. వత్సరాది ప్రభృతి 5—9—72 వరకు 5—11 రాసుల యందు రాహుకేతువులు రజతమూర్తులు, త్రిపాదాధిక శుభులు. తత్ప్రభృత్యావత్సరం 4—10 రాసులయందు సువర్ణ మూర్తులు, అర్ధ శుభులు. వేధగోచారముచే వత్సరాది లగా 25—1—1973 వరకు గురుడు శుభుడు. ఏప్రియల్ 8 లగా జూలై 27 వరకు తిరిగి 12 డిశంబరు లగా ఆవత్సరం శని పాపి. 5—9—72 లగా ఆవత్సరం రాహుకేతువులు ఇద్దరూ పాపులే. వివారణ చేయగా ఈరాశివార్కి కుటుంబమునందు స్వల్ప వివాదములు కించిదనారోగ్యములు కలిగినను లోగడ నెరవేరని వివాహాది శుభకార్యములు కుటుంబ వృద్ధి కలుగును. ఉద్యోగస్తులకు పైఅధికారుల ప్రాపకము వలన ప్రమోషను రాగలదు. రాజకీయనాయకులకు జయము హస్తగత మగును. కోర్టు వ్యాపారములయందు అనుకూల పరిణామం కల్గును. కంట్రాక్టుదారులకు గతముకంటే విశేషలాభము కలదు. వర్తకుల వ్యాపారము భారీ యెత్తున సాగును. వ్యవసాయదారులకు పూర్వాపర పంట లు రెండును చక్కగా ఫలించును. విద్యార్థులు శ్రమకొలది ఫ్లాసులను తెచ్చుకొనెదరు. పచ్చ ధరించుట చాల అనుకూలముగా నుండును. విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణ అరిష్టము పోగొట్టును. ఈ రాశి వారికి 6, 10, 18, 25, 29 తారీఖులు. మంగ, గురు, శని వారములు మంచివి.

ఉత్తర ఫల్గుని వారికి: 11—1—73 లగా మార్చి 12 వర్కు గురుడు శుభుడు. వత్సర మంతా శని శుభుడు. 1972—11—7 లగా ఆవత్సరం రాహువు శుభుడు. జూలై 4 లగా 73—3—13 వర్కు కేతువు పాపి.

హస్త వారికి 72—3—24 లగా ఏప్రియల్ 26 వరకు తిరిగి నవ 11 లగా 73—1—10 వర్కు గురుడు శుభుడు. 72—11—7ల ఆవత్సరం శని శుభుడు. రాహువు ఆవత్సరం పాపి. వత్సరాది మొ 73—3—13 వర్కు కేతువు శుభుడు.

చిత్తవారికి వత్సరమంతయు గురుడు పాపి. 72—7—27 లగా డిశ 12 వర్కు శని పాపి. వత్సరమంతా రాహువు శుభుడు— కేతువు శుభుడు.

తుల: సౌరగోచారము : తులా మాసమునందు పుట్టినవారికి

చాంద్రగోచారము : (చిత్త 3. 4. పా. స్వా. విశా 1. 2. 3 పా)

వత్సరాది ప్ర 25—1—1973 వర్కు తృతీయమున గురుడు సువర్ణమూర్తి, అర్ధ శుభుడు. తదారభ్యావత్సరము. అర్ధాష్టమమున సువర్ణమూర్తి అర్ధశుభుడు. ఈవత్సరమంతయు అష్టమమున శని లోహమూర్తి. పూర్తి శ్రమకారి. వత్సరాది ప్రభృతి 5—9—1972 వరకు 4—10రాసుల యందు రాహు కేతువులు సువర్ణమూర్తులు, త్రిపాదాల్ప శుభులు. తత్ప్రభృత్యావత్సరం 3—9 స్థానములయందు తామ్రమూర్తులు, అల్పాధిక శుభులు. వేధగోచారముచే 73—1—11 లగాయతు 73—3—12 వరకు గురుడు శుభుడు. ఈవత్సరమంతయు శని పాపి. వత్సరాది మొ 7—11—72 వరకు రాహువు పాపి. వత్సరమంతయు కేతువు శుభుడు. విమర్శించగ ఈ రాశివార్కి వత్సర మంతయు యథాతథముగ నుండును. ఉద్యోగస్తులకు చాల చిక్కులు కనుబడుచున్నవి, గావున బదిలీలు కోర కుండుటయే శ్రేయోదాయకము. ఏదట వారచట నుండుటయే మంచిది. రాజకీయ నాయకులకు వ్యర్థముగ ఖర్చు హెచ్చగును. ఫలితముశూన్యము. కోర్టు వ్యాపారస్తులకు కనుచూపు మేరలో మంచి కనుబడుట లేదు. కంట్రాక్టు దారులకు జాయంటుదారులతోను ప్రభుత్వముతోను తగాదాలను పురస్కరించుకొని కోర్టుల పాలగుదురు. వర్తకులకు రావలసినది రాదు. ఇవ్వవలసినది తప్పదు. వ్యవసాయ దారులు భారీ ఎత్తున పెట్టుబడులు పెట్ట కూడదు. విద్యార్థులకు ఫలితము సామాన్యముగ నుండును. ఈ రాశివారలు వజ్రము, నీలము ధరించుట చాల మంచిది. మృత్యుంజయ మహామంత్ర జపము. రుద్ర పారాయణ, తైలాభిషేకం శుభపరిణామం చేయగలవు. ఈ రాశివారలకు 7, 11, 19, 26, 30 తారీఖులు ఆది, శుక్ర, బుధ వారములు అనుకూలాముగ నుండును.

స్వాతి వారలకు: ఈ వత్సరమంతా గురుడు పాపి. 72ఏప్రియల్ మొదలు జూలై 27వర్కు డిశం 12 లగా ఆసంవత్సరం శని పాపి. వత్సరమంతా రాహువు శుభుడు. 5—9—72ల ఆవత్సరం కేతువు పాపి.

విశాఖవారలకు: వత్సరమంతయు గురుడు పాపి. శని పాపి. వత్సరమంతయు రాహువు, కేతువుశుభులు.

వృశ్చికము: సౌరగోచారము : వృశ్చికమాసమునందు పుట్టినవారికి

చాంద్రగోచారము : (విశా. 4వ పా. అనూ. జ్యే)

వత్సరాది ప్రభృతి 25—1—73 వరకు ద్వితీయమున గురుడు తామ్రమూర్తి, అర్ధశుభుడు. తదారభ్యావత్సరము తృతీయమున లోహమూర్తి, పూర్తి పాపి. శ్రమకారి. ఈవత్సర మంతా శని సప్తమమున తామ్రమూర్తి, పాదశుభుడు. వత్సరాది ప్ర 5—9—72 వరకు 3—9రాశుల యందు రాహుకేతువులు లోహమూర్తులు, సామాన్యులు. తదారభ్యావత్సరం 2—8 స్థానములయందు రజతమూర్తులు, సామాన్యులు. వేధ గోచారముచే 73—1—11 లగా 12—3—73 వర్కు గురు డల్ప శుభుడు. ఈ వత్సరమంతా శని కేతువులు శుభులు. రాహువు వత్సరాది మొదలు నవం 7 వరకు పాపి. పర్యవలోకన చెయ్యగా ఈరాశి వారికి ఫలితములు తగినంత ఉత్సాహజనకముగ నుండవు. శుభమూలక వ్యయము, ద్రవ్యము లేని లోపము అనుభవించక తప్పదు. ఉద్యోగులు కోరిన ఫలములకు వ్యత్యస్త ఫలము లకు లోనగుదురు. అవుషధసేవ అనవరతము తప్పదు. రాజకీయ నాయకులకు ప్రభుత్వము లోను, ప్రజలయందు విశ్వాసము సన్నగిల్లును. కోర్టు వ్యాపారస్తులకు ఏ వ్యాపారములు తేలవు. కంట్రాక్టరులు ఎక్కువ ఫలితముల నపేక్షించిన ప్రయోజనకారి కాదు. వర్తకులకు క్రయ విక్రయములు లేక వ్యాపారము స్తంభించును. వ్యవసాయదారులకు సామాన్యముగ నున్నను నల్లసస్యములు బాగుగ ఫలించును. విద్యార్థులు పరీక్ష ఉత్తీర్ణతలో అసంతృప్తిని పొందెదరు. మొత్తము ఈరాశి వార్కి ఈ సంవత్సరము ద్రవ్యమునకు కటకట యనిపించును. ఈ రాశివారలు పగడము, పుష్యరాగము ధరించుట మంచిది. శివ సహస్రనామ స్తోత్ర పారాయణ, లలితా సహస్ర నామ స్తోత్ర పారాయణ మంచిది. 8—12—20—27—31 సో. శ. గు. వారములు మంచివి.

అనూరాధ వారికి ఈవత్సరమంతా గురుడు పాపి. శని రాహు కేతువులు శుభులు—

జ్యేష్ఠ వారికి: వత్సరాది లగా 25—1—73 వరకు గురుడు శుభుడు. ఈ వత్సరమంతా శని శుభుడు. వత్సరాది లగా 72—9—5 వర్కు రాహువు శుభుడు. 4—9—72 లగా ఆవత్సరం కేతువు శుభుడు.

ధనుస్సు: సౌరగోచారము : ధనుర్మాసమునందు పుట్టినవారికి

చాంద్రగోచారము : (మూల. పూషా. ఉషా. 1 పా)

వత్సరాది లగా 25—1—1973 వర్కు జన్మమున గురుడు రజతమూర్తి పాదాధిక శుభుడు. తదారభ్యావత్సరము ద్వితీయమున సువర్ణమూర్తి, పూర్తి శుభుడు. ఈ వత్సరమంతా ఆరింట శని సువర్ణమూర్తి, పూర్తి శుభుడు. వత్సరాది ప్రభృతి 5—9—72 వర్కు 2—8 స్థానముల యందు రాహుకేతువులు సువర్ణమూర్తులు, పాదాధికశుభులు. తత్ప్రభృత్యావత్సరం 1—7 రాసులయందు లోహమూర్తులు పాపులు.

వేధ గోచారముచే ఈ వత్సర మంతయు గురుడు పాపి. శని, రాహు, కేతువులు శుభులు. పర్యవేక్షణచేయగా ఈ రాశివారికి గతంకంటే అనుకూలాంపగు రోజులు వచ్చెనని చెప్పవచ్చును. ఏ వ్యాపారమునందైనను అదృష్టము కలసి వచ్చునని చెప్పుటకు వీలుగ నున్నది. లోగడ కలసిరాని శుభకార్యములు నెరవేరును. ఉద్యోగులకు పై అధికారుల ప్రాపకమువలన ప్రమోషనులు లభించ కలవు. రాజకీయ నాయకులకు జయము అనుకూలించును. కోర్టు వ్యాపారములయందు అనుకొనని శుభ పరిణామం కలుగును. కంట్రాక్టుదారులకు గత సంవత్సరం కంటె ధనలాభ మధికముగ నుండును. వర్తకులకు భారీ యెత్తున వ్యాపారము చేసిన తగిన ధన లాభము చేకూరును. వ్యవసాయదారులకు రెండు పంటలు కలసి వచ్చును. విద్యార్థులు శ్రమ పడిన క్లాసులను తెచ్చుకొనగలరు. పుష్యరాగము ధరించిన మేలు కలుగుడు నవక పారాయణ శుభపరిణామం చెయ్యగలరు. ఈ రాశివారలకు 1—9—13—28 తారీఖులు, మం, ఆది, శుక్ర. వారములు మంచివి.

మూలవారికి:— 73—1—25 లగా. ఆవత్సరం గురుడు శుభుడు. వత్సరమంతా శని శుభుడు. 72—9—5 లగా ఆవత్సరం రాహువు శుభుడు. 72—7—4 లగా 73—3—13 వరకు కేతువు పాపి.

పూర్వాషాఢవారికి:— ఈ వత్సరమంతా గురుడు పాపి. ఈ వత్సరమంతా శని, రాహువులు శుభులు. వత్సరాది ప్రభృతి 72—3—13 వర్కు కేతువు శుభుడు.

ఉత్తరాషాఢవారికి:— ఈ వత్సర మంతయు గురుడు పాపి. 72—7—27 లగాయతు డిశంబరు 12 వర్కు శని పాపి. ఈ వత్సరమంతా రాహు, కేతువులు శుభులు.

మకరము : సౌరగోచారము : మకరమాసములో పుట్టినవారికి

చాంద్రగోచారము : (ఉషా. 2. 3. 4. పా. శ్ర. ధని 1. 2 పా)

వత్సరాది లగాయతు 25—1—73 వర్కు వ్యయమందు గురుడు లోహమూర్తి, పూర్తి పాపి. తదారభ్యావత్సరము జన్మమున తామ్రమూర్తి, శ్రమకారి. ఈ వత్సర మంతయు పంచమమున శని రజత మూర్తి, అర్థ శుభుడు. వత్సరాది ప్రభృతి 5—9—72 వర్కు 1—7 రాసుల యందు రాహు కేతువులు తామ్రమూర్తులు, పాపులు. తత్ప్రభృత్యావత్సరం 12—6 రాసులయందు తామ్రమూర్తులు పాదశుభులు. వేధగోచారముచే 26—4—72 మొదలు 11—11—72 వరకు తిర్గి మార్చి 12 లగా. ఆవత్సరం గురుడు శుభుడు. ఈ వత్సర మంతయు ఈ రాశివార్కి శని, రాహు, కేతువులు శుభులు. విచారణ చెయ్యగా ఈ రాశి వారికి గతం కంటె అనుకూలత తక్కువగ యుండును. మొత్తము అంత ఆశాజనకముగ నుండదు. కుటుంబమునందు అనారోగ్యము., మనోవికలత కలిగి ఆతురత హెచ్చుగ నుండును. ఉద్యోగులు ఎవట వారచట నుండుట మంచిది. బదిలీలు ప్రమోషనులు కోరుటకు సమయము గాదు. రాజకీయ నాయ కులకు అనుకూలత కనుపడుట లేదు. కోర్టు వ్యాపారులకు రాజీనామాలు చేయుట చాల అనుకూలము. కంట్రాక్టుదారులకు శ్రమయే మిగులును. వర్తకులు భారీయెత్తున వర్తక వ్యాపారములు చెయ్యకూడదు. వ్యవసాయదారులకు పెట్టుబడులు మిగులుట దుర్లభము. విద్యార్థులు శ్రమపడిన గాని ఉత్తీర్ణులు కాజాలరు. ఈ రాశి కలవారు నీలము—పుష్యరాగము ధరించుట శ్రేయోదాయకము. సుందరకాండపారాయణ, విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణ తప్పక చేయవలయును. ఈ రాశి వారలకు 2—10—14—29—తారీఖులు. సోమ, బుధ, శని, వారములు మంచివి.

ఉత్తరాషాఢ నక్షత్ర ఫలము ధనుస్సులో వ్రాయబడినది—చూడుడు.

శ్రవణంవారికి:— 73—1—25 లగా. ఆవత్సరం గురుడు శుభుడు. 7—6—72 లగా. ఆవత్సరం శని శుభుడు. 5—9—72 లగా. ఆవత్సరం రాహువు శుభుడు. వత్సరమంతా కేతువు శుభుడు.

ధనిష్ఠవారికి:—వత్సరాది ప్రభృతి 12—3—73 వరకు గురుడు పాపి. వత్సరమంతయు శని, రాహువుల శుభులు. 5—9—72 లగా. ఆవత్సరం కేతువు శుభుడు.

కుంభము : సౌరగోచారము : కుంభమాసములో పుట్టినవారికి

చాంద్రగోచారము : (ధని 3. 4 పా. శత. పూభా. 1. 2. 3 పా)

వత్సరాది ప్రభృతి 25—1—1973 వరకు లాభమందు గురుడు తామ్రమూర్తి, అర్థ శుభుడు. తదారభ్యావత్సరము వ్యయమందు రజతమూర్తి, పాదశుభుడు. ఈ వత్సరమంతయు అర్ధాష్టమమున నిశ లోహమూర్తి, పూర్తి పాపి. వత్సరాది మొదలు 5—9—72వరకు 12—6 రాసులయందు రాహు కేతువులు రజతమూర్తులు అర్థ శుభులు. తత్ప్రభృత్యావత్సరం 11—5రాసులయందు సువర్ణమూర్తులు, అర్థశుభులు. వేధ గోచారముచే 26—4—1972 లగాయతు 11—11—72 వరకు 25—3—1973 లగా. ఆవత్సరం గురుడు శుభుడు. ఈ వత్సర మంత శని శుభుడు. వత్సరాది ప్రభృతి 5—9—1972 వరకు రాహువు పాపి. వత్సరాది మొదలు 5—9—72 వర్కు కేతువు పాపి. విమర్శించగా ఈ రాశి వారికి ఏ వ్యాపారమునందు తొందర పడక ఆలోచించి చేయుట మంచిది. ఏ వ్యవహారమునందును విశేష లాభము లేకపోయినను నష్టము కలుగదు. మధ్య మధ్య పొరపులతో వివాదములు కలిగి చికాకులు రేకెత్తించును. ఉద్యోగస్తులకు పూర్వార్థమున అధికారుల ఒత్తిడి హెచ్చుగ నుండును. రాజకీయ నాయకులకు ప్రజలలో వైషమ్యా మేర్పడుట వలన ఉత్సాహము తగ్గును. కోర్టు వ్యాపారముల యందు మధ్యవర్తులయొక్క రాజీలు మంచివి. కంట్రాక్టుదారులకు పూర్వార్థము కన్న ఉత్తరార్థము నుంచి రోజులు. వర్తకులకు లాభ నష్టములు సమా నముగ నుండును. వ్యవసాయదారులకు తొలకరి పంట కంటె పైరు అనుకూలము. విద్యార్థులు శ్రమపడి గాని ఉత్తీర్ణులు కాజాలరు. నీలము— పుష్యరాగము ధరించుట కొంచె మనుకూలము. ఆదిత్య హృదయ పారాయణ, నవగ్రహ స్తోత్రపారాయణ చేయుట శుభముగ నుండును. ఈ రాశి వారలకు 3—11—16—23—30 తారీఖులు మంచివి. గురు, మంగళ, ఆదివారములు శుభము.

శతతారవారలకు:— ఈ వత్సర మంతయు గురుడు పాపి. శని, రాహువులు వత్సరమంతా శుభులు. వత్సరాది లగాయతు 4—7—72 వరకు తిర్గి 72—9—5 లగాయతు ఆవత్సరం కేతువు పాపి.

పూర్వాభాద్రవారికి:— 11—1—73 లగాయతు 73—3—12 వరకు గురుడు శుభుడు. వత్సరమంతా శని పాపి. వత్సరాది మొదలు 7—11—72 వరకు రాహువు పాపి. 72—7—4 లగాయతు 73—3—13 వరకు కేతువు పాపి.

మీనము : సౌరగోచారము : మీనమాసములో పుట్టినవారికి

చాంద్రగోచారము : (పూభా. 4 వ పా. ఉభా. రేవతి)

వత్సరాది లగాయతు 25—1—73 వరకు రాజ్యమందు గురుడు సువర్ణమూర్తి, అర్థ శుభుడు. తదారభ్యావత్సరము లాభమందు లోహమూర్తి, అర్థశుభుడు. ఈ వత్సరమున తృతీయమున శని తామ్రమూర్తి త్రిపాద శుభుడు. వత్సరాది మొదలు 5—9—72 వరకు 11—5 రాసుల యందు రాహు కేతువులు లోహమూర్తులు సామాన్యులు. తత్ప్రభృత్యావత్సరం 10—4 రాసులయందు రజతమూర్తులు, సామాన్యులు. వేధగోచారముచే వత్సరాది ప్రభృతి 25—1—73 వరకు గురుడు శుభుడు. వత్సరమంతా శని శుభుడు. 5—9—72 లగాయతు ఆవత్సరం రాహుకేతువులు పాపులు. పర్యవలోకన చేయగా ఈ రాశి వారలకు కుటుంబ సౌఖ్యము తక్కువ. ఋణములు హెచ్చగును. ఎన్ని ఆటం కములు కలిగినను శుభకార్యములు నెరవేరును. ఉద్యోగులకు పై అధికారులతో జగడములు, బదిలీలు మొదలగు చిక్కులు తప్పవు. రాజకీయ నాయకులకు ప్రభుత్వములోను, ప్రజలలోను విశ్వాసము సన్నగిల్లి మోసమునకు లోనగుదురు. కోర్టు వ్యాపారస్థులకు చిక్కులు విడకపోవుటచే శ్రమకు లోనగుదురు. కంట్రాక్టుదారులకు పూర్వార్థము కంటె ఉత్తరార్థము కొద్ది మేలు. వర్తకులకు వ్యాపారము స్తంభించును. వ్యవసాయదారులకు కొద్ది లాభము మాత్రమే కలుగును. తొలకరి కంటె పైరు మెరుగనిపించును. విద్యార్థులకు ఫలితములు కొద్దిగ బాగుండును. పుష్యరాగము, గోమేధికము ధరించుట మంచిది. శివ సహస్రనామ స్తోత్ర పారాయణ, మృత్యుంజయ జపము మంచిది. ఈ రాశివారలకు 4—12—16—24—31 తారీఖులు, శుక్ర, బుధ, సోమ వారములు మంచివి.

ఉత్తరాభాద్రవారలకు:— 72—3—24 లగాయతు 26—4—72 వరకు తిరిగి నవంబరు 11 లగాయతు 73—1—10 వరకు గురుడు శుభుడు. వత్సరమంతా శని శుభుడు. 7—11—72 లగాయతు ఆవత్సరము రాహువు పాపి. వత్సరాది మొదలు 73—3—13 వరకు కేతువు శుభుడు.

రేవతివారలకు :—25—1—1973 లగాయతు ఆవత్సరం గురుడు సామాన్యుడు 72—7—27లగాయతు డిశంబరు 12 వరకు శని పాపి. వత్సరాది మొదలు 72—9—5 వరకు రాహువు పాపి. వత్సరమంతా కేతువు శుభుడు.

విషయము	తిథులు	వారములు	నక్షత్రములు	లగ్నములు	విశేషములు
గృహారంభం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	సో-బు-గు-శు	అశ్వి రో మృ పున ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ శత రే	వృ. మి. కన్య. ధ. కుం. మీ. (సిం. వృశ్చిక)	అష్టమశుద్ధి. కర్తరిమీన మిథున ధనుర్మాసములు నింద్యములు
గృహాప్రవేశం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	సో-బు-గు-శు	రో మృ ఉత్తరాత్రయం చి అనూ ధ శత రే (పుష్య)	వృ. మి. సిం. క. వృ. ధ. కుం. మీ.	అష్టమశుద్ధి కలశ చక్రశుద్ధి (చతుర్థశుద్ధి) వృషభచక్రశుద్ధి
నిషేకము	౨-౩-౫-౧౦	సో-బు-గు-శు (శ)	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయ హ చి స్వా అనూ మూ శ్ర ధ శత రే	శుభయుతదృష్టములు.	సంధ్యాపర్వ ప్రదోష వ్రత శ్రాద్ధదినములు నింద్యములు
గర్భాధానము	౨-౩-౫-౭-౧౦-౧౩	ఆ-సో-బు-గు-శు	రో మృ పున పు ఉత్తరాత్రయ హ చి స్వా అనూ శ్ర ధ శత ఆర్ద్రా పూర్వాత్రయం విశా	,,	సంధ్యాపర్వ వ్రత శ్రాద్ధదినములు నింద్యములు
పుంసవనం సీమంతము	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	ఆ-మం-బు-గు-శు	మృ పున పు హ అనూ శ్ర ధ శత రే (అశ్వి రో చి స్వా ఉత్తరాత్రయం)	మే. వృష. మి. తు. ధ. కుం. మీ.	పుంసవనమునకు 3 మాసం. సీమంతం ౪, ౬, ౮ మాసములు
జాతకర్మ నామకరణము	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩	ఆ-సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పు హ చి స్వా అనూ ఉత్తరాత్రయం శ్ర ధ శత రే	శుభలగ్నములు	అష్టమశుద్ధి
డోలారోహణము	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	ఆ-సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి అనూ రే స్వా శ్ర	,,	,,
నిష్క్రమణం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩	సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ రే	మే. వృష. కర్కా. తు. ధ. మీ.	౪ మాసం శుభం 3 వమాసమున్ను శుభము
అన్నప్రాశనం	౨-౩-౫-౭-౧౦-౧౩-౧౫	ఆ-సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ శత రే	మీన. మే. వృశ్చి వినా	దశమశుద్ధి పూర్వాహ్ణం పురుషులకు సరి నెలలు, స్త్రీలకు బేసి
కర్ణవేధ	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩	ఆ-సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి శ్ర ధ అనూ రే (ఆర్ద్ర)	వృ. మి. క. క. తు. ధ. మీ. (మే. మ.)	౬-౭-౮ మాసములు అష్టమశుద్ధి
కేశఖండనం	౨-౩-౫-౭-౧౦-౧౩-౧౫	సో-బు-గు-శు	అశ్వి మృ పున పు హ చి స్వా శ్ర ధ శత రే (జ్యే)	శుభలగ్నములు	ఉత్తరాయణం పూర్వాహ్ణం విషమవర్షములు అష్టమశుద్ధి
అక్షరాభ్యాసము	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౨-౧౩	సో-బు-గు-శు	అశ్వి పున పు హ చి స్వా అనూ శ్ర రే (ఆర్ద్ర మృ ధ శ)	మి. కన్యా. ధ. మీ.	అష్టమశుద్ధి ఉత్తరాయణం ౫-వ సంవత్సరము శుభము
విద్యారంభం	౨-౩-౫-౧౦-౧౧-౧౨	బు-గు-శు	అశ్వి మృ ఆర్ద్ర పున పు ఆశ్రే పూర్వాత్రయం హ చి స్వా మూ శ్ర (ధ శత అనూ)	మే. మి. క. క. తు. ధ. మ. మీ.	దివాభాగము
ఉపనయనం	౨-౩-౫-౧౦-౧౧-(౬-౧౨)	సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి స్వా అనూ శ్ర ధ శ రే	శుభలగ్నములు	అష్టమశుద్ధి మీన చైత్రము శుభం
వివాహం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౨-౧౩-౧౫	బు-గు-శు	రో మృ మ ఉత్తరాత్రయం హ స్వా అనూ మూ రే (అశ్వి శ్ర చి ధ)	శుభలగ్నములు.	జామిత్రశుద్ధి మీన చైత్రము నింద్యము
నవవధూ ప్రవేశము	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩	సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పుమ ఉత్తరాత్రయం హ చి స్వా అనూ మూ శ్ర ధ శత రే	,,	ద్వాదశశుద్ధి విషమవర్ష మాసములు
నవవస్త్రాభరణ ధారణం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	బు-గు-శు	అశ్వి హ చి స్వా వి అనూ ధ రే (నర స్త్రీవ, రో పున పు ఉత్తరాత్రయం)	వృ. మి. క. క. తు. ధ. మీ.	తృతీయశుద్ధి
వాపీకూపాదికము	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	సో-బు-గు-శు	అశ్వి రో మృ పుష్య మ ఉత్తరాత్రయం హ అనూ మూ శ్ర ధ శ రే (జ్యే)	కర్కా. మ. కుం. మీ.	అగ్ని, దక్షిణ, నిరృతి, వాయు దిక్కులు గృహామధ్యం కూడదు
బీజావాపం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	సో-బు-గు-శు	రో పుష్యమ ఉత్తరాత్రయం హ స్వా అనూ మూ శ్ర శ రే అశ్వి మృ పున ధని	వృ. కర్కా. సిం. మ. (తు. మి. కుం.)	అష్టమశుద్ధి 3-౬ లలో శుభులు కూడదు
వృక్షులతాది స్థాపనం	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	సో-బు-గు-శు	అశ్వి రో మృ పుష్యమ ఉత్తరాత్రయం హ చి వి అనూ మూ శ్ర శత రే	శుభలగ్నములు.	చతుర్థమునకు శుభదృష్టి కలయును
దేవతా ప్రతిష్ఠ	౨-౩-౫-౭-౮-౧౦-౧౧-౧౨-౧౩	ఆ-సో-బు-గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయ హ చి స్వా అనూ శ్ర ధ శ రే (దేవనక్షత్ర)	వృష. వృ. సిం. మి. కన్యా. ధ. కుం. మీ.	సౌమ్య దేవతలకు ఉత్తరాయణం ఉగ్రదేవతలకు దక్షిణాయణం
యాత్ర	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩	బు-గు-శు	అశ్వి మృ పున పు హ అనూ ధ శ్ర రే (రో ఉత్తరాత్రయం మూ శ)	మే. వృష. కర్కా. తు. ధ. మ. మీ.	పంచమశుద్ధి, శుభశకునం
హలకర్మ	౨-౩-౫-౭-౧౦-౧౧-౧౩-౧౫	ఆ-మం-బు-గు-శు	అశ్వి రో మృ పున పు ఉత్తరాత్రయం హ చి స్వా వి అనూ మూ శ్ర ధ శ రే	వృ. మి. కన్యా. వృ. ధ. మీ.	కర్తరి కూడదు.

శుభముహూర్తములకు మహాదోషములను విడువవలయును. ఆయా శుభకర్మలకై ఇందు చెప్పబడినవియు తత్కాలమునకున్నవియు నగు తిథి (షష్ఠాదిగ లెక్కింపవలెను) నక్షత్ర, వార, లగ్న సంఖ్యలను కలిపి 9 చే భాగింప నగు శేషము 1 మృత్యు, 2 అగ్ని, 4 రాజు, 6 చోర, 8 రోగములను చేయును. 1, 2 శేష మగుట మిక్కిలి దోషము. 3, 5, 7, 9 శేషమగుట శుభము. గత తిథిసంఖ్యను లగ్న సంఖ్యను కలిపి 9 చే భాగించుట మతాంతరము. ధ్రువకమును చేర్పరాదు. తిథిమాసాదిగ లెక్కించుట శాస్త్రీయము గాదు. కొన్నిట పష్ఠాదిగను-కొన్నిట మాసాదిగను వ్యవస్థ లేకపోవు మిక్కిలి శాస్త్ర విషిద్ధము.

నామ నక్షత్ర పరిజ్ఞానము

చూ, చే, చో, లా	-	అశ్విని	రూ, రే, రో, తా	-	స్వాతి
లీ, లూ, లే, లో	-	భరణి	తీ, తూ, తే, తో	-	విశాఖ
అ, ఈ, ఉ, ఏ	-	కృత్తిక	నా, నీ, నూ, నే	-	అనూరాధ
ఓ, వా, వీ, వు	-	రోహిణి	నో, యా, యీ, యూ	-	జ్యేష్ఠ
వే, వో, కా, కి	-	మృగశిర	యే, యో, బా, బి	-	మూల
కూ, ఘం, ఙ, ఛ	-	ఆర్ద్ర	బూ, ధ, భ, ఢా	-	పూ.షాఢ
కే, కో, హా, హీ	-	పునర్వసు	బే, బో, జా, జీ	-	ఉ.షాఢ
హూ, హే, హో, డా	-	పుష్యమి	జూ, జెం, జో, ఖ	-	అభిజిత్
డీ, డూ, డే, డో	-	ఆశ్లేష	ఖీ, ఖూ, ఖే, ఖో	-	శ్రవణ
మా, మీ, మూ, మే	-	మఘ	గా, గీ, గూ, గే	-	ధనిష్ఠం
మో, టా, టీ, టూ	-	పుబ్బ	గో, సా, సీ, సు	-	శతభిషం
టే, టో, పా, పి	-	ఉత్తర	సే, సో, దా, ది	-	పూ.భాద్ర
పూ, ష, ణ, ఠ	-	హస్త	దూ, శం, ఝ, థ	-	ఉ.భాద్ర
పే, పో, రా, రి	-	చిత్త	దే, దో, చా, చీ	-	రేవతి

వారివారి పేర్ల ననుసరించి పేరుయొక్క మొదటి అక్షరము చెప్పబడిన 27 నక్షత్రములలో, ఏనక్షత్రమున, ఏ పాదమునకు చెందినదగుచున్నదో దానినిబట్టి యూహింపవలయును ప్రతి నక్షత్రమునకున్ను చెప్పబడిన 4 అక్షరములను, 4 పాదములుగా తెలియవలెను. అక్షర సంధిగల పేర్లకు, (కృష్ణా హృష శ్రీనర ఇత్యాదులకు) నిర్ణీత నక్షత్రములున్నవి. జన్మనక్షత్రమును గుర్తెరుంగనివారలకున్ను నామ నక్షత్ర ప్రధానమయిన కొన్ని కొన్ని విషయములకున్ను నామనక్షత్రమునుబట్టియే ఫలితముల నాలోచించి చెప్పవలెను.

గ్రహములకు మిత్రత్వ శత్రుత్వ సమత్వములు

సూర్యునకు—శుక్ర, శనులు శత్రువులు. బుధుడు సముడు. ఇతరులు మిత్రులు. చంద్రునకు—సూర్య, బుధులు మిత్రులు. ఇతరులు సములు. శత్రువు లేడు. కుజునకు—రవి, చంద్ర, గురులు మిత్రులు. బుధుడు శత్రువు. శుక్ర, శనులు సములు. బుధునకు—రవి, శుక్రులు మిత్రులు. చంద్రుడు శత్రువు. ఇతరులు సములు. గురునకు—బుధ, శుక్రులు శత్రువులు. శని సముడు. ఇతరులుమిత్రులు. శుక్రునకు—బుధ, శనులు మిత్రులు. కుజ, గురులు సములు. ఇతరులు శత్రువులు. శనికి—బుధ, శుక్రులు మిత్రులు. గురుడు సముడు. ఇతరులు శత్రువులు. (మూల త్రికోణరాశినుండి, "స్వస్వాంత్యధీధర్మసోచ్చాయసుఖపాః" అను సూత్రముచే చెప్పబడినది వివరింపబడెను).

తాత్కాలిక మిత్రత్వ శత్రుత్వ సమత్వములు

అన్యోన్యస్య ధనవ్యయాయ సహజ వ్యాపార బంధుస్థితా స్తత్కాలే సుహృదస్స్వ తుంగభవనే ప్యేకే రయ స్త్వన్యథా ॥ ద్వ్యేకానుక్త భపాస్సుహృత్సమ రిపూ స్స్వం చింత్య నైసర్గికాం స్తత్కాలేతు పునస్తుతావధి సుహృన్మిత్రాదిభిః కల్పయేత్ ॥

తా॥ ఒకరికొకరు 2, 12, 11, 3, 10, 4 స్థానములందున్న తాత్కాలిక (జననాది సమయములందు) మిత్రు లగుదురు. తమ ఉచ్చరాశియందున్న గ్రహము తనకు మిత్రమని కొందరి మతము. చెప్పబడినవాటికంటె నితరస్థానములందున్న గ్రహములు తాత్కాలిక శత్రువులు. తన మూల త్రికోణరాశినుండి 2, 12, 5, 9, 4, 8 ఉచ్చరాశ్యధిపతులు మిత్రులు. ఇతరులు శత్రువులు. రెండు లక్షణములున్న గ్రహములు సములు. అను విషయము "స్వస్వాంత్యధీ ధర్మసోచ్చాయసుఖపాః" సూత్రమున గలదు. దీనిచే నగు శత్రుమిత్రాది విచారము పై శ్లోకములలో వివరింపబడినది. దానిచే నగు శత్రుత్వాదులు, ఈ శ్లోకముచే నగు తాత్కాలిక శత్రుత్వాదులును గమనించి అధిమిత్ర, అధి శత్రుత్వాదికము నిర్ణయింపవలెను. ఎట్లనగా—చెప్పబడిన మిత్రస్థానములందు మిత్రగ్రహమున్న అధిమిత్రము, సముడున్న మిత్రము, శత్రువున్న సముడును అగును. ఇతరములగు శత్రుస్థానములందు మిత్రుడున్న సముడు, సముడున్న శత్రువు, శత్రువున్న అధిశత్రువు నగును.

లగ్నాది ద్వాదశభావములకు ఆధిపత్యములు

జన్మలగ్నము మొదలుకొని క్రమముగా ద్వాదశభావములకు తను, ధన, భ్రాతృ, మాతృ, పుత్ర, శత్రు, కళత్ర, ఆయు, భాగ్య, రాజ్య, లాభ, వ్యయములనెడు సంజ్ఞలగును.

మేషలగ్నమునకు:—లగ్నాష్టమాధిపతి కుజుడు, తృతీయషష్ఠాధిపతి బుధుడు, ధనసప్తమాధిపతి శుక్రుడు, వాహనాధిపతి చంద్రుడు, పంచమాధిపతి సూర్యుడు, భాగ్య వ్యయాధిపతి బృహస్పతి, రాజ్యలాభాధిపతి శని.

వృషభలగ్నమునకు:—లగ్న షష్ఠాధిపతి శుక్రుడు, ధన పంచమాధిపతి బుధుడు, తృతీయాధిపతి చంద్రుడు, వాహనాధిపతి సూర్యుడు, సప్తమ వ్యయాధిపతి కుజుడు, అష్టమ లాభాధిపతి బృహస్పతి, భాగ్య రాజ్యాధిపతి శని.

మిథున లగ్నమునకు:—లగ్న వాహనాధిపతి బుధుడు, ధనాధిపతి చంద్రుడు, తృతీయాధిపతి సూర్యుడు, పంచమాధిపతి శుక్రుడు, షష్ఠ లాభాధిపతి కుజుడు, సప్తమ రాజ్యాధిపతి బృహస్పతి, అష్టమ భాగ్యాధిపతి శని.

కర్కాటక లగ్నమునకు:—లగ్నాధిపతి చంద్రుడు, ధనాధిపతి సూర్యుడు, తృతీయ వ్యయాధిపతి బుధుడు, వాహన లాభాధిపతి శుక్రుడు, పంచమ రాజ్యాధిపతి కుజుడు, షష్ఠ భాగ్యాధిపతి బృహస్పతి, సప్తమాష్టమాధిపతి శని.

సింహలగ్నమునకు:—లగ్నాధిపతి సూర్యుడు, ధన లాభాధిపతి బుధుడు, తృతీయ రాజ్యాధిపతి శుక్రుడు, వాహన భాగ్యాధిపతి కుజుడు, పంచమాష్టమాధిపతి బృహస్పతి, షష్ఠ సప్తమాధిపతి శని, వ్యయాధిపతి చంద్రుడు.

కన్యాలగ్నమునకు:—లగ్న రాజ్యాధిపతి బుధుడు, ధన భాగ్యాధిపతి శుక్రుడు, తృతీయాష్టమాధిపతి కుజుడు, వాహన సప్తమాధిపతి బృహస్పతి, పంచమ షష్ఠాధిపతిశని, లాభాధిపతి చంద్రుడు, వ్యయాధిపతి సూర్యుడు.

తులా లగ్నమునకు:—లగ్నాష్టమాధిపతి శుక్రుడు, ధన సప్తమాధిపతి కుజుడు, తృతీయ షష్ఠాధిపతి బృహస్పతి, వాహన పంచమాధిపతి శని, భాగ్యవ్యయాధిపతి బుధుడు, రాజ్యాధిపతి చంద్రుడు, లాభాధిపతి సూర్యుడు.

వృశ్చిక లగ్నమునకు:—లగ్న షష్ఠాధిపతి కుజుడు, ధన పంచమాధిపతి బృహస్పతి, తృతీయ వాహనాధిపతి శని, సప్తమ వ్యయాధిపతి శుక్రుడు, అష్టమ లాభాధిపతి బుధుడు, భాగ్యాధిపతి చంద్రుడు, రాజ్యాధిపతి సూర్యుడు.

ధనుర్లగ్నమునకు:—లగ్న వాహనాధిపతి బృహస్పతి, ద్వితీయ తృతీయాధిపతి శని, పంచమ వ్యయాధిపతి అంగారకుడు, షష్ఠలాభాధిపతి శుక్రుడు, సప్తమ రాజ్యాధిపతి బుధుడు, అష్టమాధిపతి చంద్రుడు, భాగ్యాధిపతి సూర్యుడు.

మకర లగ్నమునకు:—లగ్న ద్వితీయాధిపతి శని, తృతీయ వ్యయాధిపతి బృహస్పతి, వాహన లాభాధిపతి కుజుడు, పంచమ రాజ్యాధిపతి శుక్రుడు, షష్ఠ భాగ్యాధిపతి బుధుడు, సప్తమాధిపతి చంద్రుడు, అష్టమాధిపతి సూర్యుడు.

కుంభ లగ్నమునకు: లగ్న వ్యయాధిపతి శని, ధన లాభాధిపతి బృహస్పతి, తృతీయ రాజ్యాధిపతి కుజుడు, వాహన భాగ్యాధిపతి శుక్రుడు, పంచమాష్టమాధిపతి బుధుడు, షష్ఠాధిపతి చంద్రుడు, సప్తమాధిపతి సూర్యుడు.

మీన లగ్నమునకు:—లగ్న రాజ్యాధిపతి బృహస్పతి, ధనభాగ్యాధిపతి కుజుడు, తృతీయాష్టమాధిపతి శుక్రుడు, వాహన సప్తమాధిపతి బుధుడు, పంచమాధిపతి చంద్రుడు, షష్ఠాధిపతి సూర్యుడు, లాభ వ్యయాధిపతి శని.

కృత్తిక, ఉత్తర, ఉత్తరాషాఢ—సూర్య దశ సం॥ 6 భుక్తులు—అంతరములు

భుక్తుల వివరము			సూర్యుడు		చంద్రుడు		కుజుడు		రాహు		గురు		శని		బుధుడు		కేతు		శుక్రుడు	
	నెల	దినం		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ
సూర్య	3	18	సూ	0-5-24	చం	0-15-0	కుజ	0-7-21	రా	1-18-36	గురు	1-8-24	శని	1-24-9	బుధ	1-13-21	కేతు	0-7-21	శుక్ర	2-0-0
చంద్ర	6	0	చం	0-9-0	కుజ	0-10-30	రా	0-18-54	గురు	1-13-12	శని	1-15-36	బుధ	1-18-27	కేతు	0-17-51	శుక్ర	0-21-0	సూ	0-18-0
కుజ	4	6	కుజ	0-6-18	రా	0-27-0	గురు	0-16-48	శని	1-21-18	బుధ	1-10-48	కేతు	0-19-57	శుక్ర	1-21-0	సూ	0-6-18	చం	1-0-0
రాహు	10	24	రా	0-16-12	గురు	0-24-0	శని	0-19-57	బుధ	1-15-54	కేతు	0-16-48	శుక్ర	1-27-0	సూ	0-15-18	చం	0-10-30	కుజ	0-21-0
గురు	9	18	గురు	0-14-24	శని	0-28-30	బుధ	0-17-51	కేతు	0-18-54	శుక్ర	1-18-0	సూ	0-17-6	చం	0-25-30	కుజ	0-7-21	రా	1-24-0
శని	11	12	శని	0-17-6	బుధ	0-25-30	కేతు	0-7-21	శు	1-24-0	సూ	0-14-24	చం	0-28-30	కుజ	0-17-51	రా	0-18-54	గురు	1-18-0
బుధ	10	6	బుధ	0-15-18	కేతు	0-10-30	శు	0-21-0	సూ	0-16-12	చం	0-24-0	కుజ	0-19-57	రా	1-15-54	గురు	0-16-48	శని	1-27-0
కేతు	4	6	కేతు	0-6-18	శు	1-0-0	సూ	0-6-18	చం	0-27-0	కుజ	0-16-48	రా	1-21-18	గురు	1-10-48	శని	0-19-57	బుధ	1-21-0
శుక్ర	12	0	శు	0-18-0	సూ	0-9-0	చం	0-10-30	కుజ	0-18-54	రా	1-13-12	గురు	1-15-36	శని	1-18-27	బుధ	0-17-51	కేతు	0-21-0
మొ॥ సం॥ 6 0 0				3-18-0		6-0-0		4-6-0		10-24-0		9-18-0		11-12-0		10-6-0		4-6-0		12-0-0

రోహిణి, హస్త, శ్రవణం—చంద్ర దశ సం॥ 10 భుక్తులు—అంతరములు

భుక్తుల వివరము			చంద్రుడు		కుజుడు		రాహు		గురు		శని		బుధుడు		కేతు		శుక్రుడు		సూర్యుడు	
	నెల	దినం		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ
చంద్రుడు	10	0	చం	0-25-0	కుజ	0-12-15	రా	2-21-0	గురు	2-4-0	శని	3-0-15	బుధ	2-12-15	కేతు	0-12-15	శుక్ర	3-10-0	సూ	0-9-0
కుజుడు	7	0	కుజ	0-17-30	రా	1-1-30	గురు	2-12-0	శని	2-16-0	బుధ	2-20-45	కేతు	0-29-45	శుక్ర	1-5-0	సూ	1-0-0	చం	0-15-0
రాహువు	18	0	రా	1-15-0	గురు	0-28-0	శని	2-25-30	బుధ	2-8-0	కేతు	1-3-15	శుక్ర	2-25-0	సూ	0-10-30	చం	1-20-0	కుజ	0-10-30
గురువు	16	0	గురు	1-10-0	శని	1-3-15	బుధ	2-16-30	కేతు	0-28-0	శుక్ర	3-5-0	సూ	0-25-30	చం	0-17-30	కుజ	1-5-0	రా	0-27-0
శని	19	0	శని	1-17-30	బుధ	0-29-45	కేతు	1-1-30	శుక్ర	2-20-0	సూ	0-28-30	చం	1-12-30	కుజ	0-12-15	రా	3-0-0	గురు	0-24-0
బుధుడు	17	0	బుధ	1-12-30	కేతు	0-12-15	శుక్ర	3-0-0	సూ	0-24-0	చం	1-17-30	కుజ	0-29-45	రా	1-1-30	గురు	2-20-0	శని	0-28-30
కేతు	7	0	కేతు	0-17-30	శుక్ర	1-5-0	సూ	0-27-0	చం	1-10-0	కుజ	1-3-15	రా	2-16-30	గురు	0-28-0	శని	3-5-0	బుధ	0-25-30
శుక్రుడు	20	0	శుక్ర	1-20-0	సూ	0-10-30	చం	1-15-0	కుజ	0-28-0	రా	2-25-30	గురు	2-8-0	శని	1-3-15	బుధ	2-25-0	కేతు	0-10-30
సూర్యుడు	6	0	సూ	0-15-0	చం	0-17-30	కుజ	1-1-30	రా	2-12-0	గురు	2-16-0	శని	2-20-45	బుధ	0-29-45	కేతు	1-5-0	శుక్ర	1-0-0
మొ॥ సం॥ 10 0 0				10-0-0		7-0-0		18-0-0		16-0-0		19-0-0		17-0-0		7-0-0		20-0-0		6-0-0

మృగశిర, చిత్త, ధనిష్ఠ—కుజదశ సం॥ 7—భుక్తులు—అంతరములు

భుక్తుల వివరము			కుజుడు		రాహు		గురు		శని		బుధుడు		కేతు		శుక్రుడు		సూర్యుడు		చంద్రుడు	
	నెల	దినం		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ
కుజుడు	4	27	కుజ	0-8-34½	రా	1-26-42	గురు	1-14-48	శని	2-3-10½	బుధ	1-20-34½	కేతు	0-8-34½	శుక్ర	2-10-0	సూ	0-6-18	చం	0-17-30
రాహు	12	18	రా	0-22-3	గురు	1-20-24	శని	1-23-12	బుధ	1-26-31½	కేతు	0-20-49½	శుక్ర	0-24-30	సూ	0-21-0	చం	0-10-30	కుజ	0-12-15
గురు	11	6	గురు	0-19-36	శని	1-29-51	బుధ	1-17-36	కేతు	0-23-16½	శుక్ర	1-29-30	సూ	0-7-21	చం	1-5-0	కుజ	0-7-21	రా	1-1-30
శని	13	9	శని	0-23-16½	బుధ	1-23-33	కేతు	0-19-36	శుక్ర	2-6-30	సూ	0-17-51	చం	0-12-15	కుజ	0-24-30	రా	0-18-54	గురు	0-28-0
బుధుడు	11	27	బుధ	0-20-49½	కేతు	0-22-3	శుక్ర	1-26-0	సూ	0-19-57	చం	0-29-45	కుజ	0-8-34½	రా	2-3-0	గురు	0-16-48	శని	1-3-15
కేతు	4	27	కేతు	0-8-34½	శుక్ర	2-3-0	సూ	0-16-48	చం	1-3-15	కుజ	0-20-49½	రా	0-22-3	గురు	1-26-	శని	0-19-57	బుధ	0-29-45
శుక్ర	14	0	శుక్ర	0-24-30	సూ	0-18-54	చం	0-28-0	కుజ	0-23-16½	రా	1-23-33	గురు	0-19-36	శని	2-6-30	బుధ	0-17-51	కేతు	0-12-15
సూర్యుడు	4	6	సూ	0-7-21	చం	1-1-30	కుజ	0-19-36	రా	1-29-51	గురు	1-17-36	శని	0-23-16½	బుధ	1-29-30	కేతు	0-7-21	శుక్ర	1-5-0
చంద్రుడు	7	0	చం	0-12-15	కుజ	0-22-3	రా	1-20-24	గురు	1-23-12	శని	1-26-31½	బుధ	0-20-49½	కేతు	0-24-30	శుక్ర	0-21-0	సూ	0-10-30
మొ॥ సం॥ 7 0 0			—	4-27-0		12-18 0		11-6-0		13-9-0		11-27-0		4-27-0		14-0-0		4-6-0	—	7-0-0

ఆర్ద్ర, స్వాతి, శతభిషం—రాహుదశ సం॥ 18 భుక్తులు అంతరములు

భుక్తుల వివరము			రాహువు		గురుడు		శని		బుధుడు		కేతు		శుక్రుడు		సూర్యుడు		చంద్రుడు		కుజుడు	
	నెల	దినం		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ
రాహు	32	12	రా	4-25-48	గురు	3-25-12	శని	5-12-27	బుధ	4-10-8	కేతు	0-22-3	శుక్ర	6-0-0	సూ	0-16-12	చం	1-15-0	కుజు	0-22-3
గురు	28	24	గురు	4-9-36	శని	4-16-48	బుధ	4-25-21	కేతు	1-23-33	శుక్ర	2-3-0	సూ	1-24-0	చం	0-27-0	కుజు	1-1-30	రా	1-26-42
శని	34	6	శని	5-3-54	బుధ	4-2-24	కేతు	1-29-51	శుక్ర	5-3-0	సూ	0-18-54	చం	3-0-0	కుజు	0-18-54	రా	2-21-0	గురు	1-20-24
బుధుడు	30	18	బుధ	4-17-42	కేతు	1-20-24	శుక్ర	5-21-0	సూ	1-15-54	చం	1-1-30	కుజు	2-3-0	రా	1-18-36	గురు	2-12-0	శని	1-29-51
కేతు	12	18	కేతు	1-26-42	శుక్ర	4-24-0	సూ	1-21-18	చం	2-16-30	కుజు	0-22-3	రా	5-12-0	గురు	1-13-12	శని	2-25-30	బుధ	1-23-33
శుక్ర	36	0	శుక్ర	5-12-	సూ	1-18-12	చం	2-25-30	కుజు	1-23-33	రా	1-26-42	గురు	4-24-0	శని	1-21-18	బుధ	2-16-30	కేతు	0-22-3
సూర్య	10	24	సూ	1-18-36	చం	2-12-0	కుజు	1-29-51	రా	4-17-42	ప	1-20-24	శని	5-21-0	బుధ	1-15-54	కేతు	1-1-30	శుక్ర	2-3-0
చంద్ర	18	0	చం	2-21-0	కుజు	1-20-24	రా	5-3-54	గురు	4-2-24	శని	1-29-51	బుధ	5-3-0	కేతు	0-18-54	శుక్ర	3-0-0	సూ	0-18-54
కుజ	12	18	కుజు	1-26-42	రా	4-9-36	గురు	4-16-48	శని	4-25-21	బుధ	1-23-33	కేతు	2-3-0	శుక్ర	1-24-0	సూ	0-27-0	చం	1-1-30
మొ॥ సం॥	18	0 0		32-12-0		28-24-0		34-6-0		30-18-0		12-18-0		36-0-0		10-24-0		18-0-0		12-18-0

పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర—గురుదశ సం॥ 16 భుక్తులు అంతరములు

భుక్తుల వివరము			గురుడు		శని		బుధుడు		కేతు		శుక్రుడు		సూర్యుడు		చంద్రుడు		కుజుడు		రాహు	
	నెల	దినం		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ
గురు	25	18	గురు	3-12-24	శని	4-24-24	బుధ	3-25-36	కేతు	0-19-36	శుక్ర	5-10-0	సూ	0-14-24	చం	1-10-0	కుజు	0-19-36	రా	4-9-36
శని	30	12	శని	4-1-36	బుధ	4-9-12	కేతు	1-17-36	శుక్ర	1-26-0	సూ	1-18-0	చం	0-24-0	కుజు	0-28-0	రా	1-20-24	గురు	3-25-12
బుధ	27	6	బుధ	3-18-48	కేతు	1-23-12	శుక్ర	4-16-0	సూ	0-16-48	చం	2-20-0	కుజు	0-16-48	రా	2-12-0	గురు	1-14-48	శని	4-16-48
కేతు	11	6	కేతు	1-14-48	శుక్ర	0-2-0	సూ	1-10-48	చం	0-28-0	కుజు	1-26-0	రా	1-13-12	గురు	2-4-0	శని	1-23-12	బుధ	4-2-24
శుక్ర	32	0	శుక్ర	4-8-0	సూ	1-15-36	చం	2-8-0	కుజు	0-19-36	రా	4-24-0	గురు	1-8-24	శని	2-16-0	బుధ	1-17-36	కేతు	1-20-24
సూర్య	9	18	సూ	1-8-24	చం	2-16-0	కుజు	1-17-36	రా	1-20-24	గురు	4-8-0	శని	1-15-36	బుధ	2-8-0	కేతు	0-19-36	శుక్ర	4-24-0
చంద్ర	16	0	చం	2-4-0	కుజు	1-23-12	రా	4-2-24	గురు	1-14-48	శని	5-2-0	బుధ	1-10-48	కేతు	0-28-0	శుక్ర	1-26-0	సూ	1-13-12
కుజ	11	6	కుజ	1-14-48	రా	4-16-48	గురు	3-18-48	శని	1-23-12	బుధ	4-16-0	కేతు	0-16-48	శుక్ర	2-20-0	సూ	0-16-48	చం	2-12-0
రాహు	28	24	రా	3-25-12	గురు	4-1-36	శని	4-9-12	బుధ	1-17-36	కేతు	1-26-0	శుక్ర	1-18-0	సూ	0-24-0	చం	0-28-0	కుజు	1-20-24
మొ॥ సం॥	16	0 0		25-18-0		30-12-0		27-6-0		11-6-0		32-0-0		9-18-0		16-0-0		11-6-0		28-24-0

పుష్యమి, అనూరాధ, ఉత్తరాభాద్ర—శని దశ సం॥ 19 భుక్తులు అంతరములు

భుక్తుల వివరము			శని		బుధుడు		కేతు		శుక్రుడు		సూర్యుడు		చంద్రుడు		కుజుడు		రాహు		గురుడు	
	నెల	దినం		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ		నెల ది ఘ
శని	36	3	శని	5-21-28½	బుధ	4-17-16½	కేతు	0-23-16½	శుక్ర	6-10-0	సూ	0-17-6	చం	1-17-30	కుజు	0-23-16½	రా	5-3-54	గురు	4-1-36
బుధుడు	32	9	బుధ	5-3-25½	కేతు	1-26-31½	శుక్ర	2-6-30	సూ	1-27-0	చం	0-28-30	కుజు	1-3-15	రా	1-29-51	గురు	4-16-48	శని	4-24-24
కేతు	13	9	కేతు	2-3-10½	శుక్ర	5-11-30	సూ	0-19-57	చం	3-5-0	కుజు	0-19-57	రా	2-25-30	గురు	1-23-12	శని	5-12-27	బుధ	4-9-12
శుక్ర	38	0	శుక్ర	6-0-30	సూ	1-18-27	చం	1-3-15	కుజు	2-6-30	రా	1-21-18	గురు	2-16-0	శని	2-3-10½	బుధ	4-25-21	కేతు	1-28-12
సూర్య	11	12	సూ	1-24-9	చం	2-20-45	కుజు	0-23-16	రా	5-21-0	గురు	1-15-36	శని	3-0-15	బుధ	1-26-31½	కేతు	1-29-51	శుక్ర	5-2-0
చంద్ర	19	0	చం	3-0-15	కుజ	1-26-31½	రా	1-29-51	గురు	5-2-0	శని	1-24-9	బుధ	2-20-45	కేతు	0-23-16½	శుక్ర	5-21-0	సూ	1-15-36
కుజ	13	9	కుజు	2-3-10½	రా	4-25-21	గురు	1-23-12	శని	6-0-30	బుధ	1-18-27	కేతు	1-3-15	శుక్ర	2-6-30	సూ	1-21-18	చం	2-16-0
రాహు	34	6	రా	5-12-27	గురు	4-9-12	శని	2-3-10½	బుధ	5-11-30	కేతు	0-19-57	శుక్ర	3-5-0	సూ	0-19-57	చం	2-25-30	కుజు	1-23-12
గురు	30	12	గురు	4-24-24	శని	5-3-25½	బుధ	1-26-31½	కేతు	2-6-30	శుక్ర	1-27-0	సూ	0-28-30	చం	1-3-15	కుజు	1-29-51	రా	4-16-48
మొ॥ సం॥	19	0 0		36-3-0		32-9-0		13-9-0		38-0-0		11-12-0		19-0-0		13-9-0		34-6-0		30-12-0



ఆశ్లేష, జ్యేష్ఠ, రేవతి—బుధ దశ సం॥ 17 భుక్తులు—అంతరములు

భుక్తుల వివరము	నెల	దినం	బుధుడు	నెల ది ఘ	కేతు	నెల ది ఘ	శుక్రుడు	నెల ది ఘ	సూర్యుడు	నెల ది ఘ	చంద్రుడు	నెల ది ఘ	కుజుడు	నెల ది ఘ	రాహు	నెల ది ఘ	గురుడు	నెల ది ఘ	శని	నెల ది ఘ
బుధ	28	27	బుధ	4-2-49½	కేతు	0-20-49½	శుక్ర	5-20-0	సూ	0-15-18	చం	1-12-30	కుజ	0-20-49½	రా	4-17-42	గురు	3-18-48	శని	5-3-25½
కేతు	11	27	కేతు	1-20-34½	శుక్ర	1-29-30	సూ	1-21-0	చం	0-25-30	కుజ	0-29-45	రా	1-23-33	గురు	4-2-24	శని	4-9-12	బుధ	4-17-16½
శుక్ర	34	0	శుక్ర	4-24-30	సూ	0-17-51	చం	2-25-0	కుజ	0-17-51	రా	2-16-30	గురు	1-17-36	శని	4-25-21	బుధ	3-25-36	కేతు	1-26-31½
సూర్య	10	6	సూ	1-13-21	చం	0-29-45	కుజ	1-29-30	రా	1-15-54	గురు	2-8-0	శని	1-26-31½	బుధ	4-10-3	కేతు	1-17-36	శుక్ర	5-11-30
చంద్ర	17	0	చం	2-12-15	కుజ	0-20-49½	రా	5-3-0	గురు	1-10-48	శని	2-20-45	బుధ	1-20-34½	కేతు	1-23-33	శుక్ర	4-16-0	సూ	1-18-27
కుజ	11	27	కుజ	1-20-34½	రా	1-23-33	గురు	4-16-0	శని	1-18-27	బుధ	2-12-15	కేతు	0-20-49½	శుక్ర	5-3-0	సూ	1-10-48	చం	2-20-45
రాహు	30	18	రా	4-10-3	గురు	1-17-36	శని	5-11-30	బుధ	1-13-21	కేతు	0-29-45	శుక్ర	1-29-30	సూ	1-15-54	చం	2-8-0	కుజ	1-26-31½
గురు	27	6	గురు	3-25-36	శని	1-26-31½	బుధ	4-24-30	కేతు	0-17-51	శుక్ర	2-25-0	సూ	0-17-51	చం	2-16-30	కుజ	1-17-36	రా	4-25-21
శని	32	9	శని	4-17-16½	బుధ	1-20-34½	కేతు	1-29-30	శుక్ర	1-21-0	సూ	0-25-30	చం	0-29-45	కుజ	1-23-33	రా	4-2-24	గురు	4-9-12
మొ॥ సం॥	17	0		28-27-0		11-27-0		34-0-0		10-6-0		17-0-0		11-27-0		30-13-0		27-6-0		32-9-0

అశ్విని, మఘ, మూల—కేతు దశ సం॥ 7 భుక్తులు అంతరములు

భుక్తుల వివరము	నెల	దినం	కేతు	నెల ది ఘ	శుక్రుడు	నెల ది ఘ	సూర్యుడు	నెల ది ఘ	చంద్రుడు	నెల ది ఘ	కుజుడు	నెల ది ఘ	రాహువు	నెల ది ఘ	గురుడు	నెల ది ఘ	శని	నెల ది ఘ	బుధుడు	నెల ది ఘ
కేతు	4	27	కేతు	0-8-34½	శుక్ర	2-10-0	సూ	0-6-18	చం	0-17-30	కుజ	0-8-34½	రా	1-26-42	గురు	1-14-48	శని	2-3-10½	బుధ	1-20-34½
శుక్ర	14	0	శుక్ర	0-24-30	సూ	0-21-0	చం	0-10-30	కుజ	0-12-15	రా	0-22-3	గురు	1-20-24	శని	1-23-12	బుధ	1-26-31½	కేతు	0-20-49½
సూర్య	4	6	సూ	0-7-21	చం	1-5-0	కుజ	0-7-21	రా	1-1-30	గురు	0-19-36	శని	1-29-51	బుధ	1-17-36	కేతు	0-23-16½	శుక్ర	1-29-30
చంద్ర	7	0	చం	0-12-15	కుజ	0-24-30	రా	0-18-54	గురు	0-28-0	శని	0-23-16½	బుధ	1-23-33	కేతు	0-19-36	శుక్ర	2-6-30	సూ	0-17-51
కుజ	4	27	కుజ	0-8-34½	రా	2-3-0	గురు	0-16-48	శని	1-3-15	బుధ	0-20-48½	కేతు	0-22-3	శుక్ర	1-26-0	సూ	0-19-57	చం	0-29-45
రాహు	12	18	రా	0-22-3	గురు	1-26-0	శని	0-19-57	బుధ	0-29-45	కేతు	0-8-34½	శుక్ర	2-3-0	సూ	0-16-48	చం	1-3-15	కుజ	0-20-49½
గురు	11	6	గురు	0-19-36	శని	2-6-30	బుధ	0-17-51	కేతు	0-12-15	శుక్ర	0-24-30	సూ	0-18-54	చం	0-28-0	కుజ	0-23-16½	రా	1-23-33
శని	13	7	శని	0-23-16½	బుధ	1-29-30	కేతు	0-7-21	శుక్ర	1-5-0	సూ	0-7-21	చం	1-1-30	కుజ	0-19-36	రా	1-29-51	గురు	1-17-36
బుధ	11	92	బుధ	0-20-49½	కేతు	0-24-30	శుక్ర	0-21-0	సూ	0-10-30	చం	0-12-15	కుజ	0-22-3	రా	1-20-24	గురు	1-23-12	శని	1-26-31½
మొ॥ సం॥	7	0 0		4-27-0		14-0-0		4-6-0		7-0-0		4-27-0		12-18-0		11-6-0		13-9-0		11-27-0

భరణి, పుబ్బ, పూర్వాషాఢ—శుక్ర దశ సం॥ 20 భుక్తులు-అంతరములు

భుక్తుల వివరము	నెల	దినం	శుక్రుడు	నెల ది ఘ	సూర్యుడు	నెల ది ఘ	చంద్రుడు	నెల ది ఘ	కుజుడు	నెల ది ఘ	రాహు	నెల ది ఘ	గురుడు	నెల ది ఘ	శని	నెల ది ఘ	బుధుడు	నెల ది ఘ	కేతు	నెల ది ఘ
శుక్ర	40	0	శుక్ర	6-20-0	సూ	0-18-0	చం	1-20-0	కుజ	0-24-30	రా	5-12-0	గురు	4-8-0	శని	6-0-30	బుధ	4-24-30	కేతు	0-24-30
సూర్య	12	0	సూ	2-0-0	చం	1-0-0	కుజ	1-5-0	రా	2-3-0	గురు	4-24-0	శని	5-2-0	బుధ	5-11-30	కేతు	1-29-30	శుక్ర	2-10-0
చంద్రుడు	20	0	చం	3-10-0	కుజ	0-21-0	రా	3-0-0	గురు	1-26-0	శని	5-21-0	బుధ	4-16-0	కేతు	2-6-30	శుక్ర	5-20-0	సూ	0-21-0
కుజుడు	14	0	కుజ	2-10-0	రా	1-24-0	గురు	2-20-0	శని	2-6-30	బుధ	5-3-0	కేతు	1-26-0	శుక్ర	6-10-0	సూ	1-21-0	చం	1-5-0
రాహు	36	0	రా	6-0-0	గురు	1-18-0	శని	3-5-0	బుధ	1-29-30	కేతు	2-3-0	శుక్ర	5-10-0	సూ	1-27-0	చం	2-25-0	కుజ	0-24-30
గురు	32	0	గురు	5-10-0	శని	1-27-0	బుధ	2-25-0	కేతు	0-24-30	శుక్ర	6-0-0	సూ	1-18-0	చం	3-5-0	కుజ	1-29-30	రా	2-3-0
శని	38	0	శని	6-10-0	బుధ	1-21-0	కేతు	1-5-0	శుక్ర	2-10-0	సూ	1-24-0	చం	2-20-0	కుజ	2-6-30	రా	5-3-0	గురు	1-26-0
బుధుడు	34	0	బుధ	5-20-0	కేతు	0-21-0	శుక్ర	3-10-0	సూ	0-21-0	చం	3-0-0	కుజ	1-26-0	రా	5-21-0	గురు	4-16-0	శని	2-6-30
కేతు	14	0	కేతు	2-10-0	శుక్ర	2-0-0	సూ	1-0-0	చం	1-5-0	కుజ	2-3-0	రా	4-24-0	గురు	5-2-0	శని	5-11-30	బుధ	1-29-30
మొ॥ సం॥	20	0		40-0-0		12-0-0		20-0-0		14-0-0		36-0-0		32-0-0		38-0-0		34-0-0		14-0-0